రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

వార్షిక సంచిక-2002





శ్రమ జీవుల రక్తంతో జెండానెగరేశాము

మృత వీరుల ఆశలతో

మునుముందుకే పోతాము





రైతుకూలీ-కార్మిక ఐక్యత వర్ధిల్లాలి!











NPR01 F 207

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా
అదురు బెదురూ లేక అడ్డేదియును లేక ॥ ఎగరాలి ॥

సామ్రాజ్యవాదంబు సమసిపోవంగ
ధనికవాదం బింక దగ్ధమై పోవంగ ॥ ఎగరాలి ॥

కూలోళ్ల గొంతులో కొనఊపిరుంటేను
పేదరైతులమేన వేడి రక్తంబుంటె ॥ ఎగరాలి ॥

కార్మికుల్ కర్షకుల్ కరముకరమూ కలిపి
జై మనకు జైయంచు జేజేలు కొట్టంగ ॥ ఎగరాలి ॥

- తిమ్మిల

వార్షిక సంచిక - 2002

విషయసూచిక

★ విశాఖ సదస్సు 1-16

★ నివేదిక - వ్యాసాలు 17-38

వ్యవసాయ నిపుణుల కమీషన్ రిపోర్టు, గ్రామీణ రుణభారం, తదితరములు

★ ప్రముఖుల వ్యాసాలు 39-58

పరకాల, చంద్రరాజేశ్వరరావు, వండూరి, భీమిరెడ్డి, నాగిరెడ్డి

★ జనరల్ కౌన్సిల్ - నివేదిక, తీర్మానాలు 59-68

★ అనుబంధాలు 69-92

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)

వార్షిక సంచిక - 2002

అక్టోబర్ - 2002

రు.25/-

ప్రతులకు :

మైత్రీ బుక్ హౌస్

మసీదు వీధి, కారల్ మార్క్స్ రోడ్,

విజయవాడ - 2

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)

ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్స్,

కృష్ణలంక , విజయవాడ - 10

ముద్రణ :

చైతన్య ప్రింటర్స్

విజయవాడ - 10

ప్రచురణకర్తలు : కా॥ ఎస్. ఝాన్సీ, కా॥ కె. కోటయ్య అధ్యక్ష, కార్యదర్శులు; రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)
ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్స్, కృష్ణలంక, విజయవాడ - 10

మా మాట

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) గత సంవత్సరం మహాసభల సావనీర్ విడుదల చేసింది. ఆ సావనీర్ వివిధ సమస్యలపై రైతుకూలీ సంఘం దృక్పథాన్ని, దశాబ్ద కాలపు కృషిని తెలియచేసింది. ఎంతో మంది దానిని సాదరంగా స్వీకరించారు.

ఈ ఏడాది పొడవునా సంభవించిన పరిణామాలు గత సంచికలో మేము వెల్లడించిన వాటిని ధృవపరిచాయి. మొత్తం వ్యవస్థతో పాటు వ్యవసాయరంగం మరింత సంక్షోభంలో కూరుకుపోయింది. పేద, మధ్య తరగతి రైతాంగంతోపాటు ధనిక రైతాంగం గూడా దివాళా తీసే స్థితికి చేరింది.

మేధావులు, ప్రజాతంత్రవాదులు, వ్యవసాయరంగ సంక్షోభ నివారణకు చేసిన ఎన్నో అమూల్యమైన సూచనలను పాలకులు పెడచెవిన పెట్టారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, రైతుకూలీ సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, దళిత కూలీ సంఘాలు చేసిన సూచనలు, విజ్ఞప్తులు, నిరసనలు, ఆందోళనలను పాలకులు లక్ష్యపెట్టలేదు. ఈ వైఖరి రైతాంగాన్ని మరింత ఆగ్రహ, ఆవేశాలకు గురిచేసింది. అనంతపురం తదితర జిల్లాలలో రైతాంగం సమరశీలంగా ఉద్యమించింది.

సీలింగ్‌కి మించి వున్న భూముల సమస్య, దేవాలయ భూముల సమస్య, గిరిజన ప్రాంతాల భూమి సమస్యల విషయంలో గ్రామీణ రైతుకూలీలకు, ఆదివాసీ గిరిజనులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరిస్తూనే వున్నది. అడవుల నుండి కోటిమంది గిరిజనులను సెప్టెంబర్ 30 వ తేదీలోపు ఖాళీ చేయమని తాఖీదిచ్చింది. ఇవన్నీ - భూస్వామ్య శక్తులకు,. దళారీ బూర్జువాలకు, సామ్రాజ్యవాద, విదేశీ కంపెనీలకు దేశాన్ని దోచిపెట్టడానికే.

ఈ రకమైన ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, చర్యలను ఎదుర్కోవడం ఒక కర్తవ్యంగా నేడు మరింత ముందుకు వచ్చింది. వివిధ సంస్థల నాయకత్వాన ప్రజలు సాగించిన ఆందోళనా పోరాటాలను పాలకులు శాంతి భద్రతల సమస్యగా మార్చారు. వందలాది మంది గిరిజన ఆదివాసీలను కేసులలో యిరికించారు. భౌతిక, మానసిక హింసలకు గురిచేశారు.దీనికి నిరసనగా ప్రజాతంత్ర శక్తులు, గ్రామీణ రైతుకూలీ సంఘాలు, రైతుసంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు - ఐక్య ఆందోళనకు పూనుకొన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ ఐక్యకృషి ద్వారా జరిగిన ఐక్యప్రజాఆందోళన పీడిత వర్గసంఘాల, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతావశ్యకతను చాటుతూంది.

సాగునీరు, త్రాగునీరు విద్యుచ్ఛక్తి కోసం, కరువు కాటకాలకు వ్యతిరేకంగా, పండించిన పంటలకు తగిన రేట్లకోసం - ఉధృత రూపంలో ఆందోళనలు సాగాయి. అయితే యివి అవగాహనలో ఏకీభావం లేకపోవడం వలన గానీ; ఇతర కారణాల మూలంగా గానీ, విడివిడి ఆందోళనలుగా ఎవరివి వారివిగా జరిగాయి. రైతుసంఘాలు, రైతుకూలీ, దళిత కూలీ సంఘాలు దీనిని పరిశీలించుకొని అధిగమించాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాద దేశాల మీద ఆధారపడి వారి సేవలో మునిగి ప్రజాజీవితాలను రోజురోజుకీ సంక్షుభిత భరితం చేస్తున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు జోహుకుం పలికి అడుగులకు మడుగులొత్తుతున్నాయి. పథకం ప్రకారం పాలకులు మత ఉద్వేగాలను, విద్వేషాలను పెంచుతున్నారు. గుజరాత్ మారణకాండ తాజా ఉదాహరణ మాత్రమే.

గ్రామీణ ప్రాంతాలలో ఫ్యూడల్ నిరంకుశ దోపిడీ సంస్కృతి కొనసాగుతూనే వుంది. దళితులపై దాడులు, స్త్రీలపై హింసాకాండ సాగుతూనే వున్నాయి. రైతుకూలీ సంఘాలు, కష్టజీవి మహిళలు, వివిధ మహిళా సంఘాలు, దళిత నిర్మాణాలు వీటికి వ్యతిరేకంగా స్పందిస్తూ ఆందోళనోద్యమాలు సాగిస్తున్నాయి. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఉద్యోగ భద్రత కోసమూ, ఉద్యోగాల కోసమూ, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు ఆందోళనోద్యమాలు సాగించక తప్పలేదు. రైతుకూలీ సంఘం తనశక్తి మేర వీటికి సంఘీభావంగా నిలబడింది.

ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దురాక్రమణ యుద్ధానికి వ్యతిరేకంగా; బి.జె.పి సంఘ్‌పరివార్‌ల మతోన్మాద ఫాసిస్టుదాడులకు, టెర్రరిస్టు ముఠాల ఉన్మాదపు దాడులకు వ్యతిరేకంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) స్పందించింది. ప్రజలలో సామ్రాజ్యవాద వ్యతిరేక, మతోన్మాద వ్యతిరేక చైతన్యాన్ని పెంచే కృషి చేసింది.

ఈ విధంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఈ ఏడాది కాలం నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమ కృషిలో తనవంతు పాత్ర నిర్వహించింది. నిర్మాణాన్ని గతం కంటే పెంచుకొంది. అనుభవాలను మదింపు చేసుకొని, పట్టుదలతో ముందుకు సాగడానికి విశ్వయించుకొంది.

ఈ వార్షిక సంచికలో చిత్తప్రసాద్, మాగోఖలే, మోహన్, శ్యాం మోహన్ గారల చిత్రాలు, శ్రీశ్రీ, సుబ్బారావు పాణిగ్రాహి తదితరుల గేయాలు, కవితలు ఉపయోగించుకొన్నాం. కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తిగారి 50వ వర్ధంతి సంచిక నుంచి వ్యాసాలను, చిత్రాలను తీసుకొన్నాం. ఇంకా గొర్రెపాటి నరేంద్రనాథ్ గారి వ్యాసాన్ని తీసుకొన్నాం. ఈ సంచిక వెలువరించడానికి ఆర్థికంగా, ఇతరత్రా సహకరించిన మిత్రులకు, డి.టి.పి కంపోజింగ్ చేసి యిచ్చిన సహచరులకు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నది.

విజయవాడ,
1-11-2002

రాష్ట్ర కార్యవర్గం
రైతుకూలీ సంఘం (ఆంధ్ర ప్రదేశ్)



జై భారత జనని

- సుబ్బారావు పాణిగ్రహి

జై భారత జననీ నమో పతిత పావనీ
అతులిత హిమశిఖరాలే - నీదు రత్న కిరీటం
మా భారత జాతి కెల్ల - తగురక్షణ కవాటం
గంగా గోదావరులూ - కృష్ణా సింధూనదులూ
జీవధార లొలికించే - మాబ్రతుకులు పండించే ॥జై॥

ఎల్లోర అజంతాలు - కళ్ళార్పని యావింతలు
ఈ అపూర్వ ఘనశిల్పం - మా పూర్వుల స్మృతి కల్పం ॥జై॥

పరుల పంచతలదాచే - దౌర్భాగ్యపు స్థితి నుండీ
ఒరను కత్తి దూసి పోరి - పరువు నిల్పినారమ్మా ॥జై॥

వేలకొలది మా నేతలు - నేల కొరిగి బలియైతే
నీదు బంధ విమోచనం - మా బ్రతుకుల పర్వదినం ॥జై॥

దేశమంత ఘన సంపద - వీసమంత మాకందదు
ఆశ పోతులంత జేరి - మోసుకు పోతున్నారు ॥జై॥

నీవే తమ స్వంతమనే - నీ పాలన హక్కుగొని
నీ బిడ్డలు నినుపట్టి బంధించగ నున్నారే ॥జై॥

పరులకమ్మ జూస్తుంటే - పరువు తగలవేస్తుంటే
సహించమూ సహించమూ - ప్రతిఘటించి తీరుతాము ॥జై॥

అంతం కాదిది ఆరంభం

- శ్రీశ్రీ

భూమికోసం భుక్తి కోసం
సాగే రైతుల పోరాటం
అనంత జీవిత సంగ్రామం ॥భూమి॥

రాజులు మారిన రోజులు మారిన
పాలన చేసే పద్ధతి మారిన
మారని దొకటేరా !
అది పేదల రైతుల బ్రతుకేరా ॥భూమి॥

సంపద పెంచే తీరులు మారిన
పంపకాలలో రీతులు మారిన
మారని దొకటేరా
అది పేదల ఆకలి మంటేరా ॥భూమి॥

పేదల బాదల రాజిన మంటలు
రైతులు గుండెల రగిలిన జ్వాలలు
లావాజలమై దావా జలమై
పల్లె పల్లెనూ కమ్మివేయగా
దొరల దోపిడీ అంతం చేయగా
సాగును రైతుల పోరాటం
భూమి కోసం భుక్తి కోసం
సాగే రైతుల పోరాటం
అంతం కాదిది ఆరంభం!

"వ్యవసాయ రంగ సంక్షోభం - కారణాలు - పరిష్కారాలు" అన్న అంశంపై విశాఖపట్నం రాష్ట్ర సదస్సు

"రైతుల జీవితాలను ఛిద్రం చేసే ప్రపంచీకరణపై పోరాడాలి"


"వ్యవసాయరంగ సంక్షోభం-కారణాలు - పరిష్కార మార్గాలు" అన్న అంశంపై విశాఖ పట్నం చందన మోహన్ రావు ఫంక్షన్‌హాలులో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్రస్థాయి సదస్సును 15-4-2002న విజయవంతంగా నిర్వహించింది. రెండువేల మంది రైతు, కూలీలు, గిరిజనులు సదస్సులో పాల్గొన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ ఝాన్సీ తన అధ్యక్షోపన్యాసంలో దోపిడీ పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానాలు ఏవిధంగా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో పడవేశాయో అర్థంచేసుకొని, దానికి తగిన విధంగా రైతాంగ ఉద్యమ నిర్మాణానికి పూనుకోవాలని కోరారు. పండిన పంటలకు సరైన ధరలు, పెండింగ్ ప్రాజెక్టుల సత్వర నిర్మాణం, ఆదివాసీ భూముల పరాయీకరణ నివారణ వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ దృష్టి నిలపాలని కోరారు.

భారత జనాందోళన్ అధ్యక్షులు డాక్టర్ బి.డి శర్మ ప్రధానోపన్యాసం చేశారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం - వ్యవసాయ ఆర్థికశాస్త్ర రిటైర్డ్ ప్రొఫెసర్ కె. ఆర్ చౌదరి, జార్ఖండ్‌క్రాంతిదళ్‌నేత కామ్రేడ్ శంభుమహతో, "జనశక్తి" సంపాదకుడు డా॥ పి. జస్వంత్‌రావు, గిరిజన - గిరిజనేతర పేదల హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ కా॥ ఇల్లా రామిరెడ్డి, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య, సహాయ కార్యదర్శులు జె. కిషోర్ బాబు, తాండ్ర ప్రకాశ్, విజయనగరం జిల్లా కార్యదర్శి డి.వర్మ తదితరులు ప్రసంగించారు.

అరుణోదయ కళాకారులు విప్లవగేయాలాలపించగా శ్రీకాకుళం కళాకారులు తప్పెట గుళ్ళు నృత్యం ప్రదర్శించారు.

ప్రదర్శన

నగరంలో సోమవారం నిర్వహించిన రైతుకూలీ రాష్ట్ర సదస్సులో భాగంగా వేలాది మంది రైతుకూలీలతో భారీ ప్రదర్శన జరిగింది. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన రైతుకూలీలు పెద్ద ఎత్తున ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో అగ్రభాగాన భారత జనాందోళన్ ఛైర్మన్ డాక్టర్ బి.డి శర్మ, వ్యవసాయార్థిక శాస్త్రవేత్త కె.ఆర్ చౌదరి, జనశక్తి ఎడిటర్ జస్వంత్ రావు, రైతుకూలీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఝాన్సీ, కోటయ్య, సహాయ కార్యదర్శి కిషోర్ బాబు, ఇల్లారామిరెడ్డి, శంభుమెహతో తదితరులు పాల్గొన్నారు.



వేదిక పై ఎడమ నుంచి కామ్రేడ్స్ తాండ్ర ప్రకాశ్, జె. కిశోర్‌బాబు, జశ్వంతరావు, శంభుమహతో, ప్రా॥ కె.ఆర్. చౌదరి,కా॥ ఝాన్సీ, డా॥బి.డి.శర్మ, కా॥ కోటయ్య, కా॥ ఇల్లా రామిరెడ్డి

వెంకోజిపాలెం నుంచి బయలుదేరిన ఈ ప్రదర్శన ఇసుకతోట, మద్దిలపాలెం, ఇండోర్ స్టేడియం, రామాటాకీస్, ఆశీలుమెట్టజంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా విశాఖ రైల్వేస్టేషన్ దాకా సాగింది.

సదస్సు తీర్మానాలు

రైతు కూలీ సంఘం రాష్ట్ర సదస్సు సందర్భంగా సదస్సు అనేక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. భారతదేశం ప్రపంచవాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఒ) నుంచి బయటకు రావాలని, ప్రపంచీ కరణ, సరళీకరణ పేరుతో సాగుతున్న రైతాంగ వ్యతిరేక, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలన్నింటికీ వెంటనే స్వస్తి పలకాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాలను కనుక వీడకపోతే భారీ ఉద్యమాన్ని చేపడతామని సదస్సు హెచ్చరించింది.

వ్యవసాయరంగానికి కేటాయింపులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోత పెట్టడాన్ని సదస్సు గర్హించింది. కేంద్రం ఎరువుల సబ్సిడీని కొనసాగించాలని, తాజా బడ్జెట్‌లో ఎరువుల రేట్ల పెంపుదలను పూర్తిగా ఉపసంహరించాలని సదస్సు కోరింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ సంస్కరణలను అమలు పరుస్తోందని సదస్సు ఆగ్రహం వ్యక్తం చేసింది. పెంచిన వ్యవసాయ విద్యుత్ మెటార్ల సర్వీసు చార్జీలు నెలకు పది రూపాయలు, హెచ్.పి.కి ఇరవై అయిదురూపాయలు ఉపసంహరించి పాతరేట్లనే

కొన సాగించాలని డిమాండ్ చేసింది.

నీటి పారుదల ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయింపులను పెంచాలని, ప్రత్యేకించి కరువు పీడిత ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణాలలో పెండిం గ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులన్నింటినీ తక్షణమే పూర్తి చేయాలని సదస్సు కోరింది. రైతాంగ ఆత్మహత్యలను, పనుల కోసం వ్యవసాయకూలీలు నగరాలకు వలస వెళ్ళడాన్ని అరికట్టాలని, నూతన వ్యవసాయ విధానాలను ఉపసంహరించు కోవాలని సూచించింది.



సదస్సుకు హాజరైన ప్రతినిధులు

గరిష్ట భూపరిమితి చట్టాలను అమలు చేయాలని, భూమిలేని దళితులకు, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని రకాలైన భూములను పంచాలని, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల భూబదిలీకరణను నిరోధించే 1/70 చట్టం సక్రమంగా అమలుచేయాలని సదస్సు కోరింది.

పంటలకు, పర్యావరణానికి హాని కలిగించే ప్రమాదం ఉన్న బి.టి కాటన్ విత్తనాలను దేశంలోకి అనుమతించ డాన్ని రద్దు చేయాలని బహుళ జాతి గుత్త సంస్థలకు లాభాలు దోచి పెట్టేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తీసు కున్న చర్యలను ఉపసంహరించుకోవాలని సదస్సు పేర్కొంది. గుజరాత్‌లో మైనారిటీల రక్షణకు చర్యలు తీసుకోవాలని, మతోన్మాదులపై కఠిన చర్యలు చేపట్టాలని, సమావేశం కోరింది.

చత్తీస్‌గడ్‌లోని నగర్నార్ ప్రాంతంలో ఆదివాసులపై ప్రభుత్వం సాగిస్తున్న దమన కాండను సదస్సు తీవ్రంగా ఖండించింది. గ్రామసభల నిర్ణయాన్ని ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేసింది." ★

స్వేచ్ఛామయ మిదం జగత్

పులులు లేళ్ళను చీల్చి
స్వేచ్ఛగా నెత్తురు పుడిసిలిస్తుంటే
తోడేళ్ళు మేకపిల్లల వల్లను
జుర్రి స్వేచ్ఛగా ఆవులిస్తుంటే
స్వేచ్ఛకేం తక్కువ ?
ఆహా! స్వేచ్ఛ !! ఓహో స్వేచ్ఛ !
ఎక్కడ చూసినా స్వేచ్ఛ !!
ఏ నోట విన్నా స్వేచ్ఛ !!
చిన్న చేపను తినడానికి
పెద్ద చేపకు స్వేచ్ఛ
పెద్దోడికి దోపిడితో పెరిగిపోవడానికి స్వేచ్ఛ!
చిన్నోడి తిరుగుబాటు వణచడానికి స్వేచ్ఛ
పాలకులు నియంతలుగా మారడానికి స్వేచ్ఛ
సత్యాన్ని అసత్యంగా నిరూపించడానికి స్వేచ్ఛ
అసత్యాన్ని సత్యంగా నిరూపించడానికి స్వేచ్ఛ
ఆహా ! ఏమి స్వేచ్ఛ ! ఓహో ఎంత స్వేచ్ఛ
రక్షించేవాడికి భక్షించే స్వేచ్ఛ
మానభంగాలకు స్వేచ్ఛ
మారణ హోమాలకు స్వేచ్ఛ
ప్రాణం తీయడానికి స్వేచ్ఛ

ఎంత దారుణం . . . ?
లాఠీలతో తూటాలతో
భాష్పవాయు దుష్ట విహంగాలతో
కుటిల కుతంత్రాల వ్యూహాలు నిర్మించి
కడుపు మాడ్చి చెమటొడ్డి మాపటికి లేని బతుకు
బతుకుతున్న కన్నీటి సీమలపై
దమనకాండ విన్యాసం! ?

ఎంత నీచం . . . ?
పరాధీనమవుతున్న దేశంలో
అవినీతి, అక్రమం అరిగిన వాగ్దానాల రికార్డులే
పెరిగి పెరిగి ఇంకా పెరిగి
ఒంటిపై బొమికలు తప్ప
ఏమీ మిగలని జీవితకాలాన్ని
అరగదీసి అరిగించే నిక్కృష్టం
సరిహద్దు విద్యుత్ రేఖ పాడవునా! ?

- సంపత్

"కారణాలు, పరిష్కారాలు తెలుసుకొని ఉద్యమిద్దాం'

కా॥ ఎస్. ఝాన్సీ, అధ్యక్షులు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)



రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి, ప్రత్యేకించి మారుమూల ప్రాంతాల నుండి ఎంతో వ్యయప్రయాసాల కోర్చి వచ్చిన గిరిజనులు, పేదరైతు, కూలీలకూ, పట్టణాల నుండి వచ్చిన కార్మికులు, మేధావులు, ఉపాధ్యాయులు, ఇతర వర్గాల ప్రజలకూ మా రైతుకూలీ సంఘం తరుపున ఆహ్వానం పలుకుతున్నాను.

వ్యవసాయరంగ సంక్షోభం గురించి చర్చించుకునేందుకు వచ్చాం. దీనిని మేము ఒక్క వ్యవసాయరంగానికి పరిమితమైనదిగా, గిరిజనులూ, పేద, మధ్య తరగతి రైతాంగపు సమస్యగానే చూడటం లేదు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన గ్రామీణ ప్రజలందరూ, తత్ఫలితంగా అన్ని రంగాల ప్రజలు సంక్షోభానికి గురౌతున్నారు. పాలకులతో సహా అందరూ సంక్షోభమంటున్నారు. తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామంటున్నారు. ఇవన్నీ బూటకపు మాటలేనని మన అనుభవం నేర్పుతున్నది.

కనుకనే ఈ సంక్షోభానికి కారణాలేమిటి? మూలం ఎక్కడుంది? పరిష్కారమేమిటి? అని ప్రజలందరూ ఆలోచించవలసిన అవసరముంది. కారణాలు, పరిష్కారమార్గాలు తెలుసుకొని ఆందోళనా మార్గం చేపట్టాల్సి వుంటుంది.

ప్రతిరోజు రైతాంగ సమస్యలు వెలుగులోకి వస్తూనే వున్నాయి. ఒకనాడు వ్రత్తి రైతుల ఆత్మహత్యలు; మరునాడు పాగాకు రైతుల సమస్యలు. **"అంతర్జాతీయ మార్కెట్టును అర్థం చేసుకొని పంటలు వేయటం, క్రాప్‌హాలిడే పాటిస్తే వచ్చే ఏడు మంచిరేటు వస్తుందని"** పాలకులు పరిష్కారాలు చెపుతున్నారు. 1 ఆఫ్ 70 చట్టాన్ని, భూసంస్కరణ చట్టాలను అటకెక్కించి భూములను కార్పోరేటైజ్ చెయ్యాలంటున్నారు. విశాల ప్రాంతాలకు సాగునీటి సదుపాయం లేదు. లక్షలాది ఎకరాలకు నీరందించగల పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేయమని ప్రజలడుగుతుంటే, ఇంకుడు గుంటలు, జలసంరక్షణలంటూ కల్లబొల్లి కబుర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారు.

పనులు లేక, జీవనాధారం లేక కడుపు చేత పట్టుకొని ప్రజలు వలసలు పోతున్నారు. 1 ఆఫ్ 70 చట్టాన్ని అమలుజరపమని గిరిజనులూ, మిగులుభూములు పంపకం చేయమని గ్రామీణ పేదలు కోరుతున్నారు. ఆ భూములు దున్నుకొని మా బ్రతుకులు మేం బ్రతుకుతామంటున్నారు. అయినా పాలకులు ఉలకటం లేదు.

పేద, మధ్యతరగతి రైతాంగస్థితి దారుణంగా వుంది. అప్పుల పాలయ్యామని చెప్పుకోలేని స్థితి; ఇంకా అప్పులు వుట్టనిస్థితి; చేసిన అప్పులు తీర్చలేని స్థితి. అందుకే రైతుల ఆత్మహత్యలు; కిడ్నీలు అమ్ముకొనేస్థితి దాపురించింది. అన్ని జిల్లాల్లోనూ ఇదే దుస్థితి. మరి రైతాంగం భవిష్యత్తేమిటి?

జమిందారీల రద్దు, కౌలుదారులకు రక్షణ అన్నారు. భూగరిష్ట పరిమితి, భూసంస్కరణలన్నారు. పి.ఎల్. 480 అన్నారు. సహకార, సేద్యమన్నారు. సస్యవిప్లవం, నీలివిప్లవం, తెల్లవిప్లవం, ఊదా విప్లవమన్నారు. రకరకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఎన్నో తెచ్చి మాయ జేస్తున్నారు. సంస్కరణలు పూర్తయితే మా కష్టాలు తీరుతాయంటున్నారు. బూటకపు వాగ్దానాలతోనూ, తప్పుడు పరిష్కారాలతోనూ మభ్యపెడుతున్నారు.

వ్యవసాయరంగ సంక్షోభానికి కారణా లేమిటి, పరిష్కారాలేమిటి, ఉద్యమ మార్గా లేమిటో ప్రతి ఒక్కరూ ఆలోచించవలసిన సమయమిది. మేమొక సంఘంగా ఉద్యమాలను నిర్మించటమే కాకుండా, వివిధ వర్గాల ప్రజలనూ, మేధావులనూ సమీకరించాలన్న లక్ష్యంతోటి ఈ సదస్సును నిర్వహిస్తున్నాం.

సంక్షోభపు సమస్యలను తీసుకుంటూ, ప్రజలలో వుండి పోరాడుతూ, ప్రభుత్వ తప్పుడు విధానాలను ఎత్తిచూపుతూ, ప్రజల పక్షాన నిలుస్తున్న మేధావులను ఆహ్వానించాము. సీరియస్‌గా చర్చించటం కోసం వేలాదిమంది ప్రజలను సమీకరించాము. మా ఆవేదననూ, ఆహ్వానాన్ని అర్థం చేసుకుని సదస్సుకు విచ్చేసిన మేధావులకు అభివందనాలు తెలుపుతున్నాను. ఈ కొద్ది మాటలతో సదస్సు ప్రారంభిస్తున్నాను. శ్రద్ధగా విని, చర్చించమని కోరుతున్నాను.

★

మార్గదర్శులు

- శంకర్

గమల్లోవ మరల్లోన - రక్తమంతా చిందించి
వెలుగుబాటు చూపెటోళ్ళు - కష్టజీవులోయ్
వీళ్ళు కార్మికులేనోయ్ - కష్టజీవులోయ్

రష్యాలో జారుకెదురు తిరుగుబాటు చేసినోళ్ళు
దాస్యపంకె లిరిసినోళ్ళు - కష్టజీవులోయ్
వీళ్ళు కార్మికులేనోయ్ - కష్టజీవులోయ్


చీనాలో రైతులతో - కలిసికట్టుగా నిలచి
విప్లవాలు నడిపినోళ్ళు - కష్టజీవులోయ్
వీళ్ళు కార్మికులేనోయ్ - కష్ట జీవులోయ్

భరతజాతి ముక్తి కొరకు - తెల్లవారి కెదురునాడు
ఛాతి నిలిపి పోరినోళ్ళు - కష్ట జీవులోయ్
వీళ్ళు కార్మికులేనోయ్ - కష్టజీవులోయ్

సమసమాజ స్థాపనకై - వల్లవారికెదురు నేడు
వడుం కట్టి నడిచేటోళ్ళు - కష్ట జీవులోయ్
వీళ్ళు కార్మికులేనోయ్ - కష్టజీవులోయ్

"భూమి కోసం, రుణ భారానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడుదాం!"

డా॥ బి.డి శర్మ, అధ్యక్షులు, భారతజన్ ఆందోళన్



అధ్యక్షులు, మిత్రులు, ప్రజలకువందనం, నేనీ ప్రాంతానికి వచ్చినప్పుడల్లా తొణికిసలాడే చిరునవ్వు తో నా ప్రక్కనే నిలిచి వుండే కా॥మండ్ల సుబ్బారెడ్డి ఈనాడు లేకపోవటం ఎంతో లోటుగా వుంది. ఆ కామ్రేడ్‌కు నేను శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

రైతులుగా మనం ఈరోజొక విషయంలో స్పష్టంగా ఉండాలి. ఇక్కడ, ఈరోజే, ఈక్షణాన్నే మనం ప్రతిజ్ఞ తీసుకోవాలి; పూనిక వహించక పోతే మన భవిష్యత్తు అంధకారమయమవుతుంది. ప్రపంచీకరణ అంటే అదేదో పరిశ్రమలకు చెందినదిగా చర్చలు జరుగుతున్నాయి. ఒక విషయంలో స్పష్టంగా వుందాం. ప్రపంచీకరణ అంటే వ్యవసాయంపై ఆధారపడిన వ్యవసాయ కూలీలనూ, పేద, మధ్యతరగతి రైతాంగాన్నీ భూమి నుండి గెంటివేసి పెద్దపెద్ద యంత్రాలను ప్రవేశపెట్టడమే. దాని క్రీనీడలు ఇప్పటికే విస్తరిస్తున్నాయి. ఒక ప్రక్కన ఫుడ్ కార్పోరేషన్ గోదాములు ధాన్యాలతో నిండి పొంగిపొర్లుతుంటే, మరోప్రక్కన అశేషప్రజానీకం ఆకలితో అలమటిస్తున్నారు. మా సరిహద్దునే వున్న కోరాపుట్ జిల్లాలో ఉత్తరభారత పెట్టుబడిదారులు లెక్కలు వేస్తున్నారు. ఎన్ని వందల ఎకరాల భూమి మాకుందని కాదు. ఎన్ని చదరపు కిలోమీటర్ల భూమి మాకుందని లెక్క వేస్తున్నారు. ఈ పెనురాకాసులు గ్రామసీమలను నాశనం చెయ్యటానికి పూనుకున్నారు.

వ్యవసాయంగా సంపద్వంత మయిందనే ఈ ఉత్తరప్రదేశ్ దక్షిణ ప్రాంతంలో రైతుల నడిగితే మొదట బాగానే వుందన్నారు. వడ్డీ వ్యాపారమందు రుణాలు అందాయా అంటూ నిర్దిష్టంగా ప్రశ్నిస్తే అసలు సమస్యలు బయటికొచ్చాయి. ఇక్కడ 15 సం॥లక్రితం ఒక్క రైతుకు కూడా అప్పులేదు. ఇవ్వాళ మేడలులేచాయి. ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. అయితే ఈరోజున అప్పులేని రైతంటూ లేడు. ధనికులమనుకుంటున్న రైతులు కూడా బ్యాంకులకు బంధితులైన కూలీలే. బ్యాంకుల దగ్గర అప్పులు తేవటం, సాగు చెయ్యటం, వడ్డీలు కట్టడం, వీరు బ్యాంకులకు పెద్దపాలేర్లుగా మారిపోయారనాలి. ఇది సస్యవిప్లవంవల్ల ఎన్నో లాభాలు చేకూరాయంటున్న ప్రాంతాల్లో రైతాంగపు పరిస్థితి. ఈ రైతాంగమే-వందలమంది ఆత్మహత్యలు చేసుకోవడం గమనార్హం.

సంక్షోభం ఎంత తీవ్రంగా వుందో తెలుపటానికే నేను ధనిక రైతాంగంతో మొదలు పెట్టాను. బ్రిటీషు పాలనకాలంలో రెవిన్యూ శిస్తు అధికంగా వుండేది. పంటలో 80శాతం శిస్తుగా రైతాంగం కట్టాల్సి వచ్చేది. రైతాంగం అప్పులపాలై శిస్తులు కట్టలేని దుస్థితిలో పడ్డారు. ఆనాడు ప్రభుత్వం నియమించిన కరువు కమీషన్ తన నివేదికలో "రైతు అప్పుల్లోనే పుడుతున్నాడు; అప్పుల్లోనే బ్రతుకుతున్నాడు; అప్పుల్లోనే చనిపోతున్నాడు" అని పేర్కొంది. నేడు అదే పరిస్థితి దాపురించింది.

జాతీయోద్యమంలో రెండు అంశాలు ప్రధానంగా ముందుకొచ్చాయి. మొదటిది దున్నేవానికే భూమినినాదం. అంటే జమిందారీ వ్యవస్థ రద్దుకావాలి. దున్నేవానికే భూమిదక్కాలి అని. రెండవది రైతాంగపు రుణాలు. షావుకారు ఒక భూతం. అతని ఆధిపత్యం పోవాలనేది ప్రజల డిమాండ్. 52 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత చూస్తే మళ్లీ ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. ఈ రెండు అంశాల్లోనూ ఇంతకు ముందున్న ప్రభుత్వ విధానాలను తిరగతోడుతున్నాడు. గ్రామీణ ప్రాంతంలో వడ్డీ వ్యాపారి పట్టు కొనసాగుతూనే వుంది. కో-ఆపరేటివ్ బ్యాంకు, జాతీయబ్యాంకు, ప్రైవేట్ బ్యాంకు ఏ పేరుతోనన్నా పిలవండి. వేర్వేరు రూపాలతో వడ్డీ వ్యాపారి కొనసాగుతున్నాడు. వ్యక్తిగా వడ్డీవ్యాపారిని ఎదుర్కోవచ్చు. ప్రభుత్వ మద్దతుతో ఒక వ్యవస్థగా బ్యాంకులు వడ్డీతో గ్రామీణ ప్రాంతాలను పీడిస్తున్నాయి. చిత్రమే మంటే రైతాంగానికి రక్షణ కల్పించే వారమంటూ మొసలి కన్నీరు కారుస్తున్న వారందరికీ రైతాంగాన్ని పీల్చిపిప్పి చేస్తున్న ఈ వడ్డీ వ్యాపారం చర్చ నీయాంశంగా లేదు. భూమికోసం ఎన్నో వీరోచిత పోరాటాలు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వ విధాన మేమిటి?

అదేమిటంటే రైతు ఆర్థికంగా బలంగా లేడు. కాబట్టి లాభసాటిగా వ్యవసాయాన్ని చెయ్యలేడు. కనుక డబ్బులున్న వారికి భూమినప్పచెప్పాలి. వారు వ్యవసాయాన్ని లాభసాటిగా నిర్వహించగలరు. ఇది నేటి వ్యవసాయవిధానం. జాతీయోద్యమంలో భూమికోసం పోరాడాం. వడ్డీ వ్యాపారంపై పోరాడాం. ఇవాళ వీరినే వ్యవసాయాన్ని రక్షించేవారిగా చిత్రిస్తున్నారు.

రైతుకే భూమి ఉండాలి :

చంద్రబాబునాయుడు విజన్ 2020లాగే, ఛత్తిస్‌ఘడ్‌లో విజన్ 2010 అని ఒక పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అందులో వ్యవసాయ రంగ వెనుకబాటుకు కారణమేమిటని ప్రశ్న వేసుకుని ఒక సమాధానమిచ్చారు. "ఇక్కడి వ్యవసాయంలో ప్రైవేటు పెట్టుబడులు ప్రవేశించిసాగు నుఅభివృద్ధి చెయ్యకపోవటమే ప్రధాన లోపమని" చెప్పారు. "మట్టి పిసికిన చేతులలోనే పట్టా ఉండాల"న్నది గత నినాదం. "ఎవరి చేతిలోనోట్లున్నాయో వారి చేతిలో భూమి వుండాల"న్నది నేటి విధానం. ఇది రైతాంగాన్ని నాశనం చేసే, ధనాఢ్యులకు అధికారాన్నిచ్చే, జాతీయ వ్యవసాయ విధానాన్ని తిరగరాసి రైతాంగానికి మరణ శాసనం లిఖించే విధానమిది.

మీరు భూమి కోసం పోరాడుతున్నారు. భూస్వాముల గూర్చి కూడా ఒకే మాట చెప్పాలి. 1930ల నాటి అమెరికా పరిస్థితి. ఆనాడు అక్కడ రైతులుండేవారు. నేడు రైతులు లేరు. "ఆగ్రహఫలాలు" అన్న నవలలో రచయిత ఇలా చెప్పాడు. "మా తాత ఇక్కడ ఆదివాసుల్ని నరికి చంపాడు; మా తండ్రి పాముల్ని ఏరివేశాడు; ఇప్పుడు బ్యాంకులు నన్ను ఏరిపారెయ్యటానికి సిద్ధంగా వున్నాయి. కనుక ప్రపంచీకరణ విధానమంటే కూలీలనీ, రైతాంగాన్నే కాదు

భూస్వాములను కూడా కబళించి వేస్తుంది. వాళ్ల బ్యాంకులెప్పుడు అప్పులివ్వడం మొదలెడతాయో అప్పుడే భూమి ద్రవ్యపెట్టుబడి చేతులతోకి వెళుతుంది. దీనినర్థం చేసుకోవాలి. లేదంటే యీ వినాశనాన్ని ఎదుర్కోలేము.

మన పోరాటం 50 ఏళ్ళ క్రిందటే ఓడి పోయింది. ఇవ్వాళ కాదు. మన డిమాండ్లకు ప్రతికూలమైన తప్పుడు అవగాహనను రాజకీయ, పరిపాలనా వ్యవస్థలు స్వీకరించినప్పుడే ఓడి పోయింది. ఏమిటా అవగాహనలు? కోట్లాది శ్రమజీవులకు ఉపాధి దొరకని దేశంలో, అభివృద్ధికి మూలం పెట్టుబడి అని అంగీకరించాం. అందు బాటులోనున్న శ్రమను వినియోగించుకోకుండా పెట్టుబడులు పెంచాలనడంతోనే మన ఓటమి ప్రారంభమైనది. కూలీల, రైతుల శ్రమకి బదులుగా ట్రాక్టర్లు, ఎరువులు, పురుగుమందు లతో పెట్టుబడులు పెట్టడం నష్టదాయకమైంది. చిన్న కమతంలో ఎక్కువ శ్రమ అవసరమౌతుంది. ఎక్కువ దిగుబడి వస్తుంది.పెద్ద కమతాలకు ఎక్కువ పెట్టుబడి కావాలి. ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది. ఇది నిరూపితమైన సూత్రం. దీనినర్థం చేసుకోకుండా శ్రమను తొలగించి పెట్టుబడులు పెంచే విధానాన్ని అనుసరించారు. అది దేశ ప్రయోజనాలకూ, ప్రజల ప్రయోజనా లకూ హాని కలిగించింది. ఇదే మూలకారణం. **రెండవది:** 70 నుండి 80 శాతం వ్యవసాయంపై ఆధారపడి వుండగా, అభివృద్ధికి కీలకం పరిశ్రమ లని నిర్ణయించటం. ఇదే దేశ వ్యతిరేకమైన, ప్రజా వ్యతిరేకమైన అంశం. అత్యధిక జనాభా ఆధార పడిన వ్యవసాయానికి కాక, పారి శ్రామికరంగానికి ఆర్థికవ్యవస్థలో ఇవ్వకూడని నాయకత్వపాత్రను ఇచ్చారు. ఇక **మూడవ అంశం** పచ్చిమోసం. సూత్రరీత్యా అసమానత్వమే అభివృద్ధికి మూల మని అంగీకరించినవారు సోషలిస్టు తరహా సమాజం గురించీ, సమానత్వం గురించీ మాట్లాడి ప్రజలను ప్రక్కదారి పట్టించారు. గాంధీజీని జాతిపితగా గుర్తిస్తున్న పార్టీలన్నీ ఆయన చెప్పిన ఒక చిన్న విషయాన్ని ఎలా మరిచిపోయారో ఆశ్చర్యం కలిగిస్తుంది. 1918లో తను రాసిన వ్యాసంలో " వ్యవసాయ కూలీల కంటే లాయరుకు ఎందుకు ఎక్కువ ఆదాయం రావాలి?" అని ఆయన ప్రశ్నించాడు. రైతుకూలీసంఘం గుంటూ రు వద్ద జరిపిన సమావేశంలో సర్వేఫలితాలను చర్చించారు. వ్యవసాయకంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల నుండి కరువు పీడిత ప్రాంతాల వరకూ రైతుల కిక్కడ రోజుకు 30 రూ॥లకు మించి ఆదాయం రావటం లేదు. అక్కడే రోజంతా నిద్రపోయే ప్యూనుకు వంద రూ॥లు, కలెక్టరుకు వెయ్యి రూపాయలు, లాయరో, డాక్టరుకో పదివేలు ఆదాయం వస్తున్నది. ఆదాయంలో ఈతేడా ఎందుకు వచ్చింది?

వ్యవసాయ కూలీల, రైతుల ఆదాయాలను దోచుకోవటం వల్ల ఈ తేడా వచ్చింది. ఎలా సాగుతున్నది? వ్యవసాయ కూలీల, రైతుల శ్రమ ఎంతో నైపుణ్యంతో కూడినది. కానీ దీనిని నైపుణ్యం లేని శ్రమగా పేర్కొన్నారు. ఇదీ జరిగిన మోసం. దీనినెవరూ ప్రశ్నించటం లేదు. కొన్ని సందర్భాలలో ఒక గ్రామంలోని ఉపాధ్యాయుని ఆదాయం ఆగ్రామ ఆదాయం కన్న ఎక్కువ. దీనితో కొన్ని గ్రామాలు దీనిని ప్రశ్నిస్తున్నాయి. వన్నుల రూపంలో మా ఆదాయం నుంచి తరలించి వారికి ఆదాయం చూపుతున్నారు. ఈ అసమానత్వం పోవాలంటున్నారు. ఇది పార పాటున జరిగింది కాదు. ఐదవ వేతన సవరణ సంఘం అధికారుల జీతాలను పెంచింది. మహానగరాలను చూడండి. కార్లతో, మోటారు సైకిళ్లతో నిండిపోయాయి. ఇళ్ల నిండా వస్తువులే. సామ్రాజ్యవాదులు వారి సరుకులు అమ్మ్ము కోవడం కోసం వేతన సవరణ సంఘంగానీ, ప్రభుత్వ విధానాలుగానీ వీరి ఆదాయలు విపరీతం గా పెంచుతున్నాయి. కార్లు సజావుగా పరుగెత్తా లంటే రోడ్లు వెడల్పు చెయ్యాలి. ఫ్లైఓవర్లు కట్టాలి. మహోఘనత వహించిన ప్రపంచ బ్యాంకు వీటికి అప్పులిస్తున్నది. దీనినే అభివృద్ధి అంటున్నారు. అయితే ఫలితమేమిటి ? దేశం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 20 లక్షల కోట్ల రూ॥ల అప్పు, దీనికి చెల్లించే వడ్డీ ప్రభుత్వ ఆదాయంలో మూడవ వంతు. ఈ అప్పుల భారంతో ప్రభుత్వాలు ఖర్చులు తగ్గించ పూనుకున్నాయి. దీని ఫలితంగా జాతీయాదాయంలో గ్రామీణుల నుండి వచ్చేది 1953లో 63 శాతం నుండి నేడు 23 శాతానికి తగ్గిపోయింది. అదే సమయంలో 10 శాతం ధనాఢ్యుల ఆదాయం 50 శాతంగా వుంది.

రుణభారం స్వరూపం :

మనం అనేక సమస్యల మీద పోరాటాలు చెయ్యవచ్చు. అయితే కీలక సమస్య రుణభారం. ఒక రైతు అప్పులపాలైతే భూమిని కోల్పోతాడు. ఒక దేశం అప్పులపాలైతే తన సహజవనరు లన్నింటినీ కోల్పోతుంది. ఇదే నేడు జరుగు తోంది. గంగాతీర మైదానమంతా బహుళజాతి కంపెనీల చేతుల్లోకి వెళ్లబోతుంది. దేశ సహజ సంపద, అటవీసంపద సామ్రాజ్యవాదులకు అప్ప జెపుతున్నారు. కనుక ఈ అప్పులకు వ్యతిరేకంగా మన పోరాడాలి. అందుకే అంతర్జాతీయంగా వున్న అప్పులన్నింటితో మనకు సంబంధం లేదని ప్రకటించాలి. ఈ అప్పుల్లో ఏది మన గుడిసెల్లోకి వచ్చింది ? రాలేదు. మనకు సంబంధం లేదని ప్రకటించకపోతే ఈ భూమికీ, అడవికీ, ఖనిజాలకీ రక్షణలేదు. వీటిని అంతర్జాతీయ పెట్టుబడి దారులు కబళించి వేస్తారు.

రైతాంగ రుణభారం గురించి గతంలో అనేక మార్లు చెప్పాను. అయినా మరోసారి చెబుతాను. వ్యవసాయదారుల రుణచట్టం, భూమి అభివృద్ధి చట్టం అని 1883లోనూ, 1884లోనూ రెండు చట్టాలు చేశారు. వీటి ప్రకారం వ్యవసాయ రుణాలకు చక్రవడ్డీ వసూలు చేయరాదు. బారువడ్డీ మాత్రమే తీసుకోవాలి. వడ్డీ కూడా సాలుకు 4 శాతము ఉండాలి. దీనిని 35 సం.లలో తీర్చవచ్చు. 1990లో బీహారులో వడ్డీ వ్యాపార క్రమబద్ధీకరణ చట్టంచేశారు. దీనిప్రకారం చక్రవడ్డీ వసూలు చేయరాదు. వడ్డీ అసలును మించరాదు. ఒక కలెక్టరు ఇల్లు కట్టుకుంటే 2 శాతం బారువడ్డీ, మేనేజరు కారుకొనుక్కొంటే 2 శాతం బారువడ్డీకి రుణమిస్తుంది. మరి ఒక రైతు 15 శాతం చక్రవడ్డీ ఎందుకు కట్టాలి? అందుకనే చక్రవడ్డీ చెల్లించము. అసలును మించిన వడ్డీ చెల్లించము. బారువడ్డీ చెల్లిస్తామని పోరాటం చేద్దాం. మన మిరోజు ఒక ప్రకటన చేద్దాం. డబ్బుగా ఎంత వచ్చింది, ఎంత పోయిందీ అని లెక్కలలోకి వెళితే రైతులు నష్టపోతారు. ఈ భూమి మనకు అన్నం పెట్టే తల్లి. ఈ భూమి తల్లిని మార్కెట్టులో అమ్మకం పెట్టే సరుకుగా మనం అంగీకరించరాదు. అలా చెయ్యకపోతే భూమి మార్కెట్టు సరుకవుతుంది. రైతు భూమిని కోల్పోతాడు ; వ్యవసాయ కూలీలు భూమికి దూరమౌతారు. దీనిని మనం ఎదు ర్కోవాలి.

సామ్రాజ్యవాదులూ, దేశ పాలకులూ మనలను చీల్చడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. సమిష్టిగా వున్నప్పుడు బలంగా వుంటాం. సమిష్టి నుండి విడిపోయిన వ్యక్తి బలహీనమవుతాడు. ఈ సమిష్టి శక్తిని నాశనం చెయ్యాలనే వారు చూస్తున్నారు. కనుకనే "అన్ని

ఆధికారాలు సోవియట్లకే'' అన్న లెనిన్ విధానాన్ని గుర్తు చేసుకుందాం. గాంధీజీ గ్రామ స్వరాజ్యాలని పిలిచారు. అందుకే "గ్రామసభలకే అన్ని అధికారాలుండాల'' న్న నినాదాన్ని ముందుకు తీసుకుపోవాలి. గ్రామాలకే అధి కారాలు లేకపోతే, సామ్రాజ్యవాదులు, పెట్టుబడి దారులూ సాగిస్తున్న దాడిని త్రిప్పి కొట్టలేం. ఢిల్లీలో నాయకులు పంచాయితీలను పటిష్టం చేయటం గురించి మాట్లాడతారు. అయినా గిరిజన ప్రాంతా లలో గ్రామసభలను ఎలా అణచివేశారో మనకు తెలుసు. ఆదివాసులు, ప్రజలు ఈ విషయాలు తెలుసుకుంటున్నారు. గ్రామసభలకు అధికారాలు రావాలని పోరాడుతున్నారు.

ఛత్తిస్‌ఘడ్‌లోని బస్తర్‌జిల్లా నగర్నార్ ప్రాంతం లో 20 మంది మహిళలతో సహా 60 మందిని అరెస్టు చేశారు. బెయిలు కూడా యివ్వలేదు. వారు చేసిన నేరమేమిటి? వారు పోరాడుతున్నారు. స్టీలు ప్లాంటు కోసం వారి భూముల నుండి, గ్రామాల నుండి వారిని తరిమి వెయ్యడానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఒక్క నగర్నార్‌లోనే కాదు. ఈ పిలుపు చేరిన ప్రతిచోటా ప్రజలు పోరాటాల్లోకి వస్తున్నారు. ఆ పోరాటాలకి మద్దతునివ్వటం, వాటిని ముందుకు తీసుకు పోవడం మన కర్తవ్యంగా వుండాలి. అందుకోసం కృషి చేద్దాం.

మన దేశ సాంప్రదాయంలో **"మనం" అమకుంటాం తప్ప "నేనే"అన్నది లేదు. వాగరికత "నేను" ను మనకు నేర్పింది. "నేను" ను మనం వదులుకోవాలి. తిరిగి "మనం"ను అలవాటు చేసుకోవాలి. "మనం" గా ఉన్నప్పుడే మన గలుగుతాం ;ముందుకెళ్ల గలుగుతాం; పోరాడ గలుగుతాం.** ★

(10 వ పేజీ తరువాయి)

చేసుకుంటున్నారు. ఇది మన వ్యవసాయాన్ని అన్నివిధాలా దెబ్బతీస్తున్నది. ఈ రెండు కారణాల వల్ల మనదేశం సామ్రాజ్యవాదులకు దాసోహమనాలి. వారి కనుసన్నలలో మెలగాలి.

కనుక మనం ఆ డిమాండు కోసమూ, ఇంకో దాని కోసమో పోరాడితే సరిపోదు. మొత్తం వ్యవసాయ విధానమే మారాలి. రైతాంగ అనుకూల ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం కావాలని మనమందరం పోరాటం చేయాలి. ప్రజావ్యతిరేకమైన ఆర్థిక సంస్కరణల రద్దుకై పోరాటం చేయాలి. ఆ పోరాటం ద్వారానే మనం దోపిడీ నుండి బయటపడతాము. మనజీవితాలు బాగుపడతాయి. ఇది సుదీర్ఘమైన పోరాటం. దీనిలో మీరందరూ ముందుండాలి. పోరాటాలు చేస్తే తప్ప ఏమీ సాధించుకోలేము. మనల్ని మనమేకాక ముందు తరాలను కూడా రక్షించు కోవాలి. అందుకు మీరందరూ కృషి చేస్తారని ఆశిస్తున్నాను. ★


(11 వ పేజీ తరువాయి)

మనకెన్నో అనుభవాలున్నాయి. ముస్లిం రాజు వుండి మెజారిటీ హిందూ ప్రజలున్నా, మిగిలిన దేశం హిందూ ముస్లిం తగాదాలతో కల్లో భరితమైన నైజాం సంస్థానంలో సాగిన వీరోచిత రైతాంగ సాయుధ పోరాటం ప్రజల ఐక్యతను నిలవగలిగింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా హిందూ ముస్లిం తగాదాలు ప్రజలలో పెట్టలేక పోయారు. నక్సల్బరీ పోరాటం గిరిజన రైతుల ఐక్యతనే కాక గిరిజన టీ తోట కార్మికుల ఐక్యతను సాధించింది. శ్రీకాకుళం గిరిజ నోద్యమం కూడా వైషమ్యాల నధిగమించి ప్రజల ఐక్యతను సాధించింది.

ఇటీవలి అనుభవాలు కూడా ఇదే తెలుపు తున్నాయి. 9 పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్తు ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ప్రభుత్వవిధానాలు, సామ్రాజ్య వాద దేశాల దోపిడీ అన్నవి ప్రజలలో విస్తృతంగా చర్చకు వచ్చాయి. అప్పుడు గుంటూరులో ఒక మసీదులో బాంబు పేలింది. ఎవరు పెట్టారో తెలియదు. విద్యుత్ ఉద్యమాన్ని ప్రక్కదారి పట్టించేందుకు మతకలహాలు రేకెత్తించేందుకు ప్రభుత్వమే ఈ పని చేసిందేమో అని చర్చించారు. ఏమైనా ఆఖరికి గుంటూరులో కూడా కలహాలు కాదు కదా కనీసం హిందూ - ముస్లిం ప్రజల మధ్య ఉద్రిక్తతలు కూడా తలెత్తలేదు. పైగా ప్రార్థనాలయంపై దాడికి అందరూ బాధపడ్డారు. నిరసించారు. ఎలుగెత్తి ఖండించారు.

ఈ అనుభవాలు తెలుపుతున్నదేమిటి? ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలను తీసుకొని ప్రజలను పోరాటాలలోకి తీసుకు వచ్చినపుడు, ఆ సమస్యలకు మూలకారణమైన బడాబూర్జువా, భూస్వామ్యవర్గాలూ, సామ్రాజ్య వాదుల విధానాలను సరిగా వారి ముందుంచి పోరాట లక్ష్యాలను రూపొందించినప్పుడు ప్రజల రాజకీయ చైతన్యం పెరిగి ప్రజలను చీల్చే పాలకవర్గాల కుట్రలన్నీ కుప్పకూలిపోతాయి.

కనుకనే నేడు రైతాంగమెదుర్కొంటున్న అన్ని సమస్యల మీద రైతు కూలీ సంఘం పోరాటాలను నిర్మించాలి. భూసంస్కరణల కోసం, గ్రామీణ రుణభారవిముక్తికోసం, సాగునీటి పారుదల కోసం, గిట్టుబాటు ధరలకోసం పోరాడాలి. అదే సమయములో ఈ సమస్యలకు మూలమైన సామ్రాజ్యవాద దోపిడీ, భూస్వామ్య విధానాలను ప్రజల ముందుంచాలి. వీటికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు కలవవలసిన ఆవశ్యకతను ప్రజల ముందుంచాలి. ఆ విధంగా ప్రజల ఐక్యతను సాధించి సంఘటిత పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్ళాలి. ఈ కర్తవ్యానికి పునరంకితమవుదాం. ★



"ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానంకోసం పోరాడుదాం"

- ప్రొ॥ కె. ఆర్. చౌదరి

అధ్యక్షా, మిత్రులారా!



వ్యవసాయరంగం సంక్షోభంలో వుంది. దాన్ని గురించే చర్చించుకుంటున్నాం. ఇదేకాదు, అన్నిరంగాలూ సంక్షోభంలో వున్నాయి. పారిశ్రామిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలన్నిటా సర్వత్రా వ్యాపించింది. గత 45 రోజులుగా సాగుతున్న గుజరాత్ మారణకాండ రాజకీయ, సామాజిక రంగాలెంత సంక్షోభంలో వున్నాయో తెలుపుతుంది. నా గుజరాత్ పర్యటనలో హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ఈనాటి రామభక్తులు హనుమంతు లంకాదహనం చెయ్యలేదు. ఆర్.ఎస్.ఎస్, భజరంగ్‌దళ్, బిజెపి వాళ్లు దగ్గరుండి గుజరాతును తగులబెట్టారు. ముస్లింల ఇళ్ళను, షాపులను, హోటళ్ళనూ తగులబెట్టారు. ధన, మాన ప్రాణాలను హరించారు. తెలుగువాళ్లే ఐఏఎస్ ఆఫీసర్లు కిశోర్‌రావు, శ్రీనివాసరావులు పై వాళ్ళ సపోర్టు లేకుండా ఇదంతా జరగదండీ! అన్నారు. గోధ్రాలో జరిగిన హింసాకాండ తర్వాత సీనియరు అధికారులతో మోడీ సమావేశం జరిపారు. "మతకలహాలు సాగి హింస ప్రజ్వరిల్లవచ్చని అధికారులం"టే,"హింస జరగదు మీరేమీ చర్యలు తీసుకోకం"డి అని ముఖ్యమంత్రి చెప్పాడు. ఎంత హింసాకాండ! ఒక ఇంటిలో 18 మంది వుంటే నీరునింపి కరెంటు పంపి వారిని చంపారు. 40 మంది వున్న మరో ఇంటిని తగులబెట్టారు. ఆరేళ్ల పసివాడు తన తాతలు, తండ్రులు, అమ్మలు, చిన్నాన్నలను ఉన్మాదులు ఎలా చంపిందీ చెప్పాడు. ఎందుకీ మారణకాండ జరిగింది? ముఖ్యమంత్రీ, ప్రధానమంత్రీ ఏ చర్యలు తీసుకున్నారు? రోజుకొక మాట మాట్లాడుతూ, మతకలహాలను ఆపలేని వారు ప్రధానమంత్రిగా వుండటం సిగ్గుచేటు. ఈ దాడులు ఫాసిస్టుశక్తులు చేస్తున్నాయి. ఒక మైనారిటీ మతస్థులపైనా, దళితులపైనా, ఆదివాసులపైనా ఈ దాడులు సాగుతున్నాయి. ఇంకా జరగవచ్చు. లౌకిక, ప్రజాస్వామికవాదులందరూ మన లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవలసిన అవసరముంది.

ఇక వ్యవసాయరంగం సంక్షోభంలో వుంది. మన రాష్ట్రం కూడా సంక్షోభంలో వుంది. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, ప్రపంచ వాణిజ్యసంస్థలు చెప్పిన ఆర్థిక సంస్కరణలు అమలు చేయటంలో ముందున్నది గనుక మన రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నదని మన ముఖ్యమంత్రి అంటున్నారు. ఇదే నిజమైతే మన రాష్ట్రం సంక్షోభంలో ఎందుకుంది? ఎక్కడా జరగనన్ని రైతుల ఆత్మహత్యలు ఆగకుండా ఇక్కడే ఎందుకు జరుగుతున్నాయి? అన్ని జిల్లాల్లోనూ, అన్ని పంటల రైతాంగమూ దిక్కుతోచక బలవన్మరణం పాలవుతున్నారు. రెంటచింతలలో కిడ్నీలు అమ్ముకుంటున్నారు. ఎందుకీ దురవస్థ? లక్షలాది చిన్న, సన్నకారు రైతులూ, కూలీలు సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. మహబూబ్‌నగర్, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వలసలు మరీ ఎక్కువయ్యాయి. గతంలో ఆదివాసీలలో వలసలు వుండేవి కాదు. ఇప్పుడు వారు కూడా వలసలు పోతున్నారు. ఇదంతా వ్యవసాయరంగ సంక్షోభాన్ని తెలియజేయటం లేదా?

మీలో అప్పులు లేనివారెవరైనా వున్నారా? రైతాంగం అప్పుల్లో కూరుకుపోయి వుంది. ఏ రకంగానూ వ్యవసాయం గిట్టుబాటు కావటం లేదు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల రేట్లు, కరెంట్ ఛార్జీలు, నీటితీరువా అన్నీ పెరిగాయి. పంటకు గిట్టుబాటు ధర లేదు. అప్పులు పెరిగిపోయాయి. ఈ రకంగా వ్యవసాయం సంక్షోభంలో పడిపోయింది. దీనికి కారణాలనేకం. వాటిని గుర్తించి పరిష్కారమార్గాలు కనుగొనాలి.

కమ్యూనిస్టులు విమర్శలే తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయరని పాలకులు విమర్శిస్తుంటారు. ప్రభుత్వ వ్యవసాయ విధానం రైతాంగ వ్యతిరేకమైనది. దీనివల్ల అభివృద్ధి జరగదు. ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం కావాలి. దీనివల్ల అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి. ఆర్థిక, సామాజిక న్యాయాలు దీనిలో వుండాలి. అభివృద్ధి భూస్వామ్య, వాణిజ్య, పెట్టుబడిదారీ వర్గాలకు కాదు. చిన్న, సన్నకారు రైతులకు, కూలీలకు, మధ్యతరగతులకూ జరగాలి.

ఈ ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానంలో ఆహార భద్రతకు ప్రాముఖ్యతనివ్వాలి. ఎందుకంటే గత పదేళ్లలో తలసరి ఆహారలభ్యత రోజుకు 510 గ్రాముల నుండి 417 గ్రాములకు తగ్గిపోయింది. 9వ పంచవర్షప్రణాళిక నాటికి 23 కోట్లటన్నుల ఆహారధాన్యాలు అవసరమనుకుంటే, యిప్పటికీ రెండు కోట్ల టన్నులు తక్కువగానే వున్నాయి. అయినా ప్రభుత్వ గోదాములు నిండిపోయి వున్నాయి. ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా తగ్గిపోతున్నది. కారణం ప్రజలు కొనుక్కోలేకపోతున్నారు. ఎందుకంటే చౌకధరల దుకాణాల్లో ధరలు పెంచివేస్తున్నారు. వ్యవసాయం గిట్టుబాటుగా లేదు; పనులు లేవు, ఆదాయాలులేవు. కనుక కొనుగోలుశక్తి పడిపోతున్నది. రాబోయే కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇంకా తగ్గుతుంది. ఇప్పటి వ్యవసాయ విధానం పంటల సరళిని మార్కెట్టు శక్తుల అంటే సామ్రాజ్యవాదుల చేతుల్లో పెట్టింది. వాళ్లు ఆహారధాన్యాల బదులు వాణిజ్యపంటలు వెయ్యమంటున్నారు. కనుక మన ప్రత్యామ్నాయ విధానం ఆహార ఉత్పత్తిని పెంచేదిగా వుండాలి. తక్కువ ధరలకు జనానికి అందించేదిగా వుండాలి.

ప్రజలందరికీ ఉపాధి దొరికితే వారి ఆదాయాలు పెరుగుతాయి. అనుబంధ కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి. పనికి ఆహార

పథకాలు కావచ్చు. ప్రజలందరికీ పని కల్పించే విధానం కావాలి. ఆహారభద్రతతోపాటు స్వావలంబనను కలిగి వుండాలి.

మన ప్రత్యామ్నాయ విధానంలో వ్యవసాయాన్ని సామ్రాజ్యవాదుల పట్టు నుండి తొలగించాలి. బ్రిటీషువాళ్లు మనదేశాన్ని పాలించారు. వారికి కావలసిన పంటలను బలవంతంగా వేయించారు. నీలిమందును బలవంతంగా పండించారు. కారుచౌకగా వాటిని తమ దేశాలకు తరలించుకు వెళ్లారు. ఇవ్వాళ వాళ్లు తమ దేశంలోనే వుండి మనదేశాన్ని రాజకీయంగా, ఆర్థికంగా తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. ఇదే సామ్రాజ్యవాదం.

మన వ్యవసాయరంగం మీద పట్టుకోసం ప్రయత్నాలు ఇప్పుడే ప్రారంభం కాలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆహారకొరతతో ఇబ్బందులు పడుతుంటే అమెరికా నుండి రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ అన్న సంస్థ వచ్చి నెహ్రూతో ఇలా చెప్పింది. "మీ ఆహార సమస్యలేవైనా అభివృద్ధి చెందాంలంటే మాతో కమిటీ వెయ్యండి." ఆ కమిటీ ఒక నివేదిక నిచ్చింది. అందులో వ్యవసాయాభివృద్ధి జరగాలంటే అధిక దిగుబడి విత్తనాలు వాడాలి అని చెప్పింది. మనదేశంలో జన్యుసంపద విస్తారంగా వుంది. వరిలో 50 వేల రకాలున్నాయి. సామ్రాజ్యవాదులు వీటిని తీసుకుపోయి, మార్చి తిరిగి మనకు అంటగట్టారు. వారు రసాయనిక ఎరువులు వాడాలని చెప్పి వాటిని మనదేశంలో అమ్ముకున్నారు. అలాగే పురుగుమందులు వాడాలన్నారు. 80 శాతం పురుగుమందులు సామ్రాజ్యవాదుల చేతుల్లోనే వున్నాయి. అలాగే ట్రాక్టర్లు, భారీ యంత్రాలను అంటగట్టాయి. ఎవరైనా తమదేశ పరిస్థితిని బట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించుకోవాలి. మనం విదేశాల నుండి దిగుమంతి చేసుకున్నాం. ఇదంతా వ్యవసాయరంగాన్ని అతలాకుతలం చేసింది.

సామ్రాజ్యవాద దేశాలు వివిధ మార్గాలలో మన వ్యవసాయాన్ని గుప్పెట్లో పెట్టుకొనేందుకు చూస్తున్నాయి. ఒకటి: చట్టాల ద్వారా: ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా మన చట్టాలను మారుస్తున్నారు. వాటిలో ముఖ్యమైనది పేటెంటు చట్టం. ఎవరైనా దేన్నైనా కనుగొంటే దానిమీద సంపూర్ణాధిపత్యం వారికే వుంటుంది. దాని జోలికి ఇతరులెవ్వరూ వెళ్లగూడదు. ఇది దుర్మార్గమైన చట్టం. దీనివల్ల మన సైంటిస్టులు మనదేశానికవసరమైన విత్తనాలను రూపొందించడానికి వీలుండదు. ఈ పేటేంటు బిల్లును వ్యతిరేకిస్తూ 50 మంది మేధావులు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి మెమోరాండం ఇచ్చారు. మొదటి సంతకం చేసిన నలుగురూ వాజ్‌పాయి, అద్వానీ, మురళీ మనోహర్ జోషి, జార్జి ఫెర్నాండెజ్. ఈ చట్టం రైతులపాలిట మరణ శాసనమన్న ఈపెద్ద మనుషులు అధికారంలోకి రాగానే ఆ చట్టానికి ఆమోదముద్ర వేశారు. సామ్రాజ్యవాదులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, చట్టాల ద్వారా మనల్ని కంట్రోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

బిటి కాటన్ విత్తనాలు వాడితే శనగపచ్చ పురుగురాదట. వీటిని ఎవరూ తయారు చెయ్యకూడదు. మాన్‌సాంటో కంపెనీ నుండే కొనుక్కోవాలి. దున్నక్కరలేదు. కలుపుతీయక్కర్లేదు. దీనిని రౌండప్ టెర్మినేటర్ అని రకరకాల పేర్లతో మనపై దాడి చేస్తున్నారు. మాన్‌శాంటోకు ప్రపంచాన్ని శాసించేశక్తి వుంది. చిన్నచేపను పెద్దచేప మింగినట్లు 32 వేల కోట్ల విలువచేసే కంపెనీలను ఇది తనలో కలిపివేసుకుంది. ఈ కంపెనీ చేతిలోకి మన విత్తనాలు పోతే రైతులు దీని కోరల్లో చిక్కుకుంటారు.

సామ్రాజ్యవాదులు మన భూమి, సహజ వనరులు, ఖనిజసంపదపై ఆధిపత్యం పొందుతున్నారు. తమకు కావల్సిన వాటిని ఉత్పత్తి చేసి ఇమ్మంటున్నారు. పండ్లు, రొయ్యలు, చేపలు ఇమ్మంటున్నారు. ఇస్తున్నాం. అయినా మనకు మిగలేదేమీ లేదు. వాళ్లకు వ్యవసాయ ఉత్పత్తులు విశేషంగా ఉన్నాయి. దీనికి అనేక కారణాలున్నా ప్రభుత్వమిచ్చే సబ్సిడీలు ముఖ్యమైనవి. అక్కడ రైతు 100 రూ॥ ఖర్చు పెడితే 50 రూ॥ సబ్సిడీ ఇస్తారు. వాటిని అమ్ముకునే మార్కెట్టు కావాలి. వాటిని మనదేశంలో దిగుమతి చేసుకోవటంపై వున్న ఆంక్షలన్నింటినీ ఎత్తివేయించారు. దీనితో విదేశాల నుండి కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. ప్రత్తి, వంటనూనె, చక్కెర దిగుమతి అవుతున్నాయి. ఇవి పండించిన మన రైతుల కావాలి. మనకు వైవిధ్య పూరిత జన్యుసంపద వుంది. తగిన పరిశోధనలు చేసి కావలసిన విత్తనాలు రూపొందించుకోవచ్చు. వ్యవసాయ పరిశోధనా కేంద్రాలున్నాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయాలున్నాయి. కష్టపడే శాస్త్రజ్ఞులు వున్నారు. రైతులకు కావలసిన విత్తనాలను వీరు రూపొందించి ఇవ్వగలరు. ఇదే స్వావలంబన.

సామ్రాజ్యవాదుల ఆదేశాల మేరకు రసాయనిక ఎరువులు వాడండి అంటూ ప్రోత్సహించారు. ఇప్పుడు మీరు ఎక్కువ వాడుతున్నారు తగ్గించండి అంటున్నారు. ఎరువుల ధరలు పెంచితే రైతులు జాగ్రత్తపడి కావాల్సినంతే వాడుతారంటున్నారు. కేవలం రసాయనిక ఎరువులు వాడితేనే సరిపోదని ఏనాడో తెలుసు. పచ్చి ఎరువులు, పశువుల ఎరువులు, సేంద్రీయ ఎరువులు, కంపోస్టు వర్మి తయారీ, వాడకం వుండాలి. ప్రభుత్వం వీటికి తగిన సూచనలూ, సలహాలూయిస్తూ ఆర్థిక సహాయ మందించాలి. ప్రభుత్వం ప్రతిదానికి చైనాతో పోల్చడం చేస్తున్నారు. చైనాలో వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. దీనికి కారణం సాంప్రదాయ విజ్ఞానాన్ని, ఆధునిక పరిశోధనా విజ్ఞానాన్ని మేళవించి వ్యవసాయం చేస్తున్నారు. కనుక మన ప్రత్యామ్నాయ విధానంలో రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. అలాగే రసాయనిక పురుగుమందుల వాడకం తగ్గించాల్సిన అవసరముంది. సస్యరక్షణ చర్యలు అంటారు. దీనిపై ఇంకా ఎక్కువగా పరిశోధనలు జరగవలసిన అవసరముంది. బహుళజాతి పురుగుమందుల కంపెనీలు దీనిపై పరిశోధన జరగకుండా అడ్డుకుంటున్నాయని తెలుస్తున్నది.

ఈనాటికీ దేశంలో 80 శాతం సన్న చిన్న కారు రైతులే. వీరు వ్యవసాయం కొనసాగించటానికి అనుకూలంగా పరిస్థితులులేవు. వీరిని కాపాడేందుకు సహకార సేద్యం పద్ధతుల అవసరమెంతైనా వుంది. కానీ ప్రభుత్వం ఏం చెబుతుంది? వీరికి వనరులు లేవు; వున్న వనరులను సరిగ్గా వినియోగించు కోలేరు. ఎగుమతి చెయ్యగల పంటలు పండించలేరు. కనుక వీరికి సేద్యం లాభసాటిగా లేదు. కాబట్టి వీరు సేద్యం మానుకుని కంపెనీలకి తమ భూములివ్వాలి అని చెబుతున్నది. మీ భూములు అమ్ముకోండి లేదా కౌలు కివ్వండి అంటున్నారు. రైతుకున్న కొద్దిపాటి భూమిని కూడా కంపెనీకిస్తే ఎక్కడికిపోయి బ్రతకాలి. భూమి ఉంటే అప్పోసప్పో పుట్టి కాలం

వెల్లమారుతున్నది. కనుక ఇది ఎన్నో నష్టాలను తెస్తుంది.

ఈ మధ్య అజిత్‌సింగ్ హైద్రాబాదు వచ్చి కాంట్రాక్టు సేద్యం అన్నాడు. దీనిని దేశమంతటా పెట్టడానికి చట్టం చేస్తామన్నాడు. ఇది చూడటానికి బాగానే వుంటుంది. విత్తనాలు, ఎరువులు, మందులు అన్నీవాళ్ళే యిస్తారు. పంటను వాళ్లే కొంటారు. కానీ వాళ్లిచ్చే దానికి రేటు ఎవరు నిర్ణయిస్తారు? రైతు నుండి కొనేటప్పుడు రేటు ఎవరు నిర్ణయిస్తారు? వాళ్ల సరుకులు అమ్ముకోటానికి కాంట్రాక్టు సేద్యం పనికొస్తుంది.

ఇది కొత్తా కాదు. మనకు భయమూ కాదు. పంజాబులో పెప్సి కంపెనీ టమాటాలు పండిస్తే కేజీకి రెండు రూపాయలిస్తామంది. రైతులు బాగా పండించారు. తీరా కంపెనీకి తీసుకెళ్లితే 50 పైసలిస్తానన్నాడు. అదేమిటంటే సరైన ఆకారం లేదు. రంగులేదు. నాణ్యతలేదు అని వంకలు పెట్టాడు. బయట అమ్ముదామంటే రూపాయి కూడా రాదు. ఇక బేరాసారలే మాడతాం? ఈ పెద్ద కంపెనీలను ప్రశ్నించగలమా? అలాగే మన దగ్గర జహీరాబాద్‌లో బిఎస్‌టి కంపెనీ బుడ్డ దోస కాయలు పండించమంది. ఎగుమతి చేస్తాం. కేజీకి 30 రూ॥ లిస్తామంది. తీరా పండిస్తే ఎగుమతి ఆర్డర్లులేవు కొనను పొమ్మంది. రైతులు పంటకోయకుండా అలాగే వదలివేశారు. మా అనంతపురం జిల్లాలో ఒక కంపెనీ బంతిపూలు వెయ్యండి, వాటి నుండి రంగు తీస్తామన్నాడు. క్వింటాలుకు 3 వేలిస్తామన్నాడు. రైతులు వేశారు. ఏమైందో! వాడు కంపెనీ బోర్డు త్రిప్పి మాయ మయ్యాడు. రైతులు నష్టపోయారు. ఇలాంటి సేద్యం వల్ల మనరైతాంగం బాగుపడుతుందా? కార్పొరేటు సేద్యం మాకొద్దు; కాంట్రాక్టు సేద్యం మాకొద్దు; రైతాంగ సేద్యం మాకు కావాలి.

రైతులకు విత్తనాలు, ఎరువులు, కావాలంటే సహకార పద్ధతి అనుసరించాలి. రైతులు తమకు కావల్సినవి వీటి ద్వారా కొనాలి. తమ ఉత్పత్తిని వీటిద్వారా అమ్ముకోవాలి. జర్మనీ, డెన్మార్క్ వంటి అన్ని దేశాల్లోనూ ఇవి పని చేస్తున్నాయి. మనదేశంలోనూ కొన్ని చోట్ల చక్కగా పనిచేస్తున్నాయి. మహారాష్ట్రంలో చక్కెర కర్మా గారాలూ, గుజరాత్‌లో పాలసహకార సంఘాలు బాగా పని చేస్తున్నాయి. ఇక్కడ కో-ఆపరేటివ్ సొసైటీలన్నీ విఫలమయ్యాయంటున్నారు. మిగిలిన చోట్ల విజయవంతమైనప్పుడు పునమొందుకు చెయ్యలేం? మన ప్రత్యామ్నాయ విధానంలో సహకారం పాత్ర ఎక్కువగా వుండాలని నా అభిప్రాయం.

ముఖ్యమైన అంశం, ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే భూసంస్కరణలు అమలు జరగాలి. అడపాదడపా, అరొకొరో పంచటం కాదు. భూస్వామ్య లేదా అర్ధ భూస్వామ్య వ్యవస్థ ఏదైతే వుందో అది నాశనమయ్యే విధంగా భూములు పంచాలి. మనదేశంలో నకిలీ భూసంస్కరణలు తెచ్చారు. ఈనాడు కౌలుదార్ల సమస్య తీవ్రంగా వుంది. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలో 40 లేదా 50 శాతం సేద్యం కౌలుదార్లే చేస్తున్నారు. ప్రభుత్వం 1 కోటి 20 లక్షల భూమి ఉందంటున్నది. ఒక కుటుంబానికి రెండు ఎకరాలు పంచితే 60 లక్షల కుటుంబాలు బాగుపడతాయి. అలా పంచకుండా ఒకే కంపెనీకి 50 వేల ఎకరాలు కట్టబెట్టడం ఈ ప్రభుత్వ విధానంగా వుంది. పేదల బ్రతుకులు బాగుపడాలంటే నిజమైన భూసంస్కరణలు అమలు కావాలి. దున్నేవానికే భూమి కోసం మనమంతా పోరాడాల్సిన అవసర ముంది. మన ప్రత్యామ్నాయ విధానంలో ఇది ముఖ్యమైన భాగంగా ఉండాలని మనవి చేస్తున్నాను.

నేడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం ఎలాంటి ప్రాధాన్యతా యివ్వటంలేదు. మనమే దన్నా మదుపు పెడితే కదా ఫలందక్కేది? కానీ వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోతూ వస్తున్నాయి. వ్యవసాయానికవసరమైన సాగునీటిపైనా, విద్యుత్తుపైనా, ఉత్పాదకాల పైనా మార్కెట్టు సౌకర్యాలపైనా ప్రభుత్వ పెట్టుబడులు పెట్టడం తగ్గిపోయింది. 1979-80లో వ్యవసాయంలో మూలధనం 19.1 శాతముంటే 1998-99 కి 5.5 శాతానికి తగ్గింది. మీరు కేంద్ర బడ్జెట్‌ను చూస్తే 5 శాతం మించి వ్యవసాయానికి కేటాయింపులులేవు. మొదటి ప్రణాళికలో 18 శాతం కేటాయిస్తే యిప్పుడు ఐదుశాతానికి పడిపోయింది. ఒక ఎకరానికి మన ప్రభుత్వం పెడుతున్న ఖర్చు 5 రూ॥లు. ఇంత తక్కువగా పెట్టుబడిపెడితే వ్యవసాయ రంగమెలా అభివృద్ధి అవుతుంది. 80 శాతం జనాభాకు జీవనాధారం కల్పించే, జనానికి అన్నం పెట్టే వ్యవసాయ రంగానికి మన ప్రత్యామ్నాయ విధానంలో పెట్టుబడులు పెంచాలి.

అంతేకాదు, వ్యవసాయరంగానికి సబ్సిడీల అవసరమెంతో వుంది. ఎవరికైనా, దేనికైనా కొరతవుంటే దాన్ని పూరించటాన్ని సబ్సిడీ లేదా రాయితీ అంటారు. ఈరాయితీలను అన్ని దేశాలలోనూ, అన్నిరంగాలకూ యిస్తున్నారు. వ్యవసాయం, వరిశ్రమలు, విద్య, వైద్యం, గృహవసతి అన్నింటికీ యిస్తున్నారు. మనదేశంలోనూ ఇస్తున్నారు. వ్యవసాయరంగానికి సబ్సిడీలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదన్నది చారిత్రక అనుభవం. అయితే వ్యవసాయానికిచ్చే రాయితీ మోయలేని భారమయిందని ప్రభుత్వమంటున్నది. సాగునీరు, కరెంటు, ఇతర ఉత్పాదకాలు అన్నింటికీ రాయితీలను తగ్గించి వేశారు. ఇంకా తగ్గించి వెయ్యాలని కోరిక. పెండింగు ప్రాజెక్టులు కట్టి సాగు నీరందించకుండా ఇంకుడు గుంట లంటాడు ముఖ్యమంత్రి. రైతులు తిప్పలు పడి బావులు, బోర్లు తవ్వుకుంటే కరెంటు, డీజలు సరఫరా బదులుగా వీటికి సబ్సిడీలిచ్చినందునే భూగర్భజలాలు అంతరి స్తున్నాయి గనుక అసలు సబ్సిడీ లివ్వలేమని ప్రధానమంత్రి అంటాడు. ఇదెంత మూర్ఖత్వమో ఆలోచించండి. సబ్సిడీలు తగ్గి వ్యవసాయ రంగం కుంటుపడుతున్నది.

మరి శర్మగారు గ్రామీణ రుణభారం గురించి ఇంతకు ముందే చెప్పారు. కనుక వివరాలలోకి వెళ్లను. వ్యవసాయం అభివృద్ధి కావాలంటే రైతాంగానికి రుణసదుపాయం ఉండాలి. భూమి చదును చేయటానికీ, మెరుగు పరచటానికీ బావులు, బోర్లు త్రవ్వటానికీ, మోటార్లు కొనడానికో, ఉత్పాదకాలు కొనడానికో అప్పుకావాలి. ఫ్రెంచిసామెత ఉంది. ఉరి వేసుకొనే వాడికి ఉరితాడు ఎంత అవసరమో రైతుకు అప్పు అంత అవసరమని. మరి ఈ రుణ సదుపాయం ప్రభుత్వం కల్పిస్తున్నదా? అన్ని రకాల సంస్థలు కలిసి రైతుల అవసరాల్లో నాలుగో వంతు మాత్రమే యిస్తున్నాయి. ఇదైనా చిన్న రైతుల కందుతున్నదా అంటే అదీలేదు. దీనిలో 75 శాతం ధనిక రైతులకే ఇస్తున్నారు. నేనే వరి పంటవేస్తాను. బోరు తవ్వుకుంటాను అంటే అప్పు పుట్టదు. పండ్లతోటలు వేస్తాను. రొయ్యలు పెంచుతాను, ట్రాక్టరు కొంటానంటే అప్పులు ఇంటికి పరుగెత్తుకొస్తాయి. కనుక రైతాంగానికి రుణసదుపాయం కావాలి. వారికి క్రాప్ తీసుకోవాలి. వ్యసాయభివృద్ధికి మదువులు కావాలి.

ఇవ్వాళ బహుళజాతి కంపెనీలు వ్యవసాయ రంగంలోకి బాగా ప్రవేశించాయి. ప్రభుత్వాన్ని తప్పిస్తున్నాయి. దాని చేతుల్లో ఏం లేకుండా చేస్తున్నాయి. బహుళజాతి కంపెనీలు ఎరువులు, పురుగుమందులు వీటన్నింటినీ ఎక్కువ రేట్లకు అమ్మి రైతులను పిండుకుంటున్నాయి. దేశంలోని ప్రైవేటు కంపెనీలు కల్తీ ఎరువులు, కల్తీ పురుగుమందులు, నాసిరకం విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తున్నాయి. దీనివల్ల వరంగల్, ఖమ్మం, గుంటూరు జిల్లాల్లో ప్రత్తి రైతులు విపరీతంగా నష్టపోయారు. ప్రభుత్వం చూస్తూ వూరుకుంది. నష్టపరిహారం కూడా యిప్పించలేకపోయింది.

మనకు అన్ని రకాల చట్టాలున్నాయి. విత్తన చట్టముంది. ఎరువుల, పురుగుమందుల చట్టాలున్నాయి. రుణవిమోచన చట్టముంది. ఇంకా ఎన్ని చట్టాలన్ని చేస్తారు. అయినా ఒక్క చట్టాన్ని కూడా అమలుజరిపే యంత్రాంగ ముండదు. అమలుజరపరని మనవిచేస్తున్నాను. కనుక మన ప్రత్యామ్నాయ విధానంలో ఈ చట్టాలను మరింత పటిష్టం చేయటం, పకడ్బందీగా అమలుపరచటం తప్పకుండా వుండాలని కోరుతున్నాను.

ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే నూతన విజ్ఞానఆవిష్కరణా, నూతన వ్యవసాయ పద్ధతుల అన్వయం చాలా అవసరం. కనుక ఈ రంగంలో శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహించవలసిన అవసర ముంది. ఇప్పటికి లేవని కాదు ఉన్నాయి. అయితే ఇవి ఎవరికి ఉపయోగ పడుతున్నాయి? ఇవి ధనిక రైతులు పండించే పండ్లు, పూలతోటలు, వరి వంటి వాటిలోనే ఎక్కువగా సాగుతున్నాయి. పేద రైతాంగం ఆధారపడే సజ్జ, జొన్న, రాగులు మొదలగు వాటిపై పరిశోధనలు జరగలేదు. కనుక వీటిలో ఉత్పాదకత చాలా తక్కువగా ఉంది.

పరిశోధనలు జరిగినా వాటిని రైతాంగానికి అందుబాటులోకి తీసుకుపోవాలి. దీనికి వ్యవ సాయశాఖ వుంది. అయితే దాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. 4 వేల వ్యవసాయాధికారుల పథకాలను సగానికి తగ్గించి వేసింది. కొన్ని పదవుల ఎక్స్‌టెన్షన్, ఆఫీసర్ల పదవులను రద్దు చేసింది. ఇక పరిశోధనల ఫలితాలు రైతుల కెలా చేరతాయి? పైగా యూజరు ఛార్జీలు చెల్లిస్తేనే వ్యవసాయశాఖ సేవలందుతాయంటున్నది. అంటే వ్యవసాయశాఖ నుండి ఏ సలహా కావాల్సినా ఛార్జీలు చెల్లించాలి. ఇప్పటిదాకా ఇది ఉచితం, అధికారుల డ్యూటీలో భాగం. ఇప్పటికే రైతులు దివాళా తీస్తున్నారు. ఇంకా ఈయూజర్ ఛార్జీలను చెల్లించగలరా? కనుకనే మన ప్రత్యామ్నాయ విధానంలో పరిశోధనా విజ్ఞానం పేద రైతాంగానికి ఉపయోగపడాలి. దాని కోసం వ్యవసాయ శాఖను పటిష్టం చేయాలి. యూజర్ ఛార్జీలు ఉండరాదన్న అంశాలు ఉండాలని మనవి చేస్తున్నారు.

ఈనాడు రైతాంగానికి తీవ్ర ఆందోళన కలిగి స్తున్న అంశం గిట్టుబాటు ధరలు. వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర వస్తేనే రైతులు నూతన పద్ధతులు అవలంభించగలరు. ప్రభుత్వం కనీస మద్దతు ధరను నిర్ణయిస్తున్నది, గత రెండేళ్ళ ఉత్పత్తి ఖర్చులను లెక్కించి వచ్చే ఏటికి ధర నిర్ణయిస్తున్నది. దేశమంతటికీ ఒకే ధర నిర్ణయిం చటం కూడా సరికాదు. మనది సువిశాల దేశం. రకరకాల నేలలూ, సాగు పద్ధతులూ వున్నాయి. విభిన్న వాతావరణం ఉంది. కనుక ఖర్చులో తేడా వుంటుంది. పంజాబులో 90 శాతం భూమికి సాగునీరుంది. కరెంటు ఉచితం. క్వింటాలు వరి ధాన్యం పండించటానికి 350 రూ॥ అవుతుంది. ఇక్కడ మనకి 500 రూ॥లు అవుతుంది. ఇద్దరికీ కలిపి ఒకే రెంటల్. ఆంధ్రరైతులు నష్టపోతారు. కనీస మద్దతు ధర నిర్ణయంలో అశాస్త్రీయ పద్ధతు లున్నాయి. పైగా పారిశ్రామికవేత్తలు ధరల నిర్ణయంలో ప్రధానపాత్ర కలిగివున్నారు. చక్కెర ఫ్యాక్టరీలు, జౌళి మిల్లులు, జూటు మిల్లులు ఎవరైనా సరే రైతుకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారు.

అయితే ఫుడ్ కార్పోరేషన్, టుబాకోబోర్డు అని ప్రభుత్వ సంస్థలున్నాయి. ఇవి రైతాంగం నుండి కొనుగోలు చేయాలి. ఏదోవంకతో అలా కొన కుండా తప్పుకుంటున్నాయి. దాంతో రైతులకు కనీసమద్దతు ధర కూడా రావటం లేదు. ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుంది. ఫుడ్ కార్పోరేషన్ ద్వారా ఆహారధాన్యాల సేకరణను ఆపివేయడం వల్ల చౌకధరల దుకాణాలు మూత పడి నష్టపోతున్నారు. అలాగే పేద ప్రజలు కూడా చౌకధరల దుకాణాలు మూతపడి నష్టపోతారు. అత్యవసర సరుకుల చట్టాన్ని రద్దు చేస్తున్నారు. దీనితో ఈ సరుకుల మార్కెట్టులోకి ఎవరైనా రావచ్చు. బహుళజాతి కంపెనీలు వచ్చాయి. ప్రాసెసింగ్ పరిశ్రమలు మొదలుపెట్టాయి. పంజాబునే తీసుకుంటే ఈ కంపెనీలు గోధుమ లను కొని పిండి తయారుచేసి పాకెట్లలో అమ్ము తున్నాయి. దీనితో 50 శాతం పిండి మిల్లులు మూతవడ్డాయి. ప్రపంచ ఆహారధాన్యాల వ్యాపారంలో 80శాతం ఐదారు కంపెనీల చేతుల్లోనే వుంది. అంటే ఒక్క కార్గిల్ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లో పండే వరినంతా కొని ఏడాది స్టాకు పెట్టినా ఆర్థికంగా యిబ్బంది పడదు. కనుక ఈ కంపెనీల చేతుల్లోకి మన ఆహార ధాన్యాల వ్యాపారం పోయే ప్రమాదముంది. అప్పుడు వారు రైతులకు రేటు ఇవ్వరు. బియ్యం ధర పెంచి ప్రజలను దోచుకుంటారు. మూడవది ఆహారధాన్యాలతో ఫ్యూచర్ ట్రేడింగ్‌ను అనుమతి స్తామని, పంటరాకుండానే ఈ రేటుకుకొంటానని రైతుతో ఒప్పందం చేసుకుంటారు. ఇది గతంలో వుండేది. ఉపయోగం లేదని రద్దుచేశారు. తీరా కంపెనీలు కొనకపోతే ఏం చేయాలి? ఇది వ్యాపారుల మధ్య లావాదేవీలకు ఉపయోగ పడుతుంది. తప్ప రైతులకు కాదు.

ఈనాడు వ్యవసాయరంగం సంక్షోభంలో వుండటానికి ప్రధాన కారణాలు రెండు. ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు చెప్పిన ఆర్థిక సంస్కరణ ల అమలులో భాగంగా భారతపాలకులు అను సరిస్తున్న రైతాంగ వ్యతిరేకవిధానాలు. వీటిని లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలలో అమలు జరిపారు. ఎక్కడా విజయ వంతంకాలేదు. ఆఫ్రికాలోని అనేక దేశాలు తమ ఆహారాన్ని తామే పండించుకొనేవి. వారికి చెప్పేదేమిటి? మీకు ఖనిజ వనరులున్నాయి. వీటికి తోడు ఏదో ఒక వాణిజ్యపంటను ప్లాంటేషను స్థాయిలో పెంచండి. మీకు డాలర్లు వస్తాయి. కావలసినవన్నీ కొనుక్కోండి అని, అలాగే చేశారు. కొన్నాళ్ళు బాగానే ఉంది. ఎన్నాళ్ళు? వారి పంటలు నాశన మయ్యే దాకా. తర్వాత వీరి పంటలకు ధరలు తగ్గించారు. దానితో ఆదాయం తగ్గింది. దేశాలు కరువులో పడ్డాయి. ప్రజలు ఆకలి చావులకు గురయ్యారు. కనుక ఈ ఆర్థిక సంస్కరణలు రైతాంగానికి మంచి కలిగించవని చెబుతున్నాను.

ఇక రెండవ కారణం సామ్రాజ్యవాద దేశాలకు తమ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్టు కావాలి. ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా మనదేశంలో అమ్ముకోవటానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా

← (తరువాయి 6వ పేజీలో)

వ్యవసాయరంగ సంక్షోభ పరిష్కారానికి విప్లవ భూసంస్కరణల అమలు కీలకం

- పి. జస్వంతరావు, ఎడిటర్, జనశక్తి



అధ్యక్షా, మిత్రులారా !

వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త కె.ఆర్.చౌదరి గారు వ్యవసాయరంగ సంక్షోభం గురించి తన ఉపన్యాసాన్ని గుజరాత్ హింసాకాండతో ప్రారంభించవలసి రావటమే, ఆయన చెప్పినట్లుగా సర్వవ్యాపిత సంక్షోభాన్ని తెలుపుతున్నది. ఈ సంక్షోభంతో ప్రజలు మేల్కొంటారనీ, తమ విధానాలను ప్రతి ఘటిస్తారనీ పాలకులకు బాగా తెలుసు. అలాంటి ప్రతిఘటనను బలహీన పరచాలనే లక్ష్యంతోనే పాలకులు మతోన్మాదాన్ని ఒక సాధనంగా చేసుకున్నారు. ప్రజలు పోరాట పంథా చేపట్టకుండా వారి చైతన్యాన్ని మొద్దు బార్చటానికీ, కుల ద్వేషాలూ, మత విద్వేషాలు ప్రాంతీయ దురభిమానాలను రగుల్కొపటమన్న విధానాన్ని గత అర్ధశతాబ్దంగా పాలకులు అనుసరిస్తున్నారు. దేశంలో బడాబూర్జువా, భూస్వామ్య వర్గాలనూ, సామ్రాజ్యవాదులనూ, వారి ప్రయోజనాలనూ రక్షించేందుకే మతోన్మాదాన్ని ఉచ్ఛ స్థాయికి కొనిపోయి, జాతీయోన్మాదంతో కలిపి, నెలరోజులుగా గుజరాత్‌ను రక్తసిక్తం చేస్తున్నారు.

విదేశీ పెట్టుబడులతో పరిశ్రమలను స్థాపించి అన్నిరంగాలలో అభివృద్ధి సాధించేందుకు ఆర్థిక సంస్కరణలని పాలకులు చెప్పుకుంటున్నారు. గత పదేళ్ళలో అత్యధికంగా విదేశీ పెట్టుబడులను పొంది అగ్రస్థానంలో వున్న రాష్ట్రం గుజరాత్. మరి యిక్కడే ఇంతకల్లోలం ఎందుకు జరిగింది? పెట్టుబడులొచ్చాయి. పరిశ్రమలొచ్చాయి. అయితే పాత పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. కొన్ని లక్షల మంది కార్మికులు నిరుద్యోగులయ్యారు. రాష్ట్రంలో కార్మికుల సంఖ్య తగ్గింది. అంటే శ్రమదోపిడీ పెరిగింది. ఇక్కడ ఉద్యోగాలు లేక యువకులు విదేశాలకు వలసపోతున్నారు. ఈ సంక్షోభం నుండి దృష్టి మరల్చడానికి వారెంచుకున్న మార్గం మత కల్లోలాలు. నూతన ఆర్థిక విధానాలతో పాటే దేశంలో హిందూ మతోన్మాదం పెచ్చరిల్లటం యాదృచ్ఛికంగా జరగలేదు.

రాజీవ్‌గాంధీ బాబ్రీ మసీదులో శిలాన్యాస్ పూజలకు అనుమతించి దేశమంతా టి.వి లో చూపించాడు. నూతనఆర్థికవిధానాలను అమలు చేసిన పి.వి. నరసింహారావు, అద్వానీ రథయాత్రను సాగనిచ్చి దేశమంతా హిందూ మతోన్మాద శక్తులు వేళ్ళూనుకునేందుకు సహాయపడ్డాడు. ఆ తర్వాత బాబ్రీ మసీదు కూల్చివేతకు తోడ్పడ్డాడు. ఈ హిందు మతో న్మాదాన్ని ఆసరా చేసుకొని బి.జె.పి అధికారం లోకి వచ్చింది. మొదట గుజరాత్‌లో గిరిజనులపై దాడి చేసింది. క్రిస్టియన్ మతం వ్యాప్తి చేస్తున్నారంటూ దళితులపై దాడి చేసింది. చివరకి ముస్లింలపై దాడి చేసింది. దీని లక్ష్యం ఒక్కటే. సంక్షోభానికి అసలు కారణాలు తెలుసుకొని ప్రజలు పోరాడకుండా వారిని చీల్చేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొట్టారు. గోధ్రా అమరుల అస్థికల నిమజ్జనమంటూ మిగిలిన రాష్ట్రాలకు కూడా విస్తరించ చూస్తున్నారు.

వ్యవసాయరంగ సంక్షోభమంటే రైతాంగ సంక్షోభమే. కనుకనే బి.డి శర్మ గారు రైతాంగాన్ని ఎలా దోపిడీ చేసి, వారిని అప్పుల్లో ముంచారో వివరించారు. కె.ఆర్ చౌదరి గారు ఈ సంక్షోభానికి కారణాలను వివరంగా చర్చించారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానమెలా వుండాలో కూడా వివరించారు. ఇది అమలు కావాలంటే కీలకమైన అంశం గురించి మాట్లాడుకుందాం.

భూమి కమతం సైజు తగ్గితే ఎక్కువ మానవ శ్రమను యిముడ్చుకుని, ఎక్కువ దిగుబడినిస్తుందనీ, దున్నేవాడికి భూమి కీలకాంశమనీ బి.డి శర్మ గారు చెప్పారు. నేటికీ 70 శాతం మంది భూమి జీవనాధారంగా వున్న స్థితిలో, వారి కొనుగోలు శక్తి పెరిగి, వారి జీవితం మెరుగుపడాలన్నా, దేశం అభివృద్ధి సాధించాలన్నా ఏ భూమిపై వారు శ్రమిస్తున్నారో ఆ భూమిపై వారికి హక్కుకల్పించాలి. వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి బయటపడవేయటానికి ఇదే కీలకాంశం. ఎందుకంటే సమగ్ర నీటి పారుదలా పథకాలు అమలుజరగకుండా దోపిడీ వర్గాలు అడ్డుపడుతున్నాయి. విశాల భూఖండాలకు నీరు లేకుండా చేసి గ్రామీణ పేదలను పట్టణాలకు వలసలు పంపితే తప్ప వీరి పరిశ్రమలలో కారుచౌకకు కార్మికశ్రమ లభ్యం కాదు. అందుకనే దశాబ్దాల పాటు నీటిపారుదలా ప్రాజెక్టులు పూర్తికానివ్వరు. గత పదేళ్ళలో వేలకోట్ల రూపాయలు రుణాలు తెచ్చారు. ఒక్క పైసా నీటిపారుదల ప్రాజెక్టులకు కేటాయించలేదు. గనుక ఇది ఉద్దేశ్యపూరితంగా అనుసరిస్తున్న విధానమే.

పైరుపచ్చ విప్లవమనండి, మరోపేరు పెట్టండి. గత 50 ఏళ్ళుగా పాలకులు చేపట్టిన వ్యవసాయ రంగ చర్యలన్నీ రైతాంగాన్ని నాశనం చేసేవిగా ఉన్నాయి. భూస్వామ్య వర్గాలను బలపరిచేవిగా వున్నాయి కాగా గత పదేళ్ళుగా అనుసరిస్తున్న విధానాలు రైతాంగాన్ని భూమి నుండి తరిమివేసి సామ్రాజ్యవాదులపరం చేసేవిగా వున్నాయి.


కె.ఆర్ చౌదరిగారు సహకార వద్దతి అమలుకావాలన్నారు. సూత్ర రీత్యా అంగీకారయోగ్యమే కాక ఆచరణ రీత్యా అనుసరణీయం కూడా. నేడు సహకార వ్యవస్థ విఫలమవటానికి కారణం వీటి నడ్డి పెట్టుకొని లబ్ధిపొందిన భూస్వాములే. వారికి వత్తాసు పలికిన పాలకులే. దీనికి కారణం భూమిలో ప్రైవేటు ఆస్థిహక్కునూ, బి.డి శర్మగారి మాటల్లో భూమి తల్లిని మార్కెట్టులో అమ్మకానికి పెట్టడమే. కనుకనే భూమి కేంద్రీకరణను తగ్గించివేసే విప్లవ భూసంస్కరణలు అమలుకాకుండా సహకార వ్యవస్థ రైతాంగానికి అనుకూలంగా నిర్మించ లేము. భూమి కొరకు పోరాటం భూస్వాములకు వ్యతిరేకంగాను, బడా బూర్జువాలకూ, సామ్రాజ్య వాదులకూ వ్యతిరేకంగా సాగవలసిన అవసరం నేడు మరింత గా ముందుకొచ్చింది.

పాలకులు సృష్టిస్తున్న కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను అధిగమించి ప్రజలు ఐక్యతను సాధించి సంఘటిత పోరాటాలు నిర్వహించాలన్నా కూడా మౌలిక సమస్యలపై పోరాటాలు నిర్మించటమే మనం చేయాల్సి వుంటుంది.

← (మిగత 6వ పేజీలో)

రైతాంగానికి పోరాటమే శరణ్యం

- శంభుమహతో, జార్ఖండ్ క్రాంతిదళ్



కామ్రేడ్స్, సుదూర గ్రామాల నుండి వచ్చిన ప్రజలకూ, మేధావులకూ, కార్మిక, ఉద్యోగ వర్గాలకూ జార్ఖండ్ క్రాంతిదళ్ తరపున విప్లవాభినందనలు.

దేశమంతటా వ్యవసాయరంగాన్ని సంక్షోభం కమ్మివేస్తున్న సమయంలో మనం మాట్లాడుకుంటున్నాము. 693మంది రైతులు, ఒక్క జిల్లాలోనే 140మంది రైతులు ఆత్మహత్యల పాలబడ్డదుస్థితి ఆంధ్రప్రదేశ్‌లో వుంది. మహారాష్ట్ర, పంజాబ్, హిమాచలప్రదేశ్‌ల్లో కూడా రైతులు దుస్థితిలోనే వున్నారు. దీనితో పాటు కార్మికులను పనినుండి తొలగిస్తున్నారు. మరోదారిలేక నిరుద్యోగ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న స్థితి వుంది. అయినా వీటికి కారణాలనూ, నివారణోపాయాలనూ చర్చించేందుకు పార్లమెంటుగానీ, అసెంబ్లీలు గానీ పూనుకోవటం లేదు. కల్తీ విరుగుమందులు, ఎరువులు, నాసివిత్తనాలు, అన్నింటికీ పెరిగిన రేట్లు, పంటకు సరైన ధరలేకపోవటం వల్ల రుణభారం పెరగటంవల్ల రైతుల ఆత్మహత్యలు సాగుతున్నాయి. కాగా చంద్రబాబు నాయుడు నష్టపరిహారం కోసం ఆత్మహత్య చేసుకుంటున్నారనటం సిగ్గుచేటైన విషయం.

పిఎల్ 480 పథకం నాటి నుండి డంకెల్ ఒప్పందం వరకూ వ్యవసాయరంగంపై పట్టు సాధించేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు చేసిన, చేస్తున్న ప్రయత్నాల ఫలితమే ఈ ఆత్మహత్యలు. గతంలో జమీందారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడిన అనుభవాలు రైతాంగానికున్నాయి. ప్రస్తుతం కార్మికులు, రైతాంగం కలసి సామ్రాజ్యవాదంపైన కూడా పోరాడాల్సిన అవసరముంది. అయితే ఈ పోరాటాలను దెబ్బతీసేందుకు మతం, జాతి, కులం అంటూ చీలికలు పెడుతున్నారు. కనుక ప్రజల ఐక్యతను కాపాడవలసి వుంది. వామపక్షాలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక సంస్థలు కలిసి ఐక్య వేదికను ఏర్పాటు చేసుకొని పోరాడాల్సిన అవసరముంది.

నేను జార్ఖండ్ నుండి వచ్చాను. ఈ రాష్ట్రం సంపద్వంతమైనది. ఖనిజ వనరులున్నాయి; అటవీ సంపద వుంది; భూమి వుంది; శ్రమించే ప్రజలున్నారు. అయినా పేదరికంలోనే మ్రగ్గాం. అందుకే మా సంపదలు మాకే చెందాలంటూ ప్రత్యేకరాష్ట్రం కోసం పోరాడాం. కానీ సంపదంతా అక్కడి పేదప్రజలకు చెందకుండాపోతున్నది. దీనికి వ్యతిరేకంగా మేము పోరాడుతున్నాం.

అక్కడ వెచ్చిస్తున్న నిధులు అధికారగణానికీ, రాజకీయ నాయకులకూ లాభం చేకూరుస్తున్నది. పేద ప్రజలకోసం ఖర్చు పెడుతున్నదేమీ లేదు. సాగు నీటి కోసం కుటీర పరిశ్రమలకోసం గానీ ఖర్చుపెట్టడంలేదు. ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్యసంస్థల ఆదేశాలతో బహుళజాతి కంపెనీలు అక్కడి సంపదనంతా దోచుకుపోయేందుకు వీలుగా వ్యవహరిస్తున్నారు. ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించుకొనేందుకు కూడా వారికి అవకాశం లేకుండా చేస్తున్నారు. జార్ఖండ్‌లో దోపిడీకి గురవుతున్న వారందరూ కూడా ఐక్యంగా ఈ రోజు పోరాడు తున్నారు. బీహారు కంటే కూడా కొంత ముందున్నారు.

ఈ రోజు జార్ఖండ్ ప్రభుత్వం వ్యవసాయం గురించి ఆలోచించటం లేదు. ఆదివాసులను అడవి నుండి తరిమివేసి, బహుళజాతి కంపెనీలు పరిశ్రమలు పెట్టుకునేందుకూ, వీటిలో ఆదివాసులను కూలీలుగా మార్చేందుకూ ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నది.

బ్రిటీష్ వారిపై బీర్సాముండా పోరాటం ఫలితంగాఛోటా నాగపూర్ చట్టం, కొల్దారీ చట్టం వచ్చాయి. ఈ చట్టాలను ప్రక్కన పెట్టేశారు. ఆదివాసులను, ప్రజలను తొలగించి దోపిడీదారుల కోసం నాలుగులైన్ల రోడ్లు వేస్తున్నారు. గ్రామీణ ప్రజల అవసరాలు తీర్చే ఏ పథకమూ అమలుకావటం లేదు.

జార్ఖండ్‌లో జమీందారీ వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ వేళ్ళూనుకొనివుంది. వేలాది ఎకరాలు వీరి స్వాధీనంలో వున్నాయి. దీనికి వ్యతిరేకంగా అక్కడ పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. నూతన ఆర్థిక విధానాలను కూడా వ్యతిరేకిస్తున్నారు. ప్రజలెందుకిలా పోరాడుతున్నారో కూడా ఆలోచించకుండా అణచివేయటానికి పూనుకున్నది ప్రభుత్వం. వారు తీవ్రవాదులని ముద్రవేసి పోటా వంటి చట్టాలతో నిర్బంధం సాగిస్తున్నారు. పోటా చట్టంగా ఆర్డినెన్సుగా ఉన్నప్పుడే 200 మంది రైతులను దాని క్రింద అరెస్టు చేసింది.

జార్ఖండ్‌లోని పరిశ్రమలు మూతవడుతున్నాయి. వాటిని తిరిగి తెరిపించే ప్రయత్నం చేయటం లేదు. ప్రభుత్వ ఉద్యోగులను తొలగిస్తున్నది. కార్మికులకు పని చూపించే ఆలోచన కూడా చేయటం లేదు.

ఆదివాసులు, రైతాంగం, కార్మికులు, మధ్యతరగతులు భూస్వాములకూ, బడా బూర్జువాలకూ, సామ్రాజ్యవాదులకూ వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరాన్ని యిప్పు డిప్పుడే గుర్తిస్తున్నారు. 1947కు ముందు బ్రిటీషు వారికి బానిసలుగా వుండేవాళ్ళం. ఇప్పుడు సామ్రాజ్యవాదులందరికి బానిసలయ్యాం. కనుక విశాల భూమిక మీద విస్తృత వేదిక ఏర్పాటు చేసుకొని ఐక్యంగా పోరాడాలని ప్రజలు ఆలోచిస్తున్న స్థితి వుంది.

ఆదివాసులపై దోపిడీ, పీడనలు సాగిస్తున్న బ్రిటీష్‌వారిపై పోరాడిన వీరుడు బీర్సాముండా. ఆయన ఆనాడే మూడు నినాదాలు యిచ్చాడు. ఒక నినాదం: ఈ అడవి, భూమి మాది. ఇక్కడ

(తరువాయి 13వ పేజీలో)

ఇల్లా రామిరెడ్డి, కన్వీనరు
గిరిజన - గిరిజనేతర పేదల హక్కుల పరిరక్షణ కమిటీ



అధ్యక్షా, పెద్దలు, కామ్రేడ్స్!

తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి అలాగే ఒరిస్సాలో అనేక చోట్ల గిరిజనులు ఒకప్పుడు ప్రభుత్వం చేసిన చట్టాలను అమలు జరపమని, మా హక్కులు మాకు కావాలని అనేక పోరాటాలు చేస్తున్నారు. మన హక్కులు మనికివ్వకపోగా అక్రమకేసులు బనాయించి వేలాదిమందిని జైళ్ళలో కుక్కుతున్నారు. ఇక్కడికొచ్చిన మేధావులంతా ఏం చెప్పారు? నూటికి 80 మందిగా వున్న మీ పేదవాళ్ళందరూ ఐక్యమై పోరాటం చెయ్యక పోతే మీకున్న చట్టాలుగానీ, హక్కులుగానీ అమలుకావు. పోరాడాల్సిందేనన్నారు.

అనేక రాష్ట్రాలలో గిరిజనులున్నారు. వారి హక్కులకు విలువలేదు. కోర్టులుగానీ, పోలీసులు గానీ, అధికారులుగానీ, భూస్వాము లకే వత్తాసు పలుకుతున్నారు. పంట వేసుకు బ్రతకటానికి భూమికావాలని అడిగితే కాల్చిచంపిన ఘటనలున్నాయి. కనుక పోరాడందే మనకు బ్రతుకులేదు. భూమి లేదు. హక్కులు లేవు.

కాబట్టి మనమందరం మనలాంటి పేదవాళ్ళ కోసం ఇంకా అనేక చోట్లకు తిరిగి, పనిచేసి, ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తేనే మన బ్రతుకులు బాగుపడతాయి. **ఈ దేశంలో మనం కూడా గిరిజనులు కూడా మనుషులన్న సంగతి గుర్తించే స్థితికి వస్తాము. లేదంటే మనల్ని అడవిలో జంతువులుగా చూస్తారు. వేటాడుతారు.**

ఇప్పటికీ గిరిజనులకు అనేక సమస్యలున్నాయి. త్రాగునీరు, విద్య, వైద్యం అందుబాటులో లేవు. వీటికోసం కూడా ఐక్యంగా నిలదీసి పోరాడి సాధించుకోవాలి. కనుక మన మంతా ఐక్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. ★

కూలీరైతు

- రామకృష్ణ

జోడెద్దుల బండివి పూసేవా .... ఓ కూలీ రైతా
గట్టుపుట్ట మెట్టలు దాటేవా ॥
మేడివి పట్టి మెరకలు దున్నేవా ॥
పువ్వుల కొరడా చేతిని బట్టి ॥
వెలపల దావట చెళ్ చెళ్ అన్నావా ॥ ॥జో॥
గాడిద బరువు గెత్తం మోసేవా ॥
ఎమ్మపూస తీపి వీతమేసేవా॥
గుండెను తీపి గూవగ జేసేవా ॥
పాతాళంలో దాగిన గంగను ॥
పట్టుకుతెచ్చి పాలమున పోసేవా ॥
గోడకి బల్లి పట్టివట్లుగా ॥
పాలం గట్టువ వట్టే వున్నావా ॥ ॥జో॥
చుక్కలే వీకు చుట్టాలాయెనా ॥
మొక్కల తోటి మాటలాయె నీకు ॥
గాలి వీరూ గంజి బువ్వా నీకు ॥
ఎండ యినుక వేడి బువ్వా నీకా ॥

మొక్కను ఉడిసి చెట్టును కోసి ॥
పసిడివి వింపే పంటను తెచ్చేవా ॥
పంట యింటికి వచ్చిన వీలకి ॥
బొక్కడావికి బుగతలు వచ్చారా ॥
భూములు మావని భాగాలన్నారా ॥
తిండి గింజలనే కొల్లగొట్టివారా ॥
అరువు తెచ్చిన ఎరువు కొట్టుకి ॥
హామిలేక అల్లాడిపోయినావా ॥ ॥జో॥
వీ గింజలు బుగతల గాదెకు చేరాయా ॥
బుగతల గుంటలు మిసమిసలాడ ॥
వీదు పిల్లలు ఎండు పుల్లలాయె ॥
చేసిన కష్టం పాకిరి అయ్యిందా ॥
రెక్కల కష్టం వక్కల పాలాయె ॥
ఇంత జరిగినా మౌనం వీకెలా ॥
దున్నే వావిదే భూమని చెప్పి ॥
పంటవంత వీ యింటికి తోలు ॥ ॥జో॥

(12వ పేజీ తరువాయి)

జమీందార్లు వుండరాదని, దీనికి బదులుగా గ్రామరాజ్యాలు స్థాపిస్తామని, ఇక్కడ ఉన్న అధికారులు కలకత్తా, బొంబాయి, ఢిల్లీలోని అధికారులందరూ జమిందారులకూ అనుకూలంగా ఉన్నారు కనుక వారిపై పోరాడాలి. ఇక మూడో నినాదం సామంత (వలస) వాదం పోవాలని, ఆనాడు బీర్సాముండా ఇచ్చిన మూడు నినాదాలూ ఈనాటికీ సరైనవేనని ప్రజలు గ్రహిస్తున్నారు. కనుక సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, భూస్వాములకు వ్యతిరేకంగా, ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా పోరాడాలని గ్రహించారు. దీనికొక వేదిక ఏర్పాటు చేసుకొని సమాయత్తమౌతున్న దశలో మేమున్నాం. దీనికి సంబంధించి మేము గ్రామసమస్య లన్నింటినీ గ్రామసభలే పరిష్కరించాలని నినాదమిస్తున్నాం. బయటి అధికారులకు గానీ, పోలీసులకు గానీ ఎలాంటి సంబంధం లేదు. పోలీసుస్టేషన్‌కు వెళ్ళేదిలేదు. ప్రజల మధ్య గ్రామసభలలో పరిష్కారం చేసుకుంటాం.

బ్రిటీష్‌వాడికి వ్యతిరేకంగా పోరాడి అధికార మార్పిడి తెచ్చుకున్నాం. ఇవ్వాళ టాటాలకూ, బిర్లాలకూ వ్యతిరేకంగా అందరు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంది. ఈనాటి సంక్షోభాలన్నింటికీ వీళ్ళే కారణం.

ఈ రోజు దేశమంతటా రైతాంగం ముందు న్నది రెండేమార్గాలు. పోరాడాలా? ఆత్మహత్యలు చేసుకోవాలా? ఇది తప్ప మూడో మార్గం లేదు. కనుక రైతుకూలీ సంఘం సామ్రాజ్యవాదానికీ భూస్వామ్య విధానానికి వ్యతిరేక పోరాటంలో ఒక విశాలవేదికలో పాల్గొనాలి. ఆ విధంగా పోరాటాన్ని తీవ్రం చేయాలి. ★

(12వ పేజీ తరువాయి)

పి.వి నరసింహారావు ఇంత ఘోరం జరుగుతుందని అనుకోలేదంటూ పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తున్నారు. ఆనాడు వ్యతిరేకించిన ప్రతిపక్షాలలో బిజెపి, చంద్రబాబు నాయుడు కూడ ఉన్నారు. ఇవాళ రెండవ దశ సంస్కరణలను అమలు చేస్తున్నట్టు బిజెపి; నేనే ప్రపంచబ్యాంకు ముద్దు బిడ్డనని చంద్రబాబు ఊరేగుతున్నారు. దోపిడీ పాలకవర్గాలాడే దొంగ నాటకమిది.

మరిదీన్నిలాగే సాగనిద్దామా? మనం కష్టాలు పడ్డా, ముందు తరానికన్నా సుఖాలు యివ్వ వద్దా? ఎన్నాళ్లిలా సామ్రాజ్యవాదాన్ని మేపు కుంటూపోతాం? కనుకనే పోరాడాలి. మన మిత్రులందరూ ఇందాక చెప్పినట్లుగానే భూస్వాములకు, బడా బూర్జువాలకూ, సామ్రాజ్య వాదానికీ వ్యతిరేకంగా పోరాడాలి.

ఇవ్వాళ చర్చించిన విషయాలను ఆకళింపు చేసుకుని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. సంఘటిత ఉద్యమాలు నడపవలసిన అవసరాన్ని వారికి వివరించి సమాయత్తం చేయాలి. మన అవగాహన పెంచుకొనేందుకై మన సంఘం ఈ సదస్సు నిర్వహించింది. మరి దీన్ని మనం కార్యాచరణలోకి తీసుకువెళ్లి రైతుకూలీ సంఘం కార్యశీలతను కూడా మనం రుజువు చేయాలి. ★

సరైన అవగాహనతో రైతాంగాన్ని కదిలించి పోరాటాలు సలపండి!

కా॥ కె. కోటయ్య, ప్రధానకార్యదర్శి, రైతుకూలీ సంఘం

అధ్యక్షా, బి.డి శర్మగారు, ప్రొ॥ కె.ఆర్ చౌదరి గారు, కామ్రేడ్స్ !

మన ప్రియతమ నాయకుడు కా॥ తరిమెల నాగిరెడ్డి 1969 మార్చి 16 న అసెంబ్లీకి రాజీనామా చేశారు. ఆ రోజునే స్వీడన్ నుంచి వచ్చిన ఇద్దరు పరిశోధకులు ఆయనను కలిసారు. వారు ఆయన్నొక ప్రశ్న అడిగారు. మీ రైతాంగాన్ని అణచివేయటంలో సామ్రాజ్య వాదులు పాత్ర ఏమిటి అని. నాగిరెడ్డి చాలా మంచి ప్రశ్న వేసారంటూ ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలతో, సస్యవిప్లవం పేరుతో సామ్రాజ్య వాదులు వ్యవసాయరంగంలోకి ప్రవేశించారని, ఈ రంగంలో వారి పాత్ర పెరుగు తుందని అన్నారు. వీటిని గమనించడం లో పార్లమెంటరీ వామపక్షాలు విఫలమయ్యా యని, మేము కూడా గత సంవత్సరమే ఈ సమస్యపై సరియైన అవగాహనకు వచ్చామని చెప్పారు. రైతాంగపు సమస్య బయటకు కనిపించే ఫ్యూడలిజపు సమస్య మాత్రమే కాదు. ధరలు, మార్కెట్లు రైతులకవసర మైన ఉత్పాదకాలకు సంబంధించి సామ్రాజ్యవాద సమస్య కూడా. కనుక వారి పాత్ర మౌలికమైన దన్నారు. నాగిరెడ్డి మాటలు ఈ నాటికీ ఎలా వర్తిస్తున్నాయో మనకు అర్థమౌతున్నది.

ప్రొ॥ కె.ఆర్ చౌదరి గారు వివరించిన అంశాలన్నీ అర్థం చేసుకోవాలి. పి.ఎల్. 480 నుండి సస్య విప్లవం వరకు, తిరిగి గాట్ నుండి డంకెల్ ఒప్పందం, ప్రపంచవాణిజ్య సంస్థ వరకూ, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలతో మొదలై నీటితీరువా, కరెంటు ఛార్జీలు వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల వరకు రైతాంగాన్ని ఎలా సంక్షోభంలో పడవేశాయో దీనికి పరిష్కారంగా కాంట్రాక్టుసేద్యం, కార్పోరేట్ సేద్యాన్ని చూపి రైతాంగాన్ని భూమినుండి గెంటివేయ పూను కున్నారో ఆయన వివరించారు. వీటిని కా॥ నాగిరెడ్డి చెప్పిన మాటలతో కల్పి అర్థం చేసు కుంటే మొత్తం సంక్షోభపు రూపం మన కళ్ళ ముందు ప్రత్యక్షమౌతుంది.

బి.డి. శర్మగారు ఋణభార సమస్యను పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతాంగము అప్పులలో ఎలా కూరుకుపోతున్నారో చెప్పారు. 4 శాతం బారువడ్డీ తప్ప వసూలు చేయరాదని చట్టాలున్నా చక్రవడ్డీ వసూలు చేస్తున్న తీరు చెప్పారు. 1938 లో మద్రాస్ ప్రభుత్వం చట్టం చేసింది. దానిని 1958 లో ఆంధ్రకు వర్తింప జేశారు. 5 శాతం బారువడ్డీ చెల్లింపులు అసలు నుండి తీసివేయాలి. వడ్డీ అసలును మించరాదని యీ చట్టం. మా చిన్నప్పుడు తక్కావి రుణాలిచ్చే వారు. 4 శాతం బారువడ్డీ. మెల్లగా వీటిని తొలగించి సొసైటీలను, బ్యాంకులను తెచ్చారు. 15 శాతం వడ్డీ చెల్లింపు ఆలస్యమైతే 3 శాతం అపరాధ వడ్డీ మొత్తం 18 శాతం చక్రవడ్డీ వసూలు చేస్తున్నారు. రైతుల ప్రయోజనాలను రక్షించాల్సిన ప్రభుత్వమే కంచే చేను మేసినట్లు చేస్తున్నది. కనుక రైతులను అప్పుల్లో ముంచటంలో ప్రభుత్వం పాత్ర వుంది. తన చట్టాన్ని తానే తుంగలోకి తొక్కి వడ్డీ వ్యాపారిలా లెక్కలేసి జప్తులు చేస్తున్నది. ఇది కూడా రైతాంగపు అవసరాలలో నాలుగవ వంతు కంటే లేదు. రైతాంగం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చేతుల్లో పడ్డారు. ప్రభుత్వమే 18శాతం చక్రవడ్డీ విధిస్తుంది. వీరు 36 నుండి 48 శాతం వరకు వసూలు చేసి రైతాంగాన్ని నిలువు దోపిడీ చేస్తున్నారు.

రైతు అప్పులకు కారణాలు తెలుసుకు నేందుకు కమీషన్ వెయ్యమని 12 సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. ప్రభుత్వం నిరాకరిం చింది. దానితో 12 సంఘాలు కలసి కమీషన్ వేశాం. మన సంఘం కూడా వుంది. 4 శాతం బారు వడ్డీయే చట్టబద్దమని తీర్పు ఇచ్చిన జస్టిస్ పి.ఎ చౌదరి గారు దీనికి ఛైర్మను. ప్రొ॥ చౌదరి గారు కూడా ఉన్నారు. ఈ నిపుణుల కమీషన్ నివేదికను ఇచ్చింది.

రైతుల శ్రమను కొల్లగొట్టి వారిని అప్పుల పాలు చేస్తున్నారు. వ్యవసాయ పంటల నుండి అనేకం తయారుచేసుకొని పరిశ్రమలంటు న్నారు. టన్ను చెరుకు నుండి 20 కిలోల పంచదార వస్తుంది. 45 లీటర్ల మెలాసిన్ వస్తుంది. దానినుంచి ఇంకా అనేకం. వీటిపై అనేక పన్నులు వేస్తుంది ప్రభుత్వం. ఎకరానికి రైతుకు 30 వేలు వేస్తే, ప్రభుత్వానికి 1,25,000 వస్తుంది. ఇంకా ఫ్యాక్టరీ యజమానుల కెంత వస్తుందో? ఇదంతా



ఎవరి శ్రమ? రైతు కూలీలు పండించ కుండా చెరకు వచ్చిందా? పొగాకు, జూటు, ప్రత్తి, వరి అన్నిపంటలూ ఇంతే. రైతుకు ఏమీమిగ లదు. ప్రభుత్వము, మిల్లులు లాభాలు గడిస్తాయి.

రాజ్యంగపు 5వ షెడ్యూలున్నా, 1 ఆఫ్ 70 వున్నా గిరిజనులు అధోగతిలో వుండటానికి కారకులెవరు? ప్రభుత్వ విధానాలు కాదా? మన వ్యవసాయానికి 10 వేల ఏళ్ళ చరిత్ర ఉంది. వరి, కూరగాయలు, జొన్న, సజ్జ, రాగులు ఇలా ఎన్నో రకాల పంటలు మనకు ఉన్నాయి. ఇవి నాశనం చేయవచ్చనుకొన్నారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా గోధుమలు, మొక్కజొన్నలు, ప్రత్తి యిబ్బడిముబ్బడిగా పండిస్తున్నారు. వాటిని అమ్ముకోవాలి. అందుకనే మన వ్యవసాయాన్ని నాశనం చేయటానికి పూనుకున్నారు. మన ఆహారపుటలవాట్లు మార్చడానికి పూనుకున్నారు. వారికి కావలసిన వాటిని మన రైతులు పండిం చాలి. వాటిని కారు చౌకగా కొనుక్కొని పోవాలి. అందుకనే రైతాంగాన్ని అప్పులలో ముంచు తున్నారు. మనం ఏ పంటలు వెయ్యాలో వారే నిర్ణయిస్తున్నారు. కనుకనే ఈ రోజు వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది.

మనరైతు కూలీ సంఘం ఈ విధానాలను మొదటి నుండే వ్యతిరేకిస్తూ వస్తుంది. వీటిని ప్రారంభించిన పి.వి నరసింహారావు మీద కా॥ఎమ్మెస్ పోటీ చేశారు. అప్పుల భారతం కళారూపం ఉరూరా ప్రచారం చేశారు. ఇవాళ

← (తరువాయి 13వ పేజీలో)

విశాఖ సదస్సు కరపత్రం :

రైతాంగ ఆత్మహత్యల నివారణకు యథాపరిమిక్తికి వ్యవసాయరంగ పరిరక్షణకు సంఘటితంగా నిలుద్దాం!

మిత్రులారా!

ఈనాటికీ దేశజనాభాలో నూటికి 70 మంది వ్యసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. 20 శాతం కుటుంబాల చేతిలో 60 శాతం భూమి వుండగా, మిగిలిన 80 శాతం మంది వ్యవసాయ కూలీలుగా, పేద మధ్యతరగతి రైతాంగంగా వున్నారు. గత అర్ధశతాబ్దికాలంగా పాలకవర్గాలు అమలుజరిపిన ప్రతివిధానమూ ఈ పరిస్థితిని ఏమాత్రం మార్పు చెయ్యలేదు. కాకపోగా భూస్వామ్య దోపిడీతో పాటుగా సామ్రాజ్యవాద దోపిడీని పెంచింది.

భూస్వామ్య విధానాన్ని బ్రద్దలుకొట్టే విప్లవ భూసంస్కరణలను అమలుజరపలేదు. భూముల కోసం పోరాడుతున్న రైతాంగాన్ని పాశవికంగా అణచివేశారు. వ్యవసాయరంగ సంక్షోభానికి వెనకబాటు తనమే ప్రధాన కారణమంటూ, దిగుబడులు పెంచటానికి ఆధునిక పద్ధతులు వినియోగించాలంటూ ప్రచారం చేశారు. పైరు పచ్చ విప్లవ వ్యూహంతో పారిశ్రామిక ఉత్పత్తుల (రసాయనిక ఎరువులు మొ॥) వాడకాన్ని పెంచారు. సబ్సిడీల పేరిట వీటిని తక్కువ ధరలకు రైతాంగానికి అందజేశారు. సంస్థాగత రుణాలను అందజేశారు. ఆచరణలో పెరిగిన దిగుబడిలో అధికభాగం వీటి కొనుగోలుకే సరిపోయే స్థితిని కల్పించారు. ఆ విధంగా సామ్రాజ్య వాద పరిశ్రమలకు మార్కెట్టును సృష్టించారు.

మరోవైపున అధికదిగుబడి వంగడాల వల్ల గడ్డి తగ్గిపోవటంతో, రైతాంగానికి పశుపోషణ చేయలేని స్థితి కల్పించారు. దీనితో కంపోస్టు ఎరువులు లేక రసాయనిక ఎరువులపై ఆధారపడటం తప్పనిసరి కావటంతో పాటుగా, వ్యవసాయ అనుబంధ ఆదాయవనరులు (పాడి, కోళ్ళు మొ॥) అందుబాటులో లేకుండా చేశారు. రైతాంగాన్ని ఈ దుస్థితిలోకి నెట్టి, వారి ఆదాయాన్ని పెంచే మార్గాలంటూ శ్వేతవిప్లవం, నీలివిప్లవాలంటూ ఈ అనుబంధ వృత్తులను కూడా వాణిజ్యపరం చేసారు. వీటిని కూడా సామ్రాజ్యవాదులకు మార్కెట్టుగా మార్చారు. మొదట్లో అనేక రాయితీలతో రైతాంగాన్ని వీటివైపు ఆకర్షించి, ఆ తర్వాత వాణిజ్య స్థాయికి పెంచటంతో పేద, మధ్యతరగతి రైతాంగం నష్టపోయారు. 50పాడిపశువులకు తక్కువ వుంటేనూ, 50వేల కోళ్ళకు తక్కువుంటేనూ గిట్టుబాటు కాని స్థాయిని కల్పించారు. ప్రాధాన్య తారంగమంటూ వ్యవసాయరంగాని కొస్తున్నట్లు పేర్కొంటున్న సంస్థాగత రుణాలలో అధికభాగం వీరికే అంటే వీటిని నిర్వహిస్తున్న ధనికరైతు, భూస్వాములకే అందుతున్నది.

ఫలితంగా వ్యవసాయరంగ సంక్షోభం మరింత తీవ్రమైంది. నీటిపారుదల సౌకర్యం ఏర్పడి అభివృద్ధి చెందాయన్న ప్రాంతాలలోనే పేద, మధ్యతరగతి రైతాంగం తమ ఆస్తుల విలువకుమించిన అప్పులలో కూరుకు పోయారు. ఇక దుర్భిక్ష ప్రాంతాలలో రైతాంగం వ్యవసాయం సాగించలేక పనులు వెతుక్కుంటూ వలసలు పోతున్నారు. వ్యవసాయకూలీలకు పనిదినాలు, నిజవేతనాలు తగ్గిపోయాయి. కౌలు రైతుల స్థితి దుర్భరంగా మారింది. చివరికి ఆత్మహత్యలకు నెట్టబడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో వర్గ వైరుధ్యాలు తీవ్రమయ్యాయి. గ్రామీణ పేదలు, దళితులపై దాడులూ, రైతాంగ వుద్యమాలపై పాశవిక నిర్బంధకాండ పెరిగాయి.

శాశ్వత సంక్షోభంతో కూరుకుపోయిన సామ్రాజ్యవాదం తన సంక్షోభ భారాన్ని మూడవ ప్రపంచదేశాలపై రుద్దటానికి పూనుకుంది. తన కబంధ హస్తాలను మరింతగా విస్తరించ పూనుకున్నది. మూడవ ప్రపంచదేశాలలో వునికిలో వున్న సామాజిక వ్యవస్థకు దెబ్బ తగలకుండా, దానిని పునాదిగా చేసుకొని తన దోపిడీని విస్తృతం చేయపూకున్నది. తక్షణంగా ఆర్థిక దోపిడీని పెంచటంతోపాటు, దేశ ఆర్థిక, సహజ వనరులన్నింటిపై ఆధిపత్యం పొంది, తన దోపిడీ ప్రయోజనాలకు వాటిని లోబర్చటం లక్ష్యంగా పెట్టుకుంది.

సామ్రాజ్యవాదుల ఆజ్ఞలను శిరసావహించే భారత బడా భూస్వామ్య, దళారీ బూర్జువా వర్గాల నూతన ఆర్థిక విధానాల పేరిట వాటిని అమలు జరపటం ప్రారంభించాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతాంగం నూతన పద్ధతులు అనుసరించాలంటూ దీనికి కాంట్రాక్టు ఫార్మింగు అవసరమంటూ నూతన వ్యవసాయ విధానాన్ని ప్రకటించింది.

దీనిలో మొదటి చర్యగా ఎరువుల ధరలను పెంచివేసింది. విద్యుత్తు ఛార్జీలను సాగునీటి తీరువా రేట్లను పెంచివేసింది. రెండవ దశగా ప్రపంచవాణిజ్య సంస్థలలో చేరి వ్యవసాయ దిగుమతులపై ఆంక్షలన్నింటినీ ఎత్తివేసింది. రైతాంగానికి కనీస మద్దతు ధరను ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఎఫ్.సి.ఐ, పాగాకు బోర్డు, సిసిఐ వంటి సంస్థలను నిర్వీర్యం చేసింది. సంస్థాగత రుణసౌకర్యాన్ని కుదించివేసింది.

ఫలితంగా ఏ పంట వేసినా రైతాంగానికి కనీస ధర రాక పంటను తెగనమ్ముకొనే స్థితి ఏర్పడింది. గత రెండు, మూడు సం॥లుగా ధాన్యం ధరను అనూహ్యస్థాయికి పడగొట్టారు. ఎఫ్.సి.ఐ కొనుగోళ్ళను ఆపి దిగుమతుల బూచిని చూపి మిల్లర్లు ధరను దిగ్గోసారు. రైతులు తెగనమ్ముకున్న తర్వాత ఎఫ్‌సిఐ మిల్లర్ల నుండి కొనుగోలు చేసి వారికి లాభాలు చేకూర్చింది. ఇక ఇప్పుడు ఒక విధానంగానే ఎఫ్‌సిఐ మార్కెట్టు నుండి తప్పుకుంటుందని ప్రకటించి రైతాంగాన్ని మిల్లర్ల దయాదాక్షిణ్యాలకు వదలిపెట్టారు. చక్కెర దిగుమతి అవుతున్నదంటూ మిల్లులు రైతాంగానికి చెల్లింపులు ఆపివేశారు. పాగాకుకు గిట్టుబాటు ధర కావాలంటే క్రాప్‌హాలిడే పాటించాలంటూ బలవంతంగా రుద్ది రైతాంగాన్ని నానా అవస్థల పాలు చేసారు. చివరికి గిట్టుబాటు ధర లేకపోగా టుబాకోబోర్డు పాత్రను నామమాత్రం చేశారు. మినుములు, కందులు, శనగలకు కూడా దిగుమతి అనుమతించి రైతాంగాన్ని ముంచారు. బ్రౌన్ రివల్యూషన్ పేరిట రైతులకు ప్రోత్సాహమిచ్చి వంటనూనె గింజల సాగును ప్రోత్సహించారు. అనేక యిబ్బందుల మధ్య రైతాంగం సాగుచేసి వంట నూనెలలో స్వయం సమృద్ధిని సాధించారు. అయినా పామ్ ఆయిల్‌ను కిలో 10 రూ॥లకు దిగుమతి చేసి వేరుశెనగ, కొబ్బరి రైతులను సంక్షోభంలో పడవేశారు. ఇప్పుడు దేశీయ ఉత్పత్తి తగ్గిన తర్వాత కిలో 35 రూ॥లు పెంచి అమ్మిలాభాలు చేసుకుంటున్నారు. ప్రతి దిగుమతులు పెరిగి, మిల్లులు మూతపడి,

పంటకు రేటు లేకుండాపోయింది. మిర్చి పంటకు కూడా రేటు లేక శీతల గిడ్డంగులలో ఉంచితే, వాటి అద్దెకు కూడా చాలక దిక్కుతోచనిస్థితి ఏర్పడింది. చివరకు యూకలిప్టస్, సరుగుడు సుబాబుల్ వంటి కలపకు కూడా పేపరు మిల్లులు పల్ప్ దిగుమతుల బూచిని చూపి రేటును దిగ కోశాయి. దీనికి తోడు వ్యవసాయ ఉత్పత్తులకు దేశంలో రవాణాపై ఉన్న నియంత్రణలన్నింటినీ తొలగించివేశారు. దీనివల్ల మార్కెట్టు శక్తులు గిట్టుబాటు ధర నిర్ణయిస్తాయని చెబుతున్నారు. అయితే గత 3 సం॥ల అనుభవాన్ని గమనిస్తే ఇది మధ్యదళారులకే లాభాలు చేకూర్చు తుందనీ, రైతాంగానికి మద్దతుధర కూడా దక్కదని తెలుస్తుంది.

ఆధునిక పద్ధతులలో విత్తనాలు ముఖ్య మైనవి. వీటిని తయారు చేసి సరఫరా చేయగల తగిన సాధన సంపత్తి ఉండి కూడా ప్రభుత్వం మిన్నకుండి కార్గిల్, మాన్‌సాంటో, మహికో వంటి గుత్త కంపెనీలకే వదిలివేసింది. వీటిపై నియంత్ర ణలు లేకుండా చేసి రైతాంగాన్ని నకిలీవిత్తనాల బారిన పడవేసింది. ఎంతో ఆశతో పంట వేసిన రైతు విత్తనాలు మొలకెత్తాక ఫలసాయం రాక నడుములు విరుగుతున్నాయి.

చేపలు, రొయ్యలు పెంపకానికి విపరీతంగా ప్రోత్సహించిన పాలకులు విశాల తీరప్రాంత భూములను గుత్త కంపెనీలకు కట్టబెట్టారు. మొదట్లో లాభాలు చూపించి రైతాంగాన్ని ఆకర్షిం చారు. బంగారు పంటభూములను కూడా చెరువులు చేశారు. ఇప్పుడు వీరి పరిస్థితి దయ నీయంగా మారింది. చెరువులను తిరిగి సాగుభూమిగా మార్చలేక, రొయ్యలు పెంచలేక పీకలలోతు అప్పులలో మునిగిపోయి రైతులు ఐస్ కంపెనీలకు, హేచరీస్‌లకూ కట్టుబానిస లయ్యారు. ఉప్పుపంట సాగించిన రైతులు దిక్కుతోచక రోజు గడవనిస్థితిలోపడగా, దీనిలోకి వచ్చిన గుత్తసంస్థలు లాభాల పంటలు దండు కుంటున్నాయి.

భూమిలాగే నీరు కూడా మానవాళికి ప్రకృతి సిద్ధంగా లభించింది. దీనిపై హక్కు ప్రజలంద రిది. ఈ నీరు ప్రజలు, పశుపక్ష్యాదులు తాగేందు కు స్వేచ్ఛగా ఉపయోగపడాలి. భూముల సాగుకు ఈ నీరు అన్ని ప్రాంతాల ప్రజలకు చేరాలి. విజ్ఞానం పెరిగిన ఫలితంగా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా దూర ప్రాంతాలకు కూడా నీరు అందించడం సాధ్యమైంది.

పాలకులు మెట్టప్రాంతాలకు అవసరమైన ప్రాజెక్టుల నిర్మాణపు బాధ్యత వదిలివేసారు. వాటర్‌షెడ్ పథకాలు, నీరు-మీరు పేరిట తమ బాధ్యతను తప్పించుకునే ప్రచార ఆర్భాట పథకాలతో సరిపుచ్చజూస్తున్నారు. సాగునీరు అందే ప్రాంతాలలో కూడా మీటర్లు పెట్టి దాని ప్రకారం రైతుల నుండి ఫీజుల వసూలుకు ప్లాను చేస్తున్నారు. ఇక తాగునీరు ఎప్పుడో ప్రైవేట్ పరమయింది. లీటర్ పాలకన్నా లీటరు నీటిని ఎక్కువ రేటు పెట్టి అమ్ముకొని బడా గుత్త కంపెనీలు వందల కోట్ల లాభాలు ఆర్జిస్తున్నాయి.

గిరిజన ప్రాంతాలలో భూముల పరాయి కరణను నిరోధించేందుకు చేసిన 1/70 చట్టపు సవరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా, కేంద్రం గిరిజనులకు రక్షణగా ఉన్న రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్‌కే తూట్లు పొడిచేందుకు కుట్ర చేస్తోంది. అటవీ ప్రాంతంలోని భూమి, నీటి వనరులు, ఖనిజ వనరులను విదేశీ బహుళజాతి గుత్త కంపెనీలకు దారాధత్తం చేయటం ప్రారంభించారు.

మైదాన ప్రాంతంలో వ్యవసాయ పంటల నిల్వకు కోల్డ్ స్టోరేజీలు కట్టేందుకు కోట్ల రూపాయల సబ్సిడీలు బడా కంపెనీలకు ఇస్తున్న పాలకులు గిరిజన కార్పోరేషన్ ఆధ్వర్యంలో చింతపండు నిల్వలకోసం కోల్డ్ స్టోరేజ్ కట్టేందుకు సిద్ధపడటం లేదు. చింతపండు ధరను ఈ సంవత్సరం ఒక్కసారిగా కిలోకు 6 రూ॥ల నుండి 2.50 పైసలకు జిసిసినే దిగకోసి గిరిజనుల పొట్టకొట్టింది. బీడీఆకుల సేకరణను నిలిపి వేసింది. అభయారణ్యాల పేరుతో వెదురు నరకక పోవటంతో మొదలైన వలసలు పై చర్యలతో మరింతగా పెరుగుతాయి.

జాతీయ బ్యాంకులు ప్రాధాన్యతారంగంగా వ్యవసాయాన్ని గుర్తించినప్పటికీ ఆచరణలో ఈ రంగానికి రుణాలను బాగా కత్తిరించారు. రైతుల రుణాలపై సామాన్య వడ్డీ మాత్రమే వసూలు చేయాలని బ్రిటీష్ ప్రభువుల కాలం నాడే చేసిన చట్టాలను పక్కనపెట్టి చక్రవడ్డీని వసూలు చేస్తున్నారు. తీసుకున్న అప్పులో అసలుకన్నా వడ్డీ మించకూడదన్న సూత్రం గాలికి ఎగిరిపోయి అసలుకన్నా రెండు మూడు రెట్లు అదనంగా వడ్డీ వసూలు చేస్తున్నారు.

ఫలితంగా రైతాంగం నష్టాలపాలు అవు తున్నారు. రైతుల శ్రమ ఫలితమైన సంపద నగరాలలోని ఉన్నత వర్గాలకు తరలిపోతుండగా రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అప్పులు తీర్చేదారిలేక పేద,మధ్యతరగతి రైతాంగం భూములు కోల్పోతున్నారు. అప్పులు విపరీతంగా పెరిగిపోయి ఆస్థి అమ్మినా తీర్చేదారే కనపడక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఒక ఏడు ప్రత్తి రైతులు, మరోఏడు పొగాకు రైతులు ఆత్మహత్యలు పాలబడగా నేడు ప్రత్తి రైతుల ఆత్మహత్యలు రోజువారీ వార్తల స్థాయికి పెరిగాయి.

మనదేశంలో వ్యవసాయం ఒక జీవన విధానం. రైతాంగ జీవనం భూమిపైనే ఆధారపడి వుంది. విప్లవ భూసంస్కరణలు అమలుజరిపి సాగుచేసే రైతాంగానికి ద్రవ్యపర మద్దతునిచ్చి, వ్యవసాయరంగ మిగులు సంపదతో దేశీయ వ్యవసాయ అవసరాలను తీర్చే పరిశ్రమలను స్థాపించి వ్యవసాయ, పారిశ్రామికరంగాల సమ తుల్య అభివృద్ధి సాగించాలి. ఈ వ్యూహం మాత్రమే వ్యవసాయాధారిత జనాభాను క్రమంగా తగ్గించి సారీశ్రామికీకరణ పెరుగుదలకు దోహదపడి సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తుంది.

కానీ దోపిడీ పాలకవర్గాల అభివృద్ధి వ్యూహం ఇదికాదు. భూస్వామ్య విధానాన్ని కొనసాగిం చటం, వారి దేశాలకనుగుణంగా దేశాన్ని సామ్రాజ్యవాదుల దోపిడీకి వనరుగా మార్చటం, ఈక్రమంలో వారు విసిరే ఎంగిలి మెతుకులు గతకడం లక్ష్యంగా సాగుతున్నాయి. దీని ఫలితమే నేటి వ్యవసాయరంగ సంక్షోభం.

ఈ సంక్షోభం నుండి వ్యవసాయరంగాన్ని కాపాడుకోవటమంటే వ్యవసాయకూలీలను పేద, మధ్యతరగతి రైతులను కాపాడుకోవటమే. భూస్వామ్య విధానాన్ని రద్దు చేయటం, విప్లవ భూసంస్కరణల అమలు, సామ్రాజ్యవాద పెట్టుబడిని జాతీయం చేసి దేశీయ పరిశ్రమల్ని అభివద్ధి చేయటమే. ఈ సంక్షోభపు సుడిగుండం నుండి రైతాంగాన్ని బయటపడవేయగలదు.

ఈ లక్ష్య సాధనతోనే రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఏర్పడింది. గత ఏప్రిల్‌లో జరుపుకొన్న మహాసభలలో విస్తృతంగా చర్చించి కార్యచరణ పథకాన్ని రూపొందించుకుంది. ఈ ఏడాది కాలంగా గిరిజన సమస్యలపైన, వ్యవసాయ కూలీలు, పేద, మధ్యతరగతి రైతాంగం, గ్రామీణ పేదల సమస్యలపై అనేక ఆందోళన లు, పోరాటాలు సాగించింది. వీటిలో భాగంగా ఏప్రిల్ 15న విశాఖ పట్టణంలో వ్యవసాయరంగ సంక్షోభంపై సదస్సు నిర్వహిస్తుంది. రాష్ట్రం నలుమూలల నుండి రైతుకూలీ ప్రతినిధులు హాజరవుతారు. ఈ సదస్సును విజయవంతం చేసేందుకు అన్ని విధాలుగా తోడ్పడమని విజ్ఞప్తి చేస్తున్నాం.

★

నివేదికలు, వ్యాసాలు

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగంపై నిపుణుల కమీషన్ నివేదిక

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయరంగం పూర్తిగా సంక్షోభంలో వుందని గుర్తించిన రైతు సంఘాలు, రైతుకూలీ సంఘాల ఐక్యకార్యాచరణ వేదిక వ్యవసాయరంగంలో నిపుణుల చేత ఒక కమీషన్‌ని నియమించమని కోరింది. ఆ కమీషన్ ఇచ్చిన సూచనల ఆధారంగా తగు చర్యలు చేపట్టవలసిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి వేదిక విజ్ఞప్తి చేసింది. ముఖ్యమంత్రి ఈ కమీషన్‌ని నియమించటానికి నిరాకరించటంతో రైతుసంఘాలు, రైతుకూలీ సంఘాలే చొరవ తీసుకొని జస్టిస్ పి.ఎ చౌదరి ఛైర్మన్‌గా, ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి, ప్రొఫెసర్ వేణు గోపాలరావు, ప్రొఫెసర్ డి. నర్సింహారెడ్డి మరియు ప్రొఫెసర్ ప్రసాద్‌రావు గార్లతో కమీషన్ ఏర్పాటయింది. ఈ కమీషన్ మహబూబ్‌నగర్, వరంగల్, గుంటూరు, కృష్ణా, అనంతపురం జిల్లాల్లో పర్యటించి రైతుకూలీ లతో, పేద, సన్నకారు, మధ్యతరగతి రైతాంగంతో కలిసి వ్యవసాయ రంగంలో వారు ఎదుర్కొంటున్న సంక్షోభాలను గురించి తెలుసు కొని తన పరిశీలనా నివేదికను విడుదల చేసింది. ఆ నివేదిక సారాంశాన్ని అనువాదం చేసి యిస్తున్నాం.

వ్యవసాయస్థితి

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయాభివృద్ధికి అనను కూల పరిస్థితి ఉంది. ఈ రంగానికి ప్రభుత్వ మద్దతు తగ్గిపోతున్నది. రాష్ట్రం అప్పులలో కూరుకుపోవటంతో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు తగ్గిపోతున్నాయి. వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని కమీషన్ సూచిస్తున్నది.

విధానపర మద్దతు

రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తిని పెంచడానికి భూమి కేంద్రీకరణ అధికం కాకుండా దున్నే వానికి భూమి హక్కును కల్పిస్తూ భూసంస్కరణ చట్టాలను అమలుచేయాలి. స్వావలంబన నుంచి వ్యవసాయాన్ని ప్రపంచీకరించే వైపుగా విధానాలు మారాయి. ప్రస్తుత సంక్షోభానికి ప్రధానంగా ఈ మార్పే కారణం. స్థూల వ్యవసాయోత్పత్తిలో 3 శాతం మాత్రమే ఎగుమతి అవుతూ, 97 శాతం దేశీయంగానే వినియోగించబడుతున్నస్థితిలో, దేశీయ మార్కెట్టు అవసరాలను తీర్చేవిధంగా నూ, దీనిని ప్రోత్సహించే విధంగానూ విధానాల దిశ ఉండాలని కమీషన్ భావిస్తున్నది. కనుక పెద్దఎత్తున పెట్టుబడి అవసరమయ్యే ఎగుమతి ఆధారిత వ్యవసాయ అవగాహన అసంబద్ధ మైంది. ప్రపంచ వాణిజ్యసంస్థ అనుమతించిన రక్షణను కూడా బలహీన వర్గాలకు కల్పించటం లేదని కమీషన్ గమనించింది.

ప్రజలపై మారుతున్న విధానాల ప్రభావం

సాగునీటి పట్ల నిర్లక్ష్యం, విద్యుత్తు సరఫరా సమస్యలు, రుణగ్రస్తత, మార్కెట్టు సమస్యలు మహబూబ్‌నగర్ జిల్లాలో రైతుల దుస్థితికి కారణాలు. తరిగిపోతున్న పనిదినాలు, ప్రభుత్వ పనులలో పెద్ద యంత్రాల వాడకం జిల్లాలో వ్యవసాయ కూలీల దుస్థితికి కారణం.

వరంగల్ జిల్లాలో కరువులు తరచుగా వస్తున్నాయి. గండ్లు పడిన చెరువులను నిర్లక్ష్యం చేశారు. కల్తీమందులు, ఎరువులు, విత్తనాలు రైతులను విపరీతంగా నష్టపరుస్తున్నాయి. ద్రవ్య సంస్థలు 15 శాతం రుణాన్ని మాత్రమే అందిం చాయి. మిగిలినది ఎరువులు తదితరములకు వ్యాపారులు అధికవడ్డితోనూ, పంటకు తక్కువ ధరనూ యిచ్చారు.

తరచుగా వచ్చే తీవ్ర కరువులు, పంటల విఫలత, అధిక రుణగ్రస్తత, సాగునీటి సౌకర్యాలు లేకపోవటం, ఇన్సూరెన్సు సదుపాయం లేమి ఇది అనంతపురం చిత్రం.

అధిక ఉత్పత్తి ఖర్చుల, ఉత్పాదకాల, ఉత్పత్తుల మార్కెటింగ్‌లో సమస్యలు, కల్తీ విత్తనాలు, ఎరువులు, మందులు గుంటూరు జిల్లా రైతుల దుస్థితికి కారణాలు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలను అమలు జరిపే విధంగా యంత్రాంగం పనిచేయటం లేదు.

గుంటూరుజిల్లా రైతుల సమస్యలతో పాటుగా అధిక కౌలు రేట్లకు కృష్ణాజిల్లా రైతులు గురవు తున్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రైతులు తరచుగా కరువులు, రుణగ్రస్తత, మార్కెట్ల సమస్యలతో సతమత మౌతున్నారు. గ్రామీణ పేదలకూ, వ్యవసాయ కూలీలకూ పనిదినాలు తగ్గి, వలసలు పోతున్నారు.

గరిష్ట పరిమితి చట్టాలు, అత్యవసర సరుకుల చట్టం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కంట్రోలు చట్టాలు, రుణవిమోచన చట్టాలు, వ్యవసాయ కూలీలకు కనీసవేతన చట్టం-వీటిని అమలుజరపటం తన విధియై ఉండగా రాష్ట్ర ప్రభుత్వం అమలుజరపటం లేదు.

రైతుల దుస్థితి - ఆత్మహత్యలు

ప్రభుత్వమనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు రుణభారంతో క్రుంగిపోతున్నారు. రుణదాతలు వారిని అవమానాలకు గురిచేస్తున్నారు. ఈ దుస్థితిని భరించలేక, అప్పులు తీర్చేందుకు ఉన్న ఒక్క జీవనాధారమైన భూమిని కోల్పోతామనే భయంతో కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీనికి ప్రభుత్వ విధానాలే కారణం.

వడ్డీవ్యాపార చట్టంలో రుణాల వసూళ్ళకు నిర్బంధ పద్ధతుల వినియోగాన్ని నిషేధించారు. దీనినమలుచేయటం ప్రభుత్వవిధి. పరిపాలనా యంత్రాంగం ఈ చట్టాన్ని అమలుపరచటం లేదని కమీషన్ గమనించింది. ఏ కోణం నుండి చూసినా రైతుల దుస్థితికి (కొందరి ఆత్మ హత్యలకూ) ప్రభుత్వ విధానాలే కారణం.

కనుక కమీషన్ అనివార్య నిర్ధారణకు వచ్చింది. ప్రభుత్వం తన విధానాలను సమీక్షించు కోవాలి. తన అధికార పరిధిలోనిదే గనుక రైతులకు రుణ భార తగ్గింపుకు చర్యలు తీసుకోవాలి. సంకుచిత రాజకీయ దృష్టితో నిరంకుశ చర్యలు కాకుండా, ఆత్మహత్యల పాలైన రైతు కుటుంబాలకు సహాయ మందించాలి. జాతీయ విపత్తుల నిధి వంటి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి రైతులు దుస్థితికి లోనయి నప్పుడు సహాయ మందించాలి. ఆత్మహత్యలను నివారించడానికి కరువులు, వరదలకు గురైన ప్రాంతాలలో రుణాల వసూళ్ళను (ప్రైవేట్, పబ్లిక్) నిలుపుదల చేస్తూ ఆర్డినెన్సు చేయాలి.

రుణ సమస్య

తీవ్ర రుణభారం నుండి రైతులకు సహాయ మందించేందుకు ఈ క్రింది చర్యలు తక్షణమే తీసుకోవాలని కమీషన్ సూచిస్తున్నది.

1. రాజ్యాంగం ప్రకారం రుణవిమోచన రాష్ట్రాల పరిధిలో వుంది. కేంద్రం ఏ రూపం లోనూ కల్పించు కోరాదు. బ్యాంకుల నియంత్రణ చట్టం ద్వారా కేంద్రం ఈ హక్కును కత్తిరించింది. రాష్ట్రాల హక్కును పునస్థాపిస్తూ చట్టాన్ని సవరించాలి.

2. రుణగ్రస్త రైతులలో అసలు కంటే వడ్డీ, అపరాధ వడ్డీ రెండు, మూడు రెట్లు ఎక్కువ ఉంది. కనుక రైతుల రుణాలన్నింటికీ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంత) వ్యవసాయదారుల సహాయక చట్టం 1938లోని సెక్షను 9, 13లను వర్తింప చేయాలి. దీని ప్రకారం సాలుకు 5శాతం బారువడ్డీ నే వర్తిస్తుంది. ఇప్పటికి చేసిన చెల్లింపులను అనలులోంచి తీసివేసి మిగిలిన అనలునే చెల్లించాలి. ఇది ప్రభుత్వం విధి.

3. 5ఎ. మాగాణి, 10ఎ. మెట్ట లోపు రైతులకు ప్రభుత్వ, కో-ఆపరేటివ్ సంస్థలు, ప్రైవేటు, ఉత్పాదకాల వ్యాపారులు ఇచ్చిన రుణాలను తీవ్రదుస్థితికి లోనైన ప్రాంతాలలో రద్దు చేయాలి.

4. విద్యుత్తు సరఫరా సమస్యలకు ట్రాన్స్‌కోను బాధ్యురాలిని చేయాలి. దీనివల్ల రైతులకు వాటిల్లిన నష్టాన్ని అది చెల్లించేలా చేయాలి.

5. తగిన సమయంలో మొత్తం అవసరాలను తీర్చే విధంగా ప్రభుత్వరంగ ద్రవ్య సంస్థలను పటిష్టం చేయాలి. రుణ సౌకర్యాన్ని సరళీకరించేందుకు కౌలుదారులతో సహా రైతులకు క్రెడిట్ కార్డులివ్వాలి.

6. అందరు రైతులకు, అన్ని పంటలకు ఇన్సూరెన్సు స్కీమును వర్తింపజేయాలి.

7. నాణ్యత గల ఉత్పాదకాలు (విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు) సరసమైన ధరకు అందించేందుకుద్దేశించిన చట్టాలను పటిష్టపరచి అమలుచేయాలి.

వ్యవసాయ మార్కెట్టు కమిటీల నిర్వహణ

ఇది లొసుగుల మయంగా ఉందని కమిషన్ దృష్టికి వచ్చింది. అవి వివాద పరిష్కార కమిటీలను ఏర్పాటు చేయ్యలేదు. వసూలు చెయ్యవలసిన 1.5-2.5 శాతం కంటే ఎక్కువ కమిషన్ వసూలు చేస్తున్నారు. చట్టప్రకారం ఏజెంటు రైతులకు ముందుగా చెల్లించి కొనుగోలుదారు నుండి తర్వాత వసూలు చేసుకోవాల్సి వుండగా తద్వైతి రేకంగా జరుగుతున్నది. శాంపిల్ తీయటం పేరిట రెండు కేజీల వరకూ లాటు నుండి తీస్తున్నారు. ఏజెంటు-కొనుగోలుదారులు కుమ్మక్కు అవు తున్నారు. రైతుబంధు పథకం అమలు కావటం లేదు. అమ్మకం ముగిసే వరకూ గోడౌను సౌకర్యం కల్పించటం లేదు. మార్కెట్టు కమిటీ నిధులను రైతులకు మేలు కలిగించని, చట్టముద్దేశించని పనులకు తరలిస్తున్నారు. ఉత్పత్తుల నాణ్యత సమంగా లేదనీ, బ్యాంకుల రుణసౌకర్యం లేదనీ, దిగుమతుల విధానం వల్ల తాము అమ్మేటప్పుడు సరైన ధర లేదనీ వ్యాపారులు చెప్పారు. కనుక మార్కెట్టు చట్టం (1996) ను సవరించి, పటిష్టం చేసి, కఠినంగా అమలు జరిపే చర్యలు సత్వరమే తీసుకోవాలని కమిషన్ సూచిస్తున్నది.

మారుతున్న విధానాలతో తలెత్తుతున్న మార్కెట్టు సమస్యలు

ప్రపంచమార్కెట్టు శక్తుల ఆధిపత్యంతో మార్కెట్టు శక్తులకు స్వేచ్ఛ, రూపాయి మారకం విలువలో మార్పులు, భారత వ్యవసాయ ఉత్పత్తులు పోటీకి తట్టుకోలేక పోవటం, ఆంక్షలు లేని దిగుమతులు, మార్కెట్టులో ప్రభుత్వ జోక్యం తగ్గుదల, ఇవీ తలెత్తుతున్న సమస్యలు. వ్యవసాయ సరుకులు, వాటి ఉత్పత్తులలో ఫ్యూచర్ ట్రేడింగ్‌ను అనుమతించటం వల్ల ప్రపంచ మార్కెట్టు శక్తులకు భారత వ్యవసాయాన్ని వదులుతున్నారు. ఇది దేశ, రైతుల, వినియోగదారుల ప్రయోజనాలకు హానికరం. కనుక తగినంత రక్షణలు, ముఖ్యంగా బలహీన వర్గాలకు కల్పించాలని కమిషన్ భావిస్తున్నది.

విత్తన సరఫరా

తగినంత ఆదుపుచేసే యంత్రాంగం లేకుండా ప్రైవేటు ఏజెన్సీలను ప్రోత్సహించటం హానికరమని, ఇది రైతుల ఆత్మహత్యలతో నిరూపితమయిందనీ కమిషన్ భావిస్తున్నది. కనుక చట్టాలను తగిన విధంగా సవరించాలి. విత్తన బ్యాంకులను ఏర్పాటు చేయాలి. మార్కెట్టులోకి విత్తనాలను విశ్వ విద్యాలయ పరిశోధనశాలల్లో పరిశీలించి సర్టిఫికేట్ పొందాలి. ఎం.ఎన్.సిలతో సహా అన్ని ప్రైవేటు కంపెనీలకు ఇది వర్తించాలి.

ఎరువుల సరఫరా

రసాయనిక ఎరువుల శాస్త్రీయ వినియోగం కోసం ఆదునిక భూసార పరీక్షా కేంద్రాలను జిల్లా కొకటి ఏర్పరచి, వ్యవసాయ విశ్వ విద్యాలయంతో అనుసంధానించాలి. రైతుల నుండి మట్టి, సాగునీరు, చెట్ల శాంపిల్సును సేకరించి ఫలితాల తో పాటు వాడవలసిన ఎరువుల మోతాదును కూడా వారికి తెలపాలి. సమతుల్యత ప్రోత్సహించటం కోసం పోషకాలు, జీవఎరువులు, సూక్ష్మ పోషకాల సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

భారత ప్రజలకు సరసమైన ధరలకు వ్యవసాయ సరుకులు అందజేసేందుకు ఎరువుల సబ్సిడీని కొనసాగించాలి.

పురుగు మందుల సరఫరా

ప్రభుత్వం సమగ్ర చీడల నియంత్రణా చర్యలు తీసుకోవాలి. దీనికవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, మార్గదర్శకం, కీలక సరుకులను రైతులకు అందజేయాలి. నాణ్యతలేని కల్తీమందుల అమ్మకం యధేచ్ఛగా సాగుతున్నది. వీటిని అణచి వేసేందుకు గట్టి చర్యలు తీసుకోవాలి. పురుగు మందులన్నింటినీ పరీక్షించి సర్టిఫికేట్ యివ్వాలి. ధరలలో పారదర్శకత కోసం ఫ్యాక్టరీ బయట కొచ్చిన రేటునూ, పన్నులనూ, అనుమతించిన కమిషన్‌ను తెలుపుతూ టిన్ను పై ముద్రించడాన్ని నిర్బంధం చేయాలి.

సాగునీటి, విద్యుత్తు సమస్యలు

ప్రాజెక్టుల నీటి సక్రమ వినియోగానికి రైతులకు భాగస్వామ్యం కల్పించవలసిన అవసరాన్ని కమిషన్ గుర్తిస్తున్నది. దీనిలో శాస్త్రీయ విజ్ఞానమే మార్గదర్శకంగా వుండాలి. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయటానికి నిధులను సమ కూర్చుకోవాలని కమిషన్ అంగీకరిస్తున్నది. అయితే నిధుల భారమంతా వ్యవసాయరంగమే భరించాలన్న చింతనతో ఏకీభవించటం లేదు. దేశ ఆర్థిక నిర్మాణానికి నిధులు సమకూర్చుకోవటంలో భాగంగానే దీనిని చూడాలి. మార్కెట్టు ఆధార వ్యవస్థలో మార్కెట్టు శక్తులకు పూర్తి స్వేచ్ఛ కాకుండా అదువు వుంటేనే సామాజిక బాధ్యతను నెరవేర్చగలవు. లేదంటే ప్రపంచీకరణ నేపథ్యంలో బహుళజాతి కంపెనీలకు ఆధిపత్యం వస్తుంది. మనదేశ, సామాజిక అవసరాలను ఇవి పాటించవు.

ప్రతి ఏడాది ఖర్చుల ప్రాతిపదికగా నీటి తీరువాను నిర్ణయించటానికి జి.ఓ.ఎం.ఎస్ నెం. 252 ది. 18-12-97 ద్వారా నీటి ఛార్జీల సమీక్షా కమిటీ ఏర్పాటుకు కమిషన్ అభ్యంతరం తెలుపు తున్నది. ఎందుకంటే డబ్ల్యూటిఓ ఒప్పందం నేపథ్యంలో ఈ రకపు విధానంవల్ల సాగునీటితో సాగే వ్యవసాయం లాభసాటి కాకుండా పోతుంది. ద్రవ్యోల్బణం రీత్యా ఛార్జీలను సవరించటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ప్రాజెక్టు నిర్వహణ, యాజమాన్య వ్యయం, ఆయకట్టు నిర్వహణ వ్యయం"రాబోయే అవసరాలకు రిజర్వులు" కోసం ఛార్జీలను నిర్ణయించటం వ్యవసాయ రంగంపై పెను భారాన్ని మోపుతుంది.

పెంచిన విద్యుత్తు రేట్లను రైతులే భరించాలని ప్రపంచబ్యాంకు సూచిస్తున్నది. ఈ విధానం రైతాంగాన్ని పెనుబాధలకు లోనుచేస్తుంది. దేశానికి నష్టదాయకం కనుక ఈ మొత్తం విధానాన్ని పునస్సమీక్షించాలని కోరుతున్నది.

పంటల భీమా

కమిషన్ పర్యటనలో రైతులలో ఎక్కువ మందికి పంటల భీమా పథకం గూర్చి తెలియదని దృష్టికి వచ్చింది. కనుక విస్తృత ప్రచారంతో రైతు లందరికి అందుబాటులోకి తేవాలి. ఈ పథకంలో పారదర్శకత పెంచేందుకు శాంపిల్ సేకరణ, దిగుబడుల అంచనాలను సరళీకరించాలి. జనరల్ ఇన్సూరెన్సు కంపెనీలు వ్యవసాయ భీమా కార్పోరేషన్‌ను ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రభుత్వ భీమా సంస్థలు తప్పు కుంటున్నందున, ఈ కార్పోరేషన్ భీమా ప్రీమియంను పెంచివేస్తాయి. కనుక బలహీన సెక్షన్లకు, పంటలకు భీమాప్రీమియంలో ప్రభుత్వం సబ్సిడీ యివ్వాలని కమిషన్ సూచిస్తున్నది.

పరిశోధనారంగ మద్దతు

ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాలలో బిటి కాటన్ విత్తనాలను పెద్ద ఎత్తున, మోస పూరితంగా ఒక ప్రైవేట్ కంపెనీ (బహుళజాతి విత్తన కంపెనీ మాన్‌శాంటో శిఖండి) అమ్మిన తీరు శాసనబద్ద పౌరులందరి కళ్ళు తెరిపిస్తుంది. నైతికపాలనా

విలువలు దిగజారిన, అవినీతి పెచ్చరిల్లిన నిర్ణయాధికార యంత్రాంగంలో బహుళజాతి కంపెనీలకుండే పలుకుబడిని తక్కువ అంచనా వేయరాదు. సామాజిక స్పృహ కలిగిన శాస్త్రజ్ఞులు, సామాజిక కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ ప్రైవేటు కంపెనీల విత్తనాలను స్వల్పకాల, దీర్ఘకాల, ప్రభావాల దృష్టితో స్వతంత్రంగా పరిశీలించాలని కమీషన్ గట్టిగా అభిప్రాయపడుతున్నది. విత్తన రకాల్ని, నాణ్యతనూ కమిటీ సర్టిఫై చెయ్యాలి. రైతులను అధిక రేట్లతో పిండుకోకుండా, వీటి ధరలను నియంత్రణ చేయాలి.

రైతుల కొత్త అవసరాలకు స్పందించే విధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలను పునర్ వ్యవస్థీకరించాలి. వ్యవసాయ పరిశోధనలకు మదుపును పెంచాలి. తక్కువ ఉత్పాదకత, అధిక ఉత్పత్తి వ్యయం ప్రధాన సమస్య కనుక పరిశోధనా రంగానికి పెట్టుబడి మదుపును పెంచాలి. విశ్వవిద్యాలయం రైతుల అవసరాలు తీర్చటంతో పాటుగా మొత్తం రాష్ట్ర అవసరాలను కూడా దృష్టిలో వుంచుకోవాలి. డబ్ల్యూ టిఓ దుష్ఫలితాలను ఎదుర్కొనేందుకు వ్యవసాయ రంగానికి తగిన వ్యూహాలను రూపొందించాలి.

సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి

రైతులకు సాంకేతిక పరిజ్ఞాన మందించటంలో అఖాతాలు, నాణ్యతలేని కల్తీ ఎరువులు, విత్తనాలు, మందులు రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కొనసాగడానికి ముఖ్యకారణాలు. సాంకేతిక పరిజ్ఞాన మందించటానికి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. కనుక నేలను బట్టి చేసే నిర్దిష్ట సూచనలు రైతుల కందటం లేదు. ఫలితంగా వారు ప్రచారమాధ్యమాలలో వచ్చే సాధారణ సమాచారం పైనో, ఉత్పాదకాల వ్యాపారులిచ్చే సమాచారం పైనో ఆధారపడుతున్నారు. ఇది నిష్ఫల వినియోగానికీ, అధిక వ్యయానికి దారి తీస్తున్నది.

సాంకేతిక పరిజ్ఞానం ప్రభుత్వ రంగంలోనే వుంది గనుక దీనిని అందించే విధానం కూడా ప్రభుత్వరంగంలోనే వుండాలి. ప్రచార సాధనాలు, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని చిన్న రైతులకు అందుబాటులోకి తేవాలి. ఈ విషయంలో ప్రభుత్వ రంగాన్ని తగ్గించి, కార్పోరేట్ రంగాన్ని పెంచుతున్న ప్రభుత్వ విధానం రైతాంగానికి మంచి చేయకపోగా హానికరమైనది. కనుక ప్రభుత్వ విధానాన్ని మార్చుకోవాలి. వ్యవసాయ విశ్వ విద్యాలయాలు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొన్నప్పుడు, దాని విస్తృత వినియోగానికి తగిన ప్రణాళికను కూడా రూపొందించాలి. బహుళజాతి కంపెనీలతో సహా ప్రైవేటుకంపెనీల సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని కోణాలనుండి విశ్వ విద్యాలయం పరీక్షించుకోవాలి.

చిన్న కమతాల సమస్యలు

చిన్న కమతాలు - కాంట్రాక్టు సాగుపై ఆంధ్ర ప్రదేశ్ అవగాహననూ, విధానాన్ని సమీక్షించాలని కమీషన్ సూచిస్తున్నది. చిన్న రైతులకు మద్దతుగా సేవా సహకార సంఘాలను ఏర్పాటు చెయ్యాలి. ఈ అవగాహనతో అన్ని సంబంధిత ప్రభుత్వశాఖలనూ, విధానాలను పునర్నిర్మించాలి. ఈ మేరకు విజన్ 2020నీ, వ్యవసాయ విధానాన్ని మార్పు చేయాలి.

వ్యవసాయ కూలీల దుస్థితి

వ్యవసాయ కూలీలను దుస్థితి నుండి ఆదుకునేందుకు ఈ క్రింది చర్యలు తీసుకోవాలని కమీషన్ సూచిస్తున్నది.

1. అమలు పరిచే పాలనా యంత్రాంగాన్ని ఏర్పరచి కనీస వేతనాలు చెల్లించేలా చూడాలి.

2. యంత్రాలు, కాంట్రాక్టరు లేకుండా, స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని పనులు లేని సమయంలో శ్రమ శక్తిని వినియోగించే అభివృద్ధి పనులు చేపట్టాలి. పనికి ఆహార పథకాన్ని పటిష్టంగా అమలు జరపవలసిన అవసరముంది.

3. వ్యవసాయ కూలీలకు మద్దతుగా మిగులు భూములనూ, బంజర్లనూ కేటాయించి సహకార సేద్యాన్ని ప్రోత్సహించాలి.

4. సామాజిక భద్రత కలిగించేందుకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలనూ, ఇతర అత్యవసర సరుకులను వ్యవసాయ కూలీలకు చౌకధరలకు సరఫరా చేయాలి.

5. ఉచిత గృహవసతి కల్పించాలి.

6. వ్యవసాయ కూలీలకు వృద్ధాప్య పెన్షను, ఆరోగ్య రక్షణ, మరణ సందర్భంలో సహాయం వంటి చర్యల కొరకు సమగ్ర సంక్షేమ పథకాన్ని రూపొందించాలి.

ప్రధాన నిర్ధారణ

రైతుల ఆత్మహత్యలూ, ఇతర రూపాలలో దుస్థితీ కొనసాగటానికి కారణాలు స్వావలంబన నుండి వ్యవసాయాన్ని ప్రపంచీకరించే అవగాహన వైపుగా మార్పని కమీషన్ ప్రధాన నిర్ధారణ. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యూటిఓల వత్తిడితో అమలవుతున్న సరళీకరణ, వ్యవస్థాగత సర్దుబాటు విధానాల ఫలితమే నేటి లోతైన సంక్షోభం.

సరళీకరణ, వ్యవస్థాగత సర్దుబాట్లతో పాటుగా భారత వ్యవసాయాన్ని ప్రపంచీకరించే ప్రస్తుత విధానాలు కొనసాగించితే రాగల సంవత్సరాలలో వ్యవసాయాధారిత జనాభా కెదురయ్యే కష్టాల విశ్వరూపపు కాలిగోరును మాత్రమే రైతుల ఆత్మహత్యలు, ఇతర సంక్షోభపు రూపాలూ చూపుతున్నాయి.

గతంలోని స్వయంపోషక విధానాలను పూర్తిగా తిరగతోడాలని ప్రపంచబ్యాంకు డాక్యుమెంట్లు స్పష్టంగా సూచిస్తున్నాయి. ఇది వ్యవసాయ రంగంలోని ప్రస్తుత సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తుంది. వ్యవసాయం పై ఆధారపడిన జనాభాను, ప్రత్యేకంగా చిన్న, నన్నకారు రైతులనూ, వ్యవసాయ కూలీలనూ దారిద్ర్యంలో ముంచుతుంది; నాశనం చేస్తుంది. వ్యవసాయాధారిత కొద్దిపాటి జనాభాకు రక్షణ కల్పించే అనేక చర్యలను అభివృద్ధి చెందిన దేశాలు అమలు జరుపుతుండగా, తద్వైతిరేకమైన విధానాన్ని భారత్‌లో అనుసరిస్తూ భారత వ్యవసాయరంగాన్ని అసమాన అన్యాయ ప్రపంచ పోటీకి గురిచేస్తూ, భారత రైతులకు రక్షణ చర్యలు తీసుకోవటంలేదు.

కనుక ఈ క్రింది అంశాలను అందరూ గమనించాలని కమీషన్ కోరుతున్నది.

1. ప్రజల పట్ల బాధ్యత గల ఏ ప్రభుత్వమైనా ఈ కమీషన్ సూచనలను సీరియస్‌గా తీసుకొని వ్యవసాయ రంగ సంక్షోభాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటుందని ఆశిస్తాము. దీనికి తగిన స్థితిని భారత రైతాంగం సృష్టించాలి.

2. ప్రపంచ మార్కెట్టు శక్తుల జోక్యం సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి వుంటుంది. దీని ప్రభావం నిపుణులైన శాస్త్రజ్ఞులకు కూడా వెంటనే అంతు పట్టదు. కనుక నిపుణులైన శాస్త్రజ్ఞులతో కమిటీని వేసి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశ ప్రయోజనాల దృక్కోణంలో నిరంతరాయంగా అంచనా వేయాలని సూచన.

3. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో ఆమోదించిన రక్షణలైనా పూర్తి స్థాయిలో కల్పించాలి.

4. కార్యక్రమాల అమలు రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా వుండాలి. వ్యవసాయం, గ్రామీణ ఆర్థికంలో ప్రస్తుత విధానాలను, ఈ కమీషన్ సూచనలను దృష్టిలో వుంచుకొని మార్పు చేయాల్సిన అవసరముంది. ★

వివిధ జిల్లాల్లో నిపుణుల కమీషన్ పర్యటనలు

విజయనగరం,శ్రీకాకుళం జిల్లాల్లో :


కమీషన్ సభ్యులైన ప్రొ॥ కె.ఆర్. చౌదరి గారు, ప్రొ॥ వేణుగోపాల్ రావు గారు 5-10-2001 విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని మండలాల్లోని గ్రామాలను పర్యటించి రైతాంగానికి సంబంధించిన అనేక సమ్యలను తెలుసుకున్నారు. వారితోపాటు రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్రఅధ్యక్షులు ఝాన్సీ, రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి తాండ్ర ప్రకాశ్, రైతుసంఘం రాష్ట్రనాయకులు బి.తులసీదాస్ గారలు కూడా గ్రామాల్లో పర్యటించినారు.

ఈ కమీషన్ విజయనగరం జిల్లాలోని తెర్లాం మండలంలోని చుక్కవలస గ్రామాన్ని సందర్శించినపుడు ఈ ప్రాంతంలో గత 3 సంవత్సరాల నుండి వర్షాలు లేకపోవటంతో పంటలులేవని, నెలకు కేవలం రెండు రోజులే పని దొరుకుతున్నదని, ఈ గ్రామంలో పురుషులు ఒక్కరు కూడా లేరని, అందరూ కృష్ణ గోదావరి జిల్లాలకు వలస వెళ్ళిపోతున్నారని వున్న ప్రజలు చెప్పారు. ఈ సంవత్సరం కూడా వ్యవసాయపనులు సరిగా దొరకకపోవటంతో మేరంగి ప్రాంతానికి వలస పోయారని చెప్పారు. కూలీ రేట్లు ఆడవాళ్ళకు 15 రూ॥లు అయితే మగవాళ్ళకు 25 రూ॥లు అని చెప్పారు. ఇప్పటి నుండే త్రాగటానికి నీరు దొరకటం లేదని, రోజూ 3 కి.మీ. వెళ్ళి ఒక బిందెడు నీళ్ళు తెచ్చుకోవాల్సి వస్తుందని చెప్పారు. తమ గ్రామంలో కోడళ్ళు పుట్టింటి నుండి తెచ్చుకున్న గొర్రెలు, మేకలు కూడా అమ్మి వేసుకోవాల్సిన దుస్థితిలో వున్నామని చెప్పారు. గత సంవత్సరం కూలీపనుల కోసం కృష్ణాజిల్లా జొన్నపాడు గ్రామానికి వెళితే అక్కడ ట్రాక్టరు ప్రమాదంలో ఈ గ్రామంలో వారు ముగ్గురు ఆడవాళ్ళు చనిపోయారని, ఆ అనాధలైన పసిపిల్లలను పెంచవలసిన బాధ్యత వృద్ధులపై పడిందని రోదిస్తూ కమీషన్ సభ్యులతో తమ కష్టాలను వెల్లడించుకున్నారు. ఈ గ్రామాలలో ఈనాటికి పనికి ఆహారపథకాలేవీ అమలుకావటం లేదని వివరించారు. తాము కనీసంగా ప్రాణాలతో బ్రతకాలంటే ప్రతి కుటుంబానికి రోజుకు 3 కేజీల బియ్యం (పనికి ఆహారపథకం క్రింద) ఇస్తే సరిపోతుందని చెప్పారు.

ఈ కమీషన్ శ్రీకాకుళం జిల్లాలోని రాజాం మండలంలోని కంచారం అనే గ్రామాన్ని సందర్శించింది. ఈగ్రామంలో చిన్న, సన్న కారు రైతాంగం, చేతివృత్తులవారు ప్రధానంగా వున్నారు. గత 3 సంవత్సరాల నుండి వర్షాభావంతో పంటలు పండని స్థితి వుందని చెప్పారు. పాడి పరిశ్రమ మీద ఆధారపడి బ్రతుకుతున్న వారికి గత నెలనుండి పాలధర లీటరుకు రూ॥ 1.25 తగ్గిపోయిందని, పశువులకేసే దాణా ధర పెరిగిందని చెప్పారు. చేనేత వృత్తుల వారు తమ గోడును వెళ్ళగక్కారు. ప్రభుత్వం తక్షణ సహాయం చేయకపోతే తాముకూడా ఆత్మహత్యలు చేసుకోవాల్సిన స్థితి వుంటుందని చెప్పారు. ఇక ఈ గ్రామ డ్వాక్రా గ్రూపులు 30 వున్నాయని, ఇందులో 3 గ్రూపులకు తప్ప దేనికీ ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ (matching Grants) ఇవ్వకపోవటంతో ఆర్థికంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. కొత్తగా మీటర్లు ఇచ్చిన ప్రతివారికి రూ॥ 400/- కరెంటు బిల్లు వస్తుందని, ఈ బిల్లులు కట్టటం ఎంతో కష్టతరంగా వుందని, కరెంటు ఆఫీసుకు ఎన్ని మార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని చెప్పారు.

ఎన్నికయిన సర్పంచ్‌ల ద్వారా అమలు కావలసిన పనికి ఆహారపథకం తమ గ్రామంలో ఏమాత్రం అమలు జరగటం లేదని చెప్పారు. అధికారపార్టీ సభ్యులకే ఆ కొద్దిపాటి పని కల్పిస్తున్నారని చెప్పారు. ఈగ్రామంలోను, ఈ ప్రాంతంలోను శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టి తోటపల్లి వద్ద నాగావళిపై రిజర్వాయర్‌ను కట్టాలని, ఇదే తమ కోరిక అని వివరించారు. రాజాంలోని ఆర్‌అండ్ బి గెస్ట్ హౌస్ వద్దకు కమీషన్‌ను కలవటానికి వచ్చిన ఈ ప్రాంతపు రైతు ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు కరువు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని తెలియచేశారు.

కమీషన్ ముందు ప్రజలు, రైతు సంఘాల నాయకులు ఈ రెండు జిల్లాల్లోను తక్షణ శాశ్వత కరువు నివారణ చర్యలు ప్రభుత్వం ఏ విధంగా తీసుకోవాలో అనుభవపూర్వకంగా వివరించారు. కమీషన్ తన పర్యటన అనంతరం శ్రీకాకుళం జిల్లాలోను, విజయనగరం జిల్లాలోను పత్రికా విలేకరుల సమావేశం జరిపి తమ పర్యటనలో పరిశీలనలోకి వచ్చిన అంశాలను వివరించారు. అనంతరం విజయనగరం జిల్లా అధికారులను కలిసి కరువు నివారణకు తక్షణ చర్యలను చేపట్టవలసిందిగా విజ్ఞప్తి చేసారు.



కమీషన్ సభ్యులు ప్రొ॥ కె. ఆర్. చౌదరి, వేణుగోపాల్, ఝాన్సీ, తులసీదాస్ తదితరులు

అనంతపురం జిల్లాలో

అత్యంత వర్షపాతం తక్కువ గల అనంత పురం జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఒట్టిపోయిన చెరువులు, బీడుబడ్డ భూములు, ఎండినపైర్లు, ఇంకి పోయిన భూగర్భ జలాలు, బక్కచిక్కిన మూగజీవాలు జిల్లాలో ఎక్కడ చూసినా ఇలాంటి హృదయ విదారక దృశ్యాలే. కరువు పరిస్థితులు మూలంగా రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడు తున్నారు. పంటలు పండక, పెట్టుబడి రాక, చేసిన అప్పులు తీరక, బ్రతుకు మార్గం కాన రాక దిగాలుపడి వున్నారు. ఒక్క వేరుశెనగ రైతులే వెయ్యికోట్లకు పైగా నష్టపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో అప్పులవాళ్ళ వత్తిడి, బ్యాంకు అధికారుల వేధింపులను తట్టుకోలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో అనేకమంది రైతులు ఆత్మహత్య కు పాల్పడు తున్నారు. రైతుల ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులను కావాలని విస్మరించిన చంద్రబాబు ప్రభుత్వం, రైతులు మానసిక వ్యాధితో ఆత్మ హత్యలు చేసుకుంటున్నారని, రైతు మరణాలను అపహాస్యం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో జిల్లాలోని కరువు పరిస్థితులు, రైతుల ఆత్మహత్యలకు కారణాలను వెలుగులోకి తేచ్చేందుకు ప్రా॥ కె.ఆర్. చౌదరి, ప్రా॥ వేణుగోపాల రావుల ఆధ్వర్యంలో ఏర్పడిన కమీషన్ జిల్లాలోని ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లో 25-9-2001 న పర్యటించింది. ఈ కమీషన్ వెంట రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి సి. నాగరాజు, వై. విశ్వేశ్వరరెడ్డి, సి.పి.ఐ నాయకులు కె.వి. రమణ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు మండలం చిన్నంపల్లిలో సెప్టెంబర్ 10న ఆత్మహత్య చేసుకున్న తిమ్మన్న కుటుంబాన్ని ముందుగా పరామర్శించింది. ఆయన భార్య నారాయణమ్మ మాట్లాడింది. కమీషన్ సభ్యులతో నారాయణమ్మ మాట్లాడుతూ బ్యాంకు అప్పులు, సొసైటీ అప్పులు తీర్చలేక తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని కమీషన్‌కు వివరించింది. కరువు-పంటలు పండక పోవడం వలన తెచ్చిన అప్పులు తీర్చేమార్గం కానరాక, అప్పులవాళ్ళ వేధింపులతో మనసు విరిగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పింది. "ప్రభుత్వం నుండి ఏదైనా కోరుకుంటున్నావా" అని కమీషన్ ప్రశ్నించగా బ్యాంక్, సొసైటీ అప్పులు రద్దుచేస్తే చాలని చెప్పింది.

తర్వాత కమీషన్ రాప్తాడు మండలంలోని లింగనపల్లి గ్రామములో ఆత్మహత్యలు చేసుకున్న పక్కీరారెడ్డి, నారపరెడ్డి కుటుంబాలను కలుసుకుంది. ఈ సందర్భముగా పక్కీరారెడ్డి భార్య రామ లక్ష్మమ్మ, కొడుకులు భాస్కరరెడ్డి, ఈశ్వరరెడ్డిలు కమీషన్‌తో మాట్లాడుతూ, వరుసగా ఐదారు సంవత్సరాలు కరువు రావడం వలన పంటలు పండక అప్పులు తీర్చటానికి భూములు అమ్మినా అప్పులు తీరలేదనిచెప్పారు. ఒకవైపున అప్పుల వాళ్ళ వత్తిడి, వేధింపులు;మరొకవైపు బ్యాంకు వాళ్ళ నోటీసు వేధింపులు ఎక్కువై ఆ అవమానం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొన్నట్లు పేర్కొన్నారు. నారపరెడ్డి భార్య నారాయణమ్మ మాట్లాడుతూ తెచ్చిన అప్పులు తీర్చేమార్గం లేకనే తన భర్త ఆత్మహత్య చేసు కొన్నట్లు వివరించింది. ప్రభత్వం 5 వేలు మాత్రమే సహాయం అందించిందని, అప్పులు బాధ అలాగే ఉందని చెప్పింది.

తదుపరి కమీషన్ 26వ తేదీన అనంతపురం ఉపాధ్యాయ ఆఫీసులో జిల్లా లోని వివిధ ప్రాంతాల్లో ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబ సభ్యులను కలుసుకొని ఆత్మహత్యలకు కారణాలను తెలుసు కున్నారు. వీరంతా కరువు- పంటలు లేక అప్పులు ఎక్కువై, తీర్చేమార్గం కానరాక ఆత్మహత్యలు శరణ్యమయ్యాయని చెప్పారు.

కమీషన్ సభ్యులు కె.ఆర్. చౌదరి, వేణు గోపాలరావులు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ, జిల్లాలో కరువు పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, రైతులు అప్పుల ఊబి నుండి బయట పడలేని పరిస్థితుల్లో ఉన్నారని, ఆత్మహత్యల నివారణకి రైతుల అప్పులు రద్దు చేయటమే పరిష్కారమని చెప్పారు. ఈ విషయాలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళి, బాధిత కుటుంబాలకు సహాయం అందించ మని కోరతామని చెప్పారు. కమిటీ సభ్యుల వెంట ఢిల్లీ నుండి వచ్చిన జర్నలిస్టు-పరిశోధకుడు పరుశురామ్‌రాయ్ కూడా ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాల బాధలు అడిగి తెలుసుకున్నారు. ★

గువ్వల చెన్నా

- ప్రవీణ్

నెత్తుటి బొట్లు ఇత్తులు నల్లి
సెమటసుక్కల నీరును పెట్టి
తల్లి భూమిని నమ్ముకొని
ప్రజలకు తిండిని పెట్టే అన్నో
రాకాసి మబ్బు సూర్యుని కమ్మిందా - ఓ గువ్వలచెన్నా
బోరున వాన జోరున కురిసిందా - ॥
ఏళ్ళూ ఊళ్ళూ ఏకం కురిసిందా - ॥
తుఫాను అంతా తుడిసే పెట్టిందా - ॥
గోదావరి గంగా గట్లను తెంచిందా - ॥
వరద పొంగు ఊళ్ళను ముంచిందా - ॥
పిల్లాపాపా కొట్టుకు పోయేరా - ॥
ముసలీ ముతకా మునిగిపోయేరా - ॥
పంటలు పశువులు మట్టిలో కలిశాయా - ॥
మామా మాకూ విరిగిపోయాయా - ॥
కూటికిలేక కుమిలిపోయావా - ॥
ఓ ..... ఓ ఓ ..... ఓ ..... ఓ ....
నీ గూడు ఏటికట్టా . . . ?
నీ కూడు పాటి మట్టా . . . ? ॥నెత్తుటి॥
రాయలసీమ రత్నాల సీమేరా - ఓ గువ్వలచెన్నా
నుక్క నీరు దొరకక పోయేరా - ॥
బావిలో నీరు ఇగిరే పోయెరా - ॥
బంగరు భూమి బీటలు వారిందా - ॥

మంద పశువులకు మేతే కరువాయే - ॥
మంది ఎవరికీ గంజే లేదాయే - ॥
నాలిక తడిసే నీళ్ళే లేవాయే - ॥
నీ బతుకు ఆకలీ చావాయే - ॥
కుండలు పట్టెలు మూటలు కట్టేవా - ॥
కన్న ఊరిని వదిలిపెట్టేవా - ॥
పాట్టసేత బట్టి నీవూ - ॥
పాలిమేర దాటి పోయేవా - ॥
ఓ ..... ఓ ఓ ..... ఓ ..... ఓ ....
ఇది కరువు బతుకురన్నా
ఇక మెతుకు దొరకదన్నా . . . ॥నెత్తుటి॥
తెలుగు గంగ గంగలో కలిపిందా - ఓ గువ్వలచెన్నా
తల్లి గోదారి పొంగే పారలిందా - ॥
కరువుకి వరదకి కారణమేమన్నా - ॥
కర్మం, గిర్మం కానేకాదన్నా - ॥
దోపీడీ వేతల నిర్లక్ష్యమేనన్నా - ॥
రాజకీయ రాక్షసులందరూ - ॥
కీడుచేసే కీచకులంతాను - ॥
ప్రజల బాధ తీర్చరోరన్నా - ॥
శవాల్ని పీకే రాబందులన్నా - ॥
గోతికాడ వక్కలోరాన్నా - ॥
దీనికి కారణం వాళ్ళే ఓరాన్నా - ॥

ఓ ..... ఓ ఓ ..... ఓ ..... ఓ ....
వీవు విజం తెలుసుకోరా
వీ భుజం కలపరార ॥నెత్తుటి॥
విశాలమైన ఈ భారతంలో - ఓ గువ్వల చెన్నా
వదీ వదాలు ఎన్నో ఉన్నాయి - ॥
గల గల పాగే గంగమ్మ మండీ - ॥
కలకల వవ్వే కావేరి వరకూ - ॥
వదులవ్వింటివి కలపాలోరన్నా - ॥
వీటికి కరువురానే రాదన్నా - ॥
అవసరమైన ప్రాంతాలలోనా - ॥
ఆవకట్టలు వేయాలరన్నా - ॥
వరదలు ఇంకా రానే రావన్నా - ॥
బాధలు బెంగలు తీరునోరాన్నా - ॥
ఈ విషయాలన్ని . . .
ప్రజలందరికి తెలియచెప్పన్నో - ఓ గువ్వల చెన్నా
ఆశయ పాధవకు అడుగువెయ్యన్నో ॥
ఓ ..... ఓ ఓ ..... ఓ ..... ఓ ....
ఈ పాట
పల్లెల్లో పాడుదాము
పట్నాలు పాకుదాము
దేశాన్ని లేపుదాము
దిశలన్ని కలుపుదాము

"గ్లోబలైజేషన్ ప్రారంభమైన నాటి నుండి రైతాంగ సమస్యలు పెరిగాయి"

"గ్రామీణ రుణభారం"పై రాష్ట్ర స్థాయి సింపోజియం

తీవ్ర కరువు పరిస్థితులు, పంటనష్టం, గిట్టుబాటు ధర-రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో గ్రామీణ రుణభారంపై మార్చి 6,7 తేదీలలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో రాష్ట్ర సింపోజియం నిడమర్రులో జరిగింది. దీనికి సంస్థ రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య అధ్యక్షత వహించారు. 46 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సింపోజియమ్‌లో ముందుగా డా॥ బి.డి శర్మ (ఛైర్మన్, భారత్ జన్ ఆందోళన్) మాట్లాడుతూ, మానవాళి ఎదుర్కొంటున్న సమస్యల్లో భాగమే రైతాంగ సమస్యలు. గ్లోబలైజేషన్ ప్రారంభమైన నాటి నుండి రైతాంగ సమస్యలు ఎక్కువయ్యాయి. వ్యవసాయం వత్తికాదు. ఇదొక జీవనవిధానం. పరిశ్రమలు మానవ సంబంధాలతో ముడిపడి ఉండేదికాక, లాభం కోసం ఉంటుంది. సమాజాన్ని ఎవరూ తయారుచేయలేదు. ఇది కుటుంబం, సమాజంగా ఉంటుంది. వనరుల మీద పట్టు, ఆధిపత్యం ఉండాలి. అలా కాకుండా దాన్ని మానవ సమాజం అనలేము.

బ్రిటీషువారు రాకముందు మనదేశం ఈ పరిస్థితుల్లోనే ఉండేది. భూమి గ్రామ సమిష్టికి చెంది ఉండేది. భూమి స్వయం సమృద్ధి, స్వయంపాలితంగా ఉండేది. కొద్ది తేడాలు ఉండేవి. రాజుకి 1/6 వంతు పంట యివ్వటం జరిగేది. సమాజం అదుపులో మొత్తం భూమి, ఇతర వనరులన్నీ ఉండేవి.

భారతదేశానికి బ్రిటీషు సామ్రాజ్యవాదులు రాక ముందు అన్నిరకాల వనరులతో ఉచ్ఛదశలో దేశం ఉంది. మార్కెట్‌లో రత్నాలు, బంగారం అమ్ముకొన్నదేశం. అంత ధనికదేశం కాబట్టే బ్రిటీషువాడి కన్నుపడింది. బ్రిటీషు సామ్రాజ్యవాదులు దేశాన్ని ఆక్రమించుకొన్న తర్వాత భూమిని, వనరులను ప్రభుత్వపరం చేశారు. భారత రాజులను ఓడించిన బ్రిటీషు వాళ్ళు గిరిజనులను ఓడించలేక పోయారు. అక్కడ రాజులు లేరు. సమిష్టి ఉంది. మొత్తం జాతి బ్రిటీష్ వాళ్ళకు వ్యతిరేకంగా పోరాడిందని చెప్పారు. బ్రిటీషువాడు భూమిపై మన రైతు హక్కును తొలగించాడు. రైతు పండించేవాడుగా మిగిలి పోయాడు. రైతులపై పన్నులు విపరీతంగా విధించారు. 85 శాతం ధాన్యం అమ్మినా రైతు పన్ను తీరేది కాదు. ఫలితంగా రైతు భూమిని వదులుకోవాల్సి వచ్చేది. పన్నులు చెల్లించకుంటే కేసులు, నిర్బంధం, జైలు రైతులకు తప్పేదికాదు.

బలవంతంగా బ్రిటీషు సామ్రాజ్యవాదులు రైతుల నుండి భూమిని గుంజుకోవటం వలన క్షామాలు ఏర్పడ్డాయి. బ్రిటీష్ వాళ్ళు ఎంత దోచుకున్నా కరువులు వాళ్ళను కదిలించి వేశాయి. 1883 -84లో వ్యవసాయదారుల అప్పు చట్టం చేశారు. రైతులు తీసుకున్న అప్పు ఈ చట్టం ప్రకారం 35 సంవత్సరాల లోపు తీర్చాలి. ఆ తరం పూర్తి అయ్యేదాకా ఆ అప్పులపై చక్రవడ్డీ ఉండేది కాదు. అసలుకు మించి వడ్డీ ఉండరాదని చట్టం పేర్కొందని వివరించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఈ చట్టం అమలులోనే ఉంది. కానీ భారత పాలకులు దీన్ని అమలుజరపటం లేదు. ఆరు నెలలకొకసారి చక్రవడ్డీ విధిస్తున్నారు. ఫలితంగా అప్పుకన్నా వడ్డీ ఎక్కువ అయిపోతున్నది. ఫలితంగా రైతులు అప్పులు తీర్చలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. బ్యాంకులు రైతుల ఆస్తులను జప్తు చేస్తున్నాయని, బ్యాంకులు పారిశ్రామిక రంగం కోసం ఏర్పడినవి తప్ప వ్యవసాయరంగానికి కాదని వివరించారు.

రైతాంగం ఎక్కువ పంటకోసం ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, యంత్రాల వాడకం ఎక్కువ అయ్యిందని, దీన్ని సామ్రాజ్యవాద కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకున్నారని చెప్పారు. రైతుకి వ్యవసాయ ఖర్చు పెరిగి, గిట్టుబాటు ధరలేక అప్పులకు వడ్డీలు పెరిగి రుణభారం పెరిగిపోయిందని, దీన్నుండి రైతు బయటపడలేక పోతున్నాడని, జీవన విధానంగా ఉన్న వ్యవసాయం పరిశ్రమగా మారుతూ వుందని వివరించారు.

గ్రామీణ సంవద వట్టణాలకు తరలి పోతుందని, పారిశ్రామిక రంగం గ్రామీణసంపదలను కొల్లగొడుతుందని, వ్యవసాయ కూలీలకు, పరిశ్రమల కార్మికులకు మధ్య కూలి వ్యత్యాసం చాలా తేడాల్లో వుందని, ఈ అసమానతను తొలగించాలని చెప్పారు.

ముస్లిమ్‌లు రాకముందు దేశం స్వతంత్రం, గ్రామరాజ్యాలు స్వతంత్రంగా వున్నాయనీ, ముస్లిమ్‌లు వచ్చిన తర్వాత దేశం బానిసత్వం, గ్రామాలు స్వతంత్రంగా వున్నాయనీ; బ్రిటీష్ వాడు వచ్చిన తర్వాత దేశం, గ్రామాలు రెండూ బానిసత్వంలోనే వున్నాయని చెప్పి ముగించారు.

అనంతరం గ్రామీణ రుణభారాలపై కృష్ణాజిల్లా, ప్రకాశం, నెల్లూరుజిల్లాల ప్రతినిధులు, తాము జరిపిన సర్వేలను వివరించారు. ముందుగా కృష్ణాజిల్లా ప్రతినిధులు గ్రామీణ వర్గ విభజన, కులాలు, రైతుల పంట ఖర్చు, వచ్చే ఆదాయం, పంట దిగుబడి, అప్పులు, వడ్డీల రూపం గురించి గ్రామాలవారీగా సర్వే చేసిన లెక్కలతో వివరించారు. పేద, మధ్యతరగతి రైతులు అప్పులు తీర్చడానికి ఉన్నకొద్దిపాటి ఆస్తులను అమ్మి వ్యవసాయ కూలీలుగా మారిన విధానాన్ని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ప్రతినిధి పల్నాడు ప్రాంతంలో పత్తిరైతు అప్పుల ఊబిలో ఏ విధంగా కూరుకుపోతున్నాడో వివరించారు. ప్రకాశంజిల్లా ప్రతినిధి కొత్తపట్నం ప్రాంతంలో ఉప్పురైతాంగం బడా వ్యాపారుల చేతుల్లో ఏ విధంగా బందీలుగా మారుతున్నారో వివరించారు. నెల్లూరుజిల్లా ప్రతినిధి రాపూరు ప్రాంతంలోని కరువుతో పీడించబడుతున్న రైతాంగ దుస్థితిని వివరించారు. అనంతపురం జిల్లా ప్రతినిధి ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతాంగ దుస్థితిని వివరించారు. వ.గోదావరి జిల్లా ప్రతినిధి ప్రగడవరం గ్రామంలోని వివిధ వర్గాల ప్రజల పరిస్థితిని వివరించారు.

అనంతరం కా॥ జస్వంతరావు (జనశక్తి, ఎడిటర్) మాట్లాడుతూ 1930లో దివి తాలూకా రైతు వ్యవసాయానికి పెట్టిన ఖర్చును తన డైరీలో వ్రాసుకొన్నారు. పండిన పంటలో సగం శిస్తులు, ఖర్చులకు పోగా, సగం రైతుకి మిగిలిందని చెప్పారు. ఇప్పుడు ఎకరాకి 40 బస్తాలు పండిస్తున్నా రైతు

అప్పులపాలౌతున్నారు. పెట్టుబడులు పెరిగి పోయాయని చెప్పారు. కొత్త వంగడాలు సామ్రాజ్య వాదులు ప్రవేశపెట్టటంతో ఎరువులు, పురుగు మందులకు వారికి మార్కెట్‌గా ఏర్పడిందని, పైరు పచ్చ విప్లవం రెండవ దశలో కోళ్ళ పాడి పరిశ్రమలు కమర్షియల్‌గా చేయబడ్డాయని వివరించారు.

సామ్రాజ్యవాదం ఇక్కడున్న సామాజికవ్యవస్థ ను బలోపేతం చేసి తన ప్రయోజనాలు కాపాడు కొంటుందని చెప్పారు. ఈ సమావేశంలో చెప్పిన రిపోర్టులనుబట్టి పారిశ్రామికరంగం, రైతు పండించే ఫలసాయాన్ని దోచుకోవటం ద్వారా పట్టణాలకు తరలిస్తుందని చెప్పారు. ఎరువులు, పురుగు మందులకు తన మీద ఆధారపడేటట్లు చేయటం ద్వారా ఇది జరుగుతుందని వివరించారు.

వ్యవసాయానికి యిచ్చే అప్పు 4 శాతం మించి వడ్డీ వసూలు చేయరాదు, చక్రవడ్డీ ఉండగూడదని చట్టాలు ఉన్నాయి. అప్పుపై 4శాతం వడ్డీ తీసుకోవాలి. అసలుకి మించి వడ్డీ ఉండరాదు. చక్రవడ్డీ వసూలు చేయరాదు. రైతు తిరిగి చెల్లించే మొత్తాన్ని మొదట అసలుకుజమచేయాలి. వీటిని రైతుల్లోకి తీసుకొని వెళ్లి కదిలించే కృషి చేయవచ్చు.

సామ్రాజ్యవాదం అత్యంత ప్రమాదకరంగా గ్లోబలైజేషన్‌తో ముందుకు వస్తున్నది. దీనికి వ్యతిరేకంగా పోరాట పద్ధతులను నిర్దిష్టంగా రూపొందించుకోవాలని చెప్పారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షు రాలు కా॥ ఝాన్సీ సింపోజియమ్‌ను ముగింపు చేస్తూ, ఇప్పుడు వచ్చిన రిపోర్టులు సమగ్ర సర్వేగా చెప్పలేమని ఇంకా లోతుగా, సమగ్రంగా అధ్యయనం చేయాలని చెప్పారు. ఇప్పుడు వచ్చిన సర్వే వివరాలు వచ్చిన మేరకు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్రలో ఏజన్సీ ప్రాంతాల్లో రుణగ్రస్తత వేరుగా ఉందని చెప్పారు. పాతప్యూడల్ పద్ధతులు ఇంకా చలామణిలో ఉన్నాయని, తెలంగాణ పరిస్థితి వేరుగా ఉంటుందని అన్నారు.

రాజ్యాంగపరంగా, చట్టపరంగా అప్పుల విషయంలో రైతాంగానికి కల్పించిన హక్కులు ఏమిటనేది సర్వే చేయాలని, ఈ రాజ్యాంగ పరిధిలోనే రుణభార విముక్తికి ఏ డిమాండ్‌లు రూపొందించి ప్రభుత్వాన్ని నిలదీయవచ్చో రైతులకు పరిష్కారం చూపేందుకు లోతుగా అధ్యయనం చేయాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ ఏ విధంగా జరుగుతుంది, ఉత్పత్తిలో వాటి పాత్ర ఎంత వరకు ఉందో స్టడీ చేయాల్సిన అవసరం వుందని చెప్పారు.

రెండు రోజులపాటు జరిగిన ఈ సింపోజియం ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయరంగానికి ముంచుకొస్తున్న ప్రమాదాలను, సగటు రైతుకు అప్పుల ఉచ్చు ఏ విధంగా బిగుస్తున్నదీ లోతుగా అర్థం చేసుకోవటానికీ, ఈ సమస్యపై మరింతగా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత వుందని ప్రతినిధులు భావించారు. ★

అప్పులు మేం తీర్చలేం

- ఉ. సాంబశివరావు


అప్పులు మేం తీర్చలేం - ఆందోళన సాగిస్తాం
శిస్తులు మేం కట్టలేం -పోరాటం సాగిస్తాం ॥ అ ॥

మొన్నటేడు ఉప్పెనొచ్చి - మొత్త మూడ్చుకెళ్ళింది
నిన్నటేడు తుఫానొచ్చి - మా చేలూ పండలేదు
మట్టిలోన బంగారం - పండాలని ఆశించి
మోరిచ్చిన సొమ్మంతా - పంట మీద ఎదపెడితే
పంట చేను పండలేదు - ఇంటిలోన గింజలేదు
చిల్లిగవ్వచేతలేదు - శిస్తులేడ గడతాము ॥ అ ॥

ఎరువురేటు పెరిగిపోయె - పురుగుమందు చుక్కలంటే
మంచి మందు దాచేసి - దొంగ మందులమ్ముతుంటే
దొంగ దొంగ ఒక్కటైతే -పట్టుకునే నాధుడెవడు ॥ అ ॥

కడుపు మండి ధాన్యాన్ని - వడిపీధిలో తగలబెడితె
ఆదుకునే నాధుడేడి ? ఆలకించినోడు ఏడి?
అయినకాడి కమ్ముకుంటె - అప్పుమూల తరగదాయె
తిండి మాట దేవుడెరుగు - తిప్పలవ్న తప్పలేదు
అప్పుమీద అప్పు పెరిగి -ముప్పు తిప్పలాయె బతుకు
అమ్మబోతె అడవిరన్న - కొనబోతే కొరివిరన్న ॥ అ ॥

తాతాలు బిర్లాలూ - ఓట్లు కోట్లు ఎగ్గొడితే
భూస్వాములు పెదబాబులు - దొంగలెక్క చూపెడితే
చూపి చూడనట్టుపోయి -పట్టి పట్టనట్లుండీ
బీదబిక్కి రైతాంగం - దొరికారా మీ దాడికి
అరువు మీద బరువేసి - అణగదొక్క జూస్తారా
దేశానికి తిండి బెట్టె -ఈ రైతే తిరగబడితె
తిరుగుబాటు వీరుడయ్యి - తిరగదోపి తీరుతాడు ॥ అ ॥



గ్రామీణ రుణభారంపై అవగాహన పత్రం

(జూన్ 10, 2002న నందిగామలో జరిగిన కృష్ణా జిల్లా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) సదస్సులో జిల్లా రైతుకూలీ సంఘం నాయకులు కామ్రేడ్ ముప్పాళ్ళ భార్గవశ్రీ వివరించారు)

గ్రామీణ ప్రజల మూల్గుల్ని పీల్చిపిప్పి చేస్తున్న 'రుణభార' సమస్య నానాటికీ తీవ్రరూపం దాల్చుతున్నది. ఈ సమస్య సుడిగుండం నుండి బయటపడలేని రైతాంగం ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. రాష్ట్రంలో 1998 నుండి ఇప్పటికి 700 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. తెలంగాణా జిల్లాలో 400 పైగా రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటే, ఓ అనంతపురం జిల్లాలో రైతుల ఆత్మహత్యలు రోజు వారీ వార్తలుగా మారుతున్న విషాదపరిస్థితి నెలకొంది. మరోవైపు రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన జిల్లాగా పిలువబడుతున్న కృష్ణాజిల్లాలో ఇప్పటికీ 13 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొని చనిపోయారంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో స్పష్టమౌతుంది. తెలంగాణా జిల్లాలో చేనేత కార్మికులతో పాటు ఎక్కువభాగం ప్రత్తి రైతాంగం ఆత్మహత్యలు చేసుకోగా, అనంతపురం జిల్లాలో ఎక్కువభాగం వేరుశెనగ రైతాంగం ఆత్మహత్యలు చేసుకొన్నారు. అయితే కృష్ణా జిల్లాలోని పశ్చిమ కృష్ణాలో ఎక్కువ భాగం ప్రత్తి రైతాంగం ఆత్మ హత్యలు చేసు కున్నారు. కొన్ని సీజన్లలో పంటలు పండక, మరికొన్ని సీజన్లలో పంటలు పండినా గిట్టుబాటు ధరలు రాక రైతాంగం నానాటికీ అప్పుల ఊబిలో కూరుకుపోతూ చివరికి ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. రైతాంగం పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. రైతాంగానికి గిట్టుబాటు ధరలు అందించటం మొదలుకొని చేపట్టిన చర్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి చేపట్టిన ఫలితంగానే రైతాంగం ఆత్మహత్యల వాతపడుతున్నారు. ఈ వాస్తవాల్ని రైతులోకానికి వెల్లడిచేసి, రైతుల దుస్థితికి ఆత్మహత్యలు పరిష్కారం కాదు; పోరాటమార్గం చేపట్టాల్సిన కర్తవ్యాన్ని తెలియ చేయటానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) కృష్ణాజిల్లా గత సంవత్సరం (2001 అక్టోబర్, నవంబర్ నెలల్లో) 'గ్రామీణ రుణ భారం' పై సర్వే కార్యక్రమాన్ని నిర్వహించింది. కరువు ప్రాంతాలుగా వున్న పశ్చిమ కృష్ణాలో పెక్కనూరు గ్రామాన్ని, మాగాణి ప్రాంతాలుగా వున్న తూర్పు కృష్ణాలో వి.రుద్రవరం గ్రామాన్ని, మాగాణి మెట్ట వనరులు కల్గిన ప్రొద్దుటూరు గ్రామాలను సర్వేచేయటానికి ఎంచుకొంది. మూడు గ్రామాల్లో సర్వే టీమ్‌లు నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం సాధ్యమైన మేరకు సమాచారాన్ని సేకరించాయి. వర్గ ప్రాతిపదిక ప్రకారం గ్రామంలో వ్యవసాయకూలీ, పేద-మధ్య తరగతి రైతు, కౌలు రైతు, ధనిక, భూస్వామ్య కుటుంబాలను, వర్గానికి 4-5 కుటుంబాలను ఎంచుకుని సేర్వే చేయటం జరిగింది. ఈ సర్వే రిపోర్టు ఆధారంగా 'గ్రామీణ రుణభారం' పై నిర్దిష్టమైన నిర్ధారణలకు కమిటీ రాగలిగింది. సర్వే రిపోర్టు ఆధారంగా కృష్ణాజిల్లాలో "గ్రామీణ రుణభారం" పై మీ ముందు 'అవగాహన పత్రాన్ని' సమర్పిస్తున్నాము.



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రా॥ కె. ఆర్. చౌదరి, ఎడమ నుండి మమ్మార్, డి. హరనాథ్, కె. కోటయ్య, మందా జార్జి, ఎస్. ఝాన్సీ, వై కేశవ రావు

నానాటికీ ఉరికంబాలకు చేరువవుతున్న పశ్చిమ కృష్ణా రైతాంగం

కృష్ణా జిల్లాలో సగభాగంగా వున్న పశ్చిమ కృష్ణా ప్రాంతం చాలా కరువు పీడిత ప్రాంతంగా వుంది. సాగర్ ఎడమకాలువకు చివరి భూమిగా ఈ ప్రాంతం మిగిలిపోయింది. సాగర్ నీరు రాక, వర్షాలు సకాలంలో పడక; పత్తి, మిర్చి తదితర పంటలు సరిగా పండక; ఎప్పుడైనా అన్నీ అనుకూలించి పంట బాగా పండితే సరైన గిట్టుబాటు ధరలు లభించక ఈ ప్రాంత రైతు చాలాకాలంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఏఏటి కాయేడు పంటలు బాగా పండుతాయనీ, గిట్టుబాటు ధర లభిస్తుందన్న ఆశతో జాతీయ బ్యాంకు, సహకార బ్యాంకు, ప్రైవేట్ వడ్డీల ఊబిలో రైతు కూరుకుపోతున్నాడు. చివరికి వడ్డీల భారం తట్టుకోలేక, కుటుంబాలను పోషించలేక ఈ ప్రాంత రైతు ఆత్మహత్యల ఉరికంబాల పైకి ఎక్కించ బడుతున్నాడు.

తాజాగా మే 7వ తేదీన ఆత్మహత్య చేసుకొన్న కంచిక చర్ల మండలం వెల్లంకి గ్రామ రైతు యర్రగొర్ల వెంకటేశ్వరరావు కుటుంబ పరిస్థితిని పరిశీలిస్తే ఈ ప్రాంత మొత్తం రైతాంగ పరిస్థితికి అద్దంపడుతుంది. గత నాలుగైదు సంవత్సరాలుగా ప్రకృతి సహకరించక పోవడం, రావలసిన సాగరు జలాలు సకాలంలో రాకపోవడం వలన వెంకటేశ్వర రావు ఈ ఏడాది మూడున్నర ఎకరాల్లో పత్తి, ఒకటిన్నర ఎకరాల్లో మిర్చి పంటలను సాగుచేశాడు. ఈ పంటలకు 70 వేల రూ. పైగా పెట్టుబడులు పెట్టాడు. ఈ ఏడాది పంటల దిగుబడులు బాగా తగ్గడంతో పత్తి 10 క్వింటాళ్ళు, మిర్చి 4 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. పంటలు సాధారణంగా పండినా పత్తి 3 ఎకరాలకు 30 క్వింటాళ్ళు, మిర్చి ఒకటిన్నర ఎకరాల్లో 15 క్వింటాళ్ళు పండాలి. ఆవిధంగా పండితే పత్తికి 60 వేల రూ॥లు, మిర్చికి 45 రూ॥లు వస్తుంది. మొత్తం లక్షా ఐదువేలు రావాల్సివుంటే కేవలం 27 వేల రూ॥ మాత్రమే వెంకటేశ్వరరావు చేతికి

వచ్చాయి. పంటల పెట్టుబడుల కోసం, పిల్లల చదువుకోసం అప్పుల భారం పెరిగిపోతూ వచ్చింది. గత మూడు సంవత్సరాల్లో కో-ఆపరేటివ్ బ్యాంక్ నుండి లక్ష రూపాయలు, ప్రవేట్ వడ్డీ వ్యాపారుల నుండి రెండు లక్షల రూ.లు, వెరసి మూడు లక్షల రూపాయలకు అప్పు పెరిగింది. సహకారబ్యాంకు సిబ్బంది, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వత్తిడి పెరిగి పోవటంతో అప్పులు తీర్చేమార్గం కనుచూపు మేరలో కన్పించకపోవడంతో వెంకటేశ్వరరావు చివరి కి ఆత్మహత్య చేసుకున్నాడు.

రెండు సంవత్సరాల క్రితం వీరులపాడు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన పాగాకు రైతు మట్టూరు మోహనరావు ప్రైవేట్ అప్పుల వాళ్ళ వేధింపులు తట్టుకోలేక, ఆత్మాభిమానం చంపుకోలేక చివరికి పురుగుమందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడు. 3 ఎకరాలు స్వంత పొలంవున్నా, 2 ఎకరాలు కౌలుకి చేస్తున్నా ప్రైవేట్ అప్పులఊబిలో కూరుకుపోయాడు. మోహన్‌రావు ఆత్మహత్య చేసుకున్న మరుసటిరోజే ఆయన భార్య తన భర్త అకాలమరణాన్ని తట్టుకోలేక చనిపోయిందంటే మధ్య తరగతి రైతుల జీవితా లతో రుణభారం ఎంతగా చెలగాటమాడు తుందో ఈ రైతు దంపతుల జీవితాలు సజీవ ఉదాహరణగా నిలుస్తాయి.

ఈ సంవత్సరం (22-1-02) జనవరిలో జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామంలో పత్తిరైతు దేవరగట్ల కృష్ణారావు ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. కష్టారావు కుటుంబానికి బ్యాంకు అప్పులు సుమారు 35 వేలు, ప్రైవేట్ అప్పులు బంగారం తాకట్టు ద్వారా 15 వేలు, అమ్మాయి పెళ్ళికి చేసిన అప్పు 70 వేలు, మొత్తం 2 లక్షల 10 వేల రూపాయల అప్పులు తేలాయి. బ్యాంకుల వాళ్ళు అప్పుల వసూళ్ళకోసం తిరుగుతూ వత్తిడి పెంచటంతో అప్పులు ఎక్కడా పుట్టక, కుటుంబ పోషణ భారం బరువై, అప్పులతీర్చే దారిలేక మధనపడుతూ, మానసికంగా కృంగి పోయి కృష్టారావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కృష్ణారావు మృతిచెందిన రోజున గ్రామంలో 'జన్మభూమి' కార్యక్రమంలో భాగంగా యంఆర్ఓ ఆత్మహత్యపై విచారణ జరిపించి "అప్పుల బాధకు తట్టుకోలేకనే ఆత్మహత్య చేసుకొన్నట్లు తేలిందని" ప్రకటించారు.

నందిగామ మండలం పల్లగిరి గ్రామ కౌలు రైతు దొడ్డి సాంబయ్య (35సం) 13-2-2002న అప్పుల బాధకు తట్టుకోలేక ఆత్మహత్య చేసు కున్నాడు. ఇతనికి భార్య, ఒక కుమారుడు (2సం), ఒక పాప (2 నెలలు) ఉన్నారు. తల్లి అమాయకు రాలు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నివాసి అయిన సాంబయ్య 7 సంవత్సరాల క్రితం పల్లగిరిలో వివాహం చేసుకొని ఆ గ్రామం లోనే అద్దె ఇంటిలో కాపురం వుంటున్నాడు. 3 ఎకరాల మాగాణి, 1 ఎకరం మెట్టభూమిని కౌలుకి తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. పంట సాగు నిమిత్తం బ్యాంక్ అప్పులే రూ॥ 11,800 లు, ప్రైవేట్ అప్పులు దాదాపు రూ. 75 వేలు ఉన్నాయి. పంటలు సరిగా పండక పోవడటంతో సాగునీరు లేక వరిపంట ఎండిపోతే పశువులకు మేపారు. పత్తిరేటు క్వింటాలుకి రూ. 1600లు మాత్రమే వుంది. అయితే వ్యాపారస్తులు రూ 12000లు అయితేనే బోరేలు తొక్కి కొంటా మని ప్రకటించడంతో రైతు తట్టుకోలేక, కుటుంబ పోషణ భారాన్ని తట్టుకోలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం గ్రామానికి చెందిన పత్తి రైతు బరిగెల రామచంద్ర రావు (27 సం ॥) 14-3-2002 న ఆత్మహత్య చేసుకొన్నాడు. రామచంద్రరావుకి భార్యతోపాటు ఒక పాప (6సం॥), ఒక బాబు (4 సం॥) ఉన్నారు. ఇంటర్ వరకు చదువుకున్న రామచంద్రరావు తనకున్న 7 ఎకరాల భూమిలో ఒక ఎకరం మాగాణి పోగా మిగతా 6 ఎకరాల్లో పత్తి, మిర్చి 3ఎకరాల చొప్పున వేశాడు. చాలా సంవత్సరాలుగా దిగుబడులు సరిగా లేకపోవడం, మరోవైపున పెట్టుబడులు పెరిగి పోవటంతో పాటు గిట్టుబాటు రేట్లు రాక పోవడంతో అప్పులు రెట్టింపయినట్లు లెక్కలు చూసుకొనగా ఆరారావటంతో షాక్‌తిని అప్పులు తీర్చలేమని అధైర్యపడి రామచంద్రారావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామచంద్రారావుకి బ్యాంకు అప్పులు వడ్డీకాక రూ. 1,18,000 లు, ప్రైవేట్ అప్పులు వడ్డీకాక రూ. 2,50,000 లు మొత్తం రూ. 4,50,000 లు అప్పులు తేలడంతో చివరికి 50 వేలురూ.ల చొ॥న భూములు అమ్మి కుందామన్నా కొనేనాధుడు కూడా లేని దుస్థితి ఏర్పడింది.

మిగిలిన గ్రామాలతో పోల్చుకొంటే లింగ గూడెం గ్రామానికి ఏదో ఒక మేరకు సాగర్‌నీటి సౌకర్యం వున్నప్పటికీ పంటలు దిగుబడి పెరగా ల్సిందిపోయి క్రిమికీటకాల వల్ల దిగుబడులు తగ్గిపోయాయి. కల్తీ పురుగుమందులే దీనికి ప్రధాన కారణం. ప్రత్తి, మిర్చి ఎకరాకు 5 క్వింటాళ్ళ చొ॥న మాత్రమే దిగుబడి వచ్చింది. పత్తిరేటు క్వింటాల్‌కి రూ. 1300-1400లు, మిర్చి రేటు రూ. 2200లు మాత్రమే వుంది. ఈ రేటు ప్రకారం 6 ఎకరాల్లో పంటలను అమ్మితే రూ 54,000లు మాత్రమే ఆదాయం వచ్చింది. కానీ పెట్టుబడి రు.1,20,000 అవటంతో రు.66,000లు కేవలం ఈ సంవత్సరం పంట నష్టం వచ్చింది.

ప్రభుత్వం ప్రకటించిన కెడిసిసి బ్యాంక్ 'వన్‌టైమ్ సెటిల్‌మెంట్' విధానం రామచంద్రరావు లాంటి రైతులను ఆత్మహత్యల నుండి కాపాడలేక పోతున్నది. లింగగూడెం గ్రామంలో' వన్‌టైమ్ సెటిల్‌మెంట్' ను అర్హత కల్గిన రైతులు కేవలం 6గురు మాత్రమే వున్నారని ప్రకటించారు. అంటే ఆచరణలో ఈ పథకం సామాన్య రైతాంగాన్ని రుణభారం నుండి విముక్తి చేయలేక పోతున్నదన టానికి లింగగూడెం గ్రామ ఉదాహరణ సాక్ష్యంగా నిలుస్తుంది.

నూజీవీడు మండలం గోగులపాడు గ్రామానికి చెందిన కోనేరు సుబ్బారావు (55 సం॥) పురుగు మందు త్రాగి నూజీవీడులో తనకి అప్పు ఇచ్చిన ప్రైవేట్ ఫైనాన్స్‌కంపెనీ ముందు అపస్మారక స్థితిలో పడిపోయాడు. తర్వాత ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం లేక చనిపోయాడు. ఆత్మహత్య చేసుకున్న కోనేరు సుబ్బారావు మూడున్నర ఎకరాల మామిడి రైతు. వ్యవసాయానికి ప్రైవేట్ ఫైనాన్ కంపెనీ ఇచ్చిన అప్పుతో ట్రాక్టర్ తీసుకొని పంటసరిగా పండకపోవటంతో ట్రాక్టర్ ఫైనాన్స్ చెల్లించలేని దుస్థితిలోపడ్డాడు. ఫైనాన్సియర్ వేధింపులు పెరగటంతో చివరికి ఆ ఫైనాన్స్ కంపెనీ ముందే ఆత్మహత్య చేసుకుని అకాల మరణం చెందాడు.

పశ్చిమకృష్ణాలో ప్రత్తి, మిర్చి పంటల రైతాంగమే కాక మామిడి రైతాంగం కూడా తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారనడానికి కోనేరు సుబ్బారావు ఆత్మహత్య సాక్ష్యంగా నిలుస్తుంది. జిల్లాలోని జగ్గయ్యపేట, నూజీవీడు ప్రాంత మామిడి రైతులు, కౌలుదారులు నానాటికీ నష్టాల ఊబిలో కూరుకు పోతున్నారు. మామిడిపూత దశలో పాగమంచు కారణంగా , ప్రారంభంలో వర్షాలు సరిగాపడక, దాని వలన చీడపీడలు పెరిగిపోయి మామిడి దిగుబడి బాగా తగ్గిపోయింది. ఈ స్థితిలో మామిడి ధర అధికంగా వుండాల్సింది పోయి కమీషన్ ఏజంట్లు, మామిడి వ్యాపారులు కుమ్మక్కై రైతుల నోట దుమ్ముకొడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో టన్ను మామిడి 6వేల నుండి 9వేల రూ॥ల వరకు మాత్రమే రైతులకు ముడుతున్నది. అదే బహిరంగ మార్కెట్లో టన్ను ధర 15వేల రూ॥ వుంది. అంతేకాక నూటికి రూపాయి వంతున మార్కెట్‌ఫీజ్, కమీషన్

రూపంలో నూటికి 10 రూ.లు వ్యాపారులు రైతుల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అంతేగాక తరుగు పేరుతో టన్ను మామిడికి ఒక క్వింటాల్ మేర కోత విధిస్తూ రైతులను తీవ్రంగా దోచుకుంటున్నారు. ఈ సంవత్సరం వర్షాభావం వల్ల మామిడికాయ బరువు కూడా తగ్గి కాపు కూడా ఆశించినంతగా లేక ఎకరానికి రెండున్నర టన్నులకు మించి పండలేదు. మామిడి రైతుకి మార్కెట్‌లో జరుగుతున్న దగాతోపాటు రవాణా ఖర్చులు, పురుగుమందుల ఖర్చులు విపరీతంగా పెరగటంతో కౌలుకి తీసుకున్న రైతులు రుణ భారంతో క్రుంగిపోయి వున్నారు.

పశ్చిమకృష్ణాలో ఇంకా మరెందరో కౌలురైతులు పురుగుమందుల షాపులలో తెచ్చిన అప్పులకు వడ్డీలు భారీగా పెరిగిపోవటంతో చివరికి షాపు యాజమానుల దౌర్జన్యాలకు, చిత్ర హింసలకు గురికావటమే గాక భారీగా పెరిగిపోయిన అప్పులు తీర్చలేక చివరికి షాపు యాజమానులైన భూస్వాముల దగ్గర పాలేర్లుగా కట్టుబానిస బ్రతుకులు బ్రతుకుతూ చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

అరిగెల కాంతయ్య అనే దళిత కౌలు రైతు రెండు ఎకరాలు సాగుభూమి చేస్తుంటే కౌలుతో కలిపి మొత్తం వ్యవసాయ ఖర్చులు 14వేలు రూ॥లు కాగా, ఇద్దరు కటుంబసభ్యులకూ (భార్యాభర్తలు) సంవత్సరానికి రూ॥16,300 లు కుటుంబ ఖర్చులు అవుతుండగా, మొత్తం ఖర్చులు రూ॥ 30,300లు అయ్యాయి. ఆదాయం వ్యవసాయం ద్వారా 8 వేల.రూ॥లు, భార్యాభర్తలు కూలీకి వెళ్లడం ద్వారా 4 వేల రూ॥ల సంపాదించగా మొత్తం సంవత్సరం ఆదాయం 12 వేలు రూ॥లు వచ్చింది. ఈ కౌలు రైతుకి పురుగుమందుల షాపులో 2 రూ॥ల వడ్డీ చొప్పున 6 వేల రూ॥లు, ప్రైవేటు అప్పు 3 రూ॥ల వడ్డీ చొప్పున 3 వేల రూ॥లు అప్పులో వున్నాడు. చివరకి ఖర్చు రూ॥ 30,300 వుంటే ఆదాయం రూ॥ 12,000 మాత్రమే రావటం వలన ఈ కౌలురైతు రూ॥18,3000 లోటుతో జీవితాన్ని గడుపుతున్నాడు.

బిసి కులానికి చెందిన మరొక కౌలు రైతు 3 ఎకరాలు పత్తి సాగుభూమిని ఎకరానికి 2 వేల రూ॥ చొప్పున కౌలుకుతీసుకున్నాడు. భార్య భర్తలతో పాటు మరొక కొడుకును కలుపుకుని ముగ్గురు సభ్యులు 3 ఎకరాలకు కౌలు 6 వేల రూ॥లు, వ్యవసాయం ఖర్చులు (శ్రమ విలువ కాక) 12వేల రూ॥లు, కుటుంబ ఖర్చులు రు.13,300 కలుపుకుంటే మొత్తం ఖర్చులు రూ॥ 31,300 అవుతున్నాయి. రెండు ఎకరాల పత్తి పాలంలో 6 క్వింటాళ్ళు మాత్రమే పండగా రూ. 10,800 మాత్రమే అమ్మితే వచ్చింది. ఎకరం పాలంలో మిర్చి పూర్తిగా ఎండిపోయింది. భార్యభర్తలు ఇద్దరూ కూలికెళితే భార్యకు 3 వేల రూ॥లు, భర్తకు 6 వేలరూ॥ మొత్తం 9 వేల రూ॥ కూలి డబ్బు వచ్చింది. పురుగు మందుల షాపులో (కౌలు కిచ్చిన యాజమాని కూడా) గత కాలపు అప్పు రూ॥ 8,410, తాజా అప్పు రూ॥ 6,735 కలుపుకొని మొత్తం అప్పు రూ॥ 15,145 లు కాగా జనవరి 2001 నాటికి వడ్డీ రూ॥ 4,590లతో కలుపుకొని మొత్తం అప్పు రూ॥ 19,735 లుగా తేలింది. బయటి పురుగుమందుల షాపుల నుంచి రూ॥ 9,600 అప్పుగా తేగా, ఇండియన్ బ్యాంక్‌లో గొర్రెల కోసం లోన్ల క్రింద 6 వేలరూ॥ అప్పుతో కలుపుకుని మొత్తం అప్పులు (19,735 + 9,600 +6000) 35,335 రూ॥లకు చేరుకొంది. ఈ విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోయిన కౌలు రైతులు గ్రామ గ్రామానికి పెద్ద సంఖ్యలో ఉన్నారు. కట్టు బానిసలుగా బ్రతుకుతున్న ఇలాంటి కౌలు రైతుల జీవితాలు ఎన్నో హృదయవిదారక కథలు చెబుతాయి.

దళితులకు చెందిన పేద సన్నకారు కౌలు రైతాంగం తమ వ్యవసాయ పెట్టుబడుల కోసం స్థానికంగా వున్న ధనిక, మధ్య తరగతి రైతాంగం, వ్యాపార, ఉద్యోగ వర్గాల నుండి వివిధ పద్ధతుల్లో అప్పులు తెచ్చుకుంటారు. కార్తీకమాసంలో 300రూ.ల అప్పు తెచ్చుకుంటే పంట మార్పిడి నాటికి ఒక బస్తా ధాన్యాన్ని (రేటుతో నిమిత్తం లేకుండా) చెల్లించాలి. అంటే సరాసరిన నూటికి నెలకు 16 రూ. వడ్డీ చెల్లించాలి. ఒక వేళ పంట పండకపోయినా ప్రామిసరీ నోటు మీద వ్రాయించుకొంటారు. గ్రామాలలో ఈ విధంగా బహిరంగంగా కాని వడ్డీ దోపిడీ రూపాలతో పేద వర్గాలు పీడించబడుతున్నారు.

వస్తులతో బ్రతుకుతున్న వ్యవసాయ కూలీలు

కరువు ప్రాంతంగా కొనసాగుతున్న పశ్చిమ కృష్ణాలో పేద, మధ్యతరగతి, కౌలు రైతులు, ధనిక రైతుల్లో ఒక సెక్షన్ అప్పుల భారంతో క్రుంగి పోయి ఆత్మహత్యలకు పాల్పడుతూవుంటే మరొక వైపు కుంటా సెంటూ భూమిలేని, రెక్కాడితే గాని డొక్కాడని పేద వర్గాలకు చెందిన వ్యవసాయ కూలీలు, వివిధ వృత్తులు చేసుకొనే శ్రామిక వర్గ ప్రజలు పచ్చడి మెతుకులతో, వస్తులతో జీవిస్తున్నారు. వ్యవసాయ కూలీలకు కరువు పరిస్థితుల వల్ల సరైన కూలీరేట్లు రాక, చేయటానికి కూలీ పనులు లేక సంవత్సరంలో 5 నెలలు నుంచి 8 నెలల వరకు పొట్టచేత పట్టుకుని పుట్టకొకరు చెట్టుకొకరు కూలీ పనులకు ఇతర జిల్లాలకు వలసలు వెళ్తున్నారు. వలసలు వెళ్ళి కూలీపనులు చేసుకున్నా పిల్లాజెల్లా పస్తుల జీవితాలనే గడుపుతున్నారు. అంతేకాగ పేదవర్గాలకు చెందిన దళితులు ఈ ప్రాంతంలోని అగ్రకుల దురహంకారుల ప్యూడల్ దౌర్జన్యాలు, దళిత మహిళలపై అత్యాచారాలు, హత్యలకు నానాటికీ గురి అవుతూనేవున్నారు. ఈ అత్యాచారాల్లో వెలుగులోకి వస్తున్నవి చాలా తక్కువ మాత్రమే.

ఇంతటి కరువు పరిస్థితిలో బ్రతుకుతున్నా పేద వర్గాలను రుణభారం వివిధ రూపాలలో పట్టిపీడిస్తున్నది. కటుకూరి వెంకటరత్నం అనే దళిత వ్యవసాయకూలీ కుటుంబం భార్యా భర్తలు కాక 10 సం. లోపు 4 గురు పిల్లలతో జీవితం గడుపుతున్నారు. మగవారికి సాధారణం గా సంవత్సరంలో 180 రోజులు కూలిపనులు దొరికితే, ఒక 40 రోజులు వలస కూలీలుగా వెళ్ళితే మగవారికి రోజు కూలీ రూ.॥50 లు వస్తే మొత్త సంవత్సరం మీద 9 వేలరూ. వస్తుంది. స్త్రీలకు పనిదినాలు రోజుకి 20 రూ. కూలీ చొ॥న 240 రోజులు వుంటాయి. తల్లితో పాటు పిల్ల కూడా కూలి కెళ్తుంది. కాబట్టి ఇద్దరి కూలీ రోజుకి రూ॥ 40 చొప్పున రూ॥240 రోజులకు 9,600 వస్తుంది. మగ, ఆడ మొత్తం కూలీ కలుపుకొంటే రూ. 18,600 వస్తుంది. కుటుంబ ఖర్చులు మొత్తం సంవత్సరం మీద సాధారణంగా ఖర్చులు పెడితే రూ. 29,940లు అయింది. ఆదాయానికీ - ఖర్చుకీ లోటు రూ॥ 11,340 లు ఏర్పడింది. ఈ లోటు ఫలితంగా ఈ కుటుంబం నిరంతరం రుణభారంతో క్రుంగి పోతున్నది. ఈ కుటుంబం బంగారం తాకట్టు ద్వారా 1500 రూ.లు, ప్రైవేటు అప్పు 10రూ. వడ్డీతో 3 వేల రూ॥లు, మరొక ప్రైవేటు అప్పు 4 వేల రూ॥లు, మొత్తం రూ. 8500 లు అప్పులో ఉన్నారు. ఈ రుణభారం నుంచి ఈ వ్యవసాయకూలీ కుటుంబం ఎప్పుడు బయట పడ్తుంది? ఈ అప్పులను సాధారణంగా గ్రామంలోని ఆసాములు, చిల్లర కొట్టుదుకాల ద్వారా తెచ్చుకుంటారు. కరువు పరిస్థితులు పెరుగుతున్న కొద్దీ చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, తిరిగి అప్పులు దొరకక ఆకలి చావుల అంచున దుర్భర జీవితాలు గడుపుతున్నారు.

కరువుని పెంచి పోషిస్తున్న ప్రభుత్వాలు

పశ్చిమ కృష్ణాలోని 20 మండలాలను 1997లో చంద్రబాబునాయుడు ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించింది. అయితే కరువు మండలాలుగా గుర్తించినప్పటికీ ఏ ఒక్క మండలం లోనూ తక్షణ సహాయక చర్యలు చేపట్టలేదు. ఈ 20 మండలాల్లో అత్యంత తీవ్ర కరువు మండలంగా గుర్తించబడిన చందర్లపాడు మండంలో అసలు ప్రభుత్వ ఉత్తర్వులు రాలేదని ఎక్కువ కాలం, ఉత్తర్వులు వచ్చిన తర్వాత నిధులు కొరత కారణం చెప్పి ఆచరణలో ఎటువంటి సహాయక చర్యలూ చేపట్టలేదు. కరువు నిధులను అధికార్లు, స్థానిక పెత్తందార్లే ఎక్కువ కైంకర్యం చేశారు.

1993లో 13 మండలాలను కరువు మండలాలు గా ప్రకటిస్తే 97లో 20 మండలాలను ప్రకటించడం లో అధికార పార్టీ కరువు రాజకీయాలు చేపట్టిందనేది బహిరంగ రహస్యం. ఆ తర్వాత సంవత్సరాల్లో ఇప్పటి వరకు మొదట ప్రకటించిన 13 మండలాలు కాదు కదా తీవ్రంగా కరువు వున్న చందర్లపాడు మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించ లేక పోయింది. అయితే రానురాను కరువు తీవ్రత పెరుగుతూ వుండటంతో పశ్చిమ కృష్ణాలో 20 మండలాల మండల ప్రజాపరిషత్తులు ఆఖరికి టిడిపి అధికారంలో వున్న చోట్ల కూడా ఆ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఏకగ్రీవ తీర్మానాలు చేశాయి. ప్రతి సంవత్సరం తీర్మానాలు చేస్తూనే ఉన్నాయి. కానీ అధికారపార్టీ కరువు మండలాలుగా ప్రకటింపచేయటంలో పూర్తిగా నిర్లక్ష్యవైఖరి చేపట్టింది.

చుట్టూ చాలినంత నీరు వున్నా కరువుతో పీడించబడుతున్న రైతాంగం

పశ్చిమ కృష్ణా ప్రాంతంలో 90 కి.మీ. వరకు కృష్ణానది నిండుగా పారుతున్నా, పీలేరు, వైరా, మునేరు, కట్టలేరు లాంటి నదులు, వాగులు, వంకలు పొర్లిపారలుతున్నా, ఆఖరికి మెట్ట పంటలకు కూడా సకాలంలో నీరు అందని దుస్థితిని ఈ ప్రాంతం ఎదుర్కొంటున్నది. ఈ ప్రాంతానికి సాగరు ఎడమ కాలువ నీరు వస్తున్నప్పటికీ, ఈ ప్రాంతం మొత్తం ఎడమకాలువ చివర భూములు గా మిగిలి పోవటంతో సకాలంలో సాగు నీరు రాక పంటలను రైతులు కళ్ళముందే ఎండబెట్టు కొంటున్నారు. ఈ నదులపై సమగ్ర ప్రణాళికతో ఎత్తి పోతల పథకాలు నిర్మించనందున, నిర్మించిన పథకాలు చెడిపోయినా రిపేర్లు చేసే నాధుడు లేక, ఈ ప్రాంతంలో పంటలకు సకాలంలో సాగు నీరు అందక, పంటలు సరిగా పండక రైతులు దివాళా తీస్తున్నారు. పత్తి, మిర్చి, పొగాకు లాంటి వ్యాపార పంటలు జూదంలా తయారై రైతులను నానాటికీ సంక్షోభంలోకి నెడ్తున్నాయి. ఈ ప్రాంత రైతు ఎక్కువగా వర్షం మీద ఆధారపడటం వలన అతివృష్టి, అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలకు బలి అవుతూనే వున్నాడు. బాగా పనిచేస్తున్న కొన్ని ఎత్తిపోతల పథకాలు గ్రామాల్లో పెత్తందారీ విధానా లకు బలై రైతులకు భారంగా తయార య్యాయి. ఇందుకు కమ్మారిపాలెం పంపింగ్ స్కీమ్‌పైన నడుస్తున్న వివాదాన్ని ఉదాహరణగా చెప్పవచ్చును.

1872లో అంచనాలు వేయబడిన పులి చింతల ప్రాజెక్టు ఈనాటికీ క్రియారూపం దాల్చకపోవటానికి అధికార పార్టీల కరువు రాజకీయాల ఫలితమేనని విస్పష్టంగా తెలుస్తున్నది. పశ్చిమ కృష్ణాకు సాగునీరందించే పథకాన్ని చివరికి డెల్టా ప్రాంతానికి రక్షితనీటిని అందించే పథకంగా దిగజార్చారు. అలానే 1996లో ఎన్.టి.ఆర్ చే శంఖుస్థాపన చేయబడిన "తారకరామా ఎత్తిపోతల పథకం" ప్రపంచ బ్యాంకు విధించిన షరతుల పుణ్యమా అంటూ పై వాళ్లకు పరిమితం చేసి, కన్నీటి తుడుపుగా అందించే నిధులను సిబ్బంది జీతాలకే సరిపెడుతూ అధికార పార్టీ సస్యశ్యామలం చేసే సమగ్ర సాగునీటి పథకాలను తయారుచేసినా చిత్తశుద్దిలేని రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా అవి కార్యరూపం దాల్చలేదు. దాల్చనివ్వరు.

సమగ్ర సాగునీటి పథకాలను అమలు పరచ నందు వల్లనే ఈ ప్రాంతంలో రైతాంగం కరువు వాతపడుతున్నారు. ఎక్కువ భాగం పంటలు సరిగా పండక, పండినా గిట్టుబాటు ధర లభించక జూదంలా తయారైన వ్యాపార పంటల కోసం ఎరువు, పురుగు మందుల కోసం అప్పుల మీద అప్పులు పెట్టి చివరికి అసలుకంటే వడ్డీలెక్కువై రుణభారాన్ని తట్టుకోలేక, వేధింపులను తట్టుకోలేక చివరికి పురుగు మందులను పెరుగన్నంలా తిని ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు.

అభివృద్ధి చెందిన డెల్టా ప్రాంతమైన తూర్పు కృష్ణాలో 'రుణభారం'

రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన జిల్లాగా పేర్గాంచిన కృష్ణాజిల్లాలో సగభాగం పశ్చిమ (కరువు) కృష్ణా పోగా మిగిలిన సగభాగం తూర్పు కృష్ణా మంచిడెల్టా ప్రాంతంగా పేర్గాంచింది. అయితే నాటికి 80 మందిగా వున్న వ్యవసాయకూలీలు, వివిధవృత్తుల పేదవర్గాలు అసంఘటిత రంగాల లోని కార్మికులు, పేద మధ్యతరగతి రైతాంగం అందరూ తరతమ స్థాయిలో రుణభారంతో పీడించబడుతున్నారు. ఈ పీడిత వర్గాలలో అప్పుల భారం లేనివారు ఏ ఒక్కరూ లేరంటే ఆశ్చర్య పోనవసరం లేదు. సామాన్యరైతు ఒక్కసారి సహకార బ్యాంకులో అప్పు తెచ్చుకొన్నాడంటే ఇక జీవిత కాలంలో ఆ బ్యాంకు అప్పు నుంచి విముక్తి కావడం సాధ్యం కాని విషయమన్నది బహిరంగ రహస్యం. 'వన్‌టైమ్ సెటిల్‌మెంట్' పథకం, ఇతర అప్పుల పథకాలలో అధికభాగం గ్రామీణ ప్రాంతంలోని భూస్వాములు, ధనికరైతులు, రాజకీయ ప్రాబల్యం కల్గిన పెత్తందారీ సెక్షన్లకు ఎక్కువ ఉపయోగ పడుతున్నాయి.

తూర్పు కృష్ణాలో ముందుగా వ్యవసాయ కూలీల ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే కూలీ పనులు సంవత్సరం అంతా దొరకవు. మెట్ట పంటలు వున్న కొన్ని ప్రాంతాల్లోనే ఎక్కువ రోజులు కూలిపనులు దొరుకుతాయి. మిగతా ప్రాంతాల్లో 90 నుంచి 120 రోజులు మాత్రమే కూలి పనులు దొరుకుతాయి. కూలీరేట్లు సగటున స్త్రీలకు 30 రూ॥లు, మగవారికి 40 రూ॥లు ఉంటాయి. ఘంటసాల ప్రాంతంలోని కూలీలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసవెళ్ళి జోడుకి 2 కేజీల బియ్యం, 100 రూ॥ల కూలీలో సుమారు 45 రోజులు పని చేస్తారు. ఇంత కష్టపడ్డా అత్యధిక భాగం వ్యవసాయ కూలీలు 4 వేల రూపాయల వరకు సాధారణ అప్పు, పెళ్ళిళ్ళు రోగాలు రొస్టులులాంటివి వస్తే 10 నుండి 15 వేల రూ॥ల వరకు అప్పుల్లో వుండిపోతున్నారు. కుంటా సెంటూ భూమి వున్న వారికంటే అసలు భూమి లేని వ్యవసాయ కూలీల పరిస్థితి మరింత సంకటంగా తయారైంది. ఇందులో ఇల్లు కూడా లేనివారి పరిస్థితి మరింత దుర్భరంగా వుంటుంది. అయితే కొన్ని గ్రామాల్లో ఎస్.సి, బి.సి, ఎస్.టి లు 80 శాతం పైన వుంటున్నారు. కానీ ఈ పేద వర్గాలంతా కష్టపడుతున్నా జీవితకాలం అప్పులు చేయక తప్పని స్థితిలో వున్నారు.

ఈ ప్రాంతంలో కౌలు రైతుల పరిస్థితిని పరిశీలిస్తే, వీరిలో ఎక్కువ భాగం ఎస్.సి, బి.సి లు ఉన్నారు. ఒసీలు తక్కువగా వుంటారు. వీరు పట్టణాలు, నగరాల్లో ఉద్యోగ, వ్యాపారాల రీత్యా స్థిరపడిన వారి భూములను కౌలుకి చేస్తున్నారు. కౌలు ఎకరానికి 20-22 బస్తాలు వుంటుంది. రెండవ పంట మినుము బాగా పండితే పరిస్థితి కొంత మెరుగ్గా వుంటుంది. అది కూడా సరిగా

పండకపోతే గడ్డి ఒకటే మిగులుతుంది. వీరి కుటుంబం స్వయంగా కూలికి వెళ్ళడం, పాల అమ్మకం, గేదెల మారు బేరంలాంటి ఆదాయ వనరుల ద్వారా కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. కౌలురేట్లు ఎక్కువగా వుండటం, వాతావరణం కలసిరాకపోవటం లాంటి ముఖ్య కారణాల వల్ల కౌలురైతులు ఎక్కువ భాగం సహకార బ్యాంకు, ప్రైవేట్ అప్పులు తెచ్చుకోక తప్పడం లేదు. పెళ్ళిళ్ళు, రోగాలు వస్తే అప్పు భారం మరింత పెరుగుతుంది. 10 వేల నుంచి 30 వేల వరకు అప్పుల్లో వుండిపోతున్నారు. జీవిత కాలం తెచ్చిన అప్పులపై వడ్డీలు కడ్తున్నారు. కొందరు ఆ వడ్డీలను కూడా కట్టలేని దుస్థితిలో వున్నారు.

ఒక ఎకరం పైన కొద్దిగా వున్న పేద రైతులు పెట్టుబడుల కోసం సహకార బ్యాంకులు, ప్రైవేట్ అప్పుల ద్వారా 4 వేల రూ.నుంచి 75 వేల రూ.ల వరకు అప్పులు చేసిన వారున్నారు. ఇందులో పిల్లల చదువుల కోసం ఎక్కువ అప్పులు చేస్తున్నారు. వ్యవసాయం ఏ మాత్రం గిట్టుబాటు కానందున తమ పిల్లలను గతంలో వ్యవసాయం చేయమని ప్రోత్సహించే కుటుంబాలు నేడు అప్పులు చేసైనా పిల్లలను చదివిస్తున్నారు. పేద రైతులు తమ స్వంత పాలం మీద వచ్చే ఆదాయం చాలక కుటుంబం మొత్తం వివిధ పనులకు కూలీ కెళ్తే గాని కుటుంబాలు జరగని పరిస్థితి - ఈ వర్గాలకు బ్యాంకుల్లో అప్పులు పుట్టాలంటే లంచాలు ఇచ్చుకోవల్సిన పరిస్థితి ఉంది.

రెండు ఎకరాలున్న సన్నకారు రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఈ రైతులు కొందరు కౌలుకి చేస్తూ కూడా పెట్టుబడి, కుటుంబ అవసరాల కోసం 5 వేల నుంచి 20 వేల కొరకు అప్పులు చేస్తున్నారు.

3-5 ఎకరాల మధ్య వున్న మధ్యతరగతి రైతులు ఎక్కువ ఒసీలు ఉన్నారు. వీరికి పంట ఆదాయంలో మిగులు వున్నా కుటుంబ ఖర్చులు, చదువులు, అనారోగ్యాలు, పెట్టుపోతల వలన నిత్యం అప్పుల్లో వుండిపోతున్నారు. కొందరు రొయ్యల చెరువుల్లో అర్ధాంతరంగా లాభాలు వస్తాయని ఆశపడి నష్టపోయి పెద్ద ఎత్తున అప్పుల్లో కూరుకు పోయారు.

5-12 ఎకరాల మధ్యవున్న ధనిక రైతులు స్వంతంతో పాటు కౌలుకి 2 నుంచి 15 ఎకరాల వరకు చేస్తున్నారు. వీరందరూ ఒసీలకు చెందిన వారే. వీరిలో ఒక సెక్షన్ వ్యవసాయం లాభ దాయకంగా లేదని తమ భూములను కౌలుకిచ్చి, కొందరు భూములను అమ్మి పట్టణాలు, నగరాల్లో వివిధ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. వీరు మిగులుతో వుంటూ పెద్ద మొత్తాల్లో వడ్డీలకు తిప్పుతారు. వీరు బ్యాంకుల్లో క్రాప్‌లోన్ పేరుతో లక్షలాది రూ॥లు తీసుకొని వడ్డీకి తిప్పుతుంటారు.

15 ఎకరాల నుంచి 30 ఎకరాల వరకు ఉన్న భూస్వాములు అందరూ ఓసీలే. అయితే వీరు గ్రామానికి నలుగురైదుగురే వుంటారు. అయితే చక్రం తిప్పేదంతా వీరే. వీరు ఏ మాత్రం శ్రమ చేయరు. కులం, ఆర్థిక పరిస్థితి కారణంగా రాజకీయ ప్రాబల్యం కల్గి ఉంటారు. వీరు బ్యాంకుల్లో క్రాప్‌లోన్, గోల్డ్‌లోన్, ఎల్‌టి లోన్ల పేరుతో లక్షల్లో అప్పులు తీసుకొని ఎక్కువ వడ్డీలకు పేదవర్గాలకు అప్పులిస్తారు. వీరు మిగులు ఆదాయంతో పిల్లలను ఉన్నత విద్యలు చెప్పించటం, పట్టణాలు - నగరాల్లో వ్యాపారాలు, వరిశ్రమలు, ఫైనాన్స్ వ్యాపారాలు పెట్టి మరింతగా ఆదాయాలు పెంచుకుంటారు.

పకల వనరులు అందుబాటులోవున్న కంకిపాడు ప్రాంతంలో 'రుణభారం'

ప్రకాశం బ్యారేజికి దగ్గరలో కృష్ణానది ప్రక్కన బందరు, ఏలూరు కాల్వల మధ్య సాగునీరు పుష్కలంగా వుండి అన్నికాలాల్లో మెట్ట, మాగాణి పంటలు పండే కంకిపాడు ఏరియాలో బందరు రోడ్డుకి లోపల ఎకరం 5 లక్షలు వుంటే రోడ్డు ప్రక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాయాజాలం వల్ల ఎకరం 35 లక్షల వరకు తేలిగ్గా పలుకుతున్నది.

ఈ ప్రాంతంలో 0.75 సెంట్లు మాగాణి భూమిని కౌలుకి చేసే రైతుకి 21 బస్తాలు ధాన్యం పండితే 15 బస్తాలు కౌలుకి పోగా, పెట్టుబడి ఖర్చులు పోగా బస్తా రూ॥410 కి అమ్మితే రూ॥ 560 లు మిగులుతాయి. అదే బస్తా రూ॥ 360లు అయితే రూ॥ 260 లు మాత్రమే మిగులుతాయి. ఈ కౌలు రైతు వ్యవసాయానికి 3 వేలు, వైద్యానికి 4వేల రూ॥ల అప్పు చేశాడు. భార్యా భర్తలిద్దరూ శ్రమ చేస్తారు. ఈ ప్రాంతంలో మగవాడికి 240 రోజులు, స్త్రీలకి 120 రోజులు పనులు దొరుకుతాయి. మగవానికి రోజుకూలీ 50 రూ॥లు, స్త్రీలకి 30 రూ॥లు కూలివస్తే మొత్తం కూలీ మీద రు. 15,600 వస్తే గేదెపాలు మీద 5 వేల రూ॥లు మొత్తం కలుపుకొని రు.20,600 ఆదాయం వస్తే ఈ కుటుంబానికి నెలసరి ఖర్చులకి బొటాబొటి సరిపోతాయి. ఆచరణలో కౌలు భూమి చేయటం వల్ల శ్రమ తప్ప ఏమీ మిగలటం లేదు.

అలాగే 2.5 ఎకరాలు కౌలుకి చేసే రైతుకి పసుపు వలన 22 వేల రూ॥ నష్టం, చెరుకు పంటలో 1220 రూ॥ నష్టం, కంద - కూరగాయల్లో 4,932 రూ॥లు నష్టం వచ్చింది. భార్యాభర్తలు కూలిపనులు చేసుకొంటున్నందున పస్తులు లేకుండా బ్రతుకు తున్నారు గానీ వ్యవసాయం కోసం చేసిన అప్పు 50 వేల రూ॥లు, దానిపై పెరుగుతున్న వడ్డీ, పంటల్లో వచ్చిన నష్టం వల్ల ఈ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.

ఒక ఎకరం, 60 సెంట్లు వున్న సన్నకారు రైతుకి ఇంటి ఖర్చులు 64 వేల రూ॥లు అయితే పంటల ద్వారా 28 వేల రూ॥లు ఆదాయం మాత్రమే వచ్చింది. పిల్లల పెళ్ళిళ్ళ కోసం 80 వేలరూ॥లు అప్పు, ప్రైవేట్ అప్పు 80 వేలు రూ॥లు, బ్యాంకు అప్పు 10 వేల రూ॥లు వుంది. ఈ సన్నకారు రైతు ఉన్న భూమిని అమ్ముకుంటే గాని అప్పుల నుంచి బయటపడలేని స్థితిలో వుంది. కౌలు సన్నకారు రైతుల జీవితాలు పంటల గిట్టుబాటు ధరల పెరుగుదల, తరుగుదలలపై ఎక్కువగా ఆధారపడి నడుస్తున్నాయి.

ఆశలు మెరిపించి అగాధంలోకి త్రోసిన రొయ్యల పెంపకం

జిల్లాలో విస్తారంగా వున్న సముద్ర తీర ప్రాంతంలో దశాబ్ద కాలంగా రొయ్యల సాగు అనేక ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నది. మొదట కొన్ని సంవత్సరాలు పెద్ద ఆదాయం చూపించి రైతాంగాన్ని రొయ్యల సాగులోకి ఆకర్షించారు. దీనితో చిన్న రైతాంగం కూడ బంగారం పండే భూములను రొయ్యల చెరువులుగా మార్చారు. ఇదే నేడు రైతాంగం పట్ల శాపంలా మారింది. బడా ఎగుమతిదారులు కోట్లలో లాభాలు గడిస్తూ రైతాంగాన్ని నిలువునా ముంచారు. చెరువులను తిరిగి వ్యవసాయ భూమిగా మార్చలేక, ఐస్ కంపెనీల వద్ద అప్పులు చేసి రొయ్యల సాగునే తప్పనిసరిగా కొనసాగించవలసిన దుస్థితిలో పడ్డారు. అప్పుల భారం విపరీతంగా పెరిగి, అప్పు తీర్చడానికి రొయ్యల సాగుచేసి రుణదాతలకే రొయ్యలు తెగనమ్ము కొని, అయినా అప్పులు పెరిగిపోతూ వెట్టి చాకిరీ చేస్తున్నారు. చివరికి అయిన కాడికి చెరువులు తెగనమ్ముకుని, వారి చెరువుల మీదే కూలీలుగా దుర్భర జీవితం గడుపుతున్నారు.

దశాబ్దాలుగా పేద ప్రజలు పోరాటాలు చేసి ప్రభుత్వ బంజర్లు, తదితర భూములను పొందారు. రొయ్యల సాగుతో ఈ భూములు

తిరిగి భూస్వామ్య వర్గాల ఆధిపత్యంలోకి ప్రత్యక్ష -పరోక్ష రూపాలలో వెళ్ళాయి. పచ్చగా కళకళ లాడే భూములు ఉప్పు నీటిమడుగు లయ్యాయి. తాగు నీరు లభ్యం కాక, భూసారం నశించి, ఇతర పర్యావరణ సమస్యలతో రైతాంగ జీవనం కొత్త సమస్యలనెదుర్కొంటున్నది.

అప్పుల ఉచ్చు బిగిస్తున్న ప్రభాత్వాల దుష్ట విధానాలు

భారత్‌జన్ ఆందోళన్ అధ్యక్షులు బి.డి. శర్మగారు గ్రామీణ రుణభారంపై ప్రత్యేక కృషిచేస్తూ 'రుణభారం'కి సంబంధించి అనేక వాస్తవాలను, చట్టాలను వెలుగులోకి తెచ్చారు. భూమి మీద ఆధారపడి అర్థవంతమైన జీవన విధానాన్ని కొనసాగిస్తున్న రైతుల ఆత్మగౌరవాన్ని నేటి ప్రభుత్వాలు ఆత్మహత్యల ఉచ్చులో బిగించి ఆత్మహత్యల వైపుకు నెడుతున్న తీరును బిడి. శర్మగారు ఒక ఉద్యమంగా కొనసాగిస్తున్నారు. అలానే రాష్ట్రంలో వివిధ రైతుకూలీ, వ్యవసాయ సంఘాలు కలిసి ఏర్పడిన "వ్యవసాయరంగ పరిరక్షణ ఐక్యపోరాట వేదిక" ఆధ్వర్యాన ఏర్పడిన నిపుణుల కమిటీ అనేక ముఖ్య సూచనలతో రిపోర్టును విడుదల చేసింది. ఈ రిపోర్టులో రుణభారం నుండి విముక్తి కావటానికి నిర్దిష్టమైన సూచనలు చేసింది. వ్యవసాయరంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్న ప్రభుత్వ విధానాల వల్ల రుణభారం సమస్య మరింత తీవ్రంగా ముందుకు వస్తున్నది.

1883లో ల్యాండ్ డెవలప్‌మెంట్ చట్టం, 1884 వ్యవసాయ రుణాల చట్టం బ్రిటీష్ వాళ్ళు చేసిన ఈ రెండు చట్టాల ప్రకారం 35 సంవత్సరాల వ్యవధిలో సాలీనా నూటికి నాలుగు రూ॥ల సామాన్య వడ్డీని వసూలు చేయాలి. 1938 నాటి ఆంధ్రప్రాంత వ్యవసాయదారుల సహాయచట్టంలో "5 శాతం బారువడ్డీ, రైతుల చెల్లింపులను అసలు నుండి తీసివేయాలి, వడ్డీ అసలుకి మించరాదు రుణాలు వసూలుకు భూమిని వేలం వేయరాదు, రైతుని జైలుకి పంపరాదు, రాజ్యాంగ శాసనం ప్రకారం రైతు గౌరవంతో జీవించేహక్కు కల్గి ఉండాలి." ప్రతి ఒక్క రైతు పరిస్థితిని గమనించి తిరిగి చెల్లించే కార్యక్రమాన్ని గ్రామసభ సహజ న్యాయ విశ్వజనీన సూత్రం ప్రకారం నిర్ణయిస్తుంది.

వడ్డీ వ్యాపారాన్ని అదుపు చేయటానికి అనేక చట్టాలు వచ్చాయి. ప్రభుత్వబ్యాంకులు, సహకార బ్యాంకులు వ్యవసాయరంగానికి ఇచ్చిన రుణాలను రుణాలు కాదనీ, అడ్వాన్సులనీ చట్టాలు చేశారు. కానీ ఇవేమీ అమలు జరగటం లేదు. కొన్నింటిని మినహాంపులు పేరుతో ఎత్తివేసిన ఫలితంగా ప్రభుత్వసంస్థలే రైతాంగాన్ని జైలుకి పంపుతున్నాయి, బలవంతపు వసూళ్ళకు పాల్పడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ రుణ విధానం అధికారులు, రాజకీయ నాయకులు, బడా వ్యాపారులకు ఇవ్వటంలో పూర్తి విరుద్ధంగా వుంది. అధికారులు, ఎం.ఎల్.ఏలకు ఇచ్చే రుణాలకు 2 శాతం సామాన్య వడ్డీ వసూలు చేస్తూ, రైతు నుంచి మాత్రం 12 శాతం చక్రవడ్డీని వసూలు చేయటం సహజ, సమాన న్యాయసూత్రమేనా?

దేవీలాల్ కేంద్రమంత్రిగా 10 వేల రూ.లోపు రైతుల రుణాలను రద్దు చేశానని ప్రకటించాడు. వాస్తవానికి జరిగింది రీషెడ్యూలు మాత్రమే. దీనివల్ల దేశ ఆర్థికవ్యవస్థ తల్లక్రిందుల యిందని రైతాంగాన్ని సోమరులు, అప్పులెగ్గొట్టి తినే వారంటూ దుమ్మెత్తిపోయని వారులేరు. అదే సమయంలో లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను బడా బూర్జువాలు ఎగ్గొడితే నిరర్ధక ఆస్తులని వాటికి పేర్లుపెట్టి వ్యాపారంలో ఇలాంటి నష్టాలు సహజమేనని సమర్థించుకున్నారు. రైతాంగాన్ని, గ్రామాలను పిండుకుని బడా బూర్జువాలకు కట్టబెట్టే విధానాలనే పాలకులు అనునరించారు. రైతాంగానికి సంస్థాగత రుణసౌకర్యాన్ని నిరాకరించి వడ్డీ వ్యాపారులకు వదిలివేశారు.

రాజ్యాంగం ప్రకారం'రుణవిమోచన' రాష్ట్రాల పరిధిలో వుండగా బ్యాంకుల నియంత్రణ చట్టం ద్వారా కేంద్రం ఈ హక్కుని కత్తిరించింది. రాజ్యాంగపరంగా, చట్టపరంగా రుణవిధానంలో రైతాంగానికి కల్పించిన రాయితీలను, హక్కులను నేటి ప్రభుత్వాలు నిరంకుశంగా కాలరాసి రైతుల ప్రాణాలతో చెలగాట మాడు తున్నాయి.

రిజర్వుబ్యాంకు పెట్టిన మార్గదర్శక విధానాల ఫలితంగానే అప్పుతీసుకునే వారిపై వడ్డీ భారం అపరిమితంగా పడుతున్నది. రిజర్వుబ్యాంక్ విధానం ప్రకారం రిజర్వుబాంక్ నుండి నాబార్డుకి 5% వడ్డీ, నాబార్డు నుండి రాష్ట్ర సహకార బ్యాంకుకు 8% వడ్డీ, రాష్ట్ర సహకార బ్యాంకు నుండి జిల్లా సహకార బ్యాంకుకు 9% వడ్డీ, జిల్లా సహకార బ్యాంక్ నుండి ప్రాథమిక సహకార సంఘానికి 12% వడ్డీ, ప్రాథమిక సహకార సంఘం నుండి రుణగ్రహీతకు 15% వడ్డీని నిర్ణయించారు. ఆచరణలో ఈ వడ్డీ భారాన్నంత అప్పు తీసుకొన్న వారే భరించాలి. ఈ విధంగా సహకార బ్యాంకులు కూడా ప్రైవేట్ వడ్డీ వ్యాపారాలను మరింపచే విధంగా తయారయ్యాయి. ఈ అధికవడ్డీ వసూలు ఫలితంగానే సహకార సంఘాల్లో అప్పులు తీసుకొన్న రైతులు అసలు కంటే వడ్డీలు పెరిగిపోయి రుణ భారంతో క్రుంగిపోతున్నారు. మరోవైపు వందల కోట్ల నిధులను ఈ రంగంలోని పాలకవర్గాలు, అధికారులు దుర్వినియోగం చేస్తున్నారు. సహకార బ్యాంకుల్లో అనేక కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయి.

సహకార బ్యాంకుల రుణాలు ఎవరికి ప్రధానంగా ఉపయోగపడ్తున్నాయో కా॥ తరిమెల నాగిరెడ్డి తన కోర్టు స్టేట్‌మెంట్‌లో ఈ విధంగా పేర్కొన్నారు.

"గ్రామాలలోని ధనికులు గ్రామీణ ప్రాంతాలలో తమ కార్యకలాపాలను వివిధ రంగాలకు విస్తరింపజేసేందుకు సహకార రుణాలు పని కత్తెలుగా వినియోగపడ్తున్నాయి.

ఈ విధంగా సహకార సంఘాల రుణాల ద్వారా, పంచాయితీలు, సమితులు, జిల్లా పరిషత్‌ల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు; తదితర వధకాల పేరిట వ్యవసాయంలో యంత్రాలను (ట్రాక్టర్లు, బుల్‌డోజర్లు, ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు మొ॥నవి) ప్రవేశపెట్టే పేరిట కోట్లాది రూపాయలతో గ్రామీణ ప్రాంతంలోని భూస్వాములను మేపుతూ వారు ఆదాయంలోనూ, సంపదలోనూ తమ వాటాను పెంచుకోవడానికి తోడ్పడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల ఆదాయాల మధ్య తారతమ్యా లను గతంలో కంటే అధికతరం చేస్తున్నది."

-కా॥ తరిమెల నాగిరెడ్డి
(తాకట్టులో భారతదేశం పేజీలు 370-371)

వ్యవసాయాన్ని ప్రపంచీకరణ విషవలయంలోకి వెడ్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

వ్యవసాయరంగ సంక్షోభంలో భాగంగా రైతుల రుణభారం ఆత్మహత్యలు చేసుకునే దుస్థితికి చేరటానికి పాలకవర్గాలు గత పదేళ్ళుగా అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాలేనన్నది స్పష్టం. ఈ విధానాలలో భాగంగానే స్వావలం బన దిశగా వుండాల్సిన వ్యవసాయాన్ని ప్రపంచీకరణ వైపుగా తీసుకెళ్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ వత్తిడితో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ

విధానాలతో మరింత నగ్నంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయి. ఫలితంగా అనేక భారాలను ప్రజలపై నిరంకుశంగా రుద్దు తున్నాయి. విద్యుత్ ఛార్జీల పెంపు, నీటి తీరువా పెంపు, ఆస్తిపన్ను పెంపు, త్రాగునీరు- సాగునీటి ప్రైవేటీకరణ, అన్ని ప్రభుత్వ రంగాలలో యూజర్ ఛార్జీల విధింపు, ఎరువు, పురుగుమందుల ధరల పెంపు, రైతులకు న్యాయంగాఇవ్వాల్సిన సబ్సిడీలపై కోత, దిగుమతుల విధానాన్ని భారీగా సడలించిన ఫలితంగా మనదేశ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పడిపోవటం; వినాశకరమైన బిటి పత్తి విత్తనాలను దిగుమతి చేసుకోవడానికి అనుమతివ్వడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ వ్యవసాయ విధానం అమలు కోసం హైటెక్ స్పీడులో వెళ్ళడం, అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం, ఉద్యోగులపై వి.ఆర్.ఎస్ పథకాలను రుద్దటం లాంటి అనేక ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం చేబడ్తున్నది. మరోవైపు రైతాంగానికి గిట్టుబాటు ధర ఆటుంచి కనీస మద్దతు ధర కూడా అందించకుండా, ఎఫ్.సి.ఐని రంగం నుంచి క్రమంగా తప్పించి రైతులను మిల్లర్ల దయాదాక్షిణ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం వదులు తున్నది. 1200 సహకార రంగ సొసైటీలను, 200 జిల్లా సహకార బ్యాంకులను రద్దుచేసే చర్య కూడా రైతాంగాన్ని మరింత రుణభారంలోకి నెట్టివేస్తుంది. ఫలితంగా రైతాంగం పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతూ వుంది.

రుణ విముక్తి కోసం పోరాట మార్గం

నానాటికీ వికృత రూపం దాలుస్తున్న రుణభారం నుండి విముక్తి పొందటానికి పేదవర్గాలు ముఖ్యంగా పేద, మధ్యతరగతి రైతాంగం సామాజిక అవగాహనతో పోరాటం మార్గం చేపట్టాలి. రుణభారంతో కృంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడటం సమస్యకు పరిష్కారం ఏ మాత్రం కాదు. కరువుని పెంచిపోషిస్తున్న ప్రభుత్వాల దగాకోరు విధానాల వల్లనే రైతులు ఆత్మహత్యలకు నెట్టబడుతున్నారు. అంటే ఇవి ప్రభుత్వాలు చేస్తున్న హత్యలు మాత్రమే. కావున ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సమైక్య పోరాటాన్ని ఎక్కు పెట్టాలి. దున్నేవాని చేతిలో నుంచి భూమిని గుంజుకునే పాలకవర్గాల భూస్వామ్య విధానం, ప్రపంచీకరణ విధానాలపై పోరాటాన్ని ఎక్కు పెట్టాలి.

జనతా ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను పరిపూర్తి చేసే కర్తవ్యాలలో భాగంగా, వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయటంలో భాగంగా గ్రామీణ ప్రజానీకాన్ని పట్టి పీడిస్తున్న 'రుణభారం' పై విశాల ఉద్యమ నిర్మాణానికి పూనుకోవల్సిన అవసరం ఉంది. ఈ ఉద్యమానికి నిర్దిష్టమైన డిమాండ్లను ఈ సదస్సులో రూపొందించుకొని రుణభార విముక్తి కోసం కార్యాచరణ చేపట్టాలి.

'రుణభారం' నుండి విముక్తి కావాలంటే

1. రైతుల రుణాలన్నింటినీ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) వ్యవసాయ దారుల సహాయక చట్టం 1938లోని సెక్షన్లు 9,13లను వర్తింప జేయాలి.

2. రాజ్యాంగం ప్రకారం రుణవిమోచన రాష్ట్రాల పరిధిలో వుండాలి. కేంద్రం జోక్యం చేసు కోరాదు.

3. 5 ఎకరాల మాగాణి, 10 ఎకరాల మెట్ట లోపు రైతులకు ప్రభుత్వ, సహకార సంస్థలు, ప్రైవేటు వ్యాపారులు ఇచ్చిన రుణాలను కరువు ప్రాంతాల రైతులకు రద్దు చేయాలి.

4. విద్యుత్ సరఫరా సమస్యలకు ట్రాన్స్ స్కాను బాధ్యురాలిని చేయాలి. దీనివలన రైతు లకు వాటిల్లిన నష్టాన్ని అది చెల్లించేలా చేయాలి.

5. రుణ సౌకర్యాన్ని సరళీకరించేందుకు కౌలుదారులతో సహా రైతులకు క్రెడిట్ కార్డు నివ్వాలి.

6. రైతులకూ, అన్ని పంటలకూ ఇన్సూరెన్సు స్కీమును వర్తింపజేయాలి.

7. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సరసమైన ధరలకు అందిం చేందుకు వున్న చట్టాలను పటిష్టపరిచి అమలు చేయాలి.

8. ప్రపంచమార్కెట్ శక్తులకు మన వ్యవసాయ రంగాన్ని బలిపెట్టే విధానాలను వదులుకొని మన వ్యవసాయరంగ ఉత్పత్తులకు తగినంత రక్షణలు కల్పించాలి.

9. రసాయనిక ఎరువులు శాస్త్రీయ వినియోగం కోసం ఆధునిక భూసార పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఎరువులపై సబ్సిడీలను కొనసాగించాలి.

10. పశ్చిమ కృష్ణా ప్రాంతాన్ని తక్షణం కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలి. కరువు ప్రాంతాల ప్రకటనలో రాజకీయాలను దరిచేరయనీయరాదు.

11. కరువు ప్రాంతాల్లో సమగ్ర సాగునీటి పథకాలను చేపట్టాలి. కరువు నివారణకు తక్షణ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి.

12. జి.ఒ.ఎమ్.ఎస్ నెం. 252, 18-12-97 ప్రకారం ఏర్పడిన నీటిఛార్జీల సమీక్షా కమిటీని రద్దుచేసి వ్యవసాయ రంగంపై పడే పెనుభారం నుంచి రక్షించాలి.

13. కరువు ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీల, పేదవర్గాలకు చేపట్టాల్సిన అన్ని సహాయక పథకాలు చేపట్టాలి.

14. వ్యవసాయ కూలీలు బానిస బ్రతుకుల నుంచి బయటపడటానికి ప్రభుత్వ భూములు, బంజర్లు, దేవాలయ భూములు, మిగులు భూములను పంచాలి.

15. వ్యవసాయ కూలీలకు సమగ్ర సంక్షేమ పథకాలు చేపట్టాలి.

16. కార్పోరేట్ వ్యవసాయ విధానాన్ని రద్దుచేయాలి. బిటి కాటన్ విత్తనాలకు అనుమతిని రద్దు చేయాలి.

17. ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి భారత్ బయటికి రావాలి. ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందాలు, పెట్టిన షరతులను రద్దు చేయాలి.

ఈ అవగాహనా పత్రంలోని అంశాలకు తగిన సూచనలిచ్చి పటిష్టపరచవలసిందిగా, రుణ భార విముక్తికి తగిన ఆందోళనా కార్యక్రమాన్ని రూపొందించవలసిందిగా సదస్సుకు విజ్ఞప్తి చేస్తున్నాము.

వందిగామ,
20-5-2002.

అభ్యుదయం


క్షణం క్షణం క్షామ వ్రణం - క్షేమంగా పెరుగుతోంది
దినం దినం బతుకు - దీనంగా మారుతోంది
దుర్భాగ్యం దౌర్భాగ్యం - దారుణంగా సాగుతోంది
కుల మతాల కళేబరం - కుళ్ళును వెదజల్లుతోంది
లంచగొండి వ్యవహారం - లక్షణంగా సాగుతోంది
బ్లాక్ మార్కెట్ పెనుభూతం - భరతనాట్యం మాడుతోంది

పీడిత జనకంటకమై - పాలన కొనసాగుతోంది
పేదజనుల కడుపునుండి - విప్లవాగ్ని రగిలినపుడు
దుష్టశక్తులేవైనా - దహనమౌట అనివార్యం
సమభావం సమధర్మం - సర్వత్రా వికసించగ
ప్రగతిపథం నందు జగతి - వయనించుట అభ్యుదయం

కా॥ కొల్లా వెంకయ్య నాల్గవ వర్ధంతి సందర్భంగా :

రాష్ట్రంలో భూసంస్కరణల అమలు: కొన్ని చేదు నిజాలు, మౌలిక ప్రశ్నలు

- గొర్రెదాటి నరేంద్రనాథ్, కన్వీనర్, భూసంస్కరణల కార్యాచరణోద్యమం



కొల్లా వెంకయ్య

తన జీవితమంతా పేద ప్రజల విమోచనకై తుది శ్వాస వరకు పోరాడిన మహాయోధులు కా॥ కొల్లా వెంకయ్య అడుగుజాడల్లో, వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళేందుకు ప్రకృతి వనరులైన భూమి, నీరు, అడవి పేద ప్రజలకు స్వాధీన పరచేందుకు, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని ప్రజా సంఘాలు, వ్యక్తుల కలయికగా భూ సంస్కరణల అమలు ఉద్యమాన్ని, నేటి పాలకుల బూటకపు ప్రపంచీకరణ విధానాన్ని ఎదిరిస్తూ, ప్రత్యామ్నాయ వ్యవస్థకు పునాదిగా తీర్చిదిద్దేందుకు నడుంబిగించాల్సిన సమయమిది.

- రచయిత

✦ కార్పోరేట్ వ్యవసాయం వైపు, ఎగుమతుల ఆధారిత వ్యవసాయం వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచబ్యాంకు, డబ్ల్యూటిఓ ప్రపంచీకరణ దృక్పథంతో పథకాలు తయారు చేస్తున్నారు. ఇందులో భాగంగా చిన్న చిన్న కమతాలు అనుత్పాథకమని, భారీ పెట్టుబడులతో కూడుకొన్న ఆధునిక ఎగుమతి ఆధారిత వ్యవసాయానికి అనుకూలము కాదని; భూపరిమితి చట్టాల్లో సవరణలు తీసుకురావటానికి చిన్న చిన్న కమతాలను కేంద్రీకరించి పెద్ద కమతాలుగా తీర్చిదిద్దటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోచిస్తున్నాయి.

✦ నేడు ప్రపంచ వాణిజ్య సంఘం ఒడంబడిక పుణ్యమా అంటూ విచ్చలవిడిగా విదేశాల నుండి వ్యవసాయోత్పత్తులు దిగుమతులు కావడంతో గిట్టుబాటు ధర లేకుండా, మరొక పక్క కరెంటు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు వంటి పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడంతోటి వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నది. రైతులు అప్పుల పాలై కొందరు ఆత్మహత్య చేసుకుంటున్నారు. లక్షలాది ఎకరాలు బీడుగా వదిలేస్తున్నారు.

వత్తిడి ఎక్కువ ఆదాయం తక్కువ

సం॥	గామీణ జనాభా శాతం	జనాభా సంఖ్య కోట్లలో	స్థూల రాష్ట్ర ఉత్పత్తి
1951	83	2.57	51
2001	73	5.52	28

✦ వ్యవసాయేతర రంగాల్లో అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెద్దగా లేనందువల్ల గ్రామీణ జనాభా శాతం గత 50 ఏండ్లుగా తగ్గినా సంఖ్యాపరంగా రెట్టింపు పైనే అయ్యింది. కానీ అదే సమయంలో స్థూల రాష్ట్ర ఉత్పత్తి జి.డి.పి:లో భాగముగా చూస్తే సగానికి పడిపోయింది. అంటే తలసరి వ్యవసాయోత్పత్తి విలువ గత 50 సంవత్సరాలలో 4 రెట్లు తరిగిపోయింది. మరో పక్క భూమిపై వత్తిడి కూడా రెట్టింపైనది.

✦ మన రాష్ట్రంలో భూకమతాలు 1.00 కోట్లు ఉన్నవి. సాగుభూమి 3.00 కోట్ల ఎకరాలున్నది. ఇందులో సాగునీటి ఆధారిత భూమి 1.08 కోట్ల ఎకరాలు: సగటున ఒక్కొక్క కమతంలో భూమి విస్తీర్ణం 3.4 ఎకరాలుగా ఉన్నది. ఇట్టి పరిస్థితులలో వ్యవసాయ రంగమే తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయినపుడు భూపంపకం గురించి మాట్లాడటం ఎంత వరకు సమంజసం.

✦ గ్రామీణ జనాభా అధికంగా ఉండి, సాగుభూమిపై వత్తిడి అమితంగా ఉన్న ఆసియా దేశాలు అనేకం ఈ రోజు అభివృద్ధి పథంలో ముందున్నాయి. ఉదా॥ చైనా, జపాన్, తైవాన్, దక్షిణ కొరియా ఈ దేశాలన్నింటిలోనూ 40.....50 సంవత్సరాల క్రితంలో భూసంస్కరణ అమలు చేసి మొత్తం సాగు భూమిలో చైనాలో 4.3 శాతం, తైవాన్‌లో 37 శాతం, జపాన్‌లో 33 శాతం, దక్షిణ కొరియాలో 32 శాతం ఉన్న వారి నుండి లేనివారికి పంచి ఇవ్వగా మన భారతదేశంలో అనేక భూసంస్కరణల చట్టాల కింద గత 55 సంవత్సరాలలో కేవలం 1.50శాతం మాత్రమే పంపిణీ చేశారు. ఇందులోనూ అనేక అవకతవకలు జరిగాయి.

✦ నేటికీ మన రాష్ట్రంలో, దేశమంతా కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి: భూ కమతాల్లో తీవ్ర వ్యత్యాసమున్నది.

2.50 ఎకరాల కింద కమతాలున్నవారు 59 శాతం. వారి చేతుల్లో నున్న సాగుభూమి 22 శాతం. 10 ఎకరాలు పైబడి కమతాలున్న వారు 6శాతం. వారి చేతుల్లో నున్న సాగుభూమి 31 శాతం.

✦ చైనా, జపాన్, దక్షిణ కొరియాలాగ అభివృద్ధి చెందాలంటే పల్లెల్లో మన పునాది గట్టిగా ఉండాలి. అనగా పల్లెల్లో వ్యవసాయంపై ఆధార పడుతున్న ప్రజలందరికీ అంతోఇంతో నీటి వసతి కలిగి ఉన్న సాగుభూమి వారి చేతుల్లో ఉండాలి. అలా చేయటం వల్ల వారి ఆహార కొరత తీరిపోతుంది. వందల కోట్లు: 800 కోట్లు: సబ్సిడీలపై బియ్యం వారికి ప్రతి సంవత్సరం పంపిణీ చేయాల్సిన అవసరం లేదు.

✦ ఏ రకంగా చూసినా వ్యవసాయ రంగంపై జనాభా వత్తిడి విపరీతంగా ఉన్నది. ఇంగ్లీషు వారు రాక మునుపు 40 శాతం ఉన్నది. నేడు ఇంక 70శాతం దరిదాపుల్లోనున్నది. ఈ అధిక జనాభాను వ్యవసాయేతర పనుల్లోకి మళ్ళించాలి. అలా జరగాలంటే ముందు కొంత నీటి ఆధారిత భూమి ఉన్నవారి నుండి లేని వారికి అందించగలిగితే వారు ఆర్థికంగా సాంఘికంగా, రాజకీయంగానూ నిలదొక్కుకోగలుగుతారు.

ఈ ఆధారంతో వారికి విద్యావకాశాలు, వివిధ వృత్తుల్లో నైపుణ్యతకు అవకాశాలు కల్పిస్తే వారు వాటిని అందుకొని సద్వినియోగం చేసుకొని వ్యవసాయేతర వృత్తులలో అభివృద్ధి చెందగలుగుతారు.

ఆర్థికంగా ఇది సాధ్యమా, అంత భూమి ఉన్నదా?

✦ 12.5 ఎకరాలు పైబడి ఉన్న కమతాల వారి చేతులలో ఉన్న సాగునీటి ఆధారభూమి 22.27 లక్షల ఎకరాలు: 20 శాతం:

✦ ఇందులో సగం భూమి సేకరించినట్లైతే నీటి ఆధారిత మిగులు భూమి 11 లక్షల ఎకరాలు

0.50 ఎకరా చొప్పున పంచితే 22లక్షల

లబ్దిదారులు సంఖ్య కుటుంబాలు

✦ అన్ని కులాలకు చెందిన 44లక్షల

వ్యవసాయ కూలీల కుటుంబాలు కుటుంబాలు

✦ ఇందులో వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్న ఎస్.సి, ఎస్.టి కుటుంబాలు 7 లక్షలు: భూమి లేని వారు: 0.50 ఎకరా నీటి ఆధారిత భూమి పంపిణీ చేయవలసినచో

అవసరమైన భూమి 22 లక్షల ఎకరాలు

సేకరించగల మిగులు ॥ లక్షల ఎకరాలు భూమి

ఇంకా అవసరమైన భూమి ॥ లక్షల ఎకరాలు

✦ అన్ని ప్రాంతాలలో నీటి ఆధారిత భూమి దొరక్కపోవచ్చు. అంతేగాక పై లెక్క ప్రకారం ఇంకా 11 లక్షల ఎకరాలు అవసర ముంది. మన రాష్ట్రంలో నేడు ప్రభుత్వ చట్టాల ప్రకారం పేదలకు స్వాధీనపరచవలసిన భూమి 38 లక్షల ఎకరాలకు పైనే ఉంది.

✦ ప్రభుత్వం పేదల పేర పంచిన బంజరు భూములు మరియు సీలింగు మిగులు భూములు 42 లక్షల ఎకరాలు. ఇందులో అనర్హుల చేతుల్లో ఉన్న భూములు కనీసం 40 శాతం. ఇది తనిఖీ చేసి అర్హులైన పేదవారికి స్వాధీనపర్చాల్సి ఉంది. 16 లక్షలు

✦ దేవాలయ, మఠం భూములు, స్థానిక పేదలకు కౌలుకు గాని, లీజుకు గాని అమ్మకానికి గానీ ఇచ్చేటట్లు చట్టం సవరణ చేసి పంపిణీ చేయాలి. 3.20 లక్షలు

✦ భూదాన భూములు 2.42 లక్షల ఎకరాలలో 1.10 లక్షల ఎకరాలు ఇంకా పంపిణీ చేయవలసి ఉన్నది. కాని ఇందులో చాలా వరకు నిరుపయోగమైనది. కొంత కోర్టులలో మరికొంత దానకర్తల వారసులు, ఇతరుల దురాక్రమణలో ఉన్నది 1.10 లక్షలు

✦ అన్యాక్రాంతములైన గిరిజనుల భూముల చట్టపరంగా వారికి తిరిగి స్వాధీనపరచవలసి ఉన్నది. 1.4 లక్షలు

✦ కోర్టులలో చిక్కుకున్న సీలింగ్ మిగులు భూములు 2.29 లక్షలు

✦ కోర్టులలో చిక్కుకున్న జమీందారీ, ఇనాందారీ, స్త్రోత్రీయం భూములు

✦ నక్సలైట్‌లు పేదలకు పంచి ఇచ్చిన భూములను పోలీసుల భయంతో పేదలు దున్నకుండా బీడు పెట్టినది. 1.50 లక్షలు

మొత్తం 38.09 లక్షలు

అడవి బంజర్లు

పైన సేర్కొన్న భూములే కాక రాష్ట్రంలో అటవీ భూములు 157.62 లక్షల ఎకరాలు. ఇందులో అడవిగా అభివృద్ధి చేయవలసిన బంజరు కనీసం 50 శాతం: 60 లక్షల ఎకరాలు.

వనసంరక్షణ సమితుల ద్వారా బాధ్యతాయుతంగా పేదవారికి ఈ భూములను స్వాధీన పరచవచ్చును

✦ నీటి వసతి ఉన్న భూములను కొందరు మేధావులు సూచించిన విధంగా ప్రభుత్వం వారు కొని పేదలకు పంచదలచినచో ఎకరాకు 2 లక్షల రూపాయల చొప్పున 11 లక్షల ఎకరాలకు 22 వేల కోట్లు ఖర్చు అవుతుంది. అలాగే 3 లక్షల ఎకరాలు మెట్ట భూమిని ఎకరా 20 వేల రూపాయలు చొప్పున సేకరించినచో మరో 6200 కోట్లు ఖర్చు కాగలదు. అనగా 17200 కోట్లు లేదా సుమారు 20000 కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వం భూస్వాములకు నష్ట పరిహారం చెల్లిస్తూ ఈ పని చేయవచ్చును. కానీ అనుభవ రీత్యా, అవినీతిలో మునిగి తేలుతున్న అధికారులు, రాజకీయ నాయకులు, భూస్వాములు కుమ్మక్కై కోట్లు దిగమింగటం తప్పితే ప్రజా ఉద్యమాల వత్తిడి లేనిదే పేదలకు ఒక్క ఎకరా కూడా స్వాధీనం కాదని గత చరిత్ర, మన అనుభవం చెబుతున్నాయి.

✦ కావున విశాల ప్రాతిపదికపై భూసంస్కరణల అమలుకోసం అన్ని ప్రజా సంఘాలు కలిసికట్టుగా ఉద్యమించనిదే ఈ పని సాధ్యం కాదు. రెండు సంవత్సరాలలో రాబోవు ఎన్నికలలో మరల భూసంస్కరణల అమలు ప్రధాన అంశం కావాలి. ఇదీ మన చేతులలోనే ఉన్నది.

✦ గిట్టుబాటు ధరలు లేక, పెట్టుబడులు లేక దేశ వ్యవసాయరంగమే తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పుడు ఈ వైరుధ్యాన్నే ప్రధానంగా తీసుకోవాలని; ఇతర సమస్యలు ..... రైతు కూలీలకు భూపంపిణీ, కనీస వేతనాలు, ఉద్యమాన్ని పక్కదోవ పట్టించేవిగా ఉన్నాయని కొందరు మేధావులు బలంగా వాదిస్తున్నారు.

ఉదా: ఎం.ఇ.వి ప్రసాదరెడ్డి, వార్త 6-6-2002 :

✦ వ్యవసాయ రంగ సంక్షోభమే ప్రధాన సమస్యగా, ప్రపంచీకరణ పేరుతో అభివృద్ధి చెందిన దేశాల బహుళ జాతి కంపెనీలతో నేరుగా పోరాడాల్సిన ఈ సమయంలో వ్యవసాయ కూలీల బ్రతుకు తెరువు సమస్యలను విస్మరించమనటం ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా ఏ మాత్రం సముచితం కాదు. బాగా ఉన్న వారినుండి మరియు చట్టాలను ఉల్లంఘించి అక్రమంగా భూములు అనుభవిస్తున్న వారినుండి, సాగు భూములను సేకరించడంలో తప్పేమి ఉన్నది? ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ రంగం ఎలా నష్టపోతుంది? చిన్న కమతాల రైతులే అధికోత్పత్తి సాధిస్తారని ఎన్నో పరిశీలనలు రుజువు చేశాయి. ముఖ్యంగా గ్రామీణ పేదలు బలోపేత మవటానికి, వారి కొనుగోలు శక్తి పెరగటానికి భూ సంస్కరణలే పునాది. ఈ బలమైన పునాదినుండి వారు ఇతర రైతాంగంతో చేయికలిపి ఒక ప్రక్క దేశ ప్రజల నిత్యావసరాలను తీరుస్తూ బహుళజాతి కంపెనీల ధాటికి సవాలుగా నిలబడగలుగుతారు. ★

అన్నింటికి వొచిపోయి అరవలేనివొడా
ఎన్నిళ్ళో ఆవేదన ఆలకించవేరా
భూస్వాముల అప్పునబడి కదలలేనివొడా
భూమంతా నాదేనని ఎదిరించగలేవా

ఆలయ భూములు గ్రామీణ పేదలకూ, గిరిజనులకూ చెందాలి!

దేవాదాయశాఖకు చెందిన 3.76 లక్షల ఎకరాల భూములకు సంబంధించి రాష్ట్రమంత్రివర్గం కొన్ని ముఖ్య నిర్ణయాలను తీసుకుంది. కౌల్దారీ చట్టాలు దేవాలయ భూములకు వర్తించకుండా చేయటానికి దేవాదాయ చట్టంలోనూ, ఆంధ్రప్రాంత, తెలంగాణా ప్రాంత కౌల్దారి చట్టాలలోనూ సవరణలు చేయటానికి మూడు ఆర్డినెన్సులు తెస్తారు. నక్సలైటు ప్రాబల్యం వున్న ప్రాంతాలలో దేవాలయ భూమిని ఎస్సీ,బిసీ, గిరిజన సంక్షేమశాఖలకు అమ్మివేస్తారు. పేదవారైన కౌలుదారులకు మార్కెట్టు రేటు ఆధారంగా కౌలుకివ్వటమో, అమ్మటమో చేస్తారు. ఈ ఆర్డినెన్సులు, సవరణలు నిర్దిష్ట రూపంలో వచ్చేసరికి ఏవిధంగా ఉండినప్పటికీ, భూస్వామ్య వర్గాలకు దేవాలయ భూములను కట్టబెట్టేందుకూ, పేదకౌలుదారుల, గిరిజనుల హక్కులను కాలరాయటానికే ప్రభుత్వం నడుం కట్టింది. కనుక దేవాలయ భూముల పూర్వాపరాలను లోతుగా పరిశీలించాల్సి వుంది.

ఆలయ భూముల సమస్య దీర్ఘకాలం నుండీ చర్చనీయాంశంగా వుంటూ వస్తున్నది. రెండు శతాబ్దాల వలసపాలన ఫలితంగా ఏర్పడిన భూమి సంబంధాలు భారతదేశంలో ప్రభుత్వాన్ని పెద్ద భూస్వామిని చేశాయి (భూమిపై యాజమాన్య హక్కు కలిగి వుండటమన్న అర్థంలో). ఈ అర్థంలోనే రెండవ పెద్ద భూస్వామి దేవుడే. క్రైస్తవ మిషనరీల ఆస్తులు, వక్ఫ్ బోర్డుల ఆస్థులు వదిలివేసినా, హిందూ దేవాలయాలకు చెందిన భూములు కోట్ల ఎకరాలున్నాయి. భూస్వామ్య వర్గాలు తమ పట్టాభూములపై యాజమాన్యంతో పాటుగా, ప్రభుత్వభూములనూ, ఆలయ భూములను కూడా తమ ఆధీనంలో ఉంచుకుంటూ వస్తున్నాయి. ఆవిధంగా గ్రామీణ జీవితంపై తమవట్టును కొనసాగించుకోవటానికి ఈ భూములను ఒక సాధనం చేసుకున్నాయి.

దేశంలో, ప్రత్యేకించి మద్రాసు ప్రెసిడెన్సీలో, ప్రభుత్వ భూములనూ, ఆలయ భూములనూ వ్యవసాయ కూలీలకూ, పేద రైతులకూ కౌలు కివ్వాలన్న డిమాండు ముందుకు వచ్చింది. ప్రధానంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిగాయి. ఫలితంగా ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం అమలులోకి వచ్చింది. కమ్యూనిస్టు ఉద్యమం బలంగా వేళ్ళూనుకున్న ప్రాంతాలలో వ్యవసాయ కూలీలూ, పేద రైతులూ సంఘటితపడి ఆలయ భూములను కౌలుకు పొందగలిగారు. మిగిలిన ప్రాంతాలలో భూస్వామ్య వర్గాలే పేదలను బెదిరించి వేలానికి రాకుండా చేసీ, లేక బినామీల తోనూ ఈ భూములను తమ ఆధీనంలోనే ఉంచుకున్నాయి. కౌల్దారి చట్టాలు వచ్చిన తర్వాత వీరంతా కౌల్దారులైపోయి దేవాదాయశాఖ అధికారులతో చేతులు కలిపి, కనీస కౌలు కూడా చెల్లించకుండా దేవాలయ ఆదాయాలకు గండిపెట్టారు. పట్టణ ప్రాంతాలలోని ఆలయ భూములను ధనాఢ్య వర్గాలే కబ్జా చేసి, రియల్ ఎస్టేట్లుగా చేసి లాభాలు గడించాయి.

ఈ నేపధ్యంలో ఆలయాల నిర్వహణకు నిధుల కొరత ఏర్పడిందంటూ, ఆలయ భూములను అమ్మి, వచ్చిన ధనాన్ని జాతీయ బ్యాంకులలో డిపాజిట్టు చేసి, దానిపై వచ్చే వడ్డీతో ఆలయ నిర్వహణ సాగించాలని ఎమర్జెన్సీ కాలంలో కాంగ్రెసు ప్రభుత్వం ప్రతిపాదించింది. 20 అంశాల కార్యక్రమం, భూముల పంపకం వంటి ప్రకటనలతో గ్రామీణ పేదలకు ఆశలు కల్పించి జోకొడుతున్న సమయంలో, ఇలాంటి చర్యకు ప్రజావ్యతిరేకత వస్తుందన్న కారణం చేతకావచ్చు, కాంగ్రెసు ప్రభుత్వం ఆలయభూముల అమ్మకాన్ని ఒకవిధానంగా ప్రకటించలేకపోయింది. అయితే ఆలయ భూములను విడివిడిగా అమ్మటానికి ప్రత్యేక అనుమతి నివ్వటం ఒక పద్ధతిగా అనుసరిస్తూ వచ్చింది. అదే సమయంలో ఆలయ భూములు అమ్మకం చేస్తామంటూ అప్పుడప్పుడు ప్రకటనలు చేస్తూ వచ్చింది.

తెలుగుదేశం పార్టీ ఆలయభూముల అమ్మకాన్ని ఒక విధానంగా చేపట్టి, భూస్వాములకు కట్టబెట్టి, తన వర్గ పునాదిని బలీయం చేసుకోవాలని భావించింది. ఆలయభూముల సమస్యపై 1984లో చల్లాకొండయ్య కమిషన్‌ను నియమించింది. రెండు సంవత్సరాల తర్వాత కమిషన్ సమర్పించిన నివేదికను విడుదల చేసింది. ప్రజాభిప్రాయ సేకరణ చేసి అంతిమ నిర్ణయం చేస్తామంటూ ప్రకటించింది.

చల్లా కొండయ్య కమిషన్ నివేదికను అర్థసత్యాలతోనూ, వక్రభాష్యాలతోనూ నింపి, ప్రభుత్వం ముందే చేసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా నివేదికను తయారు చేసిందని 'జనశక్తి' (5-7-1986) వ్యాఖ్యానించింది. కమిషన్ వితండ వాదనలకు ఒక ఉదాహరణ చూడండి. పురుషోత్తపట్నంలోని 917 ఎకరాల భద్రాద్రి రాముని భూమిని ఏజన్సీ ప్రాంత చట్టం నుండి మినహాయించాలని వాదించటానికి గిరిజనుల పేదరికం, ఆధునిక సాగుపద్ధతులు ఉపయోగించలేని వారి అశక్తతా వల్ల బీడుభూమిగా ఉండి ఆదాయం రావటంలేదని వాదించింది. దేవాలయాల "దీపం పెట్టే దిక్కయినా" లేని స్థితికి కబ్జాదార్ల "చండీతనం" కారణంగా చూపెట్టాల్సి వచ్చినపుడు అదే 917 ఎకరాల భద్రాద్రి రాముని భూమిని గిరిజనేతర "కలిమి బలిమి కలిగిన" భూస్వాములు ఆక్రమించి లిటిగేషనుతో పైసా చెల్లించకుండా వచ్చిన వైనాన్ని ఒక పేజీ నిండా వివరించింది. ఇలాంటి అతుకులబొంత నివేదికతో కమిషన్ సూచనలు చేసింది. వాటిలో ప్రధానమైనవి: ఆలయ భూములను బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడిన వారికివ్వాలి. లేదా టెండర్-కమ్-బహిరంగ వేలం ద్వారా విక్రయించాలి. ఏజన్సీ ప్రాంతంలోని భూములను గిరిజనులకే కౌలు కివ్వాల్సి వుంటుంది. దీనిని తప్పించుకోవటానికి ఏజన్సీ ప్రాంత 1959 చట్టం నుండి ఆలయ భూములకు మినహాయింపునిచ్చి బహిరంగ వేలం ద్వారా కౌలు కివ్వటమో, అమ్మటమో చేయాలి. ఈ సూచనలు అమలు జరిగితే పేదలకు, గిరిజనులకు ఆలయ భూములు దక్కకుండా పోతాయి. కమిషన్ మాటల్లోనే "కలిమి బలిమి" గలిగి వుండి ఇన్నాళ్లూ ఆలయ భూములను అవ్యవనంగా అనుభవిస్తున్న భూస్వాములు "బహిరంగ వేలం"లో వాటిని తమ చేయి జారిపోనిస్తారని భావించలేము. సిండికేట్లుగా ఏర్పడి "సజావు"గా సాగే వేలంలో వారి కబ్జాలను చట్ట బద్ధం చేసుకుంటారు.

కారణాలేమైనా కానీ, ఎంత హడావుడి చేసినా, ఈ కమిషన్ నివేదికను అమలు జరిపే చర్యలను ఎన్.టి.ఆర్.ప్రభుత్వం తీసుకోలేదు. "అనుభవజ్ఞు'లైన కాంగ్రెసు నాయకులబాటనే నడిచింది. ఆలయ భూముల అమ్మకానికి అడపాదడపా ప్రత్యేక అనుమతినిచ్చే విధానాన్నే అమలు జరుపుతూ వచ్చింది. ఆనాటి నుండి ఎవరు ముఖ్యమంత్రి అయినా ఈ విధానాన్నే పాటిస్తూ వచ్చారు.

విశాఖపట్నం నగరం పెరిగిపోయి సింహాద్రి అప్పన్న భూములకు విపరీతంగా రేటు పెరిగింది. రాజకీయ ప్రాపకంతో భూకబ్జాదారులు బయలుదేరి సింహాద్రి అప్పన్న భూములను సామ్మా చేసుకున్న ఉదంతం రచ్చకెక్కింది. దీనిపై వాదోపవాదాలూ, చర్చోపచర్చలూ జరిగాయి. చివరికి వీటిని క్రమబద్ధీకరణ చేయాలని నిర్ణయం చేసి జీవోలను జారీ చేశారు.

సింహాద్రి అప్పన్న భూముల కుంభకోణాన్ని సృష్టించింది పాలకులే. ఏళ్ల తరబడి సాగుతున్న కబ్జాలను చూస్తూ వుండటం వెనుక తమ అనుయాయుల జేబులు నిండటమన్న తక్షణ ప్రయోజనమున్నా, ఈ ఉదంతం వెలుగులోకి వచ్చినపుడు ప్రజాభిప్రాయాన్ని తమకనువుగా మలిచి, పేదల, గిరిజనుల హక్కులను →

పాడిపరిశ్రమను సంక్షోభంలోకి నెడుతున్న పాలకుల విధానాలు

వ్యవసాయం. పశుపోషణ పరస్పరానుబంధ ఉత్పత్తి వ్యాపకంగా అనాది కాలం నుండి మన దేశంలో సాగుతున్నది. వరి, జొన్న పంటలు మన ఆహార అవసరాలను తీర్చడంతోపాటుగా పశువుల మేతకు ఉపయోగపడేవి. వ్యవసాయక పనులలో వీటిని వినియోగించటంతో పాటుగా అవి యిచ్చే పాల ఉత్పత్తులు మన పౌష్టికాహార అవసరాలను తీర్చేవి. పశువుల ఎరువులతో భూసారాన్ని పెంచుకొన్నందువల్ల వ్యవసాయ దిగుబడులు నిలకడగా ఉండేవి. అందువల్ల దేశం పశుగణ సంఖ్యలో అగ్రస్థానంలో ఉండేది. పాలు, వాటి ఉత్పత్తులలో మార్కెట్టు ఏర్పడకపోవటంతో గ్రామాలలో పాలు సమృద్ధిగా దొరికేవి. పాడి పశువుల నుండి లభ్యమయ్యే దిగుబడి తక్కువగా వున్నా ఆనాటి అవసరాలను తీర్చగలిగేవి.

పైరు పచ్చ విప్లవం పేరిట పొట్టి రకం వరి వంగడాలు ప్రవేశపెట్టడంతో ధాన్యం దిగుబడి పెరిగిందిగానీ గడ్డి తగ్గింది. దీనితో పాడిపశువుల పోషణ రైతాంగానికి భారమవుతూ వచ్చింది. పాడిలేని రైతు వుండని స్థితి మారిపోయింది.

దీనికి తోడుగా ఆధునిక పాడి పోషణ పద్ధతులతో పాల ఉత్పత్తులు పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వాలు విదేశాల నుండి అధిక దిగుబడినిచ్చే పాడిపశువులనూ, వీర్యాన్ని తెచ్చి సంకరజాతి పశువులను ప్రవేశపెట్టాయి. అధికదిగుబడి విత్తనాలకు ఎరువులూ, నీరు ఉంటే తప్ప ఎలా ధాన్యం దిగుబడి వుండదో, ఈ సంకరజాతి పశువులకు కూడా ఎక్కువ దాణా, తగినంత సంరక్షణా లేకపోతే పాల దిగుబడి తగ్గిపోతుంది. దీనితో పశుదాణా, మందులతో పశుపోషణ ఖర్చుతో కూడినదిగా మారింది. ఇది రెండు రకాల ఫలితాల నిచ్చింది.

ఒకటి : పశుపోషణ వాణిజ్య స్థాయికి పెరిగింది. పెద్ద సంఖ్యలో పశువులను పెట్టి, దాణా, సంరక్షణ సాగించి పాలను నగరాలలో అమ్ముకొనే ప్రైవేటు డైరీల స్థాయికి పెరిగింది. ఒకటి రెండు పశువులతో పాడి చెయ్యటం మోయలేని భారమయింది.

రెండు : రైతులు ఒకటి రెండు పశువులతో పాడిచేయటం కొనసాగింది. సస్యవిప్లవం సంక్షోభంలో పడటంతో కౌలు రైతులు ఈస్థాయి పాడి సాగిస్తున్నారు. కౌలు రేట్లు అధికంగా వున్నా కౌలుకు తీసుకొని, పంట కౌలుకూ, ఖర్చులకూ పోయినా, గడ్డి మిగులుతుంది. గనుక దానిని పశువుల దాణాగా వాడుకొని, పాలను అమ్ము కుంటే వచ్చే నెలనరి ఆదాయాన్ని నమ్ముకొని వీరు - కుటుంబమంతా

→

→

ఆలయభూములు ...

త్రోసిరాజని, ఆలయభూములన్నీ భూస్వాములకు కట్టబెట్ట గల "దూరదృష్టి" కూడా ఉందన్నది నిస్సందేహం. కనుకనే ఇప్పుడు సింహాచలం భూముల క్రమ బద్ధీకరణ'కు (అంటే కబ్జాదారులకు అపరాధ రుసుంతో భూములకు పట్టాలివ్వటం), ఉపయో గిస్తున్న ప్రభుత్వ ఉత్తర్వులనే రాష్ట్రంలో ఇతర చోట్ల ఆక్రమిత దేవాదాయ భూములకూ వర్తింప చేస్తామని మంత్రి దండు శివరామరాజు ఢంకా బజాయించి చెప్పాడు. క్రమబద్ధీకరణ పేరిట ఆక్రమణదారులకే భూములు కట్టబెడతారు. మరో మాటల్లో చెప్పాలంటే చట్టాన్ని గౌరవించకుండా దాన్ని భూస్వాములు ధిక్కరిస్తే, చట్టాన్నే సవరించి తప్పుదిద్దుకుంటుందీ ప్రభుత్వం.

ఇప్పటికే 1 ఆఫ్ 70 చట్టాన్ని సవరించి ఏజన్సీ భూములపై గిరిజనుల హక్కులను కాలరాయాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది; చేస్తున్నది. చట్ట ప్రకారం గిరిజనులకే కౌలు కివ్వవలసిన ఆలయభూములను దశాబ్దాలుగా భూస్వాములు అనుభవిస్తున్నా లిటిగేషను పేరుతో చూస్తూ వూరుకుంది. 1959 ఏజన్సీ చట్టం పరిధి నుండి ఆలయ భూములకు మినహాయింపు ఇవ్వాలన్న చల్లా కొండయ్య కమిషన్ సూచననే మరో రూపంలో అమలు చేయటానికి పూనుకుంది. నక్సలైట్ల ప్రాబల్యమున్న ప్రాంతంలో, ఎస్సీ కార్పోరేషన్, బి.సి.కార్పోరేషన్, గిరిజన సంక్షేమశాఖ గనుక "ఆసక్తి" చూపిస్తే మార్కెట్టు రేటుకి వారికే అమ్మివేస్తారట. అవి పేదలకు పంపిణీ చేయవచ్చు నట. ఈ శాఖలకు ఆలయ భూమిని కొనుగోలు చేయటానికి నిధులివ్వలసింది ప్రభుత్వమే. నిధుల కేటాయింపు అంటే మొండిచెయ్యి చూపటం ప్రభుత్వ సహజలక్షణం. నిధులు లేకుండా ఈశాఖలు భూముల కొనుగోలుకు చూపే ఆసక్తి ఏముంటుంది? ఆసక్తి చూపలేదన్న సాకుతో ఈభూములను భూస్వాముల కు కట్టబెడతారన్నది ఎవరికైనా అర్థమౌతుంది. ఏజన్సీ చట్టాన్ని వమ్ము చేయటానికీ దళిత కౌలుదారులను తొలగించటానికీ వీరెంచుకున్న పద్ధతి "ఆసక్తి" కరమైనదే. దళితులనూ, గిరిజనులను మోసం చేయటానికే ఈ ఆసక్తి.

ఇప్పటికే ఆలయ భూములను కౌలు చేసు కుంటున్న పేద, మధ్య తరగతి రైతాంగాన్ని తొలగించటానికి, కౌలుదారీ చట్టాల రద్దుకు పూనుకున్నారు. అంటే వీరికున్న కౌలుహక్కును రద్దు చేస్తారు. బహిరంగ వేలంలో పాడుకొని వీరు కౌలు తీసుకోవాల్సి వుంటుంది. ఎన్నేళ్లుగానో కౌలు చేసుకుంటున్న వారికి ఏ హక్కులు లేకుండా చేస్తున్న ప్రభుత్వానికి భూమిలేని "పేదల"పట్ల మాత్రం ప్రేమ పుట్టుకొచ్చింది. దేవాలయ భూములను ఆక్రమించుకున్న వారిలో పేదలకు రెండున్నర ఎకరాలు మాగాణి లేదా ఐదుకరాల మెట్ట మార్కెట్టు రేటులో 75 శాతం నాలుగు వాయిదాలలో చెల్లించి స్వంతం చేసుకో వచ్చునట. చట్టప్రకారం కౌలుకు తీసుకున్నవారు బహిరంగ వేలంలోకి రావాలి. ఆక్రమించుకున్న వాడు మాత్రం తక్కువ రేటుకు కొనుక్కోవచ్చు. నిజంగా భూమిలేని నిరుపేదలకే ఈభూమి దక్కితే సంతోషించవలసిందే. అయితే భూమిలేని నిరుపేద గ్రామంలో పెత్తందార్లనుకాదని ఆలయ భూములను ఆక్రమించుకుని స్వాధీనంలో ఉంచుకున్న ఉదాహరణలెన్ని ఉన్నాయి? దీని నాసరా చేసుకుని బీనామా పేర్లతో పెత్తందారీ వర్గాలే ఆలయ భూములను కైంకర్యం చేస్తా యనటంలో సందేహం లేదు.

గ్రామీణ పేదలకూ, గిరిజనులకూ పంపకం చేయవలసిన భూములను దేవాలయాల దీనావస్థ పేరిట భూస్వామ్యవర్గాలకు కట్టబెట్ట పూనుకున్న ఈ మోసాన్ని ఎండగట్టాలి. ఈ చర్యలతో ఆలయాల ఆర్థికస్థితి మెరుగు పడుతుందనటం కల్ల. అమ్మిన డబ్బంతా ప్రభుత్వ ఖజానాకే చేరుతుంది ఇవ్వాళ కాకపోతే రేపైనా. తిరుపతి దేవస్థానం నిధులను ట్రెజరికే మార్చాలని ప్రయత్నించి భంగపడిన విషయం ఇంకా ప్రజలు మరిచిపోలేదు. ఈ దేవాలయ నిధులన్నీ ప్రభుత్వ లోటు పూరించు కోవటానికి ఉపయోగిస్తాయి. చివరికి మంత్రులు విదిలించినదే దేవాలయాలకు మిగులుతాయి.

ఏజన్సీ ప్రాంతంలోని ఆలయభూములు గిరిజనులకే కౌలుకివ్వాలనీ, మిగిలిన ఆలయ భూములను వ్యవసాయ కూలీలకూ, పేద రైతాం గానికి కౌలుకివ్వాలని డిమాండు చేయాలి. ఉద్య మించాలి. ప్రజలు ప్రజాతంత్ర వాదులూ ప్రభుత్వ మోసాన్ని అర్థం చేసుకుని గ్రామీణ పేదలకు సంఘీభావం తెలపాలి. పేదల హక్కులపై సాగుతున్న ఈ దాడిని అప్పుడు మాత్రమే నిలువరించగలం.

(జనశక్తి 15-7-2002 సంచిక నుండి)

→

పాడి పరిశ్రమ...

కాలు పాలంలో శ్రమ చేస్తున్నారు. వ్యవసాయానికి పాడి అనుబంధమన్న స్థితి తల్లక్రిందులై పాడికోసం వ్యవసాయంచేసే దుస్థితి ఏర్పడింది.

ఫలితంగా, ఆధునిక శాస్త్రీయ పద్ధతులలో నడిచే డెయిరీ ఫారంతోపాటుగా, ఒకటి రెండు పశువుల పాడితో కనీసస్థాయి పద్ధతులతో పాల ఉత్పత్తి సాగే స్థితి దేశంలో ఏర్పడింది.

ఈ పరిస్థితి విచిత్రంగానే కన్పించవచ్చును. కానీ మారుతున్న పరిస్థితులలో రైతాంగం దోపిడీకి గురవుతూ కూడా జీవనం సాగించడానికి పడిన ఘర్షణ ఫలితంగా ఈ పరిస్థితి ఏర్పడింది. నేడు పాల పరిశ్రమ రంగం, దాని విధానాలను రూపొందించే ఎవరైనా విస్మరించరాని అంశం యిది. కోట్లాది పేద, మధ్య తరగతి రైతాంగానికి పాడే ప్రధాన ఆదాయంగా వుంది.

ఈ పరిణామాలకు సమాంతరంగానే పాల ఉత్పత్తిని పరిశ్రమ స్థాయికి పెంచేందుకు సామ్రాజ్య వాదుల ప్రోత్సాహంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పాలసేకరణ, అమ్మకాలను సహకారరంగంలోకి తెచ్చింది. గుట్టలుగా పేరుకు పోయిన పాలపొడికి భారత్‌ను మార్కెట్టుగా చేయటం, శీతలీకరణ తదితర యంత్రాలను అమ్ముకొనటం, గ్రామాలలో పాలు కరువై పట్టణ ధనికులకు మాత్రమే అందుబాటులోకి రావటం వంటి వర్గ వ్యత్యాసాలను పెంచిన ఈ విధానపు దుష్ఫలితాలు అందరికీ తెలిసినవే. అయినా సహకార రంగంలో పాలసేకరణ గ్రామ సీమలలో రైతాంగానికి నిలకడైన ఆదాయాన్నిచ్చింది.

ఇక్కడే ఒక మౌలిక అంశాన్ని పేర్కొనాలి. దున్నేవానికే భూమి ప్రాతిపదికన విప్లవ భూ సంస్కరణలు అమలు జరిగివుంటే, రైతాంగం పాడి రంగంలో ఆధునిక విజ్ఞానాన్ని యిముడ్చుకోగల స్థితిలో వుండేవి. అప్పుడు సహకార రంగం వారి ఆదాయాన్ని గణనీయంగా పెంచి వుండేది. అలా జరగనందున నిలకడైన ఆదాయాన్నిస్తున్నప్పటికీ, రైతాంగం మరొక రూపంలో తీవ్ర శ్రమ దోపిడికి గురవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఫలితం మనిషికి రోజుకు 250 మిల్లీలీటర్ల పాలు అవసరం కాగా, సగటున నేడు 179 మీ.లీ. మాత్రమే లభ్యమవుతున్నాయి. ఇది సగటు లెక్క. పట్టణంలోని ధనాఢ్య వర్గాలు ఐస్‌క్రీములు, కోవాలు వంటి రూపాలతో లీటరు వరకు వాడుతున్నారు. కాగా పేద వర్గాలు కొనుగోలు శక్తి లేనందున పాల రుచే ఎరుగని స్థితి ఉంది.

పైన పేర్కొన్న చిన్న రైతుల శ్రమ వల్ల పాల దిగుబడి పెరుగుతూనే వస్తున్నది. పాడిపరిశ్రమ నుండి 16 శాతం ఆదాయం లభిస్తున్నది. ఆంధ్ర లోని డెల్టా ప్రాంతాలలో వరి పంట తర్వాత పాల ఉత్పత్తి రెండవ స్థానంలో వుంది.

నూతన ఆర్థిక విధానాలతో పాడి పరిశ్రమ నాశనమయ్యే స్థితి ఏర్పడింది. ఈ రంగం నుండి ప్రభుత్వం తన బాధ్యతను వదిలి వేసుకుంటున్నది. 3వ పంచవర్ష ప్రణాళికలో 7 శాతం నిధులను కేటాయించి ఖర్చు చేయగా, 9వ ప్రణాళికలో 3 శాతం కేటాయించినా ఖర్చు మాత్రమే చేయలేదు. అరకొరగానైనా ఎదో మేరకు పని చేస్తున్న పశు సంవర్ధక శాఖల సేవలను ఒక వాణిజ్యంగా మార్చ నున్నారు. ఆ ఖర్చులను అక్కడే రాబట్టాలన్న ఆలోచనతో యూజర్ ఛార్జీలను వసూలు చేయ టానికి రంగం సిద్ధం చేస్తున్నారు. అంటే పశువుల ఆస్పత్రికి వెళితే ఫీజు చెల్లించాల్సి వస్తుంది.

ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలతో పాల పొడి దిగుమతులు చేసుకోవాల్సి వస్తున్నది. గత ఏడాది 10 వేల టన్నుల పాలపొడి పంజాబు, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాలకు దిగుమతి అయ్యింది. సామ్రాజ్య వాద దేశాలు తమ పాడి రైతులకు అనేక సబ్సిడీలు యిస్తున్నందున పాలపొడి చౌకగా దొరికి దిగుమతి అవుతూన్నయి. వీటి నుండి తయారైన పాలు లీటరు 7 రూపాయలకు అమ్మటంతో రైతాంగం ఆందోళన చేశారు. దానితో ప్రభుత్వం వీటిపై 30 శాతం సుంకాన్ని విధించి చేతులు దులుపుకుంది. డబ్ల్యూటిఓ ఒప్పందం ప్రకారమే 300 శాతం వరకూ సుంకం విధించవచ్చు. సబ్సిడీలిచ్చే సంగతలా వుంచి, అన్యాయమైన పోటీ నుండి పాడి పరిశ్రమకు రక్షణ కల్పించేందుకు పూనుకోలేదు. ఈ దిగు మతుల ఫలితంగా మొట్టమొదట ఉపాధి కోల్పోయేది చిన్నరైతులే.

పాల ఉత్పత్తికి ప్రధాన కారకులుగా వున్న చిన్న రైతులు దెబ్బతినటమంటే, దేశీయ పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. అప్పుడు దిగుమతైన పాలరేట్లను పెంచివేసి దోపిడీ సాగిస్తారన్నది అనేక చేదు అనుభవాల తర్వాత తెలుస్తున్న వాస్తవం.

దేశీయ పాల ఉత్పత్తిని దెబ్బతీయటంతో పాటుగా, సేకరణ - అమ్మకాలు రంగంలో వున్న సహకార రంగాన్ని కూడా నాశనం చేయటానికి పూనుకున్నారు. ఈ రంగంలో ప్రైవేటు డైరీలను అనుమతించారు. కుప్పలు తెప్పలుగా ప్రైవేటు డైరీలు వచ్చాయి. వీటి పై ఎలాంటి నియంత్రణా లేకుండా పోయింది. ఇవి రైతులకు సరిగా చెల్లింపులు చేయటంలేదు. వినియోగదారులకు నాణ్యమైన పాలను సరఫరా చేయటంలేదు. వీటి పోటీ పేరుతో సహకార డెయిరీలను నీరస పరిచారు. అక్రమ యాజమాన్య పద్ధతులు, అవినీతితో వీటిని నష్టాలతో ముంచారు. రాజకీయ జోక్యంతో వాటిని అక్రమాలకు నిలయం చేశారు. ఎలాంటి హయా లేకుండా, అసలు కొనుగోలు దారుడి చెల్లింపుశక్తి ఏమిటో తెలుసుకోకుండా న్యూజిలాండులోని కొనుగోలు దారుడి అప్పుపై పాలను అమ్మి అది వసూలు కాకపోతే పోటీ వల్ల రిస్క్ తీసుకోవాల్సి వచ్చిందనీ, వ్యాపారంలో ఇలాంటి నష్టాలు సహజమేనని సంగం డైరీ ఎం.డి సమర్థించుకొనటం - పాడుగు కొయడానికే పాలకులు పూనుకొన్నారని స్పష్టం చేస్తుంది. ఈ నష్టాలను చూపే సహకారరంగమంటేనే నష్టాల మయమంటూ వీటిని భరించలేమంటూ, అమ్మివేయటానికి పూనుకుంటున్నారు. 70 కోట్ల ఆస్తులు కలిగిన కృష్ణాజిల్లా సహకార డైయిరీని 20 కోట్లకు బెంగుళూరుకు చెందిన వ్యక్తికి అమ్మబోతున్నారంటే రైతాంగపు శ్రమతో ఏర్పడిన ఆస్తులను ఎలా ధారాదత్తం చేస్తున్నారో అర్థమౌతుంది.

విధాన పరంగా రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగాన్ని నాశనం చేసేందుకు చర్యలు తీసుకుంది. 1964 చట్టం నుండి వీటిని తప్పించి 1995లో చేసిన చట్టం పరిధిలోకి వీటిని తెచ్చింది. ఈ మార్పు వల్ల జిల్లా సమితిలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘములకు ఎలాంటి హక్కులు లేకుండా చేశారు. నష్టాలు వస్తే ఉత్పత్తిదారుల సహకార సంఘాల మీద వాటిని రుద్దటానికి ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో గుంటూరు సమితి, విశాఖ సమితి 1995 చట్టంలోకి యిప్పటికే మారాయి. ఈ చట్టంలోని మారని కృష్ణాజిల్లా సమితి ఉత్పత్తిదారులకు లీటరుకు 17 రూ॥లు చెల్లిస్తుండగా, గుంటూరు సమితి 15 రూ॥లు విశాఖ సమితి 13 రూ॥ 50 పై. మాత్రమే చెల్లిస్తున్నాయి. కొనుగోలు రేటును జిల్లా సమితి ఏక పక్షంగా తగ్గించే అధికారాలు 1995 చట్టం ద్వారా సంక్రమించాయి. సహకార సంస్థను వాణిజ్య సంస్థగా మార్చేందుకు తగిన పునాదిని ఈ చట్టం వేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఈ విధానాల ఫలితంగా చిన్న రైతాంగం దెబ్బ తింటారు. పాల ఉత్పత్తి నుండి నెట్టివేయబడతారు. దేశీయంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ప్రతి మూడెళ్ల కొకసారి కోళ్ళ పరిశ్రమను సంక్షోభంలో పడవేసి, పౌల్ట్రీ రంగం నుండి చిన్న రైతాంగాన్ని నెట్టివేసి, దానిని వాణిజ్య పరిశ్రమ స్థాయికి పెంచారు. దానిని పెనవేసుకుని ప్రౌల్ట్రీ రంగంలో సామ్రాజ్యవాద దోపిడీ పట్టు ఎలా పెరిగిందో, పాడి పరిశ్రమలోనూ ఇవే పరిణామాల సంభవించబోతున్నాయి.

దేశ సహజ, ఆర్థిక వనరులన్నింటినీ సామ్రాజ్య వాదుల పరం చేస్తున్న భారతపాలక వర్గాలు పాడి రంగాన్ని కూడా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు లోబర్చుతూన్నాయి. దీని కోసం అశేష పేద రైతాంగాన్నికున్న ఆదాయవనరులు కొల్లగొట్టి వారిని మరింత దారిద్ర్యంలోకి నెట్టివేస్తున్నాయి. పాల రంగం నుండి నేడు వస్తున్న 16 శాతం ఆదాయం రైతాంగానికి రాకపోగా, సామ్రాజ్యవాద దేశాలకు తరలిపోతుంది. అర్థశతాబ్దపు దళారీ, భూస్వామ్యవర్గాల పాలన మరో విధంగా ప్రవర్తించదని అనుభవమూ స్పష్టం చేస్తున్నది.

(జనశక్తి 1-6-2002 సంచిక నుండి)

సాగునీరు - త్రాగునీరు ప్రయివేటీకరణను వ్యతిరేకించండి!

గాలి, నీరు, భూమి ప్రకృతి ప్రసాదించిన సహజసంపదలు. ఇవి ఏ ఒక్కరి సొత్తూకాదు. ఇవి లేకుంటే మానవుని జీవనమే ముగిసిపోతుంది. భూమి ప్రైవేటు ఆస్థిగా మారి శతాబ్దాలు గడిచాయి. ఫలితంగా సమాజం భూమి వున్నవారు, భూమిలేని వారుగా చీలిపోయి శ్రమ దోపిడీకి మూలాధారమైంది. భూమిని జాతీయంచేసి సమిష్టి యాజమాన్యం నెలకొల్పిన సోషలిస్టు సమాజాలు సర్వతోముఖాభివృద్ధిని సాధించాయి. ప్రతి మానవ జీవన కార్యకలాపాలన్నీ లాభాపేక్షతో చూసి అమ్మకం-కొనుగోలు సరుకుగా మార్చే పెట్టుబడిదారీ విధానం నీటిని కూడా వ్యాపార సరుకుగా మార్చుతున్నది. సామ్రాజ్యవాద పెట్టుబడి పేరుతో ప్రపంచీకరణ అన్ని దేశాల ఆర్థిక వనరులపైనే కాకుండా సహజవనరులపైన కూడా ఆధిపత్యం కొరకు తన కబంధహస్తాలను సాచు తున్నది. భారతదేశ నీటిని ప్రైవేట్ ఆస్థిగా మార్చేందుకు పూనుకున్నది.

వాణిజ్య సరుకుగా నీరు

నీటిని సరుకుగా ప్రజలతో అంగీకరింప చేసేందుకు సామ్రాజ్యవాదం తీవ్ర ప్రయత్నాలు చేసింది. సామ్రాజ్యవాద దోపిడీ విధానాలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినడాన్ని చూపి, పెరుగుతున్న జనాభా అవసరాలకూ, నీటి వనరుల దుర్వినియోగానికి మధ్య గండిని చూపి; నీటిని జాగ్రత్తగా వాడుకోకపోతే తీవ్ర దుర్భిక్ష పరిస్థితులేర్పడుతాయని ప్రచారం చేసింది. దీనికి పరిష్కారంగా నీటిలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించింది. ఈ రంగంలో మార్కెట్టు శక్తులకు స్వేచ్ఛనిస్తే అవి నీటి వినియోగాన్ని నియంత్రిస్తాయని సూచించారు. దీనికనువుగా నీరు సహజవనరు కాదనీ, వ్యాపార సరుకుగా గుర్తించారు. ఒక అంతర్జాతీయ సదస్సులో ఈ మేరకు తీర్మానం కూడా చేశారు.

దీనికనుగుణంగానే ప్రపంచబ్యాంకు రుణా లందించడానికి షరతులు విధిస్తున్నది. అందులో కొన్ని : (1) అన్ని స్థాయిల్లోని నీటి వినియోగాన్ని వాణిజ్య కార్యకలాపంగా మార్చాలి. (2) నీటి ఛార్జీలను పెంచాలి. (3) వ్యసాయ విద్యుత్తు రేట్లను పెంచాలి. (4) ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలి. నిత్యజీవితావసరంపైన ప్రజల సమిష్టి యాజమాన్యం స్థానంలో ప్రైవేటు గుత్తాధి పత్యాన్ని స్థాపించడమే ఈ షరతుల లక్ష్యం.

సాగునీటి ప్రైవేటీకరణ ప్రయత్నాలు

ప్రపంచబ్యాంకు షరతుల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన సాగునీటి విధానపత్రం ఈ విషయాన్ని స్పష్టంగా చూపు తుంది. సాగునీటి ప్రాజెక్టుల పెట్టుబడి, నిర్వహణా వ్యయం మొత్తాన్ని రైతుల నుండి వసూలు చేస్తారు. దీని అమలులో భాగంగానే నీటితీరువా ఛార్జీలను మూడురెట్లు పెంచారు. వ్యవసాయ విద్యుత్ రేట్లను పెంచారు. నీటి తీరువాను రెవిన్యూశాఖ వసూలు చేయటం ఆపి, దాని స్థానంలో నీటిని వినియోగించుకునే వారి నుండి నేరుగా వసూలు చేసి నిర్వహణను సాగించే వాణిజ్య వ్యవస్థను నెలకొల్పాలి. దీనిని మూడు దశలలో అమలుపరుస్తుంది. మొదటి దశలో నీటి వినియోగదారుల సంఘాల సహాయంతో రెవిన్యూ శాఖ వసూలు చేస్తుంది. రెండవ దశలో నీటి వినియోగదారుల సంఘాలు వసూలు చేసి రెవిన్యూ శాఖకు జమ చేస్తాయి. మూడవదశలో నీటి వినియోగదారుల సంఘాలు వసూలు చేసి తమ వాటా వుంచుకొని, మిగిలినది ఇరిగేషన్ శాఖకు జమచేస్తాయి. కీలకమైన అంశం మరొకటుంది. నీటి వినియోగ దారుల సంఘాలకు అనుభవం లేనందున తమ పనుల నిర్వహణకు ప్రభుత్వేతర సంస్థల, ప్రైవేటురంగ "సహాయం' తీసుకుంటాయి. అంతేకాక నీటిపారుదలా రంగంలో నేడు ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్య కలాపాలన్నింటినీ వీరికి కాంట్రాక్టుకిచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. నీటిపారుదలా ప్రాజెక్టుల నుండి నీరు వాడుకుంటున్న మునిసిపాలిటీలు, పరిశ్రమలకు కూడా ఇలాగే ఛార్జీలు వసూలు చేయాలి.

ఒక్కసారిగా ప్రైవేటీకరించే బదులుగా మెట్టు మెట్టుగా ప్రైవేటీకరించే చర్యలివి. ప్రజాస్వామిక ప్రక్రియ పేరిట నీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేశారు. వీటిని శిఖండిగా ఉపయోగించి సాగునీటి రంగాన్ని ప్రైవేటీకరిస్తున్నారు. త్రాగునీటి సరఫరాను కూడా ప్రైవేటీకరిస్తున్నారు. వీటికి ఎన్నికలు జరిగిన తీరు గమనిస్తే భూస్వామ్య వర్గాల ఆధిపత్యానికి నీటిని కూడా సాధనం చేస్తారనీ, గ్రామీణ పేదవర్గాలను అణచివుంచడానికి దీనిని వినియోగిస్తారనీ స్పష్టమౌతుంది.

కబంధహస్తాలు

ప్రపంచ నీటి మార్కెట్టు 50 వేల కోట్ల యూరోలుంటుందని అంచనా. భారతదేశంలో రూపుదిద్దుకుంటున్న నీటి మార్కెట్టు పదివేల కోట్ల రూ॥ లని అంచనా. దీనిలో మూడవ వంతు నీటిని అందించడానికీ, మూడోవంతు పారిశ్రామిక నీటిని శుద్ధి చేయటానికి వుంటాయి. ఈ మూడు రంగాల లోనూ యంత్రాలు సాంకేతిక పరిజ్ఞానంతో బహుళజాతి సంస్థలు గుత్తాధిపత్యం కలిగి వున్నాయి. వాటిలో వివెండీ (ఫ్రాన్సు), సూయజ్ లయనైజ్ (ఫ్రాన్సు), ఆర్‌డబ్ల్యూ ఇథేమ్స్ వాటిర్ (జర్మనీ, బ్రిటన్), సౌర్ (ఫ్రాన్సు) సెవెర్న్‌ట్రెంట్ (బ్రిటన్) బిచ్‌టల్, ఎన్రాన్ (అమెరికా). వీటిలో కొన్ని కంపెనీలు ఇప్పటికే భారతదేశంలో ప్రవేశం చాయి. బిటికాటన్ విత్తనాలతో వివాదాస్పదమైన మాన్‌సాంటో కంపెనీ టాటాలతో కలిసి ముంబాయి తాగునీటి సరఫరాను చేపట్టేందుకు మిలాఖత్తు సంస్థను ప్రారంభించాయి.

ప్లాస్టిక్ బాటిళ్ళలో త్రాగునీరు సరఫరా చేసే కొత్త మార్కెట్టును ఇవి ప్రారంభించాయి. ఈ నీరు పరిశుభ్రమైనదనీ, ఖనిజాలను కలిగివుందనీ ప్రచారం చేసి ప్రజలను మోసం చేసి అమ్ముకుంటున్నారు. అహమ్మదాబాద్‌లోని కన్సూమర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటరు 13 బ్రాండుల నీటి బాటిళ్ళను పరిశీలించగా హానికరమైన ఆర్సెనిక్; అల్యూమినియం ఖనిజాలున్నాయి. ఆరు బ్రాండులలో కాలుష్యాలున్నాయి. 5 బ్రాండులలో కంటికి కన్పించే నలకలున్నాయి. అయినా ఏడాదికి 30శాతం చొప్పున వీటి అమ్మకాలు పెరుగు తున్నాయి. ఈ మార్కెట్టులో 45శాతం బిస్లరీ, 24శాతం బెయిలీ, కోకా కోలాకు చెందిన కిన్లే 9 శాతం, పెప్సీకి చెందిన ఆక్వాఫినా 8శాతం ఆక్రమించుకున్నాయి. యునైటెడ్ బ్రూవరీస్, బ్రిటానియా,మానిక్‌చంద్

వంటివి కూడా ఉన్నాయి. దాదాపు గా ఇవన్నీ బహుళజాతి కంపెనీలకు అను బంధంగా వున్నవే. మునిసి పాలిటీలు సరఫరా చేసే నీటి కంటే ఏ మాత్రం పరిశుభ్రంగా ఉండని ఈ నీటినే నీటి కొళాయి సరఫరాకు లీటరుకు ఒక పైసా అవుతుండగా 10 రూ॥లు పెట్టి కొనుగోలు చేస్తున్నారంటే బహుళజాతి కంపెనీల ప్రచారం ఎంత బలంగా ప్రజాభిప్రాయాన్ని రూపొంది స్తున్నదో తెలుస్తుంది.

నీటి ప్రైవేటీకరణ ఎప్పుడో అమలు జరుగ బోయే కార్యక్రమం కాదు. పూర్తి స్థాయిలో దాని అమలును ప్రజలతో ఆమోదింప చేయటానికి ఇప్పటికే కొద్దికొద్దిగా అమలు జరుపుతున్నారు.

సాగునీటి సరఫరాను నీటి వినియోగదారుల సంఘాలకు అప్పజెబుతున్నారు. తర్వాతి దశలో ఈ సంఘాలు తమ పనులను ప్రైవేటు కంపెనీల కప్పజెప్పి వారికి బిల్లులు వసూలు చేసిపెడతాయి. అంతేకాక ఈ సంఘాలపై పెత్తనం భూస్వామ్య వర్గాలకే వుంటుంది గనుక సాగునీటి సరఫరాను (ఖర్చుచెల్లించని రైతులకు నీరు ఆపడం వంటి చర్యలతో) గ్రామీణ ప్రాంతాలపై తమ ఆధి పత్యాన్ని నెరపడానికి వినియోగించుకుంటాయి.

ప్రైవేటు ఆస్తిగా నీరు

సాగునీటిని ఇప్పటికే ప్రవేటు ఆస్తిగా ప్రభుత్వం పరిగణిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని ఆ అను భవాలను చూడండి. కృష్ణా డెల్టా రైతాంగానికి సాగునీటి కోసం ప్రకాశం బ్యారేజిని నిర్మించారు. విటిపిఎస్, కొండవల్లి లాంకో విద్యుత్తు కర్మాగారా లకు దీని నుండి నీటి సరాఫరా చేస్తున్నారు. వీటికి నీరందడానికి 12 అడుగుల ఎత్తున నీరుండాలి. రిపేర్లు చేయకపోతే రైతాంగానికి నీరందదు. రిపేర్లు చేయటానికి నీటిని వదలాలంటే విద్యుత్తు కంపెనీలు అంగీకరించటం లేదు. ఇప్పటికే ఆయకట్టుకు సరిగా నీరందటం లేదు. కొంత కాలం పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసు కొమ్మని విద్యుత్తు కర్మాగారాలకు చెప్పి రిపేర్లు చేసే బదులుగా, రైతాంగానికి ఆరుతడి పంటలు వేసుకొమ్మని, వతందారి పద్ధతి అనుసరించమని సలహా యిస్తున్నారు. చివరకు సెంట్రల్ వాటర్ కమీషన్ నీరు రైతాంగం కోసమని తీర్పు చెప్పినా, ప్రభుత్వం కిమ్మనకుండా వూరుకుంది. విద్యుత్తు చెయ్యాలో ఆలోచించాలంటున్నది. లక్షలాది రైతాంగం ప్రయోజనాల కంటే విద్యుత్తు కంపెనీ లకు నీటిపై హక్కుకే ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ విద్యుత్తు కోసమే ధవళేశ్వరం, నాగార్జునసాగర్ ఆయకట్టు రైతాంగాన్ని గత ఏడాది నానా యిబ్బందుల పాలు చేసింది.

ప్రధాన ప్రాజెక్టుల వద్దే కాదు. నీటికాలువల వద్దకూడా నీటిపై ప్రైవేటు ఆస్తి హక్కునే ప్రభుత్వం గౌరవిస్తున్నది. నాగార్జునసాగర్ కాలువలపై మినీ హైడల్ విద్యుత్తు ప్లాంట్లకు ప్రభుత్వం అనుమతి చ్చింది. తమ లాభాల కోసం ఇవి నీటిని నిలిపి వేస్తున్నా, రైతాంగానికి నీరందకుండా చేస్తున్నా ప్రభుత్వం చూడనట్టు ఊరుకుంటున్నది. అలాగే కొండపల్లిలోని విటిపిఎస్ కూలింగ్ కెనాల్‌పై పెట్టిన మిని హైడల్ విద్యుత్తు ప్లాంటు నీటిని అధికంగా నిలువ చేసినందున, వెనుక భూములు ముంపుకు గురైనా పట్టించుకోలేదు. ఈ ప్రైవేటు విద్యుదుత్పత్తి దారులకు ప్రయోజనాలను నష్టపరుస్తున్నది.

మున్సిపల్ నీటిసరఫరాను కూడా ప్రైవేటీకరించే చర్యలు తీసుకుంటున్నది. దీనిలో భాగంగా నీటి ఛార్జీలను పెంచుతున్నాయి. హైద్రాబాద్, సికింద్రా బాద్ నగరాలకు మంచి నీటిని గోదావరి, కృష్ణా జలాలలో వేటిని తరలించాలన్న దశాబ్దాల వివాదాన్ని ప్రపంచ బ్యాంకు పరిష్కరించింది. కృష్ణా జలాలకే "సహాయమి"చ్చింది. ప్రపంచ బ్యాంకు సూచించిన సంస్థకే (గ్లోబల్ టెండర్ల ద్వారా) దీని నిర్మాణాన్ని, నిర్వహణనూ అప్పగిస్తారు. మునిసిపల్ కార్పోరేషన్‌కు బిల్లులు వసూలు చేసి వీరికి చెల్లించే పనే మిగులుతుంది.

ప్రైవేటు పెట్టుబడి లాభాలే ప్రధానమౌతాయి తప్ప ప్రజల ప్రయోజనాలు కాదని ఈ అను భవాలు తెలుపుతున్నాయి.

నీటి ప్రైవేటీకరణను ఎందుకు వ్యతి రేకించాలి?

1. ప్రజలకు చెందిన వనరుల వినియోగంలో వారికెలాంటి పాత్ర ఉండదు.

2. నీటి ఛార్జీల నిర్ణయంలో ప్రజలకు గానీ, వారి ప్రతినిధులకు గానీ ఎలాంటి పాత్ర ఉండదు.

3. ప్రైవేటు కంపెనీలకు లాభాలే లెక్కలో వుంటాయి. కానీ ప్రజల అవసరాలు కాదు.

4. నీరు అమ్మకపు సరుకై కొనగలిగిన వారికే అందుతుంది. జీవనావసరాన్ని ప్రజలకు అందు బాటులో లేకుండా చేస్తారు. ఫలితంగా ప్రజల ఆరోగ్యం, ఆర్థికం, అభివృద్ధి ప్రైవేటు కంపెనీలతో నిర్ణయమౌతాయి.

5. నీటి సరఫరాపైనే కాకుండా నీటి వనరులపై కూడా ప్రైవేటు ఆస్తిహక్కు ఏర్పడుతుంది.

6. నీటిపై ప్రైవేటు కంపెనీల ఆధిపత్యం దేశ ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యానికి దారితీస్తుంది.

7. దేశ సహజవనరులు సామ్రాజ్యవాదుల లాభాల పంట భూమి అవుతుంది.

ప్రైవేటీకరణే పరిష్కారమా?

నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రైవేటీకరణే పరిష్కారంగా చెబు తున్నారు. ప్రైవేటీకరణ దుష్పలితాలను పైన వివరించాము. నీరు ప్రజల జీవన ప్రాథమిక హక్కు. దీనిని లాభాలార్జించే వర్తకపు సరుకుగా పరిగణించ రాదు. ఈ అవగాహనను అంగీకరిస్తే సమర్థ వంతంగా నీటిసరఫరాను ప్రభుత్వ రంగంలో నిర్వహించటం కష్టం కాదు. "నీటి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా సంఘటన" అన్న హైద్రాబాద్ నగరంలోని సంస్థ సరైన రాజకీయ కృతనిశ్చయం వుంటే కొన్ని చర్యలతో ప్రభుత్వరంగంలో నీటి సరఫరాను సమర్థవంతంగా నిర్వహించ వచ్చునని తెలిపింది. నిపుణుల సహాయంతో వివరణాత్మక నివేదికను తయారు చేస్తున్నది. దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్నీ, దేశ నిపుణుల సహాయం తీసుకుంటే ఇది అధిగమించలేని సమస్య కాదు.

డిమాండ్లు :

- నీటిని పొందటం మౌలిక మానవ హక్కు.
- నీటిని వాణిజ్య సరుకుగా పరిగణించ రాదు.
- నీటి వినియోగం, నిర్వహణలపై ప్రజల అజమాయిషీ వుండాలి. 73, 74వ రాజ్యాంగ సవరణల ప్రకారం నీటి వనరులు, వినియోగం పంచాయితీల పరిధిలోకి రావాలి.
- నీటిపై ప్రైవేటు కంపెనీల ఆధిపత్యం ప్రజల, దేశ ప్రయోజనాలకు హానికరం. కనుక నీటి ప్రైవేటీకరణను ఆపివేయాలి.
- నీటి వినియోగంపై ప్రపంచబ్యాంకుతో చర్చలు జరపరాదు. దాని షరతులను తిరస్కరించాలి.

★

ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ (ఏపిఎస్ఐడిసి)ని కాపాడుకుందాం

వివిధ రైతు, కూలీ, ఉద్యోగసంఘాల సంయుక్త పిలుపు

(ఏపిఎస్ఐడిసి ఉద్యోగసంఘాల ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ బి. జనార్దనరెడ్డి నాయకత్వాన వివిధ రైతు, కూలీ సంఘాల నాయకుల ప్రతినిధి బృందం డిసెంబర్ 2001లో మహబూబ్‌నగర్, కర్నూల్ జిల్లాల్లో పర్యటించి, రైతులు - సంస్థ అధ్వర్యంలో నడుస్తున్న పలు ఎత్తిపోతల పథకాల పనితీరుని పరిశీలించింది. ఈ ప్రతినిధి బృందంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. కోటయ్య, రైతుసంఘం రాష్ట్ర నాయకులు కా॥ తులసీదాస్, ఏపిరైతు కూలీసంఘం నాయకులు కా॥ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ పర్యటన అనంతరం వివిధ సంఘాలు సంయుక్తంగా ప్రచురించిన కరపత్రాన్ని యిస్తున్నాం.) - ఎడిటర్

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లోని దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన పేదల భూములకు సాగునీటి సౌక్యరం కల్పి స్తున్న "రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ" (ఏపిఎస్ఐడిసి)ను రద్దు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా ప్రభుత్వ నిర్ణయాన్ని ఎదుర్కోవాలి. ఏపియస్ఐడిసిని కాపాడుకోవాలి.

నిరంతర కరువు పీడిత ప్రాంతాలలోని సన్న, చిన్నకారు,హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతుల వారి సంక్షేమం కోసం బోర్లు, ఎత్తిపోతల పథకాలు మరియు ఊటబావుల ద్వారా నీటి పారుదల కల్పించడానికి ఈ పథకం ప్రారంభించబడింది. రాష్ట్రంలో 22 జిల్లాలలో మెట్టప్రాంతాల్లోని 1100 లిఫ్టులు మరియు 20 వేల బావుల ద్వారా 7 లక్షల 25 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలిగింది. లక్షలాది మందికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను జీవనోపాధి కలిగింది. 1500 కోట్ల రూపాయల విలువ చేసే పంట ఉత్పత్తి పెరిగింది. నిరంతరం కరువులకు గురయ్యే ప్రాంతాలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది.

1985 వరకు ఎస్ఐడిసి నిర్మించిన ఎత్తిపోతల పథకాలను, బోర్లను, గొట్టపు బావులను నిర్వహిస్తూ ఈ స్కీములకు రిపేర్లు వస్తే వెంటనే మరమ్మతులు చేయిస్తూ, కరెంటు బిల్లులు సంస్థ ద్వారా చెల్లిస్తూ ఈ స్కీముల కింద రైతుల నుండి ఎకరానికి రూ. 500 లను నీటిపన్నుగా వసూలు చేసేవారు. ఎస్ఐడిసి వసూలు చేస్తున్న నీటి పన్నును ఎకరానికి రూ॥ 500 ల నుండి రు. 75 లకు తగ్గించి రు. 425 లను ప్రభుత్వం సబ్సిడీగా విడుదల చేస్తుందని 1985 లో వాగ్దానం చేశారు. కానీ అలా సబ్సిడీని ఇవ్వలేదు. ఈ సబ్సిడీ భారం దాదాపు 45 కోట్లకు చేరింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేయకపోగా దీనిని ఎన్ఐడిసి ఖాతాలో నష్టంగా చూపించడం జరిగింది. అంటే అమలుకాని ప్రభుత్వ వాగ్దానం ఎస్ఐడిసిపై మొదటివేటుగా పడింది.

ఈ పథకాన్ని రద్దుచేయాలని ప్రపంచ బ్యాంకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందు కనుగుణంగానే ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయ సహకారాలు విరమించుకోవాలని నిర్ణయించింది. సిబ్బంది సంఖ్యను 2541 నుండి 948 కి తగ్గించింది. ఇపుడు మరో 544 మందిని తొలగిస్తోంది.

ప్రంచబ్యాంకు విద్యుత్ బోర్డును మూడు ముక్కలు జేసి ప్రయివేటీకరించమంది. ఛార్జీలు పెంచమన్నది. రాష్ట్ర ప్రభుత్వం అలాగే పెంచింది. ప్రజలంతా ఎదురుతిరగడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఛార్జీలు పెంచలేదు. వచ్చే ఏడాది వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించి యూనిట్‌కు 50 పైసలకు తగ్గకుండా ఛార్జీవసూలు చేయమంటోంది. యూజర్ ఛార్జీల పేరుతో ధర్మాసుపత్రుల్లో డబ్బు గుంజుతున్నారు. రాష్ట్రం లోని ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడం లేదా ప్రైవేటువారికి అప్పగించడానికి పథకాలు సాగుతున్నాయి. సహకార పాలడైరీలను, చక్కెర ఫ్యాక్టరీలను, స్పిన్నింగ్ మిల్లులను ప్రయివేటు వారికి అప్పగిస్తున్నారు. ఇదీ ప్రపంచబ్యాంకు నిర్వాకం.

ఏపిఎస్ఐడిసి స్కీముల నిర్వహణ భాద్యత నుండి ప్రభుత్వం తప్పుకొన్నాక కరెంటు ఛార్జీలు పెరగడం, మోటార్లు కాలిపోతే బాగు చేసుకునే ఆర్థిక స్తోమత లేకపోవడం, ఫలితంగా ఎస్ఐడిసి స్కీంల క్రింద సేద్యం తగ్గింది. పనిచేయని పథకాలు ప్రతి జిల్లాలో వున్నాయి. ఈ పథకం ప్రధానంగా "లాభనష్టాల"తో ప్రమేయం లేకుండా వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంతో ప్రారంభించబడినది. ఈ పథకాన్ని రద్దు చేయడమంటే ప్రభుత్వం బాధ్యత నుండి తప్పుకోవటమే.


ఈ సంస్థ రు. 125 కోట్ల వాటాధనంతో పనిచేస్తున్నది. 7.25 లక్షల ఎకరాలకు తక్కువ వ్యయంతో సాగునీటి సౌకర్యం కల్పించారు. 170 స్కీంలు ద్వారా మరో 1.20 లక్షల ఎకరాలకు నీరిచ్చే పథకాలు అనుమతి పొంది, అమలుకు సిద్ధంగా ఉన్నాయి. కొన్ని నిర్మాణ పనులు ప్రారంభించబడ్డాయి. భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల కింద ఒక ఎకరా నీటి సౌకర్యం కల్పించడానికి రూ. 75,000 లు వ్యయం అవుతుండగా ఎస్ఐడిసి క్రింద 10 వేల నుండి 15 వేల వరకు మాత్రమే వ్యయం అవుతున్నది. పైగా ప్రాజెక్టులకు అవకాశం లేని ప్రాంతాలలో ఈ పథకం వల్ల పేదల భూములకు సాగునీటి సౌకర్యం కల్పించబడు తున్నది.

కరువు నివారణకు, మెట్టప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా వున్న ఈ సంస్థను రద్దుపర్చడం వల్ల విపరీత పరిణామాలు కల్గుతాయి. సాగునీరు, త్రాగునీరు, పశుగ్రాసం ఉత్పత్తి తగ్గిపోతుంది. ఆత్మహత్యలు, వలసలు కొనసాగుతున్న మెట్ట ప్రాంతాలు ఈ నిర్ణయంతో మరింత వెనుక బడతాయి.

ఇప్పటికే ఈ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నారు. వారి ఆందోళనకు రైతులు, వ్యవసాయ కార్మికులు తోడుకావాలి. నీటి స్కీముల నిర్వహణ భాద్యత ఏపిఎస్ఐడిసి ద్వారా కొనసాగించాలి. మంజూరై అమలులో వున్న స్కీముల నిర్మాణాన్ని కొనసాగించాలి.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (జవహర్‌నగర్)
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (అమృత ఎస్టేటు)
అఖిల భారత రైతు కూలీ సంఘం
రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)
భారతీయ కిసాన్ సంఘ్
ఏపిఎస్ఐడిసి ఉద్యోగ సంఘాల కార్యాచరణ సమితి
ఏపి పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్
హైదరాబాద్, 28-12-2001.

ప్రేముఖుల వ్యాసాలు



కామ్రేడ్ కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి గారి 50వ వర్ధంతి సందర్భంగా కామ్రేడ్స్ పరకాల పట్టాభి రామారావు, చంద్ర రాజేశ్వరరావు, నండూరి ప్రసాదరావు గారులు వ్రాసిన వ్యాసాలను ప్రచురిస్తున్నాం. కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి 50వ వర్ధంతి సంస్మరణ సంచిక నుంచి తీసుకొన్నాం. సంచిక సంపాదకులకు, ప్రచురణకర్తలకు కృతజ్ఞతలం.

పరకాల గారి వ్యాసం కొమ్మారెడ్డి గారు తన రాజకీయ లక్ష్యాలను రైతు ఉద్యమ నిర్మాణ కృషికి అన్వయించుకొన్న తీరుని వివరించేదిగా వుంది.

రాజేశ్వరరావు గారి వ్యాసం జమీందారీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమంలో కొమ్మారెడ్డి గారి పాత్రనే గాక ఎస్టేటు, జమీందారీ ప్రాంతాలలో దోపిడీ, అణచివేతలను ముఖ్యంగా మునగాల, లింగగిరి జమీందారీ ప్రాంతాలలోని దుర్భర స్థితిగతులను వివరించేదిగా వుంది. దోపిడీ అణచివేతలను తుదముట్టించుటకు రైతు ఉద్యమశక్తులు, కమ్యూనిస్టులు చేసిన కృషిని వివరించేదిగా వుంది.

నండూరి ప్రసాదరావుగారి వ్యాసం ఆంధ్రరాష్ట్ర రైతు రక్షణ యాత్ర నేపథ్యాన్ని; రైతు రక్షణ యాత్రకు దారితీసిన పరిస్థితులను వివరించింది. కోర్టుల పత్రాలను అచ్చువేసి ప్రకటించడం వరకే గాక మిలిటెంట్ ఆందోళనోద్యమాలకు ఉపక్రమించిన క్రమాన్ని తెలియజేసేదిగా వుంది.

ఈ మూడు వ్యాసాలు రైతు ఉద్యమ ప్రారంభ దినాల నాటి సమస్యలను, రాజకీయాలను, రాజకీయ శక్తుల కృషిని వివరించేవిగా ఉన్నాయి. ఈ వ్యాసాలందించే విలువైన సందేశాలను అర్థం చేసుకొని నేటి ఆచరణకు అన్వయించుకోవలసినవిగా వున్నాయి.

- సంపాదకుడు

స్వాతంత్ర్య సాధన; సమసమాజ లక్ష్యంతో రైతు ఉద్యమ నిర్మాణం గావించిన కొమ్మారెడ్డి

- శ్రీ పరకాల పట్టాభిరామారావు (స్వాతంత్ర్య సమరయోధులు)

శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు 1901లో పశ్చిమగోదావరి జిల్లా పోతునూరు గ్రామంలో జన్మించారు. గాంధీజీ నాయకత్వాన 1919-21లో ప్రారంభమైన సహాయనిరాకరణోద్యమంతో జాతీయోద్యమంలో ప్రవేశించారు. త్రివిధ బహిష్కరణలో భాగంగా ఇంగ్లీషు విద్యకు స్వస్తి చెప్పారు. 1930 ఉప్పు సత్యాగ్రహంలో, 1931-1932 శాసనోల్లంఘన, రీసెటిల్‌మెంట్ (అధిక పన్నుల) వ్యతిరేక ఉద్యమాలలో అరెస్టు చేయబడి కఠిన కారాగార శిక్షలు అనుభవించారు. 1928 నుండి ఆయనకు రైతు ఉద్యమంతో పరిచయం ఏర్పడింది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అంతర్భాగంగా జమీందారీ ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ రద్దుకు జరిగిన పోరాటాలలో ఆయన ప్రముఖపాత్ర వహించారు. కాంగ్రెస్‌లోనే వుంటూ అతివాదభావాలకు, సోషలిస్టు భావాలకు ఆయన సన్నిహితులయ్యారు.

1935నాటికి ఆంధ్రలో కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమైంది. కమ్యూనిస్టుపార్టీ నిషేధంలో వుండటంవలన 1936లో కాకినాడలో ఆంధ్రరాష్ట్ర ప్రథమ కమ్యూనిస్టు మహాసభ రహస్యంగా జరిగింది. 1934లోనే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడటంతో కమ్యూనిస్టులు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరి పనిచేయసాగారు. కూలీ రక్షణ సంఘాలు, అటుపిమ్మట రైతు, యువజన, విద్యార్థి సంఘాలు నిర్మించి దేశ స్వాతంత్ర్యంతో బాటు కార్మిక కర్షక తదితర కష్టజీవుల రాజ్యాన్ని, సామ్యవాద వ్యవస్థను నెలకొల్పాలనే లక్ష్యాన్ని, మార్క్సిస్టు భావాలను ఆంధ్ర ప్రజానీకంలో విరివిగా ప్రచారం చేశారు.

1928లోనే రాష్ట్ర రైతుసంఘం ఏర్పడినప్పటికీ వర్గ ప్రాతిపదికపై అది 1935లో పునర్నిర్మించబడింది. 1937లో నిడుబ్రోలులో జరిగిన ఆరవ రాష్ట్ర రైతుమహాసభలో శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు అధ్యక్షులుగాను, శ్రీ చలసాని వాసుదేవరావు గారు కార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు.

రాష్ట్ర కాంగ్రెస్ సహాయకార్యదర్శిగా, పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా, ఎ.ఐ.సి.సి. సభ్యునిగా కాంగ్రెస్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తూ కొమ్మారెడ్డి సత్యనారాయణగారు అతివాద కాంగ్రెస్ వాదిగా, సోషలిస్టు భావాలకు అంకితమై, సోషలిస్టులతో కమ్యూనిస్టులతో కలిసి రాష్ట్ర రైతు ఉద్యమాన్ని విస్తృత ప్రజాఉద్యమంగా నిర్మించారు. 1937 -1940 వరకు రాష్ట్ర రైతు ఉద్యమానికి ప్రధాన నాయకుడిగా ఉండి చరిత్రాత్మకమైన



1937-38 ఆంధ్ర రాష్ట్ర రైతు రక్షణ యాత్రకు నాయకత్వం వహించి, రాష్ట్రమంతటా బ్రహ్మాండమైన జమీందారీ వ్యతిరేక పోరాటాలకు ప్రాతిపదిక నిర్మించారు.

సోషలిస్టు భావాలు

దేశ స్వాతంత్ర్యంతోబాటు కార్మిక, కర్షక రాజ్యాన్ని దేశంలో నెలకొల్పాలని, సోషలిస్టు సమాజం ఏర్పడనిదే దేశంలో దారిద్ర్యం తొలగదనీ, నిర్దిష్ట శాస్త్రీయ సోషలిస్టు భావాలతోనే శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తిగారు ఆ రోజుల్లో కృషి చేశారని 1937 నుండి లభ్యమవు

తున్న ఆయన ప్రసంగాలను బట్టి, ప్రకటనలను బట్టి ఆయన ఆధ్వర్యాన రైతుసంఘ తీర్మానాలను బట్టి స్పష్టమవుతుంది.

1938 సెప్టెంబరు 5వ తేదీన కృష్ణాజిల్లా వీరవల్లిలో సప్తమ ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభ అధ్యక్ష పీఠం నుండి ఆనాటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, రైతాంగ ఆర్థిక దుస్థితి, దేశప్రజల దారిద్ర్యావస్థ, పరిష్కార మార్గాలు, తదితర విషయాలతో శ్రీ కొమ్మారెడ్డి సత్య నారాయణ మూర్తిగారు యిచ్చిన బ్రహ్మాండమైన ప్రసంగం ఇందుకు నిదర్శనంగా తీసుకోవచ్చు. అందులో ఆయన ఇలా అన్నారు.

"ఆహోరోత్పత్తిదారులము కానీ మనకు కడుపు నిండా తిండి, ఒంటినిండా బట్ట, నివాసయోగ్య మగు యిల్లు మనలో నూటికి 70 మందికి సున్న. కష్టించి పండించుతాము గాని పంటపై మనకు పెత్తనం లేదు. భూదేవి మనకు శరణ్యము కాని భూమి రాను రాను దూరమగుచున్నది.

"1771లో రైతునకు సగటు భూమి 40 ఎకరాలు, 1818లో 17 1/2 ఎకరాలు 1915లో 7 ఎకరాలు. ఈనాటి పరిమితి 2 ఎకరాలకు దిగినదనుటలో వింత ఏముంది?

"1812లో సర్‌థామస్ మన్రో ఈ దేశంలో భూమిలేని రైతు అరుదు అని నుడివెను. 30 సంవత్సరాల నాటికి 1812 సంవత్సరము తర్వాత 76 లక్షల రైతులు తమ భూములు కోల్పోయిరి. తరువాత 50 సంవత్సరములకు (1920) ప్రతీ వెయ్యిమందికి 274 మంది భూములను కోల్పోయారు. 1931 నాటికి వెయ్యింటికి 417 మంది భూములను కోల్పోయారు. అనగా నూటికి 40 మంది వ్యవసాయ కూలీలుగా మారిపోయా రన్నమాట.

- వివశక్తివారపత్రిక, 7.9.1938

బ్రిటీష్ వలస విధానం, అది ప్రవేశపెడుతున్న పెట్టుబడిదారీ ఆర్థిక దోపిడీలో రైతులు కూలీలుగా ఎలా మారిపోతున్నదీ శ్రీ సత్యనారాయణమూర్తి గారు ప్రతిభావంతంగా గణాంక వివరాలతో నిరూపించారు. పాపరైజేషన్ గురించిన శాస్త్రీయ అవగాహనకిది ప్రతిబింబం.

బ్రిటీష్ పరిపాలన భారతదేశాన్ని కొల్లగొట్టిన ఫలితంగా దేశంలో ఎన్ని లక్షల, కోట్లమంది కరువులతో ఎలా మరణిస్తున్నదీ తమ అధ్యక్షోపన్యాసంలో శ్రీ సత్యనారాయణమూర్తి యిలా తెలిపారు.

"1793 మొదలు 1900 వరకు 107 సంవత్సరాలలో ప్రపంచమందు జరిగిన యుద్ధము లన్నింటిలో 50 లక్షలమంది జనం నశిస్తే 1890-1901 వరకు అనగా 10 సంవత్సరములలో మనదేశంలో కరువు వలన 1 కోటి 90 లక్షల మంది జనం నశించారు. నేడు రాయలసీమ మున్నగు ప్రదేశాలలో వేలకొలది ప్రజలు కరువు దేవతకు గురి అగుచుండుట మనం గాంచుచూనే వున్నాము.'

"దున్న పుష్ట దర్శనమే (ఎద్దుముడ్డి) జీవన హేతువని నమ్మి, దున్నపోతువలే అహర్నిశలు కష్టపడి పంటలు పండించుతాము. మనభూమి, మన రాశి అని మురుస్తాము. తుదకు రాశి తయారై నదని వార్త చెవినపడగానే ప్రభుత్వం, జమీందారు, షావుకారు, దానిని పన్నుల రూపమున, బాకీల నెపమున, మామూళ్ళు సాకున ఆరగించుతారు. మనకు మిగిలేది పాల్లుగింజలు; కుంటుగడ్డి మరునాడు రుణదాత గారికి దయవుంటే తిండి, లేకుంటే పస్తు. నూటికి 80 మంది రైతుల దుర్గతి యిటులున్నందున విషయము మన మెరిగినదే.

- అదే ఉపన్యాసంలో

రైతాంగాన్ని ప్రభుత్వం, జమిందారీ వర్గం, షావుకార్లు ఎలా దోపిడీ చేస్తున్నదీ శ్రీ సత్య నారాయణ మూర్తి అత్యంత నగ్న స్వరూపంలో యిందులో బహిర్గతం చేశారు.

ఈ దుర్గతికి కారణం

ఈ దుర్గతికి కారణం "మనం పండించే పంటను మనం వినియోగించుకొనే హక్కు మనచేతులలో లేకపోవడమే. మనపంట వారు దోచుకొనగా మిగిలినది మనం అనుభవిం చాలన్న పద్ధతి మాని మనము తినగా మిగిలినది వారు అనుభవించే పద్ధతికి రావాలి. ఆ హక్కు, ఆ స్వతంత్రమే, ఆ అధికారమే మనకు రావలసిన స్వాతంత్ర్యము, స్వరాజ్యం. "ఆ మార్పు కోరుట మన జన్మహక్కు, మన సంఘ ఆదర్శం" అని సత్యనారాయణమూర్తిగారు అన్నారు. ఒకరి శ్రమను మరొకరు దోచుకునే విధానం అంతరించి, ఎవరి శ్రమ ఫలితాన్ని వారు అనుభవించే హక్కు రావాలి. అదే నిజమైన స్వాతంత్ర్యం అని నిర్వచించుతున్నారు. అంటే బ్రిటీష్ సామ్రాజ్యవాద బానిస పరిపాలన ఒక్కటేకాదు, ఒక మనిషిని వేరొక మనిషి దోచుకునే వ్యవస్థ పోవాలి. అదే నిజమైన స్వరాజ్యం అంటున్నారు.

కూలీ రైతు రాజ్యం స్థాపించుకోవాలి

"ప్రతీ సంవత్సరం మన దేశం నుండి ఇంగ్లాండుకు ప్రవహిస్తున్న ధనం శ్రీ కె.టి. పాషాగారి (ఆనాటి ఆర్థికవేత్త) అంచనా ప్రకారం రూ॥ 213 కోట్ల 66 లక్షలు. ఈ దోపిడి వలన మనరైతు సగటు ఆదాయం 0-1-7 (ఒక అణా ఏడు పైసలు) లకు పడిపోయింది. కష్టజీవుల శ్రమశక్తిని కొల్లగొడుతున్న బ్రిటీష్ సామ్రాజ్య వాదాన్ని తనకు పునాదులుగా నియమించుకున్న జమిందారీ విధానాన్ని, నాశనం గావించాలి. దాని స్థానే నూటికి 80 మందిగా వున్న కూలీ రైతు రాజ్యమును స్థాపించుకోవాలి. దానికి మన మందరము బద్ధకంకణులము కావాలి. అట్టి రాజ్యాంగాన్ని ఈ దేశంలో స్థాపించు వరకు శాంతి యుండదని స్పష్టంగా ప్రకటించాలి".

- అదే ప్రసంగం నుండి

బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని, జమిందారీ విధానాన్ని రద్దుచేయడం కూలీరైతు రాజ్యం స్థాపించడం మన ఉద్యమకర్తవ్యాలు. అదే మనపోరాట లక్ష్యం అని శ్రీ సత్యనారాయణ మూర్తి విస్పష్టంగా పేర్కొనడమే కాదు. అందుకు రైతుకూలీ ఐక్యతను నిర్మించాలని కూడా తమ ప్రసంగంలో నిర్దేశించుతూ, వ్యవసాయ కూలీల దుర్భర జీవిత పరిస్థితులను ఇలా తెలిపారు.

వ్యవసాయ కార్మికుల దుర్భర పరిస్థితి - రైతుకూలీ ఐక్యతావశ్యకత

"రైతులను సంఘటితపరచడం ఒకటే చాలదు. వ్యవసాయ కార్మికులను సంఘటిత పరిస్తేనే కాని సంపూర్ణ స్వాతంత్ర్యమూ రాదు. రైతు కూలీ రాజ్యసంపాదనకు బలమూ చాలదు. మనకు దేశంలోని ఇతర కష్టజీవులందరి తోడ్పాటు కావాలి. ముఖ్యంగా మనతోపాటు కొంచెం యించు మించుగా సమాన సంఖ్యాకులై, మనకు అనుదిన సహాయులును, భూమియుండి మనము - భూమిలేక వారును, సకల భూమి పంట దినుసుల ను మనతోపాటు - మనకంటే కూడా అధిక శ్రమజీవులు, ఉత్పత్తికారకులు అయిన సోదర వ్యవసాయ కార్మికుల తోడ్పాటు అవసరమని మనం ఎంత త్వరగా గుర్తించిన అంతమంచిది. వారు భూమిలేని రైతులు మనం ఎండమావుల వంటి (మన చేతినుండి జారిపోవుచున్న) భూమి గల రైతులము. ఇద్దరి జీవనం వ్యవసాయమే. విశేష భూమి గల నూటికి పదిమందిగా నున్న ధనిక రైతులు తప్ప నూటికి 90మందిగా వున్న బీదరైతుల స్థితి, కూలీల దారిద్ర్యము ఒక్కటిగా వున్నది. మనము-వారు, విద్య లేని వింత గొర్రెలమే. వారిది మనది దున్నే కులమే. కనుక వ్యవసాయ కూలీల కనీస కోర్కెల సఫలత కొరకు మనం వారికి తోడ్పడాలి. మనసంఘ ఆశయాలలో వారి కనీస కోర్కెల సఫలత కూడా ఒకటే అను విషయాన్ని ప్రతీ రైతు వారితో వ్యవహరించినప్పుడు

జ్ఞాపక ముంచుకోవాలి. వాళ్ళూ మనమూ చీలితిమా జమీందారీ, షావుకారీ తోడేళ్ళు మనరెండు గొర్రె గుంపులను పీల్చిపిప్పిచేయుట నిస్సంశయం. ఆ సంఘముతో మనముమన సంఘముతో వారు కలిసిమెలసి ఐక్యంగా నడుపుకొని పోవుట యందే, మనల వారల భావి భాగ్యోదయ దశ కలదని ఉభయులము విశ్వసించి వర్తించాలి.

- ఆదే వసశక్తి ప్రసంగం నుండి

వ్యవసాయ కూలీలను రైతాంగాన్ని సమైక్య పరచాలనీ, రైతు సంఘాలు, వ్యవసాయ కూలీ సంఘాలు కలిసి పనిచేయాలని అప్పుడే మన ఉమ్మడి లక్ష్యం కూలీరైతురాజ్యం సాధించు కోగలమనీ ఇంత విస్పష్టంగా సత్యనారాయణ మూర్తి గారు ఎలా చెప్పగలిగారు? సోషలిజం స్థాపనకు కార్మిక కర్షక ఐక్యతకు గల రాజకీయ ప్రాముఖ్యతను వారు గుర్తించడం వలననే చెప్పగలిగారు. అంతేకాదు రైతు కూలీ ఐక్యతకు ఆచరణీయమైన "రాజీ బోర్డులను" (బహుళ సమిష్టి సంప్రదింపుల సంఘాలను Joint Consultative Councils రచయిత) నెలకొల్పుకోవాలన్న సూచన కూడా తమ అధ్యక్షోపన్యాసంలో శ్రీ సత్యనారాయణ మూర్తిగారు చేయడం గమనించదగిన విషయం. ఆయన ఇలా అన్నారు.

రాజీ బోర్డులు

"వారికి మనకు ఏ తగాయిదాలు ఏ గ్రామాలలో వచ్చినప్పటికీ సుహృద్భావంతో సామరస్యంగా పరిష్కరించుకోవాలి. మనకంటే వారు విద్యా విహీనులు గాన తగవు పరిష్కరించు కొనుటలో ఎక్కువ ఉదారతను చూపించవలసిన బాధ్యత మనయందే కలదు. ప్రతి జిల్లా, తాలూకాకు, రాజీ బోర్డులను ఏర్పరచుకోవాలి. ఆ బోర్డులలో మన సంఘ ప్రతినిధి ఒకడు, వారి సంఘప్రతినిధి ఒకడు, కష్టజీవుల రాజ్యస్థాపనకు కృషి చేయుచున్న సోషలిస్టు సంఘ ప్రతినిధి ఒకడు వుండి అవసరమైనపుడు రాష్ట్ర రాజీ బోర్డు సలహాలను తీసుకొని తగవులను పరిష్కరించు కోవాలి."

రైతుకూలీ సామరస్యం, ఐక్యతావశ్యకతలకు శ్రీ సత్యనారాయణ మూర్తి గారు ఎంత ప్రాధాన్యత ఆనాడే యిచ్చారో దీనినిబట్టి స్పష్టం.

శ్రీ సత్యనారాయణ గారు తమ ప్రసంగంలో గ్రామీణ పేద ప్రజలు, చేతివృత్తుల వారి నందరిని (అసంఘటిత గ్రామీణ శ్రామిక వర్గాలను) సంఘటితపరచాలనీ, కార్మిక, కర్షక తదితర కష్టజీవులందరినీ సమైక్యంగా జాతీయ పోరాటాల లోకి తీసుకురావాలనీ, జాతీయ కాంగ్రెస్‌ను వేదికగా చేసుకొని అందరు కలిసి పోరాడాలనీ, సామ్రాజ్య వాద వ్యతిరేక జాతీయైక్య సంఘటన నిర్మించు కోవాలని (Anti Imperialist National United Front) స్పష్టంగానే తమ అధ్యక్షోపన్యాసంలో ప్రతిపాదించారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయైక్య సంఘటన

దత్తు బ్రాడ్లిథీసిస్ రూపంలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏడవకాంగ్రెస్ యిచ్చిన సామ్రాజ్య వాద వ్యతిరేక జాతీయైక్య సంఘటన విధానాన్ని ఆనాడు భారత కమ్యూనిస్టు పార్టీ అవలంబించింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలోనేగాక కాంగ్రెస్‌లో కూడ చేరి కమ్యూనిస్టులందరూ పని చేస్తున్నారు. ఆనాటి వర్గసంఘాలన్నీ ఇదే రాజకీయ విధానాన్ని అవలం భించాయి. వీరవల్లి లో జరిగిన సప్తమ రాష్ట్ర రైతు మహాసభ అధ్యక్ష పీఠం నుండి ఆ రాజకీయ పంథాను రైతుకూలీ ఉద్యమాలకు అన్వయిస్తూ శ్రీ సత్య నారాయణ మూర్తి ప్రతిపాదించారు.

అనాడు అధికారంలో వున్న కాంగ్రెస్ మంత్రి వర్గాల పట్ల అనుసరించిన 'ఐక్యత పోరాట పంథా' ను వివరిస్తూ రైతు సంఘాల పట్ల అనాటి కాంగ్రెస్ నాయకత్వంలో ఒకభాగం (మితవాద వర్గం) అవలంబిస్తున్న ప్రతికూల వైఖరి సరికాదనీ, రైతు ఉద్యమం జాతీయ పోరాటానికి బలం చేకూర్చేదే తప్ప బలహీనపరచేది కాదని శ్రీ సత్యనారాయణ మూర్తి స్పష్టం చేశారు. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం ఒక్కటే సరిపోదనీ తెల్లదొరతనం స్థానంలో నల్ల దొరతనం వస్తే అట్టి రాజ్యాంగ విధానంలో దోపిడీ విధానం యధాతథంగానే కొనసాగుతుందనీ ఆయన ఎంతో దూరదృష్టితో ఆనాడే హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోని మితవాద వర్గాన్ని ఉద్దేశించి విమర్శిస్తూ "పీడిత ప్రజలు సామాజిక విప్లవాన్ని తెచ్చే శక్తిగల సైన్యంగా తయారగుటకు వారిష్ట పడరు. కానీ మనదృష్టిలోకార్మిక కర్షక ప్రజాస్వామ్యానికి సోపానమైన సంపూర్ణ స్వాతంత్ర్యము సైతం పై మార్గంవల్ల తప్ప (కార్మిక-కర్షక ఐక్యత, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయైక్య సంఘటన) మరొక విధంగా సాధించలేము" అని శ్రీ సత్యనారాయణమూర్తి గారు స్పష్టం చేశారు. తెల్లదొరతనం స్థానంలో నల్లదొరతనం వచ్చినంత మాత్రాన, కార్మిక కర్షక తదితర పీడిత ప్రజల సమస్యలు పరిష్కారం కావని విస్పష్టంగానే చెప్పారు.

శ్రీ సత్యనారాయణమూర్తిగారు తమ ప్రసంగాన్ని ఈక్రింది నినాదాలతో ముగించారు.

కార్మిక కర్షకులు ఏకం కావాలి.
రైతుల కనీస కోర్కెలు బలపరచాలి.
కాంగ్రెస్ కిసాన్ సంఘముల ఐక్యతను నమకూర్చండి.
జాతీయైక్య సంఘటనము నిర్మించండి.
జమీందారీ వద్దతి నశించాలి.
ఫెడరేషన్‌ను ఎదిరించాలి.
ప్రజాప్రతినిధి వరిషత్తు కావాలి
యుద్ధాలు అంతరించాలి
రైతు సంఘాలకు జై!

52 సంవత్సరాల క్రితం శ్రీ కొమ్మారెడ్డి సత్య నారాయణ మూర్తిగారు చేసిన ఈ అధ్యక్షోపన్యాసం మనం చదివినప్పుడు ఆయన ఆకుంఠిత స్వాతంత్ర్య సమర యోధుడుగానే గాక, శాస్త్రీయ సోషలిస్టు భావాలతో ఉత్తేజితులై, కార్మిక కర్షక రాజ్యంకోసం, సోషలిస్టు సమసమాజ నిర్మాణ లక్ష్యంకోసం అంకిత భావంతో కృషిచేసి తమ జీవితాన్ని విప్లవాదర్శాల కోసం ధారపోశారని మనకు స్పష్టమౌతుంది.


ఆయన ఈ సుదీర్ఘ అధ్యయన పూర్వక ప్రసంగంలో ఏ కార్మిక కర్షక రాజ్య స్థాపనను లక్షించారో అట్టి కర్తవ్యం ఇంకా నెరవేరవలసే వుంది. ఆయన కన్ను మూసి 50 సంవత్సరాల అనంతరమైనప్పటికీ నేడు ఆయన 50వ వర్థంతి జరుపుట ద్వారా ఆయన విప్లవాదర్శాలను, ఆయన నిరాడంబర, నిస్వార్థ ప్రజాసేవ నిరతిని, విప్లవదీక్షను మనం స్మరించుకొని, ఆయన ఏ మహోన్నత విప్లవ లక్ష్యాలకోసం తన జీవితాన్ని అంకితం చేశారో అట్టి లక్ష్యసాధనకు పునరంకిత మవడమే మనందరి కర్తవ్యం.

మరొక్క మాట చెప్పి ఈ వ్యాసాన్ని ముగిస్తాను. నాగర్జున యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కొమ్మా రెడ్డి రాజరామమోహన రావుగారు శ్రీ కొమ్మా రెడ్డి సత్యనారాయణగారి తనయుడే. వారు అనేక అభివృద్ధికర ఉద్యమాలకు, వామపక్ష ఉద్యమాలకు శాంతి, స్నేహ సంఘాలకు చేయూతనివ్వడమే కాక తమ పదవీ కాలంలోనే నాగార్జున యూనివర్శిటిలో శాస్త్రీయ సోషలిజం అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పిన ఘనత పొందిన వారు. దేశంలోనే ప్రప్రథమంగా ఒక యూనివర్శిటీ లోనే శాస్త్రీయ సోషలిజం అధ్యయన కేంద్రం ఆదీ నాగార్జున యూనివర్శిటీ లోనే నెలకొల్పబడటం యాధృచ్ఛికం కాదు. తండ్రికి తగిన తనయుడుగా డాక్టర్ రాజరామమోహన రావుగారు సోషలిజం భావాలకు అంకితం కావడమే అందుకు కారణం

- పరకాల పట్టాభిరామారావు
16-4-1990

రైతు ఉద్యమంలో కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి

- శ్రీ చంద్రరాజేశ్వరరావు (భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకులు)



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఉద్యమ ప్రారంభకులలో ఒకరైన శ్రీ కొమ్మా రెడ్డి సత్యనారాయణ మూర్తి గారి 50వ వర్థంతి జరుపుతున్నందుకు చాలా సంతోషం. ప్రముఖ కాంగ్రెస్ నాయకులుగా ఉంటూ, స్వాతంత్ర్యోద్యమంతో నూటికి అరవై మందిగా వున్న రైతుల ఉద్యమాన్ని మేళవించడం వారి యొక్క ఘనతని చెప్పాలి. వారు నాయకత్వం వహించిన రైతు ఉద్యమంలో ప్రధాన ఘట్టం 1937 ఆఖరులో ఇచ్చాపురం నుండి ప్రారంభమయి మద్రాసుకు చేరిన రైతు రక్షణ యాత్ర. ఈ యాత్ర బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, జమీందారులు, వడ్డీ వ్యాపారులు మొదలైన వారి దోపిడీతో నలిగి పోతున్న రైతాంగాన్ని ఎంతో ఉత్తేజపరచింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర అసెంబ్లీ స్పీకరైన బులుసు సాంబమూర్తి గారికి సమర్పించిన మెమోరాండం ప్రాతిపదికగా, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రప్రాంతంలో రైతు ఉద్యమాలకు ఇది ప్రాతిపదిక అయింది. ఉమ్మడి మద్రాసు శాసనసభ రెవెన్యూమంత్రిగా ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులుగారి అధ్వర్యంలో జమిందారీ, రైతుల ఇక్కట్లను తెలుసుకునేందుకు ఒక దర్యాప్తు కమిటీని నియమించాల్సి వచ్చింది.

ఈ కమిటీ జరిపిన దర్యాప్తు కార్యకలాపాలు కూడా జమీందారీ రైతులకు ఉత్సాహాన్ని, ఆశలను పురికొల్పినవి. దీని పర్యవసానంగా జమీందారీ రైతుల పోరాటాలు ప్రారంభం అయినాయి. అందులోనూ ముఖ్యమైన పోరాటాలు కృష్ణ జిల్లాలోని మునగాల, లింగగిరి పరగణాల్లో జరిగిన పోరాటాలు, గంపల గూడెం, చల్లపల్లి జమీందారీ రైతుల పోరాటాలు, పశ్చిమగోదావరి జిల్లాలోని కాళీపట్నం జమీందారుపై జరిగిన పోరాటం, నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి జమీందారీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు ముఖ్యమైనవి.

ఈ పోరాటాల్లో మునగాల, లింగగిరి జమీందారీ రైతుల పోరాటాలు ప్రత్యేక ప్రాముఖ్యత ను పొందినవి. ఎందువల్లనంటే ఈ రెండు పరగణాలు నాటి నిజాం హైదరాబాదు సంస్థానంలో కృష్ణా జిల్లాకు చెందిన దీవుల్లాగా వుండేవి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రైతులు తమ భూముల మీద చట్టబద్ధమైన యాజ మాన్యపు హక్కును సంపాదించు కున్నప్పటికీ, ఈ రెండు పరగణాల్లో మాత్రం ఇది అమలులో ఉండేదికాదు. కారణం చుట్టూ నిజాం సంస్థానం ఉండటం వలన మునగాల జమీందారు, లింగగిరి పరగణా మొఖాసాదార్లు నాటి నైజాంకాలపు దారి దోపిడీనే కొనసాగించేవారు. రైతుల భూములను అన్యాయం గా ఆక్రమించు కునేవారు. రైతుల మీద ఇష్టం వచ్చినట్లుగా శిస్తులను వేసేవారు. రైతుల్ని తమ గడీల్లో నిర్బంధించి చిత్రహింసలు చేయడం, నెత్తి మీద బండలెత్తడం మొదలైన దారుణ కృత్యాలను చేసేవారు.

వారికావక్కు లేకపోయినప్పటికి సివిల్, క్రిమినల్ అధికారాలను నిజాం సంస్థానంలోని జాగీర్దార్లవలె అమలు జరిపేవారు. వైపెచ్చు అన్ని వర్గాల వారితో కూడా వెట్టి చాకిరీ చేయించేవారు. కూలీలు జమీందారిచ్చిన ముక్కిపోయిన జొన్నల అంబలి కాసుకు తాగి, జమీందారు పొలాల్లో పని చేసేవారు. బండలు కొట్టేవారు. జమీందారీ మనుషులు పిల్లలకి పాలివ్వటానికి పిల్లల తల్లులను ఇళ్ళక్కూడా పోనిచ్చే వారు కాదు. రైతులు ఊరికినే జమిందారు పొలాలను దున్నేవారు. జమిందారు ఎంత శిస్తు వేస్తే అంతాకట్టుకునే వారు. చాకళ్ళు ఒంతులు వారీగా జమీందారు కోటలోని అందరి బట్టలు ఉతకడమే కాకుండా లంకంత కోటలో ఊడ్చి నీళ్ళు చల్లేవారు. కచ్చడం బండ్లు ముందు, వెనకాల (జమీందారు ఉద్యోగులు ప్రయాణిస్తున్నా) పరిగెత్తేవారు. మంగళ్ళు కోటలోని వారందరికి ఉచితంగా క్షౌరాలు చేయడమే కాకుండా జమీందారుల దున్నలు, బర్రెలకు కూడా క్షౌరాలు చేసి నీళ్ళుపోయాల్సి వచ్చేది.

జమీందారు మనుషులు డబ్బివ్వకుండానే వర్తకుల దగ్గర్నుండి సరుకులు తీసుకునేవారు. కుమ్మర్లు ఉచితంగా కుండలని ఇవ్వాల్సి వచ్చేది. గీత పనివాళ్ళు వుచితంగా జమిందార్ల మనుషులకు కల్లుపోయాల్సి వచ్చేది. చివరికి బ్రాహ్మలు కూడా వెట్టిచాకిరి చేయాల్సి వచ్చేది. ప్రతి కుటుంబం మోదుగాకుల విస్తళ్ళను కుట్టి జమీందారు కుటుంబాలకు ఉచితంగా యిచ్చేవారు.

వెట్టి చాకిరి ప్రజలందరి పాలిటి మహమ్మారి గా ఉండేది. అందుచే వెట్టిచాకిరి రద్దు సమస్య చాలా ప్రధానంగా ఉండేది.

కృష్ణాజిల్లాలో ఇటువంటి జమీందారీ దోపిడి దౌర్జన్య పద్ధతులు ఉన్నవని 1937 లో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి తెలిసింది. 1937 ఎన్నికల్లో పశ్చిమ కృష్ణాజిల్లాకు కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రముఖ స్వాతంత్ర్యయోధులైన కాట్రగడ్డ నారాయణ రావు గారు కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి నారు. అప్పుడు కమ్యూనిస్టులు కాంగ్రెస్‌లో సభ్యులుగా ఉండటం వలన, పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రముఖులు వామపక్ష భావాలు కలిగిన వారవటం వలన ఈ స్థానం కాట్రగడ్డ నారాయణ రావు గారికి లభించింది.

ఈ ఎన్నికల ప్రచార సందర్భంగానే ఇక్కడ మునగాల, లింగగిరి పరగణాల ప్రజల ఇక్కట్లు తెలిసినవి. ఎన్నికల్లో నారాయణరావుగారు అభ్యర్థిగా నెగ్గడంతో మునగాల ప్రజల్లో కూడా ఉత్సాహం వచ్చింది. కమ్యూనిస్టు పార్టీ పశ్చిమ జిల్లా కాంగ్రెసు కమిటీల తరపున మునగాల, లింగగిరి పరగణాల్లో పర్యటన చేసి రైతులను ఉత్సాహ పరచడానికి నలుగురుతో కూడిన ఒక దళం పంపబడింది. దాంట్లో కమ్యూనిస్టు పార్టీ తరపున నేను, వెల్లంకి విశ్వేశ్వరరావు, పశ్చిమ జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున అనుమల రామగోవిందశర్మ, బుచ్చి రామశ్రేష్టి

గార్లు ఉంటిమి. మేము మునగాల, లింగగిరి పరగణాలలో సుమారు 20గ్రామాలు తిరిగి, బహిరంగ సభలు పెట్టి రైతు సంఘాలను ఆర్గనైజ్ చేశాము. వెట్టిచాకిరి, నిర్బంధపు వసూళ్లు, దౌర్జన్యాలు చట్టవిరుద్ధమని, వాటిని ధిక్కరించాలని ప్రబోధం చేశాము. ఇంత బహిరంగంగా చెపుతున్నప్పటికి, జమీందారు ఏమీ చేయలేక పోవడంతో, ఆ పరగణాల రైతు కూలీల్లో కొంత ఆత్మ విశ్వాసం కలిగింది. మునగాల జమిందారు మా మీద దౌర్జన్యం చేయటానికి సాహసించక పోవటానికి కారణం అప్పటికే, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డం. తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌ను విచారణకు పంపింది.

మేము అందజేసిన రిపోర్టులోని అంశాలన్నీ కూడా నిజమని తేలిపోయింది. కలెక్టరు కూడా బహిరంగంగా వెట్టి చాకిరి, దౌర్జన్యాలు, చట్ట విరుద్ధమని చెప్పటం జరిగింది.

ఆ సమయంలో జమిందారీ దౌర్జన్యాలతో విసిగిపోయిన రైతు, వర్తక ఇతర ప్రముఖు లందరూ ధైర్యంగా ముందుకు రావడం జరిగింది. అందులో ప్రముఖులు మునగాలకు చెందిన ఉప్పల రామయ్య, వర్తక యువకుడు వెంకట రామనర్సయ్య ముఖ్యులు. అయితే మునగాల జమిందారు కృష్ణా జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ నాయకునితో స్నేహంగా ఉండడం వల్ల, కాంగ్రెస్ ప్రభుత్వం గట్టిచర్యలు తీసుకోడానికి వెనకాడింది. అందుచే మునగాల, లింగగిరి పరగణాల రైతు సంఘం తరపున ఉద్యమం ప్రారంభమయింది. ఆ ఉద్యమం లోనండూరిప్రసాదరావు, మోటూరు పరంధామయ్య, వేములపల్లి ఆంజనేయులు, ప్రథమశ్రేణిలో ఉండి నడిపినారు. ప్రజలు ఉవ్వెత్తున లేచారు. వెట్టిచాకిరి, దౌర్జన్యాలు, పూర్తిగా కట్టుబడి పోయినవి. ఇక మిగిలింది అక్రమశిస్తులు, అన్యాయంగా ఆక్రమించు కున్న భూముల సమస్య మిగిలి పోయినవి. ఈ పోరాట ఫలితంగానే ఉమ్మడి మద్రాసు కాంగ్రెస్ ప్రభుత్వం, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా వున్న గొట్టిపాటి బ్రహ్మయ్య గార్ని మీడియేటర్‌గా నియమించింది. ఆయన కొన్ని మంచినిర్ణయాలు చేసినా అవి అమలు జరగలేదు. కారణం అప్పటికే రెండవ ప్రపంచ యుద్ధ మేఘాలు కమ్ముకున్నవి. కాంగ్రెస్ ప్రభుత్వం రాజీనామా ఇవ్వాల్సి వచ్చింది. మునగాల రైతుల పోరాటం దీర్ఘకాలం కొనసాగింది. దాని పర్యవసానంగా చట్టబద్ధమైన హక్కులు అమలు జరిగినవి.

మునగాల పోరాట ప్రభావం చుట్టు ప్రక్కల వున్న నైజాం సంస్థానంలోని ప్రజల మీద పడింది. అప్పటికే నిజాం సంస్థాన ప్రజలు బాధ్యతాయుత ప్రభుత్వంకోసం పోరాటం ప్రారంభించారు. ప్రముఖ జాతీయవాదులు స్వామిరామానంద తీర్థ, రావి నారాయణరెడ్డి, బద్దంఎల్లారెడ్డి, ఆరుట్లలక్ష్మి నరసింహారెడ్డి మొదలైన వారి ఆధ్వర్యంలో ఈ ఉద్యమం నడిచింది. దీనితోపాటు వందేమాతరం ఉద్యమం పేరిట విద్యార్థి ఉద్యమం కూడా నడిచింది. దీనికి నాయకులు సర్వదేవభట్ల రామనాధం, దేవులపల్లి వెంకటేశ్వరరావు మొ॥ ప్రముఖులు. అదే సమయంలో కమ్యూనిస్టు భావాలతో కూడిన కామ్రేడ్స్ అసోసియేషన్ పేరిట మరోఉద్యమం నడిచింది. మగ్దూం మొహియుద్దీన్, రాజ్‌బహుదూర్ గౌడ్, జవాద్‌రజ్వి మొ॥ ప్రముఖులు ఆ ఉద్యమంలో వున్నారు. ఈ జాతీయోద్యమ ప్రభావంతోనూ, మునగాల పరగణాపోరాటంతోనూ నిజాం సంస్థానంలోని చుట్టుపట్ల గల నల్లగొండ ప్రజల్లో సంచలనం రేగింది. మునగాల పరగణా పక్కనే బేతవోలు మత్త ఉండేది. ఒకే గ్రామం మత్తగా ఉండేది. మునగాల జమీలో ఉన్న దుర్మార్గాలతో పాటు ఆ మత్తాలో ఆశ్చర్యాన్ని గొలిపే కొన్ని ఇతర దుర్మార్గాలు కూడా జరుగుతుండేవి. అక్కడ తిరగలి, గొడ్డలి మొదలైన పనిముట్లకు పన్నే కాకుండా, చంటి పన్ను పేరుతోయుక్త వయస్కులైన స్త్రీలందరి పైనా పన్ను వసూలు చేయబడేది. అప్పుడు మమ్మల్ని అక్కడికాహ్వానించారు. కాని మేము, ఏమీ చేయలేకపోయినాము. తరువాత ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో జరిగిన చారిత్రాత్మక తెలంగాణా పోరాటంతో జాగీర్దారీ, దేశ్‌ముఖ్, ముత్తేదారు, బంజరుదారు మొదలైన జమిందారీయుగపు అవశేషాలన్నీ కూడా రద్దయి, ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించినాయి.

నాకు మునగాల, లింగగిరి పరగణాలతో ప్రత్యక్ష సంబంధం ఉండటం వలన, నేను ఆ పోరాటాలను గురించి సుదీర్ఘంగా రాయడం జరిగింది. చల్లపల్లి ఎస్టేటులో బంజరు భూములు, అదనపు శిస్తులకు వ్యతిరేకంగా పోరాటాలు జరిగినా, ఇటువంటి మధ్య యుగపు దౌర్జన్యాలు అక్కడ వుండేవి కావు. ఈ పోరాటంతోనూ నాకూ ప్రత్యక్ష సంబంధం ఉన్నప్పటికీ, ఈ వ్యాసంలో వివరాలు రాయటానికి నేను పూనుకోలేదు.

"బ్రతుకంతా భారం, క్రూరం
ప్రమాదాల తీరం ఘోరం
పుట్టటమే మహాపాతకం
చావే యిక మేలను " కుంటూ
నిరుత్సాహపడ బోకండోయ్!
నిస్పృహగా వాపోకండోయ్!!

నరచరిత్ర చూసుకు వడవని,
నిరుత్సాహ నీరసులారా!
యుగయుగాల కాలం మంచీ
మానవత్వమేం జేస్తుందోయ్?-

నిరుత్సాహపడబోకండోయ్!
త్వరత్వరగా పని చెయ్యండోయ్!
యుగయుగాలు కష్టించామోయ్!
ఇకనెంతో దూరం లేదోయ్!!

కష్టానికి నిష్ఠురపడితే,
అసలెందుకు మొదలెట్టారోయ్?
కష్టకాలమంతా గడచీ,
ఈ కాస్తలో వదిలేస్తామా?

- తెన్నేటి సూరి

కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారు ఆధ్వర్యం వహించిన చారిత్రక రైతు యాత్ర అనేక రైతు పోరాటాలకు నాందీ ప్రస్తావన చేసింది. ప్రకాశం పంతులు గారి ఆధ్వర్యంలో వేసిన కమిటీ జమీందార్ల దుర్మార్గాలను క్రోడీ కరిస్తూ సుదీర్ఘమైన రిపోర్టును ఆలస్యంగా నైనా ప్రభుత్వానికి సమర్పించింది. చివరకు స్వాతంత్ర్యం తరువాత జమిందారీ విధానమే రద్దు చేయబడింది. జమీందారీ రైతుల, కూలీల ఇక్కట్లు అంతమైనవి. రైతు ఉద్యమ ఆద్యుల్లో ఒకరైన కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తిగారి కృషి వారి మరణం తరువాతనైనా ఫలించింది. అందుకు వారు చిరస్మరణీయులు.

కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారి ఎడల నాకు అపారమైన గౌరవం ఉండేది. వారి జీవితం ఆదర్శవంతమైనది. చెప్పేదానికి, చేసేదానికి మధ్య ఏమీ అంతరం ఉండేది కాదు. వారు సౌమ్యులు. తన అభిప్రాయాల్ని సౌమ్యంగానే ఖచ్చితంగా చెప్పేవారు. వారి ఆదర్శ జీవితం ప్రతి రాజకీయ నాయకునికి ఉత్తేజకరం, అనుసరణీయం.

న్యూఢిల్లీ,
29-1-1990.

ఉజ్వల రైతాంగ పోరాటాలకు నాంది - రైతు రక్షణ యాత్ర

- శ్రీ నండూరి ప్రసాదరావు (ఆంధ్ర రైతు నాయకులు, మార్క్సిస్టు పార్టీ నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు)



ఆంధ్ర రైతు ఉద్యమ చరిత్రలో 1937-38 కాలంలో కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తిగారి నాయకత్వాన జరిగిన ఆంధ్ర రాష్ట్ర రైతు రక్షణ యాత్ర ఒక చరిత్రాత్మకమైన ఘట్టం.

అవి బ్రిటిష్‌వారు పాలించేరోజులు; అతి క్రూరమైన జమీందారీ విధానాన్ని, రైత్వారీ పద్ధతి పేరుతో భూస్వామిక విధానాన్ని ప్రవేశపెట్టి రైతాంగాన్ని నిలుపు దోపిడీ చేసే రోజులవి. రైతులు చితికిపోయి వ్యవసాయ కూలీలుగా తయారౌతూ వుండేకాలం; రైతుల భూములు వడ్డీ వ్యాపారుల చేతులలోనికి, భూస్వాముల చేతుల లోనికి పోతుండే కాలం; వ్యవసాయానికి తోడుగా, ఆధారంగా వుండే గ్రామ చేతివృత్తులు బ్రిటిష్ యంత్రోత్పత్తి పోటీకి నిలువలేక నాశనమై పోతూ వుండేకాలం.

రైతాంగ ఉద్యమం ప్రభవించేకాలం; అయితే దానికి నాయకత్వం వహించేది పెద్ద భూస్వాములు, మరీ పెద్ద లాయర్లు. ఒక ధ్యేయం, ఒక లక్ష్యం, ఒక కార్యాచరణ పథకం లేకుండా కొన్ని తాత్కాలిక సమస్యలపై తమ కోర్కెలను వెల్లడించే వేదికగానే రైతుసంఘం వుండేది.

1929-33 ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఇతర దేశాల అన్నింటిలో వలెనే మన రాష్ట్రంలో కూడా రైతాంగాన్ని వినాశన స్థితికి తెచ్చింది. ధాన్యం ధర బస్తా రూ. 2-8-0లు, కిరోసిన్ డబ్బా నూనె 14 అణాలు, గజం చొక్కా గుడ్డ 2 అణాల ఆరుపైసలుకు పడిపోయిన కాలం. లక్షల ఎకరాల భూమి మార్వాడీల చేతులలోకి పోయింది. సత్య నాధన్ కమిటీ రిపోర్టు ప్రకారం రైతాంగ రుణం రూ. 103 కోట్లకుచేరింది.

ఇటువంటి భూమికలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టులు, అభ్యుదయ కాంగ్రెస్ వాదులు రైతు ఉద్యమాన్ని పోరాట పధాన నడిపించ డానికి, రైతు సంఘాన్ని ప్రజా బాహుళ్యపు సంస్థగా చేయడానికి ఉమ్మడిగా నడుములు బిగించారు. 1936లో అఖిలభారత కిసాన్‌సభ ఏర్పడింది. స్వామీ సహజానందసరస్వతి, ఇందూలాల్‌యాజ్ఞిక్, ఆచార్యరంగా, బంకింముఖర్జీ, నంబూద్రిపాద్ మున్నగువారు దీనికి సారధ్యం వహించారు. ఒక స్పష్టమైన, సూటియైన, రైతాంగ జన బాహుళ్యపు కోర్కెలను ప్రతిబింబిచేటి లక్ష్యం, ఆశయము లతో ప్రారంభమైనదీ విప్లవ రైతు సంస్థ. "జమీం దారీ విధానం రద్దు కావాలి", "రుణ విముక్తి కావాలి" కనీస ఆదాయాన్ని మినహాయించి ఆ పై వ్యవసాయాదాయాలపై వృద్ధి క్రమాను సారంగా భూమి శిస్తు విధించాలి, "పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించాలి" మున్నగు ఆశయాలు నినదించినది.

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంలో ఇదే కాలంలో కమ్యూనిస్టులు, అభ్యుదయ కాంగ్రెస్‌వాదులు, రైతు సంఘానికి ప్రాణం పోశారు. 1937 లో రాష్ట్ర కాంగ్రెస్ సహాయ కార్యదర్శి కొమ్మారెడ్డి సత్య నారాయణ మూర్తిగారు అధ్యక్షులుగా కమ్యూనిస్టు ముఖ్యులు చలసాని వాసుదేవరావుగారు ప్రధాన కార్యదర్శిగా ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం నూతన ఉత్సాహంతో నూతన వరవడితో ఉద్యమాలను ప్రారంభించింది.

కొద్ది నెలలకు ముందే మద్రాసు అసెంబ్లీ ఎన్నికలు జరిగినవి. కమ్యూనిస్టులు, అభ్యుదయ కాంగ్రెస్ వాదులు, జమీందారీ విధానం రద్దు, రుణ విముక్తి, భూమిశిస్తు సంస్కరణ, మున్నగు లక్ష్యాలను ఈ ఎన్నికలలో విస్తృతంగా ప్రచారం గావించారు. " రైతుకే వోటేయవలెనన్నా, మన కష్టసుఖములు రైతు ప్రతినిధి తీర్చగలడన్నా" అనే పాట వినువీధులా మారుమ్రోగింది. పిఠాపురం రాజా మొదలు జమీందార్లు అందరూ టపాటపా ఎన్నికలలో ఎగిరిపోయారు. కాంగ్రెస్ అత్యధిక మోజారిటీతో గెల్చి, రాష్ట్రంలో ప్రప్రథమంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పర్చడంతో రైతాంగం ఆశలు చిగిర్చింది.

1936 డిశంబర్‌లో ఫైజ్‌పూర్ కాంగ్రెస్ మహాసభ జరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షులు అప్పుడే. అక్కడే 2 వ అఖిల భారత కిసాన్ మహాసభ జరిగింది. లాజీవెండసే నాయకత్వాన రైతు యాత్రా దళం మహారాష్ట్ర జిల్లాల్లో ప్రచారంగావిస్తూ, ఫైజ్‌పూర్‌కు చేరుకుంది. జవహర్‌లాల్ నెహ్రూ కిసాన్ మహాసభలకు స్వాగతం పలుకుతూ రైతు ఉద్యమ లక్ష్యాలకు తోడ్పాటును ప్రకటించారు. అఖిలభారత కిసాన్‌సభ తమ కోర్కెలకై ఉద్యమా లను సాగించడానికి శంఖం వూదింది. ఆంధ్ర రాష్ట్రం దీనిని అందుకుంది. కాంగ్రెస్ గెల్వవచ్చు. నెహ్రూలా రైతుల కోర్కెలను బలపర్చవచ్చు. వాటిపై ఆశలు పెట్టుకుని భజన చేసుకుంటూ కూర్చు నడమా? లేక రైతాంగ ఉద్యమ బలంతో పోరాట శక్తితో తమ కోర్కెలను సాధించుకొనుటకై ఉద్యమాలకు ఉపక్రమించడమా? కొమ్మారెడ్డిగారి నాయకత్వంతో ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం రెండవ మార్గాన్నే ఎనుకున్నది.

రైతుల ఆశయాలు వెల్లడించబడినాయి, లక్ష్యాలు నిర్వహించబడినాయి. వాటి సాధన కొరకై మార్గం చూపబడింది. వీటిని రైతాంగమంతటా ప్రచారం చెయ్యాలి. వారిని మేల్కొల్పాలి, ఉత్తేజ పర్చాలి, పోరాటాలకు సంసిద్ధం చేయాలి. ఇందుకే ఆంధ్రరాష్ట్ర రైతు రక్షణయాత్ర తలపెట్టబడింది, కొమ్మారెడ్డి సత్యనారాయణగారు నాయకుడుగా, చలసాని వాసుదేవరావు గారు ఉపనాయకుడుగా ఈ జైత్రయాత్ర 1937 జులై 3వ తేదీన ఆంధ్ర రాష్ట్రపు ఉత్తర కొస ఇచ్ఛాపురం నుండి ప్రారంభ మయ్యింది. ఆచార్యరంగా, పుల్లెల శ్యామసుందర

రావు మున్నగు వారి శుభాశీస్సులతో ఆంధ్ర రైతాంగ చరిత్రలోనే అపూర్వమైన ఈ రైతు యాత్ర సాగింది. 1532 మైళ్లు కాలినడకన, మిగతా ప్రాంతాలలో542 మైళ్ళు బస్సులలోనూ 130 రోజులు పర్యటించి, ఈ యాత్రా దళం 1938 మార్చి 27న మద్రాసుకు చేరుకుంది. మద్రాసు అసెంబ్లీ స్పీకర్ మహర్షి బులుసు సాంబమూర్తి గార్కి, రాజాజీ మంత్రి వర్గానికి వినతి పత్రాలను, వందలాది రైతుల మహజర్లను సమర్పించింది.

ఈ రాష్ట్ర రైతు రక్షణయాత్ర రాష్ట్రంలో కలిగించిన సంచలనం అపూర్వం. దారి పొడవునా, గ్రామగ్రామానా అఖండ స్వాగతం లభించింది. ఆబాలగోపాలం నీరాజనాలు అర్పించింది. వారి ఉపన్యాసాలతో, బోధలతో ఉత్తేజాన్ని పొందింది. కాంగ్రెస్, కమ్యూనిస్టు, జస్టిస్‌పార్టీల అతిరథ మహా రథులందరూ ఈ దళానికి యిచ్చిన తోడ్పాటు, అందజేసిన సహాయం అపూర్వం.

రాజాజీ ప్రభుత్వం వ్యవసాయదారుల రుణ విమోచన చట్టాన్నిగావించింది. ఇది పరిమిత ప్రయోజనాన్నే కలిగించింది. జమీందారీ విధానం సంస్కరణకై ప్రకాశం కమిటీని ఏర్పరచింది. ఆ కమిటీ జమీందారీ విధానం రద్దును సిఫార్స్ చేయడం గాక, జమీందారీ విధానం ఏర్పడిన నాటికి ఉన్న పరిస్థితులను పునరుద్ధరించమని చెప్పింది. రైతాంగానికి ఇది సంతృప్తి కలిగించలేదు.

ప్రభుత్వ విధానాలు కూడా రైతులకు సంతృప్తిని కలిగించలేదు. బ్రిటీష్ కంపెనీలైన ఐ.ఎల్.టి.డి., చిట్టివలస జూట్‌మిల్లు కార్మికులు సమ్మె చేస్తే ఆ సంఘాల నాయకులు శాసనసభ్యులే-తుపాకి కాల్పులు జరిపి ముగ్గురి ప్రాణాలను బలిగొనడం జరిగింది. "బ్రిటీష్‌వాడిని తన్ని తరిమేయండి" అని వెంకటగిరిలో ఉపన్యాసమిచ్చినందుకు కమ్యూనిస్టుపార్టీ నాయకుడు బాట్లీవాలాపై రాజ ద్రోహ నేరం మోపబడింది. దీనిపై చర్చ జరపడానికి ఎ.ఐ.సి.సి.కి అనేక తీర్మానాలు రాగా ఆరోగ్య కారణం నెపంపై రాజాజీ ఆ సభకు గైర్ హాజరైనారు. జమీందార్ల ఆగడాలు సాగుతూనే వున్నాయి.

ఇటువంటి పరిస్థితులలోనే రైతుయాత్రాదళం కలిగించిన స్ఫూర్తితో ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం కొమ్మారెడ్డిగారి నాయత్వాన రైతు పోరాటాలకు ఉపక్రమించింది.

మునగాల, ముత్యాల, కాళీపట్నం, చల్లపల్లి, మందస,వెంకటగిరి,కానూరు,పెండ్యాల మున్నగు అనేక రైతుపోరాటాలు 1938-40 కాలంలో జరిగినవి. వేలాది రైతాంగం వీటిలో పాల్గొన్నారు. వేలమంది లాఠీ చార్జీలకు గురైనారు. వందల మంది జైళ్ళ పాలైనారు. కాళీపట్నం జమీందారీ వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహించినందు కు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారు, ఉద్దరాజురామం గారు వగైరా కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ నుండి సస్పెండ్ చేయబడ్డారు. కాని, చివరకు ఈ రైతాంగ పోరాటాగ్నిలో జమీందారీ విధానం దగ్ధంగాక తప్పలేదు.

ఈ చరమాంకాన్ని కొమ్మారెడ్డి గారు చూడలేక పోయారు. కాని వారు రగిలించిన చిచ్చే జమీందారీ విధానాన్ని కాల్చి బుగ్గి చేసింది.


ఆంధ్రరాష్ట్ర రైతు రక్షణాయాత్రా దళం సాధించిన చరిత్రాత్మకమైన విజయం ఇది. ★

రైతన్నా ... పేదన్నా

- దివి కుమార్

లేలేర రైతన్నా ... రైతన్న
వీరునిలా కదలిరారో పేదన్న
తెల్లవాళ్ళ రాజ్యం పోయి ... రైతన్న
వల్లవాళ్ళ రాజ్యమొచ్చెరో పేదన్న
ప్రభుతలెన్ని మారుతున్ననూ రైతన్న
నీ బ్రతుకే బండలాయెరా పేదన్న ॥లేర॥

భూస్వాముల దోపిడీని రైతన్న
దళారీ ప్రభుత్వాన్ని పేదన్న
ఎదిరించి నిలవాలిరో రైతన్న
ఐక్యమై పోరాడాలిరో పేదన్న



కాచుకో ఊదరబాంబు దెబ్బ!

- కామ్రేడ్ భీమిరెడ్డి నర్శింహారెడ్డి (తెలంగాణ సాయుధ పోరాట నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు)



అది నల్గొండ జిల్లా నూర్యాపేట తాలూకాకు చెందిన కోటపాడు గ్రామంలో 1947 సంవత్సరం వేసవిలో నిజాము రజాకారు మిలటరీ మూకపై కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన జరిగిన సాయుధ గెరిల్లా దాడి. అది తెలంగాణాలోని నాటి సాయుధ రజాకారు మిలటరీ మూకలపై జరిగిన తొలి దాడులలో ముఖ్యమైనది. హత్యలు, లూటీలు, గృహ దహనాలు యదేచ్ఛగా సాగించుతోన్న రజాకారు మూకలపై తమ ప్రతీకార దీక్షకు వరాష్కారమూ దొరకక నిరాయుధ జనం మసలిపోతున్న రోజులవి. ఈ ప్రతీకార దీక్షలో నుండే అగ్ని బాంబులు ఎగిరి శత్రుమూకపై విరుచుకపడనారంభించాయి. అందులో ఈ కోటపాడు గెరిల్లా దాడి తొలి మచ్చు తునకయని చెప్పవచ్చును.

- ఎడిటర్

"చూస్తారెందుకు ఊదరబెట్టి చంపక దుర్మార్గులను" అనే మాటలకు అప్పటికి ఎటూ తోచనిస్థితిలో తలపట్టుకొని వున్న నేను హఠాత్తుగా ఉలిక్కిపడ్డాను. ఒక పండు ముదుసలి నోటి నుండి వెలువడిన ఈ మాటలు కారుచీకటిలో కాంతిరేఖను మెరిపించి కర్తవ్యాన్ని గుర్తుచేశాయి.

అప్పటికి మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటలుగా నిజాం రజాకార్ మిలిటరీతో సాగుతున్న పోరది. వాస్తవానికి గెరిల్లా దళంగా సాయుధ మిలిటరీతో తలపడటం మాకు చరిత్రలో ఇదే మొదటిసారి. ఇది ప్రతిష్టంభనలో పడి యెటూ తేలని స్థితి ఏర్పడింది. శత్రుమూక అంతస్థుల మేడలో రక్షణ తీసుకొని ఆధునిక ఆయుధాలు కలిగిన మిలిటరీ పనికిరాని నాటు ఆయుధాలు గల (బర్మార్ తుపాకులు) మమ్ములను దరికి రాకుండా తరుముతున్నారు.

నలుమూలల ముట్టడివేసి వున్న మేమే ఒక అడుగుకూడా ముందుకు వేయలేకపోతున్నాం. మార్గము తోచక తలపట్టుకొని చతికిలపడి తరుణోపాయం కొరకు అన్వేషిస్తున్న నాకు వజ్రా యుధ మొకటి ఈ దెబ్బతో అందనే అందినది. "అవును అవసరమైతే ఈ భవనాన్నే తగులబెట్టి ఇందులో వున్న దుండగులను దనుమాడి తీరాలి" అనే నినాదం ప్రతిధ్వనిస్తుండగా అప్పటికే కర్తవ్యం కొరకు కాచుకొని వున్న వందలాది మంది జనం విజృంభించి గడ్డివాములు అందుకొన్నారు. చూస్తుండగానే భవనం నలువైపులా పేరుకొనియున్న గడ్డిమోపులు అగ్ని బాంబులుగా మారి మంటలతో భవనాన్ని నలువైపులా ముట్టడిం చాయి. ఇంతవరకు భవనం అడుగు భాగంలో రక్షణలోయున్న శత్రుమూక ఈ ఊదర దాడికి ఉడికి పోనారంభించింది. నలువైపులా ఈ అగ్ని బాంబులు (మండుతున్న గడ్డిమోపులు) ఒక్కటిగా గోడపై నుండి లోపలికి దొర్లుతూ వెదజల్లుతున్న అగడుకు (వేడి) శత్రుమూక తాళలేక పోతున్నది. అడుగుభాగం వేడెక్కడంతో పైఅంతస్తుకెక్కిన కిరాతకులు అక్కడి నుండి తిరుగుదాడి ఆరంభిం చారు.

ప్రజల అండతో విజృంభించిన గెరిల్లాలు భవనంలో ప్రవేశించి మొదటి రక్షణ శ్రేణిని ఛేదించారు. మొదటి అంతస్తు నుండి తిరుగుదాడిని ఆరంభించిన శత్రుమూకలకు అగ్ని బాంబులు ఎదుర్కోవడం ఎలా అనే సరికొత్త సమస్య ఎదురైంది.

పెద్ద పెద్ద గడ్డిమోపుల స్థానాన్ని అగ్ని జ్వాలల్లో మండుతున్న చొప్పకట్టలు మంటలు కక్కుతున్న రామబాణాలుగా అతి వేగంగా దూసుకొని పై అంతస్తులోనికి ప్రవేశిస్తున్నాయి. ప్రతీకారదీక్షతో వెనుక నుండి ప్రజలు కడు చాకచాక్యంతో గెరిల్లాలకు అండగా వెనుక నుండి సాగిస్తున్న సరికొత్త దాడి అది. రివ్వున అగ్నిబాణాలు అప్పటికే అందులో వున్న మిరపకాయ, చింతపండు, అంకెములు అంటుకొనగా అవి రణగొణ ధ్వని చేస్తూ శత్రువుకు ఊపిరిసల్పనిస్థితి కల్పించి ఉక్కిరిబిక్కిరి చేయనారంభించాయి. దీనివల్ల శత్రువు తిరుగుదాడి విచ్ఛిన్నం కాగా ప్రాణాలు రక్షించుకొనుటయే ప్రధానమని తలచి ఆ దుండగులు ఆఖరి అంతస్థుకు చేరుకున్నారు. అయినా ఆ వెనువెంటనే అగ్నిజ్వాలలు ప్రజల ప్రతీకారదీక్షగా అదేపనిగా వెంటాడుతూ శిఖరాన్ని సహితము అంటుకొన్నాయి. మరోవైపు గెరిల్లాలు కాల్పులను తప్పుకుంటూ గోడనంటి పెట్టుకొని బుసలుకొడుతున్న త్రాచువలె పైకి ఎగబ్రాకుతూ శిఖరాన్ని అందుకొంటున్నారు. భవనం లోపలి భాగం నుండి కొందరు తమ రైఫిళ్ళను భవనం మీద నుండి క్రింద పడవేసి "నాయకులారా శరణు" అంటూ ముగింపు వేడికోలు ప్రారంభించారు. కానీ అప్పటికి అందుబాటులోకి వచ్చిన జనం ఈ వేడికోలును మన్నించుటకు సిద్ధంగాలేరు. ఈ దుండగుల అత్యాచారాలకు అఘాయిత్యాలకు నిత్యం గురైన జనం పగ సాధించే పట్టుదలతో ఆ మంటల్లో నుండే త్రోసుకువచ్చి ఆవేశంతో చిందులు త్రొక్కుతున్నారు. అప్పటికే శత్రువులపై ఆఖరి దెబ్బ తీయుటకై గెరిల్లాల దళంలో తారాడుతున్న మేము ఈ జన ప్రవాహాన్ని నిలుపు జేశాము. ముగింపు దశలో నున్న శత్రువు దేనికైనా తెగించవచ్చు. కనుక దీనిపై మరో అంతస్తుగా వున్న పిట్టగోడ చాటుగా రక్షణ తీసుకొని వున్న శత్రువును కనిపెట్టుకొని కొందరు గోడ కానుకొని సిద్ధంగా వుండగా మాలో నుండి ఒకరు హఠాత్తుగా పిట్టగోడ ఎక్కిదుమికి 'లొంగిపోండి' అనే కేకతో రెండు రౌండ్లు ప్రేల్చాడు. మొదటి దెబ్బకే ఇద్దరు కూలి పోగా తక్కినవాళ్ళు శరణు అంటూ మా మధ్యలో పిట్టగోడ మీద నుండి దూకారు. ప్రతీకార ఆవేశంతో బుసలు కొడుతున్న జనం దొరికినవాణ్ణి దొరికినట్లే చితకబాదుతున్నారు. వాళ్ళ కమాండర్ మాత్రం తప్పించుకొని శరణుశరణు అంటూ నన్ను సమీపిస్తున్నాడు. అలా సమీపిస్తూనే అమాంతంగా నా చేతిలో వున్న 'స్టెన్‌గన్ మడిమ పట్టుకొని ఆ గొట్టం నాపై త్రిప్పబూను కొన్నాడు.

ఆకస్మికంగా ఈ దొంగ దెబ్బకు కొంచెం

ఆలస్యంగా తేరుకొన్న నేను ఆ గొట్టాన్ని వానిపైకి త్రిప్ప చూచినాను. ఆజానుబాహుడుగా వున్న ఆ కమాండర్ అందుకు అలవికానివ్వడంలేదు. ఈ పెనుగులాటలో ఇద్దరం క్రిందపడి ఒకరిపై ఒకరు దొర్లుతున్నాము. ఇరువురి మధ్యలో తుపాకి మెసలుతున్నది. దొరికిన కిరాతకులను తమ కసికొద్ది బాదుతున్న జనంలో నుండి కొందరు మా పెనుగులాటను ఆలస్యంగా గమనించారు. ఆ క్షణమే ఆ రజాకారు కమాండరును దెబ్బ తీయుటకు అలవిగాక పెనుగులాటలో వున్న మమ్ములను ఆవేదన, ఆవేశంతో పాగలు గ్రక్కుతూ చూస్తున్నారు. చివరకు పదిచేతులు ఆ దుండగుడును అందుకొని దెబ్బతీయబోగా, ఆ రక్కసుడు అమాంతంగా పిట్టగోడ మీదికెగిరి, భవనం ప్రక్కనే వున్న ఇంటిపై దుమికాడు. ఈ దొంగదెబ్బతో శివమెత్తి వున్న నేను ఆ వెంటనే రేచువలె వేటాడి అదే పిట్టగోడ మీది నుండి దెబ్బ వెంట దెబ్బ కాల్చడం జరిగింది. తక్షణమే పడి పోయాడు ప్రమాదకారుడైన ఆ కిరాతకుడు.

అయిపోయింది నిజానికి ఒక యుద్ధమే ముగిసింది. 8 గంటలుగా ఎడతెగకుండా నిప్పుల మంటలు చెరుగుతూ మహా అద్భుతంగా సాగిన గెరిల్లాయుద్ధం ముగిసింది. అప్పటికి రాత్రి సమయం కావచ్చింది. భవన శిఖరాగ్రంలో వున్న మేము శత్రుకోటనే గెలుచుకున్నంతటి విజయ ధ్వనితో 'విజిల్' ఊదుతూ విజయభేరి మ్రోగించుతుండగా "కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్! నైజాం ప్రభుత్వం నశించాలి", "ఆంధ్రమహాసభ జిందాబాద్" అన్న నినాదాలతో భూనభువనాంతరాలు దద్దరిల్లగా డప్పులు, కొమ్ములు విజయ దుందుభితో మారు మ్రోగగా అప్పటి వరకూ తమ తమ స్థానాలలో నిలిచి పోరాడిన గెరిల్లా వీరులు శత్రువు నుండి స్వాధీనం చేసుకున్న నూతన ఆయుధాలను ధరించి విజయగీతికతో కదం త్రొక్కుతూ పదంపాడుతూ ముందుకు నడిచారు. ఆ వెంటనే జనప్రవాహం ముందుకు సాగింది. ఈ మహా ప్రవాహం అప్పటికే చుట్టు ప్రక్కల గ్రామాల నుండి కెరటాలుగా ముందుకు వస్తున్న మానవ మహా సముద్రంలో కలసిపోయింది. తమ విజయ వీరులైన గెరిల్లాలను ఒక బోరుగడ్డపై నిలబెట్టి చుట్టూ పాటలుపాడుతూ, నాట్యమాడుతూ గంతులు వేశారు. విజయ చిహ్నంగా గెరిల్లాలు తమ నూతనాయుధాలను ప్రేల్చుతూ యుద్ధ నాట్యం చేశారు.

చివరకు ఈ వీరోచిత ఘట్టం ఒక నిరుపేద స్త్రీచే మంగళ హారతులతో గెరిల్లాకు అందించిన నీరాజనాలతో శుభంగా ముగిసింది. ఈ మహాజనం మధ్య నుండి ముందుకు త్రోసుకువచ్చిన మధ్య వయస్కురాలైన ఈ తల్లి చేతుల్లోని హారతి దీపాల వెలుగులో కళ కళ లాడుతున్న ఆమె కళ్ళలో నుంచి ఆనంద భాష్పాలు ఒక్కొక్కటిగా రాలివడుతున్నాయి. తీరా విషయం విచారించగా చారిత్రాత్మకమైన ఈ ఘట్టానికి ఈమెయే మూలకందమని వెల్లడయింది.

ప్రక్కనే రాగిపాడు గ్రామస్తురాలైన ఈ తల్లిని ఆరోజు మధ్యాహ్న సమయంలో రజాకార్ రక్కసులు బలాత్కరించే యత్నంలో వుండగా గెరిల్లాల మొదటి బర్మార్ దెబ్బ ప్రేలింది. వెంటనే నలువైపులా మ్రోగిన తుపాకి దెబ్బల మ్రోతలకు కంగారు పడినా మృగాలు ఈ తల్లిని వదిలి పరుగెత్తి ప్రక్క గ్రామమైన కోటపాడులో రక్షణ తీసుకొని ఎదురు దాడి ప్రారంభించారు. కానీ ఆ భవనమే ఆ రక్కసులను పూడ్చిపెట్టిన సమాధిగా మారింది. ★

ఎర్రెర్రని తెలంగాణ

- చెరబండరాజు

ఇదేనండి ఇదేనండి ఎర్రెర్రని తెలంగాణ
కమ్యూనిస్టు గుండెకాయ కష్టజీవి కలల కోన
॥ ఇదే ॥

ఆనాడు నైజామును మెడలుపట్టి విరిచినట్టి
కాంగిరేసు సర్కారును గడగడలాడించినట్టి
పీడితులను నిద్రలేపి యుద్ధానికి నడిపినట్టి
॥ ఇదే ॥

లక్షలాది ఎకరాలను హస్తగతం చేసుకొని
మూడువేల గ్రామాల్లో ఎర్రజెండా ఎగురవేసి
రైతుకూలీ పేదజనం చీమలవలె కదిలొచ్చిన
॥ ఇదే ॥



పీడితుల్లోకెల్లా అధమాధమం గిరిజనులు

- కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి



దేశంలోని అనేక ప్రాంతాలలో భూస్వామ్య దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా వ్యవసాయరంగంలో పెరుగుతున్న అశాంతి, సాయుధ ప్రతిఘటనలకు సైతం దారితీస్తున్న చెదురుమదురు సంఘర్షణలలో బహిర్గతమౌతున్నది. వీటిలో అగ్రభాగాన ఉన్నవాళ్ళు ఆదివాసులు.

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 1972లో హైదరాబాద్ కుట్రకేసు విచారణ సందర్భంగా ప్రత్యేక సెషన్స్ కోర్టులో చేసిన సుదీర్ఘ ప్రకటనలోని ఒక చిన్న భాగమీ అంశం. దేశ వ్యాపితంగా గిరిజన సమస్య యొక్క తీవ్రతను, వారిపై ప్రభుత్వ యంత్రాంగం, భూస్వామ్య శక్తులు సాగిస్తున్న దోపిడీని వివరించేదిగాను, రాజ్యాంగం ఇచ్చిన కొన్ని సౌకర్యాలు గూడ ఎలా కాలరాయబడుతున్నాయో వివరించారు. చట్టాలు - సంస్కరణల బూటకత్వాన్ని మేధావులు, ప్రజాతంత్రవాదులు వెల్లడించిన మాటల్లోనే ఎండగట్టే పద్ధతిని తన రచనలో అనుసరించారు. ఆనాడు హరిజనులపై సవర్ణ హిందువుల దాడి అనే పదం జర్నలిస్టులు, రాజకీయ వ్యాఖ్యాతలు ఉపయోగించేవారు. నేడది దళితులపై అగ్రకులస్తుల దాడిగా మారింది. నాగిరెడ్డి గారు ఆనాడు వాడుకలో ఉన్న పదాలనే ఉపయోగించారు. దీనిని గమనంలో ఉంచుకోవాలి. - *సంపాదకుడు*

భారతదేశంలో 30 కోట్లమంది ఆదివాసులున్నారు. వీరిలో 95 శాతం గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్నారు. వ్యవసాయ కూలీలుగా, హీనస్థాయి కౌలుదార్లుగా, చిన్నరైతులుగా జీవనం వెళ్ళబుచ్చుతున్నారు.

సాగ్రి, జోతి, హాలి, వెట్టి మొదలైన రకరకాల పేర్లతో చలామణి అవుతున్న ప్రాచీన బానిసత్వ అవశేషాలు ఈనాటికీ దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి; ప్రత్యేకించి ఆదివాసుల ప్రాంతాల్లో ప్రబలంగా ఉన్నాయి.

అత్యంత హీనంగా దోపిడీ చేయబడుతున్న వర్గం వ్యవసాయ కూలీలైతే, వారిలో గిరిజన కూలీల పరిస్థితి మరింత అధమంగా ఉంది.

1960-61 సంవత్సరానికి షెడ్యూల్డు కులాలు, జాతులకు సంబంధించిన కమీషనరు నివేదిక ప్రకారం ఆదివాసులలో భూమిలేనివారి శాతం 1950 లో 50% ఉండగా అది 1956-57 నాటికి 57%కి పెరిగింది.

ఆ తర్వాత దశాబ్దంలో కూడా ఇదే ధోరణి కొన సాగుతోందని అనుభవం రుజువు చేస్తున్నది. ధేబర్ కమీషన్ నివేదిక ప్రకారమే ఋణభారం, భూముల అన్యాక్రాంతం, బలవంతపు వెట్టిచాకిరీ, నిరక్షరాస్యత లాంటి అంశాలలో గిరిజనుల పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయని తేలింది. ఉదాహరణకు గిరిజన జనాభాయే అధిక సంఖ్యాకంగా ఉన్న త్రిపుర రాష్ట్రంలో పాలకపార్టీ లోపాయకారి సహకారంతో గిరిజనేతరులు గిరిజనుల భూములను ఆక్రమించడం వల్ల గిరిజనులే అల్పసంఖ్యాకులుగా మారిపోయారు.

పశ్చిమబెంగాల్ ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ ప్రచురిస్తున్న బులిటిన్ (సంపుటి - II సంచిక -2) "మాల్డా, పశ్చిమ దినాజ్‌పూర్, డార్జిలింగ్, బీర్భూం, 24 పరగణాలు, బంకూరా, పురూలియా, హుగ్లీ, బర్ద్వాన్, మిడ్నపూర్ జిల్లాలో 1956-1960 మధ్య కాలంలో పెద్దఎత్తున భూములు అన్యాక్రాంతం (బదిలీలు) అయ్యాయనీ ", ఈ అన్యాక్రాంతం ప్రధానంగా గిరిజనుల నుండి గిరజ నేతరులకు జరిగిందని " పేర్కొన్నది.

రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు ఆదివాసుల భూములకు రక్షణ ఇస్తున్నప్పటికీ ఈ బదిలీలు సంభవించాయనే వాస్తవాన్ని మనం గుర్తుంచుకోవాలి.

ఈ గిరిజనులలో అత్యధిక శాతం ఆంధ్రప్రదేశ్ లోని ముఠాదారీ విధానం లాంటి భూస్వామ్య దోపిడీకి, బానిసత్వానికి తీవ్రంగా గురవుతున్నారు. షెడ్యూల్డు కులాల, జాతుల కమీషనర్ తన 16వ నివేదికలో (1966 - 67సంవత్సరానికి) విశాఖ పట్నం జిల్లాలోని చింతపల్లి తాలూకాలో జరుప బడిన సర్వే గురించి ప్రస్తావించాడు. ఈ తాలూకా మొత్తం (రాజ్యాంగంలోని 5 వ షెడ్యూలు నిర్వచనం ప్రకారం) షెడ్యూల్డు ప్రాంతం (గిరిజన ప్రాంతం)లోకి వస్తుంది. "స్వతంత్రం" వచ్చిన ఇంతకాలం తర్వాత కూడా, భూసంస్కరణల విధానాలని చెప్పబడుతున్నవి చట్టాలైన తర్వాత కూడా ఈ ప్రాంతంలో పాత ముఠాదారీ పద్ధతి కొనసాగుతూనే ఉంది. అంటే ముఠాదారు శిస్తు లేకుండా ఎస్టేట్లు కలిగి ఉంటాడు. అయితే తాను మాత్రం చాల హెచ్చు మొత్తంలో శిస్తులు వసూలు చేస్తాడు.

షెడ్యూల్డు కులాలు, జాతుల కమీషనర్ తన రిపోర్టులో ఇలా తెలియజేశాడు. " కొన్ని ముఠాలలో ముఠాదారు వ్యవసాయంలో రైతులుపయోగించే ఒక్కొక్క నాగలి, ఒక్కొక్క పార ప్రాతిపదికపై కౌలురేట్లు లెక్కగడతాడు. మరికొన్ని ముఠాలలో నాటిన విత్తనాల మొత్తాన్ని బట్టి కౌళ్ళు నిర్ణయించ బడుతున్నాయి. కొన్ని సందర్భాలలో ముఠాదారు కౌళ్ళను పెంచుకొంటూ వస్తున్నాడు." "చట్ట విరుద్ధమైన వెట్టిచాకిరీ (ముఠా దారు స్వంత పనులకు ప్రతిఫలంలేని చాకిరీ), మామూళ్ళు (ఇది చట్ట విరుద్ధమైన సలామి వసూలు వంటిది) ఇంకా పూర్తిగా అదృశ్యంకాలేదు.

చట్టాన్ని మోసం చేయడం ద్వారా భూములు అన్యాక్రాంతం చేయబడిన ఆశ్చర్యకరమైన ఉదంతాలను కొన్నింటిని ఆ సర్వే బయట పెట్టింది. "గిరిజనేతరులకు భూములను బదిలీ చేయడంలో ఏజన్సీ ఏరియాలో ముఠాదారు భాగస్వామిగా ఉండటం తరచుగా ఉండదు. అయితే గ్రామ మునసబుల (వీరి ద్వారానే ముఠా

దారు కొళ్ళు వసూలు చేస్తాడు). సహకారంతో భూమిని చేతులు మార్చినట్లు కనిపిస్తున్నది."

గిరిజనులను పీల్చిపిప్పి చేసేది ఒక్క భూస్వాములే కాదు. ప్రభుత్వం కూడా వివిధ కారణాలతో గిరిజనులను వారి భూముల నుండి వెళ్ళగొడుతున్నది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం లిఖింపూర్ తదితర ఫారెస్టు ప్రాంతాలలో (తెరై) కాలనైజేషన్ పథకం ద్వారా భూస్వాములు, ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలు కొండల ప్రాంతాల 'అభివృద్ధి పేరిట ప్రభుత్వ ఆర్థిక సహాయంతో వేలాది ఎకరాల భూములను ఎలా ఆక్రమించు కున్నారో మనం ఇంతకుముందే గమనించాము. రాత్రింబవళ్లు నిరంతరం భూసంస్కరణల గురించి ప్రచారం చేస్తూ ఆచరణలో ప్రజావ్యతిరేక విధానాలను ఎడతెరపి లేకుండా అనుసరిస్తున్న ప్రభుత్వం చేతుల్లో ఆదివాసుల తదితర వ్యవసాయ కార్మికుల దుస్థితి ఎలా ఉన్నదో ఈ క్రింది ఉదంతం వెల్లడి చేస్తుంది. ఈ సంఘటన బ్లిట్జ్ 4-4-70 వ తేదీ సంచికలో ప్రచురించబడింది.

భూముల నుండి ఆదివాసుల బేదఖల్

"ఫారెస్టు భూములనబడే వాటిని సాగు చేస్తున్న 43000 మంది ఆదివాసుల్ని బేదఖల్ చేయాలని ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం తీసు కున్న నిర్ణయం గతవారంలో రాష్ట్ర శాసనసభలో వివాదాన్ని రేకెత్తించిందనీ" శ్రీవినాయక్ భావే వ్రాశాడు. "నాసిక్ జిల్లాలోని ఫేత్ తాలూకాలో ఫారెస్టు భూములను 'ఆక్రమించి' వాటిని సాగు చేస్తున్నందుకు గాను భూమిలేని ఆదివాసుల నుండి రూ.35 లక్షల జరిమానాగా అటవీశాఖ ఇంతవరకు వసూలు చేసింది."

" మొత్తం ఆ తాలూకాలో ఆదివాసుల అభివృద్ధికి, పునరుద్ధరణకు ప్రభుత్వం పెట్టిన ఖర్చుకంటే ఇది ఎక్కువే " అని ఆయన వ్రాశాడు. మహారాష్ట్రలో గ్రామీణ ప్రాంతాలలో భూమిలేని ప్రజల సమస్యల తీవ్రతను దాని పెరుగుదలను ఈ సంఘటనలు మరోసారి వెలుగులోనికి తెస్తున్నాయి. మహారాష్ట్రలోని మొత్తం జనాభాలో వ్యవసాయ కూలీలు 24% గాను గ్రామీణ జనాభాలో 34% గానూ ఉన్నారు, విదర్భ ప్రాంతంలోని 8 జిల్లాలోను వ్యవసాయ దారులలో భూమిలేని వ్యవసాయకూలీలు 47% వున్నారు. మరట్వాడా ప్రాంతంలోని వ్యవసాయదారులలో 39% మంది భూమి లేని వ్యవసాయ కూలీలు ఉన్నారు.

ప్రఖ్యాత ఆర్థికవేత్త, భారత ప్రభుత్వ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు అయిన డి.ఆర్.గాడ్గిల్ అంచనా ప్రకారం మొత్తం మహారాష్ట్ర జనాభాకు తలసరి ఆదాయం రూ. 392 ఉండగా వ్యవసాయకూలీ సాలీనా సరాసరి ఆదాయం అందులో 28% మాత్రమే ఉంది. అంటే మహారాష్ట్రలోని వ్యవసాయకూలీ రోజుకి 30 పైసల ఆదాయం మీద జీవనం వెళ్ళబుచ్చుతున్నాడన్నమాట.

వ్యవసాయ కూలీలలో అధికభాగం అంటరాని వారు, వెనుకబడిన జాతులవారే అవడం వల్ల వీరు ఆర్థిక దోపిడీకే గాక అగ్రకులాలకు చెందిన భూస్వాముల సాంఘిక పీడనకు కూడా గురవుతున్నారు.

"ఆర్థికంగా, సామాజికంగా తమ హక్కుల కోసం ఏమైనా ప్రయత్నించారంటే వీరు సాంఘిక బహిష్కరణను, నిందలను, బెదిరింపులను, దాడులను, పోలీసు నిర్బంధకాండను ఎదుర్కొనడానికి సిద్ధంగావలసి ఉంటుంది. "

ఈ వ్యవసాయకూలీలు గాక రైతులలో 29% మంది చాలా పేదవారు. వీరు తమ చిన్న స్వంత భూముల నుండి వచ్చే ఆదాయం చాలక వేతన కూలీలుగా ఇతరులకు పని చేయవలసి వస్తోంది.

"ఇది చాలదన్నట్టు ప్రభుత్వ విధానాలు పెద్ద సంఖ్యలో పేద రైతులను, కౌలుదార్లను భూముల నుండి వెళ్ళగొట్టడానికి దారితీయడంతో భూమి లేని శ్రేణులు విపరీతంగా పెరిగిపోతున్నవి."

వీటన్నింటి ఫలితంగా మహారాష్ట్రలోని భూమి లేని గ్రామీణ వ్యవసాయ కూలీల సంఖ్య చాలా ఆందోళన స్థాయిలో పెరుగుతుంది." 1951 నుండి మహారాష్ట్రలోని మొత్తం జనాభా 23.6% పెరగ్గా అదే కాలంలో వ్యవసాయ కూలీల సంఖ్య మాత్రం 93% వరకూ పెరిగింది. "

" వీరిలో ఇప్పటికే పెరుగుతున్న అసంతృప్తి బ్రద్దలయ్యే స్థితికి దారితీయవచ్చు" నని వ్రాస్తూ శ్రీ భావే ఈ ఉదంతాన్ని ముగించాడు.

ఆదివాసులలో అశాంతి

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రిక తన 31.7.68 తేదీ సంచికలో ఒక సంపాదకీయంలో "గ్రామీణ ప్రాంతాల్లో అనేక చోట్ల మూకుమ్మడి హింసా ప్రజ్వలనకు సంబంధించిన ఉదంతా"లను ప్రస్తావించి గిరిజనుల సమస్యలను సత్వరం పరిష్కరించకపోతే పరిస్థితి బ్రద్దలయ్యే స్థితికి చేరవచ్చు" నని ప్రభుత్వానికి హెచ్చరిక చేసింది.

ఆ సంపాదకీయం ఇలా పేర్కొంది. "గిరిజనుల ప్రధాన సమస్య భూమికి సంబందించినది. లోక్‌సభలో శ్రీ యన్. యమ్. జోషి చెప్పినట్లు చట్టాన్ని అతిక్రమించి ఆదివాసులను వారి భూముల నుంచి వెళ్ల గొడుతున్నారు. అమాయకు లైన ఆదివాసులు తాము తీసుకున్న కొద్దిపాటి అప్పులు తీర్చలేని పరిస్థితులలో పెద్దఎత్తున వారి భూములను స్వాధీనం చేసుకొనడానికి అలవాటు పడిన వడ్డీ వ్యాపారుల నుండే ఈ సమస్యలో అధిక భాగం తలెత్తుతున్నాయి.

ఇటీవలనే శ్రీకాకుళం గిరిజనులు తిరుగుబాటు చేసిన అనంతరమే ముఠాదారీ విధానాన్ని రద్దుచేస్తూ చట్టాలు చేయబడినాయి. అయితే దీనర్థం ఆ చట్టాలు అమలు చేయబడుతున్నాయని కాదు.

గిరిజనులు ఇప్పటికే ఉవ్వెత్తున లేచారు. వారిప్పటికే ముందుకు పురోగమిస్తున్నారు. ఫ్యూడల్ భూమి సంబంధాలను సంపూర్ణంగా రద్దు చేయడమే ఆదివాసుల అత్యంత తక్షణమైన డిమాండ్‌గా ఉంది. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసు కొనేలాగ, ఉద్యమ ఐక్యశక్తితో ఆ డిమాండ్‌ను అమలు చేసుకొనేలా వారిని ఆర్గనైజు చేయడం ద్వారా మాత్రమే వారి డిమాండును సాధించగలుగుతాం.

గిరిజనుల సంక్షేమానికి తాను కోట్లాది రూపాయాలు వెచ్చిస్తున్నట్లు ప్రభుత్వం బూటకంగా ప్రకటించుకొంటోంది. గిరిజనులకు ప్రత్యేక పంచాయితీ సమితులు, ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన సంక్షేమంలో తమకు ప్రత్యేకమైన ఆసక్తి కలదని పాలక వర్గం ప్రచారం చేసుకొంటున్నది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులవారిలో పాలకవర్గాలకు అనుకూలంగా ఉండే 'శ్రామిక సంపన్న వర్గా'న్నొకదాన్ని సృష్టించడానికి ఈ కులాలు, జాతులువారికి కొన్ని ప్రత్యేక సౌకర్యాలు పాలకులు కల్పిస్తున్నారు. ఈ శ్రామిక సంపన్న వర్గం పాలక వర్గాల పథకాల వల్ల కొన్ని ప్రయోజనాలు పొంది దోపిడీకి గురయ్యే వర్గాల కంటే పై స్థాయికి అభివృద్ధి చెందుతున్నారు. వెనుకబడిన కులాలపై వీరి పట్టు ద్వారా పాలక వర్గాలు తమ దోపిడీని మరింత సంపూర్ణంగా కొన సాగిస్తున్నారు. ఈ వర్గానికి చెందిన ఈనాటి కార్మిక నాయకులు ఈ పద్ధతుల ద్వారా వ్యవసాయ కూలీలను మోసగించడం ఒక కళలాగా అభ్యసించారు. ఇక్కడొకటీ , అక్కడొకటీ ఉద్యోగాలు

కల్పించి, కొన్ని పంచాయితీ ప్రెసిడెంటు పదవులూ, శాసనసభ్యత్వాలు పడేసి, పీడిత వర్గాల్లో కులం రీత్యా, రాజకీయంగా అవినీతి వాతావరణం కల్పిస్తున్నారు. వీటిద్వారా పీడిత వర్గాల శ్రేణుల్లో చీలికతేవడానికే, నానాటికీ పెరుగుతున్న ఈ 'శ్రామిక సంపన్న వర్గాన్ని' కొన్ని ప్రయోజనాల కోసం ఉపయోగించు కొంటున్నారు. ఇది "క్రింది కులాల్లోనే హోదాల తారతమ్యం" సృష్టించడానికి సంపన్నులైన శక్తివంతులైన ఉన్నత కులాల వారి ప్రయోజనాలకు సేవ చేసే మధ్య దళారీ పాత్రను కొందరు నిర్వహించ డానికి తోడ్పడుతుంది.

"ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ" లో (8-1-1972) ఒక రచయిత వ్రాసినట్లుగా :

"షెడ్యూల్డు కులాలవారికి ప్రత్యేక నియోజక వర్గాలు కేటాయించడం ప్రతి ఎన్నికల సందర్భం లోనూ కొద్ది మంది షెడ్యూల్డు కులాల అభ్యర్థులు ప్రజల దృష్టిలోకి రావడానికి ఉపయోగపడుతున్నది. హరిజనుల ప్రయోజనార్థం అమలు జరిపే ఇతర చర్యలతో బాటు ఇవి కూడా క్రింది కులాల లోపలే హెూదాభేదాలను సృష్టించడానికి వినియోగ పడుతోంది. అదే సమయంలో ఇతర వనరులు సైతం ఇదే ధోరణిలో పనిచేస్తాయి. రాజకీయ ప్రాముఖ్యత కలిగిన వ్యక్తిని జిల్లా సంక్షేమ కమిటీకి నియమించి హరిజనులకు భూమి తదితర వనరులు కేటాయించే బాధ్యత అప్పచెప్పవచ్చు. ఆ కమిటీ సభ్యులు తమ సన్నిహిత బంధువుల గురించి మంచి శ్రద్ధ తీసుకొంటారు. అతడి పిల్లలకు పాఠశాల, కాలేజి చదువులకుపోయి ఉపకారవేతనాలు పొందటానికి అవకాశాలు పెరుగుతాయి, చదువులు అయిన తరువాత ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యతను వినియోగించుకోవచ్చు." కాబట్టి ఈ విధంగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతుల వారికి ఇవ్వబడే ప్రత్యేక ప్రాధాన్యత కొద్దిమందికి "అధికారాన్ని, సంపదలను సృష్టిస్తుంది." అయితే షెడ్యూల్డు కులాలు జాతులలో "అత్యధిక మెజారిటీ, ఇతర పేద ప్రజానీకం తమ అవసరాల పట్ల ఈ రాజకీయ వ్యవస్థ శ్రద్ధ చూపదని గుర్తిస్తారు. (ఈ కొద్దిమందిలో) ఎవ్వరూ ప్రస్తుత అసమానతలకు హేతువుగా ఉండి వాటిని సృష్టించి పెంచిపోషిస్తున్న ఆర్థిక, సామాజిక సంస్థల యంత్రాంగాల పనితీరును గురించి ఎపుడూ పట్టించుకోరు. అంతేగాక ఈ క్రమంలో ఉన్నత వర్గాల వారితో తమకు ఏర్పడిన సన్నిహిత సంబంధాల కారణంగా ప్రస్తుత దోపిడీ వ్యవస్థను సంపూర్ణంగా మార్చి సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని సమర్థవంతంగా నెలకొల్పగల వ్యవస్థను నిర్మించే కర్తవ్యాలను గురించి వారెంత మాత్రము శ్రద్ధ వహించరు."

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులకు సంబంధించినంత వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాలు, స్థాపించిన ప్రత్యేక లక్ష్యం సరిగా ఇదే. ఈకార్యక్రమాల నుంచి విస్తృతమైన అర్థంలో ఏ కొద్ది మేలునైనా ఆశించడం భ్రమ మాత్రమే.

"సంక్షేమ" సంఘాలు అనేవి మనదేశ ప్రత్యేకత. దైవ భీతి, ఆర్జనా దృక్పథం కలిగిన సమాజం గల మనదేశంలో హరిజన సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహిళల సంక్షేమం మొదలుకొని పశువుల సంక్షేమం వరకు అసంఖ్యాక సంక్షేమ సంఘాలు ఉన్నాయి. దయాదృష్టి అనేది 'మోక్షానికి' చాలా పవిత్రమైన మార్గం. పేదలు, భిక్షగాళ్లు ఉంటేనే తప్ప ఎవరైనా దయాదృష్టిని ప్రదర్శించలేరు కదా! అందువల్ల ఆ పేదరికం నుండి నశించిపోకుండా చూడటం మనధర్మం. ఈ ధర్మాన్ని సంక్షేమ పథకాల ద్వారా మన సమాజం తన శక్తి మేరకు నిర్వర్తించడానికి కృషి చేస్తున్నది. అలాంటి పథకాల్లో ఒకటి గిరిజన సంక్షేమ పథకం. ఈ పథకం పనితీరును "బ్లిట్జ్" పత్రిక తన 31 -7-71 తేదీ సంచికలో వర్ణించింది. "ఇది భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు భారీ అట్టహాసంతో ప్రదర్శించిన ఆసక్తి కరమైన నమూనా సంక్షేమ పథకం. ఇది గిరిజన సంక్షేమం పేరిట సాగుతున్న వికారం కలిగించే ఒక అవినీతి గాథ. మనదేశంలో ఇలాంటి నేరాలకు వ్యతిరేకంగా మాత్రం ఏ కుట్ర కేసూ పెట్టలేదు."

మధ్యప్రదేశ్ గిరిజన సహకార అభివృద్ధి కార్పొరేషన్ 1960 మార్చిలో స్థాపించబడింది. "రాష్ట్రంలో ఉన్న 70 లక్షల మంది (జనాభాలో 22%) గిరిజనులను దోపిడీ నుండి రక్షించే తక్షణ సామాజిక లక్ష్యాన్ని సాధించడమే" దీని ఉద్దేశ్యం. ఈ కార్పొరేషను మూడు కోట్ల రూపాయలు దుబారా చేసిన అనంతరం ఇది సంకటంలో పడిందని "బ్లిట్జ్" వారపత్రిక 31-7-71 నవ్రాసింది.

1) గిరిజనులకు నిత్యావసర సరుకులు చౌక ధరలకు సక్రమంగా సరఫరా చేయడం 2) గిరిజనులు ప్రోగుచేసిన అటవీ సంపదకు న్యాయమైన ధర లభించేటట్లు చూడటం ఈ కార్పొరేషన్ విధులు.

" గిరిజనులకు నిత్యావసర సరుకులను చౌక ధరలకు అందించే పేరిట, గిరిజనులు నిజంగా ప్రతినిత్యం వాడే వస్తువులు తప్ప మిగతా అన్ని వస్తువులనీ కార్పొరేషన్ కొనుగోలు చేస్తున్నది. "

ఉదాహరణకు ఒక లక్ష రూపాయల విలువ కలిగిన రాళీలను, ఆరు లక్షల రూపాయల విలువ కలిగిన 60 వేల టెర్లిన్‌సూటు గుడ్డలు, 3.45 లక్షల రూపాయల విలువ చేసే టెర్లిన్ చొక్కా గుడ్డను కార్పొరేషన్ కొనుగోలు చేసింది. మరొక 50 లక్షల రూపాయలు ఖరీదు చేసే లిప్‌స్టిక్‌లు (పెదవుల రంగు), ఫేస్ పౌడరు, పర్సులు, చాక్లెట్లు, ఖరీదైన పింగాణీ సామానులు, అత్యంత నాణ్యమైన తేయాకు, కాఫీ లాంటి వాటి కొనుగోలుకు దుబారా చేసింది.

ఈ కార్పొరేషన్ పని విధానాన్ని విచారించ డానికి నియమించబడిన ' బ్లిట్జ్ ' విలేఖరి శ్రీ నరోనా ఈ కార్పొరేషన్ పొందిన నష్టము రూ.89 లక్షల మేరకు ఉంటుందని లెక్కగట్టాడు.

బ్రహ్మాండమైన ఈ విజయాన్ని సాధించడానికి ఈ కార్పొరేషన్ తన సంస్థ సిబ్బంది నిర్వహణ పై విచ్చిలవిడిగా ఖర్చు పెట్టింది. ఆ ఖర్చు సంవత్సరాల వారీగా ఇలా ఉంది :

సం.		రూ
1965 - 66	-	14,15,630
1966 - 67	-	23,90,232
1967 - 68	-	29,91,268
1968 - 69	-	27,92,566
1969 - 70	-	21,63,660

ఈ పరిస్థితులు ప్రఖ్యాత రచయిత థామస్‌పైన్ "మానవ హక్కులు" అనే తన గ్రంథంలో ఇంగ్లాండ్ ప్రభుత్వాన్ని గురించి వర్ణించిన వాక్యాలను నాకు గుర్తుకు తెస్తున్నాయి. ఈ పుస్తకాన్ని రచించి ప్రచురించినందుకు 1792 లో ఆయనపై రాజద్రోహ నేరారోపణ చేసి సమాజ బహిష్కరణ శిక్ష విధించారు.

థామస్ పెయిన్ ఇలా వ్రాశాడు : "ప్రభుత్వాలు ప్రారంభమైనది మొదలు దగాలోనూ, లంచగొండి తనంలోనూ అధికతరమైన పరిపక్వత కాకపోయినా అధిక పరిపక్వత సాధించింది 'ఇంగ్లాండ్ ప్రభుత్వమే.' నిరంతరం దీనిని చూస్తున్న అలవాటు వల్లనే వివేకం నశించకపోతే ఇది నీకు అపరిచితం కాదు. "

ఇలాంటి భౌతిక పరిస్థితులు ఉద్రిక్తతలు బ్రద్దలయ్యే పరిస్థితికి దారితీయవా? అలా దారితీస్తే దానికి బాధ్యులెవరు ?

ఈ నేపథ్యంలోనే నానాటికీ పెరుగుతూ తిరుగుబాటుగా ప్రజ్వరిల్లుతూన్న అసంతృప్తిని మనం అర్థం చేసుకోవాలి. పోలీసుల కుమ్మక్కుతో, మద్దతుతో భూస్వాములు సాగిస్తున్న దౌర్జన్య పూరితమైన హింసాయుత కార్యకలాపాల వల్ల, నిరంతరం వారు సాగించే రెచ్చగొట్టే చర్యల వల్ల ఈ ప్రజ్వలన సాగుతోంది. ఈ అశాంతి ప్రజ్వలనలో - అది నక్సల్బరీ లేక శ్రీకాకుళం, గోపీ వల్లభపూర్ లేక తూర్పుగోదావరి, ముషాహరి లేక ఖమ్మం లేక వరంగల్ - అన్ని చోట్ల ఒకే విధమైన క్రమాన్ని మనం గమనించవచ్చును. ఈ అన్ని చోట్ల స్థానిక ప్రజలను వారిభూముల నుండి తొలగించడం, చట్ట విరుద్ధమైన మామూళ్ళు వసూలు చేయడం, బలవంతపు వెట్టిచాకిరీ, ఊహాతీతమైన తక్కువ వేతనాలు, విపరీతమైన వడ్డీ రేట్లు - ఇవన్నీ ఈ ప్రాంతాల ప్రజలను పీల్చి పిప్పి చేశాయి. ఈ అన్ని ప్రాంతాలలోను మెరుగైన వేతనాల కోసం, భూమికోసం, వెట్టి చాకిరీ, తక్కువ వేతనాలు, పిచ్చి కొలతలు, మామూళ్ళు లాంటి ప్యూడల్ దోపిడీ రూపాలను రద్దు చేసుకోవడానికి, గిరిజనులను సంఘటితపరచడం తమ న్యాయమైన బాధ్యతగా కమ్యూనిస్టులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో వారు మొదట భూస్వాముల హింసనే ఎదుర్కోవలసి ఉంది. ఈ అన్ని ప్రాంతాలలోను పోలీసులు, ప్రభుత్వము, భూస్వాముల పక్షమే వహిస్తున్నది. అన్ని చోట్లా కథ ఇంతే.

శ్రీకాకుళ గిరిజన రైతాంగ తిరుగుబాటును క్లుప్తంగా సమీక్షించినట్లయితే ప్రజల పక్షాన నిల్చి పోరాడుతున్న విప్లవకారులో లేక ప్రజలను దోపిడీ దౌర్జన్యాలకు గురిచేస్తున్న భ్రష్టుపట్టిన భూస్వాములూ, ప్రభుత్వంలోని వారి ప్రతినిధులో వీరిలో వాస్తవంగా కుట్రదారులెవ్వరో నిజాన్ని బట్టబయలు చేస్తుంది. సాధారణంగా కమ్యూనిస్టు వ్యతిరేకతతో ఉండే మన దినపత్రికల లోని భాగాల రూపంలో ఉన్న ఈ క్రింది క్లుప్తమైన నోట్ - భూస్వామ్య - ప్రభుత్వ విప్లవ ప్రతీఘాత హింసాకాండను తమ సొంత విప్లవకర హింసతో ఎదుర్కోవడం తప్ప గిరిజన రైతాంగానికి మరొక దారిలేదని స్పష్టం చేస్తుంది. ప్రతి నిత్యం ప్రజలపట్ల భూస్వాములు ఎంత నిర్దాక్షిణ్యంగా, చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తున్నదో అది ఖచ్చితంగా వెల్లడి చేస్తుంది. అయినా చట్టవిరుద్ధమైన వీరి ప్రతి చర్యనూ భూస్వామ్య ప్రభుత్వము మాఫీ చేసింది. రాజ్యాంగం లోని 5వ షెడ్యూలులో గిరిజనులకై ఉద్దేశించబడిన రాజ్యాంగ రక్షణలు, ప్రత్యేక హక్కుల గురించి భూస్వాములు ఎప్పుడూ లక్ష్య పెట్టలేదని స్పష్టమవు తుంది. ఎందుకంటే భూస్వాముల ప్రయోజనాలకు ప్రతిగా ప్రజలలో ఏ భాగానికైనా ప్రత్యేకంగా కల్పించబడిన రాజ్యాంగ రక్షణలు వట్టి బూటకం మాత్రమేనని భూస్వాములకు తెలుసు. దీన్ని ఆచరణలో సహితం వారు రుజువు చేశారు. తుపాకీ ఎవరి చేతిలో ఉంటుందో దానిని నిర్దాక్షిణ్యంగా ఎవరు ఉపయోగించ గలుగుతారో వారిదే అధికారమని కూడా భూస్వాములకు బాగా తెలుసు. ఈ విధంగా ఈ భూస్వాములే సత్యమైన ఈ చారిత్రక సూత్రాన్ని అమాయకులైన గిరిజనులకు బోధించారు. ప్రభుత్వం ఎప్పుడూ భూస్వాముల పక్షమే వహించడం ద్వారా ఎప్పుడూ వారి ఆదేశానుసారమే వ్యవహరించడం ద్వారా భూస్వాముల గూండాగిరీ నుంచి ప్రజలను రక్షించకపోవడమే గాక ఈ ప్రభుత్వం భూస్వాముల ప్రయోజనాలను రక్షించడానికి అంతకంటే దారుణమైన పద్ధతులను అనుసరిస్తుందన్న పాఠాన్ని అమాయకులైన గిరిజనులకు బోధించింది".

కమ్యూనిస్టులు నేర్పిన దానికంటే గిరిజనుల స్వానుభవమే అత్యుత్తమ ఉపాధ్యాయుడులా పని చేసింది. బహుముఖమైన గిరిజనుల అనుభవాల ఆధారంగా ఈ సత్యాలని ప్రత్యేకించి ఎత్తి చూపడమే విప్లవకారులు చేసిందల్లా.

'గౌరవనీయమైన' పత్రికల్లో ప్రచురించిన కొన్ని వాస్తవాలను పునశ్చరణ చేయడం మార్క్స్ చెప్పిన ఈ మాటల్లోని సత్యాన్ని వెల్లడి చేస్తాయి. "ఎవరో కొందరు ఆందోళనకారుల దుర్బుద్ధి వల్ల విప్లవాలు జరుగుతాయన్న మూఢనమ్మకాల రోజులు ఎప్పుడో గతించాయి. విప్లవకర అలజడులు ఎక్కడ ఉన్నా, వాటి వెనుక ఏదో ఒక సాంఘిక కోర్కె ఉండి తీరుతుందనీ, అది తీరకుండా కాలం చెల్లిన వ్యవస్థా నిర్మాణాలు అడ్డగిస్తున్నాయనీ ఈ రోజుల్లో అందరికీ తెలుసు. " (మార్క్స్) - రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్ (విప్లవం - ప్రతీఘాత విప్లవం)

శ్రీకాకుళం తిరుగుబాటు (Revolt in Srikakulam)

శ్రీకాకుళంలో గిరిజన తిరుగుబాటు గురించి ఒక సమీక్షను ప్రచురిస్తూ "టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రిక (4-1-70) "తమ దుర్భర పరిస్థితుల వల్ల అమిత దురాశాపరులైన మైదాన ప్రాంతాల వారు పెట్టే కడగండ్ల వల్ల విసిగి వేసారిన శ్రీకాకుళం గిరిజనులు తమకు జరిగిన అన్యాయాలకు ప్రతీకారంగా హింసాయుత చర్యలకు దిగార" ని తగిన విధంగా ప్రచురించింది.

మనదేశంలోని అణగద్రొక్కబడిన, తమ భూముల నుండి వెళ్ళగొట్టబడిన రైతాంగానికి ఆయుధాలు చేపట్టడమొక్కటే తమ విముక్తి మార్గమన్న వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చిన ఈ పోరాట చరిత్ర ఈ సమయంలో చాలా అవసరం.

ప్రజల జీవన పరిస్థితులు

(1) "ప్రజల ఆర్థిక జీవనం ఆందోళనకరమైన దుర్భర స్థితిలో ఉంది. గిరిజనుల్లో కొందరు పోడు వ్యవసాయంపై జీవిస్తుండగా మరికొందరు చింతపండు లాంటి అటవీ ఫలసాయాన్ని అమ్మి కోవడం ద్వారా జీవనం వెళ్ళ బుచ్చుతున్నారు. ఈ అటవీ ఫలసాయాన్ని వారం వారం జరిగే సంతల్లో మారకం చేసుకుంటారు లేదా నిత్యం కొనుగోలు చేసేవారికి అమ్ముతుంటారు. ఒక మణుగు చింతపండు ఒక కిలో ఉప్పుతో లేదా ఒక చిన్న సీసా మంచినూనెతో మారకం చేసుకుంటారని చెప్పబడుతుంది."

వ్యవసాయ కూలీ వృత్తియే గిరిజనుల ప్రధాన జీవనాధారమైన వృత్తి. " పురుషులైన వ్యవసాయ కూలీల రోజువారి కూలీ 20 నుంచి 40 పైసల వరకూ ఉంటుంది. చింతగింజల పొడి నుండి తయారు చేసిన గంజినీళ్ళు ఈ ప్రజల మామూలు ఆహారం."

"మైదాన ప్రాంతాల నుండి వచ్చిన వడ్డీ వ్యాపారస్తులు ఈ గిరిజనులకు పది రూపాయలు అప్పిచ్చి రూ.100 లేదా అంతకంటే ఎక్కువకు ప్రోనోటు వ్రాయించుకొంటారు. కొన్ని సందర్భాల లో అచ్చంగా తెల్లకాగితాలపైనే వేలిముద్రలు వేయించుకొంటారు. బదులు చెల్లించినదల్లా వడ్డీగా లెక్క గట్టుకొంటారు. పెద్ద మొత్తాలు బాకీలు తేల్చి వారి కున్న భూములు కాస్తా వదులుకొమ్మని డిమాండ్ చేస్తారు. దానికి అంగీకరించకపోతే స్థానిక పోలీసు, రెవిన్యూ అధికారుల సహాయంతో ఆ భూముల నుండి గిరిజనులను నెట్టివేస్తారు."

"ఏజన్సీ ప్రాంతంలో గిరిజనుల భూములను మైదాన ప్రాంతాలవారు కాజేయకుండా నిరోధిం చేందుకై ఏనాడో 1917లోనే ఒక చట్టం చేయబడింది.

భూమిని అన్యాక్రాంతం చేయబోయే ముందు జిల్లా కలెక్టరు అనుమతి ఉండాలని ఈ చట్టం నిర్దేశిస్తున్నది. కానీ దురదృష్టవశాత్తు ఈ కాలమంతటా ఈ చట్టం అతి క్రమించబడిందే తప్ప ఏమాత్రం గౌరవించబడలేదు. గిరిజన ప్రాంతాలలో భూముల లావా దేవీలకు సంబంధించినంత వరకూ ప్రభుత్వ యంత్రాంగమే లేదు. 'స్వాతంత్ర్యం' వల్ల గిరిజనులకు ఒనగూడిన ప్రయోజనాలు దాదాపు ఏమీ లేవనే చెప్పవచ్చు."

"పంచవర్ష ప్రణాళికలలో గిరిజన సంక్షేమం పేరిట ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఆ ధనమంతా ఎక్కడికి పోతున్నదో ఎవరికీ అంతు చిక్కడం లేదు. నక్సలైట్ ఉద్యమం కుదుపు తగిలేవరకూ, శక్తివంతులైన కొండ ప్రాంతాల్లోని ఈ గిరిజనుల పట్ల ప్రభుత్వం తన బాధ్యతలను పూర్తిగా మరచిపోయింది."

"ఫలితంగా ప్రభుత్వమంటే - ఏదో కొంత లంచమిస్తే తప్ప అడవి నుండి వంట చెరుకు తెచ్చుకోకుండా నిరోధించే ఫారెస్టు గార్డుల రూపంలో మాత్రమే గిరిజనులకు తెలుసు."

"అసమర్థులే గాక లంచగొండులు కూడా అయిన ఉద్యోగులతో కూడిన గిరిజన ద్రవ్య సహాయం అభివృద్ధి కార్పొరేషన్ గిరిజనులకు సహాయం చేయడంలో తన పాత్ర నిర్వహించలేక పోయింది."(డెయిలీ న్యూస్, 14-3-70)

(2) "టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రిక 4-1-1971 తేదీ సంచికలో "శ్రీకాకుళం తిరుగుబాటు" గురించిన నివేదికలో " మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన షావుకార్లు, వడ్డీ వ్యాపారులు దశాబ్దాలుగా గిరిజనులనబడే - ఈ కొండజాతి ప్రజలను నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేయడం వల్ల దీర్ఘకాలంగా ఉన్న కష్టాలను" గురించి; "గిరిజనులపట్ల చిన్నచూపు హిట్లరు వలె ప్రవర్తిస్తున్న ఫారెస్టు గార్డుల గురించి"; "గిరిజనుల నుండి అటవీ ఫలసాయాన్ని అతిచౌకగా కొనివేసి, అవసరమైన సమయాల్లో అతి హెచ్చు వడ్డీరేట్లకు అప్పులిచ్చి చివరికి గిరిజనులను భూముల నుండి అనివార్యంగా వెళ్ళగొట్టి స్వాధీనం చేసుకొనే మైదాన ప్రాంత షావుకార్లు" గురించీ; "ఏజెన్సీ ప్రాంతాల్లోకి వెళ్లి అక్కడే స్థిరపడిన మైదాన ప్రాంతాల వారి చేతుల్లోకి పెద్దయెత్తున భూములు చేరడం" గురించీ; "రోజుకు 25 పైసల కూలీ మాత్రమే చెల్లించబడుతున్న గిరిజనుల బాధల గురించీ; "నిరక్షరాస్యులు, అమాయకులైన గిరిజనులు సేకరించిన అటవీ ఫలసాయాన్ని అతి చౌకగా కొనివేసి వాటిద్వారా మైదాన ప్రాంతాల వారు విపరీత లాభాలు ఆర్జించటం" గురించి తెలియజేసింది.

గిరిజనులు కనీవిని ఎరుగని దుర్భర పరిస్థితుల్లో జీవనం గడపడం గురించి, దేశంలోని ఏ చట్టమూ అడ్డులేని విధంగా ఈ గిరిజనులపై సాగుతున్న ఎడతెగని దోపిడీ గురించి, వారిలో పెరుగుతున్న అశాంతి గురించి, వారిపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న పాశవిక వైఖరి, భూస్వాములు వీరిపై బహిరంగంగా చేసిన యుద్ధ ప్రకటన ఈ గిరిజనుల తిరుగు బాటును రెచ్చ గొడుతున్న తీరు గురించి 1968లోనే పత్రికలలో వార్తలు వెలువడ్డాయి.

(3)."హిందూ" పత్రికలో 1968 ఫిబ్రవరిలో ఒక ప్రత్యేక విలేఖరి "ఆ ప్రాంతంలో భూస్వాములచే 1967 అక్టోబరులోనే లేవిడి అనే గ్రామంలో ఇద్దరు వ్యక్తులు హత్య చేయబడిన అనంతరం చెలరేగిన ఉద్రిక్త పరిస్థితి ఇంకా తీవ్రంగా పెరుగుతున్నట్లు" తెలియజేశాడు. ఈ ప్రతిక ఆ ప్రాంతం లోని కొన్ని సమస్యలకు సంబంధించిన ఈ క్రింది వాస్తవాలను ప్రచురించింది.

"మౌలికంగా చూస్తే ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితి వ్యవసాయక సమస్య నుండి ఉద్భవించింది. చాలా మంది మైదాన ప్రాంతాల వారు కొండల దిగువ వడ్డీ వ్యాపారులుగా స్థిరపడిపోయారు. ఆ వ్యాపారులు క్రమంగా గిరిజనుల నిరక్షరాస్యతను ఆధారం చేసుకొని గానీ, గిరిజనులు తాకట్టు రద్దు చేసుకోలేక పోవడంవల్ల గానీ తమకు అనుకూలంగా పత్రాలు సృష్టింపజేసుకొని వారి భూములన్నింటినీ కాజేశారు".

మరల " హిందూ" పత్రిక 1968 మార్చిలో ఇలా వ్రాసింది. "శ్రీకాకుళం జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలలో గత సంవత్సరం జూలై నెలలో వెలికి వచ్చిన గిరిజన అశాంతి, గిరిజన సంక్షేమం విషయంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాల వైఫల్యాన్ని స్పష్టంగా బయట పెట్టింది."

"గత జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ లో 12 లక్షల మంది గిరిజనులు వున్నారు. వారిలో 97శాతం నిరక్షరాస్యులే. శ్రీకాకుళం జిల్లాలో ప్రధానమైనది సవరతెగ. జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో వీరి సంఖ్య 68,000 వుంది. వీరిలో ముగ్గురు మాత్రం మెట్రిక్యులేషన్‌కు సమానమైన విద్యార్హత కల్గివున్నారు. 103 మంది మాత్రం ప్రాథమిక పాఠశాల వరకూ చదువుకున్నారు. ఈ పరిస్థితిలో మార్పేమీ లేదని అధికారులు చెప్తున్నారు."

"ఇన్ని సంవత్సరాలుగా గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కనీసం ఇప్పుడైనా పూనుకోవడం చాలా అవసరమని జిల్లాలోని అధికారుల, ప్రజల సాధారణాభిప్రా యంగా వుంది. భూమి యాజమాన్యం, మెరుగైన వేతనాలు లాంటి వ్యవసాయక సమస్యలు ప్రధానమైనవి. వీటితో పాటు ఇంకా పరిశుభ్రత, మంచి ఆహారపుటలవాట్లు, ప్రాథమిక విద్య మొదలైన ఇతర సమస్యలు కూడా ఉన్నాయి. గిరిజనుల అభివృద్ధికై అనేక చర్యలు ఉద్దేశించ బడినప్పటికీ ఈ సమస్యల గురించి ఎప్పుడూ తీవ్రంగా తీసుకోలేదు."

(4) 'ఆంధ్రపత్రిక' 25-3-1968న 'శ్రీకాకుళం ఏజన్సీ సమస్యలు' అనే ఒక ప్రత్యేక రిపోర్టులో ఈ క్రింది విధంగా వ్రాసింది (ఈ భాగం ఇంగ్లీషు లోంచి తెలుగు చెయ్యబడింది. కనుక తెలుగు ప్రతితో సరిపోలదు-అను")

"1959 నాటి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ఏరియాస్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ ఆక్టు" అమలు పర్చడంలో ప్రభుత్వ వైఫల్యమే ఈ ప్రాంతంలో ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితికి కారణం."

"వందల సంవత్సరాలుగా గిరిజనుల చేతుల్లో ఉన్న భూములను మైదాన ప్రాంతాల నుండి వచ్చిన వారు అక్రమంగా ఆక్రమించుకొన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతంలో మైదాన ప్రాంతాల నుండి వచ్చినవారి చేతుల్లో 100 ఎకరాల భూమి ఉందనుకొంటే గిరిజనుల చేతుల్లో ఒక్క ఎకరం మాత్రమే వుంది."

"శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతంలో 80,000 మంది గిరిజనులున్నారు. ఈ గిరిజనులచే వెట్టిచాకిరీ చేయించుకొనే భూస్వాములే కమ్యూనిస్టుల ప్రచారానికి రంగం సిద్ధం చేశారు. ఈ ప్రాంతంలో మైదాన ప్రాంతాల నుండి వచ్చిన భూస్వాములు మరింత ధనికులుగా తయారై ప్రభుత్వంలో పలుకుబడి సంపాదించారు. ప్రస్తుత పరిస్థితిని అదుపులో పెట్టడానికి మైదాన ప్రాంతాల భూస్వాములు, పోలీసులు ఎంతగా బలప్రయోగం చేస్తే అంతగా గిరిజనులు రెచ్చిపోతారు. అందువల్ల మైదాన ప్రాంతాల వారు ఆక్రమించిన భూములను సర్వే చేయించి, ఆ భూములపై గిరిజనులకు పట్టాలిస్తే తప్ప గిరిజన రాజ్యస్థాపనకు జరిగే

ప్రయత్నాలు అనివార్యమౌతాయి."

(5) మార్చి 17, 1968 "లింక్" వారపత్రిక ఇలా వ్రాస్తోంది. "ఒరిస్సా సరిహద్దులోని ఉత్తరాది జిల్లా శ్రీకాకుళంలో తరతరాలుగా దోపిడికీ గురవుతూ వున్న పార్వతీపుర గిరిజన జనాభా ఆర్థిక సాంఘిక దోపిడీ నుంచి తమను తాము విముక్తి చేసుకోవాలని కోరుకొంటూంది."

"పార్వతీపురం ఏజెన్సీ అపారమైన అటవీ సంపదకు ప్రసిద్ధి. మైదాన ప్రాంతాలకు చెందిన భూస్వాములు, దళారీలు సాంప్రదాయకంగా గిరిజనుల శ్రమ మీద పడి బ్రతుకుతున్నారు. కొద్ది నం॥ల క్రితం అతివాద కమ్యూనిస్టులు గిరిజనులను సంఘటిత పర్చి భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. అశావహమైన సంక్షేమ పథకాలున్నప్పటికీ, వారి పరిస్థితులను మెరుగు పర్చుటకు ప్రభుత్వ యంత్రాంగం చేసింది శూన్యం."

"క్రింది రెవిన్యూ అధికారులు, ఫారెస్టు అధికారులు, భూస్వాములు కుమ్మక్కు కావడంతో, నిరాశ నిస్పృహలకు గురైన, కోపోద్రిక్తులైన గిరిజనులు భయపడి దూరంగా పారిపోయే రోజులు గతించాయి. గత మూడు మాసాలలో చిన్న, పెద్ద సంఘటనలు 100కుపైగా సంభవించాయి. అనేక గ్రామాల్లో నెలల తరబడి 144 సెక్షన్ క్రింద నిషేధాజ్ఞలు అమలు చేయబడ్డాయి. రెండు సందర్భాలలో పోలీసులు కాల్పులు కూడా సాగించారు."

(6) 'టైమ్స్ ఆఫ్ ఇండియా" (1968 మార్చి 22) ఇలా వ్రాసింది. "ఇటీవలి సంవత్సరాలలో మైదాన ప్రాంతాల వారు కొండ ప్రాంతంలోని ఒక భాగంలో ప్రవేశించారు."

" వీరే భూస్వాములుగా, వడ్డీ వ్యాపారులుగా, చిన్న దుకాణదారులుగా తయారయ్యారు. మైదాన ప్రాంతాలవారు ఇప్పుడు గిరిజనులను అతి తక్కువ వేతనాలకు వ్యవసాయ కూలీలుగా పని చేయించుకొంటున్నారు. వారు అతి హెచ్చు వడ్డీరేట్లకు గిరిజనులకు అప్పులిచ్చి విపరీతమైన వడ్డీలను వసూలు చేయడానికి క్రూరమైన పద్ధతులను అనుసరిస్తారు."

"అందువల్ల అతివాద కమ్యూనిస్టులు రెచ్చ గొడుతున్నట్టుగా ఆరోపించబడుతున్న వ్యవసాయక అశాంతికి నిజమైన ఆధారం వుంది. తరుచుగా జరిగే తగాదాల్లో మైదానప్రాంతాల వారి పక్షం వహించడమే ఇంతవరకు పోలీసులకూ తేలిగ్గా వుంటున్నది."

(7)." స్టేట్స్‌మన్" (1968 ఏప్రిల్ 11,12 తేదీల సంచిక)లో వారి ప్రత్యేక విలేఖరి వి.యం.నాయర్ గిరిజన తిరుగుబాటు గురించి వ్రాసిన రెండు వ్యాసాలను ప్రచురించింది. ఆ వ్యాసాలలో ఈ క్రింది విధంగా వుంది.

"మైదానాలవారు వ్యాపారులుగా, షావుకార్లుగా, కాంట్రాక్టర్లుగా గిరిజన ప్రాంతాలలో ప్రవేశించి, గిరిజనుల త్రాగుడు వ్యసనాన్ని అవకాశంగా తీసుకొని, వారికి అప్పులిచ్చి, క్రమంగా అతి స్వల్ప మైన ధరలకు వారి భూములు కొనుగోలు చేసారు. రిజర్వు ప్రాంతంలో వున్న సారవంతమైన మాగాణి భూములన్నీ వాస్తవానికి 5 నుండి 90 ఎకరాల వరకు సగటు కమతాలు వున్న ఈ భూస్వాముల యాజమాన్యంలోనే వున్నాయి."

" స్వతంత్రం వచ్చిన చాలాకాలం తర్వాత కూడా ఈ చిన్న భూస్వాములు గిరిజనులచే రోజల్లా పనిచేయించుకొని 4 ఆణాల కూలి మాత్రమే ఇచ్చి దోపిడీ చేయటం కొనసాగించారు. కమ్యూనిస్టులు ఆ ప్రాంతంలో ప్రవేశించి గిరిజనులను ఆర్గనైజు చేయడం ప్రారంభించారు. ప్రధానంగా కాంగ్రెస్‌పార్టీకి చెందిన వారుగా చెప్పుకొనే ఈ భూస్వాములు పాలకపార్టీ మద్దతుదార్లుగా ఉండి తమ క్రింద పని చేసే భృత్యులలో పెరుగుతున్న ఈ ప్రతిఘటన తత్వాన్ని దెబ్బ తీసేందుకు తరచుగా అక్రమ పద్ధతుల ద్వారా తిప్పికొట్టారు.

"స్థానిక అధికారులపై పలుకుబడి ప్రయోగించి వారిని నిస్తబ్ధం చేశారు. సహకార సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వాలని ప్రత్యేకంగా ప్రభుత్వ ఆదేశం వున్నప్పటికీ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు ఒక్క కాంట్రాక్టు కూడా ఒక గిరిజన కార్మిక సహకార సంస్థకు ఇవ్వకుండా గుమ్మలక్ష్మీపురానికి చెందిన ఇద్దరు ధనికులైన రైతుల కిచ్చారు.

"కమ్యూనిస్టులను మినహాయించితే భూస్వాములకు వ్యతిరేకంగా గిరిజన సమస్యలను తీర్చడానికి ఏ ఇతర రాజకీయ పార్టీ ఎలాంటి కృషి చెయ్యలేదు. దీనికి విరుద్ధంగా ఇతర పార్టీలవారు గిరిజనులను అదుపులో పెట్టడానికి పెద్ద ఎత్తున పోలీసులపై ఆధారపడ్డారు. ఇంకా ఆధార పడుతున్నారు. "

కమ్యూనిస్టులు - గిరిజనులు

"1995 నాటికి కమ్యూనిస్టులు ఆ ప్రాంతాల్లోకి ప్రవేశించి గిరిజనులను ఆర్గనైజ్ చేయడం ప్రారంభించారు. గిరిజనుల, వ్యవసాయ కూలీల వేతనాలు పెరిగేట్లు చేయడంలోనూ, భూమిని పొందగల్గుతామనే భావనను భూమిలేని వారిలో సృష్టించడంలోనూ గిరిజన ప్రాంతాలలో పని చేస్తున్న మార్క్సిస్టు కమ్యూనిస్టులు విజయం సాధించకల్గారు."

"దీనితో మైదానాలకు చెందిన వారినందరినీ ఆ ప్రాంతం నుండి బహిష్కరించి గిరిజనుల భూములన్నీ తిరిగి గిరిజనులకే ఇచ్చివేయాలనే పిలుపు ఇవ్వడానికి ఈ ప్రాంతంలోని కమ్యూనిస్టు నాయకత్వానికి ధైర్యం కల్గింది. 1917 నాటి లాండ్ రెగ్యులేషన్ చట్టాన్ని ధిక్కరించి గిరిజనుల నుండి ఈ భూములు "కొనుగోలు" చేయబడినాయనేది కమ్యూనిస్టుల వాదన. ఈ 1917 చట్టం ప్రకారం వేలం ద్వారా లేక కోర్టు డిక్రీని అనుసరించి తప్ప గిరిజ నేతరులకు భూమి బదిలీచేయడం నిషేధించ బడింది."

"భూముల అక్రమ సంపాదనకు సంబంధించిన ఫిర్యాదులన్నింటినీ పరిశీ లించడానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం ద్వారా కమ్యూనిస్టుల వాదనను కనీసం పాక్షికంగానైనా ప్రభుత్వం అంగీకరించిందనే అర్థం."

"మైదాన ప్రాంతాల వారిపై పూర్తి నిషేధం పెట్టాలనే డిమాండ్ భూస్వాములలో ఆపుకోలేని తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. ఈ భూస్వాముల పూర్వ చరిత్ర కూడా సంతృప్తికరమైనది కాదు. ఈ భూస్వాములు రైతు సంఘంగా ఏర్పడ్డారు. చట్ట విరుద్ధంగా మోసంతో గిరిజనుల నుంచి స్వాధీనం చేసుకొన్న భూములను వారికి తిరిగి అప్పగించాల్సి ఉండగా ఈ (భూస్వాములు) రైతు సంఘం' ఈ నాటికీ న్యాయంగా ఏనాడో జరగవలసిన క్రమాన్ని ప్రతి ఘటిస్తున్నారు."

గత 8 నెలలకు పైగా కమ్యూనిస్టులు "గిరిజన వ్యవసాయ కూలీలను ఒక మిలిటెంట్ సంస్థగా సంఘటితపర్చి గిరిజనుల రోజుకూలీలో గణనీయ మైన పెరుగుదలను సాధించడంలో కృతకృత్యు లయ్యారు. ఆ విధంగా అత్యంత నిరపాయకర మైన అమాయక ఆదిమ జాతులవారిని సైతం క్రమబద్ధమైన ఎడతెగని ప్రచారం ద్వారా అత్యంత ప్రమాదకరమైన తిరుగుబాటు శక్తిగా ఎలా మార్చ వచ్చునో కమ్యూనిస్టులు రుజువు చేసిచూపారు."

" కమ్యూనిస్టులు మినహాయించి భూస్వాము లకు వ్యతిరేకంగా గిరిజనుల ఇబ్బందులను

తీర్చడానికి ఏ ఇతర రాజకీయపార్టీ ఎలాంటి కృషి చేయలేదు."

"ఈ ప్రాంతాల్లోని కాంగ్రెస్ వారు ప్రధానంగా భూస్వాముల పక్షమే వహిస్తున్నారు. వారు గిరిజనులను అదుపులో పెట్టడానికి పెద్ద ఎత్తున పోలీసులపై ఆధారపడ్డారు. ఇంకా ఆధారపడటం కొనసాగిస్తున్నారు కూడా."

దీనికి పూర్తి విరుద్ధంగా మార్క్సిస్టులు కొండ ప్రాంతాల్లోకి వెళ్ళి గిరిజనులతో కలసి నివసిస్తూ వారి ఆశలలో, కోర్కెలలో పాలు పంచుకున్నారు. కమ్యూనిస్టు అగ్రనాయకులు ఈ ప్రాంతంలో పర్యటించి దోపిడీ చేస్తున్న భూస్వాములకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయమని గిరిజనులకు బోధించారు.

"శ్రీకాకుళం గిరిజన సంఘం అనే సంస్థ ఒకటి స్థాపించబడింది. దీని ద్వారా అట్టడుగున ఉన్న పీడితులైన గిరిజనుల జీవనపరిస్థితులు మెరుగు పరచటంలో కమ్యూనిస్టులు విజయం సాధించారు. ఆ ప్రాంతం అంతటిలోనూ ఎల్విన్‌పేట, పార్వతీపురంలకు చెందిన గిరిజన కూలీలు ఈనాడు హెచ్చువేతనాలు పొందుతున్నారు. రోజు కూలీగా 3 నుండి 8 రూ॥ల విలువ గల ధాన్యాన్ని గిరిజన కూలీలు ఈనాడు పొందగల్గుతున్నారు."

భూస్వాముల దౌర్జన్యాలు - అక్టోబర్ 31 కోరన్న, మంగన్నల అమరత్వం

భూస్వాములు ప్రదర్శించిన అనాలోచితమైన మిలిటెన్సీయే గిరిజనుల్లో అశాంతిని చెలరేగించిందని, అంతేకాక కమ్యూనిస్టుల ఎత్తుగడలకు అవకాశం కల్పించిందని వాదించవచ్చును.

"భూస్వాముల అత్యాచారాలు అసంఖ్యాకంగా ఉన్నప్పటికీ ప్రధానంగా గత ఏడాది 1967 అక్టోబర్ 31 న జరిగిన సంఘటనే తిరుగుబాటును రగిల్చింది. ..... ఆ రోజున నినాదాలిచ్చుకుంటూ ఒక మార్క్సిస్టు సమావేశానికి వెళ్తున్న ఒక గిరిజన బృందంపై భూస్వాములు దాడిచేసి బాదారు. గిరిజనులు దీన్ని తిప్పికొట్టడంతో కొందరు భూస్వాములు తుపాకులు కాల్చారు. అక్కడికక్కడే ఇద్దరు గిరిజనులు చనిపోయారు.

గిరిజన సంఘం ఏర్పడిన నాటినుండి దాన్ని దాని కార్యకలాపాలను భంగపర్చడానికి భూస్వాములు అన్ని మోసపూరిత పద్ధతుల్ని, క్రూర పద్ధతుల్ని ప్రయోగించారు. 1960 లోనే అప్పటికే గిరిజనుల్లో అత్యంత ప్రజల ఆదరాభిమానాలు పొందిన కామ్రేడ్ వెంపటాపు సత్యనారాయణను హత్య చేసేందుకు భూస్వాములు ప్రయత్నించారు. ఎంతో మెలకువతో ఉండబట్టి భూస్వాముల దుష్ట పథకాన్నుండి ఆయన తప్పించుకున్నాడు. మరల అతికొద్ది కాలంలోనే పెద్దఖర్జి గ్రామంలో కామ్రేడ్ ఆదిభట్ల కైలాసాన్ని కొట్టడానికి భూస్వాములు ప్రయత్నించారు. 1964లో భూస్వాముల కిరాయ గూండాలు మొండెంఖల్ గ్రామ పంచాయితీ అధ్యక్షుడిపై పట్టపగలే దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. అదే సంవత్సరం కామ్రేడ్ వల్లభుడు అనే గిరిజన సంఘకార్యకర్తను గుమ్మలక్ష్మిపురం వెళ్ళినపుడు భూస్వాములు ఆయన్ని స్పృహ తప్పేంత వరకూ కొట్టారు. పెచ్చు కూలీ డిమాండ్ చేసేందుకై ఒక బహిరంగ సభకు ఊరేగింపుగా వెళ్తున్న గిరిజనులపై ప్రఖ్యాత భూస్వామ్యగుండా అయిన మేడిద సత్యం నాయకత్వాన భూస్వాములు దాడి చేశారు. పోలీసులు తమకు మద్దతిస్తారనే గట్టి విశ్వాసంతోనే వారు ఈ విధమైన దాడి చేశారు. అక్కడ దాడికి గురైన కామ్రేడ్ రామలింగాచారితో సహా దెబ్బలుతిన్న వాళ్ళ పైనే ఎదురు నేరారోపణ చేసి కేసులు పెట్టబడ్డాయనే సంగతి ఇక్కడ గమనించాల్సిన ఆసక్తికరమైన అంశం. 13-5-67 న తన ఇంటి ముందు నిద్రపోతున్న కామ్రేడ్ వెంపటాపు సత్యనారాయణను మేడిద సత్యం వద్ద పనిచేసే పాలేరు, మరొకరు వచ్చి హత్యచేయడానికి ప్రయత్నిం చారు. అదృష్టవశాత్తు ప్రక్కనే ఉన్న మరో ఇంటి యజమాని సమయానికి మేలుకొని బిగ్గరగా కేకలు వేయడంతో వారు పలాయనం చిత్తగించారు. 19-7-67న పెంపెని సూరి మరి కొందరు కామ్రేడ్ వెంపటాపు సత్యనారాయణ ఒక చోటుకు వస్తారని అక్కడవారిని కాల్చి వేయడానికి పొంచి యున్నారు. కానీ ఈ పథకాన్ని ముందే తెల్సుకున్న ఆయన అక్కడికి రాకుండానే వారి కాల్పుల బారి పడకుండా తప్పించుకున్నాడు. అదే రోజున కోటపాడుగూడెంకు చెందిన మందంగి గోవిందుడు, బిద్దిక మంగడు, ఆరికబుడ్డాడు అనే ముగ్గురు గిరిజనులను గుమ్మలక్ష్మిపురం వద్ద తీవ్రంగా బాదారు. ఈ సంఘటన జరిగిన తరువాత గిరిజన సంఘ కార్యకర్త అయిన కామ్రేడ్ బురున్నను హత్యచేస్తామని భూస్వాముల ఏజెంట్లు వీధుల్లో తిరుగుతూ బహిరంగంగానే ప్రకటించారు. ఆందోళన చెందిన గిరిజనులు తమ శక్తినంతా కూడగట్టుకొని వారిని ఎదుర్కొనడానికి సంసిద్ధమవడంతో ఆ భూస్వామి ఏజెంట్లు కాస్తా పలాయనం చిత్తగించారు. 20.7.67న గుమ్మ లక్ష్మీపురం సంతకు వెళ్ళిన మొరమ గ్రామానికి చెందిన తాడకి బాపన్న, చొడంకి ధిండాని అనే గిరిజనులను, మరొక గిరిజన స్త్రీని సైతం వారు తీవ్రంగా బాదారు. ఈ సంవత్సరా లలో భూస్వాములు చేసిన అనేక వందల సంఘట నలలో ఇవి చాలా కొద్దిపాటివి మాత్రమే.

పోలీసు అణచివేత

గిరిజన సంఘం ఏర్పడిన మొదటి రోజుల్లో భూస్వాముల చట్ట విరుద్ధమైన వసూళ్ళకు, దోపిడీకి, దౌర్జన్యకాండకు వ్యతిరేకంగా చట్టబద్ధంగా శాంతి యుతంగా గిరిజనులు పోరాటం చేసినపుడు ప్రభుత్వం వారి పోలీసుల వైఖరి ఏమిటి? చదువు రాని గిరిజనులచే ఫారెస్టు అధికారులు వెట్టిచాకిరి చేయించుకోవడమేగాక మామూళ్ళు సైతం బలవంతంగా వసూలు చేస్తున్నారని గిరిజనులు చేసే ఆరోపణలపై ప్రభుత్వం, దాని శాంతి భద్రతల విభాగమైన పోలీసు ఎన్నడైనా విచారించిందా? భూస్వాములు, వ్యాపారులు తాము ఇవ్వవలసి వచ్చినపుడు పిచ్చి కొలతలతో (తక్కువ కొలతలు-అను) కొలుస్తున్నారని గిరిజనులు, గిరిజన సంఘం చేసిన ఫిర్యాదుల్లోని నిజానిజాలను తేల్చుకోవడానికి ప్రభుత్వం అసలెప్పుడైనా ప్రయత్నించిందా? గిరిజనలు సేకరించిన అటవీ ఫలసాయాన్ని గిరిజన, మార్కెటింగ్ సంఘాలు తప్ప వేరెవరూ కొనుగోలు చేయరాదని చట్టం నిషేధిస్తున్నప్పటికీ గిరిజనులకు అప్పులిచ్చి సహాయం చేశామనే పేరిట భూస్వాములు అతి తక్కువ ధరలకు అటవీ ఫలసాయాన్ని కాజేస్తున్నారనే అంశాన్ని అధికారులు అసలు ఎప్పుడైనా గుర్తించారా? విపరీతమైన వడ్డీ రేట్లతో గిరిజనులను దోపిడీ చేయడమే గాక ప్రభుత్వం చేసిన చట్టాలనే అతిక్రమించి భూస్వాములు గిరిజనుల భూములనే చివరికి స్వాహా చేశారు. ఇన్నేళ్ళుగా గిరిజనులు వారి గిరిజన సంఘాలు చేసిన ఫిర్యాదులలో పోలీసులు ఒక్కటైనా పరిశీలించి, గిరిజనులపై క్రూర హింసాకాండ సాగిస్తున్న భూస్వాములకు వ్యతిరేకంగా ఎన్నడైనా చర్య

తీసికొన్నారా? లేదు. పైగా ఈ కాలమంతటా భూస్వాములు చేసిన ఆరోపణల ఆధారంగా వేలాదిమంది గిరిజనుల పైనా, గిరిజనసంఘ కార్యకర్తల పైనా తీవ్ర నిర్బంధ కాండ అమలు జరుపబడింది. గిరిజనులపై లెక్క లేనన్ని కేసులు పెట్టబడ్డాయి. ఫలితంగా వేలాది మంది గిరిజనులు కోర్టుల చుట్టూ తిరిగారు. వేలాదిమంది జైళ్ళ పాలయ్యారు. మొండెంఖల్, నీలకంఠపురం గ్రామలలో కొత్తగా పోలీసు చౌకీలు నెలకొల్పబడ్డాయి. వేతనాలు పెంచాలనే న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న గిరిజనుల్ని భీతవహుల్ని చేయడానికై ఆ ప్రాంతంలో నాట్లు, కోతల సమయంలో రిజర్వు పోలీసులను దించడం సర్వ సాధారణమై పోయింది.

భూస్వాముల ఘోరకృత్యాలు, పాశవిక పోలీసు నిర్బంధం సాగుతున్న ఈ పరిస్థితుల్లోనే విప్లవ భావాలు కలిగిన కమ్యూనిస్టుల నాయకత్వాన గిరిజనులు తమ పోరాట సంస్థ అయిన గిరిజన సంఘం వెనుక దృఢంగా ఐక్యమై అనేక సమస్యలపై గణనీయమైన విజయాలు సాధించారు. బలవంతపు వెట్టిచాకిరీ అంతమొందించబడింది. ఫారెస్టు తదితర అధికారుల మామూళ్ళు రద్దు అయినాయి. వేతనాలు పెంచుకొన్నారు. అధిక వడ్డీరేట్లు తగ్గించబడ్డాయి.

గిరిజనులు ఈ విధంగా బ్రహ్మాండమైన విజయాలు సాధించడంతో భూస్వాములు పెల్లుబుకుతున్న గిరిజన తిరుగుబాటును ప్రభుత్వ సహకారంతో శాశ్వతంగా అణచివేసేందుకు నిర్ణయించుకొన్నారు. భూస్వాములు, ప్రభుత్వము *గిరిజనులపై సాగిస్తున్న సాయుధదాడులకు వ్యతిరేకంగా గిరిజనుల సంపూర్ణ సాయుధ తిరుగుబాటుకు దారితీసిన పంవత్సరంగా 1967 చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది. శాంతియుతంగా సాగుతున్న గిరిజనుల ఆందోళన తప్పనిసరిగా చరిత్రాత్మక శ్రీకాకుళం గిరిజనుల సాయుధ తిరుగుబాటుగా పరిణమించింది.*

1967 విత్తనాలు, నాట్లు వేసే సమయంలో గిరిజన సంఘం నాయకత్వాన గిరిజనులు కూలీ రేట్లు ప్రకటించి భూస్వాములు వాటిని అమలు జరపాలని డిమాండ్ చేశారు. నూతన కూలీరేట్లు ప్రకటిస్తూ గిరిజనులు సభలు, ప్రదర్శనలు విస్తృతంగా జరిపారు. ఐక్యంగా పోరాడుతున్న గిరిజనులు విజయాలను సాధించడంతో ఈ ఉద్యమం సముద్ర కెరటంలాగా నూతన ప్రాంతాలకు విస్తృతంగా వ్యాపించింది. భూస్వాములు కొయ్యబారి పోయారు. ఆప్రాంతం లోని భూస్వాముల దుర్గం గుమ్మలక్ష్మీపురానికి కూడా ఉద్యమం విస్తరించింది. భూస్వాములు రహస్యంగా దుర్మార్గమైన పథకాలు పన్నారు. గుమ్మలక్ష్మీపురం భూస్వాములకు వాస్తవంగా పిచ్చెత్తిపోయింది. ముందుగా కుట్ర చేసిన ప్రకారమే భూస్వాములే ముందుగా తమ పశువుల పాకను తగులబెట్టారు. ఇక 'కమ్యూనిస్టులచే గృహదహనాలు' గురించి పోలీసు స్టేషనుకు ఫిర్యాదులు వెళ్ళాయి. గిరిజనుపై ప్రత్యక్ష దాడులు ప్రారంభమయ్యాయి. భూస్వాములు హైదరాబాదు సందర్శించారు. దానితో ఆ ప్రాంతం లోకి అదనపు పోలీసు బలగం దిగింది. 1967 జులై 24 నుండి ఆగస్టు 25 వరకు కొండ ప్రాంతం లోని గిరిజన గూడెములతో సహా 200 గ్రామాలలో 144వ సెక్షను క్రింద నిషేదాజ్ఞలు జారీ చేశారు. గుమ్మలక్ష్మీపురంలోను, లక్క గూడలోను పోలీసుల కవాతుల ప్రదర్శనలు నిత్యకృత్యమై పోయాయి. పోలీసుల అత్యాచారాలు, భూస్వాముల దౌర్జన్యకాండ తీవ్ర స్థాయికి చేరింది. అమాయకులైన చదువురాని గిరిజనులు ఈ అనుభవాల నుండి రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు. ఈ కొద్ది మాసాల స్వల్పకాలం లోనే అనుభవజ్ఞులైన భూస్వాములు, ప్రభుత్వ ఉపాధ్యాయులు మంచి సమన్వయంతో సాగించిన దాడులతో నిరక్షరాస్యులైన ఆటవిక జాతులకు విజ్ఞానాన్ని విస్తృతపర్చి అభివృద్ధి చేశారు.

ఈ విధంగా భూస్వాములు, ప్రభుత్వం ఎన్ని రెచ్చ గొట్టే చర్యలకు పాల్పడినా గిరిజనులు తమ ఐక్య మిలిటెంట్ గిరిజన సంఘము ఉద్యమ కార్యకలాపాలను కొనసాగించి తన పలుకుబడి ప్రాంతాన్ని విస్తరింపజేసింది. అధిక వేతనాలకోసం, భూమి కోసం ఉద్యమ కార్యకలాపాలు ముమ్మరంగా సాగిన ఈ కొద్ది నెలల్లోనే వందలాది మంది గిరిజనులు చావగొట్టబడ్డారు. కొన్ని వందల మందిని భయపెట్టటానికి, హింసించటానికి పోలీసు స్టేషన్లకు లాక్కెళ్ళారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అయిన కామ్రేడ్ అప్పలసూరితో సహా గిరిజన కార్యకర్తలు అరెస్టు చేయబడ్డారు.

భూస్వాములు గిరిజనులపై సాగించిన క్రూర హింసాకాండకు అనేక వేల ఉదాహరణలు ఇవ్వవచ్చును. ఈ ప్రాంతంలో భూస్వాములకు వ్యతిరేకంగా గిరిజనులు సాయుధ ఎదురుదెబ్బలు తీయటానికి దారితీసిన ఈ సంఘటనల ధోరణిని అర్థం చేసుకోడానికి పైన యిచ్చిన కొద్ది ఉదాహరణలు చాలని భావిస్తున్నాను.

క్రియలో ప్రజాస్వామ్యం

ప్రమాదకర పరిస్థితికి దారితీస్తున్న ఈ పరిస్థితుల్లోనే "భూస్వాముల ప్రత్యక్ష ప్రేరణతో" 144 సెక్షను ప్రకటించడాన్ని అసంఖ్యాక ప్రజలను చావగొట్టడాన్ని 1967 ఆగస్టు 18న ఒక పత్రికా గోష్టిలో నేను ఖండించాను. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్-18-8-1967) "144 సెక్షను ఉపసంహరించాలని పోలీసు నిర్బంధాన్ని నిలిపివేయాలని, నిష్పాక్షికమైన, నిజమైన విచారణ జరిపించడానికి అనువైన వాతావరణాన్ని కల్పించాలని" నేను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానని " ఇండియన్ ఎక్స్‌ప్రెస్" ఆ సమయంలో తెలియజేసింది.

నా ప్రకటనకు సమాధానంగా " శ్రీకాకుళం జిల్లా పోలీసు ప్రతినిధి" ఒకరు విజయనగరము నుండి "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" (20-8-1967) ద్వారా "పార్వతీపురం తాలూకా ఏజెన్సీ ప్రాంతం లోని ప్రస్తుత ఉద్రిక్తతకు బాధ్యత అతివాద కమ్యూనిస్టులదే" అని, "వారు వ్యవసాయ కూలీలను తిరుగుబాటుకు రెచ్చగొట్టటం ప్రారంభించార"ని, "వ్యవసాయ కూలీలు డిమాండ్ చేస్తున్న నాట్లకూలి రేట్లు చాలా హెచ్చుగా ఉన్నాయ"ని ప్రకటించాడు.

ఈ ప్రకటనల ద్వారా పోలీసులు రాజకీయ వేత్తలుగా తయారవడమే గాక, భూస్వాముల ఏజంట్లని కూడా నిరూపించుకున్నారు. అధిక కూలి రేట్లకోసం డిమాండ్ చేస్తున్న గిరిజనులకు వ్యతిరేకంగా పోలీసులు బహిరంగంగా ముందుకు వచ్చారు. ఆవిధంగా యథాతథ స్థితిని నిలబెట్టాలని కోరుకుంటున్న భూస్వాములకు తమ బహిరంగ మద్దతును పోలీసులే ప్రకటించారు. పోలీసుల ప్రతినిధి తన ప్రకటనలో " చైనా అనుకూల పార్టీ " గురించి, "హింసాయుత నినాదాలు, భూస్వాములను హింసాయుతంగా బెదిరిస్తున్న" ప్రదర్శకుల గురించి కూడా ప్రస్తావించారు.

ఆవిధంగా వాస్తవికమైన, నిష్పాక్షికమైన న్యాయ విచారణ జరపాలని నేను ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి రాజకీయవేత్తగా మారిన ఒక చిన్న పోలీసు అధికారి

ద్వారా త్రోసిపుచ్చబడింది. ఇది భూస్వాములు బరితెగించి గిరిజనులకు వ్యతిరేకంగా మరిన్ని హింసాకృత్యాలకు పాల్పడేందుకు దారితీసింది. ఆ విధంగా 1967 అక్టోబరులో ఇద్దరు గిరిజనులను భూస్వాములు దారుణంగా కాల్చివేయడానికి దారి తీసింది.

ఇద్దరు గిరిజనులను హత్యచేసిన భూస్వాముల పై ఎట్టి చర్యలు గైకొనకుండా పోలీసుశాఖ పై నుండి క్రింద వరకు గిరిజనులపై, కమ్యూనిస్టులపై అతివేగంగా విరుచుకపడింది. గిరిజనుల అరాచ కత్వం గురించి కథలు విపరీతంగా ప్రచారం చేయబడ్డాయి. అన్ని రకాల అణచివేత చర్యలూ అమలు జేశారు. 1968 ఫిబ్రవరిలో "హిందూ" పేర్కొన్నట్లు "గుమ్మలక్ష్మీపురానికి ఒక మైలు దూరంలో గల లేవిడి గ్రామంలో ఇద్దరు వ్యక్తులు కాల్చివేయబడిన అనంతరం ఆ ప్రాంతంలో ఉద్రిక్తత తీవ్రస్థాయికి చేరుకున్నది." భూస్వాము లు ఇద్దరు గిరిజనులను దారుణంగా హత్య చేసిన తరువాత, ఈ హత్యలకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్య తీసు కోక పోవడంతోనే ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం తీవ్రస్థాయికి చేరుకుంటున్నదనే విషయం " హిందూ" ప్రచు రించిన రిపోర్టును బట్టి కూడా స్పష్టమవుతున్నది. వాస్తవానికి ఆ ఇద్దరు గిరిజనులను స్వయంగా కాల్చివేసిన భూస్వాములు స్వేచ్ఛగా తిరుగుతున్న విషయం, వాళ్ళ ఇళ్ళల్లోనే నివశిస్తున్న విషయం ఆ ప్రాంతంలో ఉన్నవారందరికీ బాగా తెలుసు. అయినా వారిని అరెస్టు చేయడానికి పోలీసులు ఎలాంటి చర్యా తీసుకోలేదు.

ఈ పరిస్థితుల్లోనే 1968 మార్చి 4వ తేదీన "గ్రామాల్లో మళ్లీ ఫ్యూడల్ శక్తులు తలెత్తి ఘోర కృత్యాలకు పాల్పడుతున్నార"ని (హిందూ-6-3-1968) "ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తీవ్ర పరిణామాలు సంభవిస్తాయ"ని (దక్కన్ క్రానికల్-6-3-1968) ప్రభుత్వానికి నేను హెచ్చరిక చేశాను. ఈ సంఘటనపై విచారణ జరపాలని కూడా ఆసమయంలో నేను డిమాండ్ చేశాను.

వేలాది మంది గిరిజనులను అరెస్టుచేయడమే కాక పోలీసులు, భూస్వామ్య గుండాలువారి ఇండ్లను లూఠిచేశారు. అనేక మంది స్త్రీలను బాధిం చారు. అంతేకాదు గిరిజనులు కాల్చి చంపబడ్డారు. అయితే ఈసారి కాల్చింది పోలీసులు. 1968 మార్చి మొదటివారంలో పెద్దఖర్జ గ్రామంలో పోలీసులు కాల్పులు సాగించి అక్కడికక్కడే ఇద్దరిని హత్యచేసి ఇంకా అనేక మందిని గాయ పర్చారు. వివిధ తప్పుడు ఆరోపణలపై 3500 మంది గిరిజనులకు తక్కువ కాకుండా అరెస్టు చేయబడ్డారని ఆ కాలంలో నేను శాసనసభలో తెలియజేశాను. (1968మార్చి 6 - ఆంధ్రజ్యోతి) తర్వాత కొద్ది రోజుల్లోనే "ఆ ప్రాంతం లో వరసగా జరుగుతున్న సంఘటనలు గురించి అక్కడ నెలకొని ఉన్న అశాంతిని గురించి విచారణ జరిపించాలని" డిమాండ్ చేశాను. (దక్కన్ క్రానికల్ 9-3-68). దీనికి సమాధానంగా "అతివాద కమ్యూనిస్టులు తమ కార్యకలాపాలను నిలిపి వేయాల"ని, "ఎంతకైనా తెగించి అయినా ఆ ప్రాంతంలో శాంతి నెలకొల్పాల"ని చెప్తూ ముఖ్య మంత్రి డిమాండ్‌ను తిరస్కరించాడు (హిందూ). నాజీ కాన్‌సెన్‌ట్రేషన్ క్యాంపుల్లోని చిత్రహింసలను పోలినరీతిలో పరిస్థితులు ప్రమాదకరంగా కనిపిస్తు న్నప్పుడు దక్షిణ వియత్నాంలో వలె భూస్వాములు, పోలీసులు గ్రామాలను ధ్వంసం చేస్తుంటే; బొర్రగూడ గ్రామంలో పోలీసుగుండాలు అసంఖ్యాకమైన స్త్రీలపై అత్యాచారాలు సాగించిన సంఘటనల ఆధారంగా నిష్పాక్షిక విచారణ జరిపించమని మరొకసారి డిమాండ్ చేశాను. అన్ని ప్రతిపక్ష పార్టీలు ఈ డిమాండును బలపర్చినా ముఖ్యమంత్రి మాత్రం మరల త్రోసిపుచ్చాడు. "కమిటీ ఏర్పాటుకు సమయం ఇదికాదని పార్వతీపురం గిరిజన ఏజన్సీ సమస్య ప్రాథమికంగా శాంతి భద్రతల సమస్యే" నని ముఖ్యమంత్రి చెప్పారు.

(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ -మార్చి 13,1968)

బూర్జువా పత్రికలు సైతం విచారణ విధిగా అవ సరమని అభిప్రాయపడ్డారు. "దక్కన్ క్రానికల్ "పత్రిక అసెంబ్లీ సమావేశాలను సమీక్షిస్తూ " శ్రీ నాగిరెడ్డి ప్రస్తావించిన సంఘటనలపై అఖిలపక్ష విచారణ జరుపవలసిన అగత్యం ఉంది. మార్క్సిస్టు నాయకుల సంతృప్తి కోసమే గాక చట్టబద్ధ పరి పాలనలో ఆసక్తిగల వారందరికి కోసం కూడా నిష్పాక్షిక సంఘాన్ని ఏర్పాటు చేసి వాస్తవాలేమిటో వెలికి లాగడం అవసరం" అని వ్రాసింది(12.3.68).

ఈ అసెంబ్లీ సమావేశాల గురించి వ్రాస్తూ "టైమ్స్ ఆఫ్ ఇండియా" 22-3-1968న "శ్రీ కాకుళంలో వరుసగా జరిగిన అనేక సంఘటనలపై న్యాయ విచారణ జరిపించాలని ప్రతిపక్షం వారు చేసిన డిమాండ్లను ముఖ్యమంత్రి పట్టుదలతో త్రోసి పుచ్చార"ని, " పోలీసు కాల్పుల వల్ల, సంఘర్షణ వల్ల పార్వతీపురం గిరిజన ప్రాంతంలో ఇంకేమైనా చావులు సంభ విస్తే దానికి మార్క్సిస్టు కమ్యూనిస్టులే బాధ్యత వహించవలసి ఉంటుందని ముఖ్యమంత్రి ఆయనకు (నాగిరెడ్డికి) చెప్పాడ"ని వ్రాసింది. ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలను మూకుమ్మడిగా హత్యలు చేసేందుకై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పన్నిన క్రూరమైన పథకం ఈ విధంగా నగ్నంగా బయటపడింది. "టైమ్స్ ఆఫ్ ఇండియా" వ్రాసినట్లుగా "తరుచుగా జరిగే తగాదాలలో మైదానప్రాంతాల వారి పక్షం వహించడమే ఇంత వరకూ పోలీసులకు తేలికగా ఉంటున్నది." కాబట్టి ఆ ప్రాంతంలో అప్పటికే జరుగుతున్న దాని బహిరంగ వ్యక్తీకరణే ముఖ్యమంత్రి ప్రకటన అని, ఆ పరిస్థితిని మరింత విషమం చేయ దల్చారని తేటతెల్లం అవుతూంది.

తమ న్యాయమైన కోర్కెల కోసం సంఘటి తంగా పోరాడుతున్న ప్రజలను అణచడానికి ప్రభుత్వము, భూస్వాములు ఎలా కుట్రపన్ను తున్నారో చూపడానికే ఇటీవలి చరిత్రను నేను ఇక్కడ తిరిగి చెప్పవలసి వచ్చింది. ప్రజలకు వ్యతిరేకంగా అన్ని రకాల చట్ట విరుద్ధమైన పద్ధతుల ను ఉపయోగించింది ప్రభుత్వము, భూస్వాములే. గ్రామాల్లో బీభత్సాన్ని సృష్టించింది భూస్వాములు, వారి గుండాలే. ప్రజలకు వ్యతిరేకంగా మొదట తుపాకులతో సహా మారణాయుధాలను వినియో గించింది భూస్వాములే. గిరిజనులపై కాల్పులు సాగించింది పోలీసులే. రైతాంగంపై బహిరంగంగా యుద్ధాన్ని ప్రకటించింది భూస్వాములూ, ప్రభుత్వమే.

పీడిత ప్రజల డిమాండ్లు ఎంత న్యాయమైనవి అయినప్పటికీ వారిని అణచడానికి ఈ భూస్వామ్య ప్రభుత్వానికి చట్టబద్ధపరిధులంటూ ఏమీలేవని రైతులు గుర్తించారు. తాము సాగించిన ప్రతిచట్ట బద్ధమైన ఆందోళన తమపై చట్ట విరుద్ధమైన క్రూరమైన పీడనను రుద్దిందని తెలుసుకున్నాకనే వారీ విషయాన్ని గుర్తించగలిగారు. భూస్వాములు, ప్రభుత్వాధికార్లు తమపై బలవంతంగా రుద్దుతున్న వెట్టి చాకిరీ, మామూళ్ళ గురించి తాము ప్రభుత్వా నికి చేసుకున్న విజ్ఞాపనలు బుట్టదాఖలు చేయ బడటం ప్రజలు గమనించారు. అతి హీనమైన వేతనాల గురించి వారు చేసుకున్న విజ్ఞప్తులను

"చరిత్రలోని ప్రస్తుత ఘట్టంలో - జగమొండి వాళ్ళయిన బ్లాక్ హండ్రెడ్స్ మూడవ డ్యూమా (పార్లమెంటు)లో కేకలూ బొబ్బలూ పెడుతూ చిందులు తొక్కుతూన్న ప్రస్తుత సమయంలో, తీవ్ర విప్లవ ప్రతీఘాతుకత్వం పతాకస్థాయికి చేరుకున్న సమయంలో; సాధారణంగా విప్లవ కారుల మీదా, ప్రత్యేకించి రెండవ డ్యూమాలోని సోషల్ డెమాక్రాటిక్ ప్రతినిధుల మీదా అభివృద్ధి నిరోధకత్వం అనాగరికమైన రాజకీయ ప్రతీకార చర్యలను సాగిస్తున్న ఈ సమయంలో -'విశాల' వ్యవసాయ కార్యక్రమానికి ప్రస్తుత సమయం 'తగినదికాద' న్న (Unsuitable) ఆలోచన రానీయకూడదు. అలా ఆలోచించడమంటే రష్యాలోని సోషల్ డెమాక్రాటిక్ పార్టీకి చెందిన పెటీ బూర్జువా మేధావుల్లో ఆ పార్టీపట్ల సానుభూతి వహించే వారిలో విస్తృతంగా వ్యాపించిన వెనక్కి జారేతత్వం, నిరాశ నిస్పృహలు, క్షీణత, హీనత్వం లాంటి స్వభావాలకు లోనవడంతో సమానమవు తుంది. కార్మికవర్గపార్టీ శ్రేణులలో నుండి ఇలాంటి చెత్తనంతటిని తుడిచివేయడం ద్వారా శ్రామికవర్గం మేలే పొంద గలుగుతుంది. అభివృద్ధి నిరోధకులు ఎంతగా క్రూరంగా వ్యవహరిస్తారో, అంతగా అది అనివార్యమైన ఆర్థికాభివృద్ధిని క్షీణింపజేస్తుంది: మరింత విస్తృతమైన ప్రజాస్వామిక ఉద్యమ వెల్లువను అంతగా విజయవంతంగా సిద్ధం చేస్తుంది. కార్యాచరణలో వచ్చిన తాత్కాలిక స్తబ్ధతను మనం అవకాశంగా తీసుకొని మహత్తర విప్లవం యొక్క అనుభవాలను విమర్శనాత్మకంగా అధ్యయనం చేయాలి. ఈ అనుభవాలను సరిచూసుకొని, చెత్తా చెదారం ఏరేసి రాబోవు పోరాటానికి మార్గదర్శకత్వంగా వినియోగపడేందుకు ఈ అనుభవాలను ప్రజానీకానికి అందించాలి." (లెనిన్ - అగ్రేరియన్ ప్రోగ్రాం ఆఫ్ సోషల్ డెమాక్రసీ - కలెక్టెడ్ వర్క్స్ వాల్యూం 13 - పేజి 439)

బూర్జువా భూస్వామ్య ప్రభుత్వం రాజకీయ ప్రతీకారంతో క్రూరచర్యలకు పాలుపడుతున్న ఈ సమయంలో అనివార్యమైన గందరగోళం వ్యాపించి ఉన్న ఈ సమయంలో విప్లవోద్యమంలోని కొన్ని సెక్షనులు దిగజారి పోయాయి. విప్లవోద్యమానికి వివిధ రూపాలలో ద్రోహం చేస్తాయి. రైతాంగ వ్యవసాయక విప్లవం కోసం రైతాంగ చర్యలు 'తగనివి'గా ప్రకటించడం ద్వారా తమ రివిజనిస్టు పాత్రను సమర్థించుకొనేవారు ఈ సమయంలో చాలామంది ఉంటారు. ఉద్యమంలో తాత్కాలికంగా వచ్చిన స్తబ్ధతను అవకాశంగా తీసుకొని విప్లవశ్రేణులను విచ్ఛిన్నం చేయటానికి, దిగజార్చటానికి ప్రభుత్వ నిర్బంధంతోపాటు అన్ని రకాల పద్ధతులను వారు ఉపయోగిస్తారు. ఇప్పటి వరకు జరిగిన మహత్తర పోరాటాల అనుభవాలను విశ్లేషించి వివరించడం నేడు విప్లవకారుల కర్తవ్యంగా ఉంది. అంతేగాక రాబోవు పోరాటాలకు ప్రజలను సిద్ధంచేసేందుకుగాను ఈ అనుభవాలను ప్రజలకు నేరుగా అందించడం ద్వారా వ్యవసాయక కార్యక్రమాన్ని మరింతగా అమలు చేయడానికి సిద్ధం చేయడం కూడా విప్లవకారుల నేటి కర్తవ్యం.

(ఈ భాగం కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి - "తాకట్టులో భారతదేశం" నుంచి తీసుకోబడింది)

★



తెలంగాణా సాయుధ పోరులో - నక్సల్బరీ నడిబొడ్డులో
సిరికాకుళ కొండల సీమలో - గోదావరిలోయ అడవిలో
కరీంనగర్ కదన భూమి - ప్రతిఘటన పంటలల్ల
ఎర్రనైన జెండాలెత్తి అమరులైన వీరులాకు దండాలు

కనీసం విచారించలేదు. భూస్వాములు తమ భూములను అక్రమంగా, ఆక్రమించుకోవడం గురించి పెట్టుకున్న పిటిషన్‌లు, సాగించిన ఆందోళన రాజ్యాంగానికి బద్ధులైన పాలకుల్ని ఏమాత్రం కదిలించలేక పోయాయి. కాగా మరో వైపున ప్రజలపై అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు, చిత్రహింసలు, కాల్పులు నిత్యకృత్యమై పోయాయి.

ఎవరు కుట్రదారులు? అని నేను అడగాలను కొంటున్నాను. అతి హేయమైన భూస్వాములు, వారి తొత్తు ప్రభుత్వం యొక్క దుస్సాహసికుల చట్టవిరుద్ధమైన, నీతి బాహ్యమైన దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అత్యంత సాహసంతో పోరాటం సాగించిన ప్రజలా కుట్రదారులు? లేక గత అనేక సంవత్సరాలుగా రాజ్యాంగ సూత్రాల న్నింటికి విరుద్ధంగా వ్యవహరించి, ప్రజల భూములనీ శ్రమనూ కొల్లగొట్టడమేగాక, ప్లేగు వ్యాధిలా బాధించి, వారి పోరాటతత్వాన్ని నాశనం చేసేందుకై అక్రమ అరెస్టులు, చిత్రహింసలు చివరికి కాల్పులతో వారిపై నాజీల క్రౌర్యాన్ని ప్రదర్శించిన భూస్వాములూ వారి ప్రభుత్వమా కుట్రదారులు?

ప్రస్తుతానికి గిరిజనులు సాగించిన మహత్తర ప్రతిఘటన తాత్కాలికంగా వెనుకడుగు వేయడం చూసి బూర్జువాపార్టీలు వారి భృతులు ఎంతో మహోత్సాహంతో చంకలు కొట్టుకుంటున్నారు. తీవ్రమైన నిర్బంధకాండ తాత్కాలికంగా విజయం సాధించవచ్చును.

అయితే దీనికి సమాధానంగా 1848లో సంభవించిన సాధారణ అనుభవాలు, ప్రత్యేకించి జర్మన్ విప్లవం అనుభవాలను ఆధారంచేసుకొని మార్క్స్, ఎంగెల్స్‌లు తమ "జర్మనీ-విప్లవం-ప్రతీఘాతక విప్లవం" అనే గ్రంధంలో వ్రాసిన వ్యాఖ్యలను ఉదహరించటం కంటే ఉత్తమం మరొకటిలేదు. ఆ గ్రంధంలో వారిలా వ్రాశారు.

"యుద్ధరేఖలోని అన్ని అంశాల్లోనూ(యూరపు) ఖండ విప్లవపార్టీ (Continental Revolutionary Party) - పార్టీలు అనడం సరిగా ఉంటుంది. ఎదుర్కొన్న ఖచ్చితమైన ఓటమికన్నా పెద్ద ఓటమిని వూహించడం సాధ్యంకాదు. కానీ అయితేనేం? తమ సాంఘిక ఆర్థిక ఆధిక్యతకోసం బ్రిటీష్ మధ్యతరగతి వర్గాల పోరాటం 48 ఏళ్లపాటు ప్రెంచి మధ్యతరగతి వర్గాల పోరాటం 40 ఏళ్లపాటూ నిరంతరంగా సాగలేదా? కాని వాస్తవానికి వారి (మధ్యతరగతి వర్గం-అను) పోరాటం పునరుద్ధ రించబడిన రాజరికం, తాను గతంలో ఎప్పటికంటే కూడ మరింత దృఢంగా స్థిరపడినట్లు భావించిన ఆ క్షణంలో కంటే విజయానికి దగ్గరగా ఎప్పుడైనా ఉందా?...కాబట్టి మనం గనక ఓడించబడినట్ట యితే, మళ్ళీ మొదటి నుంచి మన కృషిని ప్రారంభించటం కన్నా మనం చేయాల్సింది మరేమీ ఉండదు. అయితే అదృష్టంకొద్దీ, ఉద్యమం మొదటి రంగం ముగింపుకి రెండో రంగం ప్రారంభానికి మధ్య మనకు అనుమతించబడిన అతికొద్ది విరామ కాలాన్ని (పోరాటం) ఆలస్యంగా ప్రజ్వరిల్లడాన్నీ, దాని ఓటమిని కూడా ఆగత్యం చేసిన కారణాలని అధ్యయనం చేయడం అనే ఒక అత్యవసరమైన పనికి కావాల్సిన సమయాన్ని ఇస్తోంది. అయితే కొందరు నాయకుల యాదృచ్ఛిక ప్రయత్నాల్లోనో, సామర్థ్యాల్లోనో, తప్పుల్లోనో, పొరపాట్లలోనో లేక విద్రోహాల్లోనో ఈ కారణాలని వెదకకూడదు; అలాకాక విప్లవంతో గడగడలాడిన ప్రతిదేశంలోని సాధారణ, సాంఘిక స్థితిగతుల్లోనూ, జీవన పరిస్థితు ల్లోనూ కారణాలను అన్వేషించాలి. విప్లవ ప్రతీ ఘాతుకత్వం విజయాలకు కారణాన్ని గురించి దర్యాప్తు చేసినప్పుడు, ఫలానా ఈ పౌరుడో లేక ఆ పౌరుడో ప్రజలకు "విద్రోహం" చేశాడంటూ తయారుగా ఉన్న జవాబొకటి మనకి ప్రతిచోటా విన్పి స్తుంటుంది. వరిస్థితులను బట్టి ఈ సమాధానం నిజం కావచ్చును కాకపోవచ్చును. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ విషయాన్నీ వివరించి చెప్పదు. కనీసం తాము ఆ విధంగా విద్రోహానికి గురయ్యేలా 'ప్రజలు' ఊరుకుండిపోవడం ఎలా జరిగిందో కూడా ఆ సమాధానం చూపదు. ఫలానా ఒక పౌరుణ్ణి విశ్వసించకూడదు అన్న వాస్తవాన్నొకదాన్ని ఎరిగి ఉండి, అదే విజ్ఞాన సర్వస్వంగా ఉన్న రాజకీయపార్టీ దేనికైనా ఏమి భవితవ్యం ఉంటుందిక!'

అందువల్ల ఉద్యమం యొక్క ప్రతి అంశాన్నీ లోతుగా అధ్యయనం చేయడానికి; కొన్ని సాధారణ నిర్ధారణలకు రావటానికి; పోరాటాన్ని విస్తృతపరి చేందుకు, తీవ్రపరిచేందుకు గాను మరిన్ని విలువైన అనుభవాలను సంపాదించేందుకు - తాత్కాలిక ఓటములని విప్లవకారులు ఉపయోగించుకోవాలి. విప్లవ ప్రతీఘాతకులు పాలకవర్గాలు తమ తాత్కాలిక ఉత్సాహాన్ని మిద్దెలెక్కి గట్టిగా ప్రకటించుకోనీయండి : అయితే అది అనతి కాలంలోనే అంతరిస్తుందని విప్లవ కారులకు తెలుసు. అలా నవ్వినవాళ్ళే చివరికి నవ్వుల పాలవుతారు. అందుకే ఇంగ్లాండులో 1640 -80 మధ్య, ఫ్రాన్సులో 1729-1830 మధ్య రాచరికం పునరుద్ధరించబడినప్పుడు దానిని గూర్చి మార్క్స్, ఎంగెల్స్‌లు ఇలా అన్నారు. "కాని వాస్తవానికి వారి (మధ్య తరగతి వర్గం-రచయిత) పోరాటం-పునరుద్ధరింబడిన రాచరికం, తాను గతంలో ఎప్పటికంటే కూడ మరింత దృఢంగా స్థిరపడినట్లు భావించిన - ఆ క్షణంలోకంటే విజయానికి దగ్గరగా ఎపుడైనా ఉందా?"

చివరికి బ్రిటిష్ ప్రత్యక్ష పాలనా కాలంలో కూడా ఎన్నడూ కనీ వినీ ఎరుగనంతగా ఈ బూర్జువా భూస్వామ్య ప్రభుత్వం బీభత్సం సృష్టించి ప్రజలపై విజయం సాధించానన్న భ్రమలో తాత్కాలికంగా ఉత్సాహపడిపోతోంది. "తాను గతంలో ఎప్పటి కంటే కూడా మరింత దృఢంగా స్థిరపడ్డాన"ని భావిస్తోంది. ఈ 5 సంవత్సరాలు గడగడ లాడించిన ఉజ్వలమైన చరిత్రని చారిత్రకంగా, ఆత్మ విమర్శనాత్మకంగా సమీక్షించుకోవడం ఈ "అతికొద్ది విరామకాలం"లో విప్లవకారుల కర్తవ్యం. మార్క్స్ చెప్పినట్లు -" విప్లవ వెల్లువకి, దాని అణచివేతకీ కూడా గల కారణాలను గురించి లోతుగా తెలుసుకోవడం, వాటిని వివరించు కోవడం చారిత్రక దృష్టిలో అత్యంత ప్రాధాన్యత గలవి గూడ." (కార్ల్ మార్క్స్ - సెలెక్టెడ్ వర్క్స్)-లారెన్స్ అండ్ విషార్ట్ లిమిటెడ్ 1943-వాల్యూం-II-పేజీ 41)

ఈ సమయంలో, బడాబూర్జువా భూస్వామ్య ప్రభుత్వం సాగించుతూన్న పాశవికనిర్బంధాన్ని కూడా అవకాశంగా చేసుకొని, రైతాంగ వ్యవసాయ విప్లవం ఈనాడు 'సరిపడనిదం' టూ (Unsuitability) రైతాంగ ప్రజల్లోనూ, కేడర్లలోనూ నిరాశా నిస్పృహలను, దిగజారుడును వ్యాపింపచేయాలని ప్రయత్నించే వాళ్ళు రివిజనిస్టుల్లాగా అనేకులు ఉంటారు. అయితే ఈనాడు బూర్జువావర్గం నానాటికి పెరుగుతూన్న సర్వతోముఖ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని ఎరిగిన విప్లవకారులకి పాలక వర్గాల మహదానందం మూడునాళ్ల ముచ్చట అని తెలుసు. 1907లో లెనిన్ చెప్పిన ఈ మాటలను విప్లవకారులు తమ మనసులో పెట్టుకొని వాటి ప్రకారం కృషి చేయాలి.

ఈ నేలన చిట్లిన రక్తనాళాలు ఒక్కటై పైకిలేచి
శక్తులను చిమ్మి విప్లవ విజయానకాశాలను
చిగురేసినట్టుంది.
ఈ నేలన ఒరిగిన వీరుల కళేబరాలు కూడబలుక్కొని
ఏకమై
దారులు కలుస్తున్న కూడలిలో దృఢసంకల్పాల
పునాది నుండి
దిగ్గున దిక్కూచై లేచినట్టుంది.
ఈ మట్టినుండి పెల్లుబికిన మహోద్యమాల గుండెకాయలో
కాగి లేచిన గునపం గగనాన గుచ్చుకున్నట్టుంది.
పడిలేచి నిలువునా స్థంభించిన నెత్తురుటేరు లాల్సలామై
ఇక్కడి వరకు నడిచొచ్చి నేలను కూలకుండా
నింగికెగబొడిచినట్టుంది.
విప్లవోద్యమం సమీక్షకొచ్చి నిలబడినట్టుంది
నిలకడైన ఉద్యమాల తూర్పు ఆకాశం నుదుటన
నిలువుబొట్టు దిద్దినట్టుంది.

- ఛాయారాజ్

58A

శ్రీకాకుళం జిల్లా కమ్యూనిస్టు విప్లవోద్యమ యోధుల

అమరస్మృతి

జిల్లాల్లో సభలు, ప్రదర్శనలు



అనంతపురంలో జరిగిన కా॥ మండ్ల సుబ్బారెడ్డి ప్రథమ వర్థంతి సభలో వేదికపై ఎడమ నుంచి కామ్రేడ్స్ సి. పెద్దన్న, ఝాన్సీ, పి.కె.మూర్తి, కె. కోటయ్య, గుర్రం విజయకుమార్.



కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి ప్రథమ వర్థంతి సందర్భంగా జరిగిన ఉరేగింపు.



కొయ్యలగూడెంలో 3-8-02 న గిరిజన సమస్యలపై జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కా॥ ఝాన్సీ, వేదికపై ఎడమ నుంచి కామ్రేడ్స్ రంగనాథ్, సోమరాజన్న,కె.కోటయ్య, కుంజం రామారావు.



ఏలూరులో 3-6-02న జరిగిన గిరిజనుల ప్రదర్శన



విశాఖ సదస్సుకు హాజరైన ప్రతినిధులు



విశాఖ సదస్సు సందర్భంగా జరిగిన ఊరేగింపు దృశ్యం.

జిల్లాల్లో కార్యక్రమాలు



దుగ్గేరు సభలో పాల్గొన్న ప్రజలు



జనం పాటలు పాడుతున్న కళాకారులు



గిరిజన సమస్యలపై 25-2-02న సాలూరులో ధర్నా



పత్తి, మిర్చి, పొగాకు పంటలకు గిట్టుబాటు ధరల కోసం 29-1-02 న
నందిగామలో ధర్నా



దుగ్గేరులో 16-9-01న జరిగిన మెడికల్ క్యాంప్



ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం 16-2-02 న బందర్‌లో ధర్నా



గబ్బిలం బుర్రకథ రాసీ - గవర్నరు పేటల జెపితె
గావుకేకలు పెట్టిండ్రో అన్నా అయ్యాల్ల
గాడిదలమని కొట్టిండ్రో అన్నా అయ్యాల్ల
గారడేదో చేస్తుండ్రన్న ఇయ్యాల్ల

అందరాము మడుసులామె - అందిరిలో వుందిరక్తమె
కులముతోని - కుక్కలమని
ఊరిబయట వుంచిండ్రో అన్నా - అయ్యాల్ల
ఉసురుతినీ వూరిండ్రో అన్నా అయ్యాల్ల
ఉత్త కబుర్లూ చెబుతుండ్రన్న ఇయ్యాల్ల

మాల మాదిగ సీలికబెట్టి - ఉద్ధరణ అని ఫోజులు బెట్టి
బంజెరు భూములు - ఇండ్ల జాగలు
ఆశలు చూపి ఆడిస్తుండ్రన్న - ఇయ్యాల్ల
హరిజనులని పేరు బెట్టిండ్రు అన్నా ఇయ్యాల్ల
అందరితో వేరు చేస్తుండ్రన్నా ఇయ్యాల్ల

చిన్న తప్పను పెద్దగ జూపి - గుండు సూదినీ గొడ్డలి జేసి
కంచికచర్ల కాళరాత్రుల
సజీవంగా సంపిడ్రో అన్నా అయ్యాల్ల
కట్టెసి కాలబెట్టిండ్రో అన్నా అయ్యాల్ల
మాటలతో మాయజేస్తుండ్రన్న ఇయ్యాల్ల

కూడు సాలత లేదంటే - కూలిరేటూ పెంచమంటే
మదరాసు కీలవేన్మణిలోన
మాలగూడెమే కాల్చిండ్రో అన్నా అయ్యాల్ల
నలభై మందిని సంపిండ్రో అన్నా అయ్యాల్ల
నవ్వుతు మాతిలో తోస్తుండ్రన్న ఇయ్యాల్ల

మదముతో మానభంగాలు - గర్వంతో గృహదహనాలు
ప్రతిపూట - ప్రతి చోట
నిర్భయంగా చేస్తుండ్రో అన్నా ఇయ్యాల్ల
న్యాయమడిగితె సంపుతుండ్రన్నా ఇయ్యాల్ల
నీతులు గోతులు తీస్తుండ్రన్నా ఇయ్యాల్ల

భూస్వాముల ఈ పరిపాలన - నాయకుల ఈ నయవంచన
ఆగేదాక - అంతమయ్యేదాక
కలిసీ కొట్లాడుండ్రో అన్నా - ఇయ్యాల్ల
దోపిడి రూపు మాపుండ్రో అన్నా ఇయ్యాల్ల
కలిసీ కొట్లాడుండ్రో అన్నా ఇయ్యాల్ల

- నవోదయ

కామ్రేడ్ అంగడి చెన్నయ్యకి
విప్లవ జోహార్లు



వీడిత, దళిత ప్రజల నాయకుడు, గుంటూరు జిల్లాలో అనేక ప్రజాపోరాటాలను నడిపిన యోధుడు, సి.పి.ఐ.(యం.యల్) యూనిటీ ఇనిషియేటివ్ రాష్ట్రకమిటీ సభ్యుడు అయిన కామ్రేడ్ అంగడి చెన్నయ్యను 11-12-2001న ఉదయం 8 గంటలకు గుంటూరులోని ఆయన స్వగృహం సమీపంలో న్యూడెమోక్రసీ పార్టీ ఏర్పరచిన హంతకదళం అమానుషంగా కాల్పులు జరిపి హత్య చేసింది.

గురజాల తాలుకా కొదమగండ్ల గ్రామ శివారు కాకానివారిపాలెంలో కామ్రేడ్ చెన్నయ్య జన్మించాడు. ఆయనది కమ్యూనిస్టు ప్రభావం ఉన్న కుటుంబం. సామాజికంగా అణచివేతకి గురయ్యే మైదాన ప్రాంత ఆదివాసీ తెగకు చెందిన కష్టించే రైతు కుటుంబం. కా॥ చెన్నయ్య ప్రముఖ నాయకులు కోలా సుబ్బారెడ్డి ప్రభావంతో ఉద్యమంతో అనుబంధం ఏర్పరచుకొని 1967 నుండి ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు కమిటీ కాలంలోనూ, తర్వాత కామ్రేడ్ నీలం రామచంద్రయ్య ప్రభావంతో సాధారణ కార్యకర్తగా వుంటున్న వాడు 1973 నుంచి పూర్తికాలపు కార్యకర్త అయ్యాడు. 1975 ఎమర్జన్సీ చీకటి రోజులలో అరెస్టు అయి చిత్రహింసలకు గురయ్యాడు. పార్టీ రహస్యాలు కాపాడాడు. ఈ విధంగా నాటి నుండి నేటి వరకు 30 సంవత్సరాల కాలం పాటు అనేక ఉద్యమాల ద్వారా కార్మిక,రైతాంగ, పీడిత ప్రజలను నడిపించాడు. మిర్చియార్డులో వివిధ రంగాల కార్మికులను సంఘటిత పర్చి పోరాటాలు నిర్వహించచడమే గాక మిర్చియార్డుకి వచ్చే రైతాంగానికి గిట్టుబాటు ధరల కోసం, వారి సరుకుల భద్రత కోసం ఎన్నో ఆందోళనలు నడిపాడు. ఇళ్ళులేని కార్మికులకు కె.వి.పి. కాలనీ ప్రక్కనే సీలింగ్ భూమిని ఆక్రమించి యతిరాజనగర్ ఏర్పాటులో, ఇంకా అనేకచోట్ల ఇళ్ళ కాలనీలు ఏర్పరచడంలో నాయకత్వం వహించాడు. శ్రమ జీవులను మత్తులో ముంచే సారాకి వ్యతిరేకంగా, భ్రమలుపాలు చేసే సింగిల్ నెంబర్ లాటరీలకి వ్యతిరేకంగా కామ్రేడ్ చెన్నయ్య నాయకత్వంలో జరిగిన పోరాటం అందరికీ తెలిసిందే. పల్నాడు ప్రాంతంలో దేవాదాయ, ప్రభుత్వ, ఫారెస్టు, బంజరు భూములకై పీడిత ప్రజలను సమీకరించి నడిపించటంలో కామ్రేడ్ చెన్నయ్య తీవ్రమైన కృషి చేసాడు. ఈవిధంగా పీడిత, తాడిత, దళిత ప్రజలకోసం నిలబడినందుకు మొత్తం 8 సంవత్సరాల కాలం జైలు జీవితం గడిపాడు.

ఈ విధమైన ఉద్యమ దృక్పథంతో సాగించిన కృషి ద్వారా 1978 నుంచి జిల్లాపార్టీ సెక్రటరీగానూ, 1984 నుండి 1998 వరకు న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొనసాగాడు. గుంటూరు పట్టణంలో పార్టీ ఆదేశాలను అమలుచేసే ప్రయత్నంలో గుండాయిజానికి కామ్రేడ్ చెన్నయ్య తమ్ముడు పున్నయ్య, మేనల్లుడు శంకర్‌లు బలైనా చలించకుండా విప్లవ పంథా కోసం నిలబడ్డాడు.

ఈ క్రమంలో న్యూడెమోక్రసీ పార్టీలో నిర్మాణ, రాజకీయ సమస్యలపై ఆంతరంగిక విభేధాలు ఏర్పడ్డాయి. అత్యధిక క్యాడరు, ప్రజలు, న్యూడెమోక్రసీతో విభేదించి కామ్రేడ్ చెన్నయ్య నాయకత్వంలో నిలిచారు. సి.పి.ఐ.(యం.యల్) 'ప్రజాపోరు'గా జిల్లాస్థాయిలో నిర్మాణంగా ఏర్పడి కార్యకలాపాలు సాగించాడు. సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ దృక్పథంతో పనిచేయ ప్రారంభించాడు.

1999 మొదలు గుంటూరు జిల్లాలో జరిగే అనేక కార్యక్రమాలలో, వివిధ రాజకీయ, సామాజిక ఉద్యమశక్తులతోనూ, 9 రాజకీయ పార్టీల కార్యక్రమాలలోనూ 'ప్రజాపోరు' భాగస్వామిగా నిలిచింది. అన్నింటికంటే ముఖ్యంగా ఎన్‌కౌంటర్‌ల నిర్బంధానికి వ్యతిరేకంగా ఏపిసిఎల్‌సి, ఎఐపిఆర్ఎఫ్‌లు తీసుకున్న కార్యక్రమాలలో కా॥ చెన్నయ్య నాయకత్వాన గత 'ప్రజాపోరు' చురుకైన పాత్ర నిర్వహించింది. పోలీసుల కన్నెర్రకి గురైంది. ఈ విధంగా కార్యకలాపాలు సాగిస్తూ విప్లవశక్తులతో ఐక్యతా అవగాహనతో కృషి సాగించాలని నిశ్చయించుకొంది. ఈ విధంగా కా॥ చెన్నయ్య వ్యక్తి కాదని, రాజకీయ విశ్వాసాలు కలవారికి, ప్రజాసంఘాలతో పనిచేసే వారికి సహచరుడని; రైతుకూలీలకి, కార్మికులకి, పట్టణ పేదలు, మధ్యతరగతి శక్తులకు నాయకుడని రుజువు అయింది. కామ్రేడ్ అంగడి చెన్నయ్యకి రైతుకూలీ సంఘం విప్లవజోహార్లు తెలుపుతున్నది.



కామ్రేడ్ సి. నారాయణరెడ్డికి విప్లవ జోహార్

కా॥ సి.నారాయణరెడ్డి (సి.యన్) తన 78వ ఏట 9-12-200 హృద్రోగంతో మరణించారు. అతిచిన్న వయసులోనే కమ్యూనిస్టు పార్టీవై ఆకర్షితులై చనిపోయేంతవరకు కూడ కమ్యూనిస్టు రాజకీయాలతో, పీడి ప్రజలపక్షాన నిలబడిన వ్యక్తి కా॥ సి. నారాయణరెడ్డి. అనంతపురం జిల్లా అమరుడు కా॥ తరిమెలనాగిరెడ్డి గారికి కుడిభుజంగా ఉంటూ కమ్యూని పార్టీలో వచ్చిన అనేక చీలికలు, ఒడిదుడుకులలో కా॥ తరిమెలనాగిరెడ్డి గా జిల్లాలో బాసటగా నిల్చి పార్టీకి వెన్నుదన్నుగా నిలబడ్డారు. కా॥ తరిమెలనాగి గారు చనిపోయిన తర్వాత కూడా తన వృద్దాప్యాన్ని సైతం లెక్కచేయకుం కా॥ తరిమెలనాగిరెడ్డి అందించిన విప్లవ వారసత్వాన్ని కొనసాగిస రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షులుగా ఉన్నారు. 1993 నుంచి టి.య మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

శింగనమల చెరువు ఆయకట్టు సమస్యల మీద నిరంతరం రైతుల సమీకరించి సమస్యల పరిష్కారం కొరకు ఆందోళనలు నిర్వహించా శింగనమల చెరువును లోక లైజేషన్ పరిధిలోకి తీసుకురావడానికి రై ఉద్యమాలు నడిపారు.1969లో కా॥ తరిమెల నాగిరెడ్డి గారు గార్లదిన్నె ప్రారంభించిన 25 గ్రామాలలోని దాదాపు 3000 ఎకరాల బంజరు భూమ పంపకంలో జరిగిన భూ పోరాటంలో ప్రముఖపాత్ర వహించారు. 1992 నుం కణేకల్, కొత్తపల్లి, గోవిందవాద, బొమ్మనహాళ్ తదితర గ్రామాలలోని భూమ స్వాధీనం కొరకు జరిపిన పోరాటాలకు అండగా వుంటూ వచ్చా సి.పి.ఐ.(యం.ఎల్) యూనిటీ ఇనిషియేటివ్ నిర్మాణంలో ఉంటూ అన్ని రక మిత, అతివాదాలకు వ్యతిరేకంగా నిలబడి అమరత్వం పొందా కా॥సి.నారాయణ రెడ్డికి రైతుకూలీ సంఘం విప్లవ జోహార్లు తెలుపుతున్నది

కామ్రేడ్ దూపాటి అప్పారావు కి విప్లవ జోహార్లు

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, సి.పి.ఐ. (యం.ఎల్) యూనిటీ ఇన్షియేటివ్ ప్రత్తిపాడు ప్రాంత నాయకులు కా॥ దూపాటి అప్పారావును 16-2-2002 తెల్లవారుజామున 5 గం॥లకు గుంటూరులో "న్యూడెమోక్రసీ" హంతక దళం అతికిరాతకంగా గొడ్డళ్ళతో నరికి, కత్తులతో పొడిచి హత్య చేసింది.

గుంటూరు రూరల్ మండలం పాత్తూరు గ్రామానికి చెందిన దూపాటి అప్పారావు పేద ఉప్పరకులంలో, కష్టజీవుల కుటుంబంలో జన్మించాడు. తన 50 సం॥ల జీవితం 30 సం॥ల కాలం రైతుకూలీ విప్లవోద్యమంలో కొనసాగాడు.

కా॥ దూపాటి అప్పారావు యువకుడిగా ఉన్న కాలంలోనే కమ్యూనిస్టు రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యాడు. ఎమర్జన్సీ నిర్బంధకాలంలో ఆనాటి పార్టీ నాయకులకు కొరియర్‌గా పనిచేశాడు.పాత్తూరులో రైస్‌మిల్ వర్కర్స్‌కు అండగా నిలబడి కార్మికులను సమీకరించి పోరాడాడు. అగ్రకుల పెత్తందార్ల ఆ గ్రహానికి గురయ్యాడు. భౌతికదాడులకు గురయ్యాడు. కేసులు ఎదుర్కొన్నాడు. అయినప్పటికీ పెత్తందార్లకు లొంగలేదు. అడుగడుగున తమ దోపిడీ పెత్తనాన్ని అడ్డు కుంటునే, ఎండగడ్తూనే పేదప్రజలకు అండగా నిలుస్తున్న దూపాటి అప్పారావును అడ్డు తొలగించుకోవటానికి అగ్రకుల పెత్తందార్లు కుమ్మక్కై కుట్రలు పన్నారు. విషప్రయోగం చేశారు. ఆ తర్వాత కూడ మూడు సార్లు రౌడీగుండాలతో, ఆయుధాలతో అప్పారావు ఇంటి మీదకు పంపి పెత్తందార్లు హత్యాప్రయత్నం చేయించారు. కానీ మెలకువ; ప్రజల అండదండలతో రక్షించుకొన్నాడు. గ్రామంలో పేదల్లో చీలికలు కల్పించడానికి పెత్తందార్లు ప్రయత్నించినప్పుడు పేదలను ఐక్యంగా నిలబెట్టి పెత్తందార్ల అభ్యర్థిని ఓడించాడు. జిల్లా వ్యాపితంగా సాగిన కార్మిక, రైతాంగ ఉద్యమాలకు అన్ని విధాల అండదండగా నిలిచాడు. కా॥ అంగడి చెన్నయ్య గారి నాయకత్వాన పార్టీలో పనిచేస్తూ ప్రధానంగా ప్రత్తిపాడు డివిజన్‌లో పేద ప్రజల ఉద్యమాలకు కేంద్రంగా నిలిచాడు. పెత్తందార్ల దౌర్జన్యాలకు, దురాగతాలకు, అగ్రకుల దురహంకారానికి వ్యతిరేకంగా రాజీలేకుండా మిలిటెంట్‌గా నిలుస్తూ పేద ప్రజలకు కొండంత అండగా నిలిచాడు. కామ్రేడ్ దూపాటి అప్పారావుకి రైతుకూలీసంఘం విప్లవ జోహార్లు తెలుపుతున్నది.



సింగరాజు రామకృష్ణయ్య గారికి జోహార్లు!

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించిన వారిలో ఒకరైన సింగరాజురామకృష్ణయ్యగారు తన 92వ ఏట మరణించారు. బాల్యం నుండి జాతీయవాదిగా రాజకీయాలు అభ్యసిస్తూ-ప్రజాతంత్రవాదిగా, సోషలిస్టుగా పరివర్తన చెందారు. ఆంధ్రప్రదేశ్ 1930 దశకంలో జాతీయోద్యమంలో భాగంగా మొదలైన పీడిత వర్గ ఉద్యమాలు ఉపాధ్యాయులను గూడా స్పందింపజేశాయి.

బ్రతకలేక బడిపంతులని గ్రామీణ ప్రాంతంలోని ఫ్యూడల్ భూస్వామ్య శక్తులు ఉపాధ్యాయవృత్తిని హీనపరుస్తున్న కాలమది. నిరంకుశ బ్రిటీష్ అధికారుల దాష్టీకాన్ని - ఫ్యూడల్ పెత్తందారీ వర్గాల మొరటు దౌర్జన్యాలకు ఉపాధ్యాయులు గురవుతున్న సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులలో ప్రాథమికోపాధ్యాయ సంఘాన్ని స్థాపించిన మహనీయులలో ఒకరు సింగరాజు రామకృష్ణయ్యగారు. "తెగువ చూపకపోతే అణగారి పోవడమే - తెగువ చూపండని" ఉపాధ్యాయలోకాన్ని ఉత్తేజపరిచిన రాజకీయ విజ్ఞుడాయన.

రైతుకూలీల బిడ్డలకు హిట్లరు ఫాసిజం గూర్చి, భూస్వామ్య మొరటు దురహంకారాన్ని గూర్చి పాఠాలు చెప్పిన పంతులాయన. పీడిత వర్గ ఉద్యమం ఉధృతమైన కాలంలో కాలానికి ఎదురీది సహచరులను కూడగట్టి సంఘాన్ని నిలబెట్టిన నిర్మాతాయన. 92 వర్షాల నిండు జీవితాన్ని మంచికోసం, మానవ విలువల పెంపుకోసం అర్పించిన మానవతాతత్వ బోధకుడాయన.

నాటి నుండి నేటి వరకు - మరణించే రోజు వరకు పీడిత ఉపాధ్యాయ లోకం గురించి, శ్రమ జీవుల గురించి, నూతన ప్రజాస్వామికం- వ్యవస్థాపన గురించి; సోషలిజం సాధన గురించి పరితపించిన విప్లవకారుడాయన. ఆయనకు మా జోహార్లు.

రాష్ట్ర కార్యవర్గం
రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)



జీవిత సంగ్రహం

సింగరాజు రామకృష్ణయ్య ఉపాధ్యాయ ఉద్యమం తొలితరం నాయకులు. తన 92వ ఏట నెల్లూరులో 27-8-2002 నాడు మధ్యాహ్నం 1.23 ని॥లకు తుదిశ్వాస విడిచారని తెలుపుటకు విచారి స్తున్నాం. జీవితాంతం ఉపాధ్యాయ సంక్షేమానికి, విద్యారంగంలో ప్రజాతంత్ర మార్పులకు అలుపెరుగని నిరంతరం ఉద్యమాలకు నిబద్ధతతో సారధ్యం వహించిన మహాయోధుడు! ఉద్యమ పితామహులు చెన్నుపాటి లక్ష్మయ్య అధ్యక్షు లుగా, సింగరాజు రామకృష్ణయ్య ప్రధాన కార్యదర్శిగా ఏపిటియఫ్‌కు సారధ్యంవహించి, సంస్థను ప్రగతి మార్గంలో నడిపించి, ఉపాధ్యాయ లోక బాంధవులుగా ప్రసిద్ధికెక్కారు. ఉపాధ్యా యుడుగా వుంటూ ఉద్యమాలలో పాల్గొనకూడదని, నాయకత్వం వహించరాదని నాటి బ్రిటిష్ ప్రభుత్వం 1939లో జారీ చేసిన నిరంకుశ ఉత్తర్వులను 1950 ఉమ్మడి మద్రాసురాష్ట్ర హైకోర్టులో సవాల్ చేసి, 1951లో సంఘ స్వాతంత్ర్యాన్ని సాధిం చిన ఉద్యమయోధులు. తద్వారా ఏపిటియఫ్ కు జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రతిష్టను సమకూర్చారు. వారు ఏపిటియఫ్ విధానపత్రం రూపకర్తలు!!

1968 లో చెన్నుపాటి మరణానంతరం అదే వరవడి, అదే బాటలో 1992 వరకు ఏపిటియఫ్ కు ప్రధాన కార్యదర్శిగా 43 సంవత్సరాలు కొనసాగి, స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. శాసన మండలి సభ్యులుగా ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర శాసనమండలి లో 1952, 1953 రెండు సంవత్సరాలు, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత 1958 నుండి 1976 వరకు 18 సంవత్సరాల పాటు విద్య - ఉపాధ్యాయ సమస్యలపరిష్కారానికి ఎనలేని కృషి చేశారు. 1958 నుండి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికలైన జెసిఏ, జెఏసి, మరియు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికలు యుఏసి, ప్యాప్టో వంటి సంస్థల నిర్మాణం - నిర్వహణలో తనవంతు పాత్రను సూత్రబద్ధంగా సమర్థవంతంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల వేతనాభివృద్ధికి, పదవీ విరమణ సౌలభ్యాల సాధనలో అగ్రగామి పాత్ర వహించారు. సమస్యల పరిష్కారానికి నేడు అన్ని స్థాయిలో జరుగుతున్న కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాల జీవోను రాష్ట్ర స్థాయిలో నిరాహారదీక్షలు సాగించడం ద్వారా సాధించిన దిట్ట! అఖిల భారత విద్యా సంస్థల సమాఖ్య (ఏఐఎఫ్ఇవీ)కు దక్షిణభారత కార్యదర్శిగా, టీచర్స్ ఆఫ్ ది వరల్డ్ ప్రపంచ ఉపాధ్యాయ పత్రికకు దక్షిణభారత విలేఖరిగా పనిచేశారు. నిరక్షరాస్యత నిర్మూలనకు, సమాజంలో ఉపాధ్యాయుల అంతస్తును పెంచడానికి జాతీయ విద్యావిధానం, జాతీయ వేతన స్కేళ్ళు, బడపదవీ విరమణ సౌలభ్యాలు మరియు ప్రజాతంత్ర వ్యవస్థా సాధన లక్ష్యాలుగా తన జీవితాంతం నిస్వార్థంగా,క్రియాశీలకంగా కృషి చేసినధన్యజీవి సింగరాజు! నేటి తరం ఉపాధ్యాయులకు ఉద్యమస్ఫూర్తి ప్రధాత!

అంతేకాదు గిరిజన, రైతుకూలీ ఉద్యమాలకు, విద్యార్థి, యువజనోద్యమాలకు ఉపాధ్యాయ ఉద్యమాన్ని బాసటగా నిలబెట్టారు. ప్రగతిశీల సాహితీ, సాంస్కృతికోద్యమాలకు ప్రోత్సాహ, ప్రోద్బలాలనిచ్చారు. ప్రజా ఉద్యమాలపైన, విప్లవకారులపైన జరిగిన నిర్బంధకాండను ఎదుర్కొన్నారు. ప్రజాతంత్ర హక్కుల ఉద్యమంతో భుజం భుజం కలిపారు. ఈ నిర్బంధకాండకు సహచరులైన ఉపాధ్యాయులు గూడ గురయ్యారు, జైళ్ళ పాలయ్యారు, అనుభవులు బాసారు. ఈ అన్ని సందర్భాలలో రామకృష్ణయ్యగారి స్పందన అద్వితీయం.

బి.వి. సుబ్బయ్య విద్యా సంస్థలు

పేర్నమిట్ట - ఒంగోలు, ప్రకాశం జిల్లా. ఫోన్స్ : (08592) 56232, 56295

"సమాజశ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు"

ఈ సూక్తి విద్యాబోధనలో ఎల్లవేళలా మాకు మార్గదర్శకము

ఇంటర్మీడియట్ క్లాసు ప్రాధాన్యత
తల్లి తండ్రుల కర్తవ్యం

ఇంటర్మీడియట్ క్లాసు తర్వాత ఉన్నత విద్య మెడిసన్, ఇంజనీరింగ్ మొదలగు పలు భాగములుగా ఉన్నది. ఉన్నత విద్యలో వారి అభివృద్ధి ఇంటర్మీడియట్ క్లాసుపై ఆధారపడి ఉన్నది. కనుక ఇంటర్మీడియట్ క్లాసుకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడినది.

అయితే ఇంటర్మీడియట్ క్లాసును నిర్వహించు ప్రభుత్వ కాలేజీలు ఉన్నప్పటికీ ప్రజలు అత్యధికంగా ప్రైవేటు కాలేజీలలో చేరుతున్నారు.

విద్య యొక్క ఒకే ఒక లక్ష్యము విద్యార్థుల విద్యాభివృద్ధి. ఈ లక్ష్య సాధనలో ప్రైవేటు కాలేజీలు ఘోరముగా విఫలమైనవి. ఇందుకు నిదర్శనము 2001 వ సంవత్సరము మార్చి పరీక్షలలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు నూటికి 65 మంది తప్పుట. మరొక బలమైన నిదర్శనము ఇంటర్మీడియట్ తరగతిలో 2 సం॥లు కాలమును హెచ్చించి పెద్ద ఆర్థిక భారమును మోసి కూడా మెడిసన్, ఇంజనీరింగ్‌కు అనర్హులగుట. ఇంత యాతనపడి చదివిన ఇంటర్‌చదువునే ఎంసెట్ పేరుతో మరియొక సంవత్సర కాలమును వినియోగించి ఇంకొక 50 వేల రూపాయల ఖర్చుతో చదవ వలసి వచ్చుట మరీ బాధాకరము.

ఈ ఎంసెట్ నిర్వహించుట వలన రాష్ట్రములోని తల్లిదండ్రులపై సంవత్సరానికి2000 కోట్లరూపాయల భారము పడుచున్నదని కూడా ఈ సందర్భములో గుర్తించండి.

ఈ తీవ్ర విషయాలు అర్థం చేసుకొనకుండా ప్రజలను భ్రమలలో ముంచుటకు దుష్ట శక్తి అయిన బట్టీ పెట్టు బోధనా విధానము విద్యాసంస్థల నిర్వాహకులకు రక్షణగా పనిచేయుచున్నది.

అమూల్యమైన విజ్ఞానము ఈ విధముగా ప్రజలకు అందకుండాపోవు పద్ధతిని తక్షణము అరికట్టకపోతే తీవ్రమైన నష్టము సమాజానికి ఇప్పుడు కలుగుటయేకాక ముందు తరాలవారికి ఎక్కువ హాని జరిగి తీరుతుంది.

పరిష్కారము

ప్రజలు తక్షణం మేల్కొని ఐకమత్యముతో నిలబడి పట్టుపట్టి పోరాడుటే దీనికి తిరుగులేని పరిష్కారము. ఐకమత్యముతో నిలబడిన ప్రజల మహాశక్తిని ఏదీ అడ్డుకొనలేదు, ఆపలేదు. ఈ సమస్యను గురించి గ్రామ గ్రామాన, ఇంటింట మేము ఈ కరపత్రములోనూ, మార్చి 15, 31 తేదీలలో ప్రకటించిన కరపత్రములలోనూ వివరించిన విషయములను చర్చించి సాకల్యముగా అర్థం చేసుకొనగలరు. ఈ అవగాహన మీరు బలమైన పట్టుపట్టుటకు ఎంతో తోడ్పడును.

" ఐకమత్యమే మన బలము"," విజయము మనదే "
సాధించవలసిన లక్ష్యాలు

1. బట్టీపెట్టు విధానమును విద్యా సంస్థల నుండి తుడిచిపెట్టాలి.
2. స్వయంగా జవాబులు వ్రాయు పద్ధతిలో బోధన, సాధన జరగాలి.

ఈ విధానములో ముఖ్యాంశాలు :

- ఒక్కొక్క సెక్షన్‌లో 40 మంది విద్యార్థులను మాత్రమే ఉంచాలి.
- విద్యార్థికి అర్థమగు వరకు ఒకటి, రెండు పర్యాయములు అవసరమైనప్పటికీ వివరించాలి.
- అప్పుడు విద్యార్థికి ప్రశ్న వేస్తే విద్యార్థే స్వయంగా జవాబులు చెప్పగలుగును.
- ఉపాధ్యాయుడు తానే జవాబుచెప్పి వ్రాయించకూడదు.

ఇట్లు

మీ విజయాన్ని కాంక్షిస్తూ

బి.వి. సుబ్బయ్య విద్యాసంస్థలు

686

గ్రామ గ్రామాన సంఘాన్ని పటిష్టపరచండి ! భూమి కోసం, పీడిత రైతాంగ సమస్యల పరిష్కారం కోసం నిలకడైన, విస్తృత కార్యాచరణకు పూనిక వహించండి !!

18-7-2002న హైదరాబాద్‌లో జరిగిన రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జనరల్ కౌన్సిల్‌లో రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ ఝాన్సీ పిలుపు

మన సంస్థ రాష్ట్ర మహాసభలను 2001 ఏప్రియల్‌లో గుంటూరులో విజయవంతంగా జరుపుకొన్నాము. వేలాది మంది రైతుకూలీలు ఈ సభలకు హాజరయినారు. ఈ సందర్భంగా జరిగిన ప్రజాప్రదర్శన, దాని రాజకీయ స్వభావం గుంటూరు పట్టణం పై ప్రగాఢమైన ముద్ర వేసింది.

ఈ మహాసభల ఉత్తేజంతో ఇళ్ళకి తిరిగి వెళ్ళిన మనకు కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డిగారికి గుండెపోటు వచ్చిందన్న వార్త అశనిపాతం లాగా తగిలింది. కామ్రేడ్స్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. జీవితాంతం దోపిడీ వర్గాలతో నిరంతరం పోరాడిన కాకలు తీరిన యోధుడు కామ్రేడ్ యం.ఎస్. మృత్యువుతో కూడా పోరాడి చివరకు 24-4-2001న అమరులైనారు. కామ్రేడ్ యం.ఎస్. మరణవార్త రాష్ట్రం నలు మూలలా పాకిపోయింది.

కామ్రేడ్ యం.ఎన్. భౌతిక కాయాన్ని చివరిసారి చూసేందుకు నివాళులు అర్పించేందుకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి, విశాఖ పట్టణం నుంచి నుంచి అప్పటి కప్పుడు గిరిజన, రైతుకూలీలు, మేధావులు తరలి వచ్చారు. కామ్రేడ్ యం.ఎస్. అంతిమయాత్ర 25-4-2001న విశాఖ నగరంలో ప్రారంభమై కర్నూలు జిల్లా వెలుగోడు వరకు సాగింది. దారి పొడవునా ఆయనకు జోహార్లు చెప్పేందుకు మన కార్యకర్తలు, ప్రజలు కదిలారు. విజయవాడ, పెదకాకాని, గుంటూరు, చివరగా వెలుగోడులో ఆయనకి వేలాది మంది ప్రజలు, రైతుకూలీ సంఘం సభ్యులు, 9 పార్టీల నాయకులు, కామ్రేడ్ యం.ఎస్. సన్నిహితులు, మిత్రులు జోహార్లు చెప్పారు. అంత్యక్రియలకు హాజరైనారు. కామ్రేడ్ యం.ఎస్. మరణానంతరం రాష్ట్రవ్యాప్తంగా శ్రీకాకుళం, దుగ్గేరు, జంఝావతి, రాజమండ్రి, విజయవాడ, చల్లపల్లి, పిడుగురాళ్ళ, నెల్లూరు, నిజామాబాద్, అనంతపురం, హైదరాబాద్‌లలో ఆయన సంస్మరణసభలు జరిగాయి. అంతిమ శ్వాస వరకు ఆశయసాధనకై కట్టుబడి కృషి చేసిన కామ్రేడ్‌కి అంజలి ఘటించారు.



వేదికపై ప్రసంగిస్తున్న కా॥ కె. కోటయ్య, ఎడమ నుంచి కామ్రేడ్స్ ముత్తిరెడ్డి శ్రీరాములు, ఝాన్సీ, పి. వాగరాజు

జనరల్ కౌన్సిల్

కామ్రేడ్ యం.ఎస్. మనల్ని వీడిపోయినా ఆయన అందించిన కర్తవ్యం పరిపూర్తికి, మహాసభలు నిర్దేశించిన కర్తవ్యాలు నెరవేర్చడానికి మనం పూనుకొన్నాం. 2001 జులై 19న రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జరుపుకొన్నాం. కోఅప్షన్స్ చేసుకున్నాం. యం.యస్ స్థానంలో అధ్యక్షురాలి ఎన్నిక చేసుకున్నాం. కర్తవ్యాల నిర్వహణకు పూనుకున్నాం. ఆదివాసి ప్రాంతాలలో ఉద్యమాన్ని ముందుకు తీసుకొని పోవడం; రాష్ట్ర వ్యాప్తం గా కరువు సమస్య, పెండింగు ప్రాజెక్టులు - వలసల సమస్యలపైన, కూలీ రేట్ల పెంపుకోసం ఆందోళ నా కార్యక్రమాలు చేపట్టాలని కౌన్సిల్ పిలుపునిచ్చింది.

కామ్రేడ్ యం.ఎస్. మరణించి 4 నెలలు గడవక ముందే రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో అధ్యక్ష స్థానం వహించి ఉత్తేజకరంగా వ్యవహరించిన రాష్ట్ర ఉపా ధ్యక్షులు కామ్రేడ్ కనమత రెడ్డి అంజిరెడ్డిగారిని ఆగస్టు 1వ తేదీ న మనం కోల్పోయాం. ఆరు దశాబ్దాల సుదీర్ఘ ప్రజా జీవితం ఆయనది. పీడిత ప్రజల విముక్తి కోసం నిరంతరం తపించి, నిరాడంబరంగా జీవించి, శ్రమించిన కామ్రేడ్ అంజిరెడ్డి గారి అంతిమయాత్ర ఆయన స్వగ్రామ మైన పశ్చిమ గోదావరి జిల్లా ప్రగడవరంలో జరిగింది. పీడిత ప్రజలు ఇంటింటా ఆయన భౌతికకాయాన్ని తీసుకొని వెళ్లే వాహనాన్ని ఆపి నివాళులు అర్పించారు. సెప్టెంబర్ 2న ప్రగడవరంలో ఆయన సంస్మరణ సభ వందలాది మంది ప్రజలతో జరిగింది.

విజయవంతమైన మన రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) మహాసభల విశేషాలను, వివిధ సమస్యల పైన మన కార్యకలాపాలను, వైఖరులను వివరించే విధంగా మహాసభల సావనీర్‌ను తీసుకొనివచ్చాం. సావనీర్ ఆవిష్కరణ సభలు నవంబరు 2001లో నెల్లూరు, గుంటూరు, మచిలీపట్నం తదితర చోట్ల జరిగాయి. సావనీర్ పలువురి ప్రశంసలు పొందింది.

మహాసభలు అందించిన స్ఫూర్తితో, జనరల్ కౌన్సిల్‌లో నిర్ణయించుకొన్న కర్తవ్యాల అమలుకి మన కార్యకర్తలు కృషి సాగించారు. ఆదివాసి భూపోరాటాలు, కరువు తదితర సమస్యలపై కదిలారు.

ఆదివాసి భూపోరాటాలు

ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా ఆదివాసీ ప్రాంతాల భూపోరాటం మరోసారి వార్తలలోకి వచ్చింది. 1969 నుంచి కొండమొదలు ఉద్యమ ప్రేరణతో పోలవరంలో గిరిజన భూపోరాటం ఎన్నో ఒడుదుడుకులను తట్టుకొని గత దశాబ్ద కాలంగా సాగుతున్నది. 5గురు భూస్వాముల

నుంచి 2 వేల ఎకరాలకుపైగా భూమిని స్వాధీన పర్చుకొని సాగుతున్న ఈ భూపోరాటం పై భూస్వాములు, పోలీసు యంత్రాంగం మొత్తం జిల్లా ఆదివాసీ ప్రజలపై సాగుతున్న నిర్బంధంలో భాగంగా తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేశారు. వందలాది మంది గిరిజనులపై హత్యాయత్న నేరం వంటి అక్రమకేసులు బనాయించారు. అరెస్టు అయిన వారికి కరెంటు షాకులు ఇచ్చారు. ప్రజల సాధారణ జీవితం కూడా సాధ్యం కానంత నిర్బంధం అమలు చేశారు.

ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా 2001 సెప్టెంబర్‌లో కొవ్వూరు ఆర్.డి.వో కార్యాలయం వద్ద వందలాది ఆదివాసీలతో ధర్నా నిర్వహించారు. నవంబరు 16న పోలవరం యం.ఆర్.వో. ముందు ధర్నా జరిగింది. వీటికి రాష్ట్ర నాయకత్వం హాజరైంది. పశ్చిమఏజెన్సీలో ఆదివాసి భూపోరాటా లపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ సెప్టెంబర్ 2001లో రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా గుంటూరు జిల్లాలో పిడుగురాళ్ళ, మాచవరం మండల కేంద్రాలలో, గుంటూరు జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నాలు జరిగాయి. అనంతపురం జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద 500మందితో ధర్నా జరిగింది. విజయనగరం జిల్లాలో పార్వతీపురం లోనూ, తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలంలో ఇంకా వివిధ ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి.

పశ్చిమగోదావరి జిల్లాలో పుకుంపేట మాజీ జమిందారుల ఆక్రమణలోని భూములను గిరిజనులు తిరిగి స్వాధీనం చేసుకొని గత 5 సం॥రముల నుంచి అనుభవిస్తున్నారు. ఆ భూముల నుంచి గిరిజనులు వైదొలగాలని రెవెన్యూ, పోలీస్ యంత్రాగం సాయంతో గిరిజనులను ఖాళీ చేయించాలనే ప్రయత్నాలను గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం వ్యతిరేకించింది. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శుల జోక్యంతో ఈ భూములు నిజంగా ఎవరివో తేల్చడానికి మార్చి 30, 2002 నాడు ఉభయపక్షాలు, అధికార యంత్రాంగం కలసి,రికార్డులాధారంగా చర్చించి, పరిశీలించడానికి ఒక వేదిక ఏర్పాటు చేయబడింది.

గిరిజనుల తరపున గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు, గిరిజనేతర పేదల రాష్ట్ర కార్యదర్శి, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు; లాయర్లు ప్రజాతంత్ర వాదులు; - జమీందారులు, వారి కుటుంబ సభ్యులు, వారి లాయర్లు, - ప్రాజెక్టు ఆఫీసరు, రెవెన్యూ యంత్రాంగం, పోలీసు యంత్రాంగం; హాజరైన ఈ వేదికలో వాదోపవాదాలు జరిగాయి. ఈ వాదోపవాదాల క్రమంలో భూములు భూస్వాములవా? గిరిజనులవా? అన్న అంశం తేలవలసిన విషయంగానే వుందని, భూస్వాములు భూములు తమవేనని వాదించడం సరికాదని అప్పటికి నిర్ణయించబడింది. భూములు వివాదాస్పదం అని, వాటిలో ఆదివాసులు సాగు చేస్తున్నారని స్పష్టం చేయబడింది. భూమి హక్కుల తనిఖీకి పి.ఓ. అధ్యక్షతన కమిటీ ఏర్పడాలని మనం చేసిన ప్రతిపాదనను అందరూ అంగీకరించి కలెక్టరు ఆమోదం కొరకు పంపారు. కానీ కలెక్టరు నేటికీ భూవివాదాలను పరిశీలించేందుకు ఏర్పడిన ఆ కమిటీని గుర్తించకపోగా పి.ఓ.ను బదిలీ చేశారు. ఇదే సమయంలో జిల్లాలో నకిలీ హైకోర్టు జడ్జిమెంట్ పత్రాలు, రైతుపాస్ పుస్తకాలపై యం.ఆర్.ఓ.ల ఫోర్జరీ సంతకాలను చూపి గిరిజనేతర భూస్వామ్య శక్తులు ప్రత్యేక గిరిజన డిప్యూటి కలెక్టరు కోర్టులో పట్టాలు పొందారన్న కుంభకోణం బయటపడింది. దీనిపై కా॥ ఓంకార్‌గారు కన్వీనర్‌గా ఉన్న ఆదివాసి హక్కుల వేదిక ఆధ్వర్యంలో విశాల రాజకీయ ఆందోళనకి పిలుపునిచ్చింది. ఈ పిలుపును ఆదివాసి హక్కుల వేదికలో భాగస్వాములుగా మన సంఘం అమలుచేసింది. రాష్ట్ర కార్యదర్శి కోటయ్యగారు ఏలూరులో ఉన్న ప్రతి రాజకీయ ఆందోళనలో పాల్గొని ఐక్య కార్యాచరణ ఆవశ్యకత ఉద్ఘాటించారు. ఆదివాసీ హక్కుల వేదిక ఆధ్వర్యంలో జూన్ 3న ఏలూరు కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా, ప్రదర్శన సమరశీలంగా సాగాయి. 4వ తేదీ సదస్సు ఐక్యకార్యచరణ అవసరాన్ని మరింతగా ముందు ఉంచింది. ఈ రకపు కృషి ఫలితంగా జూన్ 20న 8 ప్రజాసంఘాలు సమావేశమై ఐక్య ఆందోళనకి పిలుపు ఇచ్చారు. నకిలీ పత్రాల కుంభకోణంపై హైకోర్టు జడ్జిచే న్యాయ విచారణ, ఆదివాసులపై నిర్బంధం నిలిపివేయటం అన్న డిమాండ్‌లపై జులై 28న జిల్లాలోని మూడు ఏజెన్సీ మండలాల పికెటింగు, జులై 3న ఐ.టి.డి.ఎ ముట్టడి, జులై 11న జంగారెడ్డిగూడెం ఆర్.డి.వో కార్యాలయం స్తంభన పిలుపులను వేలాదిమంది ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ పిలుపులు పోరాడుతున్న ఆదివాసులలో ఆత్మ విశ్వాసాన్ని పెంచాయి. జులై 24న హైదరాబాద్‌లో ధర్నా జరిపి స్పీకర్‌కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాలన్నింటిలో రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్యగారు పాల్గొన్నారు. ఐక్య కార్యాచరణ కృషి కొనసాగాలని, భూపోరాటాలను మరింత నిలకడగా సాగించాలని ఆదివాసి ప్రజలకు పిలుపునిస్తూ ఆగస్టు 3న కొయ్యలగూడెంలో 600 మందితో ప్రదర్శన, 4న సదస్సు జరిగాయి. దీనికి మన అధ్యక్ష, కార్యదర్శిలతో పాటు యం.సి.పి.ఐ. రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥సోమరాజన్న హాజరైనారు.

తూర్పుగోదావరి జిల్లాలో 1969 నుంచి సాగుతున్న కొండమొదలు ప్రాంత గిరిజనోద్యమం, దేవీపట్నం ప్రాంతంలో 1996 నుంచి సాగుతున్న భూపోరాటాలు భూస్వాముల కుట్రలను, విచ్ఛిన్నాలను ఎదుర్కొంటూ సాగు తున్నది. ఇదే విధంగా విజయనగరం జిల్లాలో ఆదివాసీ భూపోరాటాలు సాగుతున్నాయి. సీబెల్లి పెదవలస జగన్నాధస్వామి దేవాలయ భూమిని ప్రజలు స్వాధీనపరుచుకొని సాగు చేసుకొంటు న్నారు. దుగ్గేరులో బలుసు ప్రసాద్ అన్యాక్రాంతం చేసిన భూమి, కొమరాడలో జంఝావతి డ్యాం భూములు ఆదివాసి, పీడిత ప్రజల సాగులో ఉన్నాయి. విజయనగరం జిల్లాలో జి.సి.సి. దోపిడీకి వ్యతిరేకంగా ఆందోళన పెద్దఎత్తున సాగింది. జి.సి.సి. తగ్గించిన అటవీ ఉత్పత్తి రేట్లు పెంచాలని, జి.సి.సీనే తునికాకు సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. ఐ.టి.డి.ఎ పార్వతీపురం కార్యాలయం ముందు ఫిబ్రవరి నెలలో వంద లాది మంది ఆదివాసీలు ప్రదర్శనలు జరిపారు.

ఖమ్మం జిల్లా భద్రాచలం డివిజన్‌లో గుత్తికోయ ప్రజలు గత 30 సంవత్సరాలుగా నివశిస్తున్నారు. రిజర్వు అడవులలో ఉంటు న్నారనే పేరుతో వీరి గ్రామాలను ఫారెస్టు అధికారులు తగలపెడుతున్నారు. ధాన్యం, పంటలను ధ్వంసం చేస్తున్నారు. గత సంవత్సర కాలంలో ఇలాంటి 4 గ్రామాలను తగలబెట్టారు. ఈ సమస్యలపై మనం హైకోర్టు నుంచి ఆ గ్రామాలను తగలబెట్టరాదని తెచ్చిన ఆర్డర్లను సైతం ఫారెస్టు అధికారులు ఖాతరు చేయడం లేదు. ఈ సమస్యపై అనేకమార్లు భద్రాచలం పి.ఓ., డి.ఎఫ్.ఓ లను ఆదివాసులు కలిసి నిరసన తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ కార్యదర్శిని గత జులైలో కలిసి వినతి పత్రం ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా ఈ సంవత్సరకాలంలో బంజరు భూములు, దేవస్థానం భూములకోసం ఆందోళనలు

గుంటూరు జిల్లాలో పల్నాడు ఏరియాలో పిడుగురాళ్ళ, కారంపూడి, మాచర్ల, గురజాల, రెంటచింతల మండలాలలో భూస్వాధీన కృషి సాగుతున్నది. పిడుగురాళ్ళలో ఆంబోతు మాన్యం, రెంటచింతలలో 450 ఎకరాల భూమి ప్రజల సాగులో ఉంది. కారంపూడి పోతురాజు గుట్టలో 300 మంది ఇళ్ళ స్థలాలకోసం స్వాధీన పరుచుకొన్నారు.

ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈత ముక్కలలో 75 ఎకరాల దేవాదాయ భూమి ప్రజల సాగులో ఉంది. 70 కుటుంబాలు 7 గ్రూపులుగా సాగుచేసుకొంటున్నారు. దేవాదాయ భూములు పేదలకి పంచాలని ప్రకాశం జిల్లా కలెక్టరు కార్యాలయం ముందు 4-2-02న ధర్నా జరిగింది. ప్రకాశం జిల్లాలోనే మోటుమాల గ్రామంలో రొయ్యల కంపెనీలు పేదల డిపారం పట్టా భూములు, పి.డబ్ల్యూ.డి. భూములు కబ్జా చేసే ప్రయత్నాలను ప్రతిఘటిస్తున్నారు.

నెల్లూరు జిల్లాలో వెంకటగిరి మండలంలో రామశాస్త్రి వారి ఖండ్రికలో భూములకోసం ప్రజలు ఆందోళన చేస్తున్నారు. వెంకటగిరి పరిసర మండలాల్లో ముందుకు వస్తున్న భూమి సమస్యలపై 2002 జులై7న వెంకటగిరిలో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. సైదాపురం మండలం వేములచేడులో దళితులకు, ఆది వాసులకి లీజుకు ఇచ్చిన భూముల లీజులు రద్దు చేయించాలని పెత్తందార్లు చేస్తున్న కుట్రలను ఎదుర్కొంటున్నారు.

విజయనగరం జిల్లా సాలూరులో ఫిబ్రవరి 25న 500 రైతు కూలీలు ప్రదర్శన జరిపి. డి. పారం పట్టాలకి భూములు అప్పగించమని డిమాండ్ చేసారు. 1-3-02న మక్కువ మండల కేంద్రంలో 1000 మంది ఆదివాసి, రైతుకూలీలు శంభర, కొండ పిండి వలస తదితర గ్రామాల్లో డి. పట్టాలకి భూములు చూపాలని డిమాండ్ చేస్తూ యం.ఆర్.వో ను నిలదీసారు.

కర్నూలు జిల్లాలో వెలుగోడు ప్రాంతంలో భూములకోసం ఆందోళనలు సాగుతున్నాయి.

అనంతపురం జిల్లాలో కణేకల్లు మండలంలో 50 ఎకరాల భూమి ప్రజల సమిష్టి సాగులో ఉంది. పామిడిలో ఇళ్ళస్థలాల కోసం 25-8-2001న ధర్నా జరిగింది. ఆత్మకూరు మండల కేంద్రంలో ఇళ్ళస్థలాల సమస్యపై పెత్తందార్లతో ఘర్షణ సాగుతున్నది.

నెల్లూరు పట్టణంలో పాతవేదాయపాలెం గ్రామ చెరువులో 350 మంది పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. జనశక్తినగర్‌లోని ఈ గుడిసెలను నిలబెట్టుకునేందుకు పోలీసు నిర్బంధాన్ని ఎదిరించి నిలబడుతున్నారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం సహాయ కార్యదర్శితో పాటు 15 మంది కార్యకర్తలు అరెస్టయి 20 రోజులు నెల్లూరు జైలులో ఉన్నారు.

నిజామాబాద్ జిల్లా, నిజామాబాద్ మండలంలో మాధవనగర్ శివారులో కెనాల్ బౌండ్రి స్థలాన్ని సంఘం నాయత్వాన 110 కుటుంబాల జనం స్వాధీనపర్చుకొని ప్లాట్లుగా విభజించుకొని జీవిస్తున్నారు. దానికొరకు 2002 ఏప్రిల్ నుంచి 2 సార్లు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా జరిపారు.

కరువు - వలసలు పెండింగు ప్రాజెక్టుల కోసం

వరుసగా గత 4 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని కరువు వెంటాడుతున్నది. దీనికి చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రపంచబ్యాంకు నిర్దేశిత సామ్రాజ్యవాద దోపిడీ విధానాలు - కరువు పీడిత రైతాంగంపై గోరు చుట్టు మీద రోకటిపోటులాగా ఉన్నాయి. గ్రామీణ రుణ భారం పెరిగిపోతున్నది. నకిలీ విత్తనాలు, పురుగు మందులు ఒకవైపు, ప్రభుత్వ వంటనూనెల విధానం ఫలితంగా రాయల సీమలో లక్షలాది ఎకరాలలో వేరుశెనగ పండించే రైతాంగం తీవ్రమైన అవస్థలకి గురవు తున్నారు. ఇలాంటి స్థితిలో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్ణయించినట్లుగా కరువు సమస్యపై మన కామ్రేడ్స్ ప్రజలను కదిలించారు. ఐక్య ప్రజా ఆందోళనలో చురుకైన భాగస్వాములైనారు.

అనంతపురం రైతాంగ సమరశీల పోరాటం

అనంతపురం జిల్లాలో గత 130 సంవత్సరాలలో 100 కరువులను ఎదుర్కొంది. అయితే ప్రజలు ఏనాడు మనోధైర్యం కోల్పోలేదు. కానీ ఆధునిక పాలకుల ప్రపంచబ్యాంకు విధానాలు బ్రిటీషు వలస పాలకులను మించిపోయి ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీసాయి. ఫలితంగా ఆత్మ హత్యలు పెరిగిపోయాయి. ఈనేపధ్యంలో కల్తీ విత్తనాలు - పురుగుమందులు - గిట్టుబాటు ధరలు, నీటిపారుదల సౌకర్యాల కోసం అనంతపురం రైతాంగం సమరశీలంగా పోరాడుతున్నారు. 2002 ఫిబ్రవరిలో జిల్లా వ్యాపితంగా ఐక్య ఉద్యమం సాగింది. 4,5 తేదీలలో 30 గంటల పాటు కలెక్టరేటును వేలాది మంది ముట్టడించారు. మరలా ఫిబ్రవరి 20,21 తేదీలలో జిల్లా వ్యాపితంగా 40 గంటల రాస్తా రోఖో జరిగింది. ప్రభుత్వ పాకేజీని నిరసిస్తూ సమగ్ర కరువు నివారణ చర్యలను అనంతపురం రైతాంగం డిమాండ్ చేసింది. ప్రభుత్వం రైతుల మీద తీవ్రంగా విరుచుకుపడింది. కరువును కూడా పాలకవర్గ వ్యవసాయ సంస్కరణ లకి అనువుగా మలచాలన్నది ప్రభుత్వ వ్యూహం. కరువు పాలకవర్గాల సృష్టే మనం ఈ ఆందోళనా కార్యక్రమంలో చురుకైన పాత్ర వహించాం. ప్రతి సందర్భంలోనూ మన రైతు కూలీసంఘ కార్యకర్తలు ఈఆందోళనా కార్యక్రమంలో ఉన్నారు. వీటిలో పాల్గొంటూనే స్వతంత్రంగా ప్రజలను విజ్ఞాన వంతులను చేస్తూ కరపత్రాలు తెచ్చారు. దీనికన్నా ముందు 2001 సెప్టెంబరులో పనికి ఆహార పథకం అమలుచేయాలని, కరువుపీడిత ప్రజానీకం సమస్యలు పరిష్కరించాలని ఆత్మకూరు, పామిడి, కణేకల్లులో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు.

విజయనగరం జిల్లాలో కరువు- వలసలు, పని హక్కుకోసం, పెండింగు ప్రాజెక్టులు పూర్తి చేయాలని, వలసలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు జరిగాయి. 2001 సెప్టెంబర్ 7,8,9 తేదీలలో పెదవలస, ఎర్రమట్టివలస, దుగ్గేరులలో బహిరంగ సభలు జరిగాయి. సెప్టెంబరు 17న పార్వతీపురంలో కరువు సహాయక చర్యలకై ధర్నా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల కరువు సమస్యలపై సర్వే నిర్వహించబడింది. అక్టోబరు 7న విజయ నగరంలో కరువు సమస్యపై 1500మందితో సదస్సు జరిగింది. దీనికి వ్యవసాయ కమీషన్ సభ్యులైన ప్రా॥ కె.ఆర్.చౌదరిగారు హాజరైనారు.

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో కరువు సమస్యపై ధర్నా జరిగింది. శ్రీకాకుళంలో అక్టోబరు 5న వ్యవసాయరంగ పరిరక్షణ కమీషన్‌ను ఆహ్వానించారు. కమీషన్ పర్యటించింది.

కృష్ణా జిల్లాలో దుర్భిక్ష పీడితంగా ఉన్న 9 మండలాల ప్రతినిధులతో 9-9-2001న ధర్నా జరిపారు.

పశ్చిమ గోదావరి జిల్లా పోలవరంలోనున్న కొయ్యలగూడెం, గోపాలపురం మండలాలలో, తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం, గండేపల్లి, రంగంపేట, యు.కొత్తపల్లి మండల కేంద్రాలలో ధర్నాలు జరిగాయి. గండేపల్లి మండలంలో ప్రాక్లెయినర్‌లతో కరువు పనులు సాగించడాన్ని ప్రజలు అడ్డుకొన్నారు.

గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రాంతంలో ముగ్గురు రైతుల ఆత్మహత్యలపై ప్రచార ఆందోళనలు చేపట్టారు. కల్తీ విత్తనాలు, పురుగు మందుల సమస్యలపై రైతాంగ ఆత్మహత్యలపైన 4 మండలాలలో ధర్నాలు జరిపారు.

నెల్లూరు జిల్లాలో కరువు సమస్యపై 'కరువు బ్రతుకులు' నాటక కళాబృందంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంటరీ కమిటీ నెల్లూరుజిల్లా పర్యటించిన సందర్భంలో వివరమైన రిపోర్టుకు తగిన మెమోరాండం అందించారు.

నిజమాబాద్ జిల్లాలో నిజాంసాగర్ ఆయకట్టుకి సింగూరు నుంచి 5. టి.యం.సి.ల నీటిని విడుదల చేయాలని, గోదావరి జలాలను మళ్ళించాలనే డిమాండ్‌పై సెప్టెంబర్ 2001, జనవరి 2002లలో ఆందోళనలు జరిగాయి. మనం స్వతంత్రంగానూ, ఐక్యకార్యాచరణల లోనూ పాల్గొన్నాం.

గ్రామీణ ఋణభారం

గ్రామీణ ప్రజల ఋణభారం నానాటికీ పెరిగిపోతున్నది. 1937-38 గొప్ప ఆర్థిక మాంద్యం కాలంలో ఋణభారం సమస్యల వల్ల మన రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ఋణగ్రస్త గ్రామీణ ప్రాంతాల నుంచి వడ్డీవ్యాపార కొత్త భూస్వామ్యవర్గం బలపడి పెరిగిపోయింది. సామ్రాజ్యవాదంకి ఈ భూస్వామ్యవర్గం ఆనాడు మరింత సాంఘిక పునాదిగా మారింది. నాటి రైతు పోరాటాల ఫలితంగా ముందుకు వచ్చిన ఋణ విమోచన చట్టాలు తర్వాత కాలంలో అటకెక్కిపోయాయి. నేటి గ్రామీణ ఋణభారం గత సమస్యలను తలదన్నేదిగా ఉంది. ప్రభుత్వ, సహకార సంఘాలే చక్రవడ్డీ వసూలు చేస్తున్నాయి. ఈ సమస్య సమగ్ర అధ్యయనం కోసం మనసంఘం పూనుకొన్నది. దీనికోసం మార్చి 2002, 6,7తేదీలలో రాష్ట్రవ్యాపితంగా మన కార్యకర్తలతో ఒక సింపోజియం నిర్వహించాం. డా॥బి.డి.శర్మగారు ముఖ్య అతిథిగా పాల్గొని విలువైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కృష్ణా, నెల్లూరు జిల్లాల కామ్రేడ్స్ గ్రామీణ ప్రాంతాల ఋణభారంపై సర్వేలు జరిపారు. దీని ఫలితంగా కృష్ణా జిల్లా వంటి కోస్తా జిల్లాల్లో నూతన ఆర్థిక వ్యవసాయ విధానాల ప్రభావం గ్రామీణ ఋణ గ్రస్తతపై ఏ విధంగా ఉందో అర్థం అయింది. పశ్చిమ కృష్ణాలో దీని అనంతరం రైతాంగ ఆత్మ హత్యలు, ఋణభారం సమస్యలపై 10-06-2002న నందిగామలో సదస్సు నిర్వహించారు.

ఈ కృషి కొనసాగింపుగా " వ్యవసాయరంగ సంక్షోభం-కారణాలు-పరిష్కార మార్గాలు" అన్న అంశంపై విశాఖపట్నంలో ఏప్రిల్ 15న రాష్ట్ర వ్యాపిత సదస్సు నిర్వహించాం. ఆ సందర్భంగా జరిగిన ప్రదర్శన, సదస్సులకి 2000 మంది ఆదివాసీ రైతు కూలీలు హాజరైనారు. డా॥బి.డి.శర్మ, ప్రా॥ కె.ఆర్. చౌదరి వంటి మేధావులు హాజరైనారు.

ధనిక, మధ్య తరగతి రైతాంగ సమస్యలపై

వివిధ జిల్లాల్లో మధ్యతరగతి, ధనిక రైతుల - చేతివృత్తుల ప్రజానీకం సమస్యలపై అనేక రూపాలలో ఆందోళనలు సాగుతున్నాయి.

ఆక్వా రైతుల పోరాటం :

నెల్లూరు జిల్లాలో మంచినీటి రొయ్యల సాగు విపరీతంగా పెరిగిపోయింది. ఆక్వారంగంకి విద్యుత్ మీటర్లు ఏర్పరచాలనే దానికి వ్యతిరేకంగా ఐక్యపోరాట వేదిక ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రచారం, విద్యుత్ సబ్‌స్టేషన్లలో మీటర్లు అప్పగించడం చేసారు. డిసెంబరు 2001న 1500 మందితో జిల్లాసదస్సు, జనవరి 2002లో 5000 మందితో విద్యుత్ యస్.ఇ. కార్యాలయం ముట్టడి కార్యక్రమాలు జరిగాయి. వీటన్నింటిలో మన కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలంలో ఉప్పు పండించే రైతాంగం స్థితి దయనీయంగా ఉంది. ఉప్పు సాగుకు వాడే విద్యుత్ మీటర్లకి రాయితీ ప్రకటించక పోవడంతో కరెంటు బిల్లులు పెరిగిపోయాయి. మరోవైపు బహుళజాతి బడాకంపెనీల అయోడిన్ ఉప్పు ప్రచారం ఫలితంగా ఉప్పు బస్తా రేటు తగ్గిపోయింది. దీనిపై కొత్తపట్నం మండల కేంద్రం లోనూ, ఒంగోలు కలెక్టరు కార్యాలయం ముందు 2002 జూన్-జులై మధ్య కాలంలో ధర్నాలు జరిపారు. కరపత్రాలు వేసి ప్రచారం సాగించారు.

కృష్ణాజిల్లాలో చిన్న తరహా రొయ్య రైతాంగంను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని ధర్నా జరిపారు. ధాన్యం సేకరణలో ఎఫ్.సి.ఐ. ఆంక్షలను ఎత్తివేయాలని, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని గుడివాడలో రైతాంగం జరిపిన ఆందోళనలో పాలుపంచుకొన్నారు. 2002 మార్చి 5న గిట్టుబాటు ధరలపై చల్లపల్లి యం.ఆర్.వో. కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ చెరుకు రైతు ఆత్మహత్య నేపథ్యంలో చెరకురైతు బకాయిల సమస్యపై జరిగిన ఆందోళనలో మన సంస్థ పాల్గొన్నది. స్వతంత్రంగా కరపత్రాలతో ప్రచారం సాగించింది. చేనేత కార్మికుల ఆందోళనకు మద్దతుగా మచిలీపట్నం, ఇతర ప్రాంతాల్లో సైకిల్ ర్యాలీలు, బంద్‌లలో పాల్గొనడం, రాస్తారోకోలు నిర్వహించడం జరిగింది.

పొగాకు రైతాంగం ఆందోళనలు :

బహుళజాతి కంపెనీలు, ప్రభుత్వ దగా, దోపిడీలకు పొగాకు రైతాంగం గురవుతున్నారు. క్రాప్‌హాలిడే రైతాంగ సమస్యలను పరిష్కరించ దని మనం ముందు చెప్పాం. అదే చివరకు జరిగింది. దీనిపై 5-01-2002న ఒంగోలులో వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రైతు సదస్సులో మన రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య గారు మాట్లాడారు. మనం రైతు కూలీ సంఘం ఉమ్మడి ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నాం. గుంటూరు పొగాకు బోర్డు ఛైర్మన్ ముందు పొగాకుపై వేసిన ఏకసభ్య కమీషన్ ముందు వందలాది మంది రైతులు తమ డిమాండ్లను ఉంచారు. 2002 ఏప్రియల్ 9న ఒంగోలు, టంగుటూరు, మేదరమెట్ల, వెల్లంపల్లి, పాదిలి, కంచికచర్ల తదితర పొగాకు వేలం కేంద్రాల వద్ద రాస్తారోకోలు నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, రైతుకూలీ సంఘం కలసి పొగాకు సమస్యలపై 2002 ఫిబ్రవరిలో సదస్సు నిర్వహించాం. గోపాలపురం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో ప్రచారం సాగించాము. పశ్చిమగోదావరి జిల్లాలో నీటి పారుదల పథకాలపై చింతలపూడి, కొయ్యల గూడెం తదితర మండలాల్లో ప్రచార కార్యక్రమాలు సాగాయి. చింతలపూడిలో సెప్టెంబరు 2001లో లో ఓల్టేజికి వ్యతిరేకంగా రైతులు విద్యుత్ స్టేషన్ ముట్టడించి కరెంటు సరఫరా సక్రమంగా సాధించుకున్నారు. కొయ్యలగూడెంలో 20-11-2001న బైనేరుపై బందకట్ట ప్రాజెక్టు పునర్ని

ర్మించాలని, గోదావరి నీటిని లిఫ్ట్‌చేసి మెట్ట ప్రాంతాలకి సాగునీరు, త్రాగునీరు సరఫరా చేయాలని సదస్సు జరిగింది. అనంతరం కలెక్టరు బందకట్ట పునర్నిర్మాణం కోసం నిధులు విడుదల చేసారు. కర్నూలు జిల్లా వెలుగోడులో 2001 సెప్టెంబరు 16న తెలుగుగంగ రిజర్వాయరుకు గండి పడింది. యుద్ధ ప్రాతిపదికన ప్రజలు కదిలి గండి పూడ్చుకున్నారు. 2 సం॥ల పాటు క్రమంగా మట్టిని గట్టిపరుస్తూ పోయాల్సిన కట్టను 3 నెలలలో కంట్రాక్టర్లు, అధికార్లు పూర్తి చేయడం వల్ల ఇది సంభవించిందని ప్రచారం చేసి ఆందోళన జరిపాము. తూర్పుగోదావరి జిల్లా తీరప్రాంతంలో సాంప్రదాయక మత్స్యకార వృత్తికి రక్షణ కల్పించాలని ప్రచారం జరిగింది.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

పాలకుల నూతన ఆర్థిక విధానాలలో భాగంగా ప్రైవేటీకరణ భూతాన్ని ప్రజలపై తోలు తున్నారు. రైతుల, ప్రజల కష్టార్జితం నుంచి నిర్బంధంగా వసూలు చేసి ఏర్పరచిన కార్పో రేషన్లు, ప్రజల విరాళాలతో, వాటాలతో నిర్వహిం చబడిన సహకార కర్మాగారాలను ప్రైవేటీకరి స్తున్నారు. నిజామాబాద్‌లో నిజాంషుగర్స్ ప్రైవేటీ కరణను వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనలో స్వతంత్రంగాను, ఇతర సంస్థలతోను కలసి పాల్గొన్నాం. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస చక్కెర కర్మాగారాన్ని ప్రైవేటీక రించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో చురుకైన పాత్ర వహించాము. రాష్ట్ర వ్యాపితంగా ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్లను మూసివేయాలనే ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో మనం పాల్గొన్నాం. ఆర్.టిసి. ప్రైవేటీకరించే ప్రయత్నాలకు నిరసనగా, కార్మికుల సమైక్య సమ్మెకి సంఘీభావంగా జరిగిన ఆందోళనలో విజయనగరం తూర్పుగోదావరి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు తదితర ప్రాంతాలలో మన సంస్థ కృషి చేసింది. ఈవిధంగా వివిధ రైతాంగ సమస్యలపై కార్మిక, ఉద్యోగవర్గాల సంఘీ భావ ఆందోళనలో మనం పాల్గొంటున్నాం. మనం పాలకుల ప్రపంచీకరణ, ప్రైవేటీ కరణ, సరళీకరణ విధానాల దుష్ఫలితాలను ఎండగడుతున్నాం. వీటిని సాధారణ ప్రచార అంశాలుగా కాక ప్రతి సమస్య లోనూ వాటి నిర్దిష్ట రూపాలను, సారాంశంను బట్టబయలు చేసేందుకు పూనుకొంటున్నాం.

సాంఘిక వివక్షకు వ్యతిరేకంగా

రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో దళితులపై జరుగుతున్న దాడులకి వ్యతిరేకంగా కులవివక్ష, అణచివేత తదితర సమస్యలపై వివిధ స్థాయిలలో ప్రచార, ఆందోళనలు, పోరాటాలు సాగుతున్నాయి. కృష్ణా జిల్లా చందర్లపాడు మండలం, ఏటూరు గ్రామంలో దళితులు నిర్మించుకున్న అంబేద్కర్ విగ్రహాన్ని అగ్రకుల పెత్తందార్లు ధ్వంసం చేశారు. దాన్ని ప్రశ్నించిన దళితులను సాంఘిక బహిష్కరణకి గురి చేశారు. మాలనాడు, యం.ఆర్.పి.యస్. లతో కలసి మనము ఈ ఆందోళనలో పాల్గొన్నాం. యం.పి.టి.సి. ఎన్నికలలో సాంఘిక బహిష్కరణ సమస్యను చూపుతూ దళిత అభ్యర్థులను బల పరుస్తూ ప్రచారం సాగించాం. తూర్పుగోదావరి జిల్లాలో కపిలేశ్వరపురం జమీందారు భూములు భూసంస్కరణల చట్టం ప్రకారం మిగులు భూములే నని 1990 నాటికే సుప్రీంకోర్టు తీర్పుచేసింది. ప్రభుత్వం నేటికీ ఆ భూములను స్వాధీన పర్చుకోక పోగా ఆ భూములతో కలిసి ఉన్న బంజరు భూము లను రెవెన్యూ అధికారులు కౌలుకి ఇస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా దళిత బహుజన వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జరుపుతున్న ఆందోళన లో పాల్గొన్నాం. కాకినాడలో జరిగిన సదస్సులో మన రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ ఝాన్సీ పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లాలోనే U.కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామంలో దళితులు సాగుచేసుకొంటున్న చెరువు భూములను ప్రభుత్వం స్వాధీనపర్చు కునేందుకు ప్రయత్నించగా దాన్ని దళితులు ప్రతిఘటించారు. నిర్బంధాలను ఎదుర్కొన్నారు. దళితుల పోరాట ఫలితంగా మొత్తం 22 ఎకరాల భూమి ప్రత్యేకించి దళితులకు 15 ఎకరాల భూమి వేరే చోట నుంచి ప్రభుత్వం అందజేసింది.

మతోన్మాదానికి వ్యతిరేకంగా, గుజరాత్ మారణకాండకి నిరసనగా వివిధ ఆందోళన లలో మన కామ్రేడ్స్ పాల్గొన్నారు. కృష్ణా జిల్లాలో 2002 ఏప్రియల్ 16న ధర్నా జరిగింది.

నిర్బంధానికి వ్యతిరేకంగా

రైతాంగం, గ్రామీణ పీడిత ప్రజలు, ఆది వాసులు, దళితులు నిర్వాసితులు ఎదుర్కొంటున్న వైవిధ్యపూరితమైన జీవిత సమస్యలను మనం పోరాట నినాదాలుగా చేసి వారితో కలసి పోరాడు తున్న క్రమంలో మనమూ నిర్బంధాన్ని ఎదుర్కొన వలసి వస్తుంది. నిజానికి ప్రజలపై అనునిత్యం పీడక వర్గాలు, ప్రభుత్వం సాగించే నిర్బంధం యొక్క కొనసాగింపుగా రైతు-కూలీ పీడిత, దళిత ప్రజల కోసం నిలచిన సంస్థలపై నిర్బంధం కొనసాగుతున్నది.

గుంటూరు జిల్లాలో మన సంస్థపై ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలో కనీస ప్రజా కార్యకలాపా లకు వీలులేని విధంగా నిర్బంధం అమలు అవుతున్నది. కల్తీ విత్తనాలు, పురుగు మందులు అరికట్టాలని పిడుగురాళ్ళలో ప్రదర్శన చేస్తున్న 200 మంది రైతుకూలీలపై పోలీసులు లాఠీఛార్జీ జరిపారు. యం.ఆర్.ఓ.కు మెమోరాండం ఇవ్వ కుండా లాక్కొన్నారు. మన సంఘం జిల్లా కార్యదర్శి కా॥ నాగేశ్వరరావును అరెస్టు చేసి ఆఫీసు తాళాలు పగుల గొట్టి; వెతికి అనంతరం ఇంటరాగేట్ చేసారు. ధర్నాలు వంటి కనీస ప్రజానిరసనలకి సైతం పోలీసుల ముందస్తు అనుమతిని కోరు తున్నారు. సభలు, సమావేశాలకి అవకాశం లేని వాతావరణం ఏర్పరుస్తున్నారు.

ఇక విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల ఆదివాసులపై నిత్యనిర్బంధం అమలవుతున్నది. దానిని ప్రజాతంత్ర శక్తుల అండతో భూమి పోరాటాలలో భాగంగా ఎదుర్కొని సాగాల్సి వస్తున్నది.

నెల్లూరు జిల్లాలో మన సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిషోర్‌తో సహా 15 మందిని అరెస్టు చేసి హత్యాయత్నం వంటి సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు బనాయించారు. ఈ అరెస్టులకి నిరసనగా వందలమంది ప్రజలు నెల్లూరు కలెక్టరు కార్యాల యం వద్ద బైఠాయించి ఆందోళన జరిపారు. మన కామ్రేడ్స్ జైలునుంచి విడుదల అయిన తర్వాత జైళ్ళల్లోని స్థితిగతులపై మరలా ధర్నా జరిపారు. ఈ ఆందోళన ఫలితంగా ఒక మేరకు జైళ్ళలో కనీస సౌకర్యాలు మెరుగుపడేందుకు వీలు అయింది. నెల్లూరు జిల్లా గూడూరులో జిల్లా కార్యదర్శి కా॥సునీతను బలవంతపు వసూళ్ళ పేరుతో అరెస్టు చేసి కేసు బనాయించారు.

హత్యాకాండకు వ్యతిరేకంగా

ఇది ఇలా ఉన్న సమయంలో గుంటూరు జిల్లాలో మన మొక ప్రత్యేక సమస్యను ఎదుర్కొం టున్నాం. విప్లవసంస్థ అని చెప్పుకొంటున్న న్యూ డెమోక్రసి మన నాయకులను హత్య చేస్తున్నది. గుంటూరు జిల్లా పీడిత ప్రజల నాయకుడు, మట్టి నుంచి ఎదిగిన ప్రజా కార్యకర్త కామ్రేడ్ అంగడి చెన్నయ్యను న్యూడెమోక్రసి హంతక దళం కిరాతకంగా హత్యచేసింది. న్యూడెమోక్రసి పిరికితనంతో చేసిన ఈ హత్య గుంటూరు జిల్లాలో ఒక నూతన ఒరవడిలో సాగుతున్న పీడిత ప్రజల ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు, న్యూడెమోక్రసి

పార్టీలో అనేక ప్రాంతాలలో పెల్లు బుకుతున్న నిరసన, అసమ్మతులను హత్యా రాజ కీయాల ద్వారా అణచివేయగలమనే హెచ్చరికను తన నిర్మాణం లోని శ్రేణులకి ఇచ్చేందు కు ఉద్దేశించబడింది. కామ్రేడ్ చెన్నయ్య మరణాన్ని తట్టుకొని ఖండించి ముందుకు సాగుతున్న దశలో మన రైతుకూలీ సంఘం జిల్లా ఉపా ధ్యక్షులు కామ్రేడ్ దూపాటి అప్పారావును మరల న్యూడెమోక్రసి కిరాయి హంతకులచే హత్య చేయించింది. కామ్రేడ్ దూపాటి అప్పారావు సంస్మ రణను మార్చి19న పాత్తూరులో జరుపుకున్నాం. విప్లవ రాజకీయాల నుంచి హత్యా రాజకీయాలను బహిష్కరించే పోరాటాన్ని సాగించాలని నిర్ణయించు కొని ఉన్నాం. పిరికితనంతో రాజకీయ కక్షలతో చేసే హత్యలు, హంతకులు చరిత్రలో ఎక్కడ చేరుతారో వారికి మనం చూపించగలగాలి. నిబ్బరంగా ముందుకు సాగాలి.

ఐక్యకార్యాచరణ

ఇంతటి విస్తృతమైన కార్యకలాపాలు సాగించ డంలో మనం స్వతంత్రంగా పనిచేస్తూనే వివిధ సంస్థలు, ప్రజాస్వామిక సంస్థలు, దళిత, ప్రజా తంత్ర వాదులతో సాగిస్తున్న ఐక్యకార్యా చరణ కృషి ప్రాముఖ్యత కలిగింది. 12 రైతు - రైతుకూలీ సంఘాల ఐక్య కార్యాచరణలు, వ్యవసాయ రంగ పరిరక్షణకై ఏర్పాటు చేసిన కమీషన్, ఆదివాసీ సమస్యలు, నీటి పారుదల, గిట్టుబాటు ధరలు, దళిత సమస్యలు, ప్రపంచ బ్యాంకు, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రచార ఆందోళనలలో మనం ఐక్య కార్యాచరణ కృషిలో ఉన్నాం. చిత్తశుద్ధితో మనం ఐక్య కార్యాచరణ కార్యకలాపాల్లో పాల్గొంటున్నాం. చౌకబారు ప్రచారాలకి, స్వల్ప నిర్మాణ ప్రయోజ నాలకి ప్రజల విశాల ఉద్యమ ప్రయోజనాలు బలికాని వ్వరాదన్నది మన వైఖరి. దీనికి అను గుణంగా ఐక్య కార్యాచరణలలో సంస్థలు, వ్యక్తులు ఫోకస్ కావడంకన్న ప్రజలను వేధిస్తున్న సమస్య, ఆందోళనా డిమాండ్లు ఫోకస్ అవడం అవసర మని భావించి కృషి చేస్తున్నాం.

కామ్రేడ్స్ !

ఈ ఏడాది మనం అనేక కష్టాలకు గురయ్యాం. రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు కామ్రేడ్ మండ్ల సుబ్బా రెడ్డి, కామ్రేడ్ కనమతరెడ్డి అంజిరెడ్డి అనారోగ్యం వాతబడి మరణించడం రైతుకూలీ విప్లవోద్య మాలకు ఎనలేని నష్టాన్ని కలిగించింది. అలాగే అనంతపురం జిల్లా సంఘం అధ్యక్షులు కామ్రేడ్ సి. నారాయణ రెడ్డి మరణం ఆ జిల్లా ఉద్యమానికి కొరత నేర్పరచింది. గుంటూరు జిల్లా పీడిత ప్రజల నాయకుడు కా॥ అంగడి చెన్నయ్య, గుంటూరు జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు కా॥ దూపాటి అప్పారావు హత్యగావించబడటం జిల్లా రైతుకూలీ ఉద్యమానికి నష్టాన్ని కలిగించింది.

అలాగే అనేక జిల్లాల్లో సంఘ కార్యకర్తలు, నాయకులు ఎన్నో తీవ్రమైన కేసులను ఎదుర్కో వలసి వచ్చింది. జైలు నిర్బంధాలకు గురికావలసి వచ్చింది. చిత్ర హింసలకు గురికావలసి వచ్చింది.

అయినా మన సంఘం తట్టుకొని నిలబడింది. మన కార్యకర్తల పట్టుదల, కార్యదీక్ష, సోదర సంఘాల సహకారం, సంఘీభావం, ప్రజా తంత్ర శక్తుల ఆండదండలు మనం నిలదొక్కుకోవడానికి దోహదపడ్డాయి. ఇది గమనంలో ఉంచుకోవలసిన అంశం.

ప్రపంచీకరణలో భాగంగా సామ్రాజ్యవాదులు ఆదివాసీ ప్రజలను, మైదాన ప్రాంత రైతుకూలీలను, మధ్య, ధనిక రైతాంగాన్ని, చిన్న వ్యాపార వర్గాలను ప్రమాదకరమైన విష వలయం లోకి ఈడుస్తున్నారు. రుణ సౌకర్యాలు, పంటల ధరలు, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం - మొత్తం సామ్రాజ్యవాదుల గుప్పెట్లో పెట్టుకొని ఆడిస్తు న్నారు.

గ్రామీణ ప్రాంతాలలో భూస్వామ్య శక్తులకు రైతు కూలీలకు మధ్య- భూమి సమస్య, సాంఘిక వివక్ష, పెత్తందారీ తనం, కూలీ దోపిడీ (శ్రమ దోపిడీ), కౌలు దోపిడీ, వడ్డీ రూపంలో దోపిడీల - ఫలితంగా వైరుధ్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీని ఫలితంగా వర్గ పోరాటాలు, వర్గ ఘర్షణలు అనివార్యమవుతున్నాయి.

ఇలాంటి స్థితిలో రైతుకూలీలు - అందులో భాగమైన దళిత ప్రజానీకం, వెనుకబడిన కులాలు సంఘటితపడి మరిన్ని పోరాటాలకు సిద్ధం కావడమొక్కటే మార్గం.

భిన్నాభిప్రాయాలు గల సోదర సంఘాలతో కలసి పనిచేయడం - ఐక్య కార్యచరణ దృక్పథాన్ని పెంపొందించుకోవడం నేటి స్థితిలో మరింత అవసరం. గ్రామ గ్రామాన సంఘ నిర్మాణం చేసి పటిష్టపరుస్తూ ; కార్యక్రమాన్ని అమలుచేయడం మనముందున్న కర్తవ్యం.

కామ్రేడ్స్!

గత ఉద్యమాల నుంచి సరైన గుణ పాఠాల ను, వాటి అనుభవ సారాన్ని స్వీకరించి మరింత ముందుకు నడుద్దాం. రైతుకూలీ రాజ్యం కోసం అసువులు బాసిన అమరవీరుల త్యాగపూరిత జీవితాలను ఆదర్శంగా తీసుకొని త్యాగాల బాటలో పయనిద్దాం.

అమరవీరులకి జోహార్లు !

- ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాలు వర్ధిల్లాలి !!

- సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు వర్ధిల్లాలి !!!

- వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి !!!! ★

కలసిపోరాడాల కూలన్నా

- రైతు

ఏవాటి కావాడు ఎండ వావల్లోవ
చేపి చేపి ప్రాణ మిపిగిపోతున్నాది
కూడు చాలవి కూలి ఓరవ్నా
దొరల కుక్కలే వయమురా కూలవ్నా! ॥ఏనాటి॥

ఆర్థరాతిరి కాడ విద్దురేలేస్తాము
బిడ్డలారా మీకు దేముడే దిక్కనీ
కాళ్లు వీడ్చుకపోదు ఓరవ్నా
నిదుర కండ్లతో తూలుతు కూలవ్నా ॥ఏనాటి॥

ఆదరాబాదరా ఆకంతదింపాక
ఆవురావురుమవి అవ్నావికెళ్ళితే
కూడుంటే కూరుండ దోరవ్నా
అపలు చల్లమాటే ఎరుగమోరవ్నా ॥ఏనాటి॥

తాలు తొవ్వన్నమూ తెల్ల కారపు ముద్ద
చేదు నోటికి పోదు బాధ దేవుడెరుగు
ఏడుపే తరుగురా ఓరవ్నా
మవకు ఏందిరా యీ బతుకు కూలవ్నా॥ఏనాటి॥

పని తొందరేదవి, వరుగు లేదాయనీ ?
ఇంకా కాలేదవి, ఇంతపేపాయనీ
వెనుక వనుగుడు మోపు ఓరవ్నా
దొరలకెంత జేసిన మెప్పు లేదవ్నా ॥ఏనాటి॥

ఏ పూట కాపూట ఏపుకొని తింటారు
కూడడిగితే తప్పు కూలడిగితే ముప్పు
కులము మతమంటారు ఓరవ్నా
దొరలు కలవనీయరు మవల కూలవ్నా॥ఏనాటి॥

ఏ కులము వారైన ఏ దేశమందున్న
పేదలంతా ఒకటి బాధలన్నీ ఒకటి
కులము కూడెట్టదుర ఓరవ్నా
మవము కలసి పోరాడాల కూలవ్నా ॥ఏనాటి॥

తీర్మానాలు

1). పోటా చట్టాన్ని రద్దు చేయాలి

ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం పేరిట కేంద్ర ప్రభుత్వం నిరంకుశ చట్టం చేసింది. దీని అమలు పర్యవసనాల గురించి ప్రజా స్వామికవాదులు వ్యక్తం చేసిన అభిప్రాయాలన్నింటినీ ఎన్‌డిఎ పాలకులు పెడచెవిన పెట్టారు. తమిళనాడు జయలలిత ప్రభుత్వం ప్రస్తుత ఎం.పి అయిన వైగోను, ఎల్‌టిటిఇ ని సమర్థిస్తున్నాడన్న పేరిట అరెస్టు చేయడంతో చట్టం గురించిన చర్చ మళ్ళీ జరుగుతుంది. ఆంధ్రరాష్ట్రంలో కూడా ఈ చట్టాన్ని ప్రయోగించడం మొదలుపెట్టారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన టాడా చట్టం దుర్వినియోగం అయిన చేదు అనుభవాలే మళ్ళీకాక తప్పదు. అధికారంలోని పాలకులు రాజకీయ కక్షతో తమకిష్టం వచ్చిన వారిపై కక్ష సాధింపుకు, వేధింపులకు పాల్పడడానికి, ప్రజావుద్యమ కార్యకర్తను వేధించి విచక్షణారహితంగా నిర్బంధించడానికి అవకాశం వున్న ఈ చట్టాన్ని రద్దు చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం.

2) గుజరాత్ మారణకాండకు బాధ్యులైన మోడీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలి.

అయోధ్యలో రామాలయ నిర్మాణం అన్న అంశాన్ని గత దశాబ్దానికి పైగా బిజెపి, సంఘ పరివారీయులు రాజకీయం చేస్తున్నారు. ఇటీవల మళ్ళీ కరసేవకుల్ని అయోధ్యకు తరలించే సందర్భంగా గోద్రాలో రైల్వే భోగీలకు నిప్పు అంటించిన ఘటనను సాకుగా చేసుకొని బి.జె.పి పరివార శక్తులు అహ్మదాబాద్ వంటి నగరాలు, పట్టణాలు, గ్రామాలలో కూడా ముస్లిముల షాపులను, ఇండ్లను లూఠీచేసి తగులబెట్టారు. స్త్రీలపై అత్యాచారాలు చేశారు. కత్తులతో గర్భంలోని పిండాలను సైతం వెలికితీసి చంపారు. సజీవదహనాలకు తలపడ్డారు. ఈ ఘటనలు చూసినవారంతా ఇవి యాదృచ్ఛికం కాదనీ, పథకం ప్రకారం చేసినవేనని భావించారు. గుజరాత్ లోని బి.జె.పి మోడీ ప్రభుత్వం పోలీసుల దాడుల నుండి మైనారిటీ ప్రజలను రక్షించకపోగా హిందూ ఫాసిస్టులకు తోడ్పడ్డారు. దీన్ని భరించలేని ఐ.ఎ.ఎస్ అధికారులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు కూడ.

మోడీ ప్రభుత్వం సహాయక శిబిరాల నుండి కూడ ముస్లిం ప్రజలను ఖాళీ చేయించింది. లక్షలాది మంది నిర్వాసితులయ్యారు. వేల మంది హతులయ్యారు. ఈ మారణ కాండకు బాధ్యులైన బిజెపి మోడీ ప్రభుత్వాన్ని రద్దుచేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. హిందూ ఫాసిస్టు మతోన్మాదానికి వ్యతిరే కంగా పోరాడాల్సిందిగా ప్రజానీకానికి పిలుపు నిస్తున్నాం.

3) పాక్‌కు వ్యతిరేకంగా భారత పాలకులు యుద్ధోన్మాద ప్రచారం నిలిపి వేయాలి. కాశ్మీర్ ప్రజల స్వాతంత్ర్య కాంక్షను ఆమోదించాలి.

ఇటీవలగుజరాత్‌లో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఆగ్రహం వెల్లువెత్తడంతో ఈ సమస్య నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి పాకిస్తాన్ మనపై యుద్ధ సన్నాహాలు చేస్తున్నదంటూ భారత పాలకులు యుద్ధ వాతావరణం సృష్టించారు. తీవ్రమైన ఆంతరంగిక సమస్యలు ముందుకు వచ్చినప్పుడల్లా విదేశీ యుద్ధ బూచిని ముందుకు తేవడం మన పాలకులకు అలవాటే. కాశ్మీర్ లో ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయ సేకరణ) జరిపితే, భారత, పాక్ ఇరుపాలకుల కుట్రలు బట్ట బయలవుతాయి. కాశ్మీర్ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గుర్తించడం ఇరువురికీ ఇష్టం లేదు.

కాశ్మీర్ ప్రజల స్వాతంత్ర్యం కాంక్షను ఆమోదించాలి. పాక్‌కు వ్యతిరేకంగా భారత పాలకులు చేస్తున్న అనవసర యుద్ధోన్మాద ప్రచారాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం.

4) పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు నిలిపివేయాలి. అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలు వశించాలి.

ఎంతో కాలంగా పాలస్తీనా ప్రజలు చేసిన పోరాట ఫలితంగా పాలస్తీనా భూభాగం సాధించుకున్నారు. పాలస్తీనా అధ్యక్షుడు యాసర్ అరాఫత్ ఉగ్రవాదులకు మద్దతు, రక్షణ ఇస్తున్నాడన్న సాకుతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడికి దిగింది. అధ్యక్ష భవనంపై విధ్వంస కరమైన దాడిచేసి అరాఫత్‌ను దిగ్బధించింది. ఈ దాడులను అమెరికా సమర్థించింది. ప్రపంచ వ్యాపితంగా ప్రజల నిరసన వెల్లువెత్తడంతో ఇజ్రాయెల్ వెనక్కు తగ్గక తప్పలేదు. ఈ దురహంకారపూరిత దాడులను ఖండిస్తూ అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఆందోళనోద్యమాలలో పాల్గొనవలసిందిగా ప్రజానీకానికి పిలుపునిస్తున్నాం.

5) కరువు - వలసలను నివారించాలి - కరువు నివారణ చర్యలు చేపట్టాలి.

గత సంవత్సర కరువు పరిస్థితుల నుండి రైతులు - వ్యవసాయ కూలీలు బయటపడక ముందే ఈ సంవత్సరం కూడా వర్షాభావం ఏర్పడటంతో గ్రామీణ ప్రజలు తీవ్ర సంక్షోభంలో పడ్డారు. నీరులేక, నాట్లు పడక రైతులు ఆకాశం వంక ఎదురుచూస్తున్నారు. బ్రతుకు మార్గం ఎలాగా అని భయ పడుతున్నారు. పనులులేక, పూట గడవక వ్యవసాయ కూలీల వలసల పరంపర కొనసాగుతున్నది. మంచి నీటికి, పశువుల మేతకి తీవ్ర ఎద్దడి ఏర్పడింది. జూన్ మొదట్లో కురిసిన వర్షాలకు వేసిన మినుములాంటి మెట్టపైర్లు ఎండిపోయాయి. దీని వలన రైతులు తీవ్రంగా నష్టపోయారు.

రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినా చంద్రబాబు ప్రభుత్వం ఎలాంటి సహాయ చర్యలు చేపట్టలేదు. నీరు సప్లయ్ చేయలేమని, ఆరుతడి పంటలు వేసుకోమని చంద్రబాబు రైతులకు సిగ్గులేకుండా సలహా యిస్తున్నాడు.

అసలు రాష్ట్రంలో కరువు పరిస్థితులకు తెలుగుదేశం - కాంగ్రెస్ పాలకులే కారణం. రైతుల నుండి పెద్దఎత్తున పన్నులు వసూలు చేస్తున్న పాలకులు, రాష్ట్రంలో ఉన్న నదులపై మీడియం, మైనర్ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాలు నిర్మాణాలు ఉద్దేశపూర్వకంగా చేపట్ట లేదు. అందువలనే ప్రతి సంవత్సరం పాలాలకు పారవలసిన వందలాది టి.యం.సి ల నీరు వృధాగా సముద్రం పాలౌతున్నది. ఇందువలనే రాష్ట్రం లో కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

కరువు - వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ కూలీ కుటుంబాలకు 5 వేల ఆర్థిక సహాయం, పూర్తిగా కరువు పనులు వారికే కేటాయించి పనికి ఆహార పథకాన్ని అమలు జరిపి వలసలు నివారించాలని, మంచినీరు, పశువుల మేత సప్లయ్ చేయాలని, రైతుల అప్పులు రద్దు చేయాలని ఈ కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

6) బ్యాంకింగ్‌లో వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యతనివ్వాలి. చక్రవడ్డీలు రద్దుచేయాలి.

ప్రకృతి వైపరీత్యాల వలన సంభవించే వరదలు, నీటి ఎద్దడి, చీడల పీడల వలన రైతుల పంట విపరీతంగా నష్టపోతుంటే, మరొక వైపున

పండిన పంటకు కూడా గిట్టుబాటు ధర లభించటం లేదు. వీటి ఫలితంగా రైతాంగానికి కష్టపడ్డ శ్రమ వృధాతోపాటు, పెట్టిన పెట్టుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ సహకార పరపతి బ్యాంకులు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర తెచ్చిన అప్పులకు వడ్డీలు విపరీతంగా పెరిగిపోయి రైతాంగం తీర్చటానికి గగనమైపోతుంది. చక్రవడ్డీతో బ్యాంక్ అప్పులు ఆంజనేయుడి తోకలా పెరిగిపోతున్నాయి. అప్పులు చెల్లించమని బ్యాంక్ అధికారుల వత్తిడి మూలంగా ఉన్న పాలం అమ్మినా అప్పులు తీరటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ప్రభుత్వ బ్యాంకులలో వ్యవసాయరంగాన్ని ప్రాధాన్యతారంగంగా కొనసాగిస్తూ వడ్డీరేట్లను తగ్గించాలి. చక్రవడ్డీ పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

6. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు 13 గం॥ కరెంటు యివ్వాలి.

రాష్ట్రంలో విద్యుత్ కొరత రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తోంది. విద్యుత్ చార్జీల వసూళ్ళ కోసం గ్రామాల మొత్తానికే విద్యుత్‌ని నిలపటం ఆందోళన పరుస్తుంది. కొందరి బిల్లులు పెండింగ్‌లో వుంటే అందరి రైతులకు విద్యుత్ నిలపటం, సామూహిక శిక్ష బ్రిటీష్ పాలకుల పద్ధతులను గుర్తుకు తెస్తున్నది. వ్యవసాయ మోటార్లకు ప్రస్తుత 3 గం॥ కూడా విద్యుత్ యివ్వని ఫలితంగా పంటలు ఎండిపోతున్నాయి. నల్గొండ వంటి జిల్లాల్లో వ్యక్తమైన రైతాంగ ఆగ్రహం దీని ఫలితమే. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ గురించి చెప్పే మాటలన్నీ భూటకమని తేలిపోయింది. పెంచిన వ్యవసాయ విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టరాదని, రైతులకు 13 గం॥లు నిరంతరాయంగా విద్యుత్ యివ్వాలని రైతుకూలీ సంఘం డిమాండ్ చేస్తున్నది.

7) దేవాలయ భూముల వేలాన్ని ఆపాలి

రాష్ట్రంలో 3 లక్షల 76 వేల ఎకరాల దేవాలయ భూములు ఉన్నాయి. ఈ భూములను పేదలకు, వ్యవసాయ కూలీలకు, దళితులకు కౌలుకి యిస్తామని ప్రభుత్వం చెప్పినా అత్యధిక భూములు బినామి పేర్లతో భూస్వామ్య పెత్తందార్ల స్వాధీనంలోనే ఉన్నాయి. వీటిని పేదలకు కౌలుకిచ్చి లక్షలాది రూపాయల ఆదాయం గడిస్తున్నారు. ఈ విషయం ప్రభుత్వం, ఎండోమెంటు అధికారులకు తెలియంది కాదు. భూముల అమ్మకానికి అనుమతించాలని రాష్ట్రం సుప్రీంకోర్టుకి వెళ్ళగా దేవాలయ భూములు ప్రభుత్వ ఆస్థిగా ప్రకటిస్తూ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు యిచ్చింది.

దీంతో రాష్ట్ర ప్రభుత్వం దేవాలయ భూములను కౌలుదారీ చట్టం నుండి మినహా యిస్తూ, బహిరంగ వేలం ద్వారా అమ్మకానికి నిర్ణయించింది. పేద కౌలుదారులు మార్కెట్ రేటులో 75శాతాన్ని మూడు దఫాలుగా చెల్లించి కొనుక్కోవచ్చని ప్రకటించింది. అలాచేయని పక్షంలో కౌలు రద్దు అవుతుందని ప్రకటించింది. పేదల ఇండ్లనిర్మాణానికి, భూములు యివ్వడానికి ఎస్.సి కార్పోరేషన్, ఎల్.ఐ.సి లాంటి ప్రభుత్వ కార్యాలయాలకు మార్కెట్ రేటు ప్రకారం విక్రయిస్తామని ప్రకటించింది. ఇది జరగని పక్షంలో బహిరంగవేలం ద్వారా ఎవరు ఎక్కువకి పాడితే వారికి ఇస్తామని ప్రకటించింది.

ఆచరణలో పేద కౌలుదారులు మార్కెట్‌లో 75 శాతం ధర చెల్లించి భూములు కొనటం జరిగేపని కాదు. భూస్వామ్య పెత్తందారీ వర్గాలే సిండికేట్‌గా ఏర్పడి అతితక్కువగా పాడిభూములు సొంతం చేసుకొంటారు. ఈవిధంగా ప్రభుత్వం ఆలయభూములపై భూస్వాములకు చట్టబద్ధ హక్కును కల్పిస్తున్నది.

వేలంపాట పేరుతో దేవాలయ భూములు భూస్వాములకు కట్టపెట్టే చర్యలు విడనాడాలని, దేవాలయ భూములను కౌలుదారీ చట్టం నుండి మినహాయించరాదని, పేద, వ్యవసాయ కూలీలకు, దళితులకు దేవాలయ భూములు కౌలుకివ్వాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

8) విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సప్లయ్ చేయాలి.

రాష్ట్రంలో వ్యవసాయ తరుణం వచ్చింది. వర్షాభావ పరిస్థితుల వలన అవి ఇంకా ప్రారంభం కాలేదు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులలో కల్తీకి వ్యాపారులు పాల్పడటం మూలంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. అనంతపురంలో వేరుశెనగ రైతులు, ప్రత్తి, మిర్చి రైతులే ఇందుకు నిదర్శనం. అందువలన రాష్ట్రంలో ఏర్పడిన దుర్భిక్ష పరిస్థితుల్లో మేలురకమైన విత్తనాలను ఉచితంగాను, ఎరువులు, పురుగుమందులను సగం సబ్సిడీతోను ప్రభుత్వమే సప్లయ్ చేయాలని ఈ జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది.

9). ప్రభుత్వ కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీల అమ్మకాన్ని విరమించాలి.

ప్రపంచబ్యాంక్ షరతులకు తలవొగ్గిన చంద్రబాబు ప్రభుత్వం పరిశ్రమలతోపాటు, పంచదార ఫ్యాక్టరీలను కూడా ప్రైవేటువ్యక్తులకు అతిచౌకగా అమ్మటం ప్రారంభించింది. ఆముదాలవలస, కృష్ణాజిల్లా హను మాన్‌షుగర్, గుంటూరు జిల్లా జంపని షుగర్, చిత్తూరు జిల్లా షుగర్ మొదలైన షుగర్ ఫ్యాక్టరీలను రాష్ట్ర ప్రభుత్వం అమ్మటం, అమ్మకానికి పెట్టడం జరిగింది. అనేక ఫ్యాక్టరీలలో రైతుల భాగస్వామ్యం ఉన్నప్పటికీ, కనీసం వారితో సంప్రదించకుండా, వారి వ్యతిరేకతను పరిగణలోనికి తీసుకోకుండా ప్రభుత్వం వ్యవహరించింది. నష్టాల్లో ఫ్యాక్టరీలు ఉన్నందువల్లనే అమ్ముతున్నామని ప్రభుత్వం ప్రకటించడం సమస్యను ప్రక్కదారి పట్టించటమే. అనేక ఫ్యాక్టరీలకు రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించవలసి ఉంది. ఈ బకాయిలను చెల్లించి, ఫ్యాక్టరీ పాలక-అధికారుల్లో ఉన్న అవినీతిని అడ్డుకుంటే ఫ్యాక్టరీలకు నష్టం అనే సమస్య ఉండదు. అనేక షుగర్ ఫ్యాక్టరీల్లో రైతులకు కోట్లాది రూపాయలు బకాయిలు చెల్లించవలసి ఉంది. అందుకు చర్యలు తీసుకోకపోవటం వలన రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఫ్యాక్టరీల అమ్మకం వలన వేలాది మంది వీధినపడే పరిస్థితి ఏర్పడింది. చెరకు రైతులు ప్రైవేటు పెట్టుబడిదారుల దోపిడీకి గురౌతారు. అందువలన చెరకు ఫ్యాక్టరీల అమ్మకాన్ని నిలుపుదల చేయాలని రైతుకూలీ సంఘం జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది. ఫ్యాక్టరీల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ, బకాయిల కోసం రైతుల సాగిస్తున్న ఆందోళనకు మద్దతు తెలియజేస్తున్నది.

10) కనీస వేతన చట్టాన్ని అమలుపర్చాలి.

వ్యవసాయ కూలీలను వేతన దోపిడీ నుండి కాపాడటానికి అంటూ వ్యవసాయ కూలీల వేతన చట్టాన్ని 1948లో పాలకులు ప్రకటించారు. దీన్ని రెండు సంవత్సరాలకొకసారి సవరించాలి. ఇప్పటి వరకు సవరించిన చట్టాల్లో పెరిగిన ధరలు, వ్యవసాయకూలీల కనీస అవసరాలు పరిగణలోనికి తీసుకోకుండా కూలీ రేట్లను నిర్ణయించటం జరిగింది. అయినప్పటికీ చేసిన చట్టాన్ని కూడా, ప్రభుత్వం, లేబర్ ఆఫీసర్లు అమలుజరపటం లేదు. అత్యధిక ప్రాంతాల్లో చట్టం ప్రకారం కూలీరేట్లు యివ్వకుండా, వ్యవసాయ కూలీలను దోచుకుంటున్నారు. చట్టం అమలు కోసం సంఘటిత ఉద్యమాల

ద్వారా చట్టంకన్నా హెచ్చు కూలీరేట్లను సాధించుకున్నారు. ప్రస్తుత నాట్ల తరుణంలో కనీస వేతన చట్టాన్ని అమలు జరపాలనీ, స్త్రీలకుయిస్తున్న కూలీ వ్యత్యాసాన్ని రూపుమాపాలని జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది. హెచ్చు కూలీరేట్లకై ఉద్యమించాలని వ్యవసాయ కూలీలకు పిలుపునిస్తున్నది.

11) వ్యవసాయ పరపతి సంఘాల కుదింపుని వ్యతిరేకిస్తూ

వ్యవసాయ రుణాలు, వివిధ బ్యాంకుల ద్వారా మన రైతాంగానికి అందుతున్నది చాలా తక్కువే. ఎక్కువగా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గరే రైతులు రుణాలు తెచ్చుకుంటున్నారు. రైతులకు ప్రతి సంవత్సరం వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా పంటరుణాలు అందుతూ ఒక మేరకు ఉపయోగకరంగా ఉన్నాయి. సబ్సిడీలు, రుణాలు రైతులకు తగ్గించాలని ప్రపంచబ్యాంకు విధించిన షరతులకు అణగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయపరపతి సంఘాలను పెద్దఎత్తున కుదించటం జరిగింది. దీని వలన పేద, మధ్య తరగతి రైతాంగంకు రుణాలు అందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. రైతాంగాన్ని ఇది ప్రైవేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లోకి నెట్టివేస్తున్నది. దీనికి వ్యతిరేకంగా రైతాంగం ఆందోళన ప్రారంభించారు. వ్యవసాయ పరపతి సంఘాల కుదింపుని ప్రభుత్వం విరమించి యధాతధంగా కొనసాగించాలని రైతుకూలీ సంఘం రాష్ట్రజనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది.

12) పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే చేపట్టాలి.

పది పంచవర్ష ప్రణాళికలు పూర్తి అయినా మొదటి ప్రణాళికలో ప్రారంభించిన ప్రాజెక్టులు కూడా పూర్తి కాలేదు. అందువలన వందలాది టి.యం.సిల నీరు, ముఖ్యంగా గోదావరి నదిలోని వెయ్యి టి.యం.సిల నీరు సముద్రంలో వృధాగా కలసిపోతుంది. ప్రాజెక్టులు కట్టి ఉంటే సాగు-త్రాగు నీరు సమస్య ఏర్పడేది కాదు. రైతాంగం ఆందోళన చేసిన సందర్భములో కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయటం, నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించటమే కానీ పనులు జరగటం లేదు. గోదావరితో సహా వివిధ నదుల నుండి వృధాగా పోతున్న నీటిని నిల్వ చేయటానికి మధ్యతరహా - చిన్న నీటి ప్రాజెక్టులు, చెక్‌డాంలు, ఎత్తిపోతల పథకాలు వెంటనే చేపట్టాలని, ఇంతకు ముందు ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది.

13) 1/70 చట్టాన్ని అమలుచేయాలి

మహత్తర శ్రీకాకుళ పోరాటం ద్వారా గిరిజనుల భూములు గిరిజనేతరులు కొనరాదని చట్టం చేయబడింది. గిరిజనులు అధికంగా వున్న గ్రామాలను షెడ్యూల్డు ఏరియాగా ప్రకటించి ఈ ఏరియాలో గిరిజనుల భూములు గిరిజనేతరులు కొనరాదు, అమ్మరాదు అనేది చట్టం. కాని ఈ పాలకులు ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర పన్నుతున్నాడు. రైతుకూలీ సంఘం ఈ చట్టాన్ని ఏజెన్సీ ఏరియాలో సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

14) సాగునీరు, త్రాగునీటి ప్రైవేటీకరణము వ్యతిరేకిస్తూ

మన రాష్ట్రంలో సాగునీరు - త్రాగునీరుకి పుష్కలంగా నీటి వనరులు ఉన్నాయి. వీటిని ప్రజలకు, రైతాంగానికి అందించటంలో పాలకులు పూర్తిగా విఫలమైనారు.

నీటి ద్వారా సంక్రమిస్తున్న అనేక జబ్బుల గురించిన స్పృహ ప్రజలలో పెరిగి పరిశుభ్రమైన, రక్షిత మంచినీటిని కోరుకుంటున్నారు. దీన్ని గమనించిన బహుళజాతి కంపెనీలు మినరల్ వాటర్ పేరిట నీటిని అమ్ముతూ వందల కోట్ల రూ॥ వ్యాపారం చేస్తున్నాయి. క్రమంగా మున్సిపాలిటీల్లో, కార్పోరేషన్లలో నీటి సరఫరా బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారు. నీటికి మీటర్లు పెట్టి దాని ప్రకారం వసూలు చేయజూస్తున్నారు.

ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు సాగునీటి వనరుల నిర్వహణ బాధ్యత నుండి కూడా ప్రభుత్వం తప్పుకుంటోంది. సాగునీటికి కూడా మీటర్లు పెట్టి వాటి ప్రకారం బిల్లులు వసూలు చేసేందుకు పథకరచన చేశారు. రైతాంగ ప్రతిఘటన మధ్య మీటర్లు బిగించారు. ఈ ప్రైవేటీకరణను నిలిపివేయాలి. రక్షిత మంచినీరు, సాగునీరు అందించే బాధ్యతను ప్రభుత్వమే చేపట్టి, సమర్థవంతంగా నిర్వహించాల్సిందిగా ఈ సమావేశం డిమాండ్ చేస్తోంది.

15) ప్రజా ఉద్యమాలపై, మహిళా - దళితుల పై పాగుతున్న నిర్బంధాన్ని - దాడులను ఖండిస్తూ

పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద, భూస్వామ్య శక్తుల అనుకూల విధానాల వలన అన్ని రంగాల ప్రజలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. పేద రైతులు భూములు కోల్పోతున్నారు. కూలీలు పనులు దొరకక వలసలకు వెళ్ళిపోతున్నారు. మధ్య, ధనిక, రైతాంగం తీవ్రమైన అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఈ సమస్యలతో సమమతమౌతున్న కార్మికులు, ప్రజలు ఆందోళనకు దిగుతుంటే ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. మహిళలు, దళితులపై భూస్వామ్య, పెత్తందారీ వర్గాల దాడులు, దౌర్జన్యాలు నిరంతరం సాగుతు న్నాయి. ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజలపైన మహిళల పైన, దళితులపైన ప్రభుత్వ నిర్బంధాన్ని కొనసాగిస్తున్నది. విప్లవ సంస్థల నాయకత్వం పైన పోలీసుల క్రూరమైన నిర్బంధాన్ని అణచివేతను ప్రయోగిస్తున్నది. ఈ నిర్బంధాన్ని జనరల్ కౌన్సిల్ ఖండిస్తున్నది.

16) కరీంనగర్ కుట్రకేసును ఎత్తివేయాలి

సి.పి.ఐ (ఎం.ఎల్) జనశక్తి రాష్ట్ర నాయ కత్వం పైన (లీగల్‌గా పనిచేస్తున్న వారిపైన) కరీంనగర్‌లో పోలీస్‌స్టేషన్ పేల్చివేతకు కుట్ర పన్నారంటూ కుట్ర కేసు పెట్టారు. పోలీసులు అక్రమంగా బనాయిం చిన ఈ కుట్రకేసును ఎత్తివేయాలని జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది.

17) పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి.

పశ్చిగోదావరి జిల్లాలో జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో గిరిజనులు ఎంతోకాలంగా భూసమస్యలపై పోరాడుతున్నారు. గిరిజనుల భూములను గిరిజనేతరులు భూస్వాముల, పెత్తందార్ల నకిలీ హైకోర్టు తీర్పులు, పట్టాదారు పాస్ పుస్తకాలు నకిలీవి సృష్టించి 40 వేల ఎకరాల గిరిజనుల భూములు, గిరిజనేతరుల ఆక్రమణలో వున్నట్లు బయట పడ్డాయి. కుంభకోణంలో బయటపడ్డ భూములను గిరిజనులకు అప్ప జెప్పాలని, పశ్చిమగోదావరి జిల్లాలో సాగు తున్న ఐక్య ఆందోళనకు రైతుకూలీ సంఘం మద్దతు తెలియచేస్తున్నది. గిరిజనులపై పెట్టిన కేసులన్నీ ఎత్తివేయాలని జనరల్ కౌన్సిల్ డిమాండ్ చేస్తున్నది. ★

ఆయన జీవితం వీరోచితం, ఆయన మరణం కూడా వీరోచితమే!
అంగడిచెన్నయ్యకు జోహార్లు

ప్రియమైన ప్రజలారా!

శ్రామిక మేధావి అంగడిచెన్నయ్య హత్య మనలందరినీ కలచివేసింది. ప్రతి జీవితానికి మరణం అనివార్యం కావచ్చు. కాని అంగడిచెన్నయ్య జీవితం ప్రజా ఉద్యమాలకు అవసరం. ఆయన ఊపిరి ప్రజాజీవితాలకి అనివార్యం. ఎందుకంటే ఆయన ప్రజల మనిషి. శ్రామికుల శ్రేయోభిలాషి. పోరాటాలలో వెన్నుచూపని వీరుడు. దరహాసంలో విజయదర్పం. ప్రజాకవి, గేయ రచయిత, సాంస్కృతిక రంగంలో ఆయన మహత్తరమైన శిల్పి, ఉద్యమాలను ముందుండి నడిపించటంలో అమోఘమైన దార్శనికత్వాన్ని ప్రదర్శించాడు. అన్నింటికి మించి దళిత పోరాట సమితికి ఆప్తమిత్రుడు. గత దశాబ్ద కాలంగా దళిత ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్న క్రియాశీలి. సామాజిక అట్టడుగు పొరల్లోంచి చీల్చుకువచ్చి ఎంతో ఎత్తుకు ఎదిగిన ఆయన జీవితం శ్రమతో పెనవేసుకుపోయింది. అందరికీ ఆయన మంచి మిత్రుడు. ఆయన రాజకీయ నిర్మాణంతో నిమిత్తం లేకుండానే ఎందరో ఆయనకు చేరువ కాగలిగారు. అంతటి స్నేహశీలి. ఎగసివస్తోన్న దళితోద్యమానికి ఆయన ప్రభావితు డయ్యారు. అంబేద్కర్ రచనలను అధ్యయనం చేశారు. విప్లవోద్యమంతోను, దళితోద్యమంతోనూ అనేక అంశాలపై ఆయనకు బేధాభిప్రాయాలు న్నప్పటికీ ఆచరణలో తేల్చుకోగలమనే ధృడ విశ్వాసాన్ని ప్రకటిస్తుండేవారు. సాంప్రదా యకంగా విద్యావంతుడు కాకపోయినప్పటికీ మానసిక శ్రమ, శారీరక శ్రమల మధ్యగల అంతరాన్ని తొలగించటం ఆయనకే సాధ్యమయ్యింది.

శ్రమైక జీవనం ఆయన సౌందర్యం

అంగడి చెన్నయ్య అందగాడు. మట్టిలో పుట్టి మట్టిలో పెరిగిన పెద్దాయన. శ్రమలో నుంచి ఎదిగిన మేధావి. ఆయన దళిత బహుజనుల ఉక్కుమనిషి. రాజకీయాల్లో రాటుదేలిన రాడికల్. సుఖాల మధ్య గారాబంగా పెరిగిన అనుభవం ఆయనకు లేదు. ఆటుపోట్లకు ఆయన జీవితం అంకిత మయ్యింది. అంగడి చెన్నయ్య అందరికోసం జీవించాడు. అందరికోసం మరణించారు.

మీడియా కన్నుల్లో రంగుల కోణం

ప్రజల మనిషి అంగడి చెన్నయ్యపై పాత్రికేయం పోలీసులతో జోడికట్టి "రౌడీషీటర్" గా గగ్గోలు పెట్టింది. ప్లస్, మైనస్‌ల గణితంలో నిమగ్నమైంది. కా॥ అంగడి చెన్నయ్య గొప్ప మానవతావాది. ఆయనకు హృదయం ఉంది. ఆక్రోశం ఉంది, వర్గకసిని ప్రదర్శించటానికి కన్నెర్రచేయగల సత్తా ఉంది. పీడిత ప్రజానీకం హక్కులకోసం పోరాడగల దమ్ము ఆయనకే సొంతం. అదే కొందరికి కంటగింపైంది. మీడియాకి డిఫరెంట్‌గా ఉంది. పరమ హంతకులు కోడెల, దేవినేని నెహ్రూ, కరణం బలరాం, వెంకయ్య నాయుడు, వై.యస్ రాజశేఖర్‌రెడ్డి ఇత్యాదులను రాజకీయ ప్రముఖులుగా గుర్తించిన పాత్రికేయం, ప్రజారక్షకుడు చెన్నయ్యను మాత్రం రౌడీషీటర్‌గా గుర్తించటం వర్గ దృష్టిలో భాగమే. పూలన్‌దేవి హత్య సందర్భంలో కూడా ఆమెను బందిపోటు రాణిగా గుర్తించడం తప్ప పార్లమెంట్ సభ్యురాలిగా ఏ కోశాన పరిగణించలేదు. ప్రతిరాజకీయ నాయకుడి అనుచరగణం, రౌడీయిజంతో ముడిపడుతూ ఉండగా కనీసం ఒక్క అక్షరం కేటాయి ంచని మీడియా అంగడి చెన్నయ్య రాజకీయ జీవితాన్ని రౌడీషీటర్‌గా మరల్చడం వర్గ దృష్టిలో భాగమే. (క్షమించడండి! ఆయన కులం "ఎరుకల")

హితులారా!

అంగడి చెన్నయ్య రాజకీయ, నిర్మాణంతో మనకు సంబంధం లేకపోవచ్చు. కాని ఆయన వ్యక్తిత్వం మనకు ఆదర్శం. ఆయన జీవితం మనకు గైడ్‌లైన్. ఆయన మరణం మనకు విజృంభణ. దళిత, గిరిజన, బహుజన ఉద్యమాల్లో ఆయన ఎప్పటికీ ఆదర్శప్రాయుడే. దళిత పోరాట సమితి కా॥ అంగడి చెన్నయ్యకు నివాళులు అర్పించడం ఈ సందర్భంగా కర్తవ్యంగా భావిస్తోంది.

దళిత పోరాట సమితి
రాష్ట్ర కమిటీ, ఆంధ్రప్రదేశ్

అన్న అమరుడురా

- అంగడి చెన్నయ్య

అన్న అమరుడురా - మన రామనర్సయ్యా
పీడిత ప్రజలా - ఆశాజ్యోతి ॥అన్న॥
కష్టజీవిగా పుట్టినాడు - కాయకష్టం చేసినాడు
కష్టఫలితమే కోరినాడు - కమ్యూనిజమును మెచ్చినాడు ॥అన్న॥
మార్క్స్ బోధన చేసినాడు - లెనిన్ బాటన నడిచినాడు
మావో మార్గమే అనుసరించి - భరత భూమిని చాటినాడు ॥అన్న॥
ప్రజల బాగును కోరినాడు - ప్రజాసంఘాల్ పెట్టినాడు
ప్రగతి మార్గమె చూపినాడు - ప్రథమ శ్రేణిలో నిలిచినాడు ॥అన్న॥
సమానత్వం కోరినాడు - సంఘశక్తిని పెంచినాడు
సమరపంథా పూనినాడు - సాయుధంగా నడిచినాడు ॥అన్న॥
దున్నేవానిదె భూమి అంటు - పంట భూములు పంచినాడు
భూస్వాముల చూసినాడు - భగ్గుభగ్గున మండినాడు ॥అన్న॥
ఖమ్మము, వరంగల్లు - కరీంనగరు జిల్లాలో
శ్రీకాకుళము జిల్లాలో - ఉభయగోదావరుల్లో
గిరిజనులనే లేపినాడు - పోరుబాటలో నడిపినాడు ॥అన్న॥
శత్రు మూకలు పొంచినాయి - కుతంత్రాలు పన్నినాయి
ద్రోహినొకనిని పట్టినాయి - డబ్బును ఎర చూపినాయి ॥అన్న॥
హైదరాబాదు నగరమందు - మలక్‌పేటప్రాంతాన
కలత నిదుర చెదరకముందే - తూర్పు ఎర్రబడకముందే ॥అన్న॥
నిరాయుధుడు అయిన అన్నను - చూసినారు పోలీసులు
ఆయుధాలతో చుట్టుముట్టి - రామనర్సయ్యను పట్టినారు ॥అన్న॥
వరంగల్లు జిల్లాలోన - నర్సంపేట తాలుకాన
పాకాల చెరువుదగ్గర - చిలకలగుట్ట అడవిలోన ॥అన్న॥
చిత్రహింసల ఎన్నోపెట్టి - చేతివ్రేళ్ళు నరికినారు
విప్లవమే నా మార్గమంటె - సిగ్గు విడిచి కాల్చినారు ॥అన్న॥
ఆ వార్తవిన్న వీర ప్రజలు - పళ్లుపటపట కొరికినారు
అన్న మార్గాన్నెంచుకొని - పోరుబాటలో కదిలినారు ॥అన్న॥

అనుబంధాలు

★ గిరిజనులను అడవి నుండి గెంటివేతపై

★ కష్టజీవి మహిళల అంతర్జాతీయ మహిళాదినోత్సవం

★ చేనేత కార్మికుల న్యాయమైన సమస్యలపై

★ ఉప్పు రైతుల సమస్యలపై

★ దుగ్గేరు మెడికల్ క్యాంప్

★ పొగాకు గిట్టుబాటు ధరల కోసం

★ పత్తి, మిర్చి గిట్టుబాటు ధరల కోసం

★ ధాన్యం, చెరకు గిట్టుబాటు ధరల కోసం

★ సుబాబుల్, జామాయిల్ గిట్టుబాటు ధరల కోసం

★ రొయ్యల రైతాంగ సమస్యలపై

★ కరెంట్ మీటర్ల బిగింపుపై రొయ్యల రైతాంగం

★ తుఫాన్ బాధితుల నష్టపరిహారం కోసం

★ సింగూరు జలాల కోసం

★ దళితుల హత్యలు, సాంఘిక బహిష్కరణలపై

★ డిప్యూటి జైలర్ అక్రమాలు, అవినీతిపై

★ పశ్చిమ గోదావరి ఆదివాసులపై నిర్బంధం

★ పంపింగ్ స్కీమ్ సమస్యపై పెత్తందారీ శక్తుల, పోలీసుల దురాగతాలు

★ కణేకల్లు పరిపర ప్రాంతాల్లో పోలీసు నిర్బంధంపై

★ ఈత ముక్కల దేవాలయ భూముల కోసం

★ సూగేపల్లి దేవాలయ భూముల కోసం

★ కపిలేశ్వరపురం జమిందారు పీలింగ్ భూముల కోసం

★ కొత్తపట్నంలో ' పనికి ఆహార పథకం ' అమలు కోసం

★ ఆత్మకూరు పెత్తందార్లదాడులను ఖండిస్తూ

[illegible]

గిరిజనులను అడవి నుంచి గెంటివేసే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలి!

ఆదివాసుల హక్కుల పరిరక్షణకై సమైక్యంగా ఉద్యమించండి!!

వేల సంవత్సరాల నుంచి అడవినే కన్నతల్లిగా నమ్ముకుంటూ, అడవిలోనే జీవిస్తూ; బానిస, రాచరిక (ఫ్యూడల్) వ్యవస్థకు వ్యతిరేకంగా గణతంత్ర వ్యవస్థకు దానికి పూర్వ లక్షణాలు కలగలిపి నిలబెట్టుకుంటూ వస్తున్నారు మూలవాసులైన ఆదివాసులు. అడవులు-కొండలు, వాగులు, వంకలు, నదులున్న ప్రాంతాలలో వీరు నివసిస్తున్నారు. వారి సహజ హక్కులకు భంగం కల్గించిన రాజులకు, మహారాజులకు, వలస దోపిడీ దారులకు వ్యతిరేకంగా వందలాది ప్రాంతాలలో వేలాది పోరాటాలు సాగించి తమ ప్రత్యేక అస్థిత్వాన్ని నిలబెట్టు కుంటూ వచ్చారు. డచ్చి, పోర్చుగీస్, ఫ్రెంచి, బ్రిటీషు వలస పాలకులకు నాగరిక వ్యవస్థలున్న భారతదేశపు రాచరిక ఫ్యూడల్ వ్యవస్థలు లొంగి పోయాయి. కానీ మూలవాసులయిన ఆదివాసులు తలొంచలేదు. అందుకే బ్రిటీషు వలసపాలకులే 1860-1917 వరకు సాగిన అనేక ఆదివాసుల పోరాటాల ఫలితంగా, 1917 లో షెడ్యూల్డ్ ఏరియా లాంటి సంస్కరణలకు దిగక తప్పలేదు. దానినైనా సక్రమంగా అమలు చేయనందునే 1919 నుంచి కోయలు-కొండరెడ్లు, కోలాలు, ముండా జాతులకు చెందినవారు; గోండులు, వర్లీలు, బిల్లులు తదితర అనేక ఆదివాసీ తెగలు మరలామరలా పోరాటాలు సాగించారు. 1947 తర్వాత హైద్రాబాద్ సంస్థానం, దానిని ఆనుకొన్న ప్రాంతాల్లో ఆదివాసీ పోరాటాలు కమ్యూనిస్టుల నాయకత్వాన విస్తరించాయి.

అందుకనే భారతరాజ్యాంగ నిర్మాతలు కూడా ఈ పోరాటాలను గుర్తించే 1949లో ఆమోదించిన రాజ్యాంగంలోని 5,6 షెడ్యూల్‌లలో ప్రత్యేకంగా ఆదివాసీ ప్రాంతాల్ని వర్గీకరించారు. ఆ తర్వాత 1959లో ఆంధ్రప్రదేశ్‌లోనూ; దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ మరికొన్ని సవరణలు, సంస్కరణలను చేపట్టాల్సి వచ్చింది. 1960 నుంచి అటు బెంగాలు, ఇటు ఆంధ్ర, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో తిరిగి ఆదివాసీ ఉద్యమాలు మొదలై 1967-78 నాటికి దేశంలోని వివిధచోట్ల ముఖ్యంగా నక్సల్‌బరీ, గోదావరి లోయ, శ్రీకాకుళం తదితర ఆదివాసీ ప్రజల మిలి టెంట్ పోరాటాలు జరిగాయి. ఫలితంగా రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్‌ను మరింతగా పటిష్టపరిచే విధంగా 1/70 చట్టం తేబడింది. అయినా ఆదివాసీ ప్రజల భూములు, సంపదలు అన్యాక్రాంతం కావడమనేది మరింతగా విస్తరించింది. ఈ విషమ పరిస్థితుల మధ్య ఆదివాసుల్లో పనిచేస్తున్న సంస్థలు, సంఘాలు, ఋుతులు, వ్యక్తులు చట్టబద్ధంగాను; చట్టాల పరిధిని అధిగమించి, అనేక పద్ధతుల్లో సాగించిన అనేక ఉద్యమాల ఫలితంగా 1980లో ఫారెస్టు కన్సర్వేషన్ చట్టం తెచ్చే ముందు కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలకు వివరమైన వాగ్దానాలు అనేకం చేసింది.

25-10-2002కు ముందు ఆదివాసీ భూ హక్కుల్ని క్రమబద్ధీకరించేందుకు ఒక సమగ్ర ప్రణాళిక రూపొంది ంచాలని 18-9-1990లో ఆరు సర్క్యులర్స్ విడుదల చేశారు. ఆదివాసీ భూముల్ని తిరిగి స్వాధీనం చేసు కొనేందుకు గ్రామకమిటీ 1-6-1990న ప్రతిపాదనలు అందాయి. 20-12-1990న వాటి క్రమబద్ధీకరణ కనుగుణంగా సవరించారు. 1980 ప్రణాళికకు ముందు కాలంలో ఆదివాసీ హక్కుల్ని పటిష్టపర్చాలనే డిమాండుకు 1990 కార్యక్రమం బలోపేతం చేయాల్సి ఉంది. అలాగే 1988 అటవీ విధానం (The Forest Policy) లో అడవుల సంరక్షణ-ఆదివాసీ ప్రజల మధ్య నున్న అవినాభావ సంబంధం గురించి నొక్కి చెప్పింది.

1990 షెడ్యూల్ కులాల కమిషన్ తన 29వ రిపోర్టులో మరింత విలువైన సిఫార్సులను చేసింది. ఆ సందర్భంగా విడుదల చేసిన వివిధ సర్క్యులర్స్ ద్వారా ఆ సిఫార్సుల ప్రాధాన్యత అర్థమవుతుంది. బన్వాసి సేవాశ్రమ కేసులపై సుప్రీంకోర్టు (1985-94) ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి ఆదివాసులు తమ భూములు పొందే విధంగా, అడవి భూములు గా మార్చే నెపంతోనే భూములు పోకుండా న్యాయ సహాయాన్నందిస్తుంది. 1995లో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికల్లో భూముల్లేని ఆదివాసీలకు భూమిని పొందేహక్కు నిర్ణయించవలసినదిగా సుప్రీంకోర్టు ప్రదేశ్ ప్రభు కేసులో ఆదేశించింది.

40/96 కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు; ముఖ్యంగా గిరిజన గ్రామపాలనలోని స్వయం నిర్ణయాధికారాలను, గ్రామసభలకు ఇచ్చిన అధికారాలు కూడా అమల్లోకి రావాలి. అందుకోసం దేశంలోనూ; మన రాష్ట్రంలోని ఆదివాసీ ప్రజలు దాని అమలుకోసం ఉద్యమిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్టికల్ 338,339 క్రింద ఏర్పాటైనది భూరియా కమిషన్. ఈ కమిషన్‌ను గాని, ఆర్టికల్ 164 రాజ్యాంగంలో కలిగిఉన్న ఆదివాసీ మంత్రిత్వశాఖను గాని సంప్రదించకుండానే గతంలో సుప్రీంకోర్టు వివిధ సందర్భాలలో (1997లో సమతవేసిన కేసు సందర్భంగా) భూమిపై విలువైన ఇతర వనరులపై గల హక్కును గుర్తించింది. సామాజికన్యాయం చేకూర్చింది.

వీటన్నింటినీ పరిగణలోనికి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం వంచనా దృష్టితో జయకృష్ణన్ కమిషన్ వేసింది. ఈ కమిషన్ 50 సంవత్సరాల్లో ఆదివాసుల కారణంగా 4,59,978 కోట్ల నష్టము ప్రభుత్వానికి వచ్చిందన్న తప్పుడు లెక్కల్ని ప్రకటించింది. సుప్రీంకోర్టు యిచ్చిన 23-11-2001 నాటి తీర్పులు అంతకు పూర్వపు సుప్రీంకోర్టు యిచ్చిన వివిధ తీర్పులకు భిన్నంగాను, సామాజిక న్యాయ సూత్రానికి భంగం కలిగే విధంగా ఉన్నది ఈ తీర్పు ఆధారంగా 3-5-2002న కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాలకు జిల్లా కలెక్టర్లకు, కన్సర్వేటర్లకు సర్క్యులర్‌లు పంపింది. ఇందులో 30-9-2002 నాటికి" చట్ట విరుద్ధంగా ఆక్రమణకు గురైన అడవి భూముల నుంచి గిరిజనులను ఖాళీ చేయించమని తాఖీదు ఇచ్చారు.

ప్రభుత్వం చాకచక్యంగా ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అమలు చేయుట కొరకే జయక్రిష్ణన్ కమిషన్ ఏర్పాటు చేసిందనేది రుజువైంది. ఈ జయ క్రిష్ణన్ గారు అంతకుముందున్న రాజ్యాంగంలోని 5,6 షెడ్యూల్స్, ఆ తర్వాత వచ్చిన 1/70 చట్టాన్ని, అదే విధంగా పైన పేర్కొన్న కేంద్ర ప్రభుత్వమే వేసిన వివిధ కమిషన్స్, వివిధ చట్టాలను, సుప్రీంకోర్టు అంతకుమందు ఇచ్చిన తీర్పుల్ని చివరకు భూరియా కమిషన్‌నుగానీ, 40/96 కేంద్ర చట్టాన్నిగానీ ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకపోవడమే ఎంత కుట్రపూరితమైనదో తెలుపుతున్నది. కేంద్ర ప్రభుత్వంపైన ప్రపంచ బ్యాంకు వత్తిడి, అది ఇస్తానన్న 650 కోట్ల రూపాయల తాజా రుణసహాయం యొక్క పాత్రను కూడా అర్థం చేసుకోవాలి. సుప్రీంకోర్టు

కూడా గత చరిత్రను; తనకు ముందే ఉన్నత న్యాయస్థానాలు అంతకుముందు ఇచ్చిన తీర్పులు, సూచనలు, డైరెక్షన్లు, సామాజిక న్యాయకోణం నుండి ఎంత దూరమై వ్యవహరించిందో అర్థమవు తుంది. సరిగ్గా ఈ తీర్పుకోసమే గుంటకాడి నక్క వలె కేంద్ర ప్రభుత్వం దాని ఆధీనంలో అటవీ, పర్యావరణ శాఖలు కాచుకున్నాయి. రూపొం దించిన ప్లాను ప్రకారం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అటవీశాఖ కార్యదర్శులకు, కన్సర్వేటర్లకు, కలెక్టర్లకు లేఖలు వ్రాయించి పంపిణీ చేయించడం వారి అసలు కుట్రను బహిర్గతం చేస్తున్నది.

కేంద్రప్రభుత్వ కుట్రలోభాగస్వామి అయిన మన రాష్ట్ర ప్రభుత్వం 1981 కంటే ముందే ఈ భూములు తమ ఆధీనంలో ఉన్నట్లు ఆదివాసులు రుజువు చేసు కోవాలన్న వంచనా పూర్వక ప్రకటన చేసింది. క్రమబద్ధీకరించే అధికారం రాష్ట్రానికే మాత్రం లేదని తెలిసి కూడా ముఖ్యమంత్రి అమాయకులైన గిరిజను లను వచించదల్చాడన్న మాట. సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా 31 లక్షల ఎకరాల భూమితో పాటు కోటి మంది ఆదివాసులు తమ సహజ హక్కులకు దూరం చేయబడి అడవి తల్లి ఒడి నుంచి దూరంగా ఎక్కడకో? ఎలా! విసిరి వేయబడ్తారో, తరిమి వేయబడ్తారో అర్థం కావడం లేదు. మన రాష్ట్రంలోని 7 లక్షల ఎకరాల భూమితో పాటు లక్షలాది మంది ఆదివాసులు, వేద గిరిజ నేతరులు భూతల్లయిన అడవితల్లి నుంచి తరిమి వేయబడ్తారు. వీరికి ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిరాశ్రయులుగా చేసి తరిమి వేయజూస్తున్నారు.

ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థల కనుసన్నల్లో మొదలైన ప్రవంచీకరణకోసం ప్రారంభించిన సంస్కరణల కంటే చాలా కాలం ముందు నుంచే మన రాష్ట్ర ప్రభుత్వం అడవులను బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేసే పథకా లను పకడ్బందీగా అమలు జరుపుతున్నది. ఐ.టి.సి. భద్రాచలం లాంటి కంపెనీలకు వేల ఎకరాల అడవి భూములను కట్టబెడ్తూ వచ్చింది. అలాగే చింతపల్లి పాడేరు ఏజెన్సీ భూములను బాక్సైట్ కంపెనీలకోసం కట్టబెట్టి వేలాది గిరిజనుల జీవితాలతో చెలగాట మాడుకునే విధానాలకు వ్యతిరేకంగా గిరిజనులు ఉద్యమించారు. ఆ పథకాన్ని నిలువరింప జేశారు. 1996 నవంబరులో పశ్చిమగోదావరి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం భూస్వామి హోతా రామచంద్రమూర్తి గిరిజనులను భూముల నుండి బేధఖల్ చేయించ డానికి వ్యతిరేకంగా వుద్యమిస్తుంటే వందలాది పోలీసులను రక్షణ ఇచ్చి కా॥ కారం పార్వతిని భూస్వామి స్వయంగా కాల్చి చంపడానికి దోహద పడ్డారు. గిరిజనులకు చెందాల్సిన 39 వేల ఎకరాల ఎల్.టి.ఆర్. భూములను, అడవి గయ్యాలి భూములు 7 వేల ఎకరాలను భూస్వాముల పరం చేయడానికి వ్యతిరేకంగా వుద్యమిస్తున్న గిరిజను లను 6వేల మందిని హత్యాయత్నం కేసుల్లో ఇరి కించి వేధించపూనుకొన్నది. దీనికి వ్యతిరేకంగా గత 2 సం॥లుగా వుద్యమం సాగుతుంది. ఈ సందర్భంగా నకిలీ జడ్జిమెంట్ల ద్వారా భూస్వాము లకు, వారి తాబేదార్లకు పట్టాలిచ్చిన తీరు బహిర్గత మైనది. అందుకు కారకులయిన అధికారుల్ని, భూస్వాములను శిక్షించాలని; ఆ భూములను గిరిజనులకే ఇవ్వాలనీ ప్రజా సంఘాలు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నా ప్రభుత్వం నుండి స్పందన లేదు. తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో కూడా ఆదివాసులు ఉద్యమిస్తున్నారు. 1997లో నవంబరు విజయనగరం జిల్లా దుగ్గేరులో ప్రభుత్వము భూస్వాములకు సహకరించి పోలీసుల దన్నుతో గిరిజనుల పై దాడిచేస్తే తిప్పికొట్టిన సందర్భం గా కా॥ జెన్ని తిరుపతి అమరుడైనప్పటికీ ఆదివాసీలు భూములు వదులుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆదివాసీ వ్యతిరేక విధానాలకు ఇవన్నీ సజీవ సాక్ష్యాలు.

రాష్ట్రంలో ఆదివాసులైన గిరిజనులకు అండగా కమ్యూనిస్టులు, విప్లవకారులు, ప్రజాస్వామిక శక్తులు, ప్రజాసంఘాలు, వ్యక్తులు అండదండ లందిస్తూ వస్తున్నారు. మేధావులు, పత్రికా రచయితలు అన్ని విధాల సహకరించుతూ వస్తున్నారు.

ఆదివాసీలు ఏనాడూ అడవిని నాశనం చేయ లేదు. వలసపాలన కాలంలోనూ, స్వా(హా)తంత్ర్యం వచ్చిన తర్వాత 55 సం॥రాల కాలంలోనూ; ప్రభుత్వం-కాంట్రాక్టర్లు, పేపరు మిల్లర్లు, స్మగ్లర్లు, పాలకపార్టీ ప్రముఖులు కలిసి ఒక పథకం ప్రకారం అడవిని కొల్లగొడ్తూ వస్తున్నందునే నాశనం అవుతూ, అటవీశాతం తగ్గుతూ వస్తుంది. అలాగే భూస్వా ములు, ముఠాదారులు, జమీందార్లు, ఎస్టేట్ దారులు ఇందులో భాగస్వాములై మేలైన గిరిజన భూములన్నీ కాజేస్తూ వచ్చారు. వారే లక్షలాది ఎకరాలను కొల్ల గొట్టారు. ఫారెస్టు అధికారులు బలంగా వీరందరికీ సహకరిస్తూ వస్తున్నారు. దొంగతనం చేసిన దొంగే "దొంగ దొంగ" అని అరుస్తూ ప్రజల్ని ప్రక్కదారి పట్టించినట్లే ప్రవంచబ్యాంకు ఆదేశాలను పాటించే నేటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ కాలుష్యాని కి, అడవి సంపద వినాశనానికి అడవి బిడ్డలే కారకులని; సుమారు 5 లక్షల కోట్ల సంపద గిరిజనులే కాజేసినట్లు కమిషన్ ద్వారా చెప్పించి కోర్టు ద్వారా తీర్పు ఇప్పించి, ఆదేశాలు జారీచేస్తూ ఆదివాసులను అడవితల్లి ఒడి నుంచి దూరం చేసే కుట్రలకు పాల్పడుతున్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఈ వైఖరి ఆదివాసుల అస్థిత్వానికి ప్రమాదకరమైనది. ఆదివాసీ నిర్మూలనకే తోడ్పడుతున్నది. ఈ వైఖరిని వెంటనే మార్చు కోవాలని డిమాండ్ చేస్తున్నాం. 23-11-2001 నాటి సుప్రీంకోర్టు తీర్పును రద్దుపర్చడానికి; సుప్రీంకోర్టు ఫుల్ బెంచికి పంపడం ద్వారా, లేదా పార్లమెంటులో అలాంటి తీర్పును రద్దుపర్చే సవరణ చేయడం ద్వారా గానీ గిరిజన రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. ఆదివాసులకు వివిధ చట్టాల క్రింద అనగా 5,6వ షెడ్యూలులు 1/70, 40/96 పంచాయతీ చట్టం; 1997లో సమతా కేసు సందర్భంగా ఆ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమల్లో ఉండే విధంగా అవసరమయిన చర్యలన్నీ తీసుకోవాలని, మన రాష్ట్రంలోని షెడ్యూల్డు ఏరియాలకు ప్రాంతీయ స్వపరి పాలన అధికారం యివ్వాలని, వాటన్నింటినీ ఖచ్చింత గా అమలు జరుపడానికి పూనుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోను, షెడ్యూల్డు వంతుగా ఉన్న ఇతర ప్రాంతా లలో తమ హక్కుల రక్షణకు ఆదివాసులు సాగిస్తున్న పోరాటాలను ఆమోదించాలి. వాటిని అణచడానికి ఇప్పటి వరకు ప్రభుత్వం తీసుకొన్న చర్యలన్నీ రద్దుపర్చాలి.

మానవజాతులలో అట్టడుగున పడి ఉన్న ఈ ఆదివాసుల హక్కుల పరిరక్షణకు పూనుకొనుటకు ప్రజలు, ప్రజాతంత్రవాదులు, అన్ని రాజకీయ పార్టీల వారు ముందుకొచ్చి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

యం. ఓంకార్ (మాజీ ఎం.ఎల్.ఎ) కన్వీనర్
ఆదివాసీ హక్కుల వేదిక
(భూమి, నీరు, అడవి, సహజవనరుల పరిరక్షణ)

ధూన్సీ, అధ్యక్షులు
రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)

భీమిరెడ్డి వర్శింహారెడ్డి మాజీ ఎం.పి.
అధ్యక్షులు, ఆం.ప్ర. రైతు సంఘం

కె. కోటయ్య, ప్రధాన కార్యదర్శి
రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)

మార్చి '8' అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకొన్న కష్టజీవి మహిళలు

"శ్రమ విముక్తితోనే మహిళా విముక్తి"

రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో దగ్గేరులో అంతర్జాతీయ మహిళాదినోత్సవం జరిగింది. 450మంది మహిళలు హాజరైన ఈ సభలో శ్రమ విముక్తికోసం సాగుతున్న పోరాటాలను వివరించారు. భూమిపై హక్కు సాధించుకోవడం ద్వారానే మహిళలపై అణచివేతను ప్రతిఘటించగలుగుతామని ; భూమికోసం, భుక్తికోసం సాగే పీడిత ప్రజల ఉద్యమాలతో మహిళా ఉద్యమం భుజం భుజం కలిపినపుడే మహిళా విముక్తికి మార్గమేర్పడుతుందని వివరించారు.

" కష్టజీవి మహిళల సమస్యకి మూలమైన భూమి సమస్య పరిష్కరించబడాలి"

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల మహిళా సదస్సుకి రైతుకూలీ సంఘం, మహిళా సంఘం నాయకురాలు కా॥ టి.అరుణ అధ్యక్షత వహించారు.

ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ఆధ్వర్యాన జరిగిన ఈ సభలో "వుత్పత్తి సాధనాలపై, వనరులపై మహిళలకి హక్కు లేకుండా వున్నంతకాలం స్త్రీల జీవితాలకి సాధికారత సాధ్యం కాదని, కష్టజీవి మహిళల సమస్యలకి మూలమైన భూమి నమన్య వరిష్క రించబడకుండా సమాజంలో ప్రజాస్వామిక విలువల చెలామణికి తగిన భూమిక వీర్పడదని, నిజమైన అర్థంలో మహిళా సాధికారత సాధ్యం కాదని నవయువసమాఖ్య రాష్ట్ర సహాయ కార్య దర్శి అమలేందు అన్నారు. కా॥ అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ వ్యవస్థ స్త్రీ, పురుష వ్యక్తిత్వాలని ఆరోగ్యంగా కనిపించనీయదని, దీన్ని అర్థం చేసుకొని (సామాజిక చైతన్యం, ఆచరణతో కూడిన) వ్యక్తిత్వాలను సంతరింప చేసుకోవాలని చెప్పారు. కా॥ భానుమూర్తి (జనసాహితి) మహిళలపై వున్న పితృస్వామిక దోపిడీ అణచివేతలు, అదనపు చాకిరీ, లైంగిక వేధింపుల పరిష్కారం కష్టజీవి మహిళల నిజమైన సాధికారత సాధనలో వుందని" వివరించారు. చివరగా అధ్యక్షురాలు "పాలకులు మహిళల జీవితాలను దుర్భరం చేసారని; గిరిజన, రైతుకూలీ ఉద్యమంలో, ప్రజాతంత్ర ఉద్యమంలో ముందుండి పోరాడటం మహిళా ఉద్యమ కర్తవ్యం" అని వివరించారు. అనంతరం 400 మందితో ప్రదర్శన జరిగింది.

"సామ్రాజ్యవాద వ్యతిరేక మహిళా పోరాటం నేటి అవసరం"

గుంటూరులో పి.ఎఫ్.డబ్ల్యూ (ప్రోగ్రెసివ్ ఫెడరేషన్ ఆఫ్ వుమెన్) ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్ (స్త్రీవిముక్తి) లు సదస్సు నిర్వహించారు. లెక్చరర్ జయశ్రీ స్వాతంత్రోద్యమంలో, చీరాల పేరాల ఉద్యమం; కన్నెగంటి హనుమంతు పోరాటంలో స్త్రీల పాత్ర వివరించారు. పి.ఎఫ్.డబ్ల్యూ జిల్లా కార్యదర్శి కా॥ మల్లీశ్వరి మాట్లాడుతూ అణచివేతకి గురవు తున్న మహిళలు నేడు తిరగబడుతున్నారని, ఇది ఇంకా తీవ్రమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంగా మారాల్సి వుందని చెప్పారు. పి.ఓ.డబ్ల్యూ నాయకురాలు కా॥ శోభారాణి పాలకుల మహిళా సాధికారత లోని బండారాన్ని వెల్లడిచేస్తే, పి.ఎఫ్.డబ్ల్యూ నగర కార్యదర్శి కా॥ సావిత్రి మాట్లాడుతూ సామ్రాజ్యవాద విచ్చలవిడి విషసంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో విద్య, వైద్య సౌకర్యాల గురించి కా॥ రుక్మిణి మాట్లాడగా, శ్రామిక మహిళా దినోత్సవం మార్చి '8'. కానీ ఈ రోజుని ధనవంతులు అందాల పోటీలు, ఫ్యాషన్ పెరేడ్‌లు, ముగ్గులు, వంటల పోటీలుగా దిగజార్చారని వక్తలు వివరించారు. అనంతరం 300 మందిమహిళలు పట్టణంలో ప్రదర్శన జరిపారు.

రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో పీడిత, శ్రామిక, మధ్యతరగతి మహిళాజనం మార్చి '8' న భూస్వామ్యవ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్యూడల్ భావాలు, పితృస్వామిక ధోరణులకి వ్యతిరేకంగా పోరాటం శ్రమవిముక్తి పోరాటంలో భాగంగా సాగాలనే వర్గ చైతన్యాన్ని ప్రతిబింబిస్తూ జరుపుకున్నారు.

"భూస్వామ్య, సామ్రాజ్యవాద, పితృస్వామిక భావజాలానికి వ్యతిరేకంగా పోరాడాలి"

మార్చి '8' అంతర్జాతీయ మహిళా దినం సందర్భంగా ఒంగోలులో జిల్లా నాయకురాలు పి. శాంతకుమారి అధ్యక్షత వహించారు. వినియోగదారుల ఫోరం సభ్యురాలు మట్లె రాఘవ రాణి మాట్లాడుతూ చట్టంలో స్త్రీ పురుషులకు వున్న సమానహక్కులను మహిళలు అవగాహన చేసు కొని చైతన్యవంతులు కావాలని అన్నారు. మహిళల పై జరుగుతున్న హింసను అడ్డుకోవటానికి మహిళా సంఘాలు ఐక్యంగా పోరాడుతున్నారన్నారు.. పి.ఒ.డబ్ల్యూ (స్త్రీ విముక్తి) రాష్ట్ర నాయకురాలు టి. శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ మహిళలను గుర్రాల తో తొక్కించిన రాష్ట్ర



ప్రభుత్వం, మహిళా సాధి కారత గురించి మాట్లాడటం బూటకమన్నారు. స్త్రీల సమస్యల పరిష్కారానికి 'సాధికారత' పరి ష్కారంకాదని, భూస్వామ్య, సామ్రాజ్యవాద, పితృ స్వామిక భావజాలానికి వ్యతిరేకంగా పోరాడినపుడే నిజమైన పరిష్కారం సాధ్యమవుతుందన్నారు.

రైతుకూలీ సంఘం జిల్లా నాయకురాలు లలిత కుమారి మాట్లాడుతూ మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. గ్రామాల్లో భూస్వామ్య పెత్తందార్ల వేధింపులకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించా లన్నారు. ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ నీరద కూడా ప్రసంగించారు." గ్యాస్ ధరలు తగ్గించాలని, ఒంగోలు మహిళా కళాశాలల్లో విద్యార్థినులపై వేధింపుల కేసులను, ప్రత్యూష కేసులో దోషుల్ని శిక్షించాలని, పనిహక్కు, ఉపాధి గ్యారంటీ కల్పిం చాలనీ మహిళలపై వేధింపులను అరికట్టాలని" కోరుతూ సదస్సులో తీర్మానాలు ఆమోదించారు.

" భూమిపై, పరిశ్రమలపై హక్కులు సాధించడమే నిజమైన మహిళా సాధికారత "

మార్చి '8' అంతర్జాతీయ మహిళాదినం సందర్భంగా నెల్లూరు జిల్లారాపూరులో సభ జరిగింది. సభకు అధ్యక్షత వహించిన కా॥ రమ మాట్లాడుతూ శ్రామిక మహిళా పోరాటాలకు సంకేతంగా నిలిచిన మార్చి '8' యొక్క విశిష్టత ను వివరించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన స్త్రీ విముక్తి నాయకురాలు కా॥ చల్లపల్లి విజయ ప్రసంగిస్తూ సాధికారత మహిళా పాదుపు పథకంలో లేదని, మహిళలు భూమిపై, పరిశ్రమలలో హక్కులు సాధించినప్పుడు మాత్రమే లభిస్తుందని, అప్పుడు మాత్రమే ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాలలో సాధికారత సాధ్యమన్నారు.

రైతుకూలీ సంఘం జిల్లా కన్వీనర్ కా॥ సునీత మట్లాడుతూ మహిళలు శ్రమదోపిడీతో పాటు లైంగిక వేధింపులకు గురౌతున్నారని, అసంఘటిత రంగాలలోని మహిళల దుస్థితి కడుదయనీయంగా వుందని; యాంత్రీకరణ, కరువు, అతివృష్టి కారణంగా ముందు ఉపాధి కోల్పోతున్నది మహిళ లేనన్నారు. శ్రమ విముక్తికై జరుగుతున్న పోరాటా లలో స్త్రీలు నిర్ణయాత్మక పాత్ర పోషించాలన్నారు.

"స్త్రీలకు రిజర్వేషన్ ద్వారా పదవులొచ్చినా పెత్తనం పురుషులే పాగిస్తున్నారు "

అంతర్జాతీయ మహిళాదినం సందర్భంగా పి.ఒ.డబ్ల్యూ (స్త్రీ విముక్తి) ఆధ్వర్యంలో మచిలీ పట్నంలో సభ జరిగింది. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకురాలు దేవభక్తుని నిర్మల, పి.ఒ.డబ్ల్యూ (స్త్రీ విముక్తి) నాయకురాలు పామర్తి అంజమ్మ ప్రసంగించారు. మహిళా హక్కులను కాపాడడం కోసం అనేక చట్టాలున్నప్పటికీ, మహిళలపై అణచివేత యధావిధిగా సాగుతోం దన్నారు. స్థానిక సంస్థల్లో స్త్రీలకు రిజర్వేషన్లు కల్పించినా పురుషులే పదవులను నిర్వహిస్తూ వ్యవస్థనే వెక్కిరిస్తున్నారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సి.హెచ్. లలిత మాట్లాడుతూ, మహిళలు సంఘటితపడి ఆందోళనచేసి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మహిళాసమాఖ్య, ప్రగతిశీల మహిళాసంఘం (స్త్రీవిముక్తి) సంఘాలు సంయుక్తంగా ఈ సభ నిర్వహించారు. ★

సారామానేయరో

- వాకిన్

సారామానేయరో - సారామానేయరో
సారాదాగూతుంటె - సంసారం పాడురో - సారా మానేయరో ... ॥సారా॥
తాగుడొద్దంటెరో - తగదాని యంటెరో
తాగొచ్చి మత్తుల - తన్ని సంపావురో - తాగుడొద్దంటెరో..... ॥సారా॥
పాట్టకు కరువాయెరో - బట్టకు కరువాయెరో
పిల్లలెంత తిండిలేక - పిట్టలైనారురో - పాట్టకు కరువాయెరో ॥సారా॥
సాగునీరు లేదురో - తాగు నీళ్ళు లేవురో
సర్కారు సారా కొట్టు - సందుసందు కుందిరో - సాగునీరు లేదురో..... ॥సారా॥
సారంటే విషంరో - సారంటే సావురో
సుక్కా బందూజేసి - సక్కాగుందామురో - సారంటే విషంరో ॥సారా॥
గుత్తెదార్లానురో - గుంజుకుంట కొట్టిరో
మద్దతిచ్చె దళారుల - మక్కేలిరగదన్నరో - గుత్తెదార్లానురో ..... ॥సారా॥
పోరు జెయ్యాలిరో - జోరు జెయ్యాలిరో
సారా సర్కారోన్ని - సాగనంపాలిరో - పోరుజెయ్యాలిరో ॥సారా॥

ఎంతేమందికి లొంగి యుందామె

- నాకిన్

ఎంతమందికి లొంగి యుందామె - అక్కయ్య మనము
ఎంతకాలము కృంగిపోదామె
ఎంతకాలం లొంగియుందా మెంతకాలం కృంగిపోదాం
ఎన్ని సేవలు జేసినా మన నెవ్వరింతను గానరైరి ॥ఎం॥

ముంతంత పిల్ల ముంతమోయడాని కాసరాయని
జానెడంత వుండగానె చాకిరీలు నేర్పినారు.
ఎంతకాలం మైనగానొక అయ్యచేతిలో బెట్టుదామని
సదువు సందెల నేర్పక సంసార నీతులు జెప్పినారు ॥ఎం॥

అటలోవ పాటలోవ చదువులందు భేదమాయె
పనులలోవ పండుగల్లో పదవుల్లో భేదమాయె
అలుమగల తేడచ్చిరి అడుజాతికి చిచ్చుబెట్టిరి
ఆడది అబలని జెప్పి మొగోన్ని మొనగాన్ని జేసిరి ॥ఎం॥

కన్నవారు భారమనిరి గుండెలాపై కుంపటనిరి
తోలు బొమ్మల జేసి మనల పెళ్ళి చూపుల తంతులనిరి
అప్పసప్ప జేసుకొనిరి తిప్పలూబడి పెళ్ళి జేసిరి
పసువుకు తలుగేసేవట్లు మెడలు వంచి తాళిగట్టిరి ॥ఎం॥

ఆడదానిగ బుట్టినందుకు అడ్డదుగు అణగద్రొక్కి
కట్టమింక దెమ్మనంటూ కాల్కుకుంట జంపినారు
అధమ ఆడదానివంటూ అదుపులోనే వుండమంటు
పుట్టు మొదలు చచ్చువరకు పుట్టెడు కష్టాలు బెట్టిరి ॥ఎం॥

అత్తమామల వేధింపులు ఆడపడుచుల సాధింపులు
బావ మరుదుల దబాయింపులు భర్తగారికి సపరిచర్యలు
ఎన్ని విధముల సేవజేసెవ తన్నియెన్నో మాటలనిరి
బడితపూజలు జేసుడాయె బావిలో పడవేసుడాయె ॥ఎం॥

కూలినాలి జేసుకుంట పిల్లజెల్లల సాదుకుంట
పగలు రాత్రులు పనులు జేస్తూ పస్తులా యంత్రాల మైతిమి
అవ్వమేదని అలిగి గదమాయించి దంచెబోల్లె గాని
తిన్నావా నీవానియడిగె దిక్కులేని దీనులైతిమి ॥ఎం॥

నాడు కన్యాశుల్కముతో నంతలోని నరుకులైతిమి
వీడువలతో వేదవలతో బానిసలుగా బ్రతికినాము
నేడు వరకట్నాల చితిలో చిక్కి నమిధలయ్యినాము
ఆర్తనాదాలాశలుడిగి ఆత్మహత్యలు జేసుకుంటూ ॥ఎం॥

ఆకలొక్కటీ దాహమొక్కటీ రక్తమొక్కటీ ప్రాణమొక్కటీ
పురుష ఆధిపత్యమేల? అధికారము కంతులేదా?
తాకని తాకట్టుబెట్టడు ఆలుబిడ్డల నమ్ముకొనెడు
స్వాతంత్ర్య దేశములో స్త్రీ జాతిని ముంచినారు ॥ఎం॥

అంతరాలు మరిచిపోయి ఆడవాళ్ళము కల్సిపోయి
హక్కులను సాధించుకొనగ ఒక్కటయ్యి పోరుదాము
సమానత్వం పొందుటకు ఈ సమాజాన్ని మార్చుదాము
స్త్రీల శక్తిని చూపుదాము స్త్రీ విముక్తిని చాటుదాము

ఎందుకింకా లొంగియుందామె అక్కయ్య మనము
క్కంగె కాలం కూల గొడ్డామె.

మనుగడకోసం సాగుతున్న చేనేత కార్మికుల న్యాయమైన ఆందోళనకు సంఘీభావంగా...

కృష్ణాజిల్లా రైతుకూలీ సంఘం (ఆంధ్రా)

అమెరికా పడగనీడలో వరల్డ్‌బ్యాంక్ ఆదేశాలతో దేశంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు అమలు చేస్తున్న నూతనఆర్థిక సంస్కరణలవల్ల అన్నివర్గాల ప్రజలు ముఖ్యంగా చేనేత కార్మికులు సంక్షోభపు సుడిగుండంలోపడి సతమతమవుతున్నారు. వ్యవసాయం తరువాత దేశంలో 1.2 కోట్లు, రాష్ట్రంలో 30లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేతరంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. గ్రామీణాభివృద్ధికి దోహదపడే చేనేత రంగాన్ని పాలకులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు?

మార్కెట్ శక్తుల నుండి చేనేత రంగాన్ని కాపాడేందుకు రిజర్వు చేయబడిన 22రకాల వస్త్రాల తయారును సత్యంకమిటి సిఫార్స్ మేరకు 11 రకాలకు కుదించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని తట్టుకునేందుకు, నాణ్యతా ప్రమాణాలు పెంపొందించేందుకు ఇది తప్పనిసరి అని సమర్థించుకొంటున్నారు. టెక్స్‌టైల్ మిల్లర్లు చిలపనూలు (హాంక్‌యారన్)ను 50% వరకు తప్పనిసరిగా ఉత్పత్తి చేయాల్సిఉండగా, దీన్ని కేంద్రప్రభుత్వం సమీక్షించటంతో చిలపలనూలు ఉత్పత్తిని 12-15% తగ్గించారు. లాభసాటిగా ఉన్న సింథటిక్ నూలు (కోన్‌యారన్) ఉత్పత్తిని ఆమేరకు పెంచారు. పైపెచ్చు ఈ నూలుపై 4% ఎక్సైజ్ డ్యూటీని తగ్గించడం వారిపాలిట వరమైంది. దీనితోపాటు చిలపలనూలు పై 9.2% సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, 8% సెంట్రల్ సేల్స్‌టాక్స్ విధించారు. అదే సమయంలో చిలపలనూలు ఎగుమతులు పెరగటంతో ధర విపరీతంగా పెరిగేందుకు కారణం అయ్యింది. చిలపలనూలుపై పన్ను తగ్గించాలని డిమాండ్ చేస్తున్న తెలుగుదేశం ప్రభుత్వం 4% సేల్స్‌టాక్స్ విధించడంలో అర్థం ఏమిటి? ఈస్థితిలో మిల్లర్ల వస్త్రాల ధరలు తగ్గి చేనేత వస్త్రాల ధరలు పెరగటంతో కొనుగోళ్ళు లేక నిల్వలు పేరుకుపోయి చేనేత వస్త్రాల ఉత్పత్తి స్తంభించి పోయింది. చేనేత రంగం మనుగడ ప్రశ్నార్థకమయింది.

కేంద్ర పాలకులు బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కనుగుణంగా తీసుకున్న నిర్ణయాలు ఎంతటి విపత్కరపరిస్థితికి దారి తీస్తున్నాయంటే 1999-2000 కాలంలో 1600 కోట్ల విలువ చేసే ఆధునిక జౌళియంత్రాలు దిగుమతి చేసుకుని వాటి ఉత్పత్తికి సరిపడా ప్రత్తినూలు లేనందున, విదేశాల నుండి పెద్దఎత్తున లక్షల టన్నుల కొద్ది వాటిని దిగుమతి చేసుకోవటంతో ప్రత్తి రైతాంగానికి గిట్టుబాటు ధరల్లేక వందలమంది ఆత్మహత్యలు చేసుకునేందుకు, జౌళిమిల్లుల్లో లక్షలాది కార్మికులు ఉపాధి కోల్పోవటానికి కారకులయ్యారు. ఇంత దారుణం మరొకటి ఉంటుందా! సామ్రాజ్యవాద కంపెనీలకు ఊడిగం చేసి, వారి మోచేతి నీళ్ళుత్రాగే ఈ దళారీ పాలకులు ఎంతకైనా పూనుకుంటారు కదా!

విదేశాల నుండి అటోలూమ్స్, జెట్‌లూమ్స్‌ను దిగుమతి చేసుకోవడం వల్ల చేనేత కార్మికులు ఉపాధి కోల్పోవలసి వచ్చింది. శివరామన్ కమిటి అధ్యయనం ప్రకారం ఒక మరమగ్గం వల్ల 12 మంది వరకు చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతే, **ఒక కోటిలూంల** వల్ల 48 నుండి 60 మంది వరకు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది. దేశంలో 2.5 కోట్లు ఉన్న చేనేత కార్మికులు ప్రస్తుతం 1.2 కోట్లకు తగ్గారంటే ఆధునీకరణ ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది.

1429 పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు, అందులో 329 టెక్స్‌టైల్ ఉత్పత్తులను యధేచ్ఛగా దేశంలోకి విదేశాల నుండి అనుమతిస్తూ చేసిన ఎగ్జిమ్‌పాలసీ సవరణవల్ల మార్కెట్‌లో మన ఉత్పత్తులు పోటీకి తట్టుకోలేక సంక్షోభానికి గురి అవ్వటం ఖాయం. అందులో భాగంగా మన వస్త్రాల పరిశ్రమకు కూడా గడ్డుకాలం దాపురించింది.

రాష్ట్రంలో వున్న 878 చేనేత సహకార సొసైటీలకు ప్రభుత్వం నుండి దాదాపు 250 కోట్లు బకాయిలు రాకపోవడం వల్ల సుమారు 400 సొసైటీలు నష్టాలపాలయ్యాయి. 250 కోట్లు ఆప్కోకు రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సి ఉండగా కేవలం 30 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కనీసంగానైనా నిధులు కేటాయించకపోవడం చేనేత రంగం పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం అవుతుంది. తెలుగుదేశం నాయకులు చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం అని వాగ్దానాలు ఒక ప్రక్క గుప్పిస్తూ మరోప్రక్క ఆ రంగాన్ని దెబ్బతీసే చర్యలు చేపట్టడం ఎంత నయవంచన.

పై వాస్తవాలు పరిశీలించినపుడు ఈదళారీ పాలకులు చేనేతరంగాన్ని ఉద్దేశపూర్వకంగానే నాశనం చేసి విదేశీ, బహుళజాతి కంపెనీలకు ఈ రంగాన్ని ధారాదత్తం చేసి, దేశీయవనరులను, మార్కెట్‌నే వారికి అప్పగించేందుకు పూనుకుంటున్నారని స్పష్టమౌతుంది.

ఈ స్థితిలో ఉపాధి కోల్పోతున్న చేనేత కార్మికులు అప్పులపాలై, తినేందుకు తిండిలేక గతంలో 150 మంది ఆకలి చావులకు గురైనట్టుగా మరోసారి ఆకలి చావుల పర్వం ఆరంభమయినా ఆశ్చర్యపోనక్కరలేదు. రాష్ట్రంలో 10 వేల చేనేత కుటుంబాలు ఆకలి చావులకు గురయ్యే అవకాశం ఉందన్న ఒక సర్వే ప్రకారం తెలుస్తుంటే చేనేత కార్మికుల స్థితి ఎంత దయనీయంగా ఉందో స్పష్టమవుతుంది. ఈ స్థితిలో చేనేత కార్మికుల మనుగడ కోసం, ఉపాధి కోసం,హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. చేనేత కార్మికులు ఈ ఉద్యమాన్ని వివిధ దశల్లో తీవ్రం చేస్తూ ఆఖరికి ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకొనే దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఉద్యమాన్ని నీరుగార్చేందుకు పాలక వర్గాలు పూనుకుంటున్నాయి. పోలీసులు ఈపూరి పాలెం లాంటి చోట్ల అణచివేత చర్యలకు పాల్పడుతున్నారు. న్యాయమైన చేనేత కార్మికుల ఆందోళనకు రైతుకూలీ సంఘం ఉద్యమ పూర్వకమైన సంఘీభావం తెల్పుతోంది. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు పూర్తిస్థాయిలో మద్దతునందిచాల్సినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

డిమాండ్లు :

1. చిలపల నూలుపై 9.2% ఎక్సైజ్‌డ్యూటీ, 8% సెంట్రల్ సేల్స్‌టాక్స్, 4% స్టేట్ సేల్ టాక్స్‌లను రద్దుచేయాలి.
2. సత్యం కమిటి సిఫార్సులను రద్దుచేయాలి.
3. చేనేతను కాపాడుకునేందుకు 22 రకాల వస్త్రాల తయారీని పునరుద్ధరిస్తూ రిజర్వేషన్ చట్టం చేయాలి.
4. 50% చిలపలనూలుతో మిల్లర్లు తయారు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.
5. సొసైటీలకు 250కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి.
6. చేనేత రంగానికి సహాయంగా 100 కోట్లు తక్షణమే కేటాయించాలి.
7. చేనేతను కబళించే ప్రైవేటీకరణ చర్యలను విడనాడాలి.
8. చేనేత కార్మికులకు, గ్రూప్ ఇన్సూరెన్స్, ఇళ్ళ స్థలాలు, పక్కాగృహాలు, వృద్ధాప్యపెన్షన్‌లు కేటాయించాలి.

మచిలీపట్నం, 15-2-02

(పెడనలో ఐక్యకార్యాచరణ కమిటీ నాయకత్వాన ఆందోళన జరిగిన సందర్భంగా)

ఉప్పే రైతులను దివాళా తీయిస్తున్న బహుళజాతి కంపెనీల దోపిడీపై

ప్రకాశంజిల్లా రైతుకూలీ సంఘం (ఆంధ్ర)

ప్రకాశం జిల్లాలో సముద్రతీర ప్రాంతాలైన చిన్నగంజాం, పెదగంజాం, కనపర్తి, మోటుమాల, కొత్తపట్నం, పాకల, ఊళ్ళపాలెం, బింగినపల్లి గ్రామాలలో 20 వేల ఎకరాలలో ఉప్పును సాగు చేస్తున్నారు. రెండు లక్షల సన్న, చిన్నకారు, పేద రైతాంగం, వ్యవసాయకూలీలు ఉప్పు పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పంటను జనవరి నుండి జూన్ నెల (వర్షాలు పడనంత కాలం) వరకు సాగు చేస్తారు. ఇందులో మొదటి నెల రోజులు కొటారును సాగుకు మలచుకోవడానికే సరి పోతుంది. ప్రారంభదశ నుండి ఉప్పు తయారై బయటకు వచ్చే వరకు ఒక్కో ఎకరాకు 30,000 రూ॥లు ఖర్చు అవుతుంది. ఈ ఖర్చుల కోసం రైతాంగానికి, వ్యాపారస్థులు అప్పులు ఇస్తుంటారు. అయితే ఉప్పు పండించిన తర్వాత ఆ వ్యాపారికే అమ్మాలనే ఒప్పందంతో వడ్డీకి అప్పులు తీసుకుంటారు. మరోవైపు ఉప్పు సాగును ప్రభుత్వం పరిశ్రమగా గుర్తిస్తున్నందు వల్ల, చిన్న, సన్నకారు, పేద రైతాంగం పరిశ్రమలు పొందే రాయితీలు పొందలేక వేలాది రూ॥లు కరెంటు బిల్లులు చెల్లించలేక కరెంటు సర్వీసు లను రద్దు చేసుకుంటున్నారు. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో ఉప్పు సాగును వ్యవ సాయంగా గుర్తిస్తున్నందువల్ల అక్కడి రైతాంగం క్వింటా బస్తా ఉప్పు 15 రూ॥లకే తయారు చేస్తున్నారు. కాని మన రాష్ట్రంలో క్వింటా బస్తా ఉప్పు తయారు కావాలంటే 30 రూ॥లు ఖర్చు అవుతుంది. దీనితో ఉప్పు వినియోగించే పరిశ్రమలు, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు తక్కువధర ఉన్న ప్రాంతాలలో కొనుగోలు చేస్తున్నందువల్ల మన జిల్లాలోని ఉత్పత్తులు నిలబడిపోయాయి. గత సంవత్సరం పండించిన ఉప్పు నేటికీ కొనుగోలు చేసే నాధుడు లేక కొండలు మాదిరి ఎదిగి ఉప్పు కువ్వలు నిలచిపోయాయి. ఫలితంగా రైతాంగం వ్యాపారుల అప్పులు తీర్చలేక, పూటగడవని స్థితిలో కూలిపనులకు వెళ్తూ కష్టభరితంగా జీవనం గడుపుతున్నారు. వ్యాపారులు అప్పులు చెల్లించమని వత్తిడి చేస్తుండటంతో, ఈ సంవత్సరం 25% రైతులు ఆరుదల తొక్కుడు తొక్కించి పెట్టుబడులు పెట్టలేక, అప్పు ఇచ్చే నాధుడు లేక కొటార్లను వదిలివేశారు. దీనితో పూర్తిగా రైతాంగం అప్పుల ఊబిలో కూరుకు పోయి, భూములకు దూరం చేయబడుతున్నారు.

ఉప్పు రైతులను దివాళా తీయిస్తున్న బహుళజాతి సాల్ట్ కంపెనీలు:

దశాబ్ది కాలంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితమే ఉప్పు రైతాంగం అప్పుల పాలవ్వటానికి కారణం. డబ్బు సంపాదనే ధ్యేయం కలిగిన బడా కంపెనీలకు, గుత్త పెట్టుబడిదారులకు లాభాలు కట్టబెట్టడానికి ప్రభుత్వం ఉప్పును నిషేధించింది. ప్రజా వ్యతిరేకత పెల్లుబికటంతో తాత్కాలికంగా వెనక్కు తగ్గింది. అయితే టాటా, కార్గిల్, ట్రిపుల్ దాండీ సాల్ట్ మార్కెట్‌లో ప్రవేశించి వంద మంది రైతులు పండించే పంటను ఒక్కరు మాత్రమే చేసే విధంగా మన దళారీ పాలకులు జీ.వోను జారీ చేశారు. ఫలితంగా దేశీయ ఉప్పు రైతులు అప్పులపాలై దిక్కుతోచని స్థితిలో వున్నారు. బహుళజాతి కంపెనీలు టి.వి., మీడియా ద్వారా, రైతులు పండించే ఉప్పులో మలినాలుంటా యని, రోగాలు వస్తాయని తప్పుడు ప్రకటనలు చేస్తూ, కంపెనీల ఉప్పును వినియోగించే విధంగా ప్రజలను ప్రక్కదారి పట్టిస్తున్నారు. వాస్తవానికి రైతులు పండించిన ఉప్పును కేజీ 0.25 పైసలకు కారు చౌకగా కొనుగోలుచేసి, దానిని యంత్రాల ద్వారా పొడిగా మార్చి ప్యాకెట్లు రూపంలో కేజీ 6 రూ.లకు అమ్ముతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ఉప్పు పంటతో అప్పులను తీర్చుకోలేక, కుటుంబాన్ని పోషించుకోలేకపోతుంటే, రైతాంగ కష్టాన్ని దోచుకుంటున్న బహుళజాతి కంపెనీలు కోట్ల రూపాయలు గడిస్తున్నాయి.

బహుళజాతి కంపెనీలకు, సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తే మన పాలకులు- ప్రభుత్వ ఆధీనంలోని ఉప్పు భూముల్లో దిగుబడిపై పన్ను రూపంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలకు ఉప్పు ఎగుమతి ద్వారా, విద్యుత్ బిల్లుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయాన్ని ఉప్పు రైతుల ద్వారా పొందుతున్నారు. కాని మన రైతాంగానికి గిట్టుబాటు ధర, కొనుగోలు గ్యారంటీ కల్పించలేకపోతున్నారు. మరోవైపు విదేశీ కంపెనీలకు విచ్చలవిడిగా లైసెన్సులు జారీ చేస్తూ తమ సామ్రాజ్యవాద భక్తిని చాటుకుంటున్నాయి.

రైతాంగం వండించే ఉప్పు వంటను నియంత్రించి, గుత్త పెట్టుబడిదారులు దోచుకో వడానికి వీలుగా దళారీ పాలకులు అవలంభిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై ఉప్పు రైతాంగం పోరాడాలి. కొనుగోలు గ్యారంటీకై, గిట్టుబాటు ధరలకై, ఉప్పు రైతుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న బహుళజాతి సాల్ట్ కంపెనీల చొరబాటుకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు, పేదలు సమిష్టిగా సంఘటితంగా ఉద్యమించాలి!

డిమాండ్స్:

- ఉప్పు రైతుల నుండి ఉప్పును ప్రభుత్వం వెంటనే కొనుగోలు చెయ్యాలి.
- క్వింటా బస్తా ఉప్పును 60 రూ.ల గిట్టుబాటు ధర కల్పించాలి.
- కొటార్లలో రవాణా సౌకర్యాలు, ఉప్పు నిల్వలకు స్టోరేజ్‌లను నిర్మించాలి.
- ఉప్పు సాగును వ్యవసాయంగా గుర్తించి, బ్యాంకుల ద్వారా రుణసౌకర్యాలు కల్పించాలి.
- బహుళజాతి సాల్ట్ కంపెనీలు మార్కెట్ ప్రవేశానికి వీలుగా జారీ చేసిన జీ.వోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి.

ఒంగోలు, 15.04.2002

దుగ్గేరులో మెడికల్ క్యాంపు

ఈ సమాజంలో అట్టడుగు జీవితాన్ని గడుపుతున్న గిరిజనులకు వైద్య సదుపా యాలు అందుబాటులో లేక మరణాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. విజయనగరంజిల్లా లోని దుగ్గేరు ఏరియాలో రైతుకూలీ సంఘం ప్రతి సంవత్సరం (జ్వరాలు అత్యధికంగా వచ్చే సీజనులో) జిల్లాలోని ప్రభుత్వ వైద్యాధి కారులనీ, ప్రైవేటు వైద్యులనీ కలసి వేలాది రూపాయల మందులను సమీకరించి దుగ్గేరులో ఒక రోజు మెడికల్ క్యాంపు నిర్వ హిస్తున్నది. ఈ సంవత్సరం కూడ జిల్లా వైద్యాధికారులను, ప్రైవేటు వైద్యులను, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలోని వైద్యాధి కారులను కూడ కలసి వేలాది రూపాయలు ఖరీదుచేసే మందులను సేకరించింది. రైతు కూలీ సంఘం జిల్లా కార్య కర్తలు దుగ్గేరు ఏరియా చుట్టుప్రక్కల గ్రామా లలో దీర్ఘకాలం జబ్బులతో బాధపడే వాళ్ళతో సహా మలేరియా, డయేరియాలతో బాధపడే వాళ్ళనీ దుగ్గేరుకు చేరుకోవలసిందిగా ప్రచారం చేశారు. సెప్టెంబరు 16 తేదీన దుగ్గేరులో ఉదయం 9 గం.కు ప్రారంభమైన మెడికల్ క్యాంపుకు చుట్టుప్రక్కల 30, 40 గ్రామాల నుండి వెయ్యి మంది గిరిజనులు వచ్చారు. ఈ క్యాంపుకు వచ్చిన వైద్యులు వివిధ జబ్బులతో బాధపడుతున్న గిరిజనులకు అక్కడకక్కడే వైద్యపరీక్షలు జరిపి మందులు ఇచ్చారు. క్షయ, మలేరియా, చర్మ వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక పరీక్షలు జరిపి కావలసిన మందులు ఉచితంగా ఇచ్చారు.

పొగాకు పంటకు గిట్టుబాటు ధరకోసం సమైక్యంగా ఉద్యమించాలి!

ఒంగోలులో జరిగిన రాష్ట్ర పొగాకు రైతుల సదస్సులో వక్తల పిలుపు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్.టి.సి, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల యూనియన్‌లను రంగంలోకి దింపి గిట్టుబాటుధరలకు కొనుగోలు చేయాలని, కర్నాటక నుండి వచ్చే అక్రమ పొగాకును అడ్డుకోవాలని డిమాండ్‌చేస్తూ రైతుసంఘాలు, రైతు-కూలీ సంఘాల ఆధ్వర్యంలో 5.1.2002 ఉ॥ 11 గం.లకు ఒంగోలు కాపు కళ్యాణమండపంలో రాష్ట్ర సదస్సు జరిగింది. సదస్సుకు అధ్యక్షవర్గంగా పి.కోటేశ్వరరావు, ఎం.కోటయ్య, పి.సీతారామయ్య, కె.నరసింహంలు వ్యవహరించారు.

సదస్సులో రైతు-కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యదర్శి కా॥ కె.కోటయ్య మాట్లాడుతూ- రాష్ట్రంలో 60 లక్షల మందికి ఉపాధి చూపు తున్న పొగాకు పంట సాగును కాపాడుకోవా లన్నారు. పొగాకు పంట పండించిన కాలంలోను, క్రాప్‌హాలిడే కాలంలోను, తర్వాత కూడా ఐటిసి లాంటి సంస్థలు లక్షల కోట్ల రూ॥ల ఆదాయాన్ని కొల్లగొడుతున్నా యన్నారు. పొగాకు పండించే ప్రాంతాల్లో సాగర్ కాలువను సైతంరానివ్వని ఐటిసి (ఇంపీరియల్ టొబాకో కంపెనీ) సంస్థ ఎంతశక్తి సామర్థ్యాలను కలిగి ఉందో స్పష్టం చేశారు. ఆంగ్లో ఇండియన్ కంపెనీలు ఆడుతున్న నాటకాల కారణంగానే భారత్ మార్కెట్ ఘోరంగా దెబ్బతిందని ఆరోపించారు. వ్యాపారులు బోర్డుతో కుమ్మక్కయి చిన్నవ్యాపారులను కూడా వేలంలోకి రాకుండా కుట్రపన్నుతున్నారని చెప్పారు.


ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కొల్లి నాగేశ్వరరావు ప్రసంగిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫల మయ్యాయని, ప్రభుత్వాలు వ్యాపారుల ప్రయోజ నాలకు పాటుపడుతున్నాయని, దాంతో రైతులు బలవుతున్నారని ఆయన ఆరోపించారు. వ్యాపార వర్గాలు తమ ప్రయోజనాల కోసం ముందు నుంచే 240 మిలియన్ల పొగాకు నిల్వలు పేరుకు పోయాయని, ఈ ఏడాది మరో వంద మిలియన్ల కిలోలకు మించి ఉత్పత్తి అవుతుందని, కావున పొగాకుకు మార్కెట్లో డిమాండ్ ఉండదని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారని నాగేశ్వరరావు ఆరోపించారు. వ్యాపారులు మోసపూరిత ప్రచారా లను నమ్మవద్దుని ఆయన రైతులను కోరారు. రాజ్యసభ సభ్యుడు, సిపిఎం రాష్ట్ర నాయకులు వై.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు పొందేం దుకు రాజకీయాలు పక్కన పెట్టి సమిష్టిగా పోరాటం సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. పొగాకు వ్యాపారుల గుత్తాధిపత్యాన్ని ఎదుర్కొన టానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో అవసరమని ఆయన కోరారు. ఎస్టీసి, సమాఖ్యను మార్కెట్లో పొగాకు కొనుగోలు చేసేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నూతన ఆర్థిక విధానాల పేరుతో అన్ని రకాల ఉత్పత్తులల్లో పోటీ పెరిగిందని, పొగాకు రంగంలో సుమారు మూడుకోట్ల మంది జీవనం కొనసాగిస్తు న్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పొగాకు ఎగు మతుల ద్వారా ప్రతి ఏటా ఎనిమిది వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని కానీ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. గతంలో మన దేశ పొగాకు ఎగుమతిదార్లు చేసిన అక్రమాల కారణంగా ప్రపంచ మార్కెట్లో ఇండియన్ పొగాకు కొనుగోలు చేసేం దుకు కొంత మంది భయపడి పోతున్నారని ఆయన ఆరోపించారు. ఒకవైపు రైతులు పండించిన పొగాకుకు ఎగుమతి ఆర్డర్లు సాధించ లేని ప్రభుత్వం, విదేశీ పొగాకు ఉత్పత్తులను మాత్రం విచ్చలవిడిగా దిగుమతికి అనుమతి నివ్వడంతో భారత్ పొగాకు మార్కెట్‌ను మన పాలకులే చేజేతులా కాజేస్తున్నారని ఆయన విమర్శించారు.

అఖిల భారత రైతు-కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదె దివాకర్ మాట్లాడుతూ, పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో పండిస్తున్న పొగాకు సాగులో రైతులు తప్ప అందరూ లాభాలు గడిస్తున్నారని విమర్శించారు. రైతులకు ఎలాంటి సహకారం ప్రభుత్వం నుంచి లభించడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్రాలు ప్రభుత్వ ఆస్తులను వచ్చిన రేటుకు విక్రయించేందుకు కంకణం కట్టుకున్నా యని విమర్శించారు. ఇంకా ఈ సదస్సులో ప్రకాశంజిల్లా రైతుకూలీ సంఘం నాయకురాలు ఎస్.లలిత కుమారి, రవి, రైతుసంఘం రాష్ట్ర నాయకులు తులసీదాస్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, నాగబోయిన రంగారావు, గొల్లపూడి వెంకటేశ్వర్లు, కృష్ణాజిల్లా రై.కూ.సం అధ్యక్షుడు మందా జార్జి, ఎస్. నాగేశ్వరరావు, తదితరులు ప్రసంగించారు.

సదస్సు- కిలో పొగాకు సరాసరి ధర రు.50/-లుగా నిర్ణయించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీసీ, రాష్ట్ర పొగాకు రైతుల యూనియన్‌చేత కొనిపించాలని; ఎస్టీసికి 100 కోట్లు, రాష్ట్ర యూనియన్‌కు 50 కోట్లు రూ॥లు కేటాయించా లని; దక్షిణాది తేలిక నేలలకు సంబంధించిన వేలం కేంద్రాలు జనవరి 17న, మిగతా అన్ని వేలం కేంద్రాలు ఫిబ్రవరి 1 నుండి ప్రారంభించాలని, ఇండెంట్ ఇచ్చిన ట్రేడర్స్ అందరూ వేలంలో పాల్గొనేలా చర్యలు తీసుకో వాలని, విదేశీ ఎగుమతి ఆర్డర్లకోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటి నుండే కృషి చేయాలని టుబాకో బోర్డు ప్రతినిధులను రైతుల నుండి ఎన్నికల ద్వారా ఎంపిక చేయాలని జిల్లా రైతుసంఘం కార్యదర్శి కెవివి.ప్రసాద్ తీర్మానాలను ప్రవేశపెట్టగా సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

సదస్సుకు ముందు 4 రోజులపాటు పొగాకు పండించే గ్రామాలలో గ్రూప్ మీటింగ్‌లు, ప్రచారం నిర్వహించారు.

సదస్సు తీర్మానం ప్రకారం 7.1.02న గుంటూరు లో టుబాకో బోర్డు ఛైర్మన్ పి.దయా చారిని వామపక్ష రైతు, రైతుకూలీ సంఘాల ప్రతినిధులు సదస్సు ఆమోదించిన తీర్మానాలతో వినతిపత్రం సమర్పించారు.



పత్తి, మిర్చి తదితర పంటలకు గిట్టుబాటు ధరల కోసం...

ప్రియమైన రైతుసోదరులారా, ప్రజలారా!

సుదీర్ఘకాలంగా ప॥ కృష్ణాలో పత్తిరైతుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారింది. రైతుల సంక్షోభం పతాకస్థాయికి చేరింది. ఫలితంగా ప॥ కృష్ణాలో రైతులు ఆత్మహత్యలవైపు కు నెట్టబడుతున్నారు. ప్రధానంగా పత్తివంట రైతులను బలి తీసుకుంటోంది. వర్షాభావ పరిస్థితి తోడవటంతో చీడపీడలకు ఆజ్యంపోసినట్లయింది. పైగా శనగపచ్చ పురుగు పత్తిని నాశనం చేయటం తో దీనిని కంట్రోలు చేయటానికి రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. విపరీతమైన పెట్టుబడులు పెట్టారు. దీనికితోడు సాగర్‌నీరు సకాలంలో రాకపోవడంతో దిగుబడిపై సాగునీటి ప్రభావం బాగా వున్నది. ఫలితంగా పత్తి దిగుబడి యావరేజి ఎకరానికి 4-5 క్వింటాలు వచ్చింది. జగ్గయ్యపేట మండలం పరిసరాల్లో తొలకరి నుంచి వర్షాలు లేకపోవటమేకాక, సాగునీరు కూడా లేకపోవటంతో ఎకరాకు 1 నుంచి 1 1/2 క్వింటాలు మాత్రమే పత్తి దిగుబడి వచ్చింది. మరొకవైపున కల్తీపురుగుమందుల విక్రయాలు అధికమవటంతో రైతులు తీవ్రంగా మోసపోయారు.

ప॥ కృష్ణాలో ముఖ్యంగా నందిగామ డివిజన్ దశాబ్దాలుగా సాగునీటి సమస్యను ఎదుర్కొంటు న్నది. ఒకప్రక్క కృష్ణానది మరియు మునేరు, వైరా, కట్టలేరు, పాలేరు మొ॥ ఉపనదులున్నా వీటిని వినియోగంలోకి తెచ్చే పథకాలను యుద్ధప్రాతి పదికపై చేపట్టాల్సిందిపోయి ప్రజా ప్రతినిధులు నీళ్ల రాజకీయాలుచేస్తూ రైతుల దృష్టి మళ్లిస్తున్నారు. సాగర్‌నీరు అక్టోబరు కల్లా విడుదల చేయాలి. కానీ అనేక సం॥లుగా డిసెంబర్ మధ్యకాలం నుంచి విడుదల చేయటంతో జనవరిలో చివరిభూములకు నీటికబురు అందుతుంది.

సాగర్‌నీటిని అందించడంలో నిర్దిష్టమైన ప్రణాళికలు ప్రభుత్వంవద్ద, అధికారుల వద్ద లేకపోవటంతో రైతులు చేయాల్సిన ఆందోళనలు ఎంఎల్‌ఏలు చేయటం విడ్డూరంగా వుంది. ఎంఎల్‌ఏల హడావుడిని మీడియా పెద్దఎత్తున ప్రచారం చేసినా నీరు సకాలంలో విడుదల కాలేదు. కాల్వ చివర భూములకు నీరు ఈ రోజు వరకు అందలేదు. నందిగామ, జగ్గయ్యపేట నియోజక వర్గాలలోని రైతాంగం సాగర్ జలాలల కోసం నేటికీ ఆందోళన చేయాల్సిన దుస్థితిలోనే వున్నారు.

మద్దతు ధర- ప్రభుత్వాల దగాకోరు విధానాలు

నీటివనరులను బట్టి యావరేజి ఎకరానికి ప్రత్తి దిగుబడులు 4, 5 క్వింటాలు మాత్రమే రావటంతో క్వింటారేటు ఈ సం॥ రు.1900/- నుంచి రు.1600/-లకు తగ్గుతూ వచ్చింది. ఈ విధంగా

కృష్ణాజిల్లా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)

ఎకరానికి ఆదాయం రు.8 వేలు మాత్రమే వస్తోంది. పెట్టుబడులు కూడా రాకపోగా ఎకరానికి 7 వేల రూ॥లు రైతు నష్టపోతున్నాడు. ఈ సం॥ పత్తి వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గించ డంతో రైతు మెడకు ఉరిబిగించినట్లు అయింది. రైతులకు గిట్టుబాటు ధరలు అందించటంలో పాలకులు మొదటి నుంచి విద్రోహకరమైన విధానాలను అనుసరిస్తున్నారు. రైతులు తమ అవసరాలకోసం పత్తిని అయిన కాడికి తెగ నమ్ముకునే పరిస్థితిని సృష్టించారు.

ఈ సం॥ పత్తికి మద్దతు ధర రు.1900/-లు ప్రకటించిన సిసిఐ ఆచరణలో పనికిమాలిన ఆంక్షలు విధించి రైతులను విసిగిస్తూ రేట్లను తగ్గిస్తూ ప్రైవేటు వ్యాపారుల లాభాలకోసమే శాయశక్తులా కృషి చేస్తోంది. సిసిఐ ద్వారా లాభపడేది వ్యాపార్లు, మిల్లర్లేకాని రైతులు మాత్రం కాదు. పెరిగిన ధరల కనుగుణంగా గిట్టుబాటు ధరలు లేవు. రైతుకు 6-7సం॥ నాటి మద్దతురేట్లను ఈ రోజు ఇస్తున్నారంటే రైతును భూమికి కట్టివేసిన బానిసగా చూస్తున్నారే తప్ప దేశానికి వెన్నెముకగా వరిగణించడంలేదు. ప్రభుత్వానికివచ్చే ఆదాయంలో రు.100కి 35/-లు వ్యవసాయ రంగం నుంచే వస్తోంది. కానీ వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయటానికి శాశ్వతమైన నీటిపారుదల ప్రాజెక్టులు అభివృద్ధి చేయకపోగా రైతాంగానికి ఇచ్చే కొద్దిపాటి సబ్సిడీలను ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో తగ్గిస్తున్నారు. మరొక వైపున బడా పెట్టుబడిదార్లు చెల్లించాల్సిన లక్షలకోట్ల రూ॥ల అప్పులను రద్దు చేస్తున్నారు. ఈ విధంగా లక్షల కోట్ల రూ॥ల ప్రజాధనాన్ని చట్టబద్ధంగా దోచు కుంటూ రైతాంగం మూలుగులనుపీల్చి వారిని ఆత్మహత్యల వైపుకు నెడుతున్నారు. కార్పొరేట్ వ్యవసాయ విధానానికి దారి సుగమం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా మరోప్రక్క సహకార బ్యాంకులు, వాణిజ్యబ్యాంకులు అప్పుల వసూళ్ల కోసం రైతులపై తీవ్రమైన వత్తిడిని తెస్తున్నారు. ప్రైవేటు అప్పులవారి వత్తిళ్లు తీవ్రంగా ఉన్నాయి. ఈ సంక్షోభపు విషవలయాన్ని ఛేదించలేక ఆత్మస్థైర్యం కోల్పోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత సం॥ చౌటపల్లిలో పొగాకు రైతు మోహనరావు దంపతులు, గని ఆత్కూరులో పత్తిరైతు, వేములనర్వ, కంభంపాడులలోను, ఈ సం॥ గంద్రాయిలో పత్తిరైతు దేవరగట్ల కృష్ణారావు ఈ విధంగా గత 3 సం॥ల కాలంలో దాదాపు 10 మంది రైతులు అన్నపూర్ణగా పేరుగాంచిన కృష్ణాజిల్లాలో ఆత్మహత్యలకు పాల్పడటం రైతుల దుస్థితికి అద్దంపడుతుంది.

మిత్రులారా!

ప్రభుత్వంచేపట్టిన నూతన ఆర్థిక, వ్యవసాయ విధానాలు, ప్రైవేటీకరణలు రైతాంగం, సామాన్య ప్రజలపాలిట మరణశాసనా లయ్యాయి. రాష్ట్ర వ్యాపితంగా వందలాది రైతాంగం, ప్రజలు చేసుకుంటున్న ఆత్మహత్యలు దీన్నే సూచిస్తోంది. ఈ సంక్షోభం ఇప్పటికే తీవ్రరూపం దాల్చింది. మిర్చి, పొగాకు రైతుల పరిస్థితి దీనికి భిన్నంగా ఏమీలేదు. గిట్టుబాటు ధరలను కల్పించలేని పాలకులను నిలదీయాలి.

కనుక రైతాంగం- ప్రజలు తమ దయనీయ స్థితికి ఒంటరిగా కుమిలిపోకుండా దళారీ పాలకుల, పెట్టుబడిదారీవర్గాల కబంధహస్తాల్లో నలిగిపోతున్న అశేషపీడిత ప్రజలతో మమేకమై తమ న్యాయమైన గిట్టుబాటుధరల సాధనకోసం, సాగునీటి పథకాల కోసం ఉద్య మించాల్సిందిగా, ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు రైతాంగ న్యాయమైన డిమాండ్లకు మద్దతు ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

డిమాండ్లు:

1. పత్తికి మద్దతుధరను క్వింటాలుకు రు.3000/- చొ॥న, మిర్చికి రు.3500/-లు చొ॥న బేషరతుగా చెల్లించాలి.
2. కల్తీ పురుగుమందు వ్యాపారులను కఠినంగా శిక్షించాలి. పురుగుమందులను పేద, మధ్య తరగతి రైతాంగానికి సబ్సిడీపై అందించాలి.
3. ప.కృష్ణాలో రైతుల ఆత్మహత్యలను వెంటనే నివారించాలి.
4. సాగర్‌నీటిని కాల్వ చివరభూముల వరకు క్రమబద్ధంగా పంపిణీ చేయాలి. సమగ్ర నీటి పారుదల సౌకర్యాలు చేపట్టాలి.
5. దళిత, పేద, మధ్యతరగతి రైతాంగానికి ఉపయోగపడే ఆం.ప్ర. నీటిపారుదల అభివృద్ధి సంస్థ (ఏపిఎస్ఐడిసి)ని ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసే క్రమాన్ని విరమించుకోవాలి.
6. వనికి ఆహారభద్రకం కార్యక్రమాల్ని సక్రమంగా నిర్వహించి వ్యవసాయకూలీల వలసలను ఆపివేసి వారిని ఆదుకోవాలి.

నందిగామ, 23.1.2002.

(29.1.2002న నందిగామలో జరిగిన ధర్నా సందర్భంగా)

పత్తి, మిర్చి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కోసం...

గుంటూరుజిల్లా రైతుకూలీ సంఘం (ఆంధ్ర)

మిత్రులారా!

'ముందు దగా - వెనుక దగా - కుడి ఎడమల దగా, దగా' ఈ మాటలు, ఈనాటి రైతు పరిస్థితికి అతికినట్లుగా - సరిగ్గా సరిపోతాయి. వ్యవసాయమనే పాముల పటంలో అధిక పెట్టుబడులు - వడ్డీలు - కల్తీ విత్తనాలు - చీడపీడలు - ఎరువు, పురుగు మందులు - అతివృష్టి - అనావృష్టి - కరెంటు, సాగునీరు సమస్యలనే పాములన్నింటికీ ఎరై, వాటిని దాటుకొని, పంటచేతికొస్తే - మార్కెట్ దోపిడీ - గిట్టుబాటు ధరల సమస్యలనే పెద్ద పాముకాట్లతో రైతు నిలువునా దగా చేయబడు తున్నాడు. ఈ 'పాముకాటు'లన్నింటికీ మూలమైన పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలతో సతమతమవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల సంఖ్య ఏడువందలకు చేరుకుంటున్నది. పంటలు చేతికొచ్చే ఈ నెలలోనే 20వ తారీకు నాటికే - 22 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ దౌర్భాగ్య పరిస్థితిని మార్చు కోవటానికి రైతాంగం సంఘటిత పోరాట మార్గాన్ని ఎంచుకోవాలి.

ఈ వాస్తవాలను అర్థం చేసుకున్న రైతాంగం గిట్టుబాటు ధరలు సాధించుకోవటం కొసం-కసితో కదంతొక్కాల్సిన అవసరం ఉంది. రైతాంగానికి ఇస్తున్న అన్ని సబ్సిడీలను రద్దు చేసి, సాగునీటి మీద పన్నువేసి, కరెంటు ఛార్జీలు గోళ్ళూడగొట్టి వసూలుచేసి, కల్తీ విత్తనాలు, ఎరువు, పురుగు మందులకు రైతులను ఎరవేసి, సహకార రుణాలను సవాలక్ష ఆంక్షలతో నామమాత్రం చేసి- ప్రైవేటు వడ్డీ వ్యాపారుల పాల్జేసి, వ్యవసాయానికి సంబంధించిన అన్ని బాధ్యతల నుండి ప్రభుత్వాలు వైదొలగి, ప్రకృతి దయాదాక్షిణ్యాలకు వదిలేసి-తిరిగి ఆ వ్యవసాయ పంటలపైనే విదేశీ మారకద్రవ్యాన్ని పొందుతూ-రైతాంగానికి కనీసం గిట్టుబాటు ధరలు కల్పించని ఈ ప్రభుత్వాలు ఉంటేనేం? ఊడితేనేం? మనం నిర్ణయించుకోవాలి.

ఈ నేపధ్యంలో రైతుకూలీలు, ధనిక, పేద, మధ్యతరగతి రైతాంగం ఒక్కటిగా, రైతాంగ వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. గిట్టుబాటు ధర డిమాండ్ చేయటమంటే 'కష్ట ఫలితాప్పి అడగటమే తప్ప - ఎవడిజేబులో సొమ్ము అడగటం కాదనే' స్పృహ, చైతన్యంతో రైతాంగం ఉద్యమించాలి. రైతుల పరిస్థితి మెరుగుదలతో కూలీల పరిస్థితి మెరుగుదల

ఈ సంవత్సరం రైతులు ఏవిధంగా నష్టపోతున్నారో ఈ పట్టిక గమనిస్తే స్పష్టమౌతుంది.

పంట	పెట్టినపెట్టుబడి (ఎకరాకు-రూపాయల్లో)	ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం అమ్మితే చేతికొచ్చేది (రూపాయల్లో)	పొంతభూమి ఉన్న రైతుకు ఒక ఎకరానికి నష్టం (రూపాయల్లో)	కౌలుదారునికి-ఒక ఎకరానికి నష్టం (రూపాయల్లో) రూపాయల్లో)
ప్రత్తి	20-25వేలు	(8-10 క్వింటాళ్ళు దిగుబడి) క్వింటా 1500 రూ॥ చొప్పున 12-15 వేలు	8-10 వేలు	12-14 వేలు (ఎకరా కౌలు 4 వేలు)
మిర్చి	40-45 వేలు	(12-15 క్వింటాళ్ళ దిగుబడి) క్వింటా 2000 రూ॥ చొప్పున 24-30 వేలు	15-20 వేలు	19-24 వేలు (ఎకరా కౌలు 4 వేలు)
ఉల్లి	13-15 వేలు	(30-40 టిక్కీలు దిగుబడి) కిలో 2-50, టిక్కి 100రూ. 3-4 వేలు	10-20 వేలు	17-19 వేలు (ఎకరా కౌలు 7 వేలు)

సహనానికి ప్రతీక అయిన రైతు సహనాన్నే పరీక్షిస్తున్నది నేటి వ్యవసాయం. 'వచ్చే ఏడు పరిస్థితి బాగుపడకపోతుందా!' అని ఆశాజీవిగా ఏళ్ళ తరబడి ఎదురుచూపులు మినహా - ఏఏటి కాఏడు రైతు పరిస్థితి దిగజారుతూనే ఉంది. లోలోపల తుకతుక ఉడుకుతున్న అగ్ని పర్వతం బ్రద్దలవకముందే ప్రభుత్వాలు కళ్ళు తెరచి రైతాంగ, వ్యవసాయ పరిరక్షణ చర్యలకు పూనుకుంటే అందుకు కేంద్ర, రాష్ట్ర పాలకులే బాధ్యత వహించాల్సి వస్తుంది.

జిల్లాలో మిర్చి,పత్తి,పొగాకు, ఉల్లి తదితర సరైన గిట్టుబాటు ధరలు లేవు. ప్రత్తి విత్తేనాడు ధర ఒక మోస్తరుగా ఉండి పంట చేతికొచ్చాక పడి పోతున్నది. గత ఏడాది క్వింటా రు.2,300 అమ్మితే ఈ సం॥ 1600కు పడిపోయింది. ఈ వ్యవసాయమ సీజన్‌లో వర్షాలు సకాలంలో పడక, సాగునీరు సెప్టెంబర్ వరకు అందక పంటలకు పెట్టే పెట్టుబడి పెరిగింది. తెగుళ్ల నివారణ కోసమని, 'అవాంట్, ట్రేసర్‌లు (లీటరు 3వేల నుండి 10వేల ఖరీదుతో) వాడటంతో పెట్టుబడులు మరింత పెరిగాయి. తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు విపరీతంగా పెరిగిపోయి ఉన్నాయి.

ఆధారపడి వుంటుందనేది గుర్తించి, రైతు,కూలీలు, ఇతర చేతివృత్తుల వారు ఈ క్రింది డిమాండ్స్ సాధన కోసం దీర్ఘకాల ఐక్యపోరాటానికి సిద్ధం కావాలి.

డిమాండ్స్ :

ప్రత్తి క్వింటాలుకు రు. 2,500; మిర్చి క్వింటాలుకు రు. 3,500, ఉల్లి కిలోకు రు.5 చొ॥న గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రత్తిని సిసిఐ సెంటర్లు పెంచి, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి. విదేశీ పత్తి దిగుబడిని ఆపివేయాలి.

కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు విత్తన కంపెనీ, డీలర్లు నుండి నష్టపరిహారం ఇప్పించాలి.

ఏపిఎస్ఐడిసి (రాష్ట్ర నీటి పారుదల సంస్థ)ను రద్దు చేసే చర్యలను ఉపసంహరించుకోవాలి.

పదివేలలోపు రైతాంగ రుణాలను రద్దు చేయాలి. రైతులను ఆత్మహత్యల బారి నుండి కాపాడాలి.

డబ్ల్యూ.టి.ఓ. నుండి భారతదేశం వైదొలగాలి.

21-01-2002.

(28-1-02న గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా సందర్భంగా)

ధాన్యం, చెరకు పంటలకు గిట్టుబాటు ధరల కోసం...

ఆరుగాలం నాగేటిచాళ్ళల్లో తన రక్తాన్ని ధారపోసి ధాన్యరాశులు పండించే రైతులకు గిట్టుబాటు ధరల్లేవు. పెళ్లాం మెడలో పుస్తెలమ్మి పెట్టిన పెట్టుబడులు రాక, చేసిన అప్పులు తీర్చేదారిలేక హతాశులై ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు. కృష్ణాజిల్లాలో ఇటీవల కమ్మగంటి కొండయ్య (కౌలురైతు, పెడన), దొడ్డి సాంబయ్య (పత్తిరైతు, పల్లగిరి)ల ఆత్మహత్యలు దీనిలో భాగమే. గత సం॥ రాష్ట్రంలో 54 మంది రైతాంగం బలయ్యారంటే వ్యవసాయరంగం ఎంత తీవ్ర సంక్షోభానికి గురయ్యిందో అర్థమవుతోంది. వరల్డ్‌బ్యాంక్‌తో చేసుకొన్న ఒప్పందం మేరకు వాజ్‌పాయ్, చంద్రబాబు దళారీ పాలకులు చేపట్టిన నూతన ఆర్థిక సంస్కరణల ప్రభావం వల్ల మొత్తం రైతాంగం ముఖ్యంగా వరి, చెరకు రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

మంచి సీజన్‌లో ధాన్యం ధరలు బాగా తగ్గి అదే సీజన్‌లో మంచి రేటు వుండటం సాధారణమై అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్నట్టుగా రైతులు నిరాశానిస్పృహలలో విలవిల్లాడు తున్నారు. గత సం॥ సార్వాలో ఎకరానికి 30-35 బస్తాలు మంచి దిగుబడి వచ్చినప్పటికీ ఫైన్ క్వాలిటీ రు.420, సాధారణ రకం రు.397 మద్దతు ధర వున్నప్పటికీ, కేవలం ఫైన్ క్వాలిటీ 390, సాధారణ రకం రు.397లకు మించి దక్కలేదు. దాళ్వా పంట చేతికొచ్చే తరుణంలో భారీ వర్షాల కారణంగా ధాన్యం దెబ్బ తినటంతో రు.400 ఉన్న ధర రు.250లకు దిగజారింది. ఈ స్థితిపై గుడివాడ ఏరియాలో రైతాంగం పెద్దఎత్తున ఆందోళనకు దిగినప్పటికీ ప్రభుత్వం మిల్లర్లచేత తగిన ధరకు కొనుగోలు చేయించలేకపోయింది. ప్రస్తుత సార్వానాట్లు సమయంలో వర్షాల్లేక, సాగర్ జలాలురాక కృష్ణాజిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 2.75 లక్షల హెక్టార్లలో 2.35 లక్షల హెక్టార్లు మాత్రమే సాగు జరిగింది. ధాన్యం ధర ఫైన్‌క్వాలిటీ రు.550, సాధారణ రకం రు.420 ఫరవాలేదని పించినప్పటికీ ఎకరానికి 20-22 బస్తాలు మాత్రమే పండి దిగుబడులు బాగా తగ్గాయి. ఎకరాకు 7 వేలు ఉత్పత్తి ఖర్చులవుతుంటే ఖర్చులుపోను రు.1000లు కూడా మిగలటం లేదు. కౌలు రైతులకు కూలి కూడా గిట్టుబాటు కావటం లేదు. మధ్యతరగతి, పేద, కౌలు రైతాంగం పరిస్థితి ఘోరంగా దిగజారింది.

ధాన్యం కొనుగోలులో ఎఫ్.సి.ఐ అర్థంలేని ప్రమాణాలు పెట్టి రైతులను వేధిస్తోంది. జిల్లాలో

కృష్ణాజిల్లా రైతుకూలీ సంఘం (ఐ.ప్ర)

3.2 లక్షల టన్నులు సేకరించాల్సి వుండగా అందులో సగం కూడా జరగలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గోడౌన్లు ఖాళీగా లేవు కాబట్టి ఎఫ్.సి.ఐ కొనుగోలు చేయటం సాధ్యంకాదు, సబ్సిడీలు ఇస్తున్నాం కనుక రాష్ట్ర ప్రభుత్వాలే సివిల్ సప్లయిస్ ద్వారా కొనుగోలు జరగాలని కేంద్రం అంటోంది. ఎఫ్.సి.ఐ చేత కొనుగోలు చేయిస్తానని ఆర్భాటం చేసినచంద్రబాబు రైతులను ఆదుకో నేందుకు ఏ మాత్రం పూనుకోలేదు. సివిల్ సప్లయిస్ ద్వారా కొనుగోలు చేయించింది కేవలం 13 వేల టన్నులు మాత్రమే. పైపెచ్చు కేంద్ర ప్రభుత్వం మనకు అవసరం లేకపోయినా డబ్ల్యు.టి.ఓ ఎగ్రిమెంట్ ప్రకారం 16 లక్షల టన్నుల బియ్యం విదేశాల నుండి దిగుమతి చేసుకోడంతో ధాన్యం ధరలు పడిపోయేందుకు కారణమయింది. ఎగుమతులు లేవనే పేరుతో మిల్లర్లు సిండికేట్‌గా మారి ధరలు తొక్కి పెట్టి, రైతాంగం గతిలేక అమ్ముకొనే పరిస్థితి కల్పించి, కనీసం వెయ్యికోట్లు సంపాదించారంటే అతిశయోక్తికాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరించటం వల్ల మార్కెట్ శక్తుల చేతుల్లో రైతాంగం బలవుతున్నారు.

చెరకు రైతాంగం పరిస్థితి వరి రైతుల కంటే మెరుగ్గా ఏమీ లేదు. ఎకరాకు రు.22,700, ఉత్పత్తిఖర్చులు అవుతుంటే ఖర్చులుపోను 3 వేలు మిగలటం కష్టమవుతోంది. దీంతో మధ్య తరగతి, పేద రైతాంగం పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. కౌలు రైతులకు కౌలుపోను వచ్చే ఆదాయం ఖర్చులకు సరిపోక అప్పుల పాలవుతున్నారు. చెరకు రైతాంగంకు గిట్టుబాటు ధర లభించక పోవడానికి షుగర్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు, ప్రభుత్వం యొక్క బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం ప్రధాన కారణంగా వుంది.

భార్గవ కమీషన్ సిఫార్సుల ప్రకారం 8.5 శాతం ఇంకా ఆపైన వచ్చిన రికవరి శాతాన్ని దృష్టిలో వుంచుకొని చెరకు ధరను నిర్ణయించి ఫ్యాక్టరీ యాజమాన్యాలు ప్రకటించాలి. ఫ్రీసేల్స్‌పై వచ్చే ఆదాయంలో 50 శాతం చెరకు రైతాంగానికి ఇవ్వాలి. దీన్ని ఎవరూ అమలుచేయటం లేదు. దీనిపై చట్టపరమైన చర్య తీసుకోడానికి బదులు రాష్ట్ర ప్రభుత్వం రాజీమార్గంగా సలహా ధరను ప్రకటిస్తోంది. '98-'99 సీజన్‌లో సలహాధర రు.125లు వుంటే 2000 సం॥ కొచ్చేసరికి రు.93లకు తగ్గించింది. రాష్ట్రప్రభుత్వం ప్రకటించే సలహాధరకు చట్టబద్ధత లేకపోవటంతో చెరకు ధర నిర్ణయించటం ఫ్యాక్టరీ యాజమాన్యాల దయా దాక్షిణ్యాల మీద ఆధారవడింది. చెరకు రైతాంగానికి లక్ష్మీపురం కెసిపి యాజమాన్యం రు.9.22 కోట్లు పడ్డ బకాయిలను నేటికీ ఇవ్వటంలేదు. దీనిపై ఆ ప్రాంత చెరకు రైతులు పెద్దఎత్తున ఆందోళన చేసినప్పటికీ కె.సి.పి యాజమాన్యం నిర్లక్ష్యం చేయటంతో నిరసనగా గత సం॥లుగా చెరకు పంట వేయకుండా బహిష్కరించారు. '94-95 సం॥ సీజన్‌లో 16,649.69 ఎకరాల్లో చెరకు పంట సాగు '2001-'02 కొచ్చేసరికి 2,425 ఎకరాలకు పడిపోయిం దంటే సమస్య ఎంత తీవ్రంగా వుందో తెలుస్తుంది. హనుమాన్ జంక్షన్‌లో డెల్టా షుగర్స్ యాజమాన్యం చెరకు రైతాంగానికి చెల్లించాల్సిన బకాయిలు రు.5.13 కోట్లు, ఉయ్యూరు కె.సి.పి రైతులకు చెల్లించాల్సిన బకాయిలకోసం, గిట్టుబాటుధరల కోసం రైతాంగం ఆందోళన చేసేసరికి ఫ్యాక్టరీ యాజమాన్యాలు కొంతమేరకైనా చెరకు ధర పెంచక తప్పలేదు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు పన్ను రు.60 రైతాంగానికి చెల్లిస్తామని నిర్ణయించటంతో గుడ్డిలో మెల్ల సామెతగా చెరకు ధర కొద్దిగా పెరిగింది. చెరకు రైతాంగానికి ప్రకటించిన కొనుగోలు పన్ను రు.60 నామమాత్రంగా వున్నందున దీన్ని రు.125లకు పెంచి రైతాంగానికి చెందేలా తగు చర్యలు తీసుకోవాల్సి వుంది. లక్ష్మీపురం కెసిపి టన్ను ధర రు.810 ప్రకటించింది. కొనుగోలు పన్ను కలిపితే టన్నుకు రు.870, అలాగే ఉయ్యూరు, హనుమాన్‌జంక్షన్‌లలో రు.900 చొప్పున టన్నుకు లభిస్తుంది. వాస్తవానికి ఈ ధర మధ్యతరగతి, పేద, కౌలు రైతాంగానికి ఏ మాత్రం గిట్టుబాటు కాదని వేరే చెప్పక్కరలేదు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల చక్కెర అమ్మకంపై కంట్రోలు ఎత్తి వేయటంవల్ల ముమ్మందు చెరకు రైతాంగం నష్టపోతారు. తద్వారా ఫ్యాక్టరీలకు నష్టం కల్గే అవకాశం వుంది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణలో భాగంగా డీకంట్రోలింగ్, డీలైసెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తోంది. సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తూ హనుమాన్‌జంక్షన్‌లోని హనుమాన్ షుగర్స్‌ను డెల్టా షుగర్స్ ప్రై.లిమిటెడ్ వార్కి కారుచౌకగా అమ్మటం దీనిలో భాగమే.

సామ్రాజ్యవాద దేశాల, బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కనుగుణంగా →

గిట్టుబాటుధర లభించే వరకు కర్ర విక్రయాలు ఆపండి!
ఒంగోలులో సుబాబుల్, జామాయిల్ రైతుల సదస్సు తీర్మానం

ఒంగోలు, సెప్టెంబరు 25 (ప్రభాత వార్త): జామాయిల్, సుబాబుల్, సరుగుడు కర్రకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించేంత వరకు వాటి విక్రయాలను నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన రైతుసదస్సుకు రైతుసంఘం ప్రధాన కార్యదర్శి నాగబోయిన రంగారావు అధ్యక్షత వహించారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ దేశంలో ప్రకాశంజిల్లాలోనే అధికంగా జామాయిల్, సుబాబుల్, సరుగుడు తోటలు పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకుండా చేసేందుకు కొంతమంది పేపరు మిల్లులు యజమానులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి కుట్రలను రైతులందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఐటిసి సంస్థ పాగాకు రంగంలోనే కాకుండా సుబాబుల్ కర్ర విషయంలో కూడా జోక్యం చేసుకొని రైతులను నష్టాలపాలు జేస్తుందని ఆయన ఆరోపించారు. సభాధ్యక్షుడు రైతుసంఘం ప్రధాన కార్యదర్శి నాగబోయిన రంగారావు మాట్లాడుతూ రైతులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న వ్యవసాయ మార్కెట్ యార్డులకు కొంతమంది వ్యాపారులు గ్రహణం పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. దీనిని రైతులందరూ ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు.

వర్షాలు లేక కొన్ని వేల ఎకరాలలో తోటలు ఎండిపోయాయని, మిగిలిన తోటలు విక్రయించుకుందామన్నా, వ్యాపారస్థులు అతితక్కువ ధరలకు కొనుగోలు చేయటంతో రైతులు నష్టాలపాలవుతున్నారని ఆయన ఆరోపించారు. రైతుకూలీ సంఘం నాయకురాలు ఎస్.లలితకుమారి మాట్లాడుతూ కొంతమంది మిల్లర్లు, ప్రజాప్రతినిధులు కలిసి గిట్టుబాటు ధర రాకుండా రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గిట్టుబాటు ధర సాధించు కొనేంత వరకు రైతులంతా ఉమ్మడిగా పోరాటం చేయాలని ఆమె కోరారు. అఖిల భారత రైతుసంఘం నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనేక వ్యయప్రయాసలకోర్చి దీర్ఘకాలిక పంటలైన సుబాబుల్, జామాయిల్, సరుగుడు తోటలకన్నా చిల్లచెట్లకు రేటు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అధికారులు రైతులకు సత్వరంగా గిట్టుబాటు ధర ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, కార్యదర్శి పమిడి వెంకట్రావు, వివిధ సంఘాల రైతు నాయకులు కొంగర నరసింహం, పరిటాల కోటేశ్వర రావు, వేజెళ్ళ సుబ్బారావు, పోకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 3న కలెక్టరేట్ ముట్టడి:

సుబాబుల్, జామాయిల్ కర్రకు ఈ నెలాఖరు లోపలరేటు పెంచకపోతే అక్టోబరు 3వ తేదీన కలెక్టరేట్‌ని ముట్టడి చేస్తామని, ప్రతి సంవత్సరం రైతు పండించే కర్రపై పదిశాతం రేటు పెంచాలని, సుబాబుల్ 1350 రూపాయలు, సరుగుడు 1400 రూపాయలు, జామాయిల్ 1550 రూపాయలుగా గిట్టుబాటు రేటు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని తీర్మానించారు. అధికారిక సమావేశాలకు రైతు సంఘాల ప్రతినిధులను, రైతు నాయకులను తప్పనిసరిగా ఆహ్వానించాలని తీర్మానించారు. ఈ సమావేశానికి జిల్లాలోని అద్దంకి, మేదరమెట్ల, నాగులుప్పలపాడు, చీమకుర్తి, సంతనూతలపాడు, టంగుటూరు, కొండపి, జరుగుమల్లి, ఒంగోలు మండలాల నుంచి రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ లేకపోవటంతో జిల్లా రెవిన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

⁂

→

ధాన్యం చెరకు....

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరి స్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలు రైతులను పెనంలోంచి పొయ్యిలోకినెట్టే విధంగా వున్నాయి. "బియ్యం ధరలు విపరీతంగా పెరగటంతో కొనుగోలు శక్తిలేని ప్రజల తలసరి వినియోగం తగ్గింది. దీన్ని పరిష్కరించాలంటే మద్దతు ధరలను ఎత్తివేసి రైతులే నేరుగా స్వేచ్ఛగా మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారులకు తమ వ్యవసాయక ఉత్పత్తులను అమ్ముకోవాలని, ధాన్యం సేకరణను ఎత్తివేస్తామని" కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీన్ని అన్ని పంటలకూ వర్తింప జేస్తోంది. వాస్తవానికి పై వాదన మోసపూరిత మైంది. నయవంచనతో కూడినది. మన ప్రభుత్వం వ్యవసాయ రంగానికిచ్చే సబ్సిడీలను భవిష్యత్‌లో పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయంచేసి, అందులో భాగంగా కోతపెట్టడంతో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో విదేశీ ఉత్పత్తులతో పోటీపడలేక మన వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోతున్నాయి. ఈ స్థితిలో మద్దతు ధరలు వుంటేనే రైతులకు గిట్టుబాటుధరలు లభించక అప్పుల నుడి గుండంలో పడి సతమతమవుతుంటే-ఇక స్వేచ్ఛా వ్యాపారంలో మార్కెట్ భూతానికి బలవ్వటం తప్ప ఇంకేమైనా ఉందా?

రైతాంగాన్ని భూమి నుండి వెళ్ళగొట్టి కార్పొరేట్ తరహా వ్యవసాయం (కుప్పం తరహా) నెల కొల్పేందుకు, బహుళజాతి కంపెనీలకు భూమి, వనరులు, మార్కెట్‌ను ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆత్మహత్యా సదృశ్య మైన ఈ దారుణానికి పాల్పడుతున్న వాజ్‌పాయ్, చంద్రబాబు దళారీ పాలకులు వ్యవసాయరంగంలో అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలపై పోరాటం సాగించే దానిలో భాగంగా రైతాంగం ఈ క్రింది డిమాండ్ల సాధనకోసం ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

డిమాండ్లు:

1) వరి పంట ధాన్యం బస్తాకు సాధారణ రకం రు.500, ఫైన్ క్వాలిటీకి బస్తాకు రు.600 గిట్టుబాటు ధర చెల్లించాలి.
2) ధాన్యంను ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరలకు ఎఫ్.సి.ఐ కొనుగోలు చేయాలి.
3) చెరకు పంట 1 టన్నుకు రు.1000 గిట్టుబాటు ధర చెల్లించాలి.
4) కెసిపి యాజమాన్యం ప్రకటించిన ప్రోత్సాహకాలు: వడ్డీలేని 3 వేలు అప్పు, 14 వందల విలువచేసే ఎరువుల అప్పును ఉచితంగా చెరకు రైతాంగానికి ఇవ్వాలి.
5) వ్యవసాయరంగంలో సబ్సిడీలను కోత పెట్టకుండా కొనసాగించాలి.
6) వ్యవసాయరంగాన్ని ప్రైవేటీకరించే పాలసీని రద్దుచేయాలి.

(5-3-02న చల్లపల్లిలో ధర్నా పిలుపు సందర్భంగా)

సంక్షోభంలో వున్న రాయ్యల రైతాంగాన్ని కాపాడే చర్యల కోసం..!!

కృష్ణాజిల్లా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)

వరల్డ్ బ్యాంక్‌తో చేసుకొన్న ఒప్పందం మేరకు కేంద్ర, రాష్ట్ర దళారీ పాలకులు అనుసరిస్తున్న నూతన ఆర్థిక సంస్కరణలు ప్రభావం అన్ని వర్గాల ప్రజలతోపాటు రైతాంగాన్ని సంక్షోభానికి గురిచేస్తోంది. దీనిలో భాగంగా తీర ప్రాంతంలోని ఆక్వా రైతాంగం గిట్టుబాటు ధరల్లేక అప్పులపాలై కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. ఆక్వా రైతుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

ఆంధ్ర రాష్ట్రంలో 9 జిల్లాల్లో సుమారు 3 లక్షల ఎకరాల్లో దాదాపు 80 వేల మందికి పైగా రైతులు రొయ్యల సాగు చేస్తున్నారు. రాష్ట్రం నుండి 2500 కోట్ల విలువైన రొయ్యలు, చేపలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలో 1 లక్షా 25 వేల ఎకరాల్లో ఆక్వా సాగు వల్ల 400 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ స్థితిలో అప్పులుచేసి పెట్టుబడులు పెట్టి శ్రమకోర్చి సాగుచేస్తున్న రైతుకు వనకూరుతున్న ప్రయోజనం ఏమిటి?

1 ఎకరానికి 30 కౌంట్ వచ్చే వరకు అయ్యే ఉత్పత్తి ఖర్చు (చెర్వు రిపేర్లు, రొయ్యసీడ్, ఫీడ్, ఆయిల్, ఎరువులు, మందులు కూలీ వగైరా) దరిదాపు రు.17,300. అవుతోంది. కాని వచ్చే ఆదాయం 17 వేలు అయినా వస్తుందనే నమ్మకం లేదు. అందులో వైరస్ సోకితే సర్వం కోల్పోవడమే. ఈ మధ్యకాలంలో రొయ్యపిల్ల రేటు విపరీతంగా పెరిగింది. వైరస్ వివిధ రకాల వ్యాధులు, వీటికి ఖరీదైన మందుల వాడకాలతో ఆక్వా రైతులు భారీ దోపిడీకి గురౌతున్నారు.

కొనుగోలుదారులు, ఎగుమతిదారులు కుమ్మక్కై సీజన్‌లో ధరలు తగ్గించి అన్‌సీజన్‌లో పెంచటం, ఈ విధంగా గత 10 సం॥లుగా రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఉదా: గత సం॥ జనవరి-మార్చికాలంలో 20 కౌంట్ రొయ్యల కెజీ ధర రు.530, 30 కౌంట్ కేజి ధర రు.480 వరకు వుంటే అదే సం॥ జూన్, జూలైకొచ్చేసరికి 20 కౌంట్ రు.310, 30 కౌంట్ 260లకు మంచి సీజన్‌లో రేట్లుపడి పోయింది. అదే సమయంలో ఆఫ్ఘన్‌పై అమెరికా దురాక్రమణ యుద్ధం ప్రభావం వల్ల విదేశాలకు చేసే ఎగుమతులు 30 శాతం తగ్గాయి.

ఈ మార్కెట్‌శక్తుల వలయంలో రైతు చిక్కి విలవిలలాడుతున్నాడు. మరోవైపు ఆగ్నేయాసియా దేశాలైన తైవాన్, థాయిలాండ్ దేశాల్లో రొయ్యలసాగు ఉచ్చదశకు చేరినప్పుడు ఎగుమతులు లేవనే పేరుతో పలుమార్లు రేట్లు తగ్గించి ఆక్వా రైతులను దారుణంగా దెబ్బతీసారు. ఈ విధంగా చేయటం ద్వారా సామ్రాజ్యవాద దేశాలు అన్ని అవసరాలకు తమ మీద ఆధారపడేలా చేసుకొనేందుకు తెరవెనుక ఆడిన నాటకం మనదేశంలో కూడా ప్రారంభమైంది.

ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న మరో ముఖ్య సమస్య వైరస్. రైతుల పాలిట మహమ్మారిలా, అరికట్టడం అసాధ్యంగా తయారై రైతాంగం దివాళా తీస్తున్నారు. జిల్లాలో 50 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం వున్నా కేవలం 105. 75 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నదంటే వైరస్ ప్రభావం ఎంత తీవ్రంగా వుందో అర్థమవుతోంది. వైరస్‌కి ప్రధాన కారణం శాస్త్రీయ పద్ధతుల్లో రొయ్యలసాగు చేయక పోవటమే. ఫలితంగా రొయ్యల రైతాంగం వైరస్ సుడిగుండం నుండి బయటపడలేకపోతున్నారు.

పేద, సన్నకారు రైతాంగం మేత, రొయ్యపిల్ల, ఇంజన్ ఆయిల్ ఉత్పత్తి ఖర్చులకోసం రొయ్యల కంపెనీలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. పంట చేతికొచ్చేసరికి వారు ఇచ్చిన ధరకే పంట తెగ నమ్మాలి. ఖర్చులకి రాక మరల సాగుకోసం అప్పుచేయటం ఈ విధంగా స్వంతపాలంలో కంపెనీ తరవున రైతు బంధితపాలేరుగా మారుతున్న దుస్థితి దాపురించింది. వందల కోట్ల విదేశీ మారక ద్రవ్యం సంపాదిస్తున్న ప్రభుత్వం ఆక్వారంగ పరిరక్షణకోసం, రైతు ప్రయోజనాల కోసం ఏమైనా చేసిందా?

ప్రభుత్వపరంగా తక్కువ ధరలకు నాణ్యమైన మేత అందించేందుకు 1993లో 10.50 లక్షలతో మార్క్‌ఫెడ్ ద్వారా ఫీడ్ ప్లాంట్ స్థాపనకోసం రూపొందించిన ప్రతిపాదన కాగితాలకే పరిమితం అయింది. రొయ్య సీడ్‌లో అవకతవకలను అరికట్టేందుకు మత్స్యశాఖ రూపొందించిన 'ఆక్వా సీడ్ యాక్ట్'ను అమలు చేయకుండా చెదలు పట్టించారు. రొయ్యల ఉత్పత్తులకు గిట్టుబాటు వున్నప్పుడు మాత్రమే అమ్ముకొనే విధంగా వాటిని నిల్వ వుంచేందుకు మచిలీపట్నంలో 30 లక్షలతో ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానన్న మత్స్యశాఖా మంత్రి నడకుదిటి నరసింహారావు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. ఆక్వా సాగులో నైపుణ్యం సంపాదించేందుకు, వ్యాధులను కనుగొనేందుకు ఎంపెడా ద్వారా ల్యాబ్‌లను ఏర్పాటు చేయాల్సి వుంది. పై విషయాలు గమనించినప్పుడు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆక్వా రైతును బహుళజాతి కంపెనీలకు, మార్కెట్‌శక్తుల దయాదాక్షిణ్యాలకు బలిచేయదల్చుకున్నాయని స్పష్టమవుతోంది.

ఆక్వా సాగు కోసం ఉప్పునీరును డ్రైన్ల నుండి ఇంజన్ల ద్వారా తోడుకొంటున్నారు. ఇందులో ప్రభుత్వం చేస్తున్నది ఏమీ లేదు. అయినప్పటికీ ఎకరానికి 600 రు.లు నీటితీరువా క్రింద వసూలు చేయటం ఏమి న్యాయం? రైతు సంక్షేమం పట్టని ఈ ప్రభుత్వానికి నీటితీరువా వసూలుచేసే నైతిక అర్హత వుందా? అంతేకాక దీర్ఘకాలంగా సంక్షోభంలో వున్న రొయ్యల రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సిందిపోయి గోరుచుట్టుపై రోకటి పోటులా ఆక్వాసాగును రిజిస్టర్ చేయాలనే నిబంధనలతో రైతులను వేధింపులకు గురిచేస్తున్నది.

ఈ స్థితిలో ఆక్వా రైతాంగం గిట్టుబాటుధరల కోసం, తన ఉనికిని నిలబెట్టుకోడం కోసం సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ క్రింది డిమాండ్ల సాధన కోసం పోరాటానికి సిద్ధంకమ్మని రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆక్వా రైతాంగానికి విజ్ఞప్తి చేస్తోంది. మచిలీపట్నం, నాగాయిలంకలలో 16.2.'02 తేదీన రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాలను విజయవంతం చేయవల్సిందిగా ఆక్వా రైతుకు విజ్ఞప్తి చేస్తున్నాం.

డిమాండ్లు:

- రైతు కమిటీల నాయకత్వాన ధరలు నిర్ణయించి అమ్మకాలు జరగాలి.
- ఆక్వా రైతాంగానికి కనీసం 30 కౌంట్‌కి రు.400లు ధర లభించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.
- ఆక్వా సాగును రిజిస్టర్ చేసుకొనే విధానాన్ని పూర్తిగా రద్దుచేయాలి.
- ఆక్వా రైతుల నుంచి నీటితీరువా పన్నును వసూలు చేయటాన్ని పూర్తిగా ఆపివేయాలి.
- రైతు కమిటీల నాయకత్వాన ఆక్వా సాగు శాస్త్రీయ పద్ధతుల్లో సాగేలా సత్వరం చర్యలు తీసుకోవాలి.
- దెబ్బతిన్న ఆక్వా రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయాలి.
- వైరస్-ఇతర వ్యాధులను కనుగొనేందుకు, అరికట్టేందుకు మచిలీపట్నంలో ఆక్వా పరిశోధనా కేంద్రం నెలకొల్పాలి.
- ఆక్వారంగం అభివృద్ధి కొరకు ఐస్‌ప్లాంట్‌లు, లేబొరేటరీలు, ఫీడ్‌ప్లాంట్,ప్రాసెసింగ్ ప్లాంట్ లను ఏర్పాటు చేయాలి.
- ఆక్వా సాగు వున్న ప్రాంతాల్లో రక్షిత మంచినీటి పథకాలను అమలుచేయాలి.
- ఎంపెడా సంక్షోభంలో వున్న రొయ్యల రైతాంగాన్ని ఆదుకొనే చర్యలు చేపట్టాలి.

(16-2-02న మచిలీనపట్నం, నాగాయలంకలలో ధర్నాలకు పిలుపిచ్చిన సందర్భంగా..)

కరెంటు మీటర్ల బిగింపుపై నెల్లూరుజిల్లా రాయ్యల రైతాంగం సాగించిన సమైక్య పోరాటం

నెల్లూరుజిల్లాలో మంచినీటి రొయ్యల సాగు బాగా విస్తరించింది. ట్రంకురోడ్డుకు తూర్పుగా వున్న సముద్రతీర గ్రామాల్లోనేగాక రోడ్డుకు పశ్చిమంగా 40,50 కి.మీ. దూరం వరకు పెన్నానది ఒడ్డున ఫిల్టరు పాయింట్లు వున్న ప్రాంతమంతటికీ ఇది విస్తరించింది. ఉప్పునీటి రొయ్యల సేద్యాని కన్నా మంచి నీటి రొయ్య సేద్యానికి నీటి అవసరం చాల ఎక్కువ. దాంతో రొయ్యల సాగుకు కొత్త మోటార్ల కనెక్షన్లకు డిమాండ్ పెరిగింది.

ప్రభుత్వం, ట్రాన్స్‌కోలు సాధారణవ్యవసాయం కన్నా రొయ్యల సాగు పద్ధతి, ఆదాయాలు మెరుగ్గా వున్నాయని, వాటి ఛార్జీలు పెంచేందుకు ప్రయత్నించాయి. చివరకు సాధారణ వ్యవసాయ మోటార్లకు వసూలుచేసే శ్లాబురేట్లకు 6 రెట్లు ఛార్జీని ఆక్వా సాగుకు నిర్ణయించారు. గత సం॥ కండెన్సర్లు పెట్టినందుకు కేసులు బనాయించడం, పెనాల్టీలు విధించడంపై జిల్లా వ్యవసాయరంగ పరిరక్షణ ఐక్యపోరాట వేదిక ఆందోళన చేసిన ఫలితంగా వాటిని రద్దుచేశారు.

ఈ సం॥ వ్యవసాయసీజనులో సెప్టెంబరు 11 దాడుల కారణంగా అమెరికాకు ఎగుమతులరేట్లు పడిపోయాయంటూ రొయ్యల ఎగుమతిదారులు రేట్లు దిగకోశారు. కిలో 750 రూ. వున్న రేటును 400 రూ.కి తగ్గించటంతో రైతాంగం బాగా నష్ట పోయింది. రైతాంగం ఈ సంక్షోభాన్ని ఎదుర్కొం టున్న కాలంలోనే కొత్తగా ఆక్వా సాగుకు మోటార్లు పెట్టుకున్న రైతులందరికీ మీటర్లు బిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మీటర్లు బిగిస్తే యూనిట్‌కు రు.1.25పై. చెల్లించాల్సి వస్తుంది. 3 హెచ్.సి మోటారుకు శ్లాబ్‌రేట్ ప్రకారం రు.5,400లు చెల్లిస్తుండగా, మీటర్లు బిగిస్తే రు.15,000లు చెల్లించాలి. 5 హెచ్.పి మోటారుకు రు.8,400లు బదులు 25 వేల రూపాయలు చెల్లించాల్సి వస్తుందని అంచనా. మీటర్లు బిగిస్తే తమపై పడబోయేభారం గురించి రైతాంగంలో ఆందోళన మొదలైంది. ఎక్కడికక్కడ రైతులు మీటర్లు బిగించుకోకుండా ఎదురు తిరగడం ప్రారంభించారు.

నవంబరు 30వ తేదీన జిల్లా వ్యవసాయరంగ పరిరక్షణ ఐక్యపోరాట వేదిక (రైతు కాంగ్రెసుతో సహా) నెల్లూరులో జరిపిన సమావేశంలో ఈ సమస్యను చర్చించారు. శ్లాబ్ విధానాన్నే కొన సాగించాలని, ట్రాన్స్‌కో బిగించే మీటర్లను తిరిగి డిపార్ట్‌మెంట్‌కే స్వాధీనం చేయమని రైతాంగానికి పోరాట వేదిక పిలుపునిచ్చింది. కరెంట్ రేట్లు పెరగడమేగాక మీటరు పరిరక్షణ బాధ్యత కూడ రైతుల మీదే మోపడంతో మీటర్లు ఏ కారణంచేత చెడిపోయినా రైతులు పెనాల్టీ చెల్లించాల్సి రావడంతో కూడా రైతాంగం ఆందోళనపడు తున్నది. జిల్లాలో 30 వేల మోటార్లు ఆక్వాసాగులో వున్నాయి. అందువల్ల ఈ రైతులంతా ఐక్యంగా నిలబడి మీటర్లను ప్రతిఘటించాలని పోరాట వేదిక పిలుపునిచ్చింది.

వేదిక పిలుపుకు రైతాంగం వెంటనే స్పందించింది. మీటర్లను తీసుకెళ్ళి సబ్‌స్టేషన్లలో అప్పగించారు. డిశంబరు 7న తిరిగి పోరాట వేదిక సమావేశమై, 17వ తేదీన జిల్లా సదస్సు నిర్వహించా లనీ, దానికిముందు మండలాల్లో వేదిక నాయకత్వం పర్యటనలు జరిపి రైతాంగాన్ని సమీకరించే నన్నాహక కృషి జరపాలని నిర్ణయించింది.

రైతుల ఆగ్రహం-మీటర్లు దగ్ధం

పోరాట వేదిక నాయకత్వం డిశంబరు 8న ఇందుకూరుపేట మండల కేంద్రానికి వెళ్ళింది. వందలాదిగా పోగయిన రైతాంగం ఎడ్లబండ్లపై మీటర్లుపెట్టి ఊరేగించి సబ్‌స్టేషన్‌వద్ద ధర్నా చేశారు. సభ నిర్వహించారు. నెల్లూరు నుండి ఇంజినీర్లు వచ్చేవరకు ఆందోళన కొనసాగించారు. చివరకు మీటర్లు తమకు అందినట్లు రశీదు ఇస్తామని, అప్పగిస్తే స్వీకరిస్తామని ఇంజినీర్లు అంగీకరించడంతో రైతులు మీటర్లు అప్పగించారు.

ఇదేరోజు టిపి గూడూరు మండలంలో కూడ రైతులు మీటర్లను అప్పగించేందుకు తెచ్చారు. అయితే అక్కడ ఇంజినీర్లు ఎవరూ అందుబాటులో లేకుండా వుద్దేశపూరితంగా వెళ్ళిపోవడంతో రైతాంగం ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రభుత్వం మీటర్లను బిగించడానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గంటలు గడుస్తున్నా అధికారులు రాక పోవడంతో ఆగ్రహంచెందిన రైతాంగం మీటర్లను, ట్రాన్స్‌ఫార్మర్లను తగులబెట్టారు. ఈ వార్తలు కొన్ని గంటల్లోనే జిల్లా అంతటా వ్యాపించాయి. రైతాంగాన్ని అరెస్టు చేసేందుకు కేసులు పెట్టేందుకు పూనుకున్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాట వేదిక నాయకత్వం రైతాంగానికి సంఘీభావం ప్రకటించింది. 8వ తేదీనాటి దిన వత్రికలన్నీ ఈ వార్తలను వతాకశీర్షికలలో ప్రచురించాయి.

జిల్లా సదస్సుకు తరలివచ్చిన రైతాంగం

డిసెంబరు 17వ తేదీన మధ్యాహ్నం 2 గం.కు జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు పోరాటవేదిక కరపత్రాలు ప్రచురించి రైతాంగంలో విస్తృతంగా ప్రచారం చేసింది. సదస్సుకు జిల్లాలో ఆక్వాసాగు వున్న అన్ని ప్రాంతాల నుండి రైతాంగం 1500 మందికిపైగా హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ వెనుకవున్న రైతాంగం కూడ హాజరవటం విశేషం. భారతీయ కిసాన్ సంఘ్, బిజెపి సెక్షన్లు కూడ సదస్సుకు హాజరై ఐక్యకార్యాచరణలో పాల్గొనేందుకు సంసిద్ధతను ప్రకటించారు. రైతునాయకులతోపాటు రాపూరు, నెల్లూరు ఎం.ఎల్.ఎలు కూడా సదస్సులో ప్రసంగించి రైతాంగపు న్యాయమైన డిమాండ్లను అసెంబ్లీలో చర్చకు తెస్తామని ప్రకటించారు.

మీటర్లు వెనక్కుతీసుకోవాలనీ, శ్లాబ్ పద్ధతిని కొనసాగించాలని కోరుతూ సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. డిసెంబరు 26వ తేదీనాడు అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మీటర్లు స్వాధీనం చేయాల్సిందిగా సదస్సు రైతాంగానికి పిలుపునిచ్చింది.

ఉద్యమంగా మీటర్ల స్వాధీనం

ఈ పిలుపు ననుసరించి అన్ని సబ్‌స్టేషన్లలో రైతాంగం వందలాది మీటర్లను విద్యుత్ అధికార్లకు స్వాధీనం చేశారు. మీటర్లు పెట్టుకోకుంటే కేసులు పెట్టాల్సి వస్తుందని అధికార్లు హెచ్చరించారు. అయినా రైతాంగం వెనక్కితగ్గలేదు.

డిశెంబరు 26న సమావేశమయిన పోరాట వేదిక నాయకత్వం పరిస్థితిని బేరీజు వేసింది. కేసులు పెడతామంటూ, కనెక్షన్లు తీసివేస్తామంటూ అధికారులు చేస్తున్న హెచ్చరికలకు జంకకుండా నిలబడమని రైతాంగానికి పిలుపునివ్వాలనీ, 30 వేల మంది రైతులపై కేసులు ప్రభుత్వం పెట్టాలంటే తీవ్ర ప్రతిఘటన చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించాలని, రైతాంగాన్ని సంఘ టితంగా నిలబెట్టేందుకు కృషి కొనసాగించాలని నిర్ణయం తీసుకొంది. జనవరి 28వ తేదీలోగా ప్రభుత్వం నిర్ణయాన్నుండి వెనుకకు రాకుంటే విద్యుత్ ఎస్.ఇ. కార్యాలయాన్ని ముట్టడించాలని తీర్మానించింది.

ఎస్ఇ కార్యాలయాన్ని ముట్టడించిన రైతాంగం

28వ తేదీ ఉదయం 10 గం. నుండి మొదలైన రైతాంగ సమీకరణ 11 గం.కు 5 వేలకు

→

తుఫాను బాధితులకు నష్టపరిహారం కోసం రాపూరులో ఆందోళన

నెల్లూరుజిల్లా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)

వర్షపునీటికి కొట్టుకుపోయిన నిమ్మచెట్లకు చెట్టుకు 500 రూ. లెక్కన నష్టపరిహారం చెల్లించాలి, కూలిపోయిన ఇళ్ళకు 3000 రూ.ల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలి తుఫాన్ బాధితులకు ప్రతి ఇంటికి 50 కేజీల బియ్యం ఇవ్వాలి మొదలగు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎం.ఆర్.ఓకు సమర్పించారు. ⁂



రాపూరు ఎమ్మార్వోతో చర్చిస్తున్న రైతుకూలీసంఘం నాయకులు

అక్టోబర్ 16వ తేదీన తుఫాన్ ఫలితంగా నెల్లూరుజిల్లాలో అసాధారణ వర్షం కురిసింది. 24 గం.లోనే 30 సెం.మీ. గరిష్ట వర్షపాతం నమోదయింది. దీని కారణంగా జిల్లాలోని దక్షిణప్రాంతం తీవ్రంగా నష్టపోయింది. గూడూరు డివిజన్‌లో వందలాది చెరువులు తెగిపోయి ఏర్లుపొంగి ప్రవహించి కొన్ని గ్రామాలను ముంచెత్తాయి. తోటల్లో నివసించే కూలీలు రాత్రిపూట నిద్రలో కొట్టుకుపోయారు. పగటిపూట వాగువచ్చిన ప్రాంతాల్లో మాత్రం ఆస్తులు కోల్పోయినా ప్రాణాలు మాత్రం దక్కించుకోగలిగారు. అంతకు ముందు వరకు వర్షాలు లేక నిమ్మచెట్లు ఎండిపోతున్న దుస్థితిని ఎదుర్కొగా ఈ తుఫాన్ ఫలితంగా వేళ్ళతో సహా పెకలించుకుని చెట్లు కొట్టుకుపోయాయి. చెరువుల కిందవున్నదే కొద్ది పాటి మాగాణి భూములు. అవి తెగిపోవడంతో ఈ సం॥ తిండిగింజలు కూడా పండించుకోలేని దుస్థితిలో రైతులు ఉన్నారు.

ప్రచార ఆర్భాటం తప్ప సహాయక చర్యలకోసం కదలని పాలకుల్ని కదిలించేందుకు రై.కూ.సం. రాపూరు మండలస్థాయిలో ధర్నా నిర్వహించింది.

తుఫాను కారణంగా నష్టపోయిన గ్రామాలకు నష్టపరిహారం చెల్లించాలని, తెగిపోయిన చెరువు గండ్లు వెంటనే పూర్తిచేయాలని 24.10.2001న రాపూరు ఎం.ఆర్.ఓ ఆఫీస్ వద్ద రై.కూ.సం. ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో ఏపూరు, నవాబుపేట, గిలకపాడు, అక్కమాంబపురం తదితర గ్రామాల నుండి 70 మంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ నుండి ర్యాలీ బయలుదేరి మెయిర్‌రోడ్డు మీదుగా ఎం.ఆర్.ఓ ఆఫీస్ వద్దకు చేరుకున్నది. ఈ ధర్నానుద్దేశించి రైతుకూలీ సంఘం జిల్లా కన్వీనర్ జి.సునీత మాట్లాడుతూ, రాపూరు మండలంలోని అనేక గ్రామాల్లో చెరువులు తెగిపోయి వందల ఎకరాల పంట నష్టపోయారనీ, అదేవిధంగా నవాబుపేట గిరిజన కాలనీ నీళ్ళమయం అయినదనీ, తుఫాన్ వచ్చి పదిరోజులు అవుతున్నా ఈ ప్రభుత్వం ఎటువంటి సహాయక చర్యలు చేపట్టలేదనీ, గత మూడు సంవత్సరాల నుంచి కరువు వచ్చి విలయ తాండవం చేస్తుంటే ఈ ప్రభుత్వంకు చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లుగా వుందనీ, ప్రపంచ బ్యాంక్ నుండి తెచ్చిన వేలకోట్ల రూపాయల అప్పులను తమ ప్రయోజనాలకు వాడుకుంటుంది తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోవటంలేదని విమర్శించారు.

తెగిపోయిన చెరువుగండ్లు వెంటనే పూడ్చాలి. నష్టపోయిన భూములకు నష్టపరిహారం చెల్లించాలి.

→

కరెంట్ మీటర్లు...

చేరింది. ఎస్.ఇ కార్యాలయాన్ని రైతాంగం ముట్టడించడంతో పోలీసులు జి.టి.రోడ్‌లో ట్రాఫిక్‌ను మళ్ళించక తప్పలేదు. 12 గం. వరకు రోడ్‌పై రైతాంగం బైఠాయించారు. రైతాంగాన్ని వుద్దేశించి వేదిక నాయకులు ప్రసంగించారు. అనంతరం రైతాంగం ప్రదర్శనగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళారు. వేదిక నాయకత్వం జాయింట్ కలెక్టర్‌ను కలిసి సమస్యల పై వినతిపత్రం అందజేసింది. రైతాంగ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియపరుస్తానని హామీ ఇచ్చారు.

రైతాంగం పెద్దఎత్తున నినాదాలు చేసి కలెక్టరు తమ వద్దకే వచ్చి మాట్లాడాలని పట్టుపట్టడంతో ఆయన రైతాంగం వద్దకు వచ్చి డిమాండ్లను తాను అర్థంచేసుకున్నానని తన పరిధిలో లేని విషయమైనందున ప్రభుత్వానికి తెలియపరుస్తానని చెప్పే వరకు రైతాంగం కదలలేదు.

ప్రభుత్వ నిర్ణయాన్ని తిరస్కరించిన రైతాంగం

రైతాంగంలో పెద్ద ఎత్తున కదలిక రావడం చూసిన ప్రభుత్వం బెంబేలు పడింది. జిల్లా మంత్రి చంద్రమోహన్‌రెడ్డి హైద్రాబాద్‌లో ముఖ్యమంత్రితోను, అధికారులతోను చర్చించి ఒప్పించామని యూనిట్‌కు రు.1.25పై బదులు 0.90పై.కు తగ్గిస్తామని, మీటర్లు పెట్టుకునేందుకు అంగీకరించమని రైతాంగానికి విజ్ఞప్తి చేయక తప్పలేదు.

జిల్లా కలెక్టరు కూడ పోరాటవేదిక నాయకత్వానికి పై ప్రతిపాదనను అంగీకరించమని కబురుపెట్టారు. పోరాటవేదిక సమావేశం ఈ రేటు తగ్గింపు ప్రకటన కేవలం ఎత్తుగడతో కూడినదనీ, మీటర్ల విధానం రైతులు భరించలేరనీ, మీటర్లకు రైతులు రక్షణ కల్పించలేదనీ (ఫిల్టరు పాయింట్లు కూడ మార్చవలసిరావడంవల్ల) శ్లాబ్ విధానాన్నే కొనసాగించాలనీ ఏకగ్రీవంగా తీర్మానించింది.

అధికారుల బెదిరింపులను లెక్కచేయకుండా రైతాంగం సంఘటితంగా నిలబడి మీటర్లు తిరస్కరించాలన్న కృతనిశ్చయంతో వున్నారు. వ్యవసాయ మోటర్లకు కూడ మొత్తంగానే మీటర్లు పెట్టాలనేది ప్రభుత్వ ప్రతిపాదన అయినందున ఇపుడు ఆక్వా రైతులు సాగిస్తున్న ఆందోళనకు మిగిలిన రైతాంగం కూడ మద్దతు ప్రకటిస్తోంది. ★

సింగూరు జలాలను నిజాం సాగరులోనికి విడుదల చేయాలని డిమాండు చేస్తూ ...

నిజాంసాగర్ ప్రాజెక్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఏర్పాటుచేసిన సింగూరు రిజర్వాయర్ నుండి తక్షణం 5 టి.యం.సిల నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు-కూలీ సంఘం (ఆం.ప్ర); ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘంల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో 13.8.2001 తేదీన నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందించారు.

నిజాంసాగరు ఆయకట్టు ప్రాంతం నుండి ధర్నాలో పాల్గొన్న వందలాది రైతులనుద్దేశించి కామ్రేడ్ గంగుల నర్సయ్య రైతు-కూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ, జిల్లాలో వర్షాలు సకాలంలో పడనందున రైతాంగం నాట్లు వేయక, వేసిన నాట్లు ఎండిపోతూ వుంటే చూడలేక తల్లడిల్లుతున్నారని, నిజాంసాగర్ ఇసుకమేట వేసినందున ఆయకట్టు భూములకు నీరును

నిజామాబాద్‌జిల్లా రైతుకూలీసంఘం (ఆంధ్రా)

అందించే స్థితిలో లేదని, సింగూరు నుండి వెంటనే 5 టియంసిల నీరు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. జిల్లాలో ఏర్పడిన కరువు పరిస్థితులకు, వలసలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సింగూరు నుండి నిజాంసాగర్‌కు నీటిని వదలాలని ఆందోళన చేసిన తెలుగుదేశం నాయకులు మండవ వెంకటేశ్వరావు (ప్రస్తుత మంత్రి) మొదలైన వారు ఇప్పుడు భూములు పడావుపడినా, పంటలు పాడైపోతున్నా, సింగూరులో 16 టియంసిల నీరు నిల్వవున్నా నోరుమెదపడం లేదన్నారు.

జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి మండలానికి కోటి రూపాయలు కేటాయించాలని, కరువు సహాయక చర్యల క్రింద విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు ఉచితంగా సరఫరా చేయాలని, సింగూరు నుండి 5 టియంసిల నీటిని వెంటనే విడుదల చేయాలి; బ్యాంకులు కొత్త ఋణాలు మంజూరు చేయాలి, పాత అప్పులు మాఫీ చేయాలి, దున్నేవానికే భూమి ఇవ్వాలి, కార్మిక, కర్షక, మేధావి ఐక్యత వర్ధిల్లాలి, నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి అని పెద్దఎత్తున నినాదాలు చేశారు.

ధర్నాలో పాల్గొన్న రైతాంగం :

ఈ ధర్నాలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.వేణు ప్రసంగించారు. కామ్రేడ్స్ సుధాకర్, రాజారెడ్డి, మారుతి, రాజన్న మొదలైనవారు పాల్గొన్నారు.

ధర్నాలో ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్, నవీపేట మండలాలకు చెందిన 300మంది రైతాంగం పాల్గొన్నారు. ★

చింతలపూడి నియోజకవర్గంలో దళితుల హత్యలు : అఖిలపక్ష కమిటీ ఆందోళన

చింతలపూడి నియోజకవర్గంలోని 4 మండలాలలోని దళిత, బలహీనవర్గాల ప్రజలపై హత్యలు, అక్రమ కేసులు, వేధింపు చర్యలకు వ్యతిరేకంగా నియోజకవర్గంలోని వివిధ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, పౌర ప్రజాస్వామ్య హక్కుల సంఘాలు ఒక అఖిల పక్షంగా ఏర్పడ్డాయి.

మక్కినవారి గూడెంలో దళితుని హత్య

టి.నర్సాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామ భూస్వామి పిన్నమనేని రాధాకృష్ణ తన వ్యవసాయక్షేత్రంలో పాలేరుగా పనిచేయుచున్న మరపట్ల సుధాకరరావు (26సం॥)ను ఎరువులు దొంగిలించాడనే నెపంతో తీవ్రంగా కొట్టగా సుధాకరరావు మరణించాడు. మరణించిన సుధాకరరావును భూస్వామి సుధాకరరావు కుటుంబానికి అప్పజెప్పటానికి ముందు సుధాకరరావు గొంతులో ట్యూబ్‌వేసి పురుగుల మందుపోసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అతని కుటుంబాన్ని నమ్మించి దహన సంస్కారాలకు కొంత ఆర్థిక సహాయం చేస్తానని శవాన్ని దహనం చేయటానికి కుటుంబాన్ని పురమాయించారు. సుధాకరరావు మతానుసారం శవాన్ని గోతిలో పాతిపెట్టడం సాంప్రదాయం అయితే దహనానికి పూనుకోవడంతో గ్రామంలోని వారికి, ఇతర కులాల వారికి అనుమానం వచ్చి పంచాయితీ సర్పంచ్ శిరిమళ్ళ బాబూరావు నాయకత్వాన పోలీసు, మండలాధికారులకు తెలియజేయడంతో శవాన్ని పంచనామా గావించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసును టి.నర్సా పురంలో ఫైలు చేసినా భూస్వామి తదితరులను అరెస్టు చేయలేదు.

వెంకటాపురంలో దారుణహత్య

టి.నర్సాపురం మండలం వెంకటాపురం గ్రామంలో యండ్రిపాటి ప్రసాద్ (16 సం॥)ను, దాకారపు శ్రీనివాసరావు స్థానిక పెత్తందారు, ప్రసాద్ కాస్తున్న పశువులు తన చేలోపడి మేశాయని, తన చేతి కర్రతో తలపై బలంగా కొట్టగా తల పగిలి చనిపోయాడు. చనిపోయిన ప్రసాద్ శవాన్ని చెరువులో పడవేసి, పశువులను దాకారపు శ్రీనివాసరావు తోలుకొచ్చి తన ఇంటివద్ద కట్టేసి ప్రసాద్ ఇంటికి కబురుపెట్టాడు. మీ అబ్బాయి పశువులు వదిలిపెట్టి ఎక్కడికిపోయాడో, పశువులు చేను పాడుచేశాయని, వెదకమని పురమాయించగా రెండవ రోజున శవం చెరువులో దొరికింది. దొరికిన శవాన్ని పంచనామా చేయించకుండా, విచారణ చేయకుండా యండ్రిపాటి ప్రసాద్ కుటుంబానికి 10 వేల రూ॥లు ఇస్తానని స్థానిక పెద్దల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకొన్నాడు. శవానికి సంస్కారాలు అయిన తరువాత పెద్దల ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వలేదు. ఈ విషయం గ్రామంలోని ఇతర రాజకీయ పార్టీల వారికి తెలియజేయడంతో ఈ హత్యపై న్యాయ విచారణ జరిపించాలని టి.నర్సాపురం మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, దళిత సంఘాలు మరియు పౌరప్రజాసంఘాలు పాల్గొన్నాయి.

ఈ హత్యలపై ది.22.12.2001 చింతలపూడి జూనియర్ కాలేజీలో అఖిలపక్ష కమిటీ నాయకత్వాన బహిరంగ సభ నిర్వహించారు. ✦

ఏటూరులో దళితులు సాంఘిక బహిష్కరణపై !!

కృష్ణాజిల్లా కైఫుకూలీ సంఘం (ఆం.ప్ర.)

ప్రియమైన ప్రజలారా!

మే నెల 3వ తేదీన చందర్లపాడు మండలం ఏటూరు గ్రామంలో దళిత ప్రజలు నిర్మిస్తున్న అంబేద్కర్ దిమ్మెను గ్రామంలోని ఒక సెక్షన్ యువకులు గడ్డపలుగులు, పారలతో ధ్వంసంచేసి, పూడ్చివేసి తమ అగ్రకుల ప్యూడల్ దురహంకారాన్ని ప్రదర్శించారు.

ఈ దాడిపై స్థానిక దళిత యువజన సంక్షేమ సంఘం నాయకులు చందర్లపాడు పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చి అధికారులకు, స్థానిక ఎం.ఎల్.ఏకు కూడా స్వయంగా తెలియపర్చుకున్నారు. అయినా తమపైనే కేసు పెడతారా? అంటూ మరింత ఆగ్రహంతో దళితులను కఠినమైన సాంఘిక బహిష్కార చర్యలతో హింసించటం ప్రారంభించారు. కౌలుకి భూమి ఇవ్వకపోవటం, పాలుపోయక పోవటం, ట్రాక్టర్లు ఇవ్వకపోవటం, బహిర్భూమికి వెళ్ళే స్త్రీలను వేధించటం, గ్రామంలోకి రానీయక పోవటంలాంటి చర్యలకు ప్యాలడ్డారు. అయినా దళిత ప్రజలు రాజీపడకుండా ఆందోళనను తీవ్రం చేయడంతో జీవనాధారంమీద దెబ్బకొడితేగాని రాజీకి వచ్చి, పెట్టిన కేసులు రద్దుచేసుకొని "మనదారికి" రారు అనే కుట్రతో గత 50 సం॥లపైగా మాలలు, మాదిగలు అనుభవిస్తున్న సొసైటీ భూములకు ఈ నం॥ మాలలు అనుభవించే భూములకే బహిరంగవేలం పెట్టించి అగ్రకులాలవారే పాడుకొని వీరి పొట్టకొట్టడంతో లంక భూములపై ఆధారపడి జీవిస్తున్న పేదలు దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడ్డారు.

పోలీస్, రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యవైఖరి

మే 3వ తేదీన దిమ్మె కూల్చిన ఘటనపై దళితులు పెట్టిన కేసుకు సంబంధించి సెక్షన్ 3కి కావాల్సిన ఆధారాలుండగా 7(1) పి.సి.ఆర్. యాక్టు క్రింద కేసు నమోదుచేసి కేసును నీరుగార్చే చర్యకు పోలీసు అధికారులు పాల్పడ్డారు. జూన్ 6వ తేదీన దళితులు గ్రామంలో ఏర్పాటు చేసిన నిరసన దీక్షా శిబిరాన్ని సందర్శించటానికి వచ్చిన డియస్పీ, చందర్లపాడు ఎం.ఆర్.ఓలు దళితుల సమస్యలను పరిష్కరించకుండా వెళ్ళిపోయారు.

రెవిన్యూ పోలీసు అధికారులు "వివాదాస్పద స్థలంలో" శిబిరాన్ని వేశారంటూ దళితులపై కేసుపెట్టి గ్రామంలోని కొందరు అగ్రకుల దురహంకార శక్తులకు కావాల్సినంత ఆజ్యం పోసారు. ఎం.ఆర్.ఓ తన మెజిస్టీరియల్ అధికారాన్నంతా ఉపయోగించుకొని దళితులను శిక్షించడంలో ఘనమైన పాత్రను పోషించారు. అంతేగాక 'వివాదాస్పద' స్థలం ప్రక్కనే అధికార పార్టీ నాయకులు కొందరు దళితులను ప్రలోభపెట్టి అంబేద్కర్ విగ్రహ నిర్మాణం చేపట్టి, మరోవైపు దీక్షాశిబిరం నిర్వహిస్తున్న దళిత ప్రజలపై ఎం.ఆర్.ఓ, డియస్పీల సమక్షంలో పెద్దఎత్తున పోలీసులు దాడిచేసి భీతావహం సృష్టించారు. ఈ దాడి సందర్భంగా 20 మందిని నిర్బంధించి, ఏటూరికి 4 కి.మీ. దూరంగా పొలాల మధ్య తిండీ తిప్పలు లేకుండా హింసించారు. అంబేద్కర్ విగ్రహం దిమ్మెను ధ్వంసంచేసిన శక్తులే అధికార పార్టీ ప్రోద్బలంతో హడావుడీగా పోలీసుల పహరాలో విగ్రహం నిర్మించటంలో దళితులపై ప్రేమకంటే రానున్న స్థానిక ఎన్నికల్లో ఓట్లను గుంజుకోవటానికేనన్నది బహిరంగ రహస్యం.

ఏటూరు ఒకనాడు కమ్యూనిస్టు విలువలు గలిగిన గ్రామం. నేడు అది సాంఘిక బహిష్కరణలకు పెట్టింది పేరుగా మారింది. 40-45 సం॥ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే ఆనాడు దళితులు సాంఘిక బహిష్కరణకు గురై దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు కందుల కోటయ్య అనే రైతు భూస్వామ్య అగ్రకుల కట్టుబాట్ల సంకెళ్లను తెంచి దళితులను ఆదుకున్న చరిత్రను ఈనాటికీ ఆ గ్రామ దళితులు మరచిపోలేదు. అలాగే సుమారు 10 సం॥ క్రితం 'మేర' (సం॥నికి ఇచ్చే మొత్తం) విషయంలో చాకలి కులం వారిని సాంఘిక బహిష్కరణకు గురిచేసారు. ఇవికాక మాదిగ కులాల వారితో ఘర్షణలు-ప్రస్తుతం మాల కులస్థుల సాంఘిక బహిష్కరణ మొ॥వి ఏటూరు గ్రామ చరిత్రలో చోటుచేసుకోవటం బాధాకరం. ఏటూరులోని కొందరు అగ్రకుల దరహంకార శక్తులు మాల ప్రజలను లొంగదీసుకోవటానికి, మాదిగ ప్రజలను భ్రమల్లో పెట్టడానికి చేసిన కుట్రలను రెండు కులాల దళితుల్లోని అత్యధికులు అర్థం చేసుకొన్నారు. మాల మహానాడు నాయకులతోపాటు ఎం.ఆర్.పి.యస్. నాయకులు సమైక్యంగా ఉద్యమాన్ని నడిపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కులాల మధ్య ఒక వైషమ్యపూరిత వాతావరణం నెలకొనివున్న నేపథ్యంలో ఏటూరులో కొనసాగుతున్న ఐక్యత మంచి ఉదాహరణగా నిలుస్తుంది. ఇటీవల ఓపిడిఆర్ నియమించిన నిజనిర్ధారణ కమిటీ ఏటూరు దళితులు సాగిస్తున్న న్యాయమైన పోరాటాన్ని వెలుగులోకి తెచ్చింది.

దళితుల్లో పెరుగుతున్న ఆత్మగౌరవకాంక్ష

ఈ మధ్యకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనికట్టుకొని అమలుచేస్తున్న నూతన ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ విధానాల ఫలితంగా ప్రపంచబ్యాంకు వారి "ఆర్థిక సహాయంతో జరిగే అభివృద్ధులు" వలన పోగుపడుతున్న సంపదలతో, వనరులతో సరికొత్త భూస్వామ్య, పెత్తందారీశక్తులు మరింతగా బలపడుతూ వస్తున్నాయి. మరోవైపు అనేక రైతాంగ ఉద్యమాలు, సాంఘిక ఉద్యమాలు, దళిత ఉద్యమాలు, ప్రజాతంత్ర ఉద్యమాల ప్రభావంవల్ల దళితుల్లో ఆత్మగౌరవంతో జీవించాలన్న ఆకాంక్షలు బలపడుతున్నాయి.

రైతాంగం, యువకులు, శ్రామిక ప్రజలు ఎదుర్కొంటున్న ఈ దుస్థితికి కారణం-ప్రపంచ బ్యాంకు, బహుళజాతి కంపెనీలు, బడా పెట్టుబడిదారీ, భూస్వామ్య, దళారీ పాలకవర్గాల దోపిడీ విధానాలే. ఈ విధంగా దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన స్థితిలో మిత్రులెవరో, శత్రువులెవరో గమనించకుండా అగ్రకులాలలోని పేద, మధ్యతరగతి రైతులు కూడా దాడులకు పాల్పడుతూ, సాంఘిక బహిష్కరణలాంటి అనాగరిక చర్యలు చేపట్టడం ఏ విధంగానూ శ్రేయస్కరం కాదు. ఇటువంటి అనాగరిక చర్యలను ఖండించవలసిందిగా, దోపిడీ పీడన నుంచి విముక్తి కొరకు జరిగే విప్లవోద్యమంలోకి కలసి రావాల్సిందిగా రైతాంగానికి, ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

డిమాండ్లు:

1. ఏటూరులో దళితులపై అమలులో వున్న సాంఘిక బహిష్కరణను ఏ రూపంలోనూ అమలుకాకుండా నిలిపివేయాలి.
2. ఎం.ఆర్.ఓ దళితులపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలి. స్థూపం దిమ్మెను ధ్వంసం చేసిన శక్తులను వెంటనే అరెస్టు చేయాలి.
3. మాలలు సొసైటీ పేరుతో సాగుచేసుకుంటున్న లంకభూములకు జరిపిన వేలం పాటను వెంటనే రద్దుచేసి లంక భూములపై పూర్తి హక్కు కల్పించాలి.
4. లంకభూములు, పోరంబోకులు, బంజర్లు, దేవాలయ భూములు, భూమిలేని నిరుపేదలకే ఇవ్వాలి.
5. దళితుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా, అభద్రతాభావాన్ని పోగొట్టి గౌరవప్రదంగా గ్రామంలో జీవించేటందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి.
6. దళితవాడల్లో మరుగుదొడ్లు, బోరింగ్ పంపులు వెంటనే నిర్మించాలి.
7. ఏటూరు దళితుల సాంఘిక బహిష్కరణకు స్థానిక ఎం.ఎల్.ఏ నైతిక బాధ్యత వహించాలి.

దళిత కులాల మధ్య ఐక్యత వర్థిల్లాలి!
పీడి ప్రజల పోరాటాలు వర్థిల్లాలి!! ★

డిప్యూటి జైలర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ...

నెల్లూరుజిల్లా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)

నెల్లూరు జనశక్తినగర్‌కి సంబంధించిన ఒక కేసులో 'రైతుకూలీ సంఘం' నాయకులు, జనశక్తి నగర్ కమిటీ సభ్యులు 15మంది నెల్లూరు జైలులో సెప్టెంబరు 4 నుంచి 21 వరకు జ్యూడీషియల్ రిమాండ్‌లో వున్నారు. ఈ సందర్భంగా వీరు ఖైదీలకు ఇస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, రుచి గురించి ప్రజాస్వామికంగా ప్రశ్నించడం జైలు అధికారులను కలవర పెట్టింది. ఒక్కపూట రేషన్ సక్రమంగా ఇవ్వాల్సి వచ్చేటప్పటికే అధికారులకు వంటినిండా తేళ్ళు, జెర్రులు పాకినట్లు అయ్యింది. కూరలు నాసిరకంగా వుండటానికి ఖైదీలకు వంట చేతకాకపోవడమే కారణమని అప్పటి వరకు బుకాయించిన అధికారులు ఒక్క పూట రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.కిషోర్‌బాబు ప్రత్యక్షంగా నిలబడి అదే ఖైదీలతో వంట రుచికరంగా చేయించటంతో వంటలు సక్రమంగా లేకపోవడానికి వంట ఖైదీల అసమర్థత కారణం కాదని- ఇవ్వాల్సిన నూనె, కూరగాయలు, ఇతర దినుసులు సక్రమంగా ఇవ్వకపోవడమే కారణమని బట్టబయలైంది. దీనితో స్టోర్స్ ఇన్ ఛార్జి డిప్యూటీ జైలర్ శేషయ్య జైలు అధికారులందరిని రెచ్చగొట్టి అబద్దాలు కల్పించి చెప్పి జైలు అధికారులను జిల్లా జడ్జి వద్దకు పంపారు. రైతుకూలీ సంఘం నాయకులు దురుసుగా వ్యవహరిస్తున్నారంటూ అబద్దపు ఫిర్యాదులు చేసి వీరిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించమని అభ్యర్థించారు. న్యాయాధికారులు నిరాకరించడంతో వెనుదిరిగారు. ఇదంతా 20.9.2001నాడు జరిగింది.

21వ తేదీన కూడా రైతుకూలీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో వంట జరిగితే ఇంకా ఎన్నో విషయాలు బయటపడతాయని, దానిని కొనసాగనివ్వరాదనే నిర్ణయానికి వచ్చి, డిప్యూటి జైలర్ శేషయ్య భౌతిక దాడికి పథక రచన చేశాడు. 21 ఉదయం లాకప్ తీసిన తరువాత పెరుగు పంపకం జరుగుచున్న స్టోర్‌రూమ్‌లో కిషోర్‌బాబు అడుగు పెట్టీ పెట్టగానే శేషయ్య అతని ఆధ్వర్యంలో పనిచేసే ఇద్దరు వార్డర్లు (శీనయ్య, మరొక అతను) ఒక్క వుదుటన మీదికి వచ్చి గదిలో నుండి నెట్టుకుంటూ బయటికి తెచ్చారు. "ఖైదీలకు మేం లెక్కలు చెప్పడం ఏమిటని, ఖైదీలు పనిచేయాలే తప్ప ఏమీ అడగరాదంటూ దుర్భాలాడుతూ" కేకలేశాడు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న కా॥ జె.కిషోర్‌బాబు

గతంలో జైలులో ఎన్నోసార్లు ఖైదీలు నాసిరకం తిండి తనబోమంటూ నిరాకరించారు. ఆయా సందర్భాలలో ముందుండి అడిగినవారందరిని వార్డర్లు, జైలర్లు విపరీతంగా కొట్టి చిత్రహింసలు పెట్టి బట్టలూడదీసి ఒంటరిగా వుండే ఏ వసతులు లేని సెల్స్‌లో నిర్బంధించారు.

జైలులో అడ్మిషను ఇచ్చేటప్పుడు బ్లాక్ కేటాయించేందుకు, సందర్శకులు ఖైదీలతో నేరుగా మాట్లాడేలా ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చేందుకు వేలకు వేలు లంచాలు అధికారులు గుంజుతున్నారు. పై స్థాయి అధికారుల లంచగొండితనం చూసిన క్రింది స్థాయి వార్డర్లు తమకు వీలైన రీతిలో సంపాదనకు దిగజారుతున్నారు. ఖైదీలకు వారి బంధువులిచ్చే పండ్లు, బిస్కెట్లు వంటి వాటిని కూడా వారికి దక్కకుండా లాగేసుకుంటున్నారు. ఖైదీల రేషన్‌లోని పాలను, మంచి కూరగాయలను, నూనెలు, మాంసంలోని కండలన్నీ సిబ్బంది ఇళ్ళకు తరలిస్తూంటారు.

న్యాయాధికారులు తమపర్యవేక్షణలో ఉండేట్లుగా (జ్యూడిషియల్ రిమాండ్) జైలుకు పంపుతారు. అక్కడ వీరిపై ఏలాంటి మానసిక, భౌతిక చిత్రహింసలు జరగరాదన్నది పాలసీ. జ్యూడీషియల్ రిమాండ్ అంటే శిక్షకాదు.


"నువ్వు", అన్నమాట జైలులో అత్యంత మర్యా దైన పదం. మహిళా ఖైదీలపట్ల కూడా సిబ్బంది బూతులను ప్రయోగించడం సర్వ సాధారణం. రిమాండ్‌లోని ఖైదీలను కూడా స్వతంత్రులైన మనుషులుగా జైలు సిబ్బంది పరిగణించటం లేదు. ఖైదీ అంటే బానిసగా వుండాల్సినదేనన్న అధికారం, అహంతో సిబ్బంది వ్యవహరిస్తున్నారు. మానసిక పరివర్తనకు బదులు నేరతత్వాన్నే పెంచుతున్నవీ జైళ్ళు

ఏ వ్యక్తిలోనైనా మానసిక పరివర్తన రావాలంటే బల ప్రయోగంతో కాదు. ప్రజాస్వామిక వాతావరణంలోనే అది సాధ్యం. అసలు దేశంలో ప్రస్తుతం జైళ్ళకు వస్తున్నది పేద, మధ్య తరగతి వర్గాలే! వందల కోట్లు దోస్తున్న బడా దొంగలు, హత్యలు చేస్తున్న సంపన్న రాజకీయ నాయకులంతా జైళ్ళకు రాకుండానే తప్పుకుంటున్నారు. జైళ్ళలోని సాధారణ ఖైదీలంతా సరియైన తిండి లభించక అనారోగ్యాల పాలవుతున్నారు. అక్కడే చస్తున్నారు కూడా. నెల్లూరు జైలులో కొద్ది నెలల క్రితమే ఇరువురు ఖైదీలు అనారోగ్యముతోనే చనిపోవడం అందరూ ఎరిగినదే.

నెల్లూరు జిల్లా జైలు అవినీతికి నిలయంగా మారింది. ఇక్కడ ఖైదీలకు పెడుతున్న తిండి పశువులు కూడా తిరస్కరించేంత నాసిరకంగా వుంది. జైలులోని చెత్త డబ్బాలన్నీ ఖైదీలు తినలేక పారబోసే అన్నంతో నిండడమే ఇందుకు బుజువు. మరొక వైపు జైలు నిండా అధికార దుర్వినియోగం, బలప్రయోగం, నిరంకుశత్వం రాజ్యమేలుతున్నాయి. ఈ పరిస్థితులను మార్చేందుకు సమైక్య ఆందోళనకు కలిసి రావలసినదిగా ప్రజాస్వామిక వాదులందరికీ నెల్లూరుజిల్లా రైతుకూలీ సంఘం విజ్ఞప్తి చేస్తున్నది.

→

పశ్చిమగోదావరి ఆదివాసిలపై సాగుతున్న కుట్రలనూ, నిర్భంధాన్ని ఖండించండి!



కుడినుండి- 18-9-2001న కొవ్వూరులో జరిగిన ధర్నా దృశ్యం, ఆర్డీవోకు మెమొరాండంను అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

పోలవరం: 15.5.02

పశ్చిమగోదావరిలో గిరిజన ఉద్యమం అనేక నిర్భంధాలనూ, కుట్రలనూ ఎదుర్కొంటున్నది. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో పోలీసు యంత్రాంగం ఆదివాసీలపై తీవ్ర నిర్భంధంతో పాటుగా వారి మధ్య చీలికలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నది. పోలవరం మండలంలో ఆది వాసీలను ఒంటరి చేసి దెబ్బ తీయాలని కుట్రలు చేస్తున్నది.

హుకుంపేట మాజీ జమిందారు హోతా శ్రీరామచంద్రమూర్తి పోలీసు అధికారులతో కలిసి కుంజం, జిళ్లెళ్లగూడెం. పేండ్రాల, మనుగోపుల గ్రామాల ఆదివాసులపై అక్రమ కేసులు బనాయించాడు. వీటిని ఆదివాసీలు నిబ్బరంగా ఎదుర్కొన్నారు.

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) నాయకులతో, గిరిజనసంఘ ప్రతినిధులతో, హుకుంపేట మాజీ జమిందారు కుటుంబీలకులతో, రెవిన్యూ అధికారులతో పోలీసు అధికారులు చర్చలు ఏర్పాటు చేశారు. భూమి సమస్యపై రెండు సార్లు చర్చలు జరిగిన తర్వాత పోలవరంలో 3-3-2002న మూడవసారి చర్చలు జరిగాయి.

దీనిలో ఆదివాసీల తరపున గిరిజనసంఘ నాయకులు, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) నాయకులు, ఓపిడిఆర్ నాయకులు వి.నారాయణరెడ్డి, ఏపిసిఎల్‌సి నాయకులు శ్రీమన్నారాయణ, ఎం.సి.పి..ఐ రాష్ట్ర నాయకులు, సిపిఐ, సిపిఐ(యం), సిపిఐ(ఎం.ఎల్) ఎన్.డి., జనశక్తి జిల్లా నాయకులు, ఐటిడిఏపిఓ హరి జవహర్‌లాల్, ఐటిడిఏ న్యాయ సలహాదారు త్రినాధరావు పాల్గొన్నారు. హోతా శ్రీరామచంద్రమూర్తి కుటుంబీకులు, ఎంఆర్ఓ, సిఐ, డిఎస్పి హాజరయ్యారు.

రైతుకూలీ సంఘం నాయకులు మాట్లాడుతూ

→

→

డిప్యూటీ జైలర్‌పై....

డిమాండ్లు:

1. జైలు ఖైదీల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న డిప్యూటీ జైలర్ శేషయ్యను, ఇద్దరు వార్డర్లను సస్పెండ్ చేయాలి.
2. మెనూ ప్రకారం ఖైదీలకు అందించాల్సిన రేషన్‌లో దొంగతనాన్ని అరికట్టాలి. శుచికరమైన, రుచికరమైన ఆహారాన్ని ఖైదీలకు అందివ్వాలి.
3. ఖైదీల పట్ల సిబ్బంది దౌర్జన్యాలను, బూతు పదజాల ప్రయోగాన్ని అరికట్టాలి. ప్రజాస్వామిక వాతావరణం నెలకొల్పాలి.
4. జైలు నిర్వహణలో సాగుతున్న అవినీతిని, అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలి. ★



కమ్మారిపాలెంలో పంపింగ్ స్కీమ్ పై పెత్తందారీ శక్తులు, పోలీసులు సృష్టించిన దురాగతాలపై...

కృష్ణాజిల్లా రైతుకూలీ సంఘం (ఆంధ్రా)

గత సంవత్సరం జరిగిన పంచాయితీ ఎన్నికల్లో ఓడి పోయిన అధికారపార్టీవారు ఓటమిని అంగీకరించలేక ప్యూడల్ దురహంకారంతో గ్రామాల్లో పెత్తనంకోసం ఘర్షణలు, ఉద్రిక్తలు పెంచుతున్న ఫలితంగా అనేక గ్రామాలు నేటికీ రావణకాష్టాల్లా కాలుతున్నాయి. నందిగామ మండలం కమ్మవారిపాలెం గ్రామంలో పంపింగ్ స్కీమ్ సమస్య దీనికి తాజా ఉదాహరణగా నిలుస్తుంది.

పంపింగ్ స్కీమ్ సమస్య-పూర్వాపరాలు

కమ్మారిపాలెం గ్రామంలో వైరా ఏటిమీద 1995లో ఏపిఎస్ఐడిసి రైతుల భాగస్వామ్యంతో అన్నపూర్ణా ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. దీని ఆయకట్టు సుమారు 640 ఎకరాలు. ఈ స్కీమ్ అధ్యక్షులుగా కొణిదన ఆదినారాయణ, కార్యదర్శిగా కిలారు మల్లిఖార్జునరావులు కొనసాగుతున్నారు. 16.5.2001న జరిగిన జనరల్ బాడీలో 2001-2002 వ్యవసాయ సీజన్ బడ్జెట్ ప్రకారం నీటితీరువా ఎకరానికి రు.300లుగా తీర్మానించారు. దీని ప్రకారం నీటితీరువాను వసూలు చేస్తున్నారు. ఈ విధంగా పంపింగ్ స్కీమ్ పనులు సజావుగా సాగుతున్న స్థితిలో గత ఆగస్టులో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో అధికారపార్టీకి చెందిన కిలారు వెంకటేశ్వరరావు తల్లి ఓడిపోవటంతో, స్కీమ్ అధ్యక్షుడు కొణిదన ఆదినారాయణ (టిడిపి) మద్దతు ఇవ్వలేదనే సాకుతో ఆయనపై కక్ష సాధింపు చర్యగా, స్కీమ్‌పై ఆధిపత్యం కోసం స్కీమ్‌కి సంబంధించిన బైలా నిబంధనలను తుంగలో తొక్కి తన తండ్రి కిలారు మల్లిఖార్జునరావుని అధ్యక్షునిగా ఒక కీలుబొమ్మ కమిటీని ప్రకటించాడు. అంతేకాక నీటితీరువాను రు.500లు చెల్లించాలని, తన ప్రత్యర్థి కొణిదన ఆదినారాయణ ప్రకటించిన రు.300లు ఆయనకు చెల్లిస్తే అది చెల్లదని హెచ్చరిక జారీ చేశాడు. దీనితో గ్రామంలోని రైతాంగంలో గందరగోళం, భయాందోళనలు పెరిగాయి.

డియస్‌పి జోక్యం ఎవరి ప్రయోజనాల కోసం?

అధికారులను బుట్టలో వేసుకోవడంలో 'చేయి తిరిగిన' కిలారు వెంకటేశ్వరరావుతో నందిగామ డిఎస్‌పి పులి కోటేశ్వరరావు 'చేయి' కలపడంతో కమ్మారిపాలెం రైతులు పోలీసుల పహారాలో బిక్కుబిక్కుమంటూ బ్రతకాల్సి వచ్చింది.

ముందుగా కిలారు వెంకటేశ్వరరావుముఠా స్కీమ్ రికార్డులను అక్రమ పద్ధతుల్లో స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నించి విఫలమయ్యారు. రౌడీశక్తులను రంగంలోకి దింపి స్కీమ్ పైప్‌లైన్ వాల్వు తాళాలను పగలగొట్టించి, స్కీమ్ హౌస్‌ను స్వాధీనం చేసుకొన్నారు. మరోవైపు స్కీమ్‌పై లస్కర్లుగా పనిచేస్తున్న 5గురు ఎస్.సి, ఎస్.టి కులాలకు చెందిన రైతుకూలీ సంఘం సానుభూతిపరులపై వాల్వు తాళాలు పగలుగొట్టారని అక్రమ కేసులుపెట్టి పేద వర్గాలను వేధించటం ప్రారంభించారు. అంతేకాక ఈ అక్రమ చర్యలను వ్యతిరేకిస్తున్న రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ చంద్ర శ్రీమన్నారాయణతోపాటు మరికొందరు రైతులపై ఎస్.సి, ఎస్.టి చట్టం క్రింద అక్రమకేసులు బనాయించారు. ఇవన్నీ డిఎస్‌పి ప్రత్యక్ష పర్యవేక్షణలో సాగుతున్నవే.

డిసెంబర్ 16న రైతుకూలీ సంఘం గ్రామంలో అక్రమ కేసులతో వేధించబడుతున్న పేదవర్గాల సమస్యపై నిజనిర్ధారణ కమిటీని నియమించింది. కమిటీ విచారణలో డిఎస్‌పి, కిలారు వెంకటేశ్వరరావుల మాటల్లోనే గ్రామంలో పెట్టిన కేసులన్నీ ఫాల్స్ (బూటకపు) కేసులని వెల్లడైంది. అయినా డిఎస్‌పి సమస్యను పరిష్కరించటానికి బదులు ఆచరణలో కిలారు వెంకటేశ్వరరావుకి పోలీసు యంత్రాంగాన్ని ప్రైవేట్ సైన్యంగా మార్చాడు. నీటితీరువాని కిలారు వెంకటేశ్వరరావు ముఠాకి ఎక్కువభాగం రైతులు చెల్లించటానికి నిరాకరించటంతో జనవరి 30వ తేదీ నుంచి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేసి; చంద్ర శివయ్య, కొర్రపాటి కోటేశ్వరమ్మల ధాన్యాన్ని కల్లాల నుంచి తీసుకురానీయకుండా పోలీసులు బెదిరింపులు సాగించటంతో మిగతా రైతులు కుప్ప నూర్పిళ్ళు సాగించలేని భయవాతావరణంలోకి నెట్టబడ్డారు.

→

→

ప.గోదావరి నిర్బంధం...

జస్టిస్ పున్నయ్య కమిషన్ సిపార్సుల ననుసరించి ప్రభుత్వ జి.ఓ ఎంఎస్ 100 ప్రకారం చూసినా, ప్రభుత్వ మార్గదర్శక సూత్రాల ప్రకారం చూసినా పిఓగారు భూవివాద కేసులను పరిశీలించాల్సి వుంది. గనుక పిఓ గారు ఛైర్మన్‌గా ఆదివాసీ ప్రతినిధులు, భూస్వాములతో కూడిన ఒక కమిటీ ఏర్పడాలనీ, హుకుంపేట మాజీ జమిందారు తనకున్నాయంటున్న భూమిపై హక్కులను ఈ కమిటీ తనిఖీ చేయాలనీ ప్రతిపాదించారు.

దీనికి అందరూ అంగీకరించి తీర్మానం వ్రాసుకున్నారు. గ్రామాలపై భూస్వాములు, పోలీసుల దాడులు గానీ, ప్రవేశం గానీ ఉండదని స్పష్టం చేస్తూ పోలీసు అధికారులు కూడా సంతకాలు చేశారు. ఈ కమిటీ ఏర్పాటు కలెక్టరు ఆమోదం కోసం పిఓ గారు వెంటనే పంపారు.

అయితే జిల్లా కలెక్టరు ఈనాటికీ ఆమోదం తెలుపకపోగా, పిఓ గారిని బదిలి చేశారు. మరోవైపున ఒప్పందంలో అనుకున్న ప్రకారం హోతా శ్రీరామచంద్రమూర్తిగానీ, రెవిన్యూ అధికారులు గానీ భూమి రికార్డులను ఆదివాసుల న్యాయవాదులకు యివ్వలేదు. ఉపయోగపడని అరకొర కాగితా లిచ్చారు. ఆదివాసులలో తనతొత్తులుగా పనిచేసే కొందరితో తగాదాలు సృష్టించేందుకు రాంపండు పూనుకున్నాడు. మనుగోపులలో రిటైర్డ్ కానిస్టేబుల్ మిడియం కోనయ్యను ముందు పెట్టి ఆదివాసులపై తప్పుడు కేసులు పెట్టించాడు. భూమి తనదేనని నిరూపించే తిరుగులేని రికార్డులు తన వద్ద ఉన్నాయని వాదించిన మాజీ జమిందా రుకు ఆ "రికార్డు"లు స్వకల్పితాలు గనుక నిష్పాక్షిక పరి శీలనకు నిలవలేవని తెలిసే ఈ కుట్రలతో నిర్బంధం తెచ్చే వద్ధతిని ఆశ్రయించాడన్నది స్పష్టం. రికార్డుల పరిశీలన కోరుతున్న ఆదివాసీ వ్రతి నిధులైన న్యాయవాదులకూ, ఆదివాసీ ప్రజలకూ ఇది తొలి నైతిక విజయం.

పోలవరంలో ధర్నా

అన్ని సెటిల్‌మెంట్ ఆర్డర్లూ రద్దు చేయాలి; ఆదివాసుల అనుభవంలో నున్న భూములన్నింటినీ 10(1) ఆడంగల్‌లో ఆదివాసులను సాగుదార్లుగా నమోదు చేయాలి; గ్రామాల వారీగా ఎంజయ్‌మెంటు రికార్డులు గ్రామ సభల పరిశీలనకు సమర్పించాలి; పిఓ ఛైర్మన్‌గా ఏర్పడిన కమిటీకి కలెక్టరు ఆమోదం తెలపాలి; పిఓ బదలీ నిలుపుదల చేయాలి; హోతా శ్రీరామచంద్రమూర్తి సరికొత్త కుట్రలను ఖండించాలని డిమాండు చేస్తూ 15-5-2002 ఎంఆర్ఓ ఆఫీసు వద్ద 500 మంది ఆదివాసీలు ధర్నా చేశారు. మెమోరాండం సమర్పించారు. అక్కడి నుండి ప్రదర్శనగా పోలీసుస్టేషనుకు వెళ్లి మాజీ జమిందారు అక్రమంగా బనాయిస్తున్న కేసులను ఖండిస్తూ, రాంపండునే కుట్రదారుగా కేసు రిజిస్టరు చేయాలనీ ఆదివాసులను వేధించరాదనీ డిమాండు చేశారు.

ఈ కార్యక్రమానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కోటయ్య, ఏజన్సీ గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతలాడ చిన్నబ్బాయి, కుంజల రామారావు, పద్దం కృష్ణమూర్తి, మిడియం భూలక్ష్మి నాయకత్వం వహించారు. ✦

పోరాటమార్గం చేపట్టిన రైతాంగం

స్కీమ్ విషయంలో డిఎన్‌పి జోక్యాన్ని ఖండిస్తూ, రైతులు ధాన్యాన్ని తెచ్చుకోవటానికి రక్షణ కల్పించాలని, మొత్తం స్కీమ్ విషయంలో రివిన్యూ యంత్రాంగం విచారణ జరిపించాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీ సంఘం చొరవతో ఫిబ్రవరి 4వ తేదీన నందిగామలో నిరసన ప్రదర్శన చేసి తర్వాత యం.ఆర్.ఓ, ఎస్‌ఐ ఆఫీసులను ముట్టడిచేసి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన స్థానిక కాంగ్రెస్, సిపిఎం పార్టీలవారు, స్కీమ్ ఆయకట్టు రైతాంగం ముఖ్యంగా మహిళలు మిలిటెంట్‌గా పాల్గొన్నారు. ఎం.ఆర్.ఓ ఇచ్చిన హామీలను అమలుజరపకుండా గ్రామంలో పోలీసులు అడ్డుకోవటంతో, తిరిగి ఫిబ్రవరి 6వ తేదీన ఎం.ఆర్.ఓ ఆఫీస్ వద్ద ధర్నా జరపటంతో 7వ తేదీన ఎం.ఆర్.ఓ -ఎస్.ఐల సమక్షంలో సమస్యపై ఒక పరిష్కారాన్ని ప్రకటించారు. నీటితీరువాను గ్రామంలో వున్న రెండు పాలకవర్గాల్లో ఎవరికైనా గ్రామ కార్యదర్శి పర్యవేక్షణలో చెల్లించి ధాన్యాన్ని తెచ్చుకోవచ్చని ప్రకటించారు. ఈ ఒప్పందాన్ని గ్రామంలో అమలుజరగనీయకపోగా కల్లం నుంచి ధాన్యం తెచ్చుకోవటానికి ప్రయత్నించిన చంద్ర శివయ్యపై లోకల్ పోలీసులే కాక చిల్లకల్లు, వీరులపాడు ఎస్.ఐలు పెద్దఎత్తున పోలీస్ బలగంతో వచ్చి గ్రామంలో బీతావహవాతావరణం సృష్టించారు. ఇదంతా కిలారు ముఠాకి రక్షణగా చేసిన హంగామానేనని పోలీసులే బయటపెట్టుకొన్నారు. అంటే ఇందులో డిఎస్‌పి 'హస్తం' ఎంత 'బలం'గా వుందో నగ్నంగా బయటపడింది.

జిల్లా కలెక్టర్, ఎస్.పిల వరకు వెళ్ళిన సమస్య

ఎం.ఆర్.ఓ-ఎస్.ఐల స్థాయిలో వచ్చిన ఒప్పందాన్ని, సబ్ కలెక్టర్ స్వయంగా విచారించి ఆదేశాలిచ్చినా-వాటిని కూడా కిలారు ముఠా అమలుకానీయని స్థితిలో రైతుకూలీ సంఘం నాయకత్వాన కమ్మారిపాలెం రైతులు ఫిబ్రవరి 15న బందర్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పీల దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్ళారు. జిల్లా ఎస్.పి శాండిల్య సమస్యపై వెంటనే స్పందించి రైతులు ధాన్యాన్ని తెచ్చు కోవటానికి అడ్డంకులు కల్పించ వద్దని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనితో 19 రోజులుగా కల్లాల్లో నిర్బంధంలో వున్న ధాన్యానికి ఫిబ్రవరి 16వ తేదీన విముక్తి లభించింది. పోలీస్ పహరా నుంచి బయటపడ్డ గ్రామంలోని రైతాంగం ఎంతో ఉత్సాహంతో కుప్పలు కొట్టడం ప్రారంభించారు. అయితే చంద్ర శివయ్య పాలం నుంచి ధాన్యాన్ని తోలుకురావటానికి వెళ్ళితే 16 బస్తాల ధాన్యం మాయమైపోయి వుంది. పోలీస్ పహరాలో వున్న ధాన్యంపోతే ఈ నష్టానికి ఎవరు బాధ్యత వహించాలి? కొర్రపాటి కోటేశ్వరమ్మకి చెందిన పాడిగేదె తోకను కిలారు ముఠా తెగ నరికారు. ఈ అవమానానికి, నష్టానికి ఎవరు మూల్యం చెల్లించాలి?

ఎవరీ కిలారు వెంకటేశ్వరరావు !!!

పచ్చగా వున్న పల్లెల్లో చిచ్చుపెట్టి కాలిన మంటల్లో బొగ్గు లేరుకొనే జాతికి చెందిన వారిలో కిలారు ఒకరు. కమ్మారిపాలెంలో సజావుగా సాగుతున్న అన్నపూర్ణా పంపింగ్ స్కీమ్‌పై ఆధిపత్యం సంపాదించి సొమ్ము చేసుకోవచ్చనే దురుద్దేశంతో అడుగుపెట్టి చాలా కథ నడిపాడు. ఇది ఇతని అవినీతి చరిత్ర మొత్తం పరిశీలిస్తే చాలా చిన్నదిగా కనిపిస్తుంది. ఇతని చీకటి వ్యాపారాలకు 'త్రివేణీ ఎడ్యుకేషనల్ ఎకాడమీ'ని పెద్ద గొడుగుగా ఉపయోగిస్తున్నాడు. ఈ గొడుగుకి అసలు కేంద్రం ఖమ్మం. నందిగామలో త్రివేణీ జూనియర్ కాలేజీ పేరుతో నకిలీ సర్టిఫికెట్ల వ్యాపారం నడిపాడు. ఇక్కడ ఇతని అవినీతి బయట పడటంతో స్వర్గీయ దేవినేని వెంటకరమణ మందలింపుతో ఖమ్మంకు మకాం మార్చినట్లు భోగట్టా. అక్కడి నుంచి ఖమ్మం కేంద్రంగా బోగస్ సంస్థల పేరుతో పక్కాఇళ్ళు తక్కువలో నిర్మి స్తానని, గేదెలు, సైకిళ్ళకు లోన్ ఇప్పిస్తానని, బ్యాంక్‌ల్లో పెద్ద మొత్తాల్లో లోను ఇప్పిస్తానని, ఉద్యోగాలు ఇప్పిస్తానని హైదరాబాద్, ఢిల్లీల వరకు తీసుకెళ్ళి 'కుచ్చుటోపీ'లు పెట్టడంలో ఆరితేరినవాడన్న విషయం ఈ ప్రాంత ప్రజలకు బాగా తెలుసు. తన స్వగ్రామం కమ్మారిపాలెంలో పక్కాగృహాల స్కీమ్, వృద్ధాశ్రమాన్ని నడుపుతూ అక్రమ సంపాదన సాగిస్తున్నాడు. ఈయన నడుపుతున్న బోగస్ సంస్థల వెనుక ఎన్ని కుంభకోణాలు వున్నాయో ఇంకా అనేకం వెలుగు చూడాల్సి వుంది. ఇంతటి 'ఘన' చరిత్ర వున్న కిలారు ఈనాటికీ అధికారపార్టీ నాయకుడిగానే చెలామణి కాగల్గుతున్నాడు. అధికారపార్టీ అండతో మరింత ధైర్యం'గా అక్రమాలకు, మోసాలకు పాల్పడుతున్నా డనటానికి కమ్మారిపాలెం స్కీమ్ సమస్య ఇందుకు తాజా ఉదాహరణగా నిలుస్తుంది.

గ్రామాల్లో ముఠాలను పెంచుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ తీరు

ప్రారంభంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను చిన్ననీటి పారుదల అభివృద్ధి సంస్థ (ఏపిఎస్ ఐడిసి)నే నిర్వహించేది. ఒక క్రమంలో సంస్థ స్కీమ్‌ల నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకొని రైతుల యాజమాన్యాలకు వదిలేసింది. దీని ఫలితంగా స్కీమ్‌లపై ఆధిపత్యం కోసం గ్రామాల్లో ముఠాలు, ఘర్షణలు పెరిగి ప్రశాంతంగా వుండే గ్రామీణ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ఈ పరిస్థితికి ప్రభుత్వం తీసుకొన్న వైఖరే ముఖ్య కారణం. రాష్ట్రంలోని చంద్రబాబునాయుడు ప్రభుత్వం ప్రపంచబ్యాంక్ నుండి వేల కోట్ల రూ.లు అప్పులుగా పొందిన దానికి నజరానాగా ప్రపంచ బ్యాంక్ షరతుల ప్రకారం అనేక ప్రభుత్వ సంస్థల్ని మూసివేసే దానిలో భాగంగా ఏపిఎస్ఐడిసీని ఎత్తివేసే చర్యలు ఇప్పటికే ప్రారంభించింది. దీని దుష్పలితాలనే నేడు మనం గ్రామాల్లో పంపింగ్ స్కీమ్‌ల నిర్వహణలో చూస్తున్నాం. కావున ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళుతెరచి పంపింగ్ స్కీమ్‌ల నిర్వహణలో రైతుల భాగస్వామ్యంతో పాటు ప్రభుత్వ అజమాయిషీ కూడా కొనసాగించ టానికి తగిన చర్యలు తీసుకోవాలి. దీనికి ప్రాథవి కంగా ఏపిఎస్ఐడిసీని ఎత్తివేసే విధానాలను మానుకోవాలని డిమాండ్‌చేస్తూ, సంస్థను కాపాడు కోవటానికి రైతాంగం-ఉద్యోగులు సమైక్య పోరాటం సాగించాలి. అప్పుడే కరువుతో పీడించ బడుతున్న పశ్చిమ కృష్ణాలో అవసరమైన సాగునీటి పథకాలను సాధించుకోగల్గుతాము.

కమ్మారిపాలెంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్వహణలో ఎదురైన పరిణామాలను హేచ్చరికగా తీసుకొని మరిన్ని 'కమ్మారిపాలెం'లను సృష్టించు కోకూడదన్న సదాశయంతో ముందడుగు వేద్దాం. ఈ కర్తవ్య సాధనకు, ఈ క్రింది డిమాండ్ల సాధన కోసం వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు సమైక్యపోరాటం సాగించటానికి ముందుకు రావలసిందిగా; మేధావులు, ప్రజాతంత్ర వాదులు పూర్తి సహాయ సహకారాలు అందించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

డిమాండ్లు:

1. స్కీమ్‌ల నిర్వహణలో రైతుల భాగ స్వామ్యంతోపాటు ప్రభుత్వ అజమాయిషీ వుండాలి.
2. అన్నపూర్ణా పంపింగ్ స్కీమ్ నిర్వహణలో ఏర్పడిన వివాదాలు, జోక్యాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి.
3. చంద్ర శివయ్య కల్లంలో అపహరించబడిన 16 బస్తాల ధాన్యానికి నష్టపరిహారం చెల్లించాలి.
4. ఏపిఎస్ఐడిసీని ఎత్తివేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలి.
5. స్కీమ్ వివాదం సందర్భంగా గ్రామంలోని దళితులపై, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి.
6. కిలారు వెంకటేశ్వరరావు నడుపుతున్న బోగస్ సంస్థలు, అవినీతి కార్యక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి.

నందిగామ, 28.2.'02.

కణేకల్లు పరిసర గ్రామాల రైతులపై పోలీసుదాడులు నిలిపివేయాలి! అరెస్టులను ఆపాలి! అక్రమంగా బనాయించిన కేసులను రద్దు చేయాలి!!

మిత్రులారా!

కణేకల్లు మండల కేంద్రంలోను, దాని పరిసర గ్రామాల్లోను రైతాంగం తీవ్ర భయాందోళనలతో వుంది. 22వ తేదీన హెచ్.ఎల్.సి. కాలువ నీరు వదిలినప్పటికీ రైతులు ఆ నీటిని వినియోగించు కొని వ్యవసాయ పనులు మొదలుపెట్టగల స్థితి లేకుండా పోయింది. వందలమంది రైతులు గ్రామా లు వదిలి బళ్ళారి వంటి ప్రాంతాలకు, బంధువుల గ్రామాలకు వెళ్ళి తలదాచుకొంటున్నారు.

ఈ పరిస్థితికి కారణం పోలీసు నిర్బంధమే. 17వ తేదీన కణేకల్లు మండల కేంద్రంలో జరిగిన ఘటనలకు ప్రతిగా పోలీసులు గ్రామాలపై విరుచుకుపడడమే. ఇండ్లలో పడుకున్నవారిని, పొలాల్లో పనిచేస్తున్న రైతులను పట్టుకెళ్ళడమే. అరెస్టులు చేసి 4,5 రోజులు గడచినా వారిని ఇప్పటికీ న్యాయ స్థానం ముందు ప్రవేశపెట్టలేదు.

ఈ ఉద్రిక్త పరిస్థితికి మూలం ఏమిటన్నది ఎవరైనా సహజంగా వేసుకొనే ప్రశ్న. అనంతపురం జిల్లాలో ప్రాజెక్టు కింద నీటిపారుదల వున్న ప్రాంతం అతి తక్కువ. తుంగభద్ర హైలెవెల్ కెనాల్ క్రింద ఆయకట్టు బొమ్మనహాళ్, కణేకల్ మండలాలతో మొదలవుతుంది. ఈ ప్రాంతంలో సాగుకు అందు బాటులో భూమి తక్కువగా వుండడం, గ్రామాల్లోని అధికులకు భూమి లేకపోవడంతో గుత్తకోసం పోటీ అధికంగా వుంది. ఈ పోటీ ఫలితంగా ఒక్క పంటకే ఎకరాకు 6 వేల నుండి 10 వేల రూపాయల వరకు గుత్తను పంట వేసే ముందుగానే రైతులు చెల్లిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా గుత్తదారులు అలాగే చెల్లించినారు. బోర్లు వున్న రైతుల వద్ద నారుమళ్లు పోసుకొని సెంటుకు 120 రూపాయలు చొప్పున (ఎకరాకు 12 వేల రూ) చెల్లించినారు.

ఇంత పెట్టుబడులుపెట్టి, నీటికోసం ఎదురు చూస్తే నీరు రాలేదు. నారు 30 నుండి 35 రోజుల్లో నాటాల్సివుండగా 45,50 రోజులయినా నీటి జాడ కనపడలేదు. ఆగస్టు 5వ తేదీ నుండే రైతులు ప్రభుత్వ అధికారులను నీటికోసం అభ్యర్థించినారు. 13వ తేదీ రైతులు ఆందోళన చేస్తే 16వ తేదీకి నీరు వదులుతామని అధికారులు ప్రకటించారు. అధికారులు ఇందుకోసం ఏర్పాట్లేమి చేయకపోగా - వరిసాగుకు నీరు ఇవ్వలేమని అందువల్ల ఆరుతడి పంటలు వేసు కొమ్మని రైతులకు సూచన చేస్తూ కరపత్రాలు పంపకం లోకి వచ్చాయి. దీంతో రైతాంగం తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. ఈ కరపత్రం పంపకంతో ప్రభుత్వం పుండు మీద కారం చల్లింది.

దీంతో అధికారులను ఈ విషయమై ప్రశ్నించా లనీ, ఎలాగైనా నీటిని సాధించుకోకపోతే తీవ్రంగా నష్టపోతామన్న భావనలు రైతాంగంలో వ్యాపిం చాయి. 16వ తేదీన నీటి విషయమై ఆర్.డి.ఓ.ను కణేకల్‌లో కలసి మాట్లాడగా - ఆయన తనకు ఏవిషయం తెలియదనీ, పైఅధికారులతో సంప్రదిస్తున్నాననీ చెప్పారు. దాంతో ఆయన నుండి సానుకూల మాట కోసం రైతాంగం తిండీ తిప్పలు లేకుండా ఆరోజంతా ఆఫీసు వెలుపల పడిగాపులు కాచారు.

17వ తేది ఉదయం తిరిగి పెద్ద సంఖ్యలో రైతులు హెచ్.యల్.సి. ఆఫీసు వద్దకు చేరుకొన్నారు. పై అధికారులకోసం, సమస్య పరిష్కారం కోసం రైతులు అడుగుతుంటే పోలీసులు లాఠీచార్జీకి పూనుకొన్నారు.

ఒక బాలునికి పోలీసు దెబ్బల వల్ల తీవ్ర గాయాలు తగిలి శరీరం రక్తసిక్తం కావడంతో రైతుల ఆగ్రహం బ్రద్దలయింది. తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల పట్ల ప్రజల్లో వున్న కోపతాపాలు వ్యక్తమయ్యాయి.

రైతుల ఈ ఆగ్రహావేశాలు రాష్ట్రవ్యాప్తంగా పత్రికలు, ఛానళ్ళలో ప్రముఖస్థానం ఆక్రమించడంతో ప్రభుత్వం సమాలోచనలు జరిపి నీటిని విడుదల చేయక తప్పలేదు. 22వ తేదీన నీటిని వదిలినారు. ఇదే నిర్ణయాన్ని 13వ తేదీన లేక కనీసం 16వ తేదీనయినా తీసుకొని నీటిని వదిలివుంటే ఈ పరిస్థితి ఏర్పడి వుండేది కాదు గదా?

అయితే ఏ నీటికోసమైతే రైతులు ఆందోళన చేశారో, ఆ నీటిని ఉపయోగపెట్టుకోగలస్థితి లేకుండా పోయింది. దీనికి కారణం పోలీసు నిర్బంధమే. ఇద్దరో ముగ్గురో అధికారులకు అవమానం జరిగిందంటూ వేలమంది రైతాంగాన్ని పోలీసులు భీతావహులను చేస్తున్నారు. రైతాంగానికి ఇప్పటికే జరిగిన, ఇప్పుడు జరుగుతున్న నష్టంపట్ల మాత్రం ప్రభుత్వం బాధ్యత వహించడంలేదనీ, కనీస పశ్చాత్తాపం కూడ లేదనీ రైతాంగంలో చర్చ జరుగుతున్నది. వలసపాలన కాలంలో భూమి కోసం, జమీందార్లు రైతాంగంపై ప్రయోగించిన పలు దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా ఆచార్య యన్.జి.రంగా, స్వామి సహజానందసరస్వతి, కొమ్మారెడ్డి వంటి వారు రైతాంగాన్ని ఆందోళనల్లోకి నడిపి హక్కులు సాధించిన చరిత్రను మనం చదువుతాం. వలసపాలకులకు, ఫ్యూడల్ ప్రభువుల కు ద్రోహపూరితమైనవిగా కనిపించిన ఆ ఉద్యమా లు ప్రజల దృష్టిలో దేశభక్తి యుతమైనవీ, న్యాయ మైనవీ అయ్యాయి. గత చరిత్రను గుర్తుంచు కోకుండా రైతాంగంపట్ల బాధ్యతో వ్యవహరించ కుండా వారిని వీధుల్లోకి తెచ్చింది అధికార యంత్రాంగం కాదా?

ఏదేమైనా ఎప్పుడూ ప్రశాంతంగా వుండే కణేకల్లు, బొమ్మనహాళ్ ప్రాంత రైతాంగానికి కోప తాపాలు తెప్పించింది ప్రభుత్వపు, అధికార యంత్రాంగపు నిర్లక్ష్యమేనన్నది నూటికి నూరు పాళ్ళు నిజం. ప్రజాతంత్ర వాదులు, సంస్థలు, రాజకీయ పక్షాలు కూడా దీన్నే ప్రకటించాయి.

అధికార యంత్రాంగం మొత్తం ఘటనల పరం పరను పర్యావలోకనం చేసుకొని గ్రామాల్లో రైతాంగం లో నెలకొన్న భయాన్ని తొలగించే బాధ్యత చేపట్టాలి. వ్యవసాయపనులు ఇప్పటి కయినా మొదలు పెట్టించేలా రైతాంగానికి ధైర్యం ఇవ్వాలి. గ్రామాలపై, పొలాలపై దాడులు నిలిపి, అరెస్టులు ఆపాలి. అక్రమ కేసులు రద్దు చేసి అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి.

- రైతాంగం ఈ పరిస్థితిని నిబ్బరంగా ఎదుర్కొ నాలనీ, తమకు జరిగిన అన్యాయం పై కలిసికట్టుగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.
- గ్రామాలపై పోలీసు దాడులు నిలిపివేయాలి, అరెస్టులను ఆపాలి.
- రైతులపై, నాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలి.

రాష్ట్ర కార్యవర్గం

25-08-2002 రైతుకూలీసంఘం, (ఆం.ప్ర)

ఈత ముక్కల దేవాలయ భూముల కోసం ధర్నా

ఈత ముక్కల గ్రామంలో అనేక సం॥లనుండి అతి తక్కువ లీజు చెల్లించి భూములు పేదలకు దక్కకుండా చేసిన పెత్తందార్ల నుండి, భూమిలేని నిరుపేద దళితులు సంఘటితంగా రైతుకూలీ సంఘం నాయకత్వాన ఆందోళనలు చేసి 60 ఎకరాల భూమిని సాధించుకున్నారు. భూములన్నీ వర్షాధారం కావడంతో సకాలంలో వర్షాలు పడక పంటలు పండించుకోలేక పోయారు. భూములను సాగుచేసి, నార్లు పోసి, నీరుచాలక భూములు ఎండిపోయి పంటలు నష్టపోయారు. ప్రభుత్వం కొత్తపట్నం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించినా నష్టపోయిన వారికి ఎటువంటి సహాయాన్ని అందించలేదు. మరోవైపు ఎండోమెంటువారు భూములకు లీజు చెల్లించాలని పేదలపై వత్తిడి చేస్తున్నారు. ఒక ప్రక్క కరువుతో పనులు లేక, పంటలు పండక, పూటగడవని స్థితిలో వున్న నిరుపేద దళితులు వేలకువేలే లీజు చెల్లించాలంటే సాధ్యమయ్యేది కాదు. అందుకే దళిత ప్రజల ఉద్ధరణ చేస్తామంటున్న ప్రభుత్వం, అధికారులు వెంటనే ఈతముక్కల దళితులకు దేవాలయ భూములను ఎస్.సి కార్పోరేషన్ ద్వారా కొనుగోలు చేయాలని, ఇప్పటికి చెల్లించిన లీజును మినహాయించాలని రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో రైతుకూలీలు ధర్నా చేశారు.

బ్రహ్మసముద్రం మండలం సూగేపల్లి గ్రామంలోని చెన్నమల్లప్పస్వామి దేవాలయ భూమిని భూమిలేని పేదలకు పంచాలి !

ప్రజలారా!

బ్రహ్మసముద్రం మండలం కొండాపురం మజరా సూగేపల్లి గ్రామంలో చెన్నమల్లప్పస్వామికి చెందిన దేవాలయ భూమి సర్వే నెంబరు 277లో 2-68 సెంట్లు మాగాణి, 426లో 56-99 సెంట్లు, 429లో 8-70 సెంట్లు, 430లో 19-10 సెంట్లు, 431లో 8-19 సెంట్లు, 432లో 32-11 సెంట్ల మెట్ట పై మొత్తం భూములను సూగేపల్లి గ్రామం లోని భూస్వామి, పెత్తందారి అయిన రాజన్నగౌడ్, ఆయన ఒక్క కుటుంబమే గత అనేక సంవత్సరాలుగా అనుభవించడం జరుగుతున్నది.

రాజన్నగౌడ్ గారి తాతపేరు చెన్నమల్లప్ప అయినందువలన పై దేవాలయ భూమి చెన్నమల్లప్ప స్వామిది కాదని, ఆ భూమి మొత్తం మా తాత చెన్న మల్లప్పగారి భూములని రెవిన్యూ అధికారులతో కుమ్మక్కై రైతువారి పట్టాలు తీసుకొని వాటికి పట్టాపాస్ పుస్తకాలు కూడా పొందడం జరిగిందని తెలిసింది.

చెన్నమల్లప్పస్వామి దేవాలయ భూములను కాపాడుకోవడానికి కొంతమంది గ్రామపెద్దలు అలాగే దేవాదాయశాఖవారు కోర్టుకు వెళ్ళడం జరిగిందని, కోర్టులో విచారణ జరిగిన అనంతరం రాజన్నగౌడ్ కుటుంబానికి యిచ్చిన రైతువారి పట్టాలు మరియు పట్టాపాస్ పుస్తకాలను రద్దు చేయాలని, ఆ భూమి దేవాదాయశాఖవారు స్వాధీనం చేసుకొని పబ్లిక్ వేలాలు పెట్టుకోవచ్చునని కోర్టు తీర్పుచెప్పినట్లు తెలిసింది.

1983లో ఈ భూములను వేలంవేయగా రాజన్నగౌడ్ దేవాదాయశాఖ అధికారులతో కుమ్మక్కై ఆ భూములు ఇతరులకు ఎవ్వరికి రాకుండా అడ్డుకొని నామమాత్రపు గుత్తకట్టి సాగుచేసుకుంటూ ఆ భూమి తమదేనంటూ కోర్టుకు మరీ వెళ్ళడంతో వివాదం మొదలైంది. ఈ భూమి దేవాదాయశాఖకు చెందినది. దీంతో రాజన్నగౌడ్‌కుగానీ ఆయన కుటుంబానికికానీ ఎలాంటి సంబంధం లేదని 2001 అక్టోబర్‌లో సివిల్ జడ్జి కోర్టు తీర్పు యిచ్చినప్పటికీ రాజన్నగౌడ్ ఆ భూముల్లో విత్తనం వేయడానికి సమాయత్తం అవుతున్నారు.

ఆ భూములపై ఏ హక్కు లేకపోయినప్పటికీ దౌర్జన్యంగా సాగుచేసి విత్తనం వేయడానికి ప్రయత్నిస్తున్న రాజన్నగౌడ్, వారి కుటుంబ సభ్యులపై చర్య తీసుకోవలసిన పోలీసులు పేదలు ఆ భూమిలోకి ప్రవేశించకుండా చేయడా నికి గ్రామంలో పేదల పక్షాన నిలబడిన రేవన్న, వన్నూర్ రెడ్డి తదితరులు కలిసి రాడికల్స్‌ను ఆశ్రయించారని రాజన్నగౌడ్ అక్రమకేసు పెడితే రేవన్నను ఎస్.ఐ. గారు సూగేపల్లికి వచ్చి సి.ఐ.గారు పిలుస్తున్నారని కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళి ఆ భూముల విషయంలో జోక్యం చేసుకోవద్దని బెదిరించి పంపడం అంటే ఈ పోలీసు అధి కారులు పేదల పక్షాన కాకుండా భూస్వామి రాజన్నగౌడ్‌కు వంత పాడుతూ పేదప్రజలకు ఆర్థికంగా, సామాజికంగా పురోగమించేందుకు కారణమయ్యే భూముల పంపిణీ అడ్డుకుంటు న్నారు. ఈ చర్యను రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) అనంతపురం జిల్లాకమిటీ ఖండిస్తున్నది.

గత అనేక సం॥లుగా అక్రమంగా అనుభవిస్తున్న చెన్నమల్లప్ప స్వామి దేవాలయ భూముల ను కోనాపురం, కొండాపురం, సూగేపల్లి గ్రామాల లోని భూమిలేని నిరుపేదలకు పంచి పట్టాలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండు చేస్తు న్నాము. చెన్నమల్లప్పస్వామి దేవాలయ భూముల స్వాధీనానికై రైతుకూలీసంఘం నాయకత్వాన పోరాడుతున్న కోనాపురం, కొండాపురం, సూగేపల్లి గ్రామాల భూమిలేని నిరుపేదలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజలు, ప్రజాతంత్రవాదులు, వివిధ ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు తమ మద్దతు యివ్వవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

రైతుకూలీసంఘం, (ఆం.ప్ర.)
అనంతపురం జిల్లా

16-7-2002

కపిలేశ్వరపురం జమీందారు సీలింగ్ భూముల కోసం ఆందోళన

శూద్రుడు ఆస్థి కలిగి వుండకూడదన్న మనువు శాసనం, హిందూ మత ధర్మంగా వర్ణాల్లి నేటికీ మరోరూపంలో కొనసాగుతున్నందువల్ల దళితులు ఈనాడు కూడా భూమిపై హక్కు పొందలేక పోతున్నారు. నిరుపేదలైన దళిత, బహుజనులకు దక్కవలసిన 897ఎకరాల 72సెంట్లు సీలింగ్ భూమిని కపిలేశ్వరపురం జమీందారులు 1971డిసెంబర్ 16, 17, 18 తేదీలలో అమ్మకాలు సాగించారు. లేండ్ సీలింగ్ చట్టం కింద ఈ భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ముందుగానే తెలుసుకున్న జమీందారులు ఈ అక్రమ అమ్మకాలు సాగించారు.

ఈ అమ్మకాలు చెల్లవని ప్రభుత్వం ఈ భూములు స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనితో జమీందారు కుటుంబం 1981లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ఈ విధమైన అమ్మకాలు చెల్లవని జీవో నెంబర్లు 3358/81, 3356/81, 3355/81 లలో తీర్పు ఇచ్చింది.

సీలింగ్ భూములలోనూ, ప్రభుత్వ భూములలోనూ సగం వాటా భూమి దళితులకు దక్కవలసి వుండగా ప్రభుత్వం ఈ భూమి స్వాధీనం చేసుకోకపోవడం వలన ఒక్క శాతం భూమికూడా ఎస్.సి లకు దక్కలేదు. ఈ విధంగా ప్రభుత్వం పరోక్షంగా కుల వివక్షతను ప్రోత్సహించినట్లయింది.

ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టు తీర్పులను అమలుచేసి సీలింగ్ భూములను, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని దళిత బహుజనులకు పంచాలని డిమాండ్ చేస్తున్నాం.

కొత్తపట్నంలో " పనికి ఆహార పథకం" అమలుకు, రైతులకు రుణాలు రద్దు చేయాలని కోరుతూ ధర్నా!

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు కొత్త పట్నం మండలంలో కూడా కరువు విలయతాండవం చేస్తున్నది. వర్షాలు లేక, పనులు లేక వ్యవసాయ కూలీలు, రైతులు తీవ్ర దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. 21 వ కరువు పట్ల కేంద్ర - రాష్ట్రప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా 22.9.01 న ధర్నా కార్యక్రమం జరిగింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు గురించి ఒకరిమీద ఒకరు చెప్పుకుంటూ కరువు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఆకలి చావులకు గురిచేస్తున్నారు. కరువు మండలాలకు కోటి రూపాయల చొప్పున గ్రాంటు విడుదల చేయాలని, కరువు పనులు చూపించి తక్షణ దీర్ఘకాలిక పథకాలన్నీ వెంటనే అమలు చేయాలనీ, కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేసారు.

కరువుకు కారణం ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలయితే మరోవైపు పాలకులు సృష్టిస్తున్న, ప్రవేశపెడుతున్న పథకాలు మరో కారణంగా వున్నాయని, సోదాహరణంగా వివరించారు. వ్యవసాయ పనుల్లోకి యంత్రపరికరాలు వచ్చిన తర్వాత కూలీలకు పని కరువై, బ్రతుకు దెరువుకు వలసలు పోతున్న స్థితిని వివరించారు.

మండలంలోని పాదర్తి చెరువు పనులకు వ్యవసాయ కూలీలను వుపయోగించడం ద్వారా మూడు పంచాయితీలలోని కష్టజీవులకు పని కల్పించవచ్చన్నారు. గ్రూప్ ఆఫ్ ట్యాంక్స్ చెంపాయ చక్రాయ, తాళ్ళ చెరువు, వినాయక చెరువులకు సాగరు కాల్వ ద్వారా నీరందిస్తే త్రాగునీరు సమస్య కొంతవరకు పరిష్కారమవుతుందని చెప్పారు.

ధర్నాలో పాల్గొన్న రైతులు, వ్యవసాయ కూలీలు ప్రదర్శనగా వెళ్ళి మండల అభివృద్ధి అధికారిని మరియు ఎంపిపిని కలిసి సమస్యలను వివరించి, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఆత్మకూరు వెత్తందార్ల పాడులను ఖండించండి!

ప్రజలారా !

ఆత్మకూరు మండల కేంద్రంలోని ఇళ్ళ స్థలాలు లేని నిరుపేదలు ఇళ్ళ స్థలాల కొరకు గత 2 సం॥రాల క్రితం నుండి రైతుకూలీ సంఘం (ఆంప్ర.) జిల్లా కమిటీ నాయకత్వాన యం.ఆర్.ఓ ఆత్మకూరు వారికి, ఆర్.డి.ఓ. గారికి , జిల్లా కలెక్టర్ గారికి ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి అనేక అర్జీల ద్వారా విజ్ఞప్తులు చేసుకు న్నప్పటికీ ఫలితం లేనందువలన గత్యంతరం లేని పరిస్థితులలో సర్వే నెం. 164-1 లో గ్రామనత్తం అయిన ప్రభుత్వ భూమిలో గత 2 నెలల క్రితం భిక్షాటనలతో జీవించే జంగాలు, మాల, చాకలి, మంగలి, దాసరి, ఏకుల, ఈడిగ, బెస్త, బోయ వడ్డె, నేనే మైనార్టి ముస్లింలలో అతి పేదవారు 135 మంది గుడిశెలు వేసుకొని ఎముకలు కొరికే చలిలో వూరికొట్టాలలో నివశిస్తున్నారు.

గుడిశెలు వేసుకునేందుకు ముందు పై భూమిలో 18మంది గడ్డివాములు వుండేవి. ఆగడ్డి వాముల ఆసాములతో చర్చించి ఒక్కొక్కరికి 3సెంట్లు చొప్పున 54సెంట్లుయిచ్చేటట్లు గడ్డి వాముల ఆసాములకు రైతుకూలీ సంఘం స్థానిక నాయకులకు మధ్య ఒక ఒప్పందం చేసుకోవడం జరిగింది. అయితే గడ్డి దొడ్ల రైతులలో ఒకరైన విశ్వనాథరెడ్డి అనే ఆస్సామి 2లక్షలకు ఇండ్లు అమ్ముకున్నాడని అతనికి యివ్వవలసిన అవసరం లేదని గడ్డిదొడ్ల రైతులే అతని పేరు తొలగించమంటే అతని పేరు తొలగించడం జరిగింది. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని విశ్వనాథ రెడ్డి కక్ష పెంచుకొని ఈ రెండు నెలల కాలంలో అగ్రకులాలకు చెందిన వారిని, గడ్డి వాముల ఆసాములలో కొందరిని జత చేసుకొని పేదలు వేసుకున్న గుడిశల్ని తొలగించి తాము ఆక్రమించుకుందామని గుడిసెవాసులపై ఉసి గొల్పడం జరిగింది.

26-12-2001 సాయంత్రం అగ్రవర్ణాలకు చెందిన 50 మంది ఆడ, మగ కలిసి దౌర్జన్యంగా ముందే అన్ని తయారు చేసుకొని గుడిశెల దగ్గరికి వచ్చి రాళ్లు వేస్తూ ఈశ్వరయ్య, జయచంద్ర, అక్కులన్న శీనప్ప, వెంకట్రాముడు, వాళ్ళ 5 గుడిశెలు పీకి వేసినారు. మగవారు ఎవ్వరూ లేనందున బోయ నాగరత్న మిగతా పదిమంది ఆడవాళ్ళు పోలీసుస్టేషన్‌కు వెళ్ళి అయ్యా! దౌర్జ న్యంగా రైతులు మా గుడిసెలు పీకేస్తున్నారని మొరపెట్టుకుంటే ఒక కానిస్టేబుల్ "మీరు వెళ్ళి దెబ్బలు తిని రాపోండి అప్పుడు చేస్తామని" నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి త్రిప్పి పంపినాడు.

మహిళలు పోలీసు స్టేషన్ నుండి 4 గంటల సమయంలో తిరిగి వచ్చి గ్రామంలోని పెద్ద మనిషి అయిన బోయమారెన్నను గుడిశెల దగ్గం ుకు పిలుచుకొని వచ్చారు. గొండెండ్లు బండి గుజ్జలు, కట్టెలు, రాళ్ళతో దాడికి సర్వ సిద్ధమై పథకం ప్రకారం రైతులు వచ్చినారని తెలియక మారెన్న "అయ్యా! "ఎందుకు పేదవారి గుడిశెలు దౌర్జన్యంగా పీకేస్తారు' ' అని అడిగితే వాళ్ళు దౌర్జన్యంగా "కొట్టాలు వేసుకున్నట్లేరా బోయనా కొడకా"అని తిడుతూ విశ్వనాథ రెడ్డి మారెన్న చేతులు గట్టిగా పట్టుకోగా జయరాంరెడ్డి మారెన్న ను గొడ్డలితో నరికినాడు. అలాగే పూసల నాగ భూషణంను తలపై నరికినారు. రాళ్ళు విసరడం వల్లరైతుకూలీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరికి పెదవి పగిలిపోయింది. 20 మందికి పైగా రక్తగాయాలు అయినవి. ఇప్పటికీ బోయమారెన్న ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్నారు.

ఈదాడికి విశ్వనాథరెడ్డి, కాళ్ల శ్రీరామరెడ్డి, ఆవుల గోపాలరెడ్డి పాక్కుల రామిరెడ్డి కొడుకు నారాయణ రెడ్డి, పాళ్యం సంజప్ప కొడుకు పాళ్యం సూరప్ప, వీరందరు దాడికి నాయకత్వం వహించగా వెంకటరెడ్డి, కొండారెడ్డి, పాట్టనారాయణ రెడ్డి, హనుమంత రెడ్డి, ఆవుల లోకనాథ రెడ్డి, ఓబుల వతిరెడ్డి, కొంకలనారాయణ రెడ్డి కొడుకు ఈశ్వర రెడ్డి, పింజరి సర్థన్, బాబయ్య, కుళ్ళాయిస్వామి, వెంకటరెడ్డి, కుంటి బాలిరెడ్డి కొడుకు కొండారెడ్డి,వడ్డే మారెన్న, జగదీష్ తదితరులు దాడిలో పాల్గొన్నారు.

వీటిన్నంటికంటే మరో అమానవీయమైన సంఘటన ఏమంటే విశ్వనాథ రెడ్డి, జయరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో 8 నెలలు నిండు మనిషి మాలకావేలమ్మ పైకి ఎద్దులు వదిలారు. అది చూచి ప్రక్కకాలనీకి చెందిన స్త్రీలు ఆమెను ఎద్దుల బారి నుండి రక్షించారు. గుడిశెవాసులపై దాడి చేసి అగ్రకుల భూస్వామ్య పెత్తందార్లు అయిన ఈ కిరాతకులు స్త్రీల జాకెట్లు, చీరలు చించి బండభూతులు తిట్టారు.

ఇంతకంటే మరో దారుణ సంఘటన ఏమి టంటే దాడి జరిగిన తరువాత బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి మొరపెట్టుకుంటే అనంతపురం నుండి వచ్చిన సి.ఐ. నరశింహులు గారు కాలనీ వద్దకు వచ్చి గ్రామస్థుల ఎదురుగా కాలనీ మహిళ లను ఉద్దేశించి సభ్య సమాజం తలవంచుకొనే రీతిలో చాలా చండాలమైన తిట్లు తిట్టడం జరి గింది. తగిలిన దెబ్బలకంటే సి.ఐ. నరశింహులు గారు తిట్టిన తిట్లు తమకు చాలా బాధ కలిగించి తాము బ్రతకడమే వ్యర్థం అని కృంగిపోయారు.

ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ యస్.ఐ. ప్రసాద రావు గారు సెలవులో వున్న సమయం చూసుకొని అగ్రకుల భూస్వామ్య పెత్తందార్లతో సి.ఐ. నర సింహులు కుమ్మక్కైనందువలన అగ్రవర్ణాలవారు దాడి తరువాత దాడిచేసిన వారిని ఏ మాత్రం మాట్లాడకుండా బాధితులను నిర్బంధంలోకి తీసు కోవడం, బాధితులపై హత్యప్రయత్న నేరం క్రింద కేసు నమోదుచేయించి 26 మందిని జైళ్ళపాలు చేసాడు.

పై సంఘటనకు కారణమైన భూస్వామ్య పెత్తందార్లు, సి.ఐ. నరసింహులు చర్యలను ఖండిస్తూ ఆత్మకూరు నిరుపేదలు జరుపుతున్న న్యాయమైన పోరాటానికి ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలుపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

డిమాండ్స్:

1. విశ్వనాథరెడ్డి, జయరాంరెడ్డి వారి ముఠా నాయకత్వన రైతుకూలీ సంఘం నాయకుల పై, పేదలపై దాడిచేసిన వారిపై హత్య ప్రయ త్నం నేరం క్రింద కేసుపెట్టి వారిని వెంటనే అరెస్టు చేయాలి.
2. రెవిన్యూ వారు హైకోర్టులో వేసిన కేసును సత్వరం పికేట్ చేయించి గుడిశెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు వెంటనే పట్టాలు యివ్వాలి.
3. భూస్వామ్య, పెత్తందార్లకు వత్తాసుపలికి దాడు లకు కారణమైన సంఘటనపైన, స్త్రీలను కించ పరుస్తూ నానాదుర్భాషలాడిన సి.ఐ. నరసింహు లపై న్యాయవిచారణ జరిపించాలి.
4. రైతుకూలీసంఘం నాయకులపైన, పేదలపైన అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి.


రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)
అనంతపురం జిల్లా

ఎదుగుతున్నావు కద బిడ్డా!
ఎదుగు, ఎదుగు
ఎదిగి మేక పిల్లలా కాకుండా
పులిలా, శత్రువు వెన్నులో చలిలా
భవిష్యత్తులో జొరబడు
నిలాంటి తల్లుల ఆశలు తుంచుతున్న
అదృశ్యపు చేతులను ఖండించు

- గోపాల్

With Best Compliments From :


SRI SARATHI STUDIOS
PRIVATE LIMITED



8-3-321, Ameerpet,
Hyderabad - 500 073.
PH: 3237299

With Best Compliments From :

SAROVAR COFFEE SHOPPE



5-9-22, Sarovar Complex,
Secretariat Road,
Hyderabad-500 063.
PH: 3237299

ప్రగతి పథంలో జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంఘం, నెల్లూరు
2001-2002 సం।ము వార్షిక లక్ష్యం ప్రగతి వివరములు మరియు చేపట్టబడుచున్న ముఖ్యమైన అభివృద్ధి పథకములు

2001 - 2002 సంవత్సర వార్షిక ప్రణాళికలోభాగంగా నెల్లూరు జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంఘం వివిధ పథకముల ద్వారా రూ. 751.35 లక్షలతో 3847 మంది లబ్దిదారులకు సహాయము చేయుటకు లక్ష్యం నిర్ణయించబడగా సదరు సంవత్సరాంతములో నిర్ణీత సమయములో రూ. 817.899 లక్షల మంది లబ్దిదారులకు వివిధ పథకముల ద్వారా ఆర్థిక సహాయము చేయడమైనది.

1. **భూమి అభివృద్ధి పథకము :** బీడు భూమిని సాగులోనికి తీసుకొని రాలేపోవుచున్న పేద దళిత లబ్దిదారులకు, సదరు భూమిని సాగులోకి తీసుకొనివచ్చుటకుగాను ఎకరమునకు రు. 2,500/- లు మించకుండా ఈ కార్యాలయము ద్వారా ఆర్థిక సహాయము చేయబడుచున్నది. ఈ పథకము క్రింద్ర ప్రతిపాదనలను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి ద్వారా ఈ కార్యాలయమునకు మంజూరుకొరకు పంపుకొనవచ్చును.
2. **భూమి కొనుగోలు పథకము :** ఈ పథకము క్రింద భూమిలేని షెడ్యూల్డు కులముల మహిళా వ్యవసాయ కూలీలకుయూనిట్ విలువ రూ. 40,000/ లుకు మించకుండ 1 ఎకరా మాగాణి (ఒక కారు పంట) లేదా 1/2 ఎకరా మగాణి (2 కార్ల పంట) లేదా 2 ఎకరముల మెట్ట పొలము (నీటివసతి వున్న భూమి) ని కొనుటకు ఈ కార్యాలయము ద్వారా ఆర్థిక సహాయము చేయబడుచున్నది.
   ఈ పథకము క్రింద భూమిలేని యస్.సి వ్యవసాయకూలీలు పై యూనిట్ ధరకు మించకుండా పొలమును ఎవరైనా అమ్ముటకు ముందుకు వచ్చు భూమి యజమానుదారుల పేర్లు మరియు ఆ భూమికి సంబంధించిన పట్టాదారు పుస్తకముతో తగు ప్రతిపాదనలను సంబంధిత మండల రెవిన్యూ అధికారి వారి ద్వారా మంజూరు కొరకు ఈ కార్యాలయమునకు పంపుకొనవచ్చును.
3. **చిన్న నీటి వనరుల పథకము :** ఈ పథకము క్రింద భూమి వుండి సాగునీటి వసతి కల్పించుకొనలేక పోవుచున్నషెడ్యూల్డు కులముల వారికి ఈ పథకము ద్వారా బావులు, బోర్లు, ఫిల్టర్ పాయింట్లు, మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, ఎత్తిపోతల పథకము మొదలగునవి ఈ కార్యాలయము ద్వారా ఆర్థిక సహాయము చేయబడుచున్నది.
   పై పథకమును కావలసిన వారు ప్రతిపాదనలు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి ద్వారా మంజూరు కొరకు ఈ కార్యాలయమునకు పంపుకొనవచ్చును.
4. **పండ్ల తోటల పథకము :** ఈ పథకము క్రింద నీటి వసతి వున్న భూమిని పండ్ల చెట్లు చేపట్టుటకు గాను ఎకరమునకు రూ. 5.000/- లు చొప్పున ఈ కార్యాలయము ద్వారా ఆర్థిక సహాయము చేయబడుచున్నది.
   ఈ పథకమును కావలసిన వారు వారి యొక్క భూమి వివరములతో ప్రతిపాదనలు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి ద్వారా మంజూరు కొరకు ఈ కార్యాలయమునకు పంపుకొనవచ్చును.
5. **ఏ.పి. మిషన్ ఫర్ మాన్యువల్ స్కావెంజింగ్ అండ్ రిహాబిలిటేషన్ ఆఫ్ స్కావెంజర్స్**
   " పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి చట్టాన్ని కాపాడండి"
   " మానవ మలాన్ని చేతులతో తీయు పద్ధతికి ముగింపు పలకండి."

చట్టబద్ధమైన హెచ్చరిక

మాన్యువల్ స్కావెంజర్లను వినియోగించుట మరియు ఎత్తుడు మరుగుదొడ్ల నిర్మాణము నిరోధక చట్టము (The Employment of Manual Scavenger and Construction of Dry Latrines Prohibition Act) 1993 నిర్దేశించిన ప్రకారము వ్యక్తిగత బహిరంగ ఎత్తుడు దొడ్లను కలిగియున్నను, ఏ వ్యక్తులనైనను మానవ మలము ఎత్తివేయుటకు ఉపయోగించినను, ప్రోత్సహించినను మరియు ఉపాధి కల్పించిన ఎడల చట్టరీత్యా నేరం. పై చట్టాన్ని ఉల్లంఘించిన వారికి ఒక సంవత్సరము జైలు లేదా రూ. 2,000/-లు వరకుజరిమానా లేదా రెండింటికి శిక్షార్హులు.

నాగరిక చిహ్నంగా, ప్రజారోగ్యము దృష్ట్యా యాంత్రిక పద్ధతులు సక్షన్ డివైజర్లు (గల్పర్) ఉపయోగించండి. సక్షన్ డివైజర్లుతో సెప్టెక్ ట్యాంకు నుండి మలము వెలికితీసి శుభ్రపరచుటకు మున్సిపాలిటీ కార్యాలయములతో కాని లేదా ఈ క్రింది ఇవ్వబడిన ఫోన్ నెంబర్లతో సంప్రదించండి.

నెల్లూరు సెల్ : 9848112510, గూడూరు : (08624) 51959, కావలి : (08626) 43706

పై పథకములే గాక బ్యాంకుల సహాయంతో స్వయం ఉపాధి, చర్మకారుల అభివృద్ధి పథకములు, మాతమ్మల పునరావాసము, మహిళాశక్తి, పథకము క్రింద స్వయం సహాయక బృందాలకు మైక్రో క్రెడిట్ మరియు స్వయం ఉపాధి కొరకు కంప్యూటర్ మరియు వివిధ వృద్ధులలో శిక్షణా కార్యక్రమములు మొదలగునవి అమలు పరచబడుచున్నవి.

శ్రీ .పి. చిన్న తాతయ్య, యం.ఎ
కార్యనిర్వాహక సంచాలకులు,
జిల్లా షెడ్యూల్డు, కులముల సేవా సహకార సంఘం, నెల్లూరు

శ్రీ. జి అనంతరాము, ఐ.పి.యస్.
జిల్లా కలెక్టరు మరియు ప్రెసిడెంట్
జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంఘం, నెల్లూరు

అపారమైన అటవీ సంపదకు ఆలవాలం ఆంధ్రప్రదేశ్ అడవులు



ప్రకృతి సహచర్యంలో
నివసించే 40 లక్షల
గిరిజనులు అహర్నిశలూ
శ్రమించి ఎన్నో అటవీ
ఉత్పత్తులను సేకరిస్తారు

వాళ్ళు సేకరించే
ఉత్పత్తులను కొనుగోలు చేసి
మీకందిస్తూ వారి అభివృద్ధికి
గత 46 సంవత్సరాలుగా
సేవచేస్తోంది
గిరిజన సహకార సంస్థ
(జి.సి.సి)



సహజోత్పత్తుల శ్రేణి - ప్రకృతినుండి గిరిజనులకు - జి.సి.సి ద్వారా మీకు


గిరిజనులు సేకరించే స్వచ్ఛమైన సహజ ఉత్పత్తులు తేనె, చింతపండు, రాజ్‌మా, తెల్లచిక్కుళ్ళు, పసుపు, వేపనూనెలతో తయారైన సబ్బులు, షీకాయ, కుంకుడు మొదలైన విస్తృత శ్రేణి అటవీ ఉత్పత్తులు "గిరిజని" పేరుతో మీకందిస్తున్నది గిరిజన సహకార సంస్థ

ఈ సహజ శ్రేణి వారిలాగే స్వచ్ఛమైనవి వాటిని ఆదరించండి, ఆనందాన్ని అనుభూతులను ఆస్వాదించండి

గిరిజన సహకార సంస్థ విశాఖపట్నం - 530 017
ఫోన్ : 796461/63, ఫ్యాక్స్ : 0891-796345 ఇ-మెయిల్ : apgirijan@yahoo.co.in

లంకపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నెం. హెచ్. 596

లంకపల్లి - ఘంటశాల మండలం - కృష్ణాజిల్లా,
ఫోన్ : 58240



అల్లు శివరామకృష్ణ ప్రసాద్
చైర్మన్

కమిటీ సభ్యులు

పర్వతనేని రామకృష్ణప్రసాద్(మణి)	కుంపటి ఝాన్సీ రాణి
అంకం యశోదరరావు	యార్లగడ్డ శ్రీలత
కూనపరెడ్డి శ్రీవాసరావు	గడ్డేటి పిచ్చేశ్వరరావు
కూతాడ చినవాగేంద్రం	బండి లక్ష్మీపతి రావు

శిద్దినేని సత్యనారాయణ


With Best Compliments

SREE PUJITA
CHIT FUND PRIVATE LIMITED

CORPORATE OFFICE :
D.No. 29-36-37, Ammanna Estates,
Prakasham Road, Vijayawada-520 002
Brach Office : Prakasham Road, Vijayawada

అభినందనలతో ...

ఎజ్జు గుంపేస్వామి
సర్పంచ్, కోటిపాం
కొమరాడ మండలం,
విజయనగరం జిల్లా




వైరి చర్ల కాంతమ్మ
మండలపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ
సభ్యురాలు
గుమడ ప్రాదేశిక నియోజకవర్గం
కొమరాడ మండలం, విజయనగరం జిల్లా



పువ్వుల రెల్లమ్మ
సర్పంచ్, మసిమండ
కొమరాడ నుండలం
విజయవగరం జిల్లా



చోడి సాంబ
సర్పంచ్, పెదశాఖ
కొమరాడ మండలం
విజయనగరం జిల్లా



****

PHONE NO: 551959

DIST. B.C SERVICE COOP., SOCIETY LTD., VISAKHAPATNAM
SANKSHEMA BHAVAN, MVP COLONY, VISAKHAPATNAM - 17

Brief note on the activities of Dist B.c Service Coop., Society Ltd. Visakhapatnam - AS ON 31/8/02

The Dist B.C Service Coop. Society Ltd., Visakhapatnam was started in the year 1975 to assist the B.C Communities for economic upliftment of their living standards through various Govt., Schemes from time to time. The District Collector is the Ex-Office/Chairman to this Society. The following are the activities under taken by this Society.

Rs. in lakhs

		2001-2002		2002-2003	
Sl. No.	Scheme	No. of Beneficiaries assisted	Out lay Amount	No.of Beneficiaries to be assisted	Out lay Amount
1	Margin Money	102	29.75	1586	104.30
2	NBCFDC	2515	40.22	2040	136.00
3	Education loans	70	20.50	83	41.50
4	MICRO CREDIT	2565	38.50	2655	177.00
5	M.T. Loans to Rajakas	414	12.42	696	8.16
6	Adarana	0	0	2191	223.00
Total		6584	141.39	9251	689.96














పేగుల ఆకలి తీరనప్పుడు
అసూయతో మెదడు చేసే ఘోషకు
ప్రతిస్పందనగా,
"తాకట్టు పెట్టిన భారతాన్నే" ఖడ్గసృష్టో
మహాప్రస్థానాన్నే ఉద్యమపాఠాల్నే పఠిస్తాను
అప్పుడు హృదయం లయబద్ధంగా
కొట్టుకుంటుండగా, ఊపిరితిత్తులు
ఉత్సాహంగా ఉరకలు వేస్తుంటాయి

- విస్ఫోటన

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)